ఎమ్బీయస్ – గ్రేట్ ఆంధ్ర ఆర్కయివ్స్ ప్రాజెక్టు

# 2013 Q4 అక్టోబరు – డిసెంబరు ఆర్టికల్స్
## (పిడిఎఫ్ రూపంలో)
## విషయసూచిక


శరద్ పవార్ సంధిస్తున్న శరాలు
శిల్పాలూ సిగ్గు పడాల్సిందే..
మమత తప్పిన ఎంపీలు
సింగపూరు చాదస్తాలు..
నందన్‌కు కాంగ్రెస్సే ఆధారం
జిగేల్ మనిపించి ఫటేల్మన్న జిగ్నేష్ షా
అస్మదీయులైనా, తస్మదీయులైనా అమెరికాకు ఒకటే
రాహుల్ నైనా కాకపోతిని..
తెలంగాణ సమస్యకు 'భశుం' కార్డు పడింది...
అలిగి ఆంటోనీ రిజైన్ చేయాలి
ఇది దూకుడు సీజన్
శ్రీలంకలో నూతనశకం
ఓ సాహసిపై బెంగాలీ సినిమా
మన వారసత్వంపై అశ్రద్ధ
ఫరీద్‌కోట రాజు ఆస్తులు దొంగ విల్లుతో కైవసం
గుజరాత్‌లో పంజాబ్ రైతుల వ్యథ
ఏది శాపం? ఏది వరం?
కేంద్రానికి ఎప్పుడూ ఆశే
దిగ్గీ రాజా పేరు వింటనే గుండెలు దిగ్గుమంటాయి
ఉల్లి ద్వారా పవర్ చూపిన పవార్
యథార్థవాదీ – రాజవిరోధీ
నేను వెళితే మజ్జిగ పోశారు కానీ....
చట్టానికి లాలూ చిక్కిన విధం
సన్నికల్లు దాచేస్తా....
జోష్ తగ్గిన మనోహర్
ఇ.టి. ఆరాధకులు
రాజస్థాన్ ఎన్నికల రంగం
అజిత్ జోగితో పెట్టుకుంటే బూడిదే
లాలూ కేసు నేర్పే పాఠాలు
కెసియార్ గడుసుదనం
సమైక్యవీరులు
అంబేద్కర్ – తనదాకా వస్తే తెలిసింది
ఎన్‌సిపి పేచీలు
దయానా ఆఖరి ప్రియుడు

ఎటు చూసినా షెహజాదాలే!
అఫయిర్స్ మీకు - ఆదాయం మాకు
తెలంగాణ రూటే సెపరేటు
పంజాబ్ ఆర్థిక స్థితి
ఛత్తీస్‌గఢ్‌లో బలాబలాలు
అదృష్టాన్ని తెచ్చే రాళ్లు
రాహుల్ ప్రవచనం- అమిత్ జోగి ప్రవర్తన
నాజీల దోపిడీకి గురైన కళాఖండాలు
రావణకాష్టం రగులుతూనే వుండాలి...
పద్మనాభుని వైభవం ఎంత?
ఉమ్మడి కుటుంబంలో ఉన్న మజా..
దాసరికి బొగ్గు మసి..
371 డికి నా దగ్గరో చిట్కా
ఆంధ్రుల్ని నరికాం - ఇక అడవుల్ని నరుకుదాం
విభజిస్తే దళితులకు అధికారమా?
కుతుబ్ మీనార్‌తో పంతం
మీ ప్రచారానికి నా సినిమా ఎందుకు?
దిగ్విజయ్ పేరు చెపితే ఓటర్లు హడల్
బాదరాయణ సంబంధం
కా-క పుట్టిస్తున్న కాక
తెలంగాణ మెదకు రాయి - రాయల తెలంగాణ
హైదరాబాదులో సీమాంధ్రుల జనాభా ఎంత?
రక్షకుడా? తక్షకుడా?
సోనియా మానసిక విశ్లేషణ
గుడి కాదు, ఆదర్శాల బడి
ఆమ్ పార్టీకి విరాళాల వెల్లువ
దేవుళ్ల దగ్గర ఎంత బంగారం వుంది?
గఢ్ ఆలా పణ్ సింహ్ గేలా...
సోనియాకు అండ వచ్చిన మండేలా
ఆరుషి కేసులో తీర్పు సబబేనా?
బిజెపి టి-టిడిపి బాట పడుతుందా?
మోదీ మ్యాజిక్ పనిచేసిందా? లేదా?
చర్చించాలా? తిప్పి పంపాలా?
శివరాజ్ చౌహాన్ ఆమోదయోగ్యత
తరుణ్ చాపల్యం - తెహల్కా విలవిల
ఓటింగ్ శాతం పెరుగుదల - స్వీప్ పుణ్యమే!
ఉత్తర కొరియాలో రాజబంధువు కాల్చివేత
లావు తగ్గితే లాభాలు
నేనిచ్చిన తీర్పు తప్పు అని ఒప్పుకున్న జడ్జి
షిండేపై ధ్వజమెత్తిన మాజీ హోం సెక్రటరీ
లోక్‌పాల్ బిల్లుకై సంతోషించాలా?
బంగ్లాదేశ్ ఎన్నికలు సవ్యంగా జరుగుతాయా?

**మంత్రీ పదవీ చెయ్ గణనాథా...**
**చెన్నారెడ్డితో పోలికెందుకు?**
**మండేలా భార్య విన్నీ...**
**దేవయాని అరెస్టు**

**అక్టోబరు 1-3 వీక్లీకై** **ఎమ్బీయస్ : న్యూస్, వ్యూస్, రివ్యూస్ - 17**

**శరద్ పవార్ సంధిస్తున్న శరాలు**

''మహారాష్ట్ర ప్రభుత్వాఫీసుల్లో ఫైళ్లు కదలటం లేదు. సంతకం పెట్టడానికి మంత్రులకు, అధికారులకు చేతులు రావడం లేదో, తాత్కాలిక పక్షవాతం వస్తోందో తెలియడం లేదు'' అంటూ సెప్టెంబరు 10 న పుణెలో శరద్ పవార్ విరుచుకుపడ్డారు. ఆ ప్రభుత్వంలో ఆయన సోదరుడి కుమారుడు అజిత్ పవార్ ఉపముఖ్యమంత్రి అని గుర్తు వస్తే 'ఇదేమిటిలా?' అని ఆశ్చర్యం కలుగుతుంది. శరద్ కోపమంతా ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చవాన్ మీద, నియమాలు వుల్లఘించకూడదన్న అతని పట్టుదల మీద! పృథ్వీరాజ్‌కు ముందు ఆ పదవిలో వున్న అశోక్ చవాన్ ఆదర్శ్ సొసయిటీ కుంభకోణం విరుచుకుపడడంతో నవంబరు 2010లో దిగిపోవల్సి వచ్చింది. తనపై అలాటి మచ్చ పడకూడదని పృథ్వీరాజ్ సంకల్పించి యిరిగేషన్, కోఆపరేషన్, రియల్ ఎస్టేటు, కార్పోరేట్ రంగాలపై గట్టిగా దృష్టి సారించాడు. ఎన్‌సిపి ఆర్థికమూలాలు ఆ రంగాల్లో వున్నాయి కాబట్టి ఆ పార్టీ నాయకుడిగా శరద్ పవార్ అతనిపై మండిపడుతున్నాడు. ఎందుకంటే బిజెపి-శివసేన రోజుల్లో కూడా ఎన్‌సిపి ఆర్థిక వ్యవహారాల జోలికి వెళ్లడానికి అందరూ భయపడేవారు.

మహారాష్ట్ర స్టేట్ కోఆపరేటివ్ బ్యాంకును క్షాళన చేయడానికి పృథ్వీరాజ్ పూనుకోగానే తమ పార్టీ అభ్యర్థిని డైర్టరుగా పెట్టాలని ఎన్‌సిపి పట్టుబట్టింది. కానీ పృథ్వీరాజ్ వినలేదు పైగా వొర్లి-హాజీ మస్తాన్ సీ లింక్ ప్రాజెక్టుకు చాలా ఖర్చు అవుతుంది కాబట్టి ప్రత్యామ్నాయాలు వెతకమని అడిగాడు. బాంద్రాలో గవర్నమెంటు ఉద్యోగులకు కాలనీ కట్టాలని అతని ప్రభుత్వం సంకల్పించి రూ.150 కోట్లు ముందుగా కట్టాలనే షరతుపై మూడు కంపెనీలకు కాంట్రాక్టు యిచ్చింది. రెండు కంపెనీలు కట్టాయి కానీ ఎన్‌సిపికి సన్నిహితంగా వుండే కంపెనీ మాత్రం కట్టలేదు. అయినా వాళ్లకు కాంట్రాక్టు యివ్వాలని ఎన్‌సిపి పట్టుబడుతోంది, ముఖ్యమంత్రి ఒప్పుకోవటం లేదు. పుణెలో పెద్ద నిర్మాణసంస్థ నడుపుతున్న అతుల్ చోర్దియా అనే అతను ఎన్‌సిపికి ఆప్తుడు. అతను ఎన్‌సిపి వారి పత్రికలో వ్యాసం రాస్తూ 'ప్రభుత్వవిధానాలు రియల్ ఎస్టేటు రంగాన్ని దెబ్బ తీస్తున్నాయంటూ' ఆరోపించాడు. ఇప్పుడు శరద్ పవార్ బిల్డర్ల లాబీ వాదనలనే తన ముఖతః వెలిబుచ్చాడు.

ఎందుకిదంతా అంటే - యిలా బెదిరించి, వచ్చే పార్లమెంటు ఎన్నికలలో 2009లో పొత్తులో భాగంగా కాంగ్రెసు యిచ్చిన 22 సీట్లు నిలుపుకోవడానికే అంటున్నారు. ఎన్‌సిపి నాయకులు చాలామంది అనేక స్కాముల్లో యిరుక్కోవడం వలన కాంగ్రెసు 3 సీట్లు తగ్గిద్దామని చూస్తోందని భోగట్టా. దాన్ని నిలవరించడానికి శరద్ యీ వ్యాఖ్యలు చేశాట్ట. కానీ పృథ్వీరాజ్ ఊరుకోలేదు. తన ఆఫీసు నుండి ఒక ప్రకటన వెలువరించాడు. ''ముఖ్యమంత్రి పదవిలోకి వచ్చిన 34 మాసాల్లో 27,500 ఫైళ్లు ఆయన వద్దకు వచ్చాయి. 95% అనగా 26,100 ఫైళ్లు క్లియర్ చేశారు.'' అని. దీనితో బాటు రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు తన పార్టీ మంత్రులకు లేఖలు రాశాడు - ''మీ శాఖల తాలూకు ఫైళ్లు ఫైనాన్స్ డిపార్టుమెంటులో పెండింగులో వుంటే వెంటనే మాకు తెలియపరచండి.'' అని. ఫైనాన్సు మంత్రి వేరెవరో కాదు, శరద్ పవార్ సోదరుని కుమారుడు అజిత్ పవారే!

**శిల్పాలూ సిగ్గు పడాల్సిందే..**

ఆడవాళ్ల లోదుస్తులు అమ్మడానికి బట్టలషాపుల్లో దాదాపు నగ్నంగా శిల్పాలు నిలబెట్టడం (మేనిక్విన్) చూసి చూసి మనం అలవాటు పడిపోయాం కానీ రీతూ తావ్‌డే అనే ముంబయి కార్పోరేటర్ అలా సర్దుకోలేకపోయింది. ఆమె ''మరాఠా ప్రతిష్ఠాన్'' అనే సంస్థ నడుపుతుంది. ''ఇది మన భారతీయ సంస్కృతి కానే కాదు. ఇళ్లల్లో ఆడవాళ్లు బట్టలు ఆరవేసినపుడు తమ లోదుస్తులు లోపలివైపున ఆరవేస్తారు, పరాయివాళ్లు వాటిని చూడకూడదని. అలాటిది యీ బట్టలషాపువాళ్లు యింత విశృంఖలంగా వాటిని ప్రదర్శనకు పెట్టడమే కాక, ఆ క్రమంలో స్త్రీ దేహంలో అంగాంగాన్ని చూపడమేమిటి? అయినా ఆ బొమ్మలు ఎవరికోసం? నాతో సహా చాలామంది ఆడవాళ్లు వాటికేసి కన్నెత్తి కూడా చూడరు. తమ సైజు ఏమిటో ముందే తెలుసు కాబట్టి, లోపలికి వెళ్లి రంగు, గుడ్డ నాణ్యత, ధర - యిలాటివి దృష్టిలో పెట్టుకుని అవే చూపమని సేల్స్‌గర్ల్‌ని అడుగుతారు. అంటే యీ బొమ్మల్ని పనీపాటా లేని మగాళ్ల కోసం పెట్టారన్నమాట. అవి చూసి వాళ్లల్లో వికారమైన ఆలోచనలు రావడం ఖాయం. ఒకసారి వచ్చాక అవి ఏ విధంగా రూపు దిద్దుకుంటాయో ఊహించలేం. అంతా వారివారి పెంపకంపై, సంస్కారంపై ఆధారపడి వుంటుంది.'' అందామె. నటీమణి గుల్ పనాగ్ ఆ విషయంలో ఏకీభవించింది - ''వాటి కేసి నా భర్త చూసే చూపులో, నా డ్రైవర్ చూసే చూపులో తేడా వుంటుంది.

ఎందుకంటే మన మగవాళ్లు మహిళలను సాంప్రదాయకమైన దుస్తుల్లో చూడడానికే అలవాటు పడ్డారు. ఆధునికమైన దుస్తులు వేసుకున్నవారు కూడా కాస్త కాస్త కనబరుస్తారు. మరి యీ బొమ్మలో! అవి దాచేది అంగుళాలలో వుంటుంది.''

ఈ వాదనల్లో బలం వుందని బృహత్ ముంబయి మునిసిపల్ కార్పోరేషన్‌కు తోచింది. మేనిక్విన్స్‌ను నిషేధించాలని 227 మంది సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఇక దానితో ఫ్యాషన్ డిజైనర్లు, యాడ్ కంపెనీల వాళ్లు రీతూపై విరుచుకుపడ్డారు – 'సినిమాల్లో, ఇంటర్నెట్‌లో నగ్నవనితలు కనబడటం లేదా?' అంటూ. ''అలాటివి కావాలనుకున్న వాళ్లే వాటిని చూస్తున్నారు. కానీ యిదేమిటి? రోడ్డు మీద వెళ్లేవాడు కూడా వీటిని తప్పించుకోలేకపోతున్నాడు.'' అని రీతూ వాదిస్తున్నారు. ఆమె బిజెపి పార్టీకి చెందినదైనా ముస్లిము మహిళాబృందాలు ఆమెకు అండగా నిలిచాయి. అంతేకాదు, రీతూ యింటికి దగ్గర్లో వున్న బట్టలషాపుల వాళ్లు ఎందుకైనా మంచిదని వాళ్ల షాపుల్లో వున్న అమ్మాయిల బొమ్మలకు టీ–షర్టులు తొడిగారు! అన్ని నగరాల్లోనూ యిలాటి మార్పులు వస్తే నిర్భయ కేసులు కాస్త తగ్గే అవకాశం తప్పకుండా వుంటుంది.

**మమత తప్పిన ఎంపీలు**

కలకత్తాలో సెప్టెంబరులో జరిగిన రక్తదాన శిబిరంలో మాట్లాడుతూ తృణమూల్‌కు చెందిన నలుగురు ఎంపీలు, ఒక ఎమ్మెల్యే మమతా బెనర్జీ పనితీరును విమర్శించి ఆమె ఆగ్రహానికి గురయ్యారు. ''దుర్గామాత అవతరించడానికి కూడా అనేకమంది దేవతల సహకారం కావలసి వచ్చింది. మమతా దీదీ యీ రోజు యీ స్థానంలో వున్నారంటే మాలాటి ఎందరో సాయపడ్డాం. కానీ ఆమె యిటీవలే పార్టీలో చేరిన కొందరి అండ చూసుకుని మమ్మల్ని పట్టించుకోవడం లేదు.'' అని ఆక్రోశం వెళ్లబుచ్చారు వాళ్లు. వీరిలో అందరి కంటె ఎక్కువగా ఆవేదన వ్యక్తం చేసినది కునాల్ ఘోష్. ఒకప్పుడు శారదా చిట్‌ఫండ్స్‌కు చెందిన పత్రికకు చీఫ్ ఎడిటర్‌గా పని చేసిన ఘోష్ మమతాని శారదా గ్రూపుకు సన్నిహితంగా తీసుకెళ్లాడు. తర్వాత ఆ గ్రూపు అప్రతిష్టపాలు కావడంతో ఘోష్ ఫోన్ చేస్తే మమత తీసుకోవడం మానేసింది. అపాయింట్‌మెంట్లు యివ్వడం తగ్గించింది. శారదా గ్రూపు వలన లాభపడిన అనేకమందిని మంత్రులను ఆదరిస్తూనే తనను మాత్రమే బలిపశువును చేసిందని ఘోష్ గారి ఘోష.

అతనితో పాటు ఆ రోజు రక్తదాన శిబిరంలో మాట్లాడిన వారిలో తపస్ పాల్ అనే బెంగాలీ నటుడు, శతాబ్ది రాయ్ అనే నటి వున్నారు. వీరిద్దరు తృణమూల్ తరఫున ప్రచారం చేసి ఎంపీలుగా ఎన్నికైనవాళ్లే. కానీ తపస్ యీ మధ్య మమతను చూడడానికి వెళితే అతన్ని బయట కుర్చీలో అరగంటసేపు కూర్చోబెట్టించింది. విజిటర్స్ స్లిప్ మీద పేరు రాసిచ్చాకనే లోపలకి రానిచ్చింది. ఇక అనేకమంది పార్టీ నాయకులు తనను అవమానిస్తున్నా వారిని మమత కట్టడి చేయడం లేదని శతాబ్ది రాయ్ ఫిర్యాదు. వీరందరిని ఒకే వేదికమీదకు తెచ్చినవాడు మరో ఎంపీ ఐన సోమేన్ మిత్రా. అతను రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడిగా వుండగానే మమతను కాంగ్రెసు నుండి బయటకు పంపాడు. కొన్నాళ్లకు రాజీ కుదిరి ఆమె పార్టీలో చేరినా ఆమె విధానాలను అతను పూర్తిగా ఆమోదించడు. అవేళ అతనేమీ మాట్లాడలేదు కానీ అతని భార్య శిఖా మిత్రా దుమ్ము దులిపేసింది. ఆవిడ ఆ పార్టీ ఎమ్మెల్యే. ఆమె గతంలోనే పార్టీని చెరిగేయడం వలన సస్పెన్షన్‌లో వుంది. అందుకని ఆమెను వదిలేసి పార్టీ డిసిప్లినరీ కమిటీ చైర్మన్ పార్థా చటర్జీ తక్కిన ముగ్గురికి షోకాజ్ నోటీసులు పంపించాడు. సోమేన్‌ను మాత్రం వదిలేశాడు. అతను కఠిన చర్యలు వద్దని వారిస్తున్నాడు.

రాబోయే పార్లమెంటు ఎన్నికలలో కనీసం పదిమంది సిట్టింగు ఎంపీలకు టిక్కెట్లు యివ్వకూడదని మమత నిశ్చయించుకుందని, వారిలో తాము కూడా వున్నారని తెలిసే వీళ్లు యిలా తిరగబడ్డారని భోగట్టా. మమతకు కోపం వచ్చి పార్టీలోంచి తీసేసినా వీళ్లు నిరుద్యోగులై పోరు. తపస్, శతాబ్దిలకు సినిమా రంగం వుంది. కునాల్ ఘోష్‌కు పత్రికా రంగం వుంది. సోమేన్‌కు సొంతంగా ఓటు బ్యాంకు వుంది, యిమేజి వుంది. కబీర్ సుమన్ అనే ఎంపీ మమతాను వ్యతిరేకించి బయటకు వెళ్లిపోయినా అతను గాయకుడు కాబట్టి చెల్లిపోయింది. వీళ్లకూ అదే ధైర్యం. ఈ తిరుగు–బావుటా వెనక కాంగ్రెస్ హస్తం వుందని మమతా అనుమానం. అందుకే కునాల్ ఘోష్‌ను పార్టీ నుండి సస్పెండ్ చేసింది. అతను వెంటనే శారదా స్కామ్‌లో విషయాలు బయటపెడతానంటూ ప్రకటించాడు. అంతే పోలీసులు వెంటబడి, విచారణపై విచారణ చేసేస్తున్నారు.

**సింగపూరు చాదస్తాలు..**

1965లో మలేసియన్ ఫెడరేషన్ నుండి విడివడ్డాక సింగపూర్‌లో ఆధునికత, ఆర్థికాభివృద్ధి బాగా పెరిగింది. ఈ రోజు ప్రపంచంలోని ఆర్థిక కేంద్రాలలో దానిది నాల్గవ స్థానం. బిజీగా వుండే నౌకాశ్రయాలలో ఐదవ స్థానం. అత్యధిక తలసరి ఆదాయంలో మూడోస్థానం. అయినా సింగపూరులో మూఢనమ్మకాలు యింకా రాజ్యం ఏలుతూనే వున్నాయి. 100 ఏళ్ల క్రితం వచ్చి స్థిరపడిన చైనీయులు తమ ప్రాచీన నమ్మకాలను అలాగే కొనసాగిస్తున్నారు. సింగపూరు వాసి ఎవరూ మీకు బహుమతిగా వాచీ యివ్వరు. ఎందుకంటే 'వాచీ యివ్వడం' అనే మాట చైనీస్ భాషలో అంతిమ ప్రార్థనల్లో వుపయోగించే 'సుంగ్ ఝూంగ్'ను స్ఫురించేస్తుంది కాబట్టి! (ఏడు అనే సంఖ్యను మనవాళ్లు కొందరు 'ఆరున్నొకటి' అనేవారు – 'ఏడు'పు అనే ధ్వని రాకుండా) చేప వండడానికి ముళు

_ తీస్తూ వుంటే అది జారి కింద పడితే మనం ఎక్కిన పడవ మునిగిపోతుందని నమ్ముతారు. భోజనం చేసే పుల్లలు (చాప్ స్టిక్స్) అనుకోకుండా పొడుగూ, పొట్టీ వస్తే దాని అర్థం – మనం పడవో, విమానమో, రైలో మిస్సయిపోతామన్నమాట. చాలామంది సింగపూరు వాసులకున్న అలవాటు ఏమిటంటే – ఎక్కడికైనా బయటకు వెళ్లి  ఇంటికి తిరిగి వచ్చాక తలుపు తడతారు – లోపల మనుష్యులెవరూ లేకపోయినా. తాము లేనప్పుడు దయ్యాలు వచ్చి వుంటే, తాము తలుపు తట్టడం వలన యిల్లు ఖాళీ చేస్తాయని వాళ్ల నమ్మకం.

చనిపోయినవారికి తర్పణాలు యిచ్చే అలవాటు హిందువులకు వుంది. కానీ సింగపూరు చైనీయుల నమ్మకం యింకా చిత్రమైనది. భూతమాసంలో (ఆగస్టు–సెప్టెంబరులలో వస్తుంది) నరకం నుండి ఆత్మలను విడుదల చేసి రోడ్లమీద తిరగనిస్తారని నమ్మి ఆ సమయంలో 'హంగ్రీ ఘోస్ట్ ఫెస్టివల్' అని నిర్వహిస్తారు. రెండవ ప్రపంచయుద్ధంలో జపాన్ సైనికులు ఇంగ్లీషు వారిని ఓడించి, పట్టుకున్న 50,000 మంది యుద్ధఖైదీలను హింసించిన బ్రిటిషు మిలటరీ బేస్‌ను 1965లో ఆసుపత్రిగా మార్చారు. అక్కడి హింసకు గురై మరణించినవారు దెయ్యాలయి ఆసుపత్రిలో తిరుగుతున్నారని, అందుకే ఎవరూ స్విచ్ నొక్కకుండానే లిఫ్టులు పైకీ కిందకూ తిరుగుతూ అప్పుడప్పుడు హఠాత్తుగా తెరుచుకుంటూ వుంటాయనీ, నీలం రంగులో వున్న ఓ దయ్యపు పిల్లవాడు దిగాలుగా చూస్తూ కనబడతాడని – యిలా వదంతులు చెప్పుకుంటూ వుంటారు. వీటికి తోడు చాలా యిళ్లల్లో దయ్యాలున్నాయని, అందుకే వాటిలో ఎవరూ నివసించడం లేదనీ నమ్ముతూంటారు. "అసలు సంగతేమిటంటే సింగపూరులో యిళ్ల స్థలాల రేట్లు బాగా పెరిగిపోయాయి. అమ్మితే మళ్లీ కొనుక్కునే పరిస్థితి లేదు. అందుకని వేరే  వూరు వెళ్లిపోయినా యిక్కడి సొంతయిళ్లకు తాళాలేసి వుంచుతున్నారు. ఖాళీగా వుండడంతో యిలాంటి పుకార్లు పుడుతున్నాయి." అంటాడు ఓ పరిశీలకుడు.

**నందన్‌కు కాంగ్రెస్సే ఆధారం**

ఇన్ఫోసిస్ సారథుల్లో ఒకడిగా యువత మన్నన లంది, ఆధార్ కార్డు రూపకల్పన ద్వారా దేశమంతా పరిచితుడైన నందన్ నీలేకని కాంగ్రెస్ అభ్యర్థిగా బెంగుళూరు సౌత్ నుండి రాబోయే పార్లమెంటు ఎన్నికలలో పోటీ చేస్తారని అనుకుంటున్నారు. నందన్ దీని గురించి యింకా ఏమీ మాట్లాడకపోయినా, రాజకీయాల్లోకి ఆసక్తి వున్నట్లు తన సన్నిహితుల దగ్గర వెల్లడించారట. విద్యావంతులు ఎక్కువగా వున్నారు కాబట్టి బెంగుళూరులో ఆయన గెలుపు సులభం అనుకోవడానికి లేదు. ఆ నియోజకవర్గంలో ఓట్లేయడానికి బద్ధకించేవారే ఎక్కువ. చవక విమానయానంతో అందర్నీ ఆకట్టుకున్న జి.ఆర్.గోపీనాథ్ 2009లో స్వతంత్ర అభ్యర్థిగా అక్కణ్నుంచే పోటీ చేసి దెబ్బ తిన్నారు. బిజెపి జాతీయ స్థాయిలో జనరల్ సెక్రటరీగా వున్న అనంత్ కుమార్ నందన్‌తో తలపడవచ్చు. బెంగుళూరుకు వున్న ఐటీ జనాభా బట్టి, ఆ నియోజకవర్గంలో యువత ఎక్కువశాతం వున్నారు కాబట్టి నందన్ గెలిచినా గెలవవచ్చని అంచనా.

**జిగేల్ మనిపించి ఫటేల్మన్న జిగ్నేష్ షా**

భారత్‌లో అతి పెద్ద స్టాక్ కుంభకోణాల్లో ఒకటిగా తోస్తున్న నేషనల్ స్పాట్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇఎల్) ప్రమోటర్లపై ముంబయి పోలీసు సెప్టెంబరు మాసాంతంలో విరుచుకుపడ్డారు. రూ.5600 కోట్ల చెల్లింపుల సంక్షోభానికి సంబంధించి, ప్రమోటర్లు, డైరక్టర్లు, బ్రోకర్ల నివాసాలపై మొత్తం 16 రాష్ట్రాలలో 184 ప్రాంగణాల్లో ఆర్థిక నేరవిభాగం సోదాలు చేసింది. ఈ స్థాయిలో మోసం జరగడానికి కారణం ఆ కంపెనీ ప్రమోటర్ అయిన జిగ్నేష్ షాకు రాజకీయనాయకులతో వున్న బలమైన సంబంధాలే! స్పాట్ ట్రేడింగులో, ఫార్వార్డ్ ట్రేడింగులో దిట్టగా పేరు తెచ్చుకున్న అతని మూల సంస్థ యైన ఫైనాన్షియల్ టెక్నాలజీస్ (ఎఫ్‌టి)లో అనేకమంది రాజకీయనాయకులు, పారిశ్రామికవేత్తలు పెట్టుబడి పెట్టారని అందరూ అనుకుంటున్నారు. అనిల్ అంబానీ సొంత కంపెనీ రిలయన్సు కాపిటల్ ట్రస్టీ యిటీవల దాకా ఎఫ్‌టిలో వాటాలు కలిగి వుంది. అంతేకాదు, జిగ్నేశ్ ఎమ్‌సిఎక్స్ అనే పేర కమోడిటీ ఎక్స్ఛేంజ్ 2003లో పెడితే దాన్ని ప్రారంభించడానికి ముకేశ్ అంబానీ వచ్చాడు. ఆ కంపెనీ తన కార్యకలాపాలు విస్తరిస్తూ ఎంసిఎక్స్–ఎస్ఎక్స్ నెలకొల్పుతానంటే మొదట్లో తటపటాయించినా దానికి అనుమతులు యిచ్చినది ప్రణబ్ ముఖర్జీ. ఈ ఏడాది దాని కార్యకలాపాలు ప్రారంభించినది – సాక్షాత్తూ ఆర్థికమంత్రి పి.చిదంబరం! జిగ్నేశ్‌కు దన్నుగా నిలబడి, అతని కంపెనీ కార్యకలాపాలను ఫైనాన్సు శాఖ పరిధిలోకి వెళ్లకుండా తన శాఖలోనే వుండేట్లు చూసినది శరద్ పవార్!

ఇంతమంది పెద్దలు వెనకుండగా జిగ్నేశ్‌ను వ్యతిరేకించిన సెబి చైర్మన్ సి బి భావే మాజీ అయిపోవడంలో ఆశ్చర్యం లేదు. సెబి డైరక్టర్ కె ఎం అబ్రహామ్, అతను సహోద్యోగి ఎం.ఎస్.సాహూలాను పక్కకు నెట్టేశారు. జిగ్నేశ్ కంపెనీని విమర్శించిన ఆర్థికవేత్త అజయ్ షాను పరువునష్టం దావా వేసి కోర్టుకి యీడ్చారు.  ఎన్ఎస్ఇఎల్‌ను రెగ్యులేటరీ కంట్రోలు నుండి మినహాయింపు యిస్తూ ప్రభుత్వం 2007లోనే ఆర్డర్లు పాస్ చేసింది. కమోడిటీ ట్రేడింగుకు 11 రోజుల పరిమితి వున్నా ఎన్ఎస్ఇఎల్ 25–34 రోజుల కాంట్రాక్టులు చేసుకునేది. గోడౌన్లలో సరుకులు లేకుండానే వున్నట్టు దొంగ రసీదులు పుట్టించి వాటితో లావాదేవీలు చేసేవారు. గోడౌన్ల ఓనర్లగా, ఇన్వెస్టర్లగా కనబడే పేర్లు బినామీవి అని బయటపడింది. ఈ లొసుగులను ఫార్వార్డ్ మార్కెట్స్ కమిషన్ (ఎఫ్ఎంసి)

కనిపెట్టి యూనియన్ మినిస్ట్రీ ఆఫ్ కన్స్యూమర్ ఎఫైర్స్‌కు 2012 ఏప్రిల్‌లోనే తెలియపరచింది. అయినా ప్రభుత్వం యిప్పటివరకు ఏ చర్యా తీసుకోలేదు. ఏదైనా కఠిన చర్య తీసుకుందామంటే ఎఫ్ఎంస్‌కు అధికారాలు యివ్వలేదు. ఎఫ్ఎంస్‌లో పని చేసే అధికారులను, సెబిలో పని చేసే అధికారులను ఎంసిఎక్స్ ప్రలోభపెట్టి తన కంపెనీలో ఉద్యోగాలు యిచ్చింది. వాళ్లు దీనిలో చేరేముందు తమ అధికారాలు దుర్వినియోగం చేసి యీ కంపెనీకి అనేక రాయితీలు కల్పించారు. ఎన్ఎస్ఇఎల్ కొనుగోలుదార్లకు 15% లాభాలు సమకూరుస్తూ వస్తూంటే ఎవరికీ అనుమానం రాలేదు. ఇన్నాళ్లకు బండారం బయటపడి రూ.5600 కోట్లు ఇన్వెస్టర్లకు వెనక్కి యిమ్మంటే కంపెనీ చేతులు ఎత్తేస్తోంది.

మన్‌మోహన్ సర్కారులో తలెత్తిన స్కాములను వేళ్లపై లెక్కించాలంటే సహస్రబాహుడైన కార్తవీర్యార్జునుడికైనా సాధ్యం కాదేమో!

**అస్మదీయులైనా, తస్మదీయులైనా అమెరికాకు ఒకటే**

ఆర్థికంగా ఉజ్జ్వల భవిష్యత్తు వున్న దేశాల్లో బ్రెజిల్ ఒకటి. గత దశాబ్దంగా ఎదుగుతూ వచ్చి అమెరికా ఖండంలో అమెరికా దేశంతో పాటు తనకూ సముచితమైన స్థానం సంపాదించుకుంది. ఈ అక్టోబరు నెలలో ఒబామా, బ్రెజిల్ అధ్యక్షుడు దిల్మా రూసెఫ్ సమావేశమై అనేక వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు పెట్టాలని అనుకున్నారు. 4 బిలియన్ డాలర్ల ఎఫ్-18 జెట్ ఫైటర్ విమానాలను అమెరికా నుండి బ్రెజిల్ కొనుగోలు చేయడం వాటిలో ఒకటి. అయితే యీ సమావేశం జరుగుతుందో లేదో అన్న సందేహం పుట్టుకుని వచ్చింది యిప్పుడు. ఎందుకంటే అమెరికన్ గూఢచారి సంస్థ నేషనల్ సెక్యూరిటీ ఏజన్సీ (ఎన్ఎస్ఏ) బ్రెజిల్ అధ్యక్షుడు, మెక్సికో అధ్యక్షుడు మధ్య జరిగే సంభాషణలపై నిఘా పెట్టి వింటోన్న విషయం బయటపడింది. మెక్సికో కూడా అమెరికాకు శత్రుదేశం కాదు. వాళ్లిద్దరి మధ్య గాఢమైన వాణిజ్యబంధంతో బాటు, టెర్రరిజంపై రహస్యసమాచారాన్ని యిచ్చిపుచ్చుకునే అనుబంధం కూడా వుంది. మత్తుమందు వ్యాపారాన్ని కట్టడి చేయడానికి మెక్సికోకు అమెరికా సహాయపడుతోంది కూడా. మరి తమలాటి స్నేహదేశాధినేతల మధ్య సంభాషణ సైతం అమెరికా రహస్యంగా వింటోందని తెలియగానే మెక్సికో, బ్రెజిల్ భగ్గుమన్నాయి.

జులై నెలలో దీని గురించి తొలి వార్తలు వచ్చాయి. అమెరికా తన పొరుగున వున్న లాటిన్ అమెరికా ప్రభుత్వాధినేతల సంభాషణలను పదేళ్లగా వింటోందని, వారి ఈ మెయిళ్లలోకి తొంగిచూస్తోందని, ఆ విధంగా గూఢచర్యానికి గురైన వాటిలో అమెరికాతో స్నేహం నెరపుతున్న కొలంబియా కూడా వుందని తెలిసింది. ఆ తర్వాత సెప్టెంబరు మొదటివారంలో బ్రెజిల్‌లో ప్రచురించే "ఓ గ్లోబో" అనే పత్రికలో యీ విషయాన్ని బయటపెడుతూ వ్యాసం వచ్చింది. రచయితల్లో ఒకరు -"గార్డియన్" పత్రికలో పనిచేసే గ్లెన్ గ్రీన్‌వార్డ్. ఎన్ఎస్ఏ అకృత్యాలను బయటపెట్టడంలో యితను విజిల్ బ్లోయర్ ఎడ్వర్డ్ స్నోడెన్‌కు సహకరించాడు. ఈ వ్యాసం వెలువడగానే బ్రెజిల్ విదేశాంగ మంత్రి ఆంటోనియో అమెరికా నుండి లిఖితపూర్వకమైన సంజాయిషీ కోరాడు. రోజులు గడిచేకొద్దీ ఇంకా కొన్ని వివరాలు బయటకు రావడంతో బ్రెజిల్ యంత్రాంగం వైట్ హౌస్‌కు తమ అభ్యంతరాలు తెలుపుతూ వారి నుండి క్షమాపణ కోరింది. అటు మెక్సికో అధ్యక్షుడు నియటో కూడా అమెరికాకు అభ్యంతరాలు తెలిపారు. జి-20 సమావేశంలో కలిసినపుడు ఒబామా వీరిద్దరితో విడివిడిగా మాట్లాడి సముదాయించబోయాడు. ఇదంతా టెర్రరిజంపై పోరాటంలో భాగంగానే చేస్తున్నామని అమెరికా చెప్పుకుంటోంది. కానీ బ్రెజిల్, మెక్సికోలలో టెర్రరిజమూ లేదు, రసాయనిక లేదా అణు ఆయుధాలూ లేవు.

అమెరికా టర్కీ, ఇండియా వంటి మిత్రదేశాలపై కూడా యిదే గూఢచర్యం నెరపుతూ యిదే సంజాయిషీ యిచ్చింది. ఆ రెండు దేశాలూ అమెరికా చెప్పినదాన్ని విశ్వసించి నోరెత్తటం లేదు. ఎన్ఎస్ఏ ఏ మేరకు చెలరేగిపోతోందో సెప్టెంబరులో "గార్డియన్", "ద న్యూయార్క్ టైమ్స్" వంటి పత్రికలు బయటపెట్టాయి. ఇంటర్నెట్ బ్యాంకింగ్ కార్యకలాపాలను రక్షించే ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీ రహస్యాన్ని కూడా అది ఛేదించిందట! **- ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2013)**

**అక్టోబరు 4-5 వీక్లీకై ఎమ్బీయస్ : రాహుల్ నైనా కాకపోతిని..**

'రాయినైనా కాకపోతిని రామపాదము సోకగా..' అనే పాట విన్న కిరణ్ యిప్పుడు పాడుకుంటూ వుండి వుంటారు - 'రాహుల్‌నైనా కాకపోతిని, అమ్మ దయ సోకగా..' అని. రాహుల్ చేసినది, కిరణ్ చేసినది ఒకటే ! అట్టే మాట్లాడితే కిరణ్ చేసినది చాలా తక్కువ. "విభజన వలన తీర్చరాని సమస్యలున్నాయి కాబట్టి అధిష్టానాన్ని పునరాలోచించుకోమని కోరుతున్నాను. కాంగ్రెసు, సమైక్యత అనే వాటి మధ్య ఎంచుకోవాల్సిన దుర్గతి నాకు పట్టకూడదని కోరుకుంటున్నాను. రెండూ నా హృదయానికి దగ్గరే. ఒకవేళ విభజన చేయాలని పట్టుబడితే నా చేతులమీదుగా చేయలేను కాబట్టి తప్పుకోవడానికైనా రెడీ." అని చెప్పారు. అది కూడా తెలంగాణ నోట్ యింకా ప్రాథమిక దశలో వుండగానే. ఇప్పటివరకు తెలంగాణ బిల్లు పార్లమెంటులో చర్చకు పెట్టలేదు, రాష్ట్రపతి వద్దకు వెళ్లలేదు, హెూం శాఖ బిల్లు తయారు చేయలేదు, అసెంబ్లీకి పంపలేదు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం మాత్రమే జరిగింది.

కాబినెట్ నోట్ తయారీ దశలో వుంది. ఏ మేరకు అని మాత్రం అడక్కండి. గంటగంటకు మార్చిమార్చి వార్తలు ఒక్కోలా వస్తున్నాయి. 'ఆంటోనీ కమిటీ నివేదిక యిచ్చేవరకూ తయారవదు, ఆయన రాష్ట్రానికి వచ్చి కళ్లారా చూసేవరకూ నివేదిక యివ్వరు,

రావాలంటే ఆయన మంచంలోంచి లేవాలి' అని ఓ ఢిల్లీ నేత చెప్పినట్టు యిప్పుడు బ్రేకింగ్ న్యూస్ వస్తే ఇంకో గంట పోయాక బ్రేకింగ్ న్యూస్ వస్తుంది – 'ఆంటోనీ యిచ్చేదేమిటి, మేం చూసేదేమిటి, ఆపాటి మాకు తెలియదా, ఆయన దారి ఆయనదే, మా దారి మాదే, మేం నోట్ తయారుచేసి మడిచి జేబులో పెట్టుకున్నాం, కాబినెట్ మీటింగులో మామూలు ఎజెండా అయిపోగానే ఆ కాగితాల్లో దీన్ని కలిపేస్తాం' అని యింకో ఢిల్లీ నాయకమ్మన్యుడు అన్నాడని! కాబినెట్ నోట్‌పై సంతకం పెట్టానని షిండే అన్నట్టు ఓ ఛానెల్ చెపితే, అబ్బే చూడనే లేదు అన్నాడని మరో ఛానెల్ యిస్తోంది. మీడియా మనతో ఆటలాడుకుంటోందనడానికి యింతకంటె నిదర్శనం కావాలా?

మరి రాహుల్ వ్యతిరేకించిన ఆర్డినెన్సు యివన్నీ దాటేసింది. కాంగ్రెస్ కోర్ కమిటీలో చర్చలు జరిగాయి, యుపిఏ భాగస్వామ్యపక్షాలతో చర్చలు జరిగాయి, ప్రతిపక్షాలతో జరిగాయి. అందరూ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అన్నీ అయిపోయి దేశజనత 'ఇదేమిటి? ఇలాటి బిల్లు' అని ఛీత్కరించుకుంటూ వుంటే దాన్నే ఆర్డినెన్సుగా తేవడానికి కాంగ్రెసు పార్టీ, యుపిఏ ప్రధాని అందరూ నిశ్చయించుకుని ప్రెస్ మీట్ పెడితే అక్కడ రాహుల్ అనుకోని అతిథిగా వచ్చి 'ఇది సెన్సు లేని ఆర్డినెన్సు, చింపి పారేయడమొకటే దీనికి శాస్తి' అని దివ్యవాణి వినిపించి మాయమై పోయారు. ఇదంతా చేసినది కాంగ్రెసు అధ్యక్షురాలు, రాహుల్‌గారు ఉపాధ్యక్షులు. పోనీ మన రాష్ట్రపు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రిలా వారేమైనా ఒకరిమొహం మరొకరు చూసుకోనివారా అంటే అదేమీ కాదు, తల్లీకొడుకులు. తమ పార్టీనే ధిక్కరించిన రాహుల్ 'నీతికోసం నిలబడిన నేతాశ్రీ'గా జేజేలు అందుకుంటూ వుంటే అంతకంటె ముందు అధిష్టానాన్ని యింత ఘాటు పదాలు ఏమీ లేకుండా 'అమ్మా తల్లీ' అంటూ బతిమాలిన కిరణ్ తిరుగుబాటుదారుడిగా ఛీత్కరించుకోబడుతున్నాడు.

ఇదేమిటి వింత? అంటే ఎమర్జన్సీ కాలం నాటి జోక్ గుర్తుకు వచ్చింది. తమిళ హాస్యనటుడు, రచయిత 'చో' రామస్వామి నడిపే "తుగ్లక్" పత్రికలో ఎవరో ప్రశ్న అడిగారు – "నేను యింత చదువుకున్నాను. ఇన్ని డిగ్రీలున్నాయి. నేను ప్రధాని కాగలనా?" అని. చో సమాధానం – "నీ డిగ్రీలెవడడిగాడయ్యా బాబూ, మీ అమ్మ పేరు చెప్పు. ప్రధాని అవుతావో లేదో చిటికెలో చెప్తాను." ! ఇందిరా గాంధీ తనయుడు సంజయ్ గాంధీ యువనేతగా, భావిప్రధానిగా దేశమంతా కీర్తిస్తున్న కాలమది. అలాగ రాహుల్‌కి పట్టిన భోగం కిరణ్‌కు పట్టకపోవడానికి కారణం – కిరణ్ తల్లి పేరు సోనియా గాంధీ కాకపోవడమే!

ఒక్కోప్పుడు రాబోయే పరిణామాలు వూహించలేక రాజు తప్పుటాలోచన చేయవచ్చు. అప్పుడు మంత్రో, రాణో, యువరాజో మరొకరో రాజుకి హితవు పలకవచ్చు. విన్నవాడు బాగుపడ్డాడు, విననివాడు చెడ్డాడు. రావణుడికి హితవు చెప్పిన విభీషణుణ్ని మనం భీషణదూషణ చేయడం లేదు. వస్త్రాపహరణం జరపబోతున్న దుర్యోధనుణ్ని వారించిన వికర్ణుణ్ని మనం కర్ణకఠోరంగా తిట్టడం లేదు. యుద్ధానికి సిద్ధమవుతున్న సుయోధనుడికి భీష్మద్రోణులు శాంతి చేసుకోమని చెప్పి చూశారు. వినకపోతే 'సరే కానీయ్, నీ కర్మా, మా కర్మా యిలా కాలింది' అనుకుంటూ కురుక్షేత్రంలోకి దిగి కురువంశ నాశనం చూసి బాధపడ్డారు. జైలుపక్షుల ఆర్డినెన్సు విషయంలో సోనియా ప్రజాగ్రహం చూశాక నాలిక కరుచుకుని వుండవచ్చు. వెనక్కి తీసుకుందామనుకుని, మనంతట మనమే తగ్గడం ఎందుకు, ఆ ఘనతేదో రాహుల్‌కి కట్టబెట్టవచ్చు కదా అనుకుని ఓ చిన్న ప్రహసనం ఆడి వుండవచ్చు.

కమ్యూనిస్టు ప్రభుత్వాలు ఉద్యోగస్తులకు జీతాలు పెంచేముందు, తమ పార్టీ ఆధ్వర్యంలోని యూనియన్ల ద్వారా వారి చేత చిన్నపాటి సమ్మె చేయించి, అప్పుడు జీతాలు పెంచుతాయిట. వాళ్లు అడక్కుండా మనమే పెంచేస్తే సమ్మెలు చేసే అలవాటు తప్పిపోతే కార్మికచైతన్యం చచ్చిపోతుందని భయంట. తదుపరి కాలంలో తాము గద్దె దిగాక మరొకర్ని ఎదిరించాలంటే కాస్త ప్రాక్టీసు వుండాలి కదా. అలాగే రాహుల్‌కు కూడా విప్లవకారుడిగా కాస్త యిమేజి తేవాలంటే యిలాటి కసరత్తు మంచిదే. "రాజమకుటం" సినిమాలో యువరాజే కోటలోని, కోటబయట శత్రువులను ఎదిరించడానికి తనే విప్లవకారుడిగా అవతారం ఎత్తుతాడు. తనని తనే అపహరించబోయినట్టు నాటకమాడతాడు. సినిమా బలే థ్రిల్లింగ్‌గా వుంటుంది. ఆ థ్రిల్ కోసమే రాహుల్ చేత యిలాటి ట్రిక్కే వేయించారు. ఆయనే రాజు, ఆయనే రాబిన్‌హుడ్. వహ్వా!

ఆ లెవెల్లో కాకపోయినా కిరణ్‌కు కూడా అలాటి పాత్రే యిచ్చారని అనుకుంటూ వచ్చాం. సీమాంధ్ర పౌరుషాన్ని రగిలించడానికి అవకతవక ప్రతిపాదన ఒకటి జులై 30 న చేసి, వారిని రెచ్చగొట్టి వాళ్లందరికి మెస్సయ్యగా కిరణ్‌ను ప్రసాదించే స్క్రీన్ ప్లే కాంగ్రెసు రచించిందని అనుమానం కలిగింది. సీమాంధ్ర ఉద్యమం పట్ల కిరణ్ బహిరంగంగా సానుభూతి ప్రదర్శిస్తున్నా, దానిపై తెలంగాణ నాయకులు విమర్శలు గుప్పిస్తున్నా అతనిపై ఏ చర్యా తీసుకోకపోవడం అనుమానాన్ని బలపరచింది. అలా అని సీమాంధ్ర ప్రాంతం విషయంలో అధిష్టానం ఏ వెసులుబాటూ కల్పించడం లేదు. ఉద్యమం ప్రారంభమై రెండు నెలలు దాటినా యిప్పటిదాకా వారిని చల్లార్చే ఒక్క చల్లటిమాట లేదు. మీ సంగతి పట్టించుకుంటామని సోనియా, రాహుల్ స్థాయి నేత నుండి హామీ లేదు. ఉద్యమాన్ని గుర్తిస్తున్నట్టు వాళ్లు కనీసం నటించనైనా లేదు. ఇక అమాంబాపతు నాయకులు చెలరేగి పోయి రోజుకో మాట మాట్లాడుతున్నారు. 'అరిచి గీపెట్టినా నిర్ణయం మారదు, తెలంగాణ ఏర్పాటు ఖాయం' అని ఒకటే దంపుళ్ల పాట.

ఓకే, ఖాయమే, కానీ మా భయాల మాట ఏమిటి? అంటే 'ఏవైనా వుంటే మా రోగిష్టి నాయకులకు చెప్పుకోండి, ఓపికున్నంత మేరకు వినిపించుకుంటారు. వాళ్లకు మీరేం చెప్పుకున్నా మాకు ఖాతరు లేదు, మా దారిన మేము బిల్లు చేసేసుకుంటూ పోతాం' అని మాటిమాటికీ బెదిరిస్తున్నారు. 'సమస్యలేవైనా వుంటే..' అంటూ అనుమానాలు దేనికి? ఉన్నాయి కాబట్టే కదా యిన్నేళ్లుగా నాన్చారు. కమిటీలు వేశారు. ఇలా ఎంత మొత్తుకున్నా వినకుండా వాళ్లు మీ లెక్కేమిటి అని ప్రవర్తిస్తూ వుంటే, 'మా భవిష్యత్తు అంధకారబంధురమే'

అని సీమాంధ్రప్రజలు భయపడుతున్నవేళ కిరణ్ ఓ బుల్లి ఆశాకిరణంలా కనబడ్డాడు.

అతను కాంగ్రెసు చేతి కీలుబొమ్మే కావచ్చు, కానీ యీ క్షణాన అతని కంఠంలో నిజాయితీ కనబడుతోంది. దృఢత్వం కనబడుతోంది. 'అసెంబ్లీ తీర్మానం రాకతప్పదు, అప్పుడు ఓడించి మన అభిప్రాయం లోకానికి తెలుపుదాం, అప్పటిదాకా రాజీనామాలు వద్దు' అని సహచరులకు నచ్చచెప్పడంలో విజ్ఞత కనబడుతోంది. కానీ యిది విభజనవాదులకు కర్ణకఠోరంగా వినబడుతోంది. 'ఆయన ఓ వెధవ' అనేశాడు మాజీమంత్రి కోమటిరెడ్డి. ఇలాటి పదాలు గతంలో ఎవరూ ఉపయోగించినట్టు నాకు గుర్తు లేదు. 'సీల్డు కవర్లోంచి పుట్టుకొచ్చిన నాయకుడు' అన్నాడు ఉపముఖ్యమంత్రి, తన పుట్టుక మర్చిపోయి. తెలంగాణ కోటాలో గీతా రెడ్డితో పోటీ పడి, మాల, మాదిగ వ్యత్యాసం వలన ఆఖరి నిమిషంలో పదవి తెచ్చుకున్న మనిషాయన. ఆయన మర్చిపోయినా జనం మర్చిపోరు కదా. కిరణ్‌ను మెచ్చుకునేవారు, తిట్టేవారు అందరూ (కుంభసంభవుల్లా) కవరుసంభవులే. పైనుంచి దిగినవారే. జనంలోంచి వచ్చిన నాయకులైతే ధైర్యంగా రాజీనామా చేసి మళ్లీ ఎన్నికయ్యేవారు. తెలంగాణ ఉద్యమం నడిచే రోజుల్లో రాజీనామా చేయమని నియోజకవర్గ ప్రజలు కోరితే వీరు చేశారా? అధిష్టానానికి కోపం వస్తుందని అదిరిబెదిరిన వారే కదా! ఇప్పుడు కిరణ్‌ను ఎత్తిపొడవడం దేనికి?

వీళ్లేమంటున్నా సీమాంధ్ర ప్రజలు కిరణ్ పట్ల ద్వేషం ప్రకటించటం లేదు. అతని దిష్టిబొమ్మలు తగలబడటం లేదు. అధిష్టానం దన్ను వుండడం చేతనే, అతని ఆటలు సాగుతున్నాయన్నాయని అనుకుంటూ వుండగా హఠాత్తుగా సీమాంధ్ర మంత్రుల్లో చీలిక వచ్చింది. కిరణ్ అనుకూలురు, వ్యతిరేకులుగా చీలిపోయారు. మొదటిరోజు అలాటిది ఏమీ లేదు అన్నారు కానీ మరుసటి రోజే డొక్కా వారు మాణిక్యాలు వెదజల్లారు. ఆయనకు హఠాత్తుగా శంకరరావు, డిఎల్ రవీంద్రా రెడ్డిల తొలగింపులో అన్యాయం, అక్రమం కనబడింది. అధిష్టానాన్ని ధిక్కరించడమేమిటి, హన్నా అని కిరణ్‌ని కోంబడ్డారు. తమ సమస్యలకు పరిష్కారం చెప్పకుండా డోంట్‌కేర్‌గా వున్న అధిష్టానాన్ని యీ మేరకు వెనకేసుకుని వస్తున్న డొక్కాను సీమాంధ్రులు డొక్క చింపుతారేమోనని భయం వేసింది నాకు. ఆ భయమే ఆయనకీ వేసిందేమో 'నేనూ సమైక్యవాదినే' అన్నాడు. మరి యిక కిరణ్ పట్ల ఫిర్యాదు దేనికి?

ఎవరేమనుకున్నా కిరణ్ పట్ల సీమాంధ్రులకు, సమైక్యవాదులకు సానుభూతి వుంది. ఆయన లేవనెత్తిన సమస్యలకు అధిష్టానం పరిష్కారాలు చూపించి అప్పుడు ముందడుగు వేయాల్సిందే అనుకుంటున్నారు. అలాటి సమయంలో కిరణ్ అధిష్టానాన్ని ధిక్కరించి మాట్లాడారంటూ యితర మంత్రులు కొందరైనా మాట్లాడితే వాళ్లను ప్రజామోదం లభించదు. అసలు కాంగ్రెసు అంటేనే జనం మండిపడుతున్నారు. కాంగ్రెసు ముఖ్యమంత్రి తమ పక్షాన మాట్లాడుతున్నాడు కదాని కాస్త ఓపిక వహిస్తున్నారు. సీమాంధ్ర మంత్రులే అతన్ని తిట్టనారంభిస్తే వాళ్లకు యిబ్బందులు తప్పవు. ఎందుకంటే 'మనకు అధిష్టానం ఫలానా మేలు చేసింది కాబట్టి విభజన ఒప్పుకుందాం. అడ్డుపడుతున్న కిరణ్ విధానం తప్పు' అని చెప్పడానికి వాళ్లకు చేతిలో ఏమీ లేదు. కేవలం అధిష్టానం చెప్పింది కదాని వాళ్లు కిరణ్‌ను బహిరంగంగా తిడితే, అంతిమంగా నష్టపోయేది వారే అవుతారు.

అధిష్టానాన్ని ధిక్కరించడమే కిరణ్ పాపమైతే మరి రాహుల్ చేసినదేమిటి? 'ఆర్డినెన్సు చింపేయమన్న రాహుల్ చేత తెలంగాణ బిల్లు కూడా చింపేయమని పిలుపు యిప్పించండి, లేదా ఆంధ్రకు ఫలానా మేళ్లు చేస్తామని హామీ యిప్పించండి' అని ప్రజలు యీ ఆనం, డొక్కాలను అడిగితే వీళ్లేం చేయగలరు? అయినా కిరణ్‌ను తొలగించడం అంత సులభమేమీ కాదు. అతన్ని తీసేసి తెలంగాణ నాయకుణ్ని పెడితే ఆంధ్రప్రజలు మాకు మరీ అన్యాయం జరిగిందంటారు. పోనీ ఏ బొత్సనో కూర్చోబెడితే 'ఆంధ్రద్రోహి' అని సీమాంధ్రులు అతనిపై ముద్ర కొడతారు. రాజీనామా చేసి దిగిపో అంటే కిరణ్ నాదెండ్ల మనోహర్‌ను మచ్చిక చేసుకుంటే, అసెంబ్లీని ఏర్పాటు చేయగలడు. ఎందుకంటే అసెంబ్లీ ప్రొరోగ్ కాలేదు. అసెంబ్లీలో బ్రహ్మాండమైన వీడ్కోలు స్పీచి యిచ్చి దిగిపోయాడంటే యిక చిరస్థాయిగా ప్రజల్లో హీరో అయిపోతాడు. ఇక అతన్ని తట్టుకోవడం అందరికీ కష్టమే. అందువలన కాంగ్రెసు అతని గాలి తీసేసిగాని, పదవి తీయదు. గాలి తీయడానికే యిప్పుడు వీళ్లను దువ్వింది. 'రాహుల్ విషయంలో వీళ్లు నోరు విప్పలేదు కదా, నా విషయంలోనే ఎందుకిలా?' అని వ్యథ చెందుతూ 'రాహుల్‌నైనా కాకపోతిని..' అని కిరణ్ పాట పాడుకున్నా లాభం లేదు. – **ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2013)**

**అక్టోబరు 6** **ఎమ్బీయస్ : తెలంగాణ సమస్యకు 'భశుం' కార్డు పడింది...**

కాబినెట్‌లో తెలంగాణ నోట్ ఆమోదించడంతో తెలంగాణ సమస్యకు 'శుభం' కార్డు పడిందని అందరూ అంటున్నారు కానీ నా దృష్టిలో అది 'శుభం' కార్డు కాదు. బాపు కార్టూన్ అందరికీ గుర్తే వుండి వుంటుంది. ఓ యిద్దరు సినిమా ముగిసాక హాల్లోంచి లేచి వెళుతూ మాట్లాడుకుంటూ వుంటారు – 'ఇంత అవకతవక, కంగాళీ సినిమా నేనెప్పుడూ చూళ్లే' అని. తెరపై శుభం బదులు భశుం అని వుంటుంది. అంటే అది కూడా సరిగ్గా రాయలేదన్నమాట సినిమా తీసినవాళ్లు.

ఇది విభజనకు వ్యతిరేకతతో అంటున్నమాటలు కావు. విభజన చేయమని అనేకపార్టీలు అడిగినపుడు, విభజన చేద్దామని కాంగ్రెసు అడిగినపుడు విభజించే ఆప్షన్ వారికి వుంది. దాన్ని వాళ్లు ఉపయోగించారు. కానీ ఆ పని యింత ఘోరంగా చేయాలా అన్నదే ప్రశ్న. జులై 30 నాటి ప్రకటన అసమగ్రంగా వుంది. ఉమ్మడి రాజధాని అంటే ఏమిటి? ఆంధ్రకు ప్యాకేజి ఏమైనా వుందా?

దానికి ఆదాయం వచ్చే సాధనాలు ఏమున్నాయి? హైదరాబాదు పాలనలో కేంద్రం జోక్యం ఏ మేరకు? – ఇవేమీ చూసుకోకుండా ప్రకటించి గందరగోళంలోకి నెట్టారు. ప్రశ్నలడిగితే కాబినెట్ నోట్‌లో అవన్నీ వుంటాయి అని చెప్పారు. రెండు నెలలు పోయాక తయారు చేసిన నోట్‌లో ఆ సందేహాలన్నీ అలాగే తీర్చకుండా వదిలేశారు. ఏమైనా అడిగితే గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ చూసుకుంటారు అంటున్నారు. ఏం చూసుకుంటారు? ఒక?వేళ వాళ్లు ఏదైనా ప్రతిపాదించిస్తే అది యిరుపక్షాలకు సమ్మతంగా వుంటుందా లేదా, లేకపోతే ఏం చేయాలి – మళ్లీ సందేహాల తేనెతుట్ట.

రెండు నెలలుగా కేంద్ర హెూం శాఖ ఏం చేస్తున్నట్టు? నాలుగేళ్లగా కేంద్రం 'తెలంగాణ అంత సులభమైన అంశం కాదు, దేశంలోని సమస్త వర్గాలను సంప్రదించి, సమస్యను అన్ని కోణాలనుండి దర్శించి, పరామర్శించి, విమర్శించి మరీ నిర్ణయం తీసుకోవాలి. దీనిలో చాలామంది స్టేక్ హెూల్డర్లు వున్నారు. అందరి బహుళాభిప్రాయం (కాన్సెన్సస్) తీసుకుని ముందు కెళ్లడానికే అందర్నీ సంప్రదిస్తున్నాం.' అంటూ చెప్పారు. చివరకు ఏం చేశారు? ఏ వర్గాలను సంప్రదించి ఒప్పించారు? జులై 30 తర్వాత గట్టిగా నిలదీసి అడిగితే 'సీమాంధ్ర కేంద్రమంత్రుల్ని పిలిచి 'విభజన చేసేస్తున్నాం' అని చెవిలో గట్టిగా చెప్పామే!' అన్నారు. ఓకే మీరు చెప్పారు, వాళు విన్నారు. విని వాళ్లు ఏమన్నారు? భేష్ అన్నారా? కుదరదు అన్నారా? దాని గురించి ఏమీ చెప్పటం లేదు. అంటే సంప్రదింపులు జరగలేదన్నమాట. మేం ఏదో ఒకటి చేయదలిచాం, మీరు నోర్మూసుకుని భరించండి – అన్నారన్నమాట. వాళ్ల నడిగితే ఏదో యాథాలాపంగా అన్నారనుకున్నాం అంటూ నీళ్లు నములుతున్నారు. విభజన చేస్తే ఏ పద్ధతిలో చేయాలన్నదానిపై శాస్త్రీయమైన చర్చ జరగలేదన్నమాట. అయినా నోరెత్తలేని తన పార్టీ అనుచరులను పిలిచి పురమాయిస్తే అది సంప్రదించినట్టు ఎలా అవుతుంది? సమాజంలో కాంగ్రెసు మంత్రులు తప్ప వేరే వర్గాలేవీ లేవా? ఉద్యోగివర్గాలు, మేధావంతులు, విద్యార్థులు, రైతులు, వ్యాపారులు, సమాజసేవకులు, యితర రాజకీయనాయకులు.. యిలా వివిధ వర్గాల వారున్నారు. వారితో సంప్రదించారా?

పోనీ తెలంగాణ ప్రాంతపు వర్గాలతో నైనా సంప్రదించారా? ఇప్పుడు చేస్తున్న ప్రతిపాదన వారికి అంగీకారమో కాదో అడిగారా? విభజనవాదులు పది జిల్లాలతో హైదరాబాదు రాజధానిగా తెలంగాణ అడిగారు కానీ పదేళ్లపాటు ఉమ్మడి రాజధాని అనిగాని, శాంతిభద్రతలు, భూములు, పరిపాలన కేంద్రం పరిధిలో వుండాలనిగాని అడగలేదు కదా! దానిలో లోతుపాతులేమిటో మీరు వారికి చెప్పారా? ఓకేనా అని అడిగారా? ఏదీ లేదు కదా! కొత్త రాష్ట్రానికి ఆర్థిక వనరులు లేవు కదాని కొన్ని కేంద్రసంస్థలు అక్కడకు తరలించేస్తున్నాం అని ప్రకటిస్తే తెలంగాణవారికి సమ్మతమో కాదో ఎవరికి తెలుసు? ఇది పదేళ్ల వ్యవహారం. కేంద్రంలో రెండు ప్రభుత్వాలు మారతాయి. అవీ సంకీర్ణ ప్రభుత్వాలే. ఆ ప్రభుత్వానికి సీమాంధ్ర నుండి వచ్చిన ఎంపీల మద్దతు అవసరమైన పక్షంలో వారు తెలంగాణ నుండి పరిశ్రమలు తరలించండి, ఐఐటి తరలించండి, ఆదాయంలో హెచ్చు వాటా యివ్వండి అని పేచీ పెట్టి సాధించుకుంటే!? తమిళనాడు, కర్ణాటకల మధ్య యిలాటి ముచ్చట్లు చూడటం లేదా? ఇవన్నీ కూలంకషంగా చర్చించి, తర్వాతి ప్రభుత్వాలు మార్చలేని విధంగా ముసాయిదా బిల్లు తయారుచేసి యిరు ప్రాంతాల్లోని అన్ని వర్గాల వారికి చూపించి అప్పుడు విభజించవలసిన అవసరం లేదా? ఈ కసరత్తేమీ చేయకుండా కేవలం యిది కాంగ్రెసు పార్టీ వ్యవహారం అనుకోవడం వలనే యిది అపసవ్య వ్యవహారం అని నా భావన.

ఇన్నాళ్లూ తెలంగాణ మంత్రులకు తాయిలాలు యిచ్చి బుజ్జగించి వూరడించారు. ఇప్పుడు ఆంధ్రమంత్రుల వంతు. కేంద్రమంత్రులను, ఎంపీలను బెదిరించో, ఊరించో వూరుకోబెట్టారు. రాష్ట్రనాయకులను మేనేజ్ చేద్దామని చూస్తే కిరణ్ అడ్డుపడ్డాడు. నా చేతులమీదుగా విడగొట్టను అంటూ విభజన వలన వచ్చే సమస్యలు ఏకరువు పెట్టి, ఎడ్యుకేట్ చేసి ప్రజలను సమైక్యంవైపు మొగ్గేట్లు చేస్తున్నాడు. ఇలా లాభం లేదనుకుని, కిరణ్‌కు ఎసరు పెట్టారు. కిరణ్ మంత్రివర్గాన్ని చీల్చారు. కొందరిని పిలిచి 'విడిపోతే మీకేం నష్టం? మీకు ప్యాకేజి యిస్తాం కదా, దానిలో దండుకోవచ్చు కదా. మీ కిరణ్ ఏమిటి, సిరి వస్తూంటే మోకాలడ్డుపెడుతున్నాడు. విడిపోయిన తర్వాత ఆంధ్ర బీభత్సంగా ఎదిగిపోవడానికి ఎంతో ఛాన్సుంది. రెండు పోర్టులకు నిధులిస్తాం. అక్కడ పరిశ్రమలు పెడతామంటే టాక్స్ హాలిడే యిచ్చుకునేందుకు మీకు అనుమతి యిస్తాం. ఇక ఇండస్ట్రీలే యిండస్ట్రీలు." అని చెప్పారట. దానితో 'అధిష్టానం మాట ధిక్కరించడం తప్పు కదా' అంటూ కిరణ్‌ను వీళ్లు నిందించసాగారు. యుపిఏ 2 మలిగిపోతున్న దీపం, దాని వెలుగులో మీరు యిల్లు చక్కబెట్టుకోండి అని వాళ్లు అంటే మాత్రం వీళ్లెలా విన్నారో నాకు తెలియదు. టాక్స్ హాలీడే యిస్తే ఆ మేరకు ఆదాయం తగ్గిపోతుంది. కొత్త రాష్ట్రానికి ఆదాయవనరులు తక్కువగా వున్నపుడు ఆ వెసులుబాటు యివ్వగలదా? మీకు సముద్రతీరం వుంది కదా అంటే – అది తరతరాలుగా వుంది. లాభం ఏమైనా కలిగిందా? అయినా మీరిస్తానన్నది మీ తర్వాత ఏ మోదీయో వచ్చి మాకు ఓట్లేయని రాష్ట్రానికి ఎందుకివ్వాలి? గుజరాత్‌లోనూ కోస్తా వుంది, అక్కడిస్తా అంటే?

ఏమైతేనేం కొందరు ఆంధ్రమంత్రులు అధిష్టానం వుచ్చులో పడ్డారు. కిరణ్‌కు ఎదురుతిరిగారు. అక్టోబరు 6 తర్వాత కిరణ్ సిఎం గా వుండడు అని కెసియార్ జోస్యం చెప్పినపుడే తెలిసిపోయింది – అధిష్టానం కిరణ్‌ను తీసేయడానికి నిశ్చయించుకుందని. అతని స్థానంలో మరో రెడ్డిని పెట్టాలంటే ఆనం రామనారాయణ రెడ్డి అని, కాదు కాపుని పెట్టాలంటే చిరంజీవో, బొత్సో అని పుకార్లు షికారు చేస్తున్నాయి. వీళ్లకు తమ ప్రాంతం ఏమై పోయినా పట్టదు, తమకు పదవులు యిస్తే, తమవాళ్లకు కాంట్రాక్టులు యిస్తే చాలు. వీళ్లు పదవిలోకి రాగానే ఓ నాలుగు రోజులు దిష్టిబొమ్మలు తగలబడతాయి. తర్వాత విసుగేసి జనాలు వూరుకుంటారు. జీతం లేకుండా, ఆదాయం లేకుండా రెండు నెలలుగా ఉద్యమం చేసి అలసినవాళ్లు యింకెంత కాలం పోరాడతారు? ఎన్నికల దాకా యీ

కోపం వుంటుందో లేదో ఎవరికీ తెలియదు. కళ్లముందు నోట్లు రెపరెపలాడిస్తే మనసు ఎటు తిరుగుతుందో వూహించలేం.

ప్రజల బాగోగులతో సంబంధం లేకుండా చేసే యీ కాంగ్రెసు రాజకీయాలే దేశాన్ని యీ గతికి తెచ్చాయి. అయినా కాంగ్రెసు 65 ఏళ్లగా దేశాన్ని ఏలేస్తోంది. ఎన్నికల వేళ ఏదో ఒక గిమ్మిక్కు చేసి, బతికేస్తోంది. అందుకే తను ఏం చేసినా చెల్లుతుందన్న గుడ్డి నమ్మకం దానికి. అందుకే యింత అడ్డదిడ్డంగా తెలంగాణ అంశాన్ని డీల్ చేసింది. దీనివలన ఆంధ్రకానీ, తెలంగాణ కానీ బాగుపడుతుందన్న నమ్మకం నాకు లేదు. రాష్ట్రపరిపాలనలోకి కేంద్రం చొరబడి, ఢిల్లీ రాజ్యమే నడిపిస్తుందని నా భయం. పిల్లి, పిల్లి కొట్టుకుని కోతికి రొట్టె అప్పగించినట్టు మన తెలుగువాళ్లం అందరం కలహించుకుని మన రాజధానిని ఢిల్లీ చేతిలో పెడుతున్నాం. భావితరాలు మనల్ని తిట్టుకోవడం ఖాయం **– ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2013)**

**అక్టోబరు 7** **ఎమ్బీయస్ : అలిగి ఆంటోనీ రిజైన్ చేయాలి**

సీమాంధ్ర కేంద్రమంత్రుల్లో ఎవరు రిజైన్ చేశారో, ఎవరు చేద్దామనుకున్నారో, ఎవరు చేయబోయారో, ఎవరు చేసినట్టు అభినయించారో నాకు యిప్పటిదాకా అర్థం కాలేదు. మనస్తాపం చెందారట, సోనియా వద్దకు వెళితే ఆవిడ 'ఆంధ్రకు న్యాయం చేయవలసిన టైములో మీరందరూ రిజైన్ చేసి యింట్లో కూర్చుంటే మీ వాళ్ల గతి ఏం కాను? మీరు పదవులలో వుండి ఆ పాపులను ఉద్ధరించాలి కదా' అని నచ్చచెప్పగానే వీళ్లు ఔను సుమా అనుకుని నాలిక కరుచుకుని రాజీనామా పత్రం మడిచి జేబులో పెట్టుకుని వచ్చేస్తున్నారు. అసలు వీళ్లకి అంతరాత్మంటూ వుంటే 'ఇన్నాళ్లుగా వుండి ఏం ప్రజలను ఉద్ధరించాం? వాళ్ల సాధకబాధకాల గురించి పార్టీ అధిష్టానానికి ఏం నచ్చచెప్పాం?' అని అడిగి చూసుకోవాలి.

'ఎప్పటిమాటో ఎందుకు, ప్రస్తుతం రెండు నెలలకు యింత ఉవ్వెత్తున ఉద్యమం ఎగసిపడుతూ వుంటే కనీసం ఒక్క ఓదార్పు మాట వాళ్ల దగ్గర్నుంచి రాబట్టగలిగామా? ఆంటోనీ కమిటీ నివేదిక రానిదే కాబినెట్ నోట్ తయారవదు అని మాకు చెప్తూనే రహస్యంగా నోట్ తయారు చేయించి, తీర్మానం పాస్ చేయించేశారే! అడ్డుకోగలిగామా? అబద్ధాలు చెప్పారేమని సోనియాను అడగగలిగామా? ఇలాటి చవటలమైన మనం జిఓఎమ్ (గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్)లో వుంటే ఎంత, వుండకపోతే ఎంత' అని ఆత్మపరిశీలన చేసుకున్నారా? విభజన సమయంలో ఆస్తిపాస్తుల వ్యవహారం చూడడానికి వీళ్లు పదవులో వుండడం అవసరం అని తమను తాము భ్రమింపచేసుకుంటూ, మనల్ని మభ్యపెడుతూ రాజీనామాలు వెనక్కి తీసుకుంటున్నారు. జిఓఎమ్ 45 రోజుల్లో తమ పని పూర్తి చేస్తుంది కదా. ఆంధ్రను ఉద్ధరించే కార్యక్రమం అప్పటితో ముగుస్తుంది కాబట్టి 46 వ రోజున రిజైన్ చేస్తానని వీళ్లు రాసి యిస్తారా? అసలు వీళ్లందరి సంగతీ కాదు కానీ, నిజానికి రిజైన్ చేయవలసిన వారెవరైనా వున్నారా అంటే అది ఆంటోనీ గారే!

జులై 30 ప్రకటన తర్వాత తెలంగాణ అంశంపై సమాధానాల కంటె ప్రశ్నలే ఎక్కువ ఉద్భవించాయి. ఈ మాట అడిగితే కాంగ్రెసు నడిగితే ఏమంది? 'సిపిఎం, మజ్లిస్ తప్ప తక్కిన అన్ని పార్టీలు చేయమన్నాయిగా, అందుకే చేశాం' అంది. వాళ్లు తెలంగాణ యిచ్చేయ్ యిచ్చేయ్ అన్నారు, యిచ్చేశాం. ఇప్పుడు మమ్మల్ని తప్పు పడతారేమిటి? అని తిరగబడింది. వాళ్లు విభజన చేయమన్నారు నిజమే, సవ్యంగా చేయవద్దనలేదుగా! అయినా వాళ్లు చెప్పిన ప్రతీమాటా వినేస్తున్నారా? వారానికోసారి మీ ప్రభుత్వం రాజీనామా చేయాలంటారు, అది విని గద్దె దిగిపోతున్నారా? ఈ విషయంలో మాత్రం తుచ తప్పకుండా వినేశారే! అయినా వైకాపా వారు తండ్రిలా సమన్యాయం చేయాలి అనే ఒక రైడర్ యిచ్చారుగా, దాని మాటేమిటి? సమన్యాయం అంటే మాకు అర్థం కాలేదు, అదేమిటో వాళ్లు చెప్పలేదు అని వీరి సమాధానం. అర్థం కాకపోతే అడిగి వుండాల్సింది. నిర్ణయం తీసుకోమని మీరు మాకు సర్వహక్కులు యిచ్చేశారు కదా, వాడేశాం అన్నారు. ఓకే వాళ్లదే తప్పు. హక్కులు వాడేటప్పుడు ఏదో న్యాయం జరుగుతున్నట్టయినా చూపించాలి కదా. అదీ లేదు.

ఈ ముక్క సీమాంధ్ర ప్రజలు అడిగితే 'ఇదిగో ఆంటోనీ కమిటీ వేశాం. కష్టాలున్నాయనుకుంటే వెళ్లి చెప్పుకోండి. లేవనుకుంటే వూరుకోండి, ఊరికే ఆయన్ను యిబ్బంది పెట్టకండి, అసలే ఆరోగ్యం బాగా లేదు' అని చెప్పారు. ఆయన దగ్గరకు వెళ్లినవాళ్లు వెళ్లారు. కాంగ్రెసు పార్టీ కమిటీకి మేం వెళ్లడమేమి టనుకుని వెళ్లనివాళ్లు వెళ్లలేదు. ఆయన అర్జంటుగా ఆపరేషన్ చేయించుకోవాల్సిన అవస్థలో వున్నాడు. పగలంతా పార్లమెంటు, అక్కణ్నుంచి వచ్చాక వీళ్ల మద్దెల దరువు. అంటే రెండు పక్కల వాళ్లూ వచ్చి రెండు పక్కలా వాయించి వదిలిపెట్టారు. అందరూ సమస్యలు చెప్పేవారే తప్ప పరిష్కారాలు చూపే సహృదయుడు ఒక్కడూ కనబడలేదు. పైగా 'అయినా యిక్కడ కాదు, ఆంధ్రకు వచ్చి జనం మధ్య నిలబడి చూడాలి, వినాలి' అని చంపుకు తిన్నారు. సరే సరే సర్సరే అన్నారు ఆంటోనీ అసహనంతో. ఇంతలో రోగం ముదిరింది. ఆపరేషన్ టైము దగ్గర పడింది. అదేదో పూర్తి చేసుకుని ఆంధ్రకు వెళ్లాలి రావాలి, అప్పుడు నివేదిక ఫైనలైజ్ చేసి అమ్మగారి చేతిలో పెట్టి శభాష్ అనిపించుకోవాలి. అనుకుంటూ ఆపరేషన్ టేబులెక్కాడు. టేబుల్ దిగాడు కానీ యింకా మంచం దిగలేదు. ఆంటోనీ నివేదిక వచ్చేవరకూ కాబినెట్ నోటు యివ్వరట అని ఆంధ్ర కాంగ్రెసు నాయకులు చెపుతూ వుంటే, అది విని పత్రికలు సంపాదకీయాలు రాస్తూ వుంటే 'ఆహా నా నివేదికకు ఎంత చారిత్రక ప్రాధాన్యం వుంది' అని ఆయన మురిసిపోయి త్వరగా కోలుకుంటున్నాడు. మంచం మీద పడుక్కుని హైదరాబాదును ఏం చేద్దాం, కృష్ణా గోదావరి జలాలను ఎలా పంచుదాం అని తెగ ఆలోచిస్తున్నాడు.

అంతలోనే కబురు – ఈ లోపునే సోనియమ్మ కాబినెట్ నోట్ తయారు చేయించేసిందని, రహస్యంగా టేబుల్ ఐటెమ్‌గా కాబినెట్ సమావేశంలో పెట్టి చప్పట్లు కొట్టించేసిందనీ! ఆ సమావేశానికి చెప్పిన అజెండా వేరే, మధ్యాహ్నం దాకా కాబినెట్ నోటు చూడలేదని, సంతకం పెట్టలేదనీ షిండేగారు బుకాయిస్తూనే వున్నారు. తీరా సమావేశానికి వెళ్లాక హఠాత్తుగా మెజీషియన్ టోపీలోంచి కుందేల్ని తీసినట్టు దీన్ని టేబుల్‌క్లాత్ కింద నుండి బయటకు లాగారు. తక్కిన అంశాలన్నీ పట్టించుకోలేదు, కేవలం దీనిపైననే గంటముప్పావు డిస్కషన్. అందులో గంటసేపు జైపాల్, పళ్లంరాజు, కావూరి ఉపన్యాసాలు. జైరాం వగైరాల ఉపన్యాసాలు అరగంట. ఇక 22 పేజీల ఆ నోట్ చదివినది ఎవరు? అసలు చదవడానికి టైమెక్కడ? మధ్యలో ఎవరైనా 'ఆంటోనీ నివేదిక ఏమైనట్టు...' అని మాట నాన్చారో లేదో కూడా తెలియదు. ఒకవేళ ఎవరైనా నానిస్తే 'ఆ గన్నయ్య నివేదిక ఎవడికి కావాలి? మాకు తెలియని విషయమేమైనా వుందా? మేం తీర్చలేని సమస్య ఏమైనా వుందా?' అని సోనియా గసిరిందేమో తెలియదు. చివరకు ఆ నివేదిక, పులుసులో ముక్క, ఆటల్లో అరిటిపండు, ఆరో వేలు, అజాగళస్తనం.. యిలాటి జాబితాలో జమ అయింది.

ఉత్తిపుణ్యానికి తనను శ్రమ పెట్టి, ఆంధ్రులను వెర్రివెధవలను చేయడానికి తన పేరు వాడుకుని, యిచ్చేముందే తన నివేదికను చెత్తబుట్ట దాఖలు చేసినందుకు  కినిసి ఆంటోనీగారు రిజైన్ చేయాలి. చేస్తారా? చేయరు! చేస్తే ఆయన కాంగ్రెస్ వాడెందుకు అవుతారు? **– ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2013)**

**అక్టోబరు 8** **ఎమ్బీయస్ : ఇది దూకుడు సీజన్**

ఎటు చూసినా దూకుడే కనబడుతోంది. కేంద్రంలో కాంగ్రెసు మాంచి దూకుడు మీద వుంది. జులై 30 నుండి రెణ్నెళ్లపాటు నోట్లో వేలేసుకుని కూర్చున్నా హఠాత్తుగా అక్టోబరు 3 న, నిద్ర లేచి కాబినెట్ తీర్మానం చేసి పారేసింది. ఆంటోనీ లేడు గీంటోనీ లేడు, అతడు నివేదిక యిచ్చేదేముంది, మనం చూసేదేముంది అనుకుని తీర్మానం తయారుచేసి మన నెత్తిన పడేసి గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ అంటూ ఓ ముఠాను తయారుచేస్తోంది. 65 రోజులుగా కేంద్రం హెూం శాఖ, న్యాయశాఖ లో హేమాహేమీ అధికారులు ఏం చేశారో తెలియదు కానీ జులై 30 నాటి ప్రకటనే కాబినెట్ ముందు పెట్టగా మరి 45 రోజుల్లో యీ మంత్రిబృందం జలసమస్యలు, రాజధాని సమస్యలు, ఉద్యోగసమస్యలు యిత్యాది అమాంబాపతు సమస్యలన్నీ చిటికెలో తేల్చేస్తారట. ఇరుపక్షాల వారి వాదనలు వినేసి, మధ్యస్తం చేసేసి, ఫటాఫటా బిల్లు రూపొందించేస్తారట. అసలు యిప్పటిదాకా అటువాళ్లు గానీ, యిటువాళ్లు గానీ సమస్యలు చెప్పడమే తప్ప పరిష్కారాలు సూచించలేదు. సూచిస్తే వాటిల్లోంచి వీళ్లు ఏదైనా ఏరుకునేవారు. అందువలన మంత్రిబృందమే పరిష్కారాలు ఆలోచించి, వీళ్ల ముందు పెట్టి, వీళ్లు ఊహూ అంటే ఇంతకంటె బెస్టు మరోటి లేదని నచ్చచెప్పి ఔననిపించాలి.

ఇంత కసరత్తుకి వీళ్ల దగ్గర టైముందా? ఎందుకంటే 5 రాష్ట్రాలలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటించేశారు. ఇవి చాలా ముఖ్యమైనవి. వీటిల్లో కాంగ్రెసు ఓడిందంటే 2014లో కూడా గెలవడం కష్టం అనే సంకేతాలు వెళతాయి. అందువలన ఎలాగైనా నెగ్గాలి, ఓడిపోయినా కాస్త గౌరవనీయంగా ఓడిపోవాలి. దేశ ఆర్థికపరిస్థితులు, అవినీతి కథనాలు చూస్తూంటే కాంగ్రెసుకు క్లిష్టంగా వున్నాయి. అందువలన వీళ్లందరూ వాటిపై దృష్టి పెట్టకతప్పదు. ఓ పక్క ఎన్నికల ప్రచారాలు చూసుకుంటూ మరో పక్క తమ శాఖల నిర్వహణ చూసుకుంటూ మన రాష్ట్రానికి వచ్చి వివిధ వర్గాల అభిప్రాయాలు కనుక్కుని అందరికీ నచ్చే పరిష్కారం చూపగలరని అనుకోగలమా? అనుకోవాలి అంటోంది కాంగ్రెసు. ఎందుకంటే డిసెంబరు 9 కల్లా అంతా అయిపోవాలి. ఎందుకంటే ఆ రోజు మన ఆధునిక భారతమాత సోనియమ్మ పుట్టినరోజు. నాలుగేళ్ల క్రితం మాట యిచ్చిన రోజు. వచ్చే డిసెంబరు 9 కి ఆవిడ పదవిలో వుంటుందో, లేదో తెలియదు. అమెరికాలో ఆసుపత్రిలో వుంటుందో, ఇండియాలో బతకమ్మగా విరాజిల్లుతూ వుంటుందో తెలియదు. చేసేదేదో యిప్పుడే చేశాయలన్న దూకుడు మీద వుందావిడ.

దేశవిభజన టైములో మౌంట్‌బాటెన్ యిలాటి దూకుడులోనే వున్నాడని అట్లీ పై రాసిన వ్యాసంలో రాశాను. జూన్ 1948 కల్లా ఇండియానుండి వైదొలగాలి, దానికి తగిన ఏర్పాట్లు చేయి అని బ్రిటిషు ప్రధానమంత్రి అట్లీ మౌంట్‌బాటెన్‌ను పంపిస్తే అదెంత పని అంటూ పది నెలల ముందే చేసి పారేస్తాను అంటూ అడావుడిగా విభజన చేపట్టాడు మౌంట్‌బాటెన్. పంజాబ్‌ను చీల్చడానికి సర్ రాడ్‌క్లిఫ్ అనే బ్రిటీషు న్యాయవాదిని తీసుకొచ్చారు. ఆయనకు ఇండియా గురించి ఏమీ తెలియదు. అదే ఆయన అర్హత అన్నారు. ఏ గ్రామం ఏ దేశంలో చేరాలన్న విషయంపై ఆయనకిచ్చిన సహాయకులు కూడా వేర్వేరుగా, రకరకాలుగా సలహాలివ్వసాగారు.  ఇక ఇలా లాభం లేదని ఆయన సగటున రోజుకి 48 కి.మీ. చొప్పున సరిహద్దు రేఖ గీసుకుంటూ పోయాడు. ఏ గ్రామం ఎటు వెళు తుందో ఎవరికీ తెలియకుండా పోయింది. ఇంత తలతిక్కగా, ఆదరాబాదరాగా జరిగింది కాబట్టే దేశవిభజన తాలూకు సమస్యలు యిప్పటికీ తీరలేదు. ఇప్పుడు ఈ మంత్రిబృందం కూడా అంత తొందరలోనూ వుంది. (అన్నట్టు వీళ్లు ఆంధ్ర, తెలంగాణ సరిహద్దులు కూడా నిర్ణయిస్తారట. చూడబోతే కొత్త తంటా ఏదో తెచ్చిపెట్టేట్టున్నారు) వీళ్ల దూకుడు వల్ల మన బతుకు బండలవుతుంది చూడండి.

మనబోటి వాళ్లు సోనియా మెదడులో ఏమైనా సందేహాలు పెట్టేటట్టుంటే 'నో ఫియర్, ఐ యామ్ హియర్' అని చెప్పడానికి తిరు చిదంబరంగారు వున్నారు. శ్రీవారే మంత్రిబృందానికి నాయకత్వం వహిస్తారట. ఆయన ఆర్థిక శాఖను అమోఘంగా నిర్వహించేసి

మనల్ని, రూపాయిని పాతాళంలో తోసేశాడు. ఇప్పుడు యిక విభజన కార్యక్రమాన్ని కూడా యింతకంటె అమోఘంగా నిర్వహించడానికి ధోవతి బిగించాడు. మామూలు ఆర్థికమంత్రి ఎవరైనా అయితే 'ఇప్పుడున్న పరిస్థితుల్లో చేయాల్సింది ఎంతో వుంది. ఈ బాధ్యత చేపట్టడం నాకు కష్టమౌతుంది' అనేవారు. కానీ చిదంబరంగారు మాంచి దూకుడు మీదున్నారు. ఈ ఆంధ్రప్రదేశ్ సంగతి నాకు వదిలిపెట్టండి, ఆనపకాయ నరికినట్టు నరుకుతా అంటున్నాడు.

ఇతనికి ఎందుకింత వుబలాటం అని ఆశ్చర్యపడుతూండేవాణ్ని. ఇవాళ ఆంధ్రజ్యోతిలో వచ్చింది – శివగంగలో తను మళ్లీ ఎన్నికవడని తెలిసి (మళ్లీ – అనడం తప్పని నాకూ తెలుసు. కితంసారే ఎన్నికవలేదు. గోల్‌మాల్ చేసి ఢిల్లీకి వచ్చేశాడు) మెదక్ నుండి పోటీ చేద్దామని అనుకుంటున్నాట్ట. ఇప్పటిదాకా మెదక్‌కి చేసినదేమీ లేదు కదా, అక్కణ్నుంచి ఎలా గెలుద్దామనుకుంటున్నాడు అనుకుంటున్నారా? సీమాంధ్రులు అందరి కంటె ఎక్కువగా ద్వేషిస్తున్నది చిదంబరం నాటి డిసెంబరు 9 ప్రకటననే. ప్రణబ్ వుంటే అది వచ్చేది కాదని, చిదంబరమే సోనియాను తప్పుదారి పట్టించాడని వాళ్లు విశ్వసిస్తున్నారు. చిన్నరాష్ట్రాలతోనే దేశప్రగతి సాధ్యం అని వ్యాసాలు రాసి, ఆంధ్రప్రదేశ్‌ను విడగొడితే మంచిదని వాదించి, దాని కంటె కేవలం మూడు పార్లమెంటు సీట్లు తక్కువున్న తమిళనాడు దగ్గరకు వచ్చేసరికి 'తమిళజాతి ఒకటి, దాన్ని విడగొట్టే ప్రయత్నాలు మొగ్గలోనే తుంచేయాలి' అని గర్జించిన మొనగాడు యితను. అందుకే సీమాంధ్రులకు చిదంబరం అంటే కోపం. ఆ కోపమే తనను మెదక్‌లో గెలిపిస్తుందని చిదంబరం ఆశ కాబోలు. అందుకే ఆయనా దూకుడు మీదున్నాడు.

తన దూకుడుకి ఎవరు అడ్డం వచ్చినా సోనియా సహించేట్టు లేరు. కిరణ్ ఒకడు ప్రతిబంధకంగా కనబడుతున్నాడు. అందువలన అతని పనిబడుతున్నారు. 65 రోజులుగా శాంతియుతంగా ఉద్యమం సాగుతూంటే దాన్ని సుతారంగా హేండిల్ చేస్తూ సమైక్యవాదిగా, అంతరాత్మ ప్రబోధం వింటున్న నాయకుడిగా పేరు తెచ్చుకుంటున్నాడు. అధిష్టానం తన నిర్ణయాన్ని పునరాలోచించాలి అని మాటిమాటికి చెప్తున్నాడు. ఇదంతా కాంగ్రెసే అతని చేత చేయిస్తోందేమోనన్న సందేహం అందరిలో వుంది. కానీ యిటీవలి ఘటనలు చూస్తూ వుంటే అలాటిది వున్నట్టు తోచటం లేదు. ఎందుకంటే అధిష్టానం కిరణ్ వ్యతిరేకులను దువ్వుతోంది. వాళ్లకు శక్తి నిచ్చింది. తనపై విమర్శలు విని కిరణ్ వూరుకున్నారు. తన బదులు బొత్స కానీ, ఆనం కానీ ముఖ్యమంత్రిగా వస్తారని పుకార్లు వస్తే ప్రతిచర్యగా ఏమీ చేయలేదు. అధిష్టానం కొత్త ఎత్తు ఎత్తింది. ఇప్పటిదాకా శాంతియుతంగా నడుస్తున్న వుద్యమం హఠాత్తుగా హింసాత్మకం అయింది. కిరణ్‌కు వ్యతిరేకిగా ముద్రపడిన బొత్స ఆస్తుల ధ్వంసం ప్రారంభమైంది. ఇదంతా కిరణే చేయిస్తున్నాడన్న భావం అందరిలో కలగాలి. రేపో మాపో అధిష్టానవిధేయ మంత్రులందరూ విజయనగరం ఘటనల విషయంలో కిరణ్‌ను తప్పుపడతారు. బొత్సతో సంఘీభావం వ్యక్తపరుస్తారు. ప్రత్యర్థులను సహించలేని, శాంతిభద్రతలను అదుపు చేయలేని ముఖ్యమంత్రి మాకు వద్దు బాబోయ్ అని అధిష్టానానికి విజ్ఞప్తి చేస్తారు. ఇక అధిష్టానానికి తప్పదు కదా, కిరణ్‌ను దింపేయాల్సి వస్తుంది.

కిరణ్‌ను దింపి ఎవర్ని కూర్చోబెట్టినా సమైక్య ఉద్యమకారులు వారిని ద్రోహులుగా ముద్ర వేస్తారు. అందువలన కాస్త తమాయించాలి. ముందుగా చేయవలసినది శాంతిభద్రతల పేరు చెప్పి రాష్ట్రపతిపాలన విధించడం. సీమాంధ్ర ఉద్యమాన్ని హింసాత్మకంగా అణచి వేయడం. 1973లో జరిగినది అదే. ఇప్పుడూ అదే చేయడంలో ఆశ్చర్యం లేదు. దానికి తగిన భూమిక రెడీ అవుతోందన్న సూచనలు కనబడుతున్నాయి. ఎందుకంటే 65 రోజులుగా సమైక్య ఉద్యమం శాంతియుతంగా జరుగుతూంటే కవర్ చేయని జాతీయ మీడియా యిప్పుడు హఠాత్తుగా లైవ్ ప్రోగ్రాంలు చూపించేస్తోంది. బొత్స ఆస్తులపై దాడి, తిరుపతిలో భక్తుల యిక్కట్లు – అన్నీ వాళ్లకు న్యూసే యిప్పుడు. సీమాంధ్రుల సమస్యల గురించి హైలైట్ చేయడమో, వాటి పరిష్కారాల గురించి చర్చలు నిర్వహించడమో చేయని జాతీయ టీవీ ఛానెల్స్ యిప్పుడు వాళ్లు చేసే విధ్వంసాన్ని మాత్రం హైలైట్ చేసి 'ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ తన ప్రభుత్వాన్నే కూలదోసుకోవడానికి కారణం యిది' అని దేశప్రజల్లో ఒక భావం వ్యాప్తి కావడానికి దోహదపడుతోంది. కిరణ్‌ను గద్దె దింపడంతో బాటు, విధ్వంస కారుడిగా కూడా ముద్ర కొట్టి పంపిస్తే తన కనుసన్నల్లో మెలగే బొత్సో, ఆనమో ముఖ్యమంత్రి కావడానికి మార్గం సుగమం అవుతుంది. రాష్ట్రపతి పాలన సమయంలోనే అసెంబ్లీ తీర్మానం కూడా మమ అనిపించేస్తే సోనియమ్మ పుట్టినరోజు నాటికి తెలంగాణ అవతరించడానికి యిబ్బంది వుండదు.

జులై 30 ప్రకటన తర్వాత తెలంగాణ నాయకుల్లో పెద్ద హుషారు కనబడలేదు. కొత్త రాష్ట్రం ఏర్పాటుకు విధివిధానాలు ఏవీ చెప్పకుండా అన్నీ అస్పష్టంగా వుంచడంతో 'దీనిలో ఏదో మతలబు వున్నట్టుంది. నామ్‌కే వాస్తే ప్రకటనలా వుంది. బిల్లు తయారయ్యేందుకు 7 నెలలు పడుతుందట. అంటే 2014 లోపున వచ్చేందుకు అవకాశం లేదు.' అని స్తబ్దంగా వూరుకున్నారు. దానికి తోడు రెండు నెలల పాటు ఎక్కడ వేసిన గొంగళీ అక్కడే వుండడంతో, అదంతా తమ ప్రతిభే అని రాజగోపాల్ వంటి వాచాశూరులు చెప్పుకోవడంతో డీలా పడ్డారు కూడా. అయితే అక్టోబరు 3 తీర్మానం చూడగానే ఒక్కసారిగా హుషారు వచ్చింది. ఇక దూకుడే దూకుడు. బొత్స ఆస్తుల విధ్వంసం గురించి ఒకటే విచారం వ్యక్తం చేస్తున్నారు. సీమాంధ్ర ఉద్యమం గురించి వ్యాఖ్యల జోరు పెరిగింది. 'అసలు దీనిలో మీరు ఏడవడానికి ఏముంది?' అని సీమాంధ్రులను పొన్నం వగైరాలు గద్దిస్తున్నారు. 'కేంద్రం డబ్బిస్తుంది లెండి, వెళ్లి ఎక్కడో అక్కడ ఏదో ఒక రాజధాని కట్టుకుని ఏడవండి. ఏదో కోల్పోయినట్టు ఊరికే ఏడుపుమొహం పెట్టకండి' అని చివాట్లు వేస్తున్నారు. కేంద్రప్రభుత్వం ఎంత యిస్తుందో, అసలు యివ్వడానికి 2014 తర్వాత యీ సర్కారు వుంటుందో లేదో వాళ్లకు తెలియదు, వీళ్లకూ తెలియదు.

అక్టోబరు 3 వ తారీకునాడే ప్లానింగ్ కమిషన్ వారు అన్ని రాష్ట్రాలకూ ఉత్తరాలు రాశారు – 'మీరు ప్లాన్‌డ్ ఎక్స్‌పెండిచర్

(ప్రణాళికా బద్ధమైన వ్యయం, అంటే ప్రజారంజకమైన పథకాలకు యిచ్చేది కాదు, నిర్మాణాత్మకమైన పనులకు పెట్టే ఖర్చు)కు డబ్బులడిగినా మా దగ్గర లేదు. అందుకని అడక్కండి' అని. ఇలాటి దివాలాకోరు ప్రభుత్వం కొత్త రాజధానికి లక్ష కోట్లు, రెండు లక్షల కోట్లు యిస్తుందా? (బాబుగారు మూడో ఫ్రంట్‌కో, ఎన్‌డిఏకో మద్దతిచ్చి కేంద్రంలో తనకు అనుకూలమైన ప్రభుత్వాన్ని తెచ్చుకున్నా తను చెప్పిన 4,5 లక్షల కోట్లలో సగం కూడా తెచ్చుకోలేరని గ్యారంటీగా చెప్పవచ్చు). గతంలో జార్‌ఖండ్ ఏర్పడినపుడు 1500 కోట్లు యిస్తానన్న వారు యిప్పటిదాకా 500 కోట్లు కూడా యివ్వలేదు. వరద వచ్చినపుడు, కరువు వచ్చినపుడు కేంద్రబృందం ఓ పట్టాన రాదు. అంతా సద్దు మణిగాక వచ్చి, చూసి 'ఏం, అంతా బాగానే వుందే! మీరు అంచనా వేసిన నష్టం చాలా ఎక్కువగా వుంది. పదోవంతు చాలు' అంటారు. పోనీ అదీ యివ్వరు. మొదటి విడత యిచ్చినదానికి లెక్కలు సరిగ్గా చెప్పలేదంటారు, ఆ ఫైల్‌కు ట్యాగ్ వూడిపోయిందంటారు. ఇలాటివాళ్లు లక్షలు, కోట్లు యిస్తారా? వాళ్లు యిస్తే కదా ఆంధ్రులు రాజధాని కట్టేదీ, యిక్కణ్నుంచి కదిలేదీ! ఇదీ తెలంగాణ వారి భయం. ఈ భయాలను పోగొట్టాలంటే, వాళ్లు దసరాకు బతకమ్మ స్థానంలో సోనియమ్మను పెట్టి ఆడాలంటే 'మేం తెలంగాణ తెచ్చేశాం, భయసందేహాలు విడవండి, వచ్చే ఎన్నికల్లో మా పంచన చేరండి' అని చెప్పుకోవడానికి టి-కాంగ్రెసు నాయకులు యీ దూకుడును ప్రదర్శించాల్సిందే - మనసులో వారి కెంత గుబులున్నా!

దూకుడు చూపుతున్న మరో నాయకుడు జయపాల్ రెడ్డిగారు. ప్రత్యేక తెలంగాణ సూదిని దబ్బనంగా భ్రమింపచేస్తూ వచ్చిన సూదిని రెడ్డిగారు యిన్నాళ్లూ ముసుగువీరుడిగానే ఖ్యాతి చెందారు. కాబినెట్‌లో వుంటూ యిలాటివి పైకి మాట్లాడకూడదు అంటూ మర్యాద అభినయిస్తూ వచ్చిన యీ మేధావి జులై 30 తర్వాత శిలాశాసనం రిమార్కు ద్వారా కాస్త దూకుడు ప్రదర్శించారు. వినాయకచవితి నాడు వచ్చే వినాయక చవితి ప్రత్యేక తెలంగాణలోనే అని ప్రకటించి, తనను తాను ప్రకటితం చేసుకున్నారు. అప్పటికింకా కాబినెట్‌లో తీర్మానం జరగనేలేదు. కేవలం పార్టీ తీర్మానం లెవెల్లోనే వుంది. అయినా మర్యాదలను ప్రతిమా, పత్రితో పాటు నిమజ్జనం చేసేశారు.

ఇక అక్టోబరు 3 తర్వాతినుండి పట్టపగ్గాలు లేకుండా విచ్చురూపాయిలా వెలిగేస్తున్నారు. మరో పెద్దమనుష్యుల ఒప్పందం కుదర్చడానికి తను మధ్యవర్తిత్వం వహిస్తారట. ఈ పని యిన్నాళ్లూ చెయ్యవద్దని ఎవరన్నారు? 2009 డిసెంబురులోనే ఒక సీనియర్ నాయకుడిగా యిరుపక్షాలను పిలిచి ఓ ఫార్ములా వర్కవుట్ చేసి, అధిష్టానానికి సబ్మిట్ చేస్తే వాళ్లకూ ఉపకారంగా వుండేది కదా! అప్పుడంతా తెరచాటు భాగోతం నడిపి, యిప్పుడు విజేతగా ముందుకు వచ్చి పరాజితులతో సంధి కుదురుస్తానంటే, ఆంధ్రులకు ఉక్రోషంగా వుండదా? అయినా యీ పెద్దమనుషుల ఒప్పందం అనే మాటెందుకు వాడారు స్వామీ? 1956 నాటి పెద్దమనుష్యుల ఒప్పందం నాటి పెద్దమనుష్యుల్లో ఎవరూ పెద్దమనుష్యులు కారనీ, అందరూ కాంగ్రెసు వారేననీ తేలిపోయాక కూడా మరో పెద్దమనుష్యుల ఒప్పందం అంటే ఎవరు నమ్ముతారు? పైగా మధ్యవర్తి అన్నవాడు యిద్దరికీ సమదూరంలో వుండాలి. తమరు పూర్తి తెలంగాణవాది, పైగా సమైక్యం నుండి ఫిరాయించినవారు. కొత్తగా వైష్ణవం పుచ్చుకున్నవాడికి పంగనామాలు ఎక్కువ అన్నట్టు తెలంగాణ కోసం ఎప్పణ్నుంచో పోరాడుతున్నవారి కంటె వీర లెవెల్లో ఆంధ్రకు వ్యతిరేకమై పోయారు.

హైదరాబాదులో సీమాంధ్రుల పెట్టుబడులు - అన్న అంశంపై టి-ఉద్యమకారులు యిస్తున్న గణాంకాలు అన్నీ ఒక చోట సేకరిస్తే ఏ పరిశోధకుడికైనా మతి పోవడం ఖాయం. ఓ సారి 95% వాళ్లవే అంటారు, యింకోసారి 5% కి మించవు అంటారు. జయపాల్ రెడ్డిగారు మొన్ననే హైదరాబాదులో తెలుగేతరుల పెట్టుబడులే ఎక్కువ అన్నారు. ఇప్పుడు హైదరాబాదు అభివృద్ధిలో సీమాంధ్రుల పాత్ర కాదనలేనిది అంటారు. అక్టోబరు 3 న కాబినెట్ సమావేశంలో యిదే మహానుభావుడు 'హైదరాబాదును యింకోళు వృద్ధి చేసేదేముంది, నిజాం కాలంలోనే హైదరాబాదు దేశంలో అయిదో పెద్ద నగరం. ఇప్పుడూ అంతే!' అని తన వాగ్ధాటితో అక్కడున్న వారందరినీ ముగ్ధుల్ని చేసేశాడు. ఈ ఎంగిలిముక్క వాడని టి-ఉద్యమకారుడు యిప్పటిదాకా నాకు కనబడలేదు. అసలు వీళ్లెవరికీ ఒక విషయం తోచదా? ఐదో పెద్ద నగరం ఏ విషయంలో? అక్షరాస్యత లోనా? తలసరి ఆదాయంలోనా? విస్తీర్ణంలోనా? మానవాభివృద్ధిలోనా? పౌరహక్కులలోనా? ప్రభుత్వ ఆస్తులలోనా? పరిశ్రమల్లోనా? సౌందర్యం లోనా?.. లేక అన్నిటిలోనా? నిజాం ప్రభువు అంత గొప్పగా పాలించేస్తే మరి ఆయనకు వ్యతిరేకంగా జనమెందుకు తిరగబడ్డారట అని ఒక్కళ్లయినా తమను తాము ప్రశ్నించుకున్నారా?

నా 'నిజాం కథలు'లో గణాంకాలు సవివరంగా యిస్తున్నాను, దయచేసి చూడండి. ప్రభువులు పట్టుపరుపుల మీద దొర్లితే, పేదలు అన్నం కోసం అలమటించి, సాయుధపోరాటం చేపట్టి నిజాంను గద్దె దింపారు. యూనియన్ సైన్యాలు హైదరాబాదులో ప్రవేశించినపుడు ఘనస్వాగతం పలికారు. నేను చెప్పేది అబద్ధమే అనుకునేవారు కూడా యింకోదానికి సమాధానం చెప్పాలి. 65 ఏళ్ల క్రితం పెద్ద నగరంగా వున్నంత మాత్రాన, యిప్పుడూ అదే స్థాయిలో వుండాలని లేదు కదా! ఐదో క్లాసులో క్లాసు ఫస్టు వచ్చినవాడు, ఐదో ఫారంలో కూడా ఫస్టు రావాలన్న రూలుందా? ఆ స్థాయి నిలబెట్టుకోవడానికి వాడు శ్రమించాలిగా! కలకత్తా ఒకప్పుడు గొప్ప పారిశ్రామిక నగరం. మరి యిప్పుడు? కాలం గడుస్తున్న కొద్దీ ఆ స్థానం నిలబెట్టుకోలేకపోయింది కదా! హైదరాబాదు అప్పణ్నుంచి యిప్పటివరకు అయిదోస్థానాన్ని నిలుపుకోగలిగితే అదీ గొప్ప విషయంగానే గుర్తించి, దానికి కారకులైనవారికి సలాం కొట్టాలిగా, వాళ్ల కృషిని తీసి పారేయకూడదుగా! బెంగుళూరు వంటి నగరాలు 65 ఏళ్ల క్రితం పరిశ్రమలకు గుర్తింపు పొందలేదు. ఇటీవలి కాలంలో ఐటీ, బిటీలకు నెలవుగా మారాయి. హైదరాబాదు వాటితో పోటీ పడితే దానికి మార్కులు వేయరా? కెసియార్,

హరీశ్ వంటి వాళ్లు యిలా మాట్లాడితే నేను ఫీలవను. కానీ మేధావిగా భావించే జయపాల్‌రెడ్డిగారే యిలాటి తలతిక్క వాదనలు చేస్తే ఔరా, పదవీలాలస ఎంత పని చేయిస్తుంది! అనిపిస్తుంది.

ఇక కెసియార్‌గారు కూడా ప్రస్తుతం దూకుడు మోడ్‌లో వున్నారు. ఆయన ఎప్పుడు స్లీప్ మోడ్‌లోకి వెళతారో, ఎప్పుడు రీస్టార్ట్ మోడ్‌లో వుంటారో ఆయనకే తెలియాలి. జులై 30 తర్వాత దిమ్మ తిరిగి కొన్ని రోజులు మ్యూట్ మోడ్‌లో వున్నారు. ఆ తర్వాత అంతా సజావుగా జరిగిపోతోందన్న భయం వేసి, యిలా అయితే కాంగ్రెసుకే క్రెడిటంతా దక్కుతుందని బెంగపడి, నోరు విప్పి ఆంధ్ర ఉద్యోగులను రెచ్చగొట్టే కార్యక్రమంలో పడ్డారు – అప్షన్లు గిప్షన్లు లేవ్, తట్టాబుట్టా పట్టుకుని పోవల్సిందే అంటూ! వెంటనే అక్కడ అగ్గి అంటుకుని కెసియార్ దిష్టిబొమ్మలు తగలబడ్డాయి. హమ్మయ్య అని కెసియార్ కుదుటపడ్డారు. సీమాంధ్ర ఉద్యమాగ్నికి నేను సైతం – అంటూ సమిధలు వేస్తూ పోతున్నారు. సీమాంధ్రలో కిరణ్‌కు పాప్యులారిటీ పెరుగుతోందని గమనించిన కొద్దీ ఆయన్ని మరింత తిడుతున్నారు. కర్రీ పాయింటు పెట్టుకోమంటే తప్పేముంది, పదిమందికి కూడు పెట్టే పని కదా అని చతుర్లు వేస్తున్నారు.

ఆంధ్రలో పుట్టినవారందరూ తెలంగాణ ద్రోహులే అని కెసియార్ తీర్మానించేశారు. దెబ్బకి సీమాంధ్రలో విభజన కోసం ఉద్యమిస్తున్న దళిత నాయకుకు, సిపిఐ, బిజెపి పార్టీల ఆంధ్ర యూనిట్‌ల వారికి, తెలంగాణకు అనుకూలంగా లేఖ యిచ్చిన టిడిపి నాయకులకు, తెలంగాణ సెంటిమెంటును గుర్తిస్తున్నామని అన్న వైకాపా నాయకులకు, 'విడిపోతే తప్పేముంది?' అన్న కాంగ్రెసు నాయకులకు అందరికీ బుద్ధి వచ్చేసి వుంటుంది. సీమాంధ్ర ఉద్యమాన్ని కించపరిచే వ్యాఖ్యలు చేశారు. సీమాంధ్ర ఉద్యమంలో నాయకులు లేకపోవడం చేత ఎవళ్లకి తోచినది వాళ్లు చేస్తున్నారని తెలుస్తూనే వుంది. రాజకీయప్రేరితమైతే దానికి విశ్వసనీయత తగ్గిపోయేది. అయినా అత్తారింటికి దారి యిది అనీ, ఉద్యమం చేయడానికి పద్ధతి ఇదీ అని ఎవరూ పుస్తకం రాయలేదు. ఆకులు కట్టుకుంటే ఉద్యమమా? చేపలు పడితే ఉద్యమమా? అని కెసియార్ వెక్కిరించారు. తెలంగాణ ఉద్యమం నడిచే రోజుల్లో నేనూ బూటు పాలిష్ చేసేవాళ్లు, అరగుండు కొట్టించుకునే వాళ్లమీదా, రోడ్డుమీద భోజనాలు చేసేవాళ్ల మీదా జోకులు వేశాను. అయితే తర్వాత నాలిక కరుచుకోవాల్సి వచ్చింది – ఎందుకంటే అధిష్టానం దృష్టిలో అదే ఉద్యమం అయింది. అంతేకాదు ఉద్యమం నడిచిన కాలం గురించి కూడా కేంద్రం ఒక అభిప్రాయం ఏర్పరచుకుంది. దాని ప్రకారం మనమంతా చరిత్ర పుస్తకాలు రాయాలి మరి.

తెలంగాణ ఉద్యమం ఆరుదశాబ్దాలుగా సాగుతోందని, 1971లో దేశమంతా ఇందిరా ప్రభంజనం వీచినా తెలంగాణలో తెలంగాణ ప్రజా సమితి పది సీట్లు గెలుచుకుందని జయపాల్ చెప్పి కాబినెట్‌ను ఇంప్రెస్ చేశారు. అది అర్ధసత్యమే. ఆ తర్వాత ఈ పదిమంది కాంగ్రెసులో చేరిపోయి సమైక్యం పాట ఎత్తుకున్నా, తెలంగాణ ప్రజలు కిమ్మనలేదు. 1972లో సమైక్యమే నా విధానం అని నిలిచిన ఇందిరా గాంధీ నాయకత్వంలోని కాంగ్రెసు పార్టీకే బ్రహ్మాండమైన విజయం కట్టబెట్టారు. ఆ ఏడాది చివర్లో జై ఆంధ్ర అంటూ విభజన వుద్యమం చెలరేగితే మద్దతు యివ్వలేదు. ఆ పాటికి సమైక్యమే మేలు అనే భావనకు వచ్చేశారు. 1969 ఉద్యమం నడిపిన చెన్నారెడ్డి తర్వాతి రోజుల్లో తనను ఎవరైనా విభజనవాది అంటే మండిపడేవారు. నేను సమైక్యవాదిని అనేవారు. ఆయన ముఖ్యమంత్రి అయినపుడు 'ప్రత్యేక తెలంగాణ సంగతేమిటి?' అని అడిగితే 'దట్ ఈజ్ ఏ క్లోజ్‌డ్ చాప్టర్' (అది ముగిసిన అధ్యాయం) అన్నారు క్లుప్తంగా.

తెలంగాణ ప్రజలందరూ 60 ఏళ్లగా ఉద్యమం చేస్తున్నారు అని షిండే గారూ కాబినెట్ నోట్‌లో రాయించారు. మరో పక్క కెసియార్ చాప చుట్టి పక్కన పడేసివున్న తెలంగాణ ఉద్యమాన్ని తలకెత్తుకుని నేను 2001లో లాంతరు చేత పట్టుకుని బహుదూరపు ప్రయాణానికి ఒంటరిగా బయలుదేరాను అంటున్నారు. 1972 తర్వాత మళ్లీ విభజన ఉద్యమం ఊపందుకున్నది కెసియార్ చలవ వల్లనే. ఆయనను మెచ్చుకునేవారు, తిట్టుకునేవారూ కూడా నిర్ద్వంద్వంగా ఒప్పుకోవలసిన విషయం యిది. అందువలన 60 ఏళ్లగా ఉద్యమం నడుస్తోందని తెలంగాణ బిల్లులో రాయబోయే మొదటి వాక్యమే అసంబద్ధమైన వాక్యం. మొగుడూ పెళ్లాం పెళ్లయిన కొత్తల్లో తగవులాడుకుని, సమాధానపడి, 50 ఏళ్లు కాపురం చేస్తే – వీళ్లు 50 ఏళ్లగా కొట్లాడుకుంటూనే వున్నారని తీర్మానించగలమా? కొట్లాడుకుంటూ వుంటే పిల్లలు ఎలా పుట్టారు? పక్కింటివాళ్ల చలవా? 'తెలంగాణ ఉద్యమం ఆరు దశాబ్దాలుగా తీవ్రంగా నడుస్తూనే వుంటే సీమాంధ్రులు నాలుగు దశాబ్దాలుగా తమ పెట్టుబడులు తెలంగాణలో ఎందుకు పెడతారు?' అన్న చిన్న పాయింటు కూడా వీళ్లకు తట్టదా?

పాత విభజన ఉద్యమాలకు కాలం చెల్లింది. అవి విజయవంతం కాలేదు. ఈనాటి యీ తెలంగాణ ఉద్యమం వయసు 12. కెసియార్ వలననే యిది యీ స్థాయికి వచ్చింది. దానికి కాంగ్రెసు అంతర్గత రాజకీయాలు సాయపడ్డాయి నిజమే కానీ దీపం ఆరిపోకుండా, కారు ఆగిపోకుండా చూసినది మాత్రం కెసియారే! అందుకే ఆయన ఏం మాట్లాడినా వార్తే, ఆయన ప్రకటనలకు విలువనిచ్చి చర్చించడం జరుగుతుంది. హైదరాబాదు తెలంగాణదే అని కచ్చితంగా చెపుతూ 'హైదరాబాదుపై కిరికిరి పెడితే ఊరుకోం, కొట్లాడుతాం' అని ఆయన పెట్టిన మెలిక సామాన్యమైన మెలిక కాదు. 'హైదరాబాదులో ఆంధ్ర రాజధాని వుండవచ్చు, అదీ పదేళ్లపాటు..' ఇదే కెసియార్ యిచ్చే మాగ్జిమమ్ కన్సెషన్. అంటే ఓ నాలుగు పాత బిల్డింగులు ఆంధ్ర రాష్ట్రానికి యిచ్చి 'ఇవే అసెంబ్లీ అనుకో, సెక్రటేరియట్ అనుకో, రాజభవనం అనుకో, సమ్మర్ ప్యాలెస్ అనుకో, వింటర్ రిసార్ట్ అనుకో..' అంటే చాలని ఆయన ఊహ. తక్కినదంతా తెలంగాణదే అనాలని ఆయన పట్టుదల. అయితే పరిస్థితి అలా వుందా? ఉండదన్న అనుమానం మీకుందో లేదో కానీ ఆయన కుంది, అందుకే 'బిల్లు స్వరూపాలు చూశాక, పాస్ అయ్యాక విలీనం' అంటున్నాడాయన.

జులై 30 తర్వాత, అక్టోబరు 3 తర్వాత చాలామంది విభజనవాదులు వెక్కిరిస్తూ నాకు యీమెయిల్స్ రాశారు. 'మీ సమైక్యవాదం చెట్టెక్కిందిగా' అంటూ! నిజమే ప్రస్తుతానికి అలాగే అనిపిస్తోంది. అంతిమంగా విడిపోయినా నా సమైక్య సెంటిమెంట్లు పదిలంగానే వుంటాయి. ఆ మాటకొస్తే 1947లో భారత్ విడిపోకుండా వుంటే చాలా బాగుండేదని యిన్నేళ్లు పోయినా అనుకుంటాను. ఇవాళ విభజన కోరినవాళ్లు కూడా కొన్నేళ్లు పోయాక అయ్యయ్యో అనుకోవచ్చు. చరిత్రగతిని మనం మార్చలేం. రాహుల్ ప్రధానిని చేయడానికి కాంగ్రెసు యిదంతా చేపట్టింది కదా, ఇంత చేసి రేపు ఆంధ్రలోనూ, తెలంగాణలోనూ రెండు చోట్లా ఓడిపోయి, కేంద్రంలో ఏ నరేంద్ర మోదీయో అధికారంలోకి వస్తే 'ఆంధ్రప్రదేశ్ విడగొట్టి మనం బావుకున్నదేమిటి' అని సోనియాయే ఫీలవ్వచ్చు. నాకు మెయిల్స్ రాస్తున్నవారికి నేను యిచ్చే సమాధానం ఒకటే – 'విభజన వలన ఆంధ్రకు నష్టం జరిగింది, తెలంగాణకు లాభం జరుగుతుందని నాకు అనిపించటం లేదు. ఏదో ఒక పేరు చెప్పి హైదరాబాదును కేంద్రం తన చేతిలోకి తీసుకుంటుంది. అప్పుడు పన్నెండేళ్ల ఉద్యమం చేసి తెలంగాణ సాధించినదేమిటి? హైదరాబాదుపై అధికారం పోగొట్టుకోవడమా? అదే జరిగితే విభజన వలన తెలంగాణయే ఎక్కువగా నష్టపోయినట్టు అవుతుంది' – అని.

ఆదివారం నాడు దిగ్విజయ్ సింగ్ చెప్పిన సమాధానాలు చూడండి (ఈయన మాటలను రేపు మరొకరు ఖండించవచ్చు, లేదా ఆయనే దీనికి వ్యతిరేకంగా మాట్లాడవచ్చు, ప్రస్తుతం మాట్లాడినదానిపైనే మనం వ్యాఖ్యానించగలం). 'హైదరాబాదు ఉమ్మడి రాజధానిగా పదేళ్లు వుంటుంది. ఆ సమయంలో గవర్నర్ కానీ, కేంద్ర ప్రభుత్వం కానీ దీన్ని పాలిస్తుంది. యూటీ మాత్రం చెయ్యం.' ఈ మాటల్లో ఎంతైనా ప్రమాదం పొంచి వుంది. దీని అర్థం – యూటీ అని పేరు పెట్టకుండానే కేంద్రం తన చేతిలోకి హైదరాబాదు లాక్కుంటోంది. యూటీ అంటే మజ్లిస్ వద్దు అంటుంది. టి–జాక్ యుద్ధమే అంటుంది. అందుకని అనరు. 'మీ తెలుగువాళ్లలో మీకూ మీకూ పడదు, అందుకని నేను బెత్తం పట్టుకుని నిలబడతా' అంటూ యిద్దరికీ క్షవరం చేసి తన ఒళ్లో పడేసుకుంటోంది.

గతంలో సంస్థానాధీశుల విషయంలో ఈస్టిండియా కంపెనీ అదే చేసింది. మీలో మీకు కొట్లాటలు రాకుండా కాపాడతాను అంటూ తన కంపెనీ సైన్యాన్ని రాజధానిలో పెట్టేది. వాళ్ల జీతాలు సంస్థానాధీశుడి దగ్గర్నుంచి తీసుకుంటారు కానీ అతని మాట వినరు. కంపెనీవాళ్లు కాల్చమంటేనే తుపాకీ తీస్తారు. ఇప్పుడు మన నెత్తి ఎక్కి తొక్కే కేంద్రప్రభుత్వపు అధికారుల ఖర్చు కూడా మనమే భరిస్తాం. ప్రత్యేక రాష్ట్రం చేస్తే స్థానిక ప్రజాప్రతినిథులైనా వుంటారు. వాళ్ల చేతిలో పాలన వుంటుంది. ఇప్పుడు ప్రజలెన్నుకున్న ప్రజాప్రతినిథులు నోరెత్తడానికి లేదు. మహారాజశ్రీ గవర్నరు గారు పాలిస్తారట. నిష్పాక్షికంగా వుండడానికి గవర్నరంటే సుప్రీం కోర్టు న్యాయమూర్తా? అతడు కేంద్రం తాబేదారు. రిటైరైన రాజకీయనాయకులకు యిచ్చే పెన్షన్ – గవర్నరుగిరీ.

గవర్నరు ఏయే అంశాల్లో పాలిస్తుందో మంత్రిబృందం తేలుస్తుంది అంటున్నారు కానీ ప్రస్తుతం అనుకుంటున్న దాని ప్రకారం – శాంతిభద్రతలు, భూపరిపాలన, రెవెన్యూ వంటి కీలకవిభాగాలు వుంటాయట. ఇవన్నీ పోగా తెలంగాణ రాష్ట్రమంత్రులకు మిగిలేదేమిటి? క్రీడలు, మ్యూజియంలు, హెల్త్, ప్రాథమిక విద్య, రోడ్లు, భవనాలు, డ్రయినేజి... యిలాటివా? ఇండస్ట్రీ విభాగం వీరి చేతిలో వున్నా కొత్తగా పెడతానని ఎవరైనా వస్తే భూమి ఎలాట్ చేయాలంటే అది వీళ్ల చేతిలో వుండదు. గవర్నరు చేతిలో వుంటుంది. అస్మదీయులకు, అస్మదీయులు కాదలచుకున్నవారికి భూములు కట్టబెట్టలేకపోతే వీళ్లను పట్టించుకునేదెవరు? రెవెన్యూ చేతిలో లేని రాష్ట్రప్రభుత్వం అదొక ప్రభుత్వమా? సంపాదించని వాడికి మన్నన ఎక్కడ?

ఇక శాంతిభద్రతలు – హైదరాబాదులోని యిండస్ట్రియలిస్టులు మన్‌మోహన్ వద్దకు వెళ్లి మొరపెట్టుకున్న దేమిటంటే – తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే పెత్తనం చెలాయిద్దామనుకునే వాళ్లు పరిశ్రమల వద్దకు వెళ్లి 'మాకు చందాలిస్తారా, మీ పని పట్టమంటారా? మేం అడిగినంత యివ్వకపోతే స్థానికులకు ఉద్యోగాలు యివ్వలేదని గొడవ చేస్తాం. అసలు యిక్కడ మీరు ఫ్యాక్టరీ పెట్టకుండా చేస్తాం' అంటారు, వారినుండి మీరు రక్షించాలి అని. (ఈ దబాయింపు వివరాలు హరీశ్, రఘునందన్‌లు బాగా చెప్పగలరు. సయోధ్య కుదిరిపోయింది కాబట్టి ఊరుకున్నారు కానీ లాయరు గారు కేసులు పెట్టేదాకా వెళ్లారు.) అందుకే సీమాంధ్రుల రక్షణ పేరుతో కేంద్రం శాంతిభద్రతలు కేంద్రం తమ చేతిలో పెట్టుకుంటోంది. పోలీసు లాఠీ ఆడిస్తాడు కానీ పోలీసును పైవాళ్లు ఆడిస్తారు. హైదరాబాదులో పోలీసులు కేంద్ర ఉద్యోగులైతే స్థానిక రాజకీయనాయకులను పట్టించుకోకుండా అందర్నీ తాటించగలరు. ఇప్పుడు రాష్ట్రపోలీసులు కాబట్టి, రాష్ట్రప్రభుత్వం నుండి తీవ్రమైన ఆదేశాలు లేవు కాబట్టి సమైక్య ఉద్యమం పట్ల చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. రేపు రాష్ట్రపతి పాలన విధించి, కేంద్రబలగాలు దింపితే వారి ధాటికి సమైక్య ఉద్యమం నీరుకారక తప్పదు.

ఉమ్మడి రాజధానిగా వుండబోయే హైదరాబాదు పరిధి ఎంత అన్నదానిపై కూడా స్పష్టత లేదు. కార్పోరేషన్ మాత్రమే అంటే 174 చ.కి.మీ.యే! ఎచ్‌ఎండిఏ అంటే 7228 చ.కి.మీ. అంటే 41.5 రెట్లు ఎక్కువ. పోనీ మధ్యేమార్గంగా జిఎచ్ఎంసి అనుకుంటే 625 చ.కి.మీ. అనుకుంటే 3.5 రెట్లు ఎక్కువ. వీటిలో ఏది తీసుకుంటారో మంత్రులబృందమే తేలుస్తుందట. కేంద్రంలో ఈస్టిండియా పోకడలు మీకు కనబడుతూ వుంటే ఎచ్‌ఎండిఏయే తన గుప్పిట్లో పెట్టుకుంటుందని అనుకుంటారు. అబ్బే ఉదారంగా వుంటుంది అనుకుంటే కార్పోరేషన్ మాత్రమే తీసుకుంటుం దనుకుంటారు. 'సీమాంధ్రుల రక్షణ' అనే అస్త్రం వాళ్ల చేతిలో వుందని మర్చిపోవద్దు. సీమాంధ్రులు ఎచ్‌ఎండిఏలో ఎక్కువగా వున్నారు కాబట్టి వాళ్లని రక్షిస్తాం అంటూ అతి పెద్ద ఏరియానే తమ కింద పెట్టుకోవచ్చు. కొత్తగా పరిశ్రమలు పెట్టగలిగేది కూడా అక్కడే కదా. ఖైరతాబాదులో, నాంపల్లిలో ఎవరు పెడతారు? అన్నిటికన్నా ముఖ్యం ఈ పదేళ్లు పదేళ్లగా వుండకపోవచ్చు. హైదరాబాదు ఆ పాటికి ఐటిఐఆర్ వగైరాలతో తులతూగుతూంటే ఓ పట్టాన వదులుకుంటారా?

ఏవో కబుర్లు చెప్పి ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలా, చండీగఢ్‌లా కాలపరిమితి పెంచుకుంటూ పోవచ్చు.

ఇక దిగ్విజయ్ చెప్పిన రెండో అంశం – అతి ముఖ్యమైనది – స్థానికులంటే ఎవరు? అనేది. ఆంధ్రులు ఉద్యోగాలు దోచుకుంటున్నారు. వాళ్లను పంపించి వేస్తే మనవాళ్లకు ఉద్యోగాలు కొల్లలుగా వస్తాయని టి–ఉద్యమకారులు పదేపదే చెప్పారు. ప్రభుత్వోద్యోగాలే కాదు, ప్రయివేటు ఉద్యోగాలలో కూడా కోటా కల్పిస్తామని యువతకు ఆశలు కల్పించారు. ఎవరు తెలంగాణ? ఎవరు ఆంధ్ర అనేది అస్పష్టంగా ఉన్నంతవరకూ యీ సమస్య ఎప్పటికీ రగులుతూనే వుంటుందని నేను అనేకసార్లు రాశాను. టి–ఉద్యమకారులెవ్వరూ ఆ అంశంపై మాట్లాడలేదు. కాస్సేపు హైదరాబాదులో అందరూ వుండవచ్చు, రొయ్యలమ్ముకోవచ్చు అంటారు, కాస్సేపు తట్టాబుట్టా సర్దుకోవాల్సిందే అంటారు – కానీ మాతోపాటు ప్రభుత్వోద్యోగాలకు పోటీ పడవచ్చు అని ఎన్నడూ అనలేదు. గుత్తా సుఖేందర్ రెడ్డి వంటి వాళ్లు 'ఆంధ్రోళ్లకు పుట్టినవాళ్లు తెలంగాణ వాళ్లు ఎట్లవుతరు?' అనే ప్రశ్న లేవదీశారు. తండ్రి ఆంధ్రప్రాంతం నుండి వచ్చి సెటిలయితే, నువ్వు యిక్కడే పుట్టినా తెలంగాణ వాడివి కావు అనే వాదన వినిపించారు. ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ నుండి అనేకమంది యీ ఆరోపణ ఎదుర్కున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పరచేటప్పుడు ముల్కీ రూల్సు మళ్లీ తెచ్చి 12 ఏళ్ల నిరంతర నివాసమో, లేక హైస్కూలు స్థాయిలో నాలుగేళ్ల నిరంతర విద్యాభ్యాసమో వుండాలన్న షరతు పెడతారనుకున్నాను.

ఇప్పుడు దిగ్విజయ్ ఆ విషయం తేల్చేశారు – హైదరాబాదుతో సహా యావత్తు తెలంగాణలో ఓటర్లుగా నమోదైనవారందరూ తెలంగాణవారే అని. అంటే రెండేళ్లగా మా పక్కింట్లో అద్దె కుంటున్న బెంగాలీ కుర్రాడూ తెలంగాణా వాడే నన్నమాట. అతనూ యిక్కడి ప్రభుత్వోద్యోగానికి దరఖాస్తు చేయవచ్చన్నమాట. భేష్! ఇలా అయితే తెలంగాణ ఉద్యమం సాధించినది ఏముంది? అస్సలు ఏమీ లేదా? అంటే కాస్త వుంది పాపం. రాష్ట్రం ఏర్పడ్డాక ఎవడ్కెటనా ఆంధ్ర నుండి తెలంగాణకు తరలి వస్తే ఓటరుగా నమోదు చేయించుకునేవరకు స్థానికుడిగా లెక్కలోకి రాడు కాబట్టి కింది స్థాయి ప్రభుత్వోద్యోగానికి అప్లయి చేయలేడు. పై స్థాయిలో అయితే ఓపెన్ కాంపిటీషనే అనుకుంటా. ఇదే తమిళనాడుకో, కర్ణాటకకో వెళ్లి ప్రయత్నిద్దామంటే అక్కడ స్థానిక భాషలో చదవగలిగితే తప్ప, రాయగలిగితే తప్ప అప్లయి చేయడానికి వుండదు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు భాషాసమస్య లేదు కాబట్టి అప్లయి చేసేయవచ్చు. దీని అర్థం ఏమిటంటే – ఉద్యోగాల విషయంలో తెలంగాణకు వీళ్లు కల్పించే రక్షణ ఏమీ లేదు. ఇప్పుడెలా వుందో యించుమించు భవిష్యత్తులోనూ యిలాగే వుంటుంది.

ఇటువంటి తెలంగాణ బిల్లుకి అంగీకరించడం టి– ఉద్యమకారులకు ఆత్మహత్యాసదృశమే. ఇలాటిదానికి అంగీకరిస్తే అందరూ కెసియార్‌పై పడతారు – ఇలాటి తిరుక్షవరపు తెలంగాణ కోసమా నువ్వు పోరాడినది? అని. అందుకనే ఆయన 'హైదరాబాదుపై కిరికిరి..' అని పదేపదే చెప్తున్నాడు. బిల్లు యీ తీరుగానే వుంటే 'ఇంతకంటె సమైక్యం మేలు' అనేయగలడు. బిజెపి కూడా యిలాటి బిల్లుకి ఎలా సమ్మతించగలదు? తెలంగాణ అనే పేరు చెపితే చాలు, బిల్లు ఎలా వున్నా ఓకే అని అది బ్లాంక్ చెక్ యిచ్చిందా? ఆంధ్రలో కాంగ్రెసుపై ద్వేషం పెల్లుబుకుతున్న వేళ ప్రతిపక్ష జాతీయపక్షంగా అది ఆ అవకాశాన్ని వదులుకుంటుందా? 'తెలంగాణకు సై అంటే ఆంధ్రకు నై అన్న అర్థం కాదు' అనే స్లోగన్‌తో ఎస్కేప్ రూట్‌కు సిద్ధపడుతోందన్న అనుమానం వస్తోంది – కొందరు నాయకుల ప్రకటనలు చూస్తూ వుంటే!

దూకుడులో సూపర్ దూకుడు ఎవరిదంటే జగన్‌దే అని చెప్పాలి. అతనిలో యింతటి సమైక్యవాది దాగి వున్నాడని నేను ఎన్నడూ ఊహించలేదు. ఏదో పార్లమెంటులో ప్లకార్డు పట్టుకున్నాడంటే – సోనియాను యిరకాటంలో పెట్టాలని పట్టుకున్నాడనుకున్నాను. మానుకోట వెళ్లడంటే తెలంగాణలోనూ నాకు అనుయాయులు వున్నారని చెప్పుకోవడానికి అనుకున్నా. ఎందుకంటే దరిమిలా సొంత పార్టీ పెట్టాక చంద్రబాబుకి డిటోలాగే ప్రవర్తించాడు. ఒక్కటే తేడా – సమన్యాయం అనే రుమాలు అక్కడ వేసుకుని వుంచాడు. ఆ పాటి మెలిక వేయాలన్న యింగితం బాబుకి లోపించింది. అందువలన యిప్పుడాయన సమన్యాయం అంటూ వుంటే జగన్ ఎంగిలి చేసిన మాటలా వినబడుతోంది. ఇంతకీ యీ సమన్యాయం ఏమిటో బాబుకీ తెలియదు, జగన్‌కి తెలియదు. ఒకవేళ తెలిసినా మనకు చెప్పలేదు. కాంగ్రెసువాళ్లు అష్టకష్టాలు పడి కసరత్తు చేసి 'ఇదిగో యిదీ యిరుప్రాంతాలు ఓకే చేసిన కాంప్రమైజ్ ఫార్ములా' అని ఒకటి ముందు పెట్టినా వీళ్లు 'ఇది సమన్యాయం కాదు' అంటూ వాదించవచ్చు, కాలం గడపవచ్చు.

బాబు ఏ న్యాయం గురించి మాట్లాడకుండా సమన్యాయం బ్లాంక్ చెక్ యిచ్చేసి కూర్చున్నపుడు జగన్ ఓ అడుగు ముందేసి 'సమన్యాయం' అన్నారు. బాబు ఆలస్యంగా రైలెక్కేటప్పటికి అక్కడ సీట్లో జగన్ కిటికీలోంచి వేసి వుంచిన సమన్యాయం రుమాలు కనబడింది. ఈయనా సమన్యాయం పాట అందుకున్నాడు. వెంటనే జగన్ నిచ్చెన ఎక్కి సమైక్యం అంటూ బెర్త్‌మీద రుమాలు వేసేశాడు. బాబుకి బెర్త్ కేసి ఆశగా చూస్తున్నారు, కానీ సమైక్యం అనలేకుండా వున్నారు. ఇప్పుడున్న నాయకులందరిలోకి జగనే సమైక్య ఛాంపియన్‌గా కనబడదామని చూస్తున్నారు. అంత బహిరంగంగా సమైక్యం అంటే తెలంగాణలో పార్టీ యూనిట్ మూసుకోవాలి, ఓట్లు రావు అని కొందరు భయపెట్టారు. నిజంగా కొండా సురేఖ లాటి వాళ్లు వెళ్లిపోయారు కూడా. అయినా జగన్ జంకలేదు. ఎందుకలా? 'సోనియా గాంధీయే జగన్ చేత సమైక్యం నాటకం ఆడిస్తోంది' అనే థియరీ కాస్సేపు పక్కన పెట్టి ఆలోచిద్దాం –

కాంగ్రెసు విభజన నిర్ణయం తీసుకోబోతోంది అనే మాట సాధారణ ప్రజలకు తెలియడానికి వారం రోజుల ముందే సీమాంధ్ర కాంగ్రెసు నాయకులకు తెలిసిపోయింది. తెలిశాక కూడా వాళ్లు ఏమీ చేయకుండా వూరుకున్నారు. ప్రజలు ఎలా రియాక్టవుతారో వూహించలేక, సోనియాతో గట్టిగా వాదించకుండా మిన్నకుండి పోయారు. ప్రజలు ఆమోదించి ఒకటి రెండు రోజులు నిరసన తెలిపి

పూరుకుంటే, ఆ భాగ్యానికి సోనియాతో చెడగొట్టుకోవడం దేనికి అనుకున్నారు. కాంగ్రెసు నాయకుల ద్వారా జగన్‌కు సమాచారం చేరగానే, పబ్లిక్ మూడ్‌ను జగన్ కరక్టుగా అంచనా వేయగలిగారు. అందుకే జులై 30 ప్రకటనకు ముందే తన ఎమ్మెల్యేల చేత రిజైన్ చేయించారు. ప్రకటన వచ్చాక తనూ, తల్లీ కూడా రిజైన్ చేశారు.

ఆ విధంగా సీమాంధ్రలో సమైక్య ఉద్యమం ప్రజ్వరిల్లినపుడు వారి ఆగ్రహం కాంగ్రెసు, టిడిపిలవైపు పూర్తిగా మళ్లిపోయింది. వైకాపావారిని ఏమీ అనలేదు. ఉద్యమాన్ని తమ చేతిలోకి తీసుకుందామని వైకాపావారు ప్రయత్నించారు కానీ ప్రజలు రాజకీయ నాయకులందర్నీ దూరం పెట్టడంతో పెద్దగా లీడ్ తీసుకోలేకపోయారు. కాంగ్రెసు, టిడిపి వారి దిష్టిబొమ్మలు తగలబడ్డాయి కానీ వైకాపా వారి జోలికి ఎవరూ పోలేదు. ఎందుకంటే జగన్ అందరి కంటె ఎక్కువ దూకుడు చూపారు. తెలంగాణలో యూనిట్ పోయినా ఫర్వాలేదు సమైక్యం వైపే వుంటాను అని అతను చేసిన 'త్యాగం' సీమాంధ్రులను ఆకట్టుకుంది. వైకాపాను యిప్పటికే ఉపప్రాంతీయ పార్టీ అని టిడిపివారు, కాంగ్రెసు వారు ఎద్దేవా చేస్తున్నారు. 'జగన్కెతే తెలంగాణను వదిలేసుకున్నాడు కాబట్టి సమైక్యం అనగలడు. మేం రెండు చోట్లా బలంగా వున్నా. ఆ నినాదం మాకెలా కుదురుతుంది?' అని టిడిపి వారు సంజాయిషీ చెప్తున్నారు. జగన్ తెలంగాణను వదులుకోవడానికి సిద్ధంగా వున్నాడా? వైకాపా తెలంగాణ యూనిట్ నిజంగా మూసేసినట్టేనా? పటిష్టమైన ఆర్థికక్షేత్రం, జగన్ ఆస్తుల్లో చాలాభాగం వున్న హైదరాబాదు తెలంగాణలోనే వుంది కదా. అక్కడ తనకు రాజకీయంగా వునికి లేకుండా వుండేటంత రిస్కు జగన్ తీసుకుంటాడా? నా ఉద్దేశంలో తీసుకోడు.

నిజానికి సమైక్యం అన్నంత మాత్రాన తెలంగాణలో ఓట్లే పడవని అనుకోవడం చాలా పొరబాటు. సమైక్యం అంటున్న సిపిఎం మజ్లిస్‌లకు తెలంగాణలో ఒక్క అసెంబ్లీ సీటు కూడా రాదని చెప్పగలమా? తెలంగాణ జనాభా 3.5 కోట్లు అయితే దానిలో సమైక్యవాదులు కోటికి మించి వుండి తీరతారు – విభజన తర్వాత కూడా! అంతేకాదు, తెలంగాణలో ఆంధ్ర మూలాలు వున్నవారి జనాభా కూడా కోటి దరిదాపుల్లో వుండవచ్చు. తెలంగాణ రాష్ట్రం వలన తమకు ఏం లాభం సమకూడుతున్నదన్న దానిపై సామాన్య తెలంగాణ ప్రజలలో చాలా గందరగోళం వుందని పత్రికలు రాస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో 'తెలంగాణ వచ్చేసింది కదా, మీరింకా యిక్కడే వున్నారేం?' అని ఆంధ్రుల్ని అడుగుతున్నారట. ఆంధ్రా యింటాయన యింట్లో అద్దెకున్న తెలంగాణ ఆయన 'మీకు అద్దె కట్టడం ఎందుకు? ఇంకో రెండు నెలల్లో మీరెలాగూ వెళ్లిపోతారు కదా! ఇల్లు మా సొంతం అయిపోతుంది కదా' అన్నాట్ట. ఇవన్నీ జోకులు అనుకుంటాం కానీ నాలుగేళ్ల క్రితం రైల్లో నేను ఓ సంభాషణ స్వయంగా విన్నాను.

నల్గొండకు చెందిన నాలుగో తరగతి ఉద్యోగి, అతని భార్య ఓ పక్క కూర్చుంటే మరో పక్క హైదరాబాదులో తరాలుగా స్థిరపడిన మధ్యతరగతి ఆంధ్ర కుటుంబం మరో పక్క కూర్చుంది. ఈ ఆంధ్ర ఆవిడ 'కెసియార్ మాటలు మీరు వింటారెందుకు?' అంటూ తెలంగాణ వనితకు సుద్దులు చెప్పబోయింది. 'కెసియార్ మాట వినము లేమమ్మా, నాకు మీరు వెళ్లిపోండి, మాకు అదే చాలు' అంటోంది తెలంగాణ వనిత. 'మేం ఎక్కడికి వెళతాం? ఆంధ్రలో మాకేముంది కనుక? అయినా యిక్కడి ఆస్తులు వదులుకుని మేమెందుకు వెళ్లాలి?' అంటోంది యీవిడ. 'ఏమిటి ప్రత్యేక తెలంగాణ వచ్చినా వెళ్లరా? వెళ్లకుంటే ఊకుంటామా? ఉన్నంతకాలం వున్నారు, చేతులెత్తి మొక్కుతా, యికనైనా వెళ్లండి.' అంటోంది తెలంగాణ మహిళ. ఉద్యమంలో ఎవరు ఏం నూరిపోశారో తెలియదు కానీ తెలంగాణ రాష్ట్రం రాగానే ఆంధ్ర వాళ్లందరూ తట్టాబుట్టా ఎత్తుకుని, ఆస్తులన్నీ తెలంగాణ వారి పరం చేసి వెళ్లిపోతారన్న నమ్మకం బలంగా నాటుకుంది ఆమె స్థాయి వాళ్లకు.

''ఆంధ్రా వాలే భాగో'' అని నినాదం యిచ్చి రెచ్చగొట్టిన కెసియార్ యింకో నెల్లాళ్లకు 'అక్రమంగా మా ఉద్యోగాల్లో తిష్టవేసిన వారిని ఉద్దేశించి ఉద్యమంలో నినాదంగా అన్నాను కానీ నా భావం అది కాదు' అని వివరణ యిచ్చారు కానీ సామాన్య తెలంగాణ ప్రజల్లో ఆంధ్రవాళ్లు నిజంగా పరుగులు పెట్టి పారిపోతారన్న భావం నెలకొన్నట్టే వుంది. చట్టప్రకారం అలా జరిగేట్లా చేయలేమని తెలిశాక వాళ్ల ఫ్రస్ట్రేషన్ ఏ మేరకు వుంటుందో ఎవరూ వూహించలేం. కొన్ని చోట్ల చట్టాన్ని చేతిలోకి తీసుకునే ప్రయత్నాలు జరగవచ్చు. దేశవిభజన గురించి రాసినపుడు రాశాను. పాకిస్తాన్ ఏర్పడడానికి అంగీకరించినపుడు మన జాతీయ నాయకులు (జిన్నాతో సహా) హిందువులు ఇండియా వైపు, ముస్లిములు పాకిస్తాన్ వైపు తరలి వెళ్లిపోతారని వూహించలేదు. ఎక్కడున్నవారు అక్కడే వుంటారు, పాలన మాత్రం చేతులు మారుతుందనుకున్నారు. కానీ ప్రజల్లో భయం పుట్టింది. పరదేశస్తులపై దాడులు మొదలుపెట్టారు.

ఇప్పుడు మళ్లీ అలాటివి జరిగి తెలంగాణలో ఆంధ్రులపై, వారి ఆస్తులపై దాడులు జరుగుతాయన్న భయం పాలకులకు వున్నట్టుంది. అందుకే కేంద్రప్రభుత్వం మాటిమాటికీ 'సీమాంధ్రుల రక్షణ' అంశం లేవనెత్తుతోంది. దానికి ప్రత్యేకమైన చట్టం వుంటుందని, శాంతిభద్రతలు కేంద్రం చేతిలో వుంటాయనీ చెప్తోంది. చట్టప్రకారం ఎంత రక్షణ కల్పించినా సామాన్యులకు భయంగానే వుంటుంది. చట్టాన్ని నమ్ముకోవడం కంటె స్థానికంగా వున్న రాజకీయనాయకులను, రాజకీయనాయకులతో పేరుతో చలామణీ అయ్యే గూండాలను నమ్ముకోవడం మేలు అనుకుంటారు. ఇది గ్రహించే 'ఆంధ్రులు భయపడనక్కరలేదు, మేం వారిని జాగ్రత్తగా చూసుకుంటాం' అంటూ హైదరాబాదులో వున్న ప్రతి రాజకీయనాయకుడు అభయం యిచ్చేస్తున్నారు. దానం నాగేందర్ కావచ్చు, తలసాని శ్రీనివాస్ కావచ్చు, వి హనుమంతరావూ కావచ్చు.

ఇందరు కాండిడేట్లు తమ సర్వీసులు ఆఫర్ చేస్తూ వుంటే భయభీతులైన గృహస్తులు, పారిశ్రామికవేత్తలు ఎవర్ని ఎంచుకుంటారు

చెప్పండి? మూకబలం, రూకబలం వున్న నాయకుణ్నే నమ్ముకుంటారు. ఆ విషయంలో జగన్‌ను మించినవారున్నారా? జగన్ వెనక్కాల దండధరులు చాలామంది వున్నారని, వారు తలచుకుంటే హైదరాబాదులో ఏ స్థలం గురించైనా సెటిల్‌మెంట్లు చేయగలరనీ ఎప్పటినుండో వినిపిస్తోంది. మామూలు రోజుల్లో అలాటివారికి దూరంగా వుండాలని అనుకున్నా, భద్రతకే ముప్పు కలిగినప్పుడు వాళ్లే దేవుళ్లలా కనిపిస్తారు. (నాయకన్ సినిమాలో పోలీసు అధికారి కూతురు రేప్‌కు గురయితే చట్టరీత్యా చర్యలు తీసుకోలేక అండర్ వరల్డ్ డాన్‌ను ఆశ్రయించి, కక్ష సాధిస్తాడు). అందువలన విభజనానంతరం హైదరాబాదు, రంగారెడ్డి, నిజామాబాద్, నల్గొండ, ఖమ్మం వంటి అనేక జిల్లాలలో ఆంధ్రలో మూలాలు వున్నవారికి దిక్కుగా, ఛాంపియన్‌గా ఎదగడానికి వైకాపాకు చాలా మంచి ఛాన్సుంది అని తోస్తుంది. మరి ఆ క్రమంలో తెలంగాణవారికి అయిష్టుడుగా మారడా? అలా జరగదని జగన్‌కు నమ్మకం.

సమైక్యవాదిగా నిలబడినా తెలంగాణలో తనకు ఛాన్సుంది అని జగన్‌కి ఎప్పుడు కాన్ఫిడెన్సు వచ్చి వుంటుంది? జైలు నుండి బయటకు వచ్చిన రోజునా? నిజానికి అది ఒక వింత దృశ్యం. జగన్ జైలుకి వెళ్లినది – దేశం కోసం కాదు, రాష్ట్రభవిష్యత్తు బాగుపరచడానికి ఉద్యమం చేస్తూ కాదు. కేవలం ఆర్థికనేరస్తుడిగా వెళ్లాడు. బయటకు వదిలితే సాక్ష్యులను తారుమారు చేయగల ఘనుడీతను అని సిబిఐ భయపడి, కోర్టుని కూడా భయపెట్టింది. ఆ వాదనలో బలం వుందని కోర్టు నమ్మింది కూడా. అలాటి జగన్ ఎట్టకేలకు బెయిలు దొరికి బయటపడితే అంత ఘనస్వాగతమా? అదీ తెలంగాణ నడిబొడ్డులో వున్న హైదరాబాదులో...? వారిలో కొందర్ని డబ్బు పెట్టి తీసుకుని వచ్చారనుకున్నా, మరి కొందరు జస్ట్ క్యూరియాసిటీ కొద్దీ గుమిగూడారనుకున్నా – అయిదారు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించేటంత లెవెల్లో జనం వచ్చారంటే యిది దేనికి సంకేతం? జగన్ గొప్పవాడనా లేక యితరులపై ప్రజలకు విశ్వాసం పోయిందనా?

మనం ఎలాటి అభిప్రాయమైనా ఏర్పరచుకోవచ్చు కానీ జగన్‌కి మాత్రం తను వెళుతున్నది సరైన దారే అన్న అభిప్రాయం కలిగి దానిలో దూసుకుపోతున్నాడు. సమైక్యం అన్నా తెలంగాణలో పార్టీకి ఏం కాదులే అన్న ధీమా అతనిలో వుంది. 'విభజన వలన తెలంగాణ నష్టపోతుంది' అని నచ్చచెప్పగలిగితే తెలంగాణలో కూడా తగుపాటి సీట్లు తెచ్చుకోవచ్చు. ఒకవేళ తెచ్చుకోలేకపోయినా 2014 అసెంబ్లీ ఎన్నికల వరకే ఎఫెక్టు వుంటుంది. ఆ తర్వాత జరిగే మునిసిపల్ ఎన్నికలు, స్థానిక ఎన్నికలు, ఏర్పడబోయే రాష్ట్రానికి ఝూర?ండ్‌లా అస్థిరత పట్టుకుంటే మధ్యంతర ఎన్నికలు.. యిలా అనేక అవకాశాలు వస్తాయి. అందువలన జగన్ తన సమైక్య సభను తెలంగాణ నడిబొడ్డునే ప్లాన్ చేశాడు. తన పార్టీ సభే అంటే రెస్పాన్సు పరిమితం అయిపోతుందని ఏ పార్టీ వారైనా సరే, ఏ పార్టీలో లేనివారైనా సరే రావచ్చు అని ఆహ్వానించాడు. ఇక ఉద్యోగులు, తటస్థులు అందరూ తప్పకుండా మద్దతు యిస్తారు. హైదరాబాదులో జగన్ సభ పెడితే మానుకోట సంఘటన పునరావృతవుతుంది అని సవాళ్లు విసిరిన తెరాస వారు నాలిక కరుచుకునేట్లు చేస్తే తెరాసకు హైదరాబాదులో పెద్ద పట్టు లేదు అని నిరూపించినట్టవుతుంది.

ఎన్‌జిఓలు సభ పెడితే కిరణ్ మద్దతుతో జరిగిందని టి–కాంగ్రెసువాళ్లు అన్నారు. మరి దీనికి కూడా కిరణ్ మద్దతు వుందంటారో లేదో చూడాలి. '..లేదు సోనియాయే మద్దతు యిప్పించింది' అని టి–కాంగ్రెసువాళ్లు అనలేరు. ఎందుకంటే తెలంగాణ యివ్వడానికి సోనియా కంకణబద్ధురాలై వుందని, అటు సూర్యుడు యిటు పొడిచినా యిచ్చి తీరుతుందని వాళ్లు అంటున్నారు. తెరాస కూడా జగన్ సభ వెనక్కాల సోనియా వుందని గట్టిగా అనరు. ఎందుకంటే తెలంగాణ వస్తుందో రాదో మనసులో సందేహం పీకుతున్నా, యీ దశలో సోనియాపై రాళ్లు వేయడానికి వాళ్లు సిద్ధంగా లేరు.

అలాటి రాళ్లు వేయగల శక్తి టిడిపికి మాత్రమే వుంది. అదీ సోనియా ఫ్లెక్సీకి సమాధి కట్టేసిన ఆంధ్ర యూనిట్ వారికి మాత్రమే. తెలంగాణ టిడిపి యూనిట్‌వారు, తెరాసలాగే సోనియాను తిట్టడానికి తటపటాయిస్తున్నారు. చంద్రబాబు సమైక్యం అని నోటితో అనకపోయినా ఆంధ్ర టిడిపి నాయకులు మాత్రం తమను తాము సమైక్యవాదులుగా చూపుకుంటూ తక్కినవారిని విభజనవాదులని నిందిస్తున్నారు. సోనియా విభజన చేయడానికి నిశ్చయించుకుని, ఆ ప్రణాళికలో భాగంగానే జగన్‌కు బెయిల్ యిప్పించిందని, జైలు నుండి బయటకు రావడానికి ఆమె పావుగా వుండడానికి జగన్ ఒప్పుకున్నాడనీ వారు ప్రచారం చేస్తున్నారు. నిజానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక తెలంగాణలోని సమైక్యవాదులకు, ఆంధ్రమూలాలు వున్నవారికి ఛాంపియన్‌గా ఎదిగేందుకు వైకాపాకు ఎంత ఛాన్సుందో – టిడిపి కి కూడా అంతే వుండి వుండేది, చంద్రబాబు కూడా సమైక్యం వైపు తిరిగిపోయి వుంటే! ఇప్పటివరకు ఆయన తిరగలేదు కాబట్టి వైకాపాకు ఎక్కువ ఛాన్సు కనబడుతోంది.

అది టిడిపికి నచ్చుబాటుగా లేదు. అందువలన జగన్ సమైక్యవాది కాదు, విభజనవాది అనే ప్రచారం ఉధృతంగా చేస్తున్నారు వాళ్లు. 'జగన్ పెదాలపై సమైక్యం, మనసులో విభజన' అని వారు మనకు పదేపదే చెప్తున్నారు. దానికి కారణం ఏమిటో కూడా చెప్తున్నారు. 'విభజన జరిగితే జగన్‌కి ఎక్కువ లాభం. ఎందుకంటే జగన్‌కు తెలంగాణలో బలం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. సీమాంధ్రలోనే కాస్త వుంది. రాష్ట్రం సమైక్యంగా వుంటే జగన్‌కు ఏ నాలుగో స్థానమో దక్కుతుంది. అదే విడిపోతే సీమాంధ్రలో రెండు, లేదా మూడో స్థానంలో వుండవచ్చు. అందువలన రాష్ట్రం విడిపోవాలని జగన్ మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాడు.' అదీ వాళ్ల వాదన. దీనికి తోడు సోనియాతో కుమ్మక్కు పాయింటు కూడా వుంది. దాన్ని తిప్పికొట్టడానికి జగన్ 'కుమ్మక్కు వుంటే 16 నెలలు జైల్లో వుంటానా?' అని అడుగుతున్నారు. గతంలో యుపిఏకు మద్దతు యిస్తానని జగన్ అన్న విషయం గుర్తు చేసి సబ్బం శ్రీహరి, దాడి వైకాపా కార్యకర్తల కోపానికి గురయ్యారు. తనపై వున్న ఈ ఆరోపణ తుడిచేసుకోవడానికి జగన్ 'సోనియా చేతిలో పావుగా వున్నది నేను

కాదు, కిరణ్‌' అని పెద్దపెట్టున దాడి చేస్తున్నారు. ''సాక్షి'' పేపరంతా రోజూ అదే న్యూస్‌. కిరణ్‌పై యీ ప్రత్యేక కోపం దేనికంటే యిప్పుడు సమైక్య ఛాంపియన్‌ అంటే కిరణే అని సామాన్యప్రజలందరూ నమ్ముతున్నారు. సమైక్యవాదుల హృదయంలోంచి కిరణ్‌ను తరిమివేస్తే తప్ప తనకు చోటు దక్కదని జగన్‌ తాపత్రయం.

కాంగ్రెసు పార్టీలో వుంటూ, సోనియాకు కోపం తెప్పిస్తే కొంప మునుగుతుందని తెలిసి కూడా కిరణ్‌ సాహసం చూపుతున్నారని స్థూలంగా చూస్తే అనిపిస్తూనే వుంది. సూక్ష్మంగా చూస్తే దాని వెనకాల కుట్ర వుంది, గమనించండి అని జగన్‌, టిడిపివారు మనల్ని పోరుతున్నారు. దానికి వీళ్లు చెప్పే కారణం ఏమిటంటే – అంత సమైక్యవాదే అయితే రాజీనామా చేయాలి కదా అని. గతంలో తెలంగాణ మంత్రులు రాజీనామా చేసినపుడు ఏం జరిగిందో చూశాం. అధిష్టానం చలించలేదు. పోయినవాళ్లు పోయారనుకుంది. మాజీమంత్రులయ్యాక వాళ్లు చెప్పేది ఎవరూ వినడం మానేశారు. కాంగ్రెసులో వున్నంతకాలం మీడియా కేకే, మందా వగైరాలను ఎంత కవర్‌ చేసిందో గమనించండి. ఒక్కసారి పార్టీలోంచి బయటకు వెళ్లగానే వాళ్ల నోళ్లు మూతబడ్డాయి. ఫలానా దానిపై మీ అభిప్రాయం ఏమిటి అని మీడియా కూడా అడగడం మానేసింది. రాజీనామా చేశాక కిరణ్‌దీ అదే పరిస్థితి. కీలకమైన పదవిలో వుండి అడ్డుపడితే ప్రభావం వుంటుంది తప్ప రిజైన్‌ చేస్తే చేసేదేముంది? రిజైన్‌ చేయలేదని నిందించడానికి వైకాపాకు నైతికపరమైన హక్కు వుంది కానీ టిడిపికి అస్సలు లేదు. వాళ్ల ఎంపీల రాజీనామాలన్నీ బోగస్‌ అని తేలిపోయింది. హరికృష్ణ ఒక్కరే నిజాయితీగా చేశారు. తక్కినవాళ్లందరూ వేషాలు వేశారు. శివప్రసాద్‌ లిటరల్‌గా వేషాలు వేశారు. అదేమిటంటే 'మేం రిజైన్‌ చేసి ప్రయోజనం ఏముంది? కాంగ్రెసు వాళ్లు చేయాలి తప్ప..' అంటున్నారు. 'చేస్తే నష్టం ఏముంది?' అని కానీ 'అలాటప్పుడు దీక్షలు చేసీ ప్రయోజనం ఏముంది?' అని కాని అడిగితే ఏవేవో కథలు చెప్తారు.

ఇంతకీ కిరణ్‌కానీ, జగన్‌ కానీ సోనియా చెప్పినట్లే ఆడుతున్నారా? వీరిలో ఎవరు కోవర్టు? ఎవరైనా కావచ్చు, ఎవరూ కాకపోవచ్చు. ఇప్పుడు కావచ్చు, రేపు కాకపోవచ్చు. ఎందుకంటే 2014 తర్వాత రాజెవడో, రంగడెవడో? సోనియా సారథ్యంలో కాంగ్రెసుకు, యుపిఏకు తగుపాటి సీట్లు వచ్చి మెజారిటీ కోసం అల్లాడినపుడు కదా వీళ్ల సపోర్టు తీసుకునేది! ఇప్పటివరస చూస్తూంటే కాంగ్రెసు మళ్లీ అధికారంలోకి వస్తుందని ఎవరూ అనలేరు. మన్‌మోహన్‌ ప్రభుత్వం యావత్తు అవినీతిమయమై పోయిందని ఛీ కొడుతున్నపుడు, రాహుల్‌ గాంధీలో నాయకత్వ లక్షణాలు కనబడనప్పుడు, సోనియా అనారోగ్యం గురించి అందరికీ తెలిసిపోయినపుడు కాంగ్రెసు అధికారానికి చేరువలోనైనా వస్తుందన్న నమ్మకం కలగడం కష్టం. అంతమాత్రం చేత కాంగ్రెసు పూర్తిగా అడుగంటుతుందని అనలేము. రాష్ట్రస్థాయిలో కొందరు నాయకులు కొన్ని సీట్లు సంపాదించి పెడతారు. అవి చాలినన్ని రానపుడు యుపిఏ విచ్ఛిన్నం కావచ్చు. కాంగ్రెస్సే మూడో ఫ్రంట్‌కో, మరో దానికో మద్దతు యివ్వరావలసి రావచ్చు. భవిష్యత్తు ఎలా వుంటుందో తెలియదు కాబట్టే ఎవరూ తమ ఆప్షన్స్‌ ఫోర్‌క్లోజ్‌ చేసుకోవడం లేదు. ద్వారము తెరిచియే వుంచుతున్నారు.

కెసియార్‌ వారిలో ప్రథముడు. అందుకే విలీనం జాన్తా నై అంటున్నారు. పొత్తు చాల్లే అంటున్నారు. ఆయనతో పొత్తు అంటే అది సవ్యంగా సాగదని 2004, 2009 ఎన్నికలు రుజువు చేశాయి. భాగస్వామికి సీటు వదిలేశామంటారు, మళ్లీ తన పాటికి తను పార్టీ అభ్యర్థికి బి ఫారం యిచ్చి పంపిస్తారు. అడుగుదామంటే ఫామ్‌ హౌస్‌లోకి మాయమై పోతారు. 'తెలంగాణ యిస్తానంటే ఎవరికైనా మొక్కుతాను' అన్న కెసియారే యిలా వుంటే, జగన్‌ మాత్రం తన భవిష్యత్తును కాంగ్రెసుతో ముడి వేసుకుని కూర్చుంటారా? రేపు కేంద్రంలో ఎవరుంటే వారి చేతిలో సిబిఐ వుంటుందని జగన్‌కి తెలియదా? కేంద్రంలో మోదీ వుండే సినారియోను కూడా జగన్‌ ఊహించకపోలేదు. అందుకే 'మతతత్వం వదులుకుంటే మోదీ పరిపాలనాదక్షుడే' అని ఓ సర్టిఫికెట్టు పడేసి కూర్చున్నారు. వెంటనే మోదీ 'దేవాలయాల కంటె శౌచాలయాలు ముఖ్యం' అని ఓ స్టేటుమెంటు యిచ్చి నేనూ తక్కువ తినలేదని చూపుకున్నారు. మూడో ఫ్రంట్‌ను కూడా జగన్‌ దువ్వుతూనే వున్నారు. మొన్న చంద్రబాబు ఢిల్లీలో నిరాహారదీక్ష చేసినపుడు సిపిఎం, ములాయం యిత్యాదులు తొంగి చూడకపోవడానికి కారణం జగన్‌తో లింకులే కారణం అనేవారూ వున్నారు. అబ్బే మోదీతో బాబు దోస్తీ చేయడమే కారణం అనేవారూ వున్నారు. ఏది ఏమైనా బాబు ఎటు వుంటే దానికి వ్యతిరేకదిశలో నడవడమే జగన్‌ లక్ష్యం. కానీ కేంద్రంలో వున్న వారితో బాబు దోస్తీ చేసి సిబిఐను ఉసికొల్పితే, జగన్‌ తన స్ట్రాటజీ మార్చుకోవచ్చు కూడా. **(సశేషం) – ఎమ్బీయస్‌ ప్రసాద్‌ (అక్టోబరు 2013)**

**అక్టోబరు 15-17 వీక్లీకై** **ఎమ్బీయస్‌ : న్యూస్‌, వ్యూస్‌, రివ్యూస్‌ – 18**

**శ్రీలంకలో నూతనశకం**

అంతర్యుద్ధంలో ఎల్‌టిటిఇని పూర్తిగా మట్టుపెట్టిన శ్రీలంక ప్రభుత్వం యిచ్చిన మాట ప్రకారం తమిళుల ప్రాబల్యం వున్న ఉత్తర శ్రీలంకలో ప్రాదేశిక కౌన్సిల్‌ ఎన్నికలు నిర్వహించింది. యుద్ధానంతరం శ్రీలంక ప్రభుత్వం యునైటెడ్‌ పీపుల్స్‌ ఫ్రీడమ్‌ ఎలయన్స్‌ (యుపిఎఫ్‌ఏ) అనే కూటమిని అధికారంలో నిలిపి వాళ్ల ద్వారా ఆ ప్రాంతాలన్నిటిలో అభివృద్ధి పనులు చేపట్టింది. అయితే మొత్తం 38 సీట్లలో యుపిఎఫ్‌ఏకు 20% ఓట్లు వచ్చాయి కానీ సీట్లు మాత్రం ఏడే వచ్చాయి. శ్రీలంక ముస్లిం కాంగ్రెసుకు ఒకటి వచ్చింది. తమిళ్‌ నేషనల్‌ అలయన్స్‌ (టిఎన్‌ఏ) పేర వెలసిన ఐదు పార్టీల కూటమి 28 సీట్లు గెలుచుకుని, బోనస్‌గా మరో రెండు పొంది,

మొత్తం 30 సీట్లతో ప్రభుత్వాన్ని ఏర్పరచబోతోంది. ఎల్‌టిటిఇ ఆవిర్భావానికి ముందు తమిళ హక్కుల కోసం అహింసాయుతంగా, ప్రజాస్వామ్యపద్ధతుల్లో పోరాడిన టెలో (తమిళ ఈలం లిబరేషన్ ఆర్గనైజేషన్), ఇపిఆర్‌ఎల్‌ఎఫ్ (ఈలం పీపుల్స్ రివల్యూషనరీ లిబరేషన్ ఫ్రంట్), తుల్ఫ్ (తమిళ్ యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్) మరో రెండు సంస్థలు కలిసి యీ అలయన్సును ఏర్పరచాయి. వారిలో వారు తగవులాడుకునే వారే కానీ వారందరూ కలిసి విఘ్నేశ్వరన్ అనే రిటైర్డ్ సుప్రీం కోర్టు జడ్జిని తమ చైర్మన్‌గా ఎన్నుకుని ఆయననే ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించారు.

ఈ కూటమిపై ఓటర్లందరికీ నమ్మకం ఏర్పడడానికి విఘ్నేశ్వరన్ యిమేజే కారణం. ఆయన ఏ గ్రూపుకీ చెందని మేధావి. ముక్కుసూటిగా మాట్లాడతాడు. శ్రీలంక సార్వభౌమత్వంలోనే తమిళప్రాంతం స్వతంత్ర ప్రతిపత్తి సాధించాలని, దానికై శ్రీలంకను పాలించే మహేంద్ర రాజపక్షతో పొత్తు పెట్టుకున్నా తప్పులేదనీ ఆయన అంటాడు. "తమిళనాడు రాజకీయనాయకులు మా వ్యవహారాల్లో కలగజేసుకోకుండా వుంటేనే మంచిది. మా పేరు చెప్పి వాళ్లు వాళ్ల ఎన్నికలలో ఓట్లు దండుకుంటున్నారు. ఆ తర్వాత కూరలో కరివేపాకులా మమ్మల్ని తీసిపారేస్తున్నారు. వారి ప్రలాపాల వలన స్థానిక సింహళీయులు మాపై కత్తి కడుతున్నారు." అని మొగమాటం లేకుండా చెప్పాడు. ఇలాటి నిక్కచ్చి మనిషి కేంద్రప్రభుత్వాన్ని నేర్పుతో ఒప్పించి తమ ప్రాంతానికి అధికారాలు సాధిస్తాడని, 50 వేలమంది వితంతువులు, 12 వేల మంది అనాథలు వున్న తమ ప్రాంతానికి వెలుగు చూపుతాడని ఓటర్లు భావించారు. చూదాం ముందుముందు ఏం జరుగుతుందో!

## ఓ సాహసిపై బెంగాలీ సినిమా

భారత్–బంగ్లాదేశ్ సరిహద్దు గ్రామమైన సూతియాలో వరుణ్ బిశ్వాస్ అనే 30 ఏళ్ల స్కూలు టీచరు హత్యకు జులై 2012లో గురయ్యాడు. ఎందుకంటే అతను తన వూళ్లో పెద్ద తలకాయలను ఎదిరించాడు. గూండాగిరీని, రాజకీయాలను కలగలపిన కొందరు ఆ గ్రామాన్ని ఏలారు. వరుణ్ ఆ వూళ్లో టీచరుగా పని చేస్తూ తన జీతంతో పేదలకు పుస్తకాలు, మందులు కొనిపెట్టేవాడు. ఇచ్ఛామతి నది వరదల్లో మునిగిపోతున్న తమ గ్రామాన్ని కాపాడడానికి కాలువలు తవ్వాలని ఉద్యమం ప్రారంభించాడు. చివరకు ప్రభుత్వమే యీ పని చేపట్టింది. అయితే యీ పెద్ద తలకాయలు దానికి అడ్డుకట్ట కట్టి తమ వ్యాపారాలకై యీ నీళ్లను మళ్లించుకోసాగారు. ఎవరైనా అడ్డగిస్తే వాళ్ల యింటి స్త్రీలపై వీళ్లు సామూహిక మానభంగాలు చేసేవారు. ఆ వూళ్లో 2000–2002 మధ్య 33 బలాత్కారాలు, 12 హత్యలు జరిగాయంటే వూహించుకోవచ్చు వారెంతటి నరరూప రాక్షసులో. వరుణ్ వీరికి వ్యతిరేకంగా ఉద్యమం నడిపి, కేసులు పెట్టాడు. ఎవరు బెదిరించినా అదరలేదు. చివరకు అతని ప్రయత్నాలు ఫలించి 2012లో ఆ గూండా నాయకుడు సుశాంత చౌధరీతో బాటు మరో నలుగుర్ని కటకటాల వెనక్కి పంపగలిగాడు. యావజ్జీవ శిక్ష పడిన చౌధురీ వూళ్లో కొంతమంది కుర్రాళ్లకు సుపారీ యిచ్చి రైల్వే స్టేషన్ పార్కింగ్ ఆవరణలో వరుణ్‌ను చంపించాడు. ఐదురుగు అరెస్టు అయ్యారు.

బతికుండగా వరుణ్‌ను ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు కానీ రాజ్ చక్రవర్తి అనే సినిమా దర్శకుడికి ఆయన కథ ఆధారంగా "ప్రళయ్" అనే బెంగాలీ సినిమా తీయాలనిపించింది. సినిమాలో ఊరి పేరు దుఖియా. సినిమా ప్రథమార్థం యథార్థ ఘటనలతో తీస్తూనే మెలోడ్రామా కోసం వరుణ్‌ను యువకుడిగా, ప్రేమికుడిగా చూపించాడు. అంతేకాదు, ఇంటర్వెల్ తర్వాత కొన్ని ఘట్టాలు కల్పించాడు. హత్య తర్వాత నేరస్తులు –రాజకీయనాయకులు –పోలీసుల కలిసికట్టుగా వాస్తవాలు బయటపడకుండా దుర్మార్గంగా ప్రవరిస్తూ వుంటే ఒక పోలీసు అధికారి వాళ్ల ఆట కట్టిస్తాడు. అతనికి రూల్సన్నా, గాంధేయవిధానాలన్నా మహా చికాకు. చట్టాన్ని చేతిలో తీసుకుని వీళ్లకు బుద్ధి చెప్తాడు. "కహానీ" సినిమాలో బాబ్ బిశ్వాస్ పాత్రలో తళుక్కుమన్నశాశ్వత చటర్జీ ఆ పాత్ర వేశాడు. అతనికి సహాయపడిన వృద్ధుడి పాత్రలో పరన్ బెనర్జీ వేశాడు. కోర్టు కెళితే న్యాయం ఆలస్యమవుతోందని, నిర్భయ కేసులో మైనర్ లా నియమాల చాటున నేరస్తులు తప్పించుకుంటున్నారని మండిపడుతున్న ప్రజలు యీ సినిమాలో చూపిన 'తక్షణన్యాయం' చూసి హర్షిస్తున్నారు.

## మన వారసత్వంపై అశ్రద్ధ

భారతదేశంలోని 3678 ప్రాచీన కట్టడాలను, చారిత్రక స్థలాలను సంరక్షించే బాధ్యత ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఎస్‌ఐ)కు అప్పగించింది ప్రభుత్వం. ఈ సంరక్షణ ఎంత బాగా జరుగుతోందో చూద్దామని కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) వాటిలో సగం కంటె తక్కువ అంటే 1655 కట్టడాలపై దృష్టి సారించి సర్వే నిర్వహించింది. ఫలితాలు చూసి 92 కట్టడాలు కనబడటం లేదని తెలిపింది. 2006లో ఎఎస్‌ఐ స్వయంగా పార్లమెంటుకి చెప్పిన దాని ప్రకారం 35 మిస్సింగ్!కానీ 92 అంటే మరీ ఎక్కువ. అన్ని కట్టడాల గురించి వెతికితే, పోయినవాటి సంఖ్య యింకా ఎక్కువ వుండవచ్చని విమర్శలు రావడంతో కల్చర్ మినిస్టర్ చందేష్ కుమారీ కటోచ్ సెప్టెంబరులో ఓ ప్రెస్ మీట్ పెట్టి "కాగ్ వాళ్లు చెప్పిన 92 స్థలాల గురించి వెతికించాం. వాటిలో 38 కనబడ్డాయి. కావాలంటే ఫోటోలు చూపిస్తాం. ఇక తక్కిన 54 వాటిల్లో 22 బొత్తిగా కనబడటం లేదు. 32 ఆక్రమణకు గురయ్యాయేమో

తెలియదు. పూర్తిగా విచారించి చెపుతాం" అన్నారు. అనేక చారిత్రక స్థలాలను కబ్జా చేసేస్తున్నా నిరోధించడానికి ఎఎస్‌ఐకు శక్తి చాలటం లేదు. తవ్వకాలు జరుగుతాయి కదా వాటిపై నివేదికలు ప్రచురించడం కూడా ఎఎస్‌ఐ చేతకావటం లేదు. 2007 నుండి 2012 వరకు 113 చోట్ల తవ్వకాలు జరిగితే కేవలం ఒకే ఒక్క నివేదిక వెలుగు చూసింది.

ఎందుకిలా? అని ఎఎస్‌ఐను అడిగితే వాళ్లు బోల్డు కారణాలు వల్లించారు. 3678 కట్టడాలుంటే వాటిని కాపాడడానికి వాళ్ల కిచ్చిన స్టాఫ్ 3458! వాటిలో 1279 పోస్టులు ఖాళీ. ఇంగ్లండులో యీ కట్టడాలు సందర్శించడానికి వచ్చేవారు వద్ద వసూలు చేసిన టిక్కెట్టు డబ్బు ఆర్కియాలజీ సంస్థకే యిచ్చేసి, వాటిని కాపాడమంటారు. మనదేశంలో అలాటి పద్ధతి లేదు. టిక్కెట్టు ఆదాయం వేరేవాళ్లకి పోతుంది. వీళ్లకు ప్రభుత్వం యిచ్చేదే ఆదాయం. వాళ్ల ఏడాది బజెట్ 750 కోట్ల రూ.లు. దానిలో 500 కోట్ల రూ.లు జీతభత్యాలకే పోతుంది. మిగిలినదానిలో యిన్ని కట్టడాలు కాపాడడం ఎలా? తక్కిన దేశాల్లో మ్యూజియంలో ఏదైనా అపురూపమైన వస్తువు పోతే వెంటనే వాళ్లు ప్రపంచంలో యిలాటి వస్తువులు వేలం వేసే వ్యాపారులకు వెంటనే డైరక్టుగా తెలియపరచగలుగుతారు. ఇక్కడ ఎఎస్‌ఐకు అలాటి అధికారం లేదు. దగ్గరున్న పోలీసు స్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్ రాయించి చేతులు ముడుచుకుని కూర్చోవాల్సిందే. అందుకే గత 50 ఏళ్లలో 156 అపురూప కళారూపాలు చోరీకి గురయ్యాయి. ఇవి యిక్కడితో ఆగుతాయన్న నమ్మకం లేదంటుంది కాగ్. 'ఢిల్లీలోని నేషనల్ మ్యూజియంకు, హైదరాబాదులోని సాలార్ జంగ్ మ్యూజియంకు సెక్యూరిటీ చాలదు, కలకత్తా మ్యూజియం గ్యాలరీలలో సెక్యూరిటీ కెమెరాలు కూడా లేవు. హరప్పా నాగరికత బయటపడిన రాఖిగఢీ (హరియాణా)లో ఆక్రమణలు జరిగి జనావాసాలు ఏర్పడుతున్నాయి. ధోలావిరా (గుజరాత్) లో దొరికిన హరప్పా కాలం నాటి కుండపెంకులు, రాళ్లు ఏ రక్షణా లేకుండా బయటే పడి వున్నాయి. తక్కిన దేశాలు తమకు గతచరిత్ర లేదని తల్లడిల్లుతున్నాయి. మనకు మాత్రం చరిత్రను భద్రపరచుకోవాలనే తపనే లేదు.

**ఫరీద్‌కోట రాజు ఆస్తులు దొంగ విల్లుతో కైవసం**

1989లో మరణించిన ఫరీద్‌కోట మహారాజు హరీందర్ సింగ్ ఆస్తులను యితరులు యిన్నాళ్లూ దొంగ విల్లు సహాయంతో అనుభవించారని, అవి ఆయన కూతుళ్లిద్దరికీ మాత్రమే చెందాలని చండీగఢ్ కోర్టు యిటీవలే తీర్పు యిచ్చింది. ఆ ఆస్తుల విలువ రూ.25,000 కోట్లు. హరీందర్ సింగ్‌కు ముగ్గురు కూతుళ్లు – అమృత్, దీపీందర్, మహీపీందర్. కొడుకు హర్‌మందిర్ ఓ రోడ్డు ప్రమాదంలో 1981లో చనిపోవడంతో ఆయన నైరాశ్యంలో మునిగిపోయి జబ్బు పడ్డాడు. మగ వారసుడు లేకపోవడం చేత రాజుగారి వద్ద పనిచేసే కొందరు ఉన్నతోద్యోగస్తులు, లాయర్లు కలిసి కుట్ర పన్నారు. 1989లో ఆయన పోయాక 1982లో రాశారంటూ ఒక దొంగ విల్లు చూపించారు. దాని ప్రకారం ఆస్తులన్నీ కుటుంబసభ్యులకు ఎవరికీ దక్కకుండా మహారావల్ ఖేవాజీ ట్రస్టు అనే ధర్మసంస్థకు చెందుతాయి. ఆ ట్రస్టులో ధర్మకర్తలందరూ యీ లాయర్లు, ఉద్యోగస్తులే. తమ చేతిలో కీలుబొమ్మలుగా వున్న రెండో కూతురు దీపీందర్‌ను చైర్మన్‌గా, మూడో కూతురు మహీపీందర్‌ను వైస్‌చైర్మన్‌గా పెట్టారు. హరీందర్ తల్లి, భార్య, పెద్దకూతుళ్లకు ఏమీ లేకుండా చేశారు.

మహీపీందర్ కొన్ని రోజులపాటు ధర్మకర్తలు చెప్పినట్టే ఆడింది. వాళ్లు పెట్టమన్నచోటల్లా సంతకాలు పెట్టింది. కానీ రెండేళ్లు పోయాక అనుమానం వచ్చి తిరగబడింది. ట్రస్టులోంచి బయటకు వచ్చేసి విల్లును సవాలు చేసిన కొన్ని రోజులకే అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించింది. ఈ వరసంతా చూసి పెద్దకూతురు అమృత్ ఆ విల్లులో రాసిన కొన్ని అంశాలు అనుమానాలు రేకెత్తించాయంటూ కోర్టు కెక్కింది. "ఒకవేళ నా ప్రస్తుత భార్యద్వారా కాని, భవిష్యత్తులో ఏర్పరచుకోబోయే సహజీవన ఒప్పందం లేదా సర్రోగేట్ మ్యారేజి (నా వీర్యంతో బిడ్డను కని యిచ్చే ఒప్పందం) వలన కానీ మగపిల్లవాడు పుడితే..." అంటూ దానిలో ఓ పేరా వుంది. రాజుగారి భార్యకు అప్పుడు 67 ఏళ్లు. ఆవిడకు యింకా పిల్లలు పుడతారని యీయన ఎలా అనుకున్నాడు? 1982 నాటికి సహజీవన ఒప్పందాలు, సర్రోగేట్ మ్యారేజీలు విరివిగా లేవు. అంటే వీళ్లు సినిమాల్లో చూపించినట్టు ఎవడో ఒకణ్ని తీసుకుని వచ్చి 'వీడి తల్లి రాజుగారితో సహజీవనం చేసింది కాబట్టి వీడే వారసుడు' అందామనుకున్నారన్నమాట. ఈ పాయింటే కాకుండా మరోటి కూడా వుంది. విల్లు ప్రకారం యింత ఆస్తి దక్కించుకున్న ఫరీద్‌కోట కోట, చండీగఢ్‌లోని మణి మజ్రా అనే భవనం, ఫరీద్‌కోటలోని షాహీ సమాధులు మేన్‌టేన్ చేస్తే చాలు. తక్కిన డబ్బు ఎలా ఖర్చు పెట్టాలో నిర్దేశించలేదు. ఇది చాలా అసాధారణంగా వుంది.

ఈ ట్రస్టు సభ్యులు తమ చిత్తం వచ్చినట్టు ప్రవర్తించారు. 'మాపై కేసు పెట్టావు కాబట్టి నువ్వు ఫరీద్‌కోట్ రాజమహల్‌లోకి అడుగుపెట్టడానికి వీల్లేదు' అని ఉత్తరం రాసింది. ఆ ట్రస్టు వ్యవహారాలు ఎంత శ్రుతి మించాయంటే వారిపై ఇన్‌కమ్‌టాక్స్ దాడులు కూడా జరిగాయి. ఎట్టకేలకు 22 ఏళ్ల పోరాటం తర్వాత యీ జులైలో అమృత్ కేసు గెలిచింది. ఆవిడకు యిప్పుడు 80 ఏళ్లు. ఆమెకు, చెల్లెలు దీపీందర్‌కు చెరిసగం ఆస్తి దక్కుతుంది. కోర్టు డిక్రీ అమలు చేయడానికి వీళ్లు మళ్లీ యింకో కేసు వేయాల్సి వుంటుంది. దానితో బాటు దీపీందర్ విల్లును సవాలు చేయలేదు కాబట్టి ఆమెకు వాటా యివ్వనక్కరలేదని కూడా యీమె అడగబోతోంది. ఇన్నాళ్లూ ట్రస్టు పక్షాన వుందని యీవిడకి ఆమెపై కోపం. 16 మంది ట్రస్టు సభ్యుల్లో 6గురు మాత్రమే బతికి వున్నారు. మహారాజుగారి భవంతుల్లో తిష్ట వేసుకుని వున్న యీ ఆరుగురూ ఆస్తులు అప్పగించేందుకు సుముఖంగా లేరు. తీర్పును సవాలు చేస్తారట. కుట్ర

కథకు యిప్పట్లో ముగింపు కనబడటం లేదు.

**గుజరాత్‌లో పంజాబ్ రైతుల వ్యథ**

'దేశంలోని పౌరులు ఎక్కడైనా ఆస్తి కొనుక్కోవచ్చు, కానీ కశ్మీర్‌లో మాత్రం కాదు, అక్కడ కశ్మీరీయులే కొనగలరు' అని నియంత్రించే ఆర్టికల్ 370 రద్దు చేయాలని బిజెపి ఉద్యమిస్తూ వుంటుంది. ఈ స్ఫూర్తికి భిన్నంగా వున్న ఓ వివాదాస్పద నిబంధన ఆ బిజెపి ఏలుతున్న గుజరాత్‌లోనే అమలవుతున్న విషయం యిప్పుడు వెలుగులోకి వచ్చింది. ఆ సర్క్యులర్ ప్రకారం గుజరాత్‌లో పంట పొలాలను గుజరాత్ వాసులైన వ్యాపారస్తులకు, ఉద్యోగులకు అమ్మకూడదు. అంతేకాదు, యితరప్రాంతాల నుండి వచ్చిన రైతులకు కూడా అమ్మకూడదు. అది చూపించి యిప్పుడు గుజరాత్ ప్రభుత్వం కచ్ ప్రాంతంలో వున్న పంజాబ్ హర్యాణా రైతుల భూముల ఖాతాల లావాదేవీలను నిలిపివేతకు (ఫ్రీజ్) దిగింది. అక్కడ పంజాబీ రైతులేమిటి అంటే దానికో నేపథ్యం వుంది. కచ్ ప్రాంతం పాకిస్తాన్‌తో సరిహద్దుల్లో వుండడమే కాకుండా అక్కడ ముస్లిములు ఎక్కువ. 1965లో పాకిస్తాన్‌తో యుద్ధం జరిగాక, అక్కడ సిక్కులను తెచ్చి పెట్టి తూకం చేస్తే దేశభద్రతకు మంచిదని కేంద్రం భావించింది. కచ్ యిసుక ప్రాంతం, నీటి లభ్యత తక్కువ. వ్యవసాయానికి అవకాశాలు లేవు. వ్యవసాయంలో దిట్టలైన పంజాబీలను తీసుకుని వస్తే వారు చమత్కారాలు చేయగలరని కూడా ఆశించి 454 సిక్కు రైతులకు వుచితంగా భూములిచ్చారు.

వారు నిజంగా చమత్కారం చేసి చూపించారు. ఆ వుప్పునేలలనే లోతుగా తవ్వి జలను బయటకు తెచ్చారు. పంటలు పండించారు. ఆ ప్రాంతాల్లో ఎరగని పత్తి  పండించారు. వాళ్లను చూసి, పంజాబ్, హరియాణాలలోని యితర జాట్ రైతులు అక్కడ తమ భూముల్ని అమ్ముకుని యిక్కడ కొనుక్కుని, స్థిరపడ్డారు. ఆ పద్ధతి యింకా కొనసాగుతూనే వుంది. 2005లో ఒక రైతుల పంజాబ్‌లో 3 ఎకరాలమ్మితే కచ్‌లో 30 ఎకరాలు వచ్చింది. గుజరాత్ ప్రభుత్వం యీ అమ్మకాలన్నిటినీ రిజిస్టర్ చేసింది, స్టాంప్ డ్యూటీ వసూలు చేసింది. ఇలా చేస్తూ చేస్తూ యిప్పుడు హఠాత్తుగా 1973 నాటి సర్క్యులర్‌ను బయటకు లాగి వెయ్యిమంది రైతుల ఖాతాలను నిలిపివేసింది.  (అబ్బే అన్ని లేవు 784 మాత్రమే, వాటిలో 164 మందివి సిక్కులవి, 100 మంది గుజరాతీలవి అంటారు జిల్లా కలక్టర్ హర్షద్ పటేల్). రైతులు దీన్ని వ్యతిరేకిస్తూ 2012లో గుజరాత్ హై కోర్టుకి వెళ్లారు. వీరి వ్యవసాయం వలన అక్కడి ప్రాంతమంతా అభివృద్ధి చెందింది. భూముల ధరలు పెరిగాయి. ఇప్పుడు యిలా ఖాతాలు నిలిపివేయడం వలన బ్యాంకులు లోన్లు ఆపేశాయి. పండిన పంటను మార్కెట్ యార్డులో అమ్ముకోలేరు కాబట్టి ప్రయివేటు వ్యక్తులకు తక్కువ ధరలకు అమ్ముకోవాలి. ఇన్నాళ్లూ పన్నులు వసూలు చేస్తూ వచ్చిన ప్రభుత్వం యిప్పుడు సడన్‌గా యిదంతా అక్రమం అంటోంది.

రైతుల వాదన విన్న హైకోర్టు వారి పక్షాన తీర్పు యిచ్చింది. తీర్పు వ్యతిరేకిస్తూ గుజరాత్ రాష్ట్రప్రభుత్వం సుప్రీం కోర్టుకి వెళ్లింది. సిక్కు రైతులకు ఒళ్లు మండి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మలు తగలేశారు. శిరోమణి అకాలీదళ్‌కు ఫిర్యాదు చేశారు. జాతీయ మైనారిటీ కమిషన్ వచ్చి వారి ఫిర్యాదులు వింది. గుజరాత్ కాంగ్రెసు ఎంపీలు మన్‌మోహన్‌ను కలిసి వీరి సంగతి చూడమని విజ్ఞప్తి చేశారు. ఇదంతా చూసి పంజాబ్ ముఖ్యమంత్రి బాదల్ మోదీతో మాట్లాడాడు. "మాదేం లేదు, ఆ 1973 నాటి నోటిఫికేషన్ కాంగ్రెసు హయాంలో వచ్చినదే" అన్నాడు మోదీ. గుజరాత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్జున్ మోద్‌వాడియా "గుజరాత్ రైతుల భూములు బినామీ రైతుల పేర అన్యాక్రాంతం కాకూడదనే ఉద్దేశంతో యిచ్చిన నోటిఫికేషన్ అది. ఈ పంజాబు, హర్యాణా రైతులు నిజమైన రైతులు. దాన్ని వీరికి వర్తింపచేయడం అన్యాయం." అన్నాడు. కచ్‌లో హరితవిప్లవాన్ని తెచ్చిన ఆ రైతులకు తమ బతుకులు పచ్చగా వుంటాయో లేదో చెప్పలేని స్థితిలో వున్నారు.

**ఏది శాపం? ఏది వరం?**

ఏది శాపమో, ఏది వరమ్మో తెలిసీ తెలియక అలమటించుటే జీవితం అంటాడు కవి. ఈ రోజు కీడు అనుకున్నది రేపటికి మేలుగా తోచవచ్చు. ఏది జరిగినా మన మంచికే అనుకునేవాళ్లకు నచ్చే చారిత్రక వాస్తవం యిది. 1971–79ల మధ్య ఉగాండాను పాలించిన ఇదీ అమీన్ అనే మిలటరీ నియంత 1972 ఆగస్టులో ఆసియన్లను తమ దేశం విడిచి వెళ్లాలని ఆదేశాలు జారీ చేశాడు. ఉగాండాలో ఆసియన్లంటే భారతీయులే. వారు ఎన్నో తరాలుగా అక్కడ స్థిరపడిపోయి ఆస్తిపాస్తులు సంపాదించుకుని దేశ ఆర్థికవ్యవస్థనే పాలించే దశలో వున్నారు.  నరమాంస భక్షణకు పేరుబడిన అమీన్ వాళ్ల ఆస్తులన్నీ జాతీయం చేసి, 90 రోజుల గడువులో కట్టుబట్టలతో దేశం విడిచి వెళ్లాలని చెప్పాడు. తలా 50 పౌండ్లు మాత్రం తీసుకెళ్లడానికి అనుమతించాడు. ఆగర్భశ్రీమంతులు ఒక్కసారిగా గర్భదరిద్రులై పోయారు. 70,000 మంది ఆసియన్లు ఆ రోజు ఉగాండా విడిచి వెళుతూ అమీన్‌కు శాపనార్థాలు పెట్టారు.

వారిలో 28,000 మంది శరణార్థులుగా ఇంగ్లండ్ చేరుకున్నారు. ఉగాండా ఉష్ణదేశం కాబట్టి అక్కడ ఉన్నిదుస్తుల అవసరం లేదు. బ్రిటన్‌లో చలి తట్టుకోవడానికి వీరి దగ్గర సరైన దుస్తులు లేవు. లావుపాటి బూట్లు లేవు. చాలామందికి ఇంగ్లీషు రాదు. వాడకంలో లేని మిలటరీ బారక్స్ చూపించి అదే 'శరణార్థుల శిబిరం' అంది బ్రిటన్ ప్రభుత్వం. గతిలేక చిన్నచిన్న ఉద్యోగాలు చేశారు. కాస్త కుదుటపడ్డాక తమకు బాగా వచ్చిన కళ వ్యాపారమే కాబట్టి (వీరిలో దాదాపు అందరూ గుజరాతీలే – పటేల్, అమిన్,

షాలే!) వ్యాపారాలు పెట్టుకున్నారు. అలా మొదలైన తమ ప్రయాణం 40 ఏళ్లల్లో ఎక్కడికి చేర్చిందో సింహావలోకనం చేసుకోవడానికి ఆగస్టులో లండన్‌లో ఒక ఎగ్జిబిషన్ పెట్టారు. ''ఎక్సయిల్స్–ద ఉగాండన్ ఏసియన్ స్టోరీ'' అనే పేరు పెట్టిన యీ ప్రదర్శనలో ఆనాటి ఫోటోలు, న్యూస్ పేపరు కటింగ్స్, టీవీ ఫుటేజిలు, ప్రభుత్వ ఆదేశాలు, వ్యక్తిగత ఉత్తరప్రత్యుత్తరాలు.. అన్నీ పెట్టారు. ఇటువంటి వంద ప్రదర్శనలు పెట్టగల ఆర్థికస్తోమత వారికి యిప్పుడుంది. నిజానికి ఆ రోజు అక్కణ్నుంచి తరిమేసి అమీన్ తమకు మేలు చేశాడని, తమ ప్రతిభ చాటుకోవడానికి, అధికంగా సంపాదించుకోవడానికి సంపన్నదేశ మొకదాన్ని చూపించాడని ఆసియన్లు అనుకుంటున్నారు. కొందరు తమ యిళ్లల్లో అతని ఫోటో పెట్టుకున్నారు కూడా.

ఈ రోజు ఇంగ్లండ్‌లో గుజరాతీలు ఎంత లోతుగా చొచ్చుకుపోయారో చెప్పడానికి ఓ వాస్తవం లాటి జోక్ చెప్తారు. – 'ఓ అమెరికన్ టూరిస్టు లండన్‌లో దిగాడు. తనను హొటల్‌కు తీసుకెళ్లిన టాక్సీ డ్రైవర్ని పేరు అడిగితే 'పటేల్' అన్నాడు వాడు. హొటల్ యజమాని కూడా 'పటేల్'యే. హొటల్ వీధి చివర వున్న డిపార్ట్‌మెంటల్ స్టోర్సుకి వెళ్లి యజమాని పేరు అడిగితే అదీ 'పటేల్'యే. ఇదంతా చూసి తలనొప్పి తెచ్చుకుని మాత్రకోసం మెడికల్‌షాపుకి వెళితే అదీ 'పటేల్'దే. తను తెచ్చిన డాలర్లను పౌండ్లుగా మార్చుకోవడానికి డీలరు వద్దకు వెళితే అతనూ 'పటేలే'. బుర్ర తిరిగి హొటల్ రూము కొచ్చి కాఫీ తెమ్మనమని రూంబోయ్‌ను పిలిస్తే వాడూ 'పటేలే'! హొటల్ సిబ్బందిలో సగం మంది 'పటేల్'లు వున్నారని తెలిశాక ఆ అమెరికన్‌కు మతిపోయి అడిగాడట – 'అవునూ, అడగడం మర్చిపోయాను, బ్రిటిషు రాణి పేరు కూడా 'పటేలా'?' **– ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2013)**

**అక్టోబరు 18 వీక్లీకై** **ఎమ్బీయస్ ః కేంద్రానికి ఎప్పుడూ ఆశే**

ప్రస్తుతం హైదరాబాదు తెలంగాణ చేతిలో వుంటుందా, లేక కేంద్రానికి వెళ్లిపోతుందా అన్న చర్చ జరుగుతోంది. ఢిల్లీ నాయకులు రోజుకొక మాట మాట్లాడుతున్నారు. హైదరాబాదు నగర నిర్వచనం పై కూడా తర్జనభర్జనే. ఆంధ్ర, తెలంగాణ రెండూ తగవులాడుకుని చివరకు హైదరాబాదును కేంద్రానికి అప్పగిస్తే యీ పుష్కరకాలం నాటి ఉద్యమం వ్యర్థం కావడమే కాదు, తీరని నష్టాన్ని కూడా తెచ్చిపెట్టుకున్నట్టు అవుతుంది. గత చరిత్ర పరికిస్తే మహానగరాలను కబళించాలన్న ఆశ కేంద్రానికి గతంలో వుందని కూడా అర్థమవుతుంది. బొంబాయి విషయం తీసుకుందాం.

స్వాతంత్ర్యం వచ్చాక భాషాప్రయుక్త రాష్ట్రాల డిమాండ్ ముందుకు వచ్చింది. మరాఠీ మాట్లాడే ప్రాంతాలన్నీ (విదర్భ, మరాట్వాడా, మహారాష్ట్ర, బొంబాయి) కలిపి బొంబాయి రాజధానిగా సంయుక్త మహారాష్ట్ర రాష్ట్రం ఏర్పడాలని మహారాష్ట్ర ఏకీకరణ్ పరిషత్ డిమాండ్ చేసింది. కాంగ్రెసు పార్టీ ఆదేశాల మేరకు రాష్ట్రాల పునర్విభజనను చేపట్టిన జెవిపి (జవహర్‌లాల్, వల్లభాయ్, పట్టాభి సీతారామయ్య) కమిటీ బొంబాయి రాష్ట్రాన్ని (ఇప్పటి మహారాష్ట్ర, గుజరాత్ ప్రాంతాలలో కొన్ని కలిసి వుండేవి) రీఆర్గనైజ్ చేయాలని చెపుతూ బొంబాయిని విడి రాష్ట్రంగా వుంచాలని అభిప్రాయపడింది. ఇప్పుడు హైదరాబాదు గురించి చెపుతున్నట్టే బొంబాయి భిన్నసంస్కృతుల సమ్మేళనమని, కేవలం మహారాష్ట్రులదే అనడానికి లేదనీ, ఆ సంస్కృతి అలా కాపాడాలంటే అది విడిగా కేంద్రపాలనలో వుండాలని వాదించింది. ఇలాటి వాదనల్లో నెహ్రూ అగ్రస్థానంలో వుంటాడు. ఆదర్శవాది కాబట్టి ఆయనకు ప్రాంతీయత అంటే గిట్టదు. అయితే ఈ ప్రతిపాదన బొంబాయి రాష్ట్రంలోని మహారాష్ట్రులకు, గుజరాతీయులకు గిట్టలేదు. దాంతో 1955లో మనందరికి పరిచితమైన ఫజల్ అలీ అధ్యక్షతన మొదటి ఎస్సార్సీ వేశారు.

తెలంగాణను ఐదేళ్లపాటు విడిగా వుంచి అప్పుడు ఆంధ్రతో కలపాలి అన్న ఫజలాలీ సిఫార్సును ఆంధ్రుల ఒత్తిడికి లొంగి కేంద్రం పట్టించుకోలేదని తెలంగాణవాదులు ఆరోపిస్తారు. బొంబాయి వ్యవహారంలో ఎవరు ఒత్తిడి చేశారంటారో కానీ ఆ విషయంలోనూ ఆయన సిఫార్సులను కేంద్రం పట్టించుకోలేదు. ఫజల్ ఆలీ బొంబాయి, విదర్భ అనే రెండు రాష్ట్రాలు ఏర్పరచాలని ప్రతిపాదించాడు. బొంబాయిలో రెండు డివిజన్లని, మహారాష్ట్ర డివిజన్‌లో మరాఠ్వాడా వుండాలని, గుజరాత్ డివిజన్‌లో కచ్, సౌరాష్ట్ర వుండాలని అన్నాడు. విదర్భ విడి రాష్ట్రంగా వుండాలన్నాడు. పరిషత్ దాన్ని వ్యతిరేకించింది. అప్పుడు నెహ్రూ అబ్బే, మూడు రాష్ట్రాలుండాలి – విదర్భ, మరాఠ్వాడాలతో కూడిన సంయుక్త మహారాష్ట్ర, కచ్, సౌరాష్ట్రలతో కూడిన మహా గుజరాత్, బొంబాయి రాష్ట్రం. అది కేంద్రం అజమాయిషీలో వుండాలి. ఎందుకంటే అన్ని ప్రాంతాలవారూ అక్కడికి నిర్భయంగా వస్తూ పోతూ వుండాలి అన్నాడు. నెహ్రూ 1955 అక్టోబరులో యీ మాట అనగానే నవంబరులో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ యీ సలహా భేషుగ్గా వుందంది.

బొంబాయిని కేంద్రపాలిత ప్రాంతంగా చేస్తామని ప్రకటించిన నెహ్రూకి వ్యతిరేకంగా 1956 జనవరిలో హింసాత్మక ఆందోళనలు జరిగాయి. యూనియన్ కేబినెట్ మంత్రిగా వున్న సి డి దేశ్‌ముఖ్ (మహారాష్ట్రుడు, మన దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ గారి భర్త) నెహ్రూ కాబినెట్ నుండి రాజీనామా చేశారు. నెహ్రూ మహారాష్ట్ర వ్యతిరేకి అని ఆరోపించాడు. దాంతో రాష్ట్రమంతా ఆందోళనలు చెలరేగాయి. బొంబాయి వదులుకోం అని మహారాష్ట్రులు, గుజరాతీయులు నిరసనలు చేశారు. సంయుక్త మహారాష్ట్ర వాదనలను మొరార్జీ దేశాయ్ ఖండించాడు. యశ్వంతరావు చవాన్ ఒక ప్రకటన చేస్తూ ''సంయుక్త మహారాష్ట్ర, నెహ్రూల మధ్య ఎంచుకోవాల్సి వస్తే నేను నెహ్రూనే ఎంచుకుంటాను.'' అన్నాడు. (ఈయన అప్పుడు పోషించిన పాత్రనే నేను యిప్పుడు పోషిస్తా అంటున్నారు జయపాల్ రెడ్డి. వారి భావం ఏమిటో మరి) అల్లర్లలో బొంబాయిలో 27 మంది, అహ్మదాబాద్‌లో 12 మంది పోయారు. అయినా నెహ్రూ చలించలేదు.

1956 జూన్‌లో బొంబాయిని ఐదేళ్లపాటు కేంద్రపాలితంగా ప్రకటించాడు. మహారాష్ట్రకు రాజధానిగా వుండదన్నాడు. బొంబాయి, మహారాష్ట్ర, గుజరాత్ మూడు రాష్ట్రాలకు విడివిడిగా హైకోర్టు, పబ్లిక్ సర్వీసు కమిషన్లను ప్రకటించాడు.

దీనిపై మళ్లీ విపరీతంగా ఆందోళనలు జరిగాయి. చివరకు భరించలేక కేంద్రం దిగి వచ్చి 'సరే, బొంబాయిని కేంద్రం చేతిలోకి తీసుకోం కానీ ద్విభాషా రాష్ట్రంగానే వుంచుతాం' అని ప్రకటించి, 1956 నవంబరు 1 న బొంబాయి రాష్ట్రం ఏర్పాటు చేశారు. అప్పటిదాకా విడిగా వున్న సౌరాష్ట్ర, కచ్, విదర్భ దానికి కలిపారు. 'ఇది బాగా లేదు, తెలుగువాళ్లకు విడిగా రాష్ట్రం యిచ్చారు కదా, మా గుజరాతీయులకూ వేరే యివ్వండి' అని గుజరాత్‌లో ఆందోళన చేస్తూ వచ్చారు. కేంద్రం పట్టించుకోలేదు. ఆ తర్వాత వచ్చిన ఎన్నికలలో కాంగ్రెసుకు పెద్దగా సీట్లు రాకపోవడంతో రాష్ట్రం విడగొట్టక తప్పదని వారికి అర్థమైంది. "మీరే విడిపోతామంటున్నారు కాబట్టి కొత్త రాజధాని మీరే కట్టుకోవాలి. రూ.50 కోట్లు యిస్తాం. బొంబాయి మహారాష్ట్రకే వుంచేస్తాం" అంది కేంద్రం. గుజరాతీలు బొంబాయి మాదే అంటూ పోట్లాడారు. కానీ కుదరలేదు. 'విభజన కోరినవారికి రాజధాని దక్కదు, ఆంధ్రులు ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుండి విడిపోయినప్పుడు వారు మద్రాసుకై ఎంత ఆందోళన చేసినా యివ్వలేదు కదా' అంటూ గుజరాతీల వాదనను తిరస్కరించారు. జన్మతః మహారాష్ట్రీయుడైన ఆంబేడ్కర్ కూడా గుజరాతీల వాదన తిరస్కరించాడు.

దీనివలన మనం గమనించవలసిన అంశాలు – 1. విడిపోతామనేవాళ్లకు రాజధాని యివ్వడం జరగలేదు. అసాంలోని షిల్లాంగ్ యిచ్చారు కానీ అది పెద్ద నగరమూ కాదు, దానిలో భిన్న సంస్కృతుల ప్రజలూ లేరు. మద్రాసు, బొంబాయి, హైదరాబాదు వంటి నగరాలతో దానికి పోలికే లేదు.

2. వివాదం వచ్చినపుడు యిలాటి నగరాలను తన చేతిలోకి తీసుకోవాలని కేంద్రం ఎప్పుడూ ప్రయత్నిస్తుంది

3. హైదరాబాదు విషయంలో కేంద్రం యిప్పుడు చేస్తున్నది అదే. దీన్ని అడ్డుకోవాలంటే తెలంగాణ నాయకులు విపరీతంగా కృషి చేయాలి. బొంబాయి విషయంలో అది కేంద్రం చేతిలోకి వెళ్లడాన్ని గుజరాతీయులు కూడా అడ్డుకున్నారు. హైదరాబాదు విషయంలో అది యుటీ అయితే బాగుండునని సీమాంధ్ర నాయకులు కొందరు కోరుకుంటున్నారు. అందువలన వారి సహకారం వుండదు. తెలంగాణ ఉద్యమకారులు ఒంటరిగా, మరింత దృఢంగా పోరాడవలసి వుంటుంది.

కేంద్రం అజమాయిషీ స్వరూపస్వభావాల గురించి సందేహాలు వ్యక్తం చేస్తూ కెసియార్ ఒక్కరే గళం విప్పుతున్నారు. తెలంగాణ కాంగ్రెసు నాయకులెవరూ ఢిల్లీ నాయకులను అడగకుండా స్తబ్దంగా వుండడం విచిత్రంగా వుంది. ఈ పొరపాటుకు వారు భావితరాలకు సంజాయిషీ చెప్పుకోవలసి వస్తుంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2013)**

**అక్టోబరు 19-21 వీక్లీకై** **ఎమ్బీయస్ : న్యూస్, వ్యూస్, రివ్యూస్ – 19**

## దిగ్గీ రాజా పేరు వింటనే గుండెలు దిగ్గుమంటాయి

దిగ్గీ రాజాగా పిలవబడే దిగ్విజయ్ సింగ్ పేరు యీనాడు మన రాష్ట్రమంతా సుపరిచితం. చాలా ఏళ్లగా అచేతనంగా వున్న విభజన అంశం ఆయన రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జిగా వచ్చిన దగ్గర్నుంచే ఊపందుకుంది. ఏదో యిన్నాళ్లకు నావను ఆ ఒడ్డుకో, యీ ఒడ్డుకో చేర్చడానికి సిద్ధపడ్డాడు అనుకుంటే యీ వ్యవహారాన్ని ఎంత అస్తవ్యస్తంగా చేయాలో అంత యిదిగానూ చేస్తున్నాడు. రోజుకో మాట మాట్లాడతాడు. అసెంబ్లీకి రెండుసార్లు వస్తుందని ఉద్యోగస్తులకు నా మాటగా హామీ యిచ్చేయండి అని ఈయన ముఖ్యమంత్రికి చెప్తాడు. చెప్పడానికి ఆయనెవడు, నేను కదా చెప్పాలి అంటూ హోం మంత్రి మరొకటి చెప్తాడు. ఈయన దగ్గర కెళ్లి అదేమిటండీ అంటే, హోం మంత్రిని కనుక్కుంటా అంటాడు. కనుక్కోవడానికి ఎన్నాళ్లు పడుతుందిట? ఓ మిస్‌డ్ కాల్ కొడితే చాలదా? మొత్తం వ్యవహారాన్ని గబ్బు పట్టించి, సీమాంధ్రులకు కాంగ్రెస్ అంటే రోత పుట్టించే స్థితికి తెచ్చాడు. ఇదీ రాష్ట్ర కాంగ్రెస్ యిన్‌చార్జిగా యీయన సాధించిన ఘనకార్యం! మరి యిలాటాయన పొజిషన్ సొంత రాష్ట్రంలో ఎలా వుంది? వచ్చే నెలలో అక్కడ అసెంబ్లీ ఎన్నికలు కాబోతున్న తరుణంలో యీయన వలన పార్టీకి ఒనగూడే లాభం ఏమైనా వుందా?

దిగ్గీరాజా రాజకీయాల్లో అర్జున్ సింగ్‌కు శిష్యుడు. 1990ల్లో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా వుండగా చాలా సమర్థుడైన పాలకుడిగా పేపర్లలో వచ్చేది. ఆంధ్రలో చంద్రబాబు, కర్ణాటకలో ఎస్ఎమ్ కృష్ణ, మధ్యప్రదేశ్‌లో యీయనా – ముందుచూపు కలవారనీ, ఆధునిక పద్ధతుల్లో తమ రాష్ట్రాలను ప్రగతిపథంలో నడిపించేస్తున్నారని మీడియా పొగిడింది. మన చంద్రబాబు ప్రతీ నియోజకవర్గంలో తన పార్టీ కార్యకర్తలను పేర్లతో సహా గుర్తుపట్టగలిగినట్లే, యీయనా మధ్యప్రదేశ్‌లో తన పార్టీ కార్యకర్తలను పేరుతో పలకరించగలరు. తీరా చూస్తే వీళ్లు ముగ్గురూ తర్వాత వచ్చిన ఎసెంబ్లీ ఎన్నికలలో ఓడిపోయారు. పార్టీలో వారి పట్ల అభిమానం చెక్కు చెదరకపోయినా, ప్రజలకు మాత్రం వాళ్ల పాలన గిట్టలేదు. దిగ్గీ రాజా హయాంలో మధ్యప్రదేశ్‌లో రవాణా బాగుండేది కాదు, నీటి సమస్య, విద్యుత్ సమస్య వుండేవి. గ్రోత్ రేట్ నెగటివ్‌లోకి వెళ్లిపోయింది. అతని పరిపాలన అంటే ప్రజలకు ఎంత భయం పట్టుకుందంటే 2003లో ఓడించడమే కాదు, 2008లో 'మాకు ఓటేసి గెలిపించకపోతే మళ్లీ దిగ్గీ పాలన వస్తుంది జాగ్రత్త' అని ఎన్నికల ప్రచారంలో బిజెపి హెచ్చరిస్తే అడిలిపోయి మళ్లీ బిజెపినే గెలిపించారు. ఐదేళ్ల తర్వాత కూడా అదే పరిస్థితి కనబడుతోంది. 'దిగ్గీ ప్రచారానికి దిగితే

కాంగ్రెస్ పని మటాషే, ఆయన వెనక్కాల వుండి మంత్రాంగం నడిపితే ఫరవాలేదు' అని కాంగ్రెస్ వారే అంటున్నారు.

ఈ పరిస్థితి గమనించి దిగ్గీ ''నాకు రాష్ట్రరాజకీయాల్లో ఆసక్తి లేదు. జాతీయ రాజకీయాల్లోనే వుంటాను' అని పదేపదే ప్రకటిస్తున్నాడు. కాంగ్రెసు పార్టీ మధ్యప్రదేశ్‌లో తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా జ్యోతిరాదిత్య సింధియాను చూపిస్తూ అతనికే పగ్గాలు అప్పగించింది. దిగ్గీ కొడుకు జీవర్ధన్ సింగ్‌కు రాఘవ్‌గఢ్ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు టిక్కెట్టు యిచ్చి సరిపెట్టవచ్చంటున్నారు. సొంత రాష్ట్రంలో పరపతి లేని యిలాటి నాయకులందరూ మన తెలుగువారి భాగ్యవిధాతలుగా మారి మన భవిష్యత్తును లిఖిస్తున్నారు. అదీ మన దురద ృష్టం!

**ఉల్లి ద్వారా పవర్ చూపిన పవార్**

శరద్ పవార్‌గారికి అర్జంటుగా మధ్యంతర ఎన్నికలు కావాలి. యుపిఏకు నూకలు చెల్లాయని గుర్తించాడు. దీనిలో భాగస్వామిగా పిండుకున్నంత పిండుకున్నాడు. రాబోయే ప్రభుత్వం ఏదైనా దానిలో భాగస్వామి కావాలంటే దీనిలోంచి సరైన టైములో బయటకు వెళ్లాలి. వెళ్లేముందు దీని ప్రతిష్ట అడుగంటించాలి. తెలంగాణ సమస్యపై మధ్యంతర ఎన్నికలు వస్తాయని ఆయన ప్రకటించడంలో ఆంతర్యం యిదే. తెలంగాణ యిమ్మనమన్నాం కానీ యింత అడ్డదిడ్డంగా విడగొట్టమన్నామా, ఆంధ్రులను ఎలా హేండిల్ చేయాలో మీకు తెలియలేదు అని బిజెపితో పాటు పవారూ కాంగ్రెసును విమర్శించబోతాడు చూడండి. యుపిఏను ఏడిపించాలంటే యిలాటి చిన్న ట్రిక్కులు చాలవు. సామాన్యజనమంతా బూతులు తిట్టాలంటే ఉల్లి ధర పెంచాలి. 1979లో జనతా పార్టీ కూలిపోయిందంటే దానికి కారణం ఉల్లి ధరే! కూరలు ప్రియం అయిపోయినపుడు, కూలీవాళ్లు రొట్టెలో ఉల్లిపాయలు నంచుకుని తిని ఆకలి చల్లార్చుకుంటారు. ఉల్లిని వాళ్లకు అందుబాటులో లేకుండా చేస్తే ప్రభుత్వంపై పగపడతారు. ఉల్లికి, శరద్ పవార్‌కు లింకేమిటంటే – దేశంలోని ఉల్లి మార్కెటులో 70% జరిగేది మహారాష్ట్ర లోని నాసిక్ జిల్లాలో. అది శరద్ పవార్ పార్టీకి కంచుకోట. అక్కడ ఉల్లి వ్యాపారస్తులు, వాళ్లకు అండగా నిలిచేవారు చాలామంది పవార్ సమర్థకులే. కొందరు బిజెపివారు కూడా వున్నారు కానీ కాంగ్రెసుకు చెడ్డపేరు తెచ్చే క్రమంలో పవార్‌తో చేతులు కలపడానికి సిద్ధం.

2012లో ఉల్లి ఉత్పాదన 42 లక్షల టన్నులైతే ఈ ఏడాది దిగుబడి 55 లక్షల టన్నులు. మరి ఉల్లి ధర కిలో 80 రూ.లు ఎలా అయింది? ఇంతెలా పెరిగింది? ఉల్లి ధర పెంచడం వెనక జరిగిన ట్రిక్కులు అర్థం చేసుకోవడం కష్టమేమీ కాదు. పంట పండినపుడు రైతులు మార్కెట్ యార్డుకు తన సరుకు పట్టుకుని వస్తాడు. మార్కెట్ యార్డును శాసించే కొద్దిమంది వ్యాపారస్తులు కూటమి (కార్టెల్ అంటారు)గా ఏర్పడి ధర పెరక్కుండా చూసి, అతి తక్కువ ధర యిచ్చి కొనేస్తారు. ఆ తర్వాత స్టాకును గోడౌన్లలో దాచేసి వుంచుతాడు. మార్కెట్‌లోకి కొద్దికొద్దిగా స్టాకు రిలీజ్ చేసి, కొరత స ృష్టించి రేటు పెంచి, వినియోగదారుడి వద్ద నుండి హెచ్చు ధర రాబడతారు. అటు వినియోగదారుడు, యిటు రైతు యిద్దరూ నష్టపోతారు. మధ్యలో వున్న దళారి బాగుపడతాడు. ఈ ఏడాది పంటలో 80% దిగుబడిని ఫిబ్రవరి–మార్చి మాసాల్లో క్వింటాల్ రూ.800–రూ.1200 రేటులో వ్యాపారస్తులు కొనేశారు. 80% మంది రైతులు చిన్నకారు వాళ్లే కాబట్టి, తమ ఉత్పాదనను దాచుకునే సౌకర్యం లేని వాళ్లు కాబట్టి అమ్ముకున్నారు. తక్కిన రైతులు దాచుకుని కొన్నాళ్లు పోయాక రూ.5600 రేటులో అమ్మారు. వ్యాపారస్తులు రూ.4000 – నుండి రూ.6000 రేటులో దాన్ని తిరిగి అమ్ముకున్నారు. ఆ సరుకులో రూ.800కి కొన్నది కూడా వుందని గుర్తు పెట్టుకోవాలి. దేశంలోనే అతి పెద్దదైన ఉల్లి మార్కెట్ యార్డు లసల్‌గావ్ అగ్రికల్చర్ ప్రొడ్యూస్ మార్కెట్. దాని కమిటీలో వున్న వ్యాపారస్తులు ఆగస్టు 12–15 మధ్య నాలుగు రోజుల్లో రూ.150 కోట్లు గడించారు.

ఈ కథ చిన్నప్పటినుండీ వింటూ వచ్చినదే. మరి దీన్ని అరికట్టేందుకు మార్గాలు కనిపెట్టలేదా? అంటే కనిపెట్టారు, అప్పుడప్పుడు మూసేస్తూ వుంటారు. ఉదాహరణకి ఉల్లి అత్యవసర వస్తువుల లిస్టులో వుండేది. ఆ లిస్టులో వుంటే మార్కెట్ ధరను ప్రభుత్వం నియంత్రించవచ్చు. కానీ 2004లో ఆ లిస్టులోంచి ఉల్లిని తప్పించారు. ఎందుకు? ఎందుకంటే ఆ వ్యాపారస్తులు ఎన్నికలకు విరాళాలిచ్చారు. ఆ వ్యాపారస్తులకు అండగా నిలిచిన రాజకీయ పార్టీ మద్దతు ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైంది. అదేవిధంగా ఏదైనా మార్కెట్‌లో సరుకు వేలం వేసేటప్పుడు ఎవరైనా వచ్చి పాల్గొనవచ్చని చట్టం చెపుతుంది. కానీ దాన్ని అమలు చేయరు. కమిటీలో కొందరు సభ్యులు యింకెవర్నీ రానివ్వరు. గత మూడు నెలల్లో లసల్‌గావ్ మార్కెట్‌లో 6.5 లక్షల ఉల్లిని వేలం వేస్తే దాన్ని కొన్నవారు కేవలం 12 మంది వ్యాపారస్తులు/వ్యాపారబ ృందాలు. అంటే వాళ్లు రింగుగా ఏర్పడి ఎవర్నీ రానివ్వటం లేదని అర్థమౌతుంది. రైతు తన ఉత్పాదనను కొంతకాలం దాచుకోగలిగితే రేటు పెరిగా మార్కెట్‌లో అమ్ముకునేందుకు వెసులుబాటు వుంటుంది. రూ.40000 పెడితే తాత్కాలికమైన గోదాము, రూ. 2 లక్షలు పెడితే స్టోర్ హౌస్ తయారవుతాయి. దానికోసం గతంలో అతనికి సబ్సిడీ యిచ్చేవారు. కానీ 2004 నుండి అది కూడా ఆపేశారు. ఎందుకు? వ్యాపారస్తులు బాగుపడాలి, రైతు నష్టపోవాలి.

సెప్టెంబరు మధ్యలో ఉల్లి మార్కెట్‌లో ధర క్వింటాల్ రూ.5700కు చేరింది. వెంటనే మహారాష్ట్ర ప్రభుత్వం అగ్రికల్చర్ బోర్డు మార్కెటింగ్ డైరక్టరు సెప్టెంబరు 19న మార్కెట్ కమిటీ వాళ్లను పిలిచి మేం రంగంలోకి దిగాల్సి వస్తుంది జాగ్రత్త అని హెచ్చరించారు. అంతే 24 గంటల్లో ధర రూ.4300కి పడిపోయింది. అంటే ఏమిటన్నమాట వీళ్లందరూ కలిసి కావాలని క ృత్రిమంగా కొరత స

ృష్టించారు. ప్రభుత్వం చురుగ్గా వుంటే వెనక్కి తగ్గుతారు. లేకపోతే దోపిడీ చేస్తారు. ఫిబ్రవరి నుండి మే లోపున 27.5 లక్షల మెట్రిక్ టన్నుల ఉల్లి గోదాముల్లో వుందని అధికారిక దస్తావేజులు తెలుపుతున్నాయి. దేశం మొత్తం మీద నెలవాడకం 7-8 లక్షల మెట్రిక్ టన్నులు. ఇక కొరతకు అవకాశం ఎక్కడ? అయినా ప్రభుత్వం ఏమీ పట్టించుకోదు. పైగా దేశంలో ఉల్లి దొరకటం లేదని తెలిసికూడా దుబాయి, బహరైన్‌ల యిత్యాది దేశాలకు ఎగుమతులను అనుమతించారు. ఉల్లి కోసం దేశప్రజలు హాహాకారాలు మిన్నుముట్టిన సెప్టెంబరు తొలిపక్షంలోనే నాసిక్‌లోని ఒక ఉల్లి వ్యాపారస్తుడు 46 క్వింటాళ్ల ఉల్లిని బంగ్లాదేశ్‌కు ఎగుమతి చేశారు. అదే సమయంలో ఇంకో వ్యాపారస్తుడు నేపాల్, దుబాయిలకు 72 క్వింటాళ్ల ఉల్లిని ఎగుమతి చేశాడు. ఉల్లికి కొరత వచ్చిందని అనగానే 'ఉండండి, ఈజిప్టు, చైనా, అఫ్గనిస్తాన్‌ల నుండి దిగుమతి చేసుకుని మీ అందరికీ సప్లయి చేస్తాం' అంటారు. ఏమిటీ తిక్కపనులు? ఎగుమతెందుకు? దిగుమతెందుకు? ఓ పక్క గోడౌన్లలో ఉల్లి స్టాకులు కుప్పలుతిప్పలుగా వుండగా, రూపాయి విలువ విపరీతంగా పడిపోయిన యీ రోజుల్లో దిగుమతులా? ఆర్థికవేత్త ప్రధాని గారు బొగ్గు పులుముకుని కూర్చున్నారు, కళ్ల నిండా మసి, కనబడదు, అడ్డపంచె మేధావిగారు ఆంధ్రులను విడగొట్టడంలో బిజీగా వున్నారు. ఆయనకు వినబడదు.

**యథార్థవాదీ – రాజవిరోధీ**

జాన్ ప్యాటన్ డేవిస్ జూనియర్ అనే అమెరికన్ డిప్లోమాట్ రాసిన ఆత్మకథ "చైనా హ్యేండ్" మార్కెట్లో లభిస్తోంది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత మావోను విస్మరించడం తగదని హితవు చెపుతూ తన అమెరికా దేశానికి చైనా గురించిన క్షేత్రవాస్తవాలు చెప్పి అతనెన్ని కష్టాలు పడ్డాడో అది చదివితే తెలుస్తుంది. విషయం తెలియాలంటే చైనా చరిత్ర కాస్త గుర్తుకు తెచ్చుకోవాలి. ప్రజలను ఉత్తేజపరచి విప్లవం తెచ్చి చైనా చక్రవర్తిని గద్దె నుండి దింపివేసిన డా౹౹ సన్యట్ సేన్ కొమింటాంగ్ అనే తన ఉద్యమం పేర ప్రభుత్వం ఏర్పరచి భూ సంస్కరణలు చేపట్టాడు. అతనికి చైనా కమ్యూనిస్టులు మద్దతు యిచ్చి ప్రభుత్వంలో చేరారు. సన్యట్ మరణం తర్వాత అతని స్థానంలో వచ్చిన చాంగ్ కై షేక్ కమ్యూనిస్టు వ్యతిరేకి. కుటిలుడు. పాశ్చాత్య దేశాలకు ఆప్తుడిగా మెలగుతూ వాళ్లకు నచ్చని భూ సంస్కరణలను పక్కన పడేశాడు. అప్పటికే రష్యాలో కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడింది. చైనా కూడా ఆ దోవన పడిపోకుండా చాంగ్ ఆపుతాడు కదాని అమెరికా వంటి దేశాలు అతనికి అండగా నిలిచాయి. కమ్యూనిస్టులకు యీ వరస నచ్చలేదు. చాంగ్‌ను వ్యతిరేకిస్తూ ప్రభుత్వం నుండి తప్పుకున్నారు.

ఇంతలో రెండవ ప్రపంచయుద్ధం వచ్చింది. చైనాకు ఆగర్భశత్రువైన జపాన్ పెరల్ హార్బర్‌పై బాంబులు వేసి అమెరికాను యుద్ధంలోకి లాగింది. జపాన్‌ను యిటునుండి ఎదుర్కోవాలంటే చైనాయే తగినదని తలచిన అమెరికా కొమింటాంగ్‌కు, కమ్యూనిస్టులకు యిద్దరికీ ఆయుధాలు అందించింది. కొమింటాంగ్ సైన్యం కంటె కమ్యూనిస్టులు చిత్తశుద్ధితో పోరాడుతున్నారని గమనించి, వాళ్లకు ఎక్కువ ఆయుధాలు యిచ్చారు. తను యుద్ధంలో దిగేటంత వరకూ రష్యా కూడా కమ్యూనిస్టులకు బోల్డు ఆయుధాలు యిచ్చింది. అమెరికా జపాన్‌పై ఆటంబాంబు వేయడంతో జపాన్ ఓడిపోయింది. ఉత్తర కొరియానుండి, మంచూరియా నుండి తన సైన్యాన్ని వెనక్కి రప్పించింది. అప్పుడు రష్యా వాటిని ఆక్రమించి చైనా కమ్యూనిస్టు పార్టీ పరం చేసింది. ఇటు అమెరికా సహాయంతో కొమింటాంగ్ ప్రభుత్వం మధ్య చైనా, దక్షిణచైనా ప్రాంతాలను తన అధీనంలోకి తెచ్చుకుంది. చైనా కమ్యూనిస్టు పార్టీని అడ్డుపెట్టుకుని రష్యా చైనాలో తన పలుకుబడి పెంచుకుందామని చూసినట్లే చాంగ్‌కై షేక్‌ను అడ్డుపెట్టుకుని అమెరికా చైనాను తన గుప్పిట్లోకి తెచ్చుకుందామనుకుంది. మరి కమ్యూనిస్టులతో ఎలా వ్యవహరించాలి? జపాన్ ఓడిపోయింది కాబట్టి యిక కమ్యూనిస్టులకు ఆయుధాలు యివ్వనక్కరలేదు. కమ్యూనిజం వ్యాప్తి నివారించాలంటే చాంగ్ కై షేక్‌ను దువ్వాలి. కమ్యూనిస్టులను కూడా దార్లో పెట్టుకోవాలి. ఎలా? ఇది యుద్ధానంతరం అమెరికా ముందున్న సమస్య. తన విదేశాంగ శాఖలో ఉద్యోగి ఐన చైనా నిపుణుడు జాన్ ప్యాటన్‌ను సంప్రదించారు.

జాన్ ప్యాటన్ డేవిస్ జూనియర్ తండ్రి అమెరికాలో పుట్టిన క్రైస్తవ మిషనరీ. మతవ్యాప్తికై చైనాలో నివసించినప్పుడు జాన్ పుట్టాడు. చదువు అమెరికాలో సాగింది. అమెరికన్ ప్రభుత్వంలో ఫారిన్ సర్వీసెస్‌లో చేరితే చైనాలో పోస్టింగ్ యిచ్చారు. జనరల్ జోసెఫ్ స్టిల్‌వెల్ వద్ద స్పెషల్ డిప్లోమాటిక్ అటాచీగా నియమించారు. జనరల్ జోసెఫ్ చైనా-బర్మా-ఇండియా సైన్యాలకు కమాండర్. చాంగ్ కై షేక్‌కు చీఫ్ ఆఫ్ స్టాఫ్ కూడా. చైనాలో అమెరికన్ రాయబారిగా వున్న పాట్రిక్ హర్లీకి కూడా చాంగ్ కై షేక్ అంటే అభిమానం. పాట్రిక్ అమెరికాలో ఆయిల్ వ్యాపారి. చైనా గురించి ఏమీ తెలియదు. అమెరికా అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ రూజ్వెల్టుకు కూడా చైనా గురించి పెద్దగా ఐడియా లేదు. అందువలన చాంగ్‌కు మద్దతు యివ్వాలని భావించారు. కమ్యూనిస్టులను అతని పాలన కిందకు తేగలమని కలలు కన్నారు. రాయబారి కార్యాలయంలో వున్న జాన్ ప్యాటన్ యీ అంచనా తప్పని వాదించాడు. తన ప్రభుత్వానికి లేఖలు రాశాడు. "నేను మావో, చౌ ఎన్ లైలను స్వయంగా కలిసి మాట్లాడాను. వాళ్లకే ప్రజల మద్దతు వుంది. అమెరికా వాళ్లను ఆదుకొనకపోతే, చాంగ్‌ను గుడ్డిగా సమర్థిస్తే మావో యిష్టం లేకపోయినా స్టాలిన్ దరి చేరతాడు. చైనాతో అమెరికా శాశ్వతంగా స్నేహం కోల్పోతుంది." అని హెచ్చరించాడు.

కానీ అతని మాట అమెరికన్ ప్రభుత్వం వినలేదు. నిన్నటిదాకా ఆయుధాలు యిచ్చి సహాయం చేశాం కాబట్టి కమ్యూనిస్టులు మన

మాటకు విలువిచ్చి కొమింటాంగ్‌తో కలిపి సంకీర్ణ ప్రభుత్వంలో చేరతారని భ్రమపడింది. 'ఆయుధాలకు థ్యాంక్స్ కానీ మీరు అడిగిన ప్రత్యేక వ్యాపార సదుపాయాలకు అంగీకరించలేం' అన్నాడు మావో. కమ్యూనిస్టులతో పొత్తుకు చాంగ్ కై షేక్ అంగీకరించకపోగా 1946 జులై నుండి కమ్యూనిస్టు స్థావరాలపై దాడి ప్రారంభించాడు. జాన్ ప్యాట్రిక్ సలహాకు వ్యతిరేకంగా అమెరికా దానికి వత్తాసు పలికింది. సోవియట్ రష్యా కమ్యూనిస్టులకు కొండంత అండగా నిలబడింది. యూరప్‌దేశాల తొత్తుగా మారడమే కాక, జపాన్ దాడిని సమర్థవంతంగా ఎదుర్కోలేకపోయిన చాంగ్ కై షేక్‌ను చైనా ప్రజలు అసహ్యించుకున్నారు. కమ్యూనిస్టులకు వత్తాసు పలికారు. అందువల్ల మూడేళ్ల పాటు జరిగిన అంతర్యుద్ధంలో మావో గెలుపొందారు. 1949 అక్టోబరు 1 న 'పీపుల్స్ చైనా రిపబ్లిక్' ఏర్పరచారు మావో. చాంగ్ కై షేక్ ఫార్మోజా ద్వీపానికి పారిపోయి అక్కణ్నుంచి 'తనదే అసలైన చైనా ప్రభుత్వమ'ని చెప్పుకున్నాడు.

పీపుల్స్ చైనా ఏర్పడగానే అమెరికాలో గగ్గోలు పుట్టింది. ''యుద్ధసమయంలో మన నుండి ఆయుధాలు తీసుకున్న కమ్యూనిస్టులు పార్టీ ఫిరాయిస్తారా? రష్యాకు విజయమూ, మనకు అపజయమూనా? మన రాయబార కార్యాలయం గుడ్లప్పగించి చూస్తూ వుందా?'' అని ప్రజలు నిలదీశారు. వెంటనే అమెరికన్ ప్రభుత్వం ''మన రాయబార కార్యాలయంలో దేశద్రోహులున్నారు. వాళ్లు అంతరంగంలో కమ్యూనిస్టులు. వాళ్లే మనను తప్పుదోవ పట్టించారు.'' అంటూ జాన్ ప్యాట్రిక్‌తో సహా కొంతమంది పేర్లు పేర్కొన్నారు. ఆనాటి రోజుల్లో కమ్యూనిస్టులంటే అమెరికాలో జ్వరం వచ్చేసేది. మెక్ కార్థీ అనే సెనేటర్ కనబడిన ప్రతీ వాణ్నీ కమ్యూనిస్టు అని ఆరోపించడం, ప్రభుత్వం, ప్రజలు వారిని వెంటాడి వేధించడం జరిగింది. చార్లీ చాప్లిన్ కూడా అదే విధంగా అమెరికానుండి తరిమివేయబడ్డాడు. జాన్ ప్యాట్రిక్‌ను 1954 నవంబరులో ఫారిన్ సర్వీసు నుండి తొలగించి అతనిపై విచారణలు జరిపారు. ఒకదాని తర్వాత మరొకటిగా 8 విచారణలు జరిగాయి. ఒక్కటీ అతన్ని దోషిగా నిలబెట్టలేకపోయింది. తొమ్మిదో విచారణ జరిపించి 'అతనికి వివేకం, యింగితం లోపించాయని' తేల్చారు. జాన్ ప్యాట్రిక్‌కు ఒళ్లు మండి 'నేను రాజీనామా యివ్వను, రిటైరవ్వను, పెన్షన్ తీసుకోను. ఏం చేస్తారో చేసుకోండి.' అని ప్రకటించి ఫర్నిచర్ వ్యాపారిగా సెటిలయిపోయాడు.

కథకు ముక్తాయింపు ఏమిటంటే – అమెరికా పీపుల్స్ చైనాను కాకుండా చాంగ్ కై షేక్ ఫార్మోజాలో ఏర్పరచిన దాన్నే చైనాగా గుర్తించినంత కాలం గుర్తించి, చివరికి నిక్సన్ కాలంలో దాన్ని పక్కకు నెట్టేసి, మావో చైనానే అసలైన చైనాగా గుర్తించింది! ఇప్పుడు ఆ చైనాయే అమెరికాకు ఆక్సిజన్ అందిస్తోంది. 70 ఏళ్ల క్రితమే దీన్ని ముందే వూహించినందుకు జాన్‌కు శిక్ష పడింది పాపం. – **ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2013)**

**అక్టోబరు 22 వీక్లీకై** **ఎమ్బీయస్ : నేను వెళితే మజ్జిగ పోశారు కానీ....**

సీమాంధ్ర మంత్రులందరూ హఠాత్తుగా రాయబారులై పోయారు. ఎప్పటికైనా సీమాంధ్రుల కష్టాలు కేంద్రానికి నివేదిస్తారని మనం అనుకుంటూ వచ్చాం. వాళ్లు ప్లేటు ఫిరాయించి కేంద్రం అభిమతాన్ని చెప్పి సీమాంధ్రుల మెడలు వంచడానికి వచ్చారు. 'వంచితేనే మీకు మంచిది, లేకపోతే మెడ తెగి పడుతుంది' అని బెదిరిస్తున్నారు. ఈ రాయబారులకు నాయకత్వం వహిస్తున్నది – శ్రీమతి పురంధరేశ్వరి. 'నాన్నగారు కృష్ణరాయబారం సీన్లలో రాణించారు కదా, నేను మాత్రం రాణి తరపున రాయబారంలో రాణించలేనా?' అనుకుని రంగంలోకి దిగారు. ఇంతకీ వీళ్లు ముక్తకంఠంతో చెప్పేది ఏమిటి?

'సమైక్యంగా వుండడం యింకా సాధ్యమే అంటూ చెప్పే కబుర్లు బూటకం. అలా నమ్మించడానికి చూసే కిరణ్‌ది నాటకం. నమ్మకండి. విభజన నిర్ణయం జరిగిపోయింది. ఆ నిర్ణయం తీసుకున్నదెవరు? మహామహురాలు, అమ్మలగన్నయమ్మ సోనియా, అల్లాటప్పా భారతీయురా లనుకున్నారా? మాఫియా పుట్టిన ఇటలీ నుండి దిగుమతి చేసుకున్న సామ్రాజ్ఞి. ''గాడ్‌ఫాదర్'' సినిమాలో అండర్‌వరల్డ్ డాన్ కొటేషన్ గుర్తుందా? 'ఐ విల్ మేక్ ఏ ప్రపోజల్ విచ్ హీ కాన్ట్ రిఫ్యూజ్' ! నా ప్రతిపాదన ఒప్పుకోకపోతే చంపి పారేస్తాను అని అన్యాపదేశంగా చెప్పడమన్నమాట. ఆవిడ ప్రతిపాదించిందంటే మనం చచ్చినట్టు ఒప్పుకుని తీరాల్సిందే, లేకపోతే చచ్చినట్టే లెక్క. 'ఒప్పుకుంటే మనమే కాదు, మన భావి తరాలు కూడా చచ్చినట్టే కదా' అంటూ నసక్కండి. మీరు ఎప్పుడు బతికున్నారు కనుక! మీలో జీవలక్షణం వుండి వుంటే మమ్మల్ని ఎప్పుడో నిలదీసేవారు. మేం చెప్పిన అబద్ధాలను ఎప్పుడో కనుక్కునే వారు. సరే, యింతకీ చెప్పేదేమిటంటే – విడిపోవడం ఖాయం. శివుని ఆజ్ఞ అయితే చీమ కుట్టకుండా మానేస్తుందా? సోనియా ఆజ్ఞ అయిన తర్వాత తెలుగువాళ్లు కలిసి ఎలా వుండగలరు? కృష్ణ కమిటీ ఐదో ఆప్షన్ ప్రకారం విడగొట్టేముందు అన్ని ప్రాంతాల వార్ని ఒప్పించాలని వుంది కదా అంటారా? 2009లో సోనియాకు పడిపడి ఓట్లేశారంటే దాని అర్థం ఏమిటి? ఆవిడ చెప్పిన దానికి ఎదురు చెప్పమని ఒప్పుకున్నట్టే కదా! మళ్లీ యింకా సణుగుడు ఏమిటి? మీకేది మంచో ఆవిడే చూసుకుంటుంది. తనకేది మంచో కూడా ఆవిడే చూసుకుంటుంది. మధ్యలో మీ బోడి అభిప్రాయం ఎవడికి కావాలి?

'విభజన అనివార్యం అని ఒప్పేసుకోండి. ఒప్పుకోక ఏం చేస్తారు? 'మొండివాడు రాజు కంటె బలవంతుడు' అని సామెత. మొండివాడే రాజైనప్పుడు..? అతన్ని మించిన బలవంతుడు వుంటాడా? మీరు 60, 70, 80.. ఎన్ని రోజులైనా సమ్మె చేసుకోండి. ఆవిడ నోరు విప్పిందా? అయ్యో పాపం అందా? 'మా యుపిఏ2 ప్రభుత్వానికి ఊపిరి లూదిన ఆంధ్రులారా, మీ దయవలనే కదా యింకో పది స్కాములు చేసుకోగలిగాం. మీకేం ఫర్వాలేదు నేనున్నాను' అని చెప్పిందా? ఎంతకాలం చేయగలరో చూస్తాగా అనుకుంది.

చివరకు మీరే నీరసించారు. తుఫాను పేరు చెప్పి, సిఎం హామీ పేరు చెప్పి సమ్మె విరమించుకుని గోడకు నడుం చేరేశారు. నెలజీతగాళ్లు మీరే యింత మొండిగా రెణ్నెళ్లపాటు సమ్మె చేస్తే, లక్షలాది కోట్లు వెనకేసుకున్న ఆవిడకు ఎంత గోరోజనం వుండాలి? ఆవిడ పవరు మీకు తెలియదు. మాకు తెలుసు. మమ్మల్ని నోరెత్తనివ్వదు. నోరు తెరవబోతే ఏదో ఒకటి కళ్ల ముందు పడేస్తుంది. చటుక్కున దాన్ని నోటితో ఒడిసి పట్టుకోవాల్సి వస్తుంది. ఇంకేం మాట్లాడతాం? నోరు బిజీ కదా!

'విభజన అనివార్యం అని మనసా, వాచా అనుకున్న తర్వాత యిక మిగతా విషయాలన్నీ – అంటే తెలుగు జాతి ఐక్యత, ఆత్మగౌరవం, 'రాహుల్ ప్రధాని కావాలంటే మేం నాశనం కావాలా?' అంటూ సందేహాలు – యివన్నీ పక్కన పడేయాలి. మనకు ఏం దక్కుతుంది? అది చూసుకుంటే చాలు. మమ్మల్ని చూసి నేర్చుకోండి. మేం ఏం చేస్తున్నాం? విడిపోయిన రాష్ట్రంలో 'మాకేంటి?' అని చూసుకుంటున్నాం. మీరూ అదే చేస్తే మంచిది. వాళ్ల మాట విని నోర్మూసుకుని పడి వుంటే వాళ్లు ఏదో ఒకటి విదిలించకపోరు. మనం అడుక్కోవాలంతే. అడక్కపోతే అమ్మయినా పెట్టదు. అడుక్కుందాం రండి. మీకు మరీ సిగ్గయితే మాతో చెప్పండి, మేం వెళ్లి మీ తరఫున అడుక్కుని వస్తాం. మీకేం కావాలో మాకు తెలియదు కదా, ఏదో మాటవరసకి ప్రజాప్రతినిధులం తప్ప మీ బాగోగులు మాకేం తెలుసు? అందుకని మీకేం కావాలో మీరే వచ్చి మాకు చెప్పాలి. అవన్నీ లిస్టు రాసి కట్టకట్టి అమ్మ పాదాల ముందు పడేస్తాం. ఆవిడ ఎంత యిస్తే అదే మన ప్రాప్తం."

– ఇదీ వాళ్ల విజ్ఞాపనల సారాంశం. పురంధరేశ్వరిగారు విజయదశమి పండగరోజు చూసుకుని యీ శుభకార్యానికి సంకల్పం చెప్పుకున్నారు. అడిగినవాడికి, అడగనివాడికి యింటర్వ్యూలు ప్రసాదించారు. ఆవిడ చెప్పినదేమిటి? 1. ఆంటోనీ కమిటీ నివేదిక వచ్చాకనే కాబినెట్ నోట్ అని చెప్పి మమ్మల్ని జోకొట్టారు. 2. అది లేకుండానే నోట్ పెట్టడంతో మేం రాజీనామా చేశాం. 3. అయినా దానిపై పట్టు పట్టడం లేదు, ఎందుకంటే విభజన అనివార్యం కాబట్టి మన ప్రాంతప్రజల హక్కులు కాపాడడానికి మేం పోరాడుతున్నాం 4. పోరాడడానికే పదవుల్లో కొనసాగుతున్నాం 5. కాంగ్రెసు పార్టీని వదిలిపెట్టేది లేదు. అదయ్యాక ఇంకో రెండు రోజుల్లో కార్యాచరణలోకి దిగారు. సమాజంలో అన్ని వర్గాల వారినీ కలిసి విభజనకు ఒప్పించే యాగం చేస్తున్నారు. సోనియాతో చెప్పి అడిగినవి చేయించేస్తామని వాళ్లకు వరాలు యిచ్చేస్తున్నారు.

పాతకాలం సామెతలంటే నాకు భలే యిష్టం. ఓ సామెత వుంది – 'నే వెళితే మజ్జిగే పోశారు. నేను నీకు చీటీ రాసిస్తాను, వెళ్లి చూపెడితే పెరుగు పోస్తారు' అని వెనకటికి ఎవడో అన్నాడట. ఎంత మూరు?డైతే మాత్రం అలా అంటాడా అనుకునేవాణ్ని. ఇప్పుడు పురంధరేశ్వరి వంటి విదుషీమణి కూడా యిలాగే ప్రవర్తిస్తున్నారు. ఈవిడ మన్‌మోహన్‌కు, కపిల్ సిబ్బల్‌కు గారాబుపట్టి అని, ఆవిడ మేధస్సు చూసి సోనియా కూడా మురిసిపోతోందని, ఆవిడ మాటకు చాలా గౌరవం యిస్తుందని యిన్నాళ్లూ మనకు చాలా బిల్డప్ యిచ్చారు. ఇప్పుడు ఆవిడ ఏం చెప్తోంది? 'మాకు కూడా సోనియా ఠోకరా యిచ్చింది. మా మాటకు పూచికపుల్ల యివ్వలేదు. ఆంటోనీ నివేదిక అంటూ మభ్యపెట్టింది' అని. మరి ఠోక్రాణీ సోనియా దగ్గర్నుంచి ఈవిడ యింకేం మంచి ఆశిస్తున్నారు? మా ప్రాంత ప్రజల హక్కులు కాపాడతాం అని మనకు చెప్తున్నారే! అసలు మీకు శక్తే లేదు. మీకు పలుకుబడి లేదు. మీరు ఒట్టి ఆరో వేలు గాళ్లు, ఆటల్లో అరటిపళ్లు, కూరలో కరివేపాకులు. మిమ్మల్ని మీరే ఉద్ధరించుకోలేరు. ఇక మమ్మల్ని ఏం ఉద్ధరిస్తారు? మీకే విలువ లేనపుడు మీ సిఫార్సులకు విలువ వుంటుందా? మాకు పెరుగు పోస్తారా? చాల్లెండి. అసలు మాకు సోనియమ్మ విలువ ఏమైనా యిస్తోందా?

ఆంటోనీ రాష్ట్ర పర్యటనకు వస్తారు, కష్టాలు తెలుసుకుంటారు అన్నారు. తూచ్! గ్రూప్ ఆఫ్ మినిస్టర్లు వస్తారు అన్నారు. అదీ తూచ్! దానిలో పది మంది అన్నారు, అది తూచ్! జలవనరుల మంత్రి లేకుండా, ఎచ్ఆర్‌డి మంత్రి లేకుండా, ప్లానింగ్ కమిషన్ డిప్యూటీ చైర్మన్ లేకుండా, సంబంధిత మంత్రులు లేకుండా అదో కమిటీయా? దానికి కాలపరిమితి లేకుండా ఎప్పుడు కావాలంటే అప్పుడు రిపోర్టు యిచ్చేయవచ్చా? మేం ఏం చేసినా చెల్లుతుంది, మీ తుచ్ఛజీవులకు యింతకంటె ఎక్కువ మర్యాద అక్కరలేదని సోనియా ఘంటాపథంగా చెప్తూ వుంటే వీళ్లు ఆవిడ వద్దకు రాయబారం వెళ్లి యిది తగదు, తల్లీ అని చెప్పాలి తప్ప, మన వద్దకు రాయబారం రావడమేమిటి? మీరు మీ ప్రాంతప్రజల హక్కులు కాపాడగలరా? అసలు 2014లో మీ ప్రభుత్వం మళ్లీ వస్తుందా? మీరు అధినేత్రిగా ఆరాధిస్తున్న సోనియా మళ్లీ అధిపతిగా అవుతుందా? మీరు యివాళ యిచ్చే హామీలకు పూచికపుల్లయినా విలువ వుంటుందా? సర్వే ఫలితాలు చూస్తున్నారుగా, పరప్రభుత్వం ఏర్పడితే మీలో ఎంతమంది జైలుకి వెళతారో తెలియదు. మీ సంగతే మీకు తెలియనప్పుడు 13 జిల్లాల ప్రజలకు మీరు ఏ హామీ యివ్వగలరు? మీ పార్టీలోని ఢిల్లీ నాయకులు రోజుకో స్టేటుమెంటుతో తెలుగువారందరితో ఆడుకుంటున్నారు. వాళ్ల చేత సవ్యమైన స్టేటుమెంటు ఒక్కటీ యిప్పించలేని మీరు ప్రజాప్రతినిధులా? నేతలా? వాళ్లపై తిరగబడేందుకు మీకు దమ్ము చాలదని మాకు తెలుసు. వాళ్ల సిబిఐ వాళ్లకుంది. మీ లొసుగులు మీకున్నాయి. రాజీనామాలు చేయకుండా మాయమాటలు చెప్పినా సరేలే అని వూరుకుంటున్నాం. ఊరుకున్నాం కదాని యీ రాయబారాలు కూడా మొదలెడితే ఎలా?

వారసత్వం వలన కొన్ని చిక్కులుంటాయి. ఇలాటి రాయబారాలు ఏ కావూరియో చేస్తే విసుక్కుని వూరుకునేవాళ్లం. సాక్షాత్తూ ఎన్టీయార్ కూతురే – ఎంత కాంగ్రెసులో చేరినా – యిలాటి పనులకు దిగజారితే చికాకు కాదు, కోపం వస్తుంది. – ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2013)

**అక్టోబరు 23 ఎమ్బీయస్ : చట్టానికి లాలూ చిక్కిన విధం**

దాణా కుంభకోణ నిందితుడు లాలూ ప్రసాద్ యాదవ్ ఎట్టకేలకు చట్టానికి చిక్కి నాలుగేళ్ల శిక్ష అనుభవించడానికి జైలుకి వెళ్లడం విస్మయం కలిగించింది. అది జరిగిన తీరుతెన్నులు యీ పాటికి అందరికీ తెలుసు. క్లుప్తంగా చెప్పాలంటే – పశువుల దాణాకై బజెట్‌లో ఓ 45 కోట్ల రూ.లు ఎలాట్ చేసేవారు. కానీ ఏడాది చివరకు వచ్చేసరికి 200 కోట్ల రూ.లు అయ్యేది. అయ్యో యింత అవుతోంది కదాని మరుసటి ఏడాది ఏ 250 కోట్లో ఎలాట్ చేసేవారు కారు. మళ్లీ 48 కోట్లు.. అంతే! బజెట్ సెషన్‌లో యీ అంకెలే చూసేవారు తప్ప నిజానికి ఎంత ఖర్చవుతోంది అనేది పట్టించుకునేవారు. ఏడాది పొడుగూతా జరిగే కార్యక్రమం ఏమిటంటే – పట్నా సెక్రటేరియట్‌లో వున్న ఏనిమల్ హజ్బెండరీ (పశు సంవర్ధక) శాఖ నుండి బజెట్ కేటాయింపులతో నిమిత్తం లేకుండా ఒక దొంగ ఎలాట్‌మెంట్ లెటర్ జిల్లా స్థాయి కార్యాలయానికి వెళ్లేది. అది పెట్టుకుని జిల్లా అధికారి లేని పశువులను చూపించి వాటి మేతకోసం, మందులకోసం, యంత్రసామగ్రికోసం ఆర్డర్లు తయారుచేసేవాడు. అవి డెలివర్ చేసినట్టుగా దొంగ రసీదులు తయారుచేసేవారు. ట్రక్కు రిజిస్ట్రేషన్ నెంబర్లు వేయాల్సిన జాగాలో స్కూటర్‌ల నెంబర్లు వేసేవారు. ఆ ఆర్డర్ల ఆధారంగా చలాన్లు తయారయ్యేవి. సరుకు ముట్టినట్టుగా స్టాఫ్ దొంగ రసీదులు తయారుచేశేవారు. అవి రావడం వలన స్టాకు పెరిగినట్లు రిజిస్టరులో రాసేవారు. ఈ రసీదుల ఆధారంగా పేమెంటు ఆర్డర్లు తయారయ్యేవి. వాటిని ట్రెజరీ డిపార్టుమెంటు క్యాష్‌లో చెల్లించేది. ఈ విధంగా పశు సంవర్ధక శాఖలో అందరూ బాగా డబ్బు చేసుకున్నారు. వారికి రాజకీయనాయకులు మద్దతు యిస్తూ వచ్చారు. వాటాలు పంచుకున్నారు.

సెక్రటేరియట్‌లోని పశు సంవర్ధక శాఖలో పని చేసే ఒక గుమాస్తా టూర్లు గమనిస్తే విషయం బోధపడుతుంది. పట్నా నుండి అతను బస్సెక్కి మర్నాడు ఉదయం రాంచీలో చేరేవాడు. ఈ కుంభకోణానికి రాంచీ కేంద్రస్థానంగా వుంది. అతను ట్రెజరీ శాఖనుండి సప్లయర్ల పేర తయారుచేసిన చెక్కులు తీసుకుని మధ్యాహ్నం ఢిల్లీ విమానం ఎక్కేవాడు. సాయంత్రం అక్కడ దిగేవాడు. ఆ చెక్కులు వాళ్ల కిచ్చేసి ఆ రాత్రే ఢిల్లీ నుండి మగధ ఎక్స్‌ప్రెస్ ఎక్కి పొద్దున్న పట్నాలో దిగేవాడు. ప్రతీ రెండు నెలలకు క్రమం తప్పకుండా యిలాగే తిరిగేవాడు. మామూలుగా అయితే దీన్ని కనిపెట్టడం కష్టమే కానీ, చాలా ఏళ్లకు ఎక్కవుంట్స్ కంప్యూటరైజ్ చేయడంతో ఎ.జి.(ఎక్కౌంటెంట్ జనరల్) ఆఫీసువారికి యీ పేటర్న్ తెలిసిపోయింది. ఆ గుమాస్తాను పట్టుకుని 'నీకు రాంచీ, ఢిల్లీలలో ఏం పని? విమానంలో వెళ్లడానికి నీకు డబ్బెవరిచ్చారు?' అని నిలదీశారు. అతను సంగతంతా చెప్పేశాడు. విషయం బయటపడింది.

1970లలో జగన్నాథ్ మిశ్రా ముఖ్యమంత్రిగా వుండే రోజుల నుండి యీ భాగోతం జరుగుతూ వచ్చింది. అది ముఖ్యమంత్రికి తెలిసినా వూరుకునేవారు. పోనుపోను అది శ్రుతి మించింది. 1985లో కాగ్ వారు దీన్ని బిహారు ప్రభుత్వం దృష్టికి తెచ్చారు కానీ ముఖ్యమంత్రి పట్టించుకోలేదు. అతనే కాదు, ఆ తర్వాత వచ్చిన ఏ ముఖ్యమంత్రీ పట్టించుకోలేదు. ఆడిటర్ జనరల్ ఆఫీసువాళ్లు అడుగడుగునా హెచ్చరిస్తూనే వున్నారు. అయినా వినేవాడే లేడు. ఈ అవినీతి లాలూ హయాంలో మితిమీరింది. తన అవినీతి గురించి ఆధారాలు బయటపడుతున్నా లాలూ పట్టించుకోలేదు. ఇవన్నీ నిరూపించడం కష్టం అనుకుని అహంకరించాడు. పత్రికలు హెచ్చరిస్తున్నా మొండిగా వ్యవహరిస్తూ తనకేం కాదని దబాయించాడు. ఆ ధీమాయే అతన్ని కొంపముంచింది. జైలుకి పంపింది. జైలుకి వెళ్లి వచ్చాక లాలూకి బుద్ధి వచ్చింది. రైల్వే మంత్రిగా పని చేసిన ఐదేళ్లూ (2004–09) అవినీతి ఆరోపణలు రాకుండా జాగ్రత్త పడ్డాడు. అంతేకాదు, రైల్వే రవాణా విభాగాన్ని కంప్యూటరైజ్ చేయించి, అక్కడ జరుగుతున్న అండర్ యిన్వాయిసింగ్ (రవాణా చేసిన సరుకుల బరువు తక్కువగా చూపడం) వంటి నేరాలను అరికట్టాడు. కానీ చివరకు పాతనేరం నీడ వెంటపడి కాటేసింది.

'లక్ష కోట్ల అవినీతి అనేదాన్ని అతి చులాగ్గా మాట్లాడేస్తున్న యీ రోజుల్లో ఆ అవినీతి పన్నెండు వందల కోట్లే. ఆ మాత్రానికే యింత శిక్షా? ఈ మాత్రం దానికి శిక్షేం పడుతుంది? ఈ నాయకులు సులభంగా బయటపడతారు' అనుకున్నాం. కానీ తప్పించుకోవడానికి వీలులేకుండా పకడ్బందీగా కేసు తయారు చేసిన అప్పటి సిబిఐ తూర్పు విభాగానికి జాయింటు డైరక్టరుగా వున్న ఉపేన్ బిశ్వాస్, అతని బృందం కారణంగానే యిది సాధ్యపడింది. మరి అతనిపై ఒత్తిళ్లు రాలేదా? వస్తే ఎలా తట్టుకున్నాడు? ఇవన్నీ ఆసక్తి కలిగించే ప్రశ్నలు. ఇవన్నీ సాధారణంగా బయటకు రావు. కానీ ఉత్తమ్ సేన్‌గుప్త అనే 'ఔట్‌లుక్" డిప్యూటీ డైరక్టరు చాలా విషయాలు "ఔట్‌లుక్" పాఠకులతో పంచుకున్నారు. అప్పట్లో ఆయన "టైమ్స్ ఆఫ్ ఇండియా" పట్నా బ్రాంచ్‌కు రెసిడెంట్ ఎడిటర్. ఆయన రాసిన కొన్ని విషయాలను (సౌజన్యం – "ఔట్‌లుక్") మనకు యిప్పటిదాకా తెలిసినవాటితో కలిపి చూస్తే ...

1990 మార్చిలో జనతాదళ్ లెజిస్లేచర్ పార్టీ సమావేశం జరిగింది. ముఖ్యమంత్రి పదవికై ముగ్గురు అభ్యర్థులు పోటీ పడ్డారు. వారిలో లాలూ నెగ్గారు. అప్పుడు ఉత్తమ్ అతన్ని ఇంటర్వ్యూ చేస్తే "మా నాన్న వెటర్నరీ కాలేజీలో బంట్రోతు. నాల్గవ తరగతి ఉద్యోగుల క్వార్టర్స్‌లోనే నేను పెరిగాను. ముఖ్యమంత్రి అయినా అక్కడే నివసిస్తాను." అని చెప్పాడు. కానీ అతి త్వరలో అధికారిక నివాసమైన బంగళాలోకి మారిపోయాడు. రెండేళ్లు గడిచేసరికి లాలూ చాలా పాప్యులర్ అయిపోయాడు. రథయాత్ర సందర్భంగా అడ్వానీని అరెస్టు చేసి మతతత్వవాదులను కట్టడి చేసినందుకు మీడియా అతన్ని ఆకాశానికి ఎత్తేసింది. వచ్చే 20 ఏళ్ల దాకా నేను రాష్ట్రాన్ని పాలిస్తాను అని లాలూ చెప్పుకునేవాడు.

బిహార్ యాంటీ కరప్షన్ బ్యూరోలో ఇనస్పెక్టర్‌గా పని చేసే బిధు భూషన్ ద్వివేది అనే అతను 1992లో దాణా కుంభకోణం

గురించి వివరంగా నివేదిక తయారు చేశాడు. తమ శాఖ డైరక్టర్ జనరల్‌నుండి ముఖ్యమంత్రి స్థాయిదాకా అవినీతి పాకిపోయిందని రాశాడు. వెంటనే అతన్ని వేరే యూనిట్‌కు బదిలీ చేసి, ఆ పై సస్పెండ్ చేసేశారు. (1996లో హైకోర్టు ఆదేశాల మేరకు అతని ఉద్యోగం అతనికి దక్కింది. కేసులో అతను ఒక ముఖ్యమైన సాక్షి.) అదే సంవత్సరం రాంచీ ఎయిర్‌పోర్టులో ఢిల్లీ వెళ్లే ఇండియన్ ఎయిర్‌లైన్సు విమానం బయలుదేరబోతూండగా ఇన్‌కమ్‌టాక్స్ అధికారులు వెళ్లి ఆపారు. పశు సంవర్ధక శాఖ ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు నల్లడబ్బుతో వెళుతున్నారని వాళ్లకు సమాచారం అందింది. విమానం నుండి దింపి తనిఖీ చేయడానికి రమ్మనమంటే పట్టుబడతామన్న భయంతో వాళ్లు చెకింగ్ పాయింటుకి వెళ్లే దారిలోనే తమ హ్యాండ్ బ్యాగ్‌ల్లోంచి, బ్రీఫ్ కేసుల్లోంచి నోట్లకట్టలు, నగలు తీసి కిందపడేసి చెకింగ్‌కు వెళ్లారని కళ్లారా చూసినవాళ్లు చెప్పారు. అది స్థానిక దినపత్రికల్లో వచ్చింది. కానీ పెద్ద పత్రికలు దాన్ని పట్టించుకోలేదు. ఇన్‌కమ్‌టాక్స్ డిపార్టుమెంటు కూడా గప్‌చుప్‌గా కూర్చుంది. ఇక అందరూ దాని గురించి మర్చిపోయారు.

రోజులు గడిచే కొద్దీ లాలూపై ప్రజల భ్రమలు తొలగాయి. అతని అనుచరులు విశృంఖలంగా ప్రవర్తించసాగారు. శాంతిభద్రతలు క్షీణించాయి. అవినీతి, బంధుప్రీతి, మీడియాపై ఆంక్షలు యివన్నీ వెలుగులోకి వచ్చి అతనికి ప్రజాదరణ తగ్గింది. లాలూ అధికారంలోకి వచ్చి మూడేళ్లయిన సందర్భంగా 1993లో టైమ్స్ ఆఫ్ ఇండియా రెసిడెంట్ ఎడిటర్ ఉత్తమ్ అతన్ని ఘాటుగా విమర్శిస్తూ వ్యాసం రాశాడు. వెంటనే కారులో వెళుతూంటే అతనిపై తుపాకీతో దాడి జరిగింది. అయితే బుల్లెట్టు ఫ్రంట్‌సీటులో యిరుక్కుంది. ఆ రాత్రే లాలూ టైమ్స్ ఆఫ్ ఇండియాకి వచ్చి "ఉత్తమ్, నీపై దాడి ఎందుకు జరిగింది? నీకైమైనా ఆస్తి గొడవలున్నాయా? ప్రభుత్వపరంగా ఏమైనా చేయమంటావా?" అని అడిగాడు, దాడితో తనకు ఏ సంబంధమూ లేదని చూపుకోవడానికి! అర్ధరాత్రి పోయాక ఢిల్లీ నుండి కాంగ్రెసు పార్టీకి చెందిన కేంద్రమంత్రి రాజేష్ పైలట్ ఢిల్లీ నుండి ఫోన్ చేసి "లాలూ నీపై దాడి చేయించా డనుకుంటున్నావా? చెప్పు విచారణ జరిపిస్తాం" అని ఆఫర్ చేశాడు. అబ్బే లేదు అని ఉత్తమ్ అనడంతో రాజేష్ నిరుత్సాహపడ్డాడు. సాక్ష్యాలేమీ లేనపుడు ఉత్తిపుణ్యాన ఆరోపణలు చేయకూడదని ఉత్తమ్ అనుకున్నాడు.

1995 అసెంబ్లీ ఎన్నికలలో నెగ్గి లాలూ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యాడు. 1996లో యింకో అయిదు నెలల్లో పార్లమెంటు ఎన్నికలు జరుగుతాయనగా లాలూ రాంచీకి వెళ్లాడు. పివి నరసింహారావు ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాదని, రాబోయే ఎన్నికలలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడవచ్చని, దానిలో లాలూ ప్రధాన భూమిక పోషిస్తూ, అయితే గియితే లాలూ ప్రధాని అవుతాడని అందరూ అనుకుంటున్నారు. ఇటువంటి అస్థిర మిశ్రమ ప్రభుత్వానికి ప్రధానిగా వుండడం కంటె దానిలో ముఖ్యపాత్రధారిగా వుండి కావలసిన పనులు చేయించుకోవడం మంచిదని లాలూ అంచనా. రాంచీకి వెళ్లినపుడు అతని వద్దకు ఒక విషయం తెచ్చారు. అమిత్ ఖరే అనే ఐయేయస్ ఆఫీసర్ వెస్ట్ సింగ్‌భూమ్ జిల్లాలో డిప్యూటీ కమిషనర్‌గా పని చేస్తున్నాడు. చాయిబాసా అనే పట్టణంలో పశుసంవర్ధక శాఖలో అక్రమాల గురించి ఫిర్యాదు వస్తే తన టీముతో వెళ్లి పరిశోధించాడు. అక్కడి ట్రెజరీ ఆఫీసర్లు అనేక సార్లు అర్ధరాత్రి పూట ట్రెజరీ తెరిచి క్యాష్ విత్‌డ్రా చేశారని, కోట్లాది రూపాయలకు చెక్కులు జారీ చేశారనీ తేలింది. ఈ అక్రమాలలో రాంచీ, పట్నాలలోని ఉన్నతాధికారుల పాత్ర కూడా వుందని బయటకు వచ్చింది. డిప్యూటీ కమిషనర్ నివేదిక రాసి యిచ్చాడు. దానిపై ఏం చేయాలి? అని రాంచీ వచ్చిన లాలూని అడిగారు. అతి కొద్దికాలంలో దేశాన్ని ఏలబోతున్నామన్న వూపులో వున్న లాలూ "నేరం చేసినవారిపై చర్యలు తీసుకోండి, కావాలంటే అరెస్టు చేయండి" అని చెప్పేశాడు.

అరెస్టుల పర్వం ప్రారంభమయ్యాక తక్కిన జిల్లాల్లో కూడా యిలాటివి జరిగాయని బయటకు వచ్చింది. పశుసంవర్ధక శాఖ ఉద్యోగస్తులు జీతాలు తక్కువ. రీజనల్ డైరక్టరుకి కూడా అప్పట్లో నెలకు 12000 రూ.ల జీతం. మరి అలాటప్పుడు వాళ్ల పిల్లల పెళ్లిళ్లకు భారీగా ఎలా ఖర్చు పెట్టగలుగుతున్నారు? అవినీతి జరిగినట్లే కదా. కానీ బయటపెట్టడం ఎలా? టైమ్స్ ఆఫ్ ఇండియా వారు ఒక ఉపాయాన్ని కనిపెట్టారు. పశు సంవర్ధక శాఖ అధికారులు తమ గ్రామాల్లో, పట్టణాల్లో కట్టిన, కడుతున్న బంగళాలపై వీళ్లు దృష్టి సారించారు. రోజూ ఒకరి యింటి ఫోటో వేయడం, దీని ఖరీదు ఎంత వుంటుందో ఊహించండి అంటూ పాఠకులను అడగడం..! ఇల్లు ఎక్కడుందో రాసి, అది ఎవరిదని గ్రామస్తులు అనుకుంటున్నారో, వారు ఏ శాఖలో పని చేస్తున్నారో రాసేవారు. దీని వలన పాఠకులు తమకు తెలిసిన యిళ్ల గురించి కూడా సమాచారం పంపసాగారు. తమ పేరు వెల్లడించవద్దని కోరేవారు. ఆ శాఖలో ఎంత అవినీతి వుందో అందరికీ అర్థం కాసాగింది. ఇలా ఒక వారం గడిచేసరికి ఇన్‌కమ్ టాక్స్ కమిషనర్ ఫోన్ చేసి "పట్నాలో కడుతున్న ఒక యింటి ఫోటో కూడా వేయండి. మాకున్న సమాచారం ప్రకారం అది ముఖ్యమంత్రి లాలూదో, లేక ఆయన బావమరదులదో అయి వుండాలి. ఎవరిదని అడగడానికి వెళితే మా అధికారులను కొడుతున్నారు. మీ పిల్లల్ని, పెళ్లాల్ని ఎత్తుకుపోతామని బెదిరిస్తున్నారు. మీరు ఫోటో వేస్తే కాన్పూరునుండి స్పెషల్ టీముని రప్పించడానికి నాకు వీలు పడుతుంది." అని కోరాడు.

అప్పుడు ఉత్తమ్ తన స్టాఫ్ ఫోటోగ్రాఫర్ కృష్ణ మోహన్‌ను పంపి ఆ బిల్డింగ్‌ను కాస్త దూరంలో వున్న వేరే బిల్డింగ్‌నుండి టాప్ ఏంగిల్‌లో ఫోటో తీయించాడు. ఇలా తీయించిన విషయం లాలూ మనుష్యులకు తెలిసింది. అయితే ఫోటోతీసినది కృష్ణమోహన్ సోదరుడు కృష్ణ మురారి అని వాళ్లు కన్‌ఫ్యూజ్ అయ్యారు. అతను పని చేసే "హిందూస్తాన్ టైమ్స్" సంపాదకుడు ఘోష్‌కి ఫోన్ చేసి "మీరేదైనా ఫోటో వేయబోతూ వుంటే ముఖ్యమంత్రితో మాట్లాడిన తర్వాతే వేయండి" అని చెప్పారు. ఆయనకు ఏమీ అర్థం కాలేదు. ఉత్తమ్‌కి ఫోన్ చేసి "మీరేమైనా పట్నాలో బిల్డింగ్ ఫోటో వేయబోతున్నారా?" అని అడిగాడు. "అబ్బే, మేం వేసే ఫోటోలన్నీ జిల్లాలవే. పట్నాలోవి ఏమీ వేయడం లేదు." అని ఉత్తమ్ అబద్ధమాడాడు. ఆయన వూరుకున్నాడు. కానీ కాస్సేపటికి ఓ మంత్రి "హిందూస్తాన్

టైమ్స్" ఆఫీసుకి వచ్చి "మీ ఫోటోగ్రాఫర్ ఏవో ఫోటో తీసేట్టగా" అనడంతో మళ్లీ ఉత్తమ్‌కు ఫోన్ చేశాడు. ఉత్తమ్ మళ్లీ అదే అబద్ధం ఆడి, యిక ఆగితే లాభం లేదనుకుని అవేళే ఆ ఫోటోను పబ్లిష్ చేసేశాడు. 'ఈ బిల్డింగ్ ఎవరిదో ఇన్‌కమ్ టాక్స్ డిపార్టుమెంట్‌వారు కనుక్కోలేకుండా వున్నారు' అని శీర్షిక పెట్టారు.

మరి కొన్ని రోజులకు పట్నా మ్యూజియం ఎదురుగా కడుతున్న 5 బెడ్‌రూముల భవంతి ఎవరిదో కనుక్కోండి అంటూ ఒక అజ్ఞాత వ్యక్తి ఉత్తమ్‌కు ఫోన్ చేశాడు. కాపలాగా వున్న గార్డులను అడిగితే వాళ్లు నోరు విప్పటం లేదు. టైమ్స్ వాళ్లు వెతికి, వెతికి ఆ బిల్డింగ్ కాంట్రాక్టరు ఎవరో, ఆర్కిటెక్ట్ ఎవరో కనిపెట్టారు. వెళ్లి అడగబోతే వాళ్లు నోరు విప్పకుండా పారిపోయారు. రెవెన్యూ డిపార్టుమెంటు రికార్డులు వెతికితే స్వాతంత్ర్యానికి పూర్వం ఒక బెంగాలీ ఆయనకు ప్రభుత్వం ఆ స్థలాన్ని లీజుకి యిచ్చిందని, తర్వాత ఆయన కలకత్తాకు తరలి వెళ్లి అక్కడే చనిపోయాడని తెలిసింది. ఇక ఆర్కిటెక్ట్ మీదే దృష్టి పెట్టాలని ఉత్తమ్ అనుకుంటూండగా పట్నాలో టైమ్స్ ముద్రించే ప్రెస్ యజమాని సుధీర్ జైన్ డిన్నర్‌కు పిలిచాడు. అక్కడ ఒకతన్ని పరిచయం చేసి 'ఇతనే నువ్వు వెతికే ఆర్కిటెక్ట్' అన్నాడు. ఎంత అడిగినా తనకు ఆ బిల్డింగ్ పని అప్పచెప్పిన క్లయింట్ పేరు చెప్పలేదు సరి కదా తన పేరు బయటకు వస్తే తను ఊరు వదలి పారిపోవాల్సి వస్తుందని చెప్పాడతను. ఉత్తమ్ ఆ ఫోటోను తన పేపర్లో వేసి ఓనర్లు ఎవరో తెలియడం లేదు అని రాశాడు. దానిపై ఎవరో కేసు వేశారు. చివరకు హై కోర్టు దాన్ని స్వాధీనం చేసుకుని కోర్టు రికార్డు రూముగా మార్చింది. ఆ తీర్పు వినగానే కొందరు పశు సంవర్ధక శాఖ అధికారులు కోర్టుకి వచ్చి '81 మంది సభ్యులున్న హౌసింగ్ కోపరేటివ్ ఏర్పరచుకుని మేం కట్టుకున్నాం" అని అఫడవిట్ దాఖలు చేశారు. ఆ 81 మంది ఎవరయ్యా అంటే ఆ శాఖ అధికారులు లేదా దాణా సప్లయిర్లు!

ఇవన్నీ బయటకు రావడంతో సిబిఐ చేత విచారణ చేయించాలని కోరుతూ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. కలకత్తాలో ఏసియన్ ఏజ్‌లో పని చేస్తున్న రవి ఝా అనే జర్నలిస్టు బిహార్ ముఖ్యమంత్రికి కూడా హస్తం వుందని ఆరోపిస్తూ వ్యాసాలు రాశాడు. ఇలా తన ఆస్తులపై ప్రజల దృష్టి పడేట్టు చేస్తున్న టైమ్స్ ఆఫ్ ఇండియాను కట్టడి చేయాలని లాలూ భావించాడు. 'రేపు ఉదయం 9 గంటలకు ఓ సారి కలవండి' అని ఉత్తమ్‌కు లాలూ ఫోన్ చేశాడు. చాలా ఆలస్యంగా నిద్ర లేచే అంత పొద్దున్నే రమ్మనడం ఏమిటా అనుకుంటూ ఉత్తమ్ వెళ్లాడు. అక్కడ విజిలెన్స్ బ్యూరో చీఫ్ డిపి ఓఝా, బిహార్ లెజిస్లేటివ్ కౌన్సిల్ చైర్మన్ జబీర్ హుస్సేన్ కూడా వున్నారు. "మీ పత్రిక బిజెపికి బాకా పత్రికలా పనిచేస్తోంది. వాళ్ల ఆరోపణలు వేస్తున్నారు కానీ మా వివరణలు వేయడం లేదు" అని లాలూ నిందించాడు. 'అలాటి సందర్భం ఒక్కటైనా చూపించండి' అని ఉత్తమ్ సవాలు చేశాడు. మిగతా యిద్దరు అసలు విషయానికి వస్తే మంచిది కదా అని లాలూకి సూచించారు. లాలూ ఓఝాకు సైగ చేయగా, ఓఝా తన ఫైల్లోంచి ఒక డాక్యుమెంటు తీసి ఉత్తమ్‌కు యిచ్చాడు. "దాణా కుంభకోణం గురించిన అసలు వాస్తవం యిది. దీన్ని మీరు ప్రచురించగలరా?' అని లాలూ వెక్కిరించాడు. పబ్లిక్ ఎక్కవుంట్స్ కమిటీ చైర్మన్ ముఖ్యమంత్రికి ఆ కుంభకోణం గురించి రాసిన ఉత్తరం అది. "మేము యిప్పటికే దానిపై విచారణ జరుపుతున్నాం కాబట్టి ప్రభుత్వపరంగా మీరు ఎలాటి విచారణ చేపట్టవద్దు" అని అతను కోరాడు. ముఖ్యమంత్రి దానిపై సంతకం చేసి పోలీసు డైరక్టర్ జనరల్‌కు పంపించాడు.

ఉత్తమ్ ఇది చదివి "తప్పకుండా ప్రచురిస్తాను, కానీ ఒక్క విషయం. ఇది 1993లో రాసిన ఉత్తరం. అంటే అప్పటికే దీని గురించి మీకు తెలుసని రుజువౌతోంది." అన్నాడు. ఆ విషయం వాళ్లెవరికీ తట్టలేదు. "ఇప్పుడు మీరు నైతిక బాధ్యత వహించి రాజీనామా చేసి, మీరే సిబిఐ విచారణ చేయాలని డిమాండ్ చేస్తే ప్రజలు పొంగిపోతారు. ఇప్పటి కంటె భారీ మెజారిటీతో గెలిపించి ప్రధానమంత్రిని చేస్తారు." అన్నాడు ఉత్తమ్ నవ్వుతూ. "సిబిఐకు అప్పగిస్తే ఎన్నికల తర్వాత పివి నరసింహారావు అది చూపించి నన్ను బ్లాక్‌మెయిల్ చేస్తాడు. నాకెందుకు ఆ తలకాయనొప్పి?" అన్నాడు లాలూ. ఇది జరిగిన కొద్ది వారాలకే బిహార్ హై కోర్టు సిబిఐకు కేసు అప్పగించాలని ఆదేశించింది. నాలుగు వారాల్లో విచారణ ముగించాలంది.

ఉత్తమ్ ఒక నెల్లాళ్లు లీవుపై వెళ్లి వచ్చాక చూస్తే దాణా కుంభకోణం గురించి అన్ని పత్రికలూ రాయడం మానుకున్నాయి. ఎందుకంటే సిబిఐ అధికారులు తమ విచారణపై రిపోర్టులు సీల్టు కవర్లో చీఫ్ జస్టిస్ డి పి వాధ్వాకు యిస్తున్నారు. ఉత్తమ్ వాధ్వా వద్దకు వెళ్లి 'ప్రజలకు సమాచారం చేరకుండా చేస్తే ఎలా? మీరు ప్రెస్‌కు బ్రీఫింగ్స్ యివ్వాలి కదా' అని అడిగాడు. 'ఏ చట్టం కింద అలా యిచ్చే సావకాశం వుంది?' అని ఆయన అడిగాడు. తమ విచారణ సవ్యంగా సాగకుండా బిహార్ అధికారులు, ప్రజాప్రతినిధులు అడ్డుపడుతున్నారని, అడిగిన దస్తావేజులు యివ్వడం లేదని సిబిఐ కోర్టుకి విన్నవించింది. సిబిఐ కోర్టుకి తప్పుడు సమాచారం యిస్తోందంటూ బిహార్ ఎమ్ఎల్‌సిలు సిబిఐ అధికారులపై ప్రివిలేజ్ మోషన్ పెడతామని బెదిరించారు. సిబిఐ అధికారులు క్షమాపణ చెప్పి బయటపడ్డారు. విచారణకు కేటాయించిన సమయాన్ని పెంచాలని కోర్టుని కోరారు. అప్పుడు వాధ్వా డివిజన్ బెంచ్ ఏర్పాటు చేసి సిబిఐను తన వాదనలు చెప్పుకోమన్నాడు. ఆ విధంగా సిబిఐ విచారణ ఏ దశకు చేరిందో తెలుసుకునే వీలు కలిగింది. సహజంగానే యిది లాలూకి నచ్చలేదు.

1996 ఎన్నికల తర్వాత పివి నరసింహారావు ప్రభుత్వం పడిపోయి లాలూ మద్దతుతో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడింది. దేవెగౌడ ప్రధాని అయ్యాడు. ఇక కేంద్రం, సిబిఐ లాలూకు అనుకూలంగా వ్యవహరించ సాగాయి. బిహార్ పశుసంవర్ధక శాఖ ఉద్యోగులకు బాగా సన్నిహితుడు, సిబిఐ రాంచీ ఆఫీసులో డిఐజిగా పని చేసే ఒక వ్యక్తి జస్టిస్ వాధ్వాను కలిసి "సుప్రీం కోర్టుకి మిమ్మల్ని ప్రమోట్ చేద్దామని చూస్తున్నారు. దానికి ఇంటెలిజెన్సు బ్యూరో క్లియరెన్సు యివ్వాలి. దానిలో కాస్త యిబ్బంది వుంది. మీరు

కాస్త సఖ్యంగా వుంటే దాని సంగతి నేను చూసుకుంటాను." అన్నాడు. హైకోర్టు ఎపాయింట్‌మెంట్స్‌కు ఐబీ క్లియరెన్సు కావాలి తప్ప సుప్రీం కోర్టు ఎపాయింట్‌మెంట్స్‌కు అక్కరలేదు. ఆ విషయం తెలిసిన వాధ్వా నవ్వి వూరుకున్నాడు. కొన్ని నెలల తర్వాత ఆయనకు ప్రమోషన్ వచ్చింది. వెళ్లబోయేముందు ఉత్తమ్‌ను పిలిచి యీ సంగతి చెప్పి "ఈ విచారణ వలన ఏదో బయటపడుతుందని ఆశ పెట్టుకోకండి. కొందరు సుప్రీం కోర్టు జడ్జిల యిళ్లల్లో లాలూ బ్లూ లేబుల్ స్కాచ్ తీసుకుంటూ వుండగా చూశాను. వ్యవస్థను ఎలా వుపయోగించుకోవాలో అతనికి బాగా తెలుసు." అని హెచ్చరించాడు.

మామూలు పరిస్థితుల్లో అయితే వాధ్వా చెప్పినట్లే సిబిఐ విచారణ సాగేది కానీ సిబిఐ జాయింట్ డైరక్టరుగా కలకత్తాలో అప్పుడు ఉపేన్ బిశ్వాస్ వుండడంతో కథ మారిపోయింది. బిసిలకు రాజకీయ ప్రాధాన్యత తెచ్చినందుకు అతను లాలూను చాలా మెచ్చుకునేవాడు. హై కోర్టు అతన్ని పిలిచి 'సిబిఐ విచారణ సరిగ్గా జరగటం లేదు. మీరు దాన్ని సరిగ్గా పర్యవేక్షించటం లేదు' అని బాగా తిట్టిన కొద్ది రోజులకే ఉత్తమ్ అతన్ని కలిశాడు. సిబిఐ అధికారులకు, పోలీసు అధికారులకు కోర్టు తమను తిట్టడంతో మంట పుట్టింది. తమ వద్ద వున్న సమాచారాన్ని బయటపెట్టకుండా సిబిఐ ఉన్నతాధికారులు ఒత్తిడి ఒక పక్క, కోర్టు చివాట్లు మరో పక్క. దానితో వాళ్లు ఉత్తమ్‌ను కలిసి తమ వద్ద వున్న సమాచారమంతా అందచేసి 'వీటిని మీ పత్రికలో వేయండి. బిశ్వాస్ పరువు కాపాడండి.' అని అడిగారు. ఉత్తమ్ అవన్నీ తన పత్రికలో వేసి కోర్టు బిశ్వాస్‌ను నిందించడాన్ని విమర్శించింది. దానిపై కోర్టు తన ఆర్డరును మార్చింది. ఇది బిశ్వాస్‌కు చాలా ఆనందం కలిగించింది. పట్నా వచ్చినపుడు ఉత్తమ్‌ను ప్రత్యేకంగా పిలిపించి అభినందించాడు.

కొన్ని వారాల తర్వాత ఉత్తమ్ రాంచీకి వెళ్లినపుడు ఒక స్నేహితుణ్ని కలిశాడు. అతను ఇండియన్ ఎయిర్‌లైన్సులో పని చేస్తాడు. అవీ యివీ చెపుతూ "నీలాటి రెసిడెంట్ ఎడిటర్లు ఎప్పుడో కానీ విమానంలో వెళ్లరు. కానీ మా వూళ్లో సాధారణ రిపోర్టరు కూడా నీకంటె ఎక్కువగా విమానాల్లో తిరుగుతారు." అని జోక్ చేశాడు. అదేమిటి అంటే కన్నుగీటి "పశుసంవర్ధకం కదా" అని నవ్వాడు. సరిగ్గా చెప్పు అంటే అప్పుడు అతను చెప్పుకొచ్చాడు – "ఆ డిపార్టుమెంటులో పనిచేసే అతనే తన భార్య పేర ఓ ట్రావెల్ ఏజన్సీ నడుపుతాడు. తన శాఖలో పని చేసే స్టాఫ్ టిక్కెట్లే కాదు, స్థానిక పత్రికా విలేకరులకు, యితర ప్రభుత్వాధికారులకు, రాంచీలో చదువుతున్న ముఖ్యమంత్రి పిల్లలకు – అందరికీ ఆ ఏజన్సీయే టిక్కెట్లు కొంటుంది. అంతా నగదు వ్యవహారమే!"

స్నేహితుడితో కబుర్లు అయిపోయి ఆఫీసు చేరగానే ఉత్తమ్ రాంచీ నుండే పట్నా ఆఫీసులో కొలీగ్‌కి ఫోన్ చేసి 'పట్నాలో క్యాంప్ చేస్తున్న బిశ్వాస్‌కు యీ ట్రావెల్ ఏజన్సీ సంగతి తెలియపరచు.' అని చెప్పాడు. రాత్రి 9 గంటలకు బిశ్వాస్‌నుండి ఉత్తమ్‌కు ఫోన్ వచ్చింది. "విషయం సరిగ్గా అర్థం కాలేదు. వివరంగా చెప్పు." అని. ఉత్తమ్ అంతా చెప్పాక "థాంక్యూ" అని ఫోన్ పెట్టేశాడు బిశ్వాస్. మర్నాటికల్లా రాంచీలోని ట్రావెల్ ఏజన్సీపై ఇన్‌కమ్ టాక్స్ దాడి జరిగింది. అతని నుండి అనేక విషయాలు బయటపడ్డాయి. సిబిఐ విచారణ జోరందుకుంది.

ఇంతలో దేవెగౌడ దిగిపోయి ఐకె గుజ్రాల్ ప్రధాని అయ్యాడు. అతనూ లాలూ మద్దతుపై ఆధారపడినవాడే. అతని ఆధ్వర్యంలోని సిబిఐ లాలూను అరెస్టు చేయకుండా అతనిపై విచారణ జరపడానికి గవర్నరు అనుమతి కోరింది. అనుమతి అవసరం లేదు కదా, ఎందుకడిగారు అని సిబిఐను హై కోర్టు నిలదీసింది. 'ముందుజాగ్రత్తగా...' అని సిబిఐ నసిగింది. 'ఈ పేరు చెప్పి ఆలస్యం చేస్తే మేమే అరెస్టుకి ఆదేశించాల్సి వస్తుంది' అని హై కోర్టు హెచ్చరించింది.

1997 మేలో బిశ్వాస్ పట్నా ఆఫీసుకి ఉత్తమ్ వెళ్లాడు. బిశ్వాస్ లోపల మీటింగులో వున్నాడు. బయట అతని పర్సనల్ అసిస్టెంటు ముఖ్యమైన కాగితాలను జిరాక్స్ తీసుకుంటున్నాడు. తన బాస్‌కు, ఉత్తమ్‌కు స్నేహం వుందని తెలుసు కాబట్టి ఆ అసిస్టెంటు 'సార్ వచ్చేదాకా యీ మ్యాగజైన్ చూస్తూండండి సార్' అంటూ కూర్చోబెట్టాడు. ఉత్తమ్ అక్కడే కూర్చుని ఆ కాగితాల కేసి చూస్తూ వున్నాడు. అవేమిటో తెలుసుకోవాలన్న కుతూహలం వున్నా సభ్యత కాదని వాటిని చేతిలోకి తీసుకోలేదు. ఇంతలో అసిస్టెంటుని లోపలికి పిలిచారు. అతను అలా వెళ్లగా చూసి యితను చటుక్కున ఓ కాపీని జేబులోకి దోపేశాడు. బిశ్వాస్‌తో మాట్లాడి తన ఆఫీసుకి వచ్చాక చూస్తే విచారణ సందర్భంగా ఐటీ ఆఫీసర్లు ఆ ట్రావెల్ ఏజన్సీ వాడి నుండి రాబట్టిన సమాచారం వుంది. వెంటనే మర్నాడే దాన్ని తన పత్రికలో వేసేశాడు. ఇంకేముంది, అంతా అల్లకల్లోలం! కాస్సేపటికే బిశ్వాస్ నుండి ఫోన్. "నీకు ఆ కాపీ ఎలా వచ్చింది? నేను యిచ్చి వుంటానని వీళ్లంతా నింద వేస్తున్నారు" అని. "నువ్వు యివ్వలేదు కదా. నా కెవరు యిచ్చారో చెప్పడం నా వృత్తిధర్మానికి విరుద్ధం. అలా చెప్పడం మొదలుపెడితే నీకు ట్రావెల్ ఏజన్సీ సమాచారం కూడా యివ్వగలిగేవాణ్ని కాను." అన్నాడు ఉత్తమ్.

ఇలాటి వార్తలు ప్రచురించడం వలన ఉత్తమ్‌కు, లాలూకి బాగా చెడిపోయింది. 'ఇంగ్లీషు పత్రికలు, ముఖ్యంగా టైమ్స్ ఆఫ్ ఇండియా అబద్ధాలు ప్రచారం చేస్తోంది.' అంటూ లాలూ ఉపన్యాసాలు దంచేవాడు. అతని అనుచరులు పెద్ద నిరసన ప్రదర్శన చేపట్టిన సందర్భంగా టైమ్స్‌పై దాడి చేస్తారని బెదిరింపులు కూడా వచ్చాయి. "మీ పత్రిక ఆఫీసు యివాళ్టికి మూసుకుంటే మంచిది. అల్లరిమూకలు దాడి చేస్తే మేమేమీ చేయలేం" అంటూ డిజిపి ఉత్తమ్‌కు ఫోన్ చేశాడు. వెంటనే ఉత్తమ్ తన హెడాఫీసుకి ఫోన్ చేసి కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు చేయించాడు. గవర్నరుకు కూడా చెప్పాడు. అదే రాత్రి లాలూ నుండి ఫోన్ వచ్చింది. "ఫర్‌గెట్ అండ్ ఫర్‌గివ్' అంటూ!

చివరకు లాలూను అరెస్టు చేయడానికి జూన్ 17 న గవర్నరు అనుమతి యిచ్చాడు. లాలూ ముందస్తు బెయిల్ కోసం అప్లయి చేయడంతో సిబిఐ లాలూ యింటిపై, అతని బంధువుల యింటిపై దాడి కొన్ని దస్తావేజులు స్వాధీనం చేసుకుంది. చివరకు జూన్ 23

న సిబిఐ చార్జిషీటు ఫైల్ చేసి జులై 30 న అరెస్టు చేశారు. ఈ లోపున లాలూ జనతా దళ్ నుండి బయటకు వచ్చేసి సొంతంగా రాష్ట్రీయ జనతాదళ్ పేర సొంత పార్టీ పెట్టేశాడు. తను రాజీనామా చేసి తన స్థానంలో తన భార్య రబ్డీ దేవిని కూర్చోబెట్టాడు.

అరెస్టు కావడానికి కొన్ని రోజుల ముందు లాలూ ఉత్తమ్‌ను పిడబ్ల్యుడి గెస్ట్‌హౌస్‌కు ఒంటరిగా పిలిపించాడు. అతనూ ఒంటరిగానే వున్నాడు. ''నువ్వూ, బిశ్వాస్ స్నేహితులని నాకు తెలుసు. నా సంగతి అతన్ని చూసుకోమను. అతని సంగతి నేను చూసుకుంటాను. సిబిఐ హెడ్‌క్వార్టర్స్‌లో అతనిపై ఫిర్యాదులు వున్నాయి. అవి యిబ్బంది పెట్టకుండా చూసే బాధ్యత నాది.'' అన్నాడు లాలూ.

''మాకు స్నేహం ఏమీ లేదు. ఏదైనా సందర్భం వస్తే మీరు చెప్పిన సంగతి చెప్తాను. అంతకంటె నానుండి ఏదీ ఆశించకండి.'' అని చెప్పి ఉత్తమ్ వచ్చేశాడు.

ఇది జరిగిన కొన్ని రోజులకు బిశ్వాస్ చార్జిషీటు ఫైల్ చేయబోతూ దాని ముసాయిదా చూపించడానికి ఉత్తమ్‌ను పిలిచాడు. 'చదివి ఎలా వుందో చెప్పు' అంటూండగానే సిబిఐ డైరక్టర్ జోగీందర్ సింగ్ నుండి ఫోన్ వచ్చింది. ఉత్తమ్ లేచి వెళ్లిపోబోయాడు. 'ఫరవాలేదు, కూర్చో' అంటూ బిశ్వాస్ ఫోన్ తీసుకున్నాడు. ఆ తర్వాత 'నో సర్, సారీ సర్, ఐ కాన్ట్ డూ దిస్ సర్...' అంటూనే వున్నాడు. ఫోన్ పెట్టేశాక అసలు విషయం తెలిసింది. అప్పుడు బిశ్వాస్‌కు అసిస్టెంటుగా, ప్రస్తుతం సిబిఐ డైరక్టరుగా వున్న రంజిత్ సిన్హా చేత జోగీందర్ సింగ్ వేరే రిపోర్టు తయారు చేయించాడు. దాన్నే అఫీషియల్ సిబిఐ రిపోర్టుగా కోర్టుకి సబ్మిట్ చేయాలని జోగీందర్ బిశ్వాస్‌ను ఒత్తిడి చేస్తున్నాడు.

అనుకోకుండా తెలిసిన యీ సమాచారాన్ని ఎలా వినియోగించుకోవాలో ఉత్తమ్‌కు తోచలేదు. ఉన్నదున్నట్లు వేస్తే బిశ్వాస్, జోగీందర్ యిద్దరూ ఖండిస్తారు. రెండు రిపోర్టుల్లో వున్న వ్యత్యాసం ఏమిటో కూడా తెలియదు. ఉత్తమ్ తన టీముతో దీని గురించి చర్చించాడు. ''జడ్జిలకు యీ సమాచారం చేరవేస్తే చాలు..'' అన్నాడు ఒకతను. ''ఎలా?'' అడిగాడు ఉత్తమ్.

''ఒక పెద్దాయన యింట్లో యివాళ పెళ్లి వేడుకలు జరుగుతున్నాయి. అక్కడకు వాళ్లు వస్తారు.'' ''రైఠో''!

తర్వాతి వాయిదాలో కోర్టువారు బిశ్వాస్‌ను ఉద్దేశించి జడ్జిలు అడిగారు ''మీ పాత రిపోర్టులకు, యిప్పుడు సబ్మిట్ చేసిన కొత్త రిపోర్టుకు చాలా భేదం వుంది. ఎందుకలా? అసలు యిది మీరు తయారుచేసినదేనా?'' అని. బిశ్వాస్ నిలబడి ''ఇది నా రిపోర్టు కాదు, లార్డ్‌షిప్'' అన్నాడు. అంతే, కోర్టు జోగీందర్ సింగ్‌కు మొట్టికాయలు వేసింది. ఐకె గుజ్రాల్ ప్రభుత్వం అతన్ని సిబిఐనుండి తప్పించి హెూం మినిస్ట్రీలో స్పెషల్ సెక్రటరీగా వేసింది. గుజ్రాలే విచారణ సాగకుండా ఆగకుండా అడ్డుకున్నాడంటూ జోగీందర్ తర్వాతి రోజుల్లో ఆరోపించాడు. కానీ అప్పటి రోజుల్లోనే బిశ్వాస్‌ను కూడా బదిలీ చేద్దామని ప్రభుత్వం చూసింది. అటువంటిది ఏదైనా చేస్తే బదిలీ ఆపేస్తాం అంటూ హై కోర్టు వార్నింగ్ యిచ్చింది.

చాలా కేసుల్లో సిబిఐ విచారణ కొంతకాలం త్వరగా, కొంతకాలం మందకొడిగా సాగుతుంది. కొన్ని కేసుల్లో స్టాఫ్ లేరంటూ విచారణే మొదలుపెట్టదు. మరికొన్ని వాటిల్లో మధ్యలో చేతులెత్తేస్తుంది. ప్రతీ చర్యకు వెనకాల అనేక శక్తులు పనిచేస్తూంటాయని యీ కథనం వలన రుజువౌతోంది. 1993 నాటి కథ 20 ఏళ్ల తర్వాత యిప్పుడు బయటపడింది. ఈనాటి కేసులు బయటపడాలంటే రెండు, మూడు దశాబ్దాలు పడతాయేమో! ఇప్పటికైనా యిది బయటపెట్టినందుకు ఉత్తమ్ సేన్‌గుప్తాకు, ధైర్యంగా దాన్ని ప్రచురించిన ''ఔట్‌లుక్''కు మనం ఋణపడాలి. ఇంతకీ ఉపేన్ బిశ్వాస్ యిప్పుడు ఎక్కడున్నారు? ఆయన ఎడిషనల్ డైరక్టరుగా ప్రమోషన్ పొంది రిటైర్ అయ్యాక, తృణమూల్ పార్టీలో చేరి బాక్‌వర్డ్ క్లాసెస్ వెల్‌ఫేర్ మినిస్టర్‌గా మమతా బెనర్జీ మంత్రివర్గంలో వున్నారు. ప్రచారం జోలికి వెళ్లకుండా సమర్థవంతంగా తన శాఖ నిర్వహిస్తారు. లాలూ జైలుకి వెళ్లినందుకు ఆనందమేనా అని స్నేహితులు అడిగితే ''నా విధి నేను నిర్వర్తించాను. రిటైరయ్యాక బిహార్ వెళ్లలేదు, లాలూ కేసు ఎంతవరకు వచ్చిందో కనుక్కోనూ లేదు.'' అని ఊరుకున్నాడు.
**(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2013)**

**అక్టోబరు 27 ఎమ్బీయస్ : సన్నికల్లు దాచేస్తా....**

వెనకటికి ఓ కుర్రాడు వుండేవాడు. మేనమామ తన కూతుర్ని యిస్తాడన్న ధీమాతో వేరే ఏ పురుషప్రయత్నమూ చేయకుండా కూర్చున్నాడు. వీడికి పిల్ల నివ్వకపోయినా ఏం ఫర్వాలేదు, నోర్మూసుకుంటాడు అనుకున్న మేనమామ తన కూతురికి యింకో వరుణ్ని తీసుకుని వచ్చాడు. అప్పుడు రగిలింది మనవాడికి. 'ఈ పెళ్లి ఆపకపోతే నా పేరు మార్చుకుంటా' అని శపథం పట్టాడు. కానీ పెళ్లి ఏర్పాట్లు దిగ్విజయంగా సాగిపోతున్నాయి. మనవాడిలో కదలిక కనబడలేదు. వీడు పెళ్లి ఎలా ఆపుతాడా అని స్నేహితులందరూ ఉగ్గబట్టుకుని చూస్తున్నారు. పెళ్లివారు ఊళ్లోకి దిగారు, విడిదిలో బస చేశారు. స్నేహితులు వెళ్లి మన హీరోని అడిగారు – 'ఈ పరిస్థితిలో పెళ్లి ఎలా ఆపుతావురా?' అని. వాడు నవ్వాడు – 'ఎలా ఆపుతానో మీరు చూస్తూ వుండండి. నా దగ్గర బ్రహ్మాస్త్రం వుంది.' అని. గుట్టు విప్పమని వాళ్లు బతిమాలితే చెప్పాడు – ''పెళ్లిలో పెళ్లికూతురు సన్నికల్లు (రాయి) తొక్కాలిగా. అది దాచేశా. తొక్కందే పెళ్లి అయినట్టు కాదు కదా...'' అని. ఆ కుర్రాడి పేరేమిటంటారా? రాజగోపాల్, వెంకటేశ్, అశోక్‌బాబు, కేశవ్.. ఏదైనా కావచ్చు.

సీమాంధ్ర ఛాంపియన్లు యిన్నాళ్లూ పడి నిద్రపోయారు. తాము నిద్రపోవడమే కాకుండా, తమ ప్రజలను జోకొట్టారు – మేం చూసుకుంటాం అంటూ. వాళ్లు చెప్పిన ఒక్కొక్కమాట బూటకం అని తేలిపోతున్న కొద్దీ వాళ్లు మరో మారువేషం వేసుకుని వచ్చి

నాటకం ఆడాల్సి వస్తోంది. తెలంగాణ ప్రతిపాదనే లేదన్నారు, దిగ్విజయ్ విభజనకు వ్యతిరేకి అన్నారు, జులై 30 తర్వాత 2014లోపున వచ్చే ప్రశ్నే లేదన్నారు, ఆంటోనీ యిక్కడికి వచ్చినపుడు భరతం పడదామన్నారు... యిలా అడుగడుగునా ఏదో ఒకటి చెప్పి పబ్బం గడుపుకుని వచ్చారు. అవతల మారువేషాలు అయిపోతున్నాయి. ఎప్పటికో అప్పటికి నిజరూపం బయటపడక తప్పదు. అది తెలిసి కూడా వీళ్లు తమ శక్తి కొలదీ నటించేస్తున్నారు. కానీ హై కమాండ్ ఎలాటి మొహమాటాలు పెట్టుకోవడం లేదు. గతంలో టి-లీడర్లు తమ పేరు నియోగించుకుని ఏదైనా మాట్లాడితే అధిష్టానంవారు ఖండించకుండా ఊరుకునేవారు. 'మేం పెద్దలకు అన్నీ వివరించాం, వాళ్లు సానుభూతితో విన్నారు, తెలంగాణ ఏర్పాటు చారిత్రక ఆవశ్యకత అన్నారు. ఇక వచ్చేస్తుంది' అని చెప్పుకుంటూ జనం మధ్య తిరిగే అవకాశం టి-లీడర్లకి కల్పించారు. ఇప్పుడు సీమాంధ్ర వాళ్లంటే ఢిల్లీ వాళ్లకు బాగా లోకువగా వుంది. జనం తిట్లు, చివాట్లు, రాళ్లదెబ్బలు భరించలేక సీమాంధ్ర కాంగ్రెసు నాయకులు ఏదో ఒకటి చెప్తే వెంటనే ఢిల్లీ నాయకులు ఖండించి పడేస్తున్నారు. అసెంబ్లీకి రెండు సార్లు వస్తుంది అని కిరణ్ అంటే – కాదు ఒక్కసారే అని షిండే అంటారు, హైదరాబాదు యుటీని చేసే ఆలోచన వుందని దిగ్విజయ్ అన్నారు అని జెడి శీలం అంటే – అంతా వట్టి అబద్ధం అని దిగ్గీ అంటారు. 'త్రోయింగ్ క్రిస్టియన్స్ టు లయన్స్' అంటే ఏమిటో ప్రత్యక్షంగా చూస్తున్నాం. కాంగ్రెసు వాళ్లను సీమాంధ్రులు తరిమితరిమి కొట్టేట్లా చేస్తున్నది ఢిల్లీ కాంగ్రెసు వారే.

'సీతారామస్వామీ నే చేసిన నేరంబదియేమి?' అని రామదాసు నిలదీసి విలపిస్తే సీమాంధ్ర కాంగ్రెసు నాయకులూ సోనియాను నిలదీయలేక విలపిస్తున్నారు. రామభక్తుడనంటూనే రామదాసు రాముణ్ని కడిగి పారేశాడు. నీకు హారాలు చేయించడమేనా నేను చేసిన నేరం? ఎవడబ్బ సొమ్మని కులుకుతూ తిరిగేవు? ఇవన్నీ నీ బాబు చేయించాడా? నీ జనకమామ చేయించేడా? అని నిలదీశాడు. 'నువ్వు యీ రోజు ఢిల్లీలో గద్దె ఎక్కావంటే, యిన్ని స్కాములు చేయగలిగావంటే మా తెలుగువాళ్లం యిచ్చిన 33 సీట్లే కదా' అని అడగాలని మన కాంగ్రెసు వాళ్లకూ వుండి వుంటుంది. కానీ అడగలేరు, ఏమంటే ఎందులో యిరికిస్తారోనని భయం. జగన్ ఉదాహరణ ప్రత్యక్షంగా కనబడుతోంది. 'కాంగ్రెసులో వుండి వుంటే సిఎం అయివుండేవాడు, తిరగబడి చెడిపోయాడు' అని ఆజాద్ అనేశాడు కదా. వీళ్ల నిస్సహాయత మనకు అర్థం అవుతోంది కాబట్టి సరేలే అని సరిపెట్టుకుంటాం. కానీ వాళ్లు అంతటితో ఆగకుండా ఏదో పొడిచేస్తాం అంటేనే మండుతుంది. ఇప్పటిదాకా ఏం పొడిచారు? ఆ గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ వ్యవహారం ఏమిటని గట్టిగా అడగ్గలిగారా?

పదిమంది అన్నారా, ముఖ్యమైన శాఖల వాళ్లందరినీ తీసి పారేసి, ఆరుగురితో టీము కూర్చి ఆరోవేలులా పిఎంఓలో సహాయమంత్రిని ఆహ్వానితుడిగా చేర్చారు. పది రోజుల కోసారి కలుస్తున్నారు. ముచ్చటగా మూడు మీటింగుల్లో తేల్చి పారేస్తారట. అందరూ యిప్పటిదాకా కలిసి కూర్చున్నది లేదు. ఆంటోనీని కాకపోయినా, జిఓఎమ్‌నైనా రాష్ట్రానికి రప్పిస్తాం అని మన నాయకులు బీరాలు పలికారు. ఏడిశారు, వాళ్లెవరు చెప్పడానికి? ఈ మెయిల్ చాలు మీ మొహానికి అన్నారు షిండే. కృష్ణ కమిటీకి లేఖ రాసినట్టు దీనికీ రాస్తారా అని కొందరు నన్ను అడుగుతున్నారు. జస్టిస్ శ్రీకృష్ణ గారు పెద్దమనిషి. సమాచారం సేకరించి, వివిధవర్గాల అభిప్రాయాలు సేకరించి, పలు పరిష్కారాలు, వాటి అమలులో వున్న చిక్కులు అన్నీ సమగ్రంగా చర్చించిన వారు. రాష్ట్రాన్ని అడ్డంగా విభజించాలన్న మన సలహా తీసుకోకపోవచ్చు. కానీ అలాటివాళ్లకు పంపితే పుణ్యం, పురుషార్థం. వీళ్లేముంది? అంతా తమకే తెలుసన్న అహంభావం వీళ్లది. ఎవరైనా వాదనలు విన్నాక తీర్పు చెప్తారు. వీళ్లు తీర్పు చెప్పి వాదనలు.. వేదనలు చెప్పుకోండి అంటున్నారు. ఉద్యోగికి వాలంటరీ రిటైర్‌మెంట్ ఆప్షన్ యిస్తారు. దంపతులకు విడాకుల ఆప్షన్ యిస్తారు. ఇంతిస్తాం, ఇంతకుమించి యివ్వం అని చెప్పి యిష్టమైతే వుండు, లేకపోతే పో అని చెప్తారు. ఈ కేసులో దొరతనం వారు విడాకులు మంజూరు చేసేశారు – భరణం గిరణం తేల్చకుండానే !

ఇప్పుడు రాబోయే బిల్లులో కూడా యిలాటి వివరాలు ఏమీ వుండవట. గతంలో రాష్ట్రాలు విభజించినప్పుడు కూడా బిల్లులో యిలాటి విషయాలు ఏమీ చెప్పలేదట. ఇప్పుడు దీనిలోనూ ఏమీ వుండదు. ప్రతీ అంశానికీ చివర 'కేంద్ర తగు నిర్ణయం తీసుకుంటుంది' అని వదిలేస్తారట. ఇలా వదిలేస్తే భవిష్యత్తులో ఎవరి కొంప మునుగుతుందో చెప్పలేం. ఈ ప్రభుత్వం ఆయుర్దాయం అతి తక్కువ. దీనికి పునర్జన్మ వుంటుందని ఎవరూ గ్యారంటీ యివ్వలేరు. రాబోయే ప్రభుత్వ స్వభావస్వరూపాలు, ఒత్తిళ్లు ఎవరికీ తెలియవు. ఇప్పటిదాకా సోనియా తెలంగాణపై శీతకన్ను వేసి, జులై నుండే చల్లని చూపు ప్రసరింపచేసింది. సీమాంధ్ర కష్టాల పట్ల కన్ను మూసుకుంది. వచ్చే ప్రభుత్వం కూడా యిలాగే ప్రవర్తిస్తుందన్న నమ్మకం లేదు. అది సీమాంధ్ర ఎంపీల కరుణపై ఆధారపడితే, ఇప్పుడు ఓపెన్‌గా వదిలేసిన అంశాలను తెలంగాణకు వ్యతిరేకంగా మలచవచ్చు. ఉమ్మడి రాజధాని గడువును పదేళ్ల నుంచి పాతికేళ్లు చేయవచ్చు, కొత్త రాజధానికి కావలసిన డబ్బు తెలంగాణ రాష్ట్రమే యివ్వాలనవచ్చు. 'ఏమిటండీ, బొత్తిగా జోకులేస్తున్నారు, అంత తలతిక్కగా ఎవరైనా చెప్తారా?' అనవద్దు. ఇప్పుడు జరుగుతున్నది తలతిక్క వ్యవహారమే కదా. సంబంధిత అంశాల నిపుణులను కూర్చోబెట్టి ఒక విధానం ఏర్పరచుకుని, యిరుప్రాంతాల నాయకులను దానికి ఒప్పించే ప్రయత్నం జరుగుతోందా? నవంబరు 7 నాటికి సమాచారం తెప్పించుకుంటారట. సమాచారాన్ని ఏముంది, కృష్ణగారే బోల్డు పోగేసి పెట్టారు. పరిష్కారం మాట చెప్పండి మహాప్రభో. ఒక్కో సమస్యకు పరిష్కారం తేలేటప్పటికి నెలలు పడతాయి.

ఈ జిఓఎమ్‌లో వున్నవాళ్లందరూ షష్టిపూర్తి చేసుకున్నవాళ్లు, రోగిష్టివాళ్లు. ముఖ్యమైన మంత్రిత్వశాఖలు నిర్వహించేవాళ్లు. వీళ్లకు తీరిక, ఓపిక రెండూ లేవు. 'న్యాయం జరగగానే సరిపోదు, జరిగినట్టు కనబడాలి కూడా' అని సామెత. 'అన్యాయం చేయడమే కాదు,

అన్యాయం జరిగినట్టు కనబడాలి కూడా' అన్నట్టు వీళ్లు ప్రవర్తిస్తున్నారు. 'మేం చేసినా ఈ సీమాంధ్రులు పడి వుంటారు.' అన్న పొగరుమోత్తనం తప్ప వేరే ఏమీ కనబడటం లేదు. రాజ్యాంగం ప్రకారం వుండాల్సిన టైమ్ టేబుల్‌ను కుదించడానికి, కాబినెట్‌లో నోట్‌లో చెప్పిన మంత్రుల సంఖ్య తగ్గించడానికి వీరికెవరిచ్చారు హక్కు? రాష్ట్రవిభజన వంటి ముఖ్యమైన అంశంపై రోజుకొకరు పూటకో మాట మాట్లాడం పద్ధతేనా? హైదరాబాదు పరిస్థితి ఏమిటో స్పష్టంగా చెప్పవలసిన బాధ్యత లేదా? మొన్న సోమవారం దిగ్విజయ్ మాట్లాడుతూ సీమాంధ్ర, తెలంగాణ, హైదరాబాదు వాసులకు (పీపుల్ ఆఫ్ హైదరాబాదు)లకు బెస్ట్ పాజిబుల్ డీల్ యిచ్చే బాధ్యత కాంగ్రెస్‌ది అని చెప్పారు. (ఇది టీవీలో వచ్చింది. ''హిందూ''లో కరక్టుగా రిపోర్టు చేశారు. నేను చూసిన తెలుగు పేపర్లలో రాలేదు). సీమాంధ్ర, తెలంగాణ రెండూ వేర్వేరు ప్రాంతాలని తెలుసు, హైదరాబాదును మూడో ప్రాంతంగా చేర్చడంలో మతలబు ఏమిటి? దిగ్గీగారు నోరుజారారంటే నమ్మగలమా? హైదరాబాదును తెలంగాణలో అంతర్భాగంగా చూడడం లేదా?

'ఇలా తెలుగువాళ్లందరినీ అయోమయానికి గురి చేస్తూ, అందర్నీ బేఖాతరు చేస్తూ ప్రవర్తిస్తున్న ఢిల్లీ నాయకులను మేం ఏమీ చేయలేం. బిల్లు ఆపగలిగితే సోనియానే ఆపాలి. మేం ఏమీ చేతకానివాళ్లం.' అని ఒప్పేసుకుని సీమాంధ్ర నాయకులు మౌనంగా వుంటే కాస్తయినా మర్యాద దక్కుతుంది. కాంగ్రెసు వాళ్లే కాదు, యితర పార్టీల వాళ్లు కూడా! ఎందుకంటే కాంగ్రెసువాళ్లు అధిష్టానం మాట శిరోధార్యం అంటూ వచ్చారు. ఇక టిడిపి, వైకాపావారు 'మాకు అభ్యంతరం లేదు, బంతి మీ కోర్టులోనే వుందంటూ' ఉత్తరాలు యిచ్చారు. సమన్యాయం అనే బ్రహ్మపదార్థం ఏమిటో యిప్పటికీ చెప్పటం లేదు. మా కోర్టులో వున్న బంతిని యిష్టం వచ్చినట్టు ఆడుకుంటాం. ఈ షరతులు అప్పుడే ఎందుకు చెప్పాల్సింది అని కేంద్రం అంటే వీళ్లు నోళ్లు వెళ్లబెట్టాలి. వీళ్ల చేతకానితనం బయటపడ్డాక కూడా 'అసెంబ్లీలో ఓడిస్తాం, కోర్టుకి వెళ్లి ఆపేస్తాం, హ్యూమన్ రైట్స్ కమిషన్‌కి వెళతాం, ఐక్యరాజ్యసమితికి వెళతాం... ఏదో మాయ చేసి విభజన ఆపేస్తాం' వంటి కబుర్లు చెపితే సన్నికల్లు దాచేసినవాడి కథలాగానే వుంటుంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2013)**

**అక్టోబరు 28-30 వీక్లీకై** **ఎమ్బీయస్ : న్యూస్, వ్యూస్, రివ్యూస్ – 20**

## జోష్ తగ్గిన మనోహర్

శివసేన స్థాపకుడు బాల థాకరేకు అత్యంత సన్నిహితుడు మనోహర్ జోషీ. 40 ఏళ్లుగా పార్టీలో వున్నాడు. శివసేన తరఫున తొలి ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, లోకసభ స్పీకర్‌గా పని చేశాడు. శివసేన ఆవిర్భవించిన సౌత్ సెంట్రల్ ముంబాయి నియోజకవర్గం నుండి ఎన్నో ఏళ్లుగా ప్రాతినిథ్యం వహిస్తూ వచ్చాడు. అలాటి జోషీ మొన్న అక్టోబరు 13న శివాజీ పార్కులో శివసేన ఏర్పాటు చేసిన దసరా సభలో మాట్లాడబోతే శివసైనికులు అతన్ని తరిమికొట్టారు. సభాప్రాంగణానికి రాగానే అతనికి వ్యతిరేకంగా చాలామంది నినాదాలు యిచ్చారు. వారిని సముదాయించడానికి సీనియర్ లీడరు లీలాధర్ డాకే ప్రయత్నించినా వినిపించుకోలేదు. గత్యంతరం లేక మనోహర్ వెనక్కి వెళ్లిపోయాడు. ఇదంతా శివసేన అధిపతి ఉద్ధవ్, అతని కుమారుడు ఆదిత్య సమక్షంలోనే జరిగింది. వారు తమ పార్టీ కార్యకర్తలను ఆపే ప్రయత్నం చేయలేదు. దీనికి వెనక్కాల వున్న కారణం – మనోహర్ ఎంపీ టిక్కెట్టు ఆశించడం!

మనోహర్ 2012 వరకు రాజ్యసభ సభ్యుడుగా వున్నాడు. ఆ తర్వాత అతనికి మళ్లీ టిక్కెట్టు యివ్వలేదు. ఈ సారి ముంబయి సౌత్ సెంట్రల్ నియోజకవర్గం ద్వారా లోకసభకు వెళదామని అతను ఆశిస్తున్నాడు. అయితే ఉద్ధవ్ 76 ఏళ్ల యీ వృద్ధనాయకుడికి కాకుండా యువకుడైన రాహుల్ షెవాలే అనే శివసేన కార్పోరేటర్‌కు టిక్కెట్టు యిద్దామని చూస్తున్నాడు. 2009 వరకు ఆ సీటు శివసేన నెగ్గుతూనే వచ్చింది. కానీ ఆ ఎన్నికలలో కాంగ్రెసు పక్షాన ఏక్‌నాథ్ గాయిక్‌వాడ్ అనే దళితుడు నెగ్గాడు. శివసేన నుండి విడిగా వెళ్లిన రాజ్ థాకరే శివసేన ఓటర్లను చీల్చడం ఒక కారణం కాగా, ఆ నియోజకవర్గంలో వున్న దళిత ఓటర్లు కాంగ్రెసుకు ఓటేయడం మరో కారణం. అందువలన యీ సారి రాహుల్ని నిలబెడదామని నిశ్చయించుకున్నాడు. అయితే ఆ మాట మనోహర్‌కి స్పష్టంగా చెప్పటం లేదు. రాహుల్‌ను అభ్యర్థిగా చూపుతూ బ్యానర్లు వెలసినపుడు మనోహర్ ఉద్ధవ్‌ని వెళ్లి సూటిగా అడిగాడు. ఉద్ధవ్ ఎటూ చెప్పకుండా పంపించివేశాడు. మనోహర్ కొడుకు బిల్డర్. అతను శివసేన భవనానికి ఎదురుగా కోహినూర్ టవర్ అని పెద్ద భవంతి కడుతున్నాడు. ''మా వాడు కట్టిన టవర్ పూర్తయేసరికి అందరూ శివసేనా భవన్ అంటే కోహినూర్ టవర్‌కు ఎదురుగా వున్నదేనా? అని అడుగుతారు చూడండి.'' అంటూ మనోహర్ గొప్పలు చెప్పుకున్నాడు. అది విని ఉద్ధవ్ మండిపడ్డాడు. శివసేన వలననే యింతవాడైన మనోహర్ శివసేనను కించపరుస్తున్నాడని, యిక అతనికి బ్రేకులు వేయాలని నిశ్చయించుకున్నాడు. తన తండ్రికి విధేయులైన వారిని తప్పించి, తనకు విధేయులైన వారితో పార్టీని నింపాలని అతని ప్లాను.

ఇది గ్రహించిన మనోహర్ దసరా సమయంలో ఓ పాత్రికేయుడికి యింటర్వ్యూ యిస్తూ ''బాల థాకరేకు శివాజీ పార్కులో స్మారకచిహ్నం కడతానంటే ప్రభుత్వం అనుమతి యివ్వలేదు. ఉద్ధవ్ మిన్నకున్నాడు. బాల థాకరేకు యిటువంటిది జరిగి వుంటే, అంటే ఆయన తన తండ్రి ప్రబోధాంకర్ స్మారకచిహ్నం కడదామని అనుకుని దానికి ప్రభుత్వం అడ్డుపడి వుంటే, దెబ్బకు ప్రభుత్వాన్ని కూల్చిపారేసేవాడు. ఇలా చెప్పి ఉద్ధవ్‌ను తప్పుపడుతున్నానని అనుకోవద్దు. ఒక్కోరి వ్యవహారశైలి ఒక్కోలా వుంటుంది. ఉద్ధవ్‌ది

మెతక స్వభావం." అన్నాడు. బాల థాకరే దూకుడుతనానికి అసలైన వారసుడు అతని సోదరుడి కుమారుడైన రాజ్ థాకరేనే అనీ, సొంత కొడుకు ఉద్ధవ్ మందకొడి అని శివసైనికులు భావిస్తున్న యీ తరుణంలో యిలాటి వ్యాఖ్యలకు చాలా ప్రాముఖ్యత వుంది. అందుకనే ఉద్ధవ్ తన కార్యకర్తల చేత మనోహర్‌కు పరాభవం జరిపించాడు. దీని తర్వాత మనోహర్ పార్టీలోంచి బయటకు వెళ్లిపోవచ్చు. ఆ నియోజకవర్గంలో ఎంఎన్ఎస్ తరఫున టిక్కెట్టు యిస్తానని రాజ్ థాకరే అతనికి ఆఫర్ యివ్వవచ్చు కూడా. దసరా నాడే నలుగురు ముఖ్యమైన శివసేన లీడర్లు ఎంఎన్ఎస్‌లోకి దూకారు. ఎవరున్నా, ఎవరు పోయినా శివసేనకు సంబంధించినంత వరకు తన మాటే చెల్లాలన్న పట్టుదలతో వున్నాడు ఉద్ధవ్!

**ఇ.టి. ఆరాధకులు**

ప్రపంచంలో యిప్పటికే చాలామంది దేవుళ్లున్నారు. వీళ్లు చాలనట్టు కొత్త దేవుళ్లను సృష్టిస్తున్నారు, రేలిస్టులు. వీరి దేవుళ్లు – ఇ.టి.లని మనం పిలుచుకునే గ్రహాంతర వాసులు. 1968 ప్రాంతంలో ''ఛారియట్స్ ఆఫ్ గాడ్" అనే పుస్తకం వచ్చింది. ఎరిక్ వాన్ డానికెన్ అనే స్విజర్లండ్ దేశస్తుడు ఒక ప్రతిపాదన చేశాడు. మన పురాణాల్లో అద్భుతాలుగా కనబడే విషయాలు, పురాణపురుషులకు వున్న విశేషశక్తులు – యివన్నీ గ్రహాంతరవాసుల వలననే సంక్రమించాయని అతని వాదన. రోదసిలో నుండి చూస్తే తప్ప కనబడని భూగోళం మ్యాప్, గ్రహాంతర నౌక దిగేందుకు నిర్మింపచేసిన హెలిపాడ్, అప్పటి మానవులకు అందుబాటులో లేని విజ్ఞాన సంపద – యివన్నీ సాక్ష్యాలుగా చూపించి మానవజాతి దేవుళ్లుగా భావిస్తున్నది నిజానికి యితర గ్రహాల నుండి వచ్చిన వారేనని, వారు మనకంటె సాంకేతికంగా, శాస్త్రపరంగా చాలా అభివృద్ధి చెందినవారని అతను ప్రతిపాదించాడు. వారు ఆకాశం నుండి వచ్చారు కాబట్టే దేవుడు ఆకాశంలో వుంటాడని మనం అనుకున్నామని, గంధర్వులు, కిన్నెరలు, కింపురుషులు అనే పేర్లతో పిలిచామని, వారికి భూలోకవాసులతో కలిగిన సంపర్కం వలననే కర్ణుడి వంటివారు సహజకవచకుండలాలతో పుట్టారని.. ఆగ్నేయాస్త్రం వంటివి వాళ్లు భూలోకవాసులకు యిచ్చిన అస్త్రాలనీ, కొన్ని వేల సంవత్సరాల క్రితం జరిగిన యీ అనుబంధం మళ్లీ ఎందుకోగానీ కొనసాగలేదనీ .. – యివన్నీ అతను తన పుస్తకంలో చర్చించి 'నిజం కావచ్చు' అనిపించాడు.

అయితే క్రమేపీ దాన్ని ఒక మతంగా మార్చారు కొందరు మహానుభావులు. దాన్ని రేలిజం అంటున్నారు. ఈ ఉద్యమాన్ని 1973లో నెలకొల్పినది క్లాడ్ ఓరిహాన్ అనే ఫ్రెంచ్ పెద్దమనిషి. అతను ''ఆటో పాప్" అనే ఆటోమొబైల్ మ్యాగజైన్‌ను ఎడిట్ చేసేవాడు. ''ఇంటెలిజెంట్ డిజైన్" అనే పుస్తకంలో ఓరిహాన్ ఇ.టి.లతో తన భేటీల గురించి రాశాడు. ఫ్రాన్సులో ఓ పార్కులో ఒకసారి యావే అనే ఒక నాలుగు అడుగుల ఇ.టి. ఫ్లయింగ్ సాసర్ (ఎగిరే పళ్లాలు అని తెలుగులో అంటున్నారు) నుండి దిగి ఓరిహాన్‌కు సృష్టి ఆవిర్భవించిన క్రమం చెప్పాడట. 'ఎలోహిమ్ అనే దేవుడు మానవజాతిని సృష్టించాడు. మధ్యమధ్యలో తన దూతలుగా మోజెస్, జీసస్, మహమ్మద్ వంటి వారిని ప్రవక్తలుగా పంపాడు. ఈ కాలంలో నిన్ను ఎంచుకున్నాడు. మానవులు తమ సృష్టికర్తతో సంబంధం పెట్టుకోవాలంటే నువ్వు దూతగా వుండు. ఎలోహిమ్ కోసం ఒక ఎంబసీ (రాయబార కార్యాలయం) కట్టు. భక్తులను ఎలోహిమ్‌తో అనుసంధానింప చేయి. 1,44,000 మంది నిజమైన భక్తులు భూమండలంపై ఏర్పడినపుడు ఎలోహిమ్ తన సేనను పంపి మానవజాతికి చిరంజీవిత్వాన్ని ప్రసాదిస్తాడు. ఈ విషయం అందరికీ చెప్పు.' అని ఆ ఇ.టి. ఓరిహాన్‌కు చెప్పాడు. ఇక అప్పణ్నుంచి ఓరిహాన్ తన పేరును 'రేల్' (సందేశం అందించేవాణ్ని హీబ్రూలో రేల్ అంటారు)గా మార్చుకున్నాడు. యూరోప్, ఆఫ్రికా, అమెరికా, ఆసియాలలో వ్యాప్తి చేయసాగాడు. మైకేల్ జాక్సన్, హ్యూ హెఫ్‌నర్ (''ప్లేబోయ్" ప్రచురణకర్త), జూలియన్ అసాంజే వంటి ప్రముఖులు యీ ఉద్యమంలో చేరారు. ఇప్పటికి 98 వేలమంది పోగడ్డారు. వారిలో భారతీయులు 70 మంది వున్నారు. ఇంకో 20 వేల మంది అప్లికేషన్ పెట్టుకున్నారు.

ఈ మతంలో చేరడానికి ఓ రకమైన బాప్టిజం వుంది. చేరదామనుకున్నవారు స్థానికంగా వున్న గురువు దగ్గరకు వెళ్లాలి. గురువు శిష్యుడు చేతిని నీట్లో ముంచమంటాడు. తన కుడిచేతిని శిష్యుడి తల వెనక్కాల, ఎడమచేతిని అతని నుదురుపైన పెడతాడు. ఇతని శరీరం నుండి సంకేతాలు వెలువడి ఎలోహిమ్ యొక్క కంప్యూటర్ మదర్‌బోర్డుకు చేరిపోతుందట(!) 'తనను నిజమైన సృష్టికర్తగా శిష్యుడు నిస్సందేహంగా నమ్ముతున్నాడా లేదా' అని ఎలోహిమ్‌కు తెలిసిపోతుందట. నమ్మకం కుదిరితే గురువు ద్వారా అనుమతి ప్రసాదిస్తాడు. లేకపోతే తిరస్కరిస్తాడు. ప్రపంచంలోని అన్ని జీవరాశుల జెనటిక్ ఇన్ఫర్మేషన్ ఎలోహిమ్ వద్ద భద్రపరచి వుందని రేలిస్టుల నమ్మకం. ఎలోహిమ్ రాయబార కార్యాలయం భూమి మీద కట్టాలి కాబట్టి, దానిలో ఇ.టి.లు దిగేందుకు పెద్ద హెలిపాడ్ కట్టాలి కాబట్టి ఆ ఖర్చు నిమిత్తమై రేలిస్టులు తమ సంపాదనలో 1%ను ఉద్యమానికి విరాళంగా యివ్వాలి. అంతేకాదు, పెళ్లి, పూజాపునస్కారం వంటి జంఝాటాలు వదులుకోవాలి. ఆల్కహాలు, పొగాకు మానేయాలి. వీరిలో ఏకలింగసంపర్కులు ఎక్కువట. టాప్‌లెస్ కార్నివాల్స్, కౌగలింతలు, పైజామా పార్టీలు.. జరుపుతూ తమ మతాన్ని వ్యాప్తి చేస్తూంటారు. ఇండియాలో మాత్రం వీళ్లు గుట్టలపై ధ్యానం చేస్తూ ఎలోహిమ్‌తో టెలిపతీలో సంభాషిస్తూ వుంటారు. భారతీయులందరినీ యీ మార్గంలోకి తీసుకు రావాలనే ప్రయత్నంలో రెండు పుస్తకాలను మరాఠీలోకి అనువాదం చేశారు. ఈ మతంలో చేరినా సందేహాలు వదలని ఒక ప్రొఫెసర్ గారు ''ఎలోహిమ్ దేవుడు అనడం వరకూ బాగానే వుంది. కానీ ఆయన తన దూతలుగా పంపినవారిలో ఒక్క హిందూ దేవుడు కూడా

లేకపోవడం ఏమీ బాగాలేదు" అని పెదవి విరిచాడు.

### రాజస్థాన్ ఎన్నికల రంగం

రాజస్థాన్ ఎన్నికలకు సిద్ధమవుతున్న అశోక్ గెహ్లోట్ మళ్లీ గెలుస్తానన్న ఆశతో వున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం పని చేయదనీ, బిజెపి తనను ఓడించలేదనీ నమ్ముతున్నారు. నమ్ముతూనే ఎందుకైనా మంచిదని యీ మధ్య అనేక ప్రజాకర్షక పథకాలు ప్రవేశపెట్టి వాటికి విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు. కాంగ్రెసును ఎలాగైనా ఓడించాలన్న పట్టుదలతో వున్న బిజెపి అవినీతి ఆరోపణల అస్త్రాన్ని చేపట్టింది. ఇప్పటివరకు అశోక్ పరిపాలన బాగాలేదని చెపుతూ వచ్చారు. బిజెపి ముఖ్యమంత్రి అభ్యర్థి అయిన వసుంధరా రాజె సూరజ్ సంకల్ప్ యాత్ర మొదలుపెట్టి ప్రజల్లో తిరుగుతూ 'రోడ్లు, విద్యుత్ సరఫరా, పారిశ్రామిక ప్రగతి, ఉద్యోగావకాశాలు బాగా లేవని' ప్రచారం చేశారు. వాటికి స్పందన అంత బాగా లేదు. ప్రజాకర్షక పథకాలను విమర్శించినా ప్రజలు హర్షించరు.

ఏం చేయాలా అని ఆలోచిస్తే తను 22 వేల కోట్ల రూ.ల అవినీతికి పాల్పడినట్లు గత ఎన్నికల సమయంలో (2008) కాంగ్రెసు వారు ప్రచారం చేసిన విషయం, ప్రజలు అది నమ్మిన విషయం గుర్తుకు వచ్చింది. ఈ సారి తామూ అదే చేయాలనుకుని మహారాష్ట్ర బిజెపి లీడరు కిరీట్ సోమయ్యాను పిలిచారు. ఆయన అశోక్ గెహ్లాట్ స్కాములు చేశారంటూ, కొంతమంది పారిశ్రామికవేత్తల పట్ల వలపక్షం చూపారంటూ అవినీతి ఆరోపణలతో 100 పేజీల బుక్‌లెట్ వేయించి, దానికి తోడుగా ఒక వీడియో తయారుచేసి యిచ్చాడు. వాటికి కాపీలు తీయించి యీ ప్రచారసామగ్రిని 200 రథాలకు ఎత్తించి రెడీగా పెట్టారు. ఈ రథాలెక్కి బిజెపి వారు గ్రామగ్రామాలూ తిరుగుతారట. పైగా ఎన్‌డిఏ హయాంలో తాము ఎంత బాగా పనిచేశామో కూడా చెప్తారట. 'బ్లాక్ పేపర్' అనే ఈ పుస్తకానికి ప్రతిగా అశోక్ 'రైజింగ్ రాజస్థాన్' పేర తన పాలనలో రాజస్థాన్ ఎలా వెలిగిపోయిందో చెప్తూ మరో పుస్తకం వేయించాడు.

### అజిత్ జోగితో పెట్టుకుంటే బూడిదే

ఛత్తీస్‌గఢ్‌లో అజిత్ జోగిని ఏం చేయాలో కాంగ్రెసుకు తోచడం లేదు. అతను దళితుడు. సత్నామీ కులంలో అతనికి విపరీతమైన పలుకుబడి వుంది. గిరిజనులు, మతం మారిన క్రైస్తవులు అతన్ని గుడ్డిగా నమ్ముతారు. అతను వారి భాషలో మాట్లాడగలడు. ప్రజలకు అందుబాటులో వుంటాడు. పల్లెల నుండి అనేకమంది గిరిజనులు అతని బంగళాకు వచ్చి ఎక్కడ పడితే రోజుల తరబడి అక్కడ బస చేయవచ్చు. బెడ్‌రూమ్‌లోకి తప్ప ఎక్కడికైనా వెళ్లవచ్చు. వీళ్లందరికీ అజిత్ యింట్లో భోజనం వండి పెడుతూంటారు. అయినా రాష్ట్రనాయకులకు అతనంటే పడదు. తనూ, తన కుటుంబం తప్ప కాంగ్రెసులో యితర నాయకులుండడం సహించలేక అందర్నీ పక్కకు పడేశాడని వాళ్ల కోపం. 'గిరిజన ప్రాంతాల్లో మన పార్టీకి ఎంతో పలుకుబడి వుండేది, అదంతా జోగీ వలననే సర్వనాశనమైంది. 2003, 2008 ఎన్నికలలో పార్టీ ఓడిపోవడానికి యితనే కారణం.' అంటారు వాళ్లు. 2003లో అతను అధికారంలో వుండగా బిజెపిని దెబ్బ తీయాలన్న ఉద్దేశంతో ఆ పార్టీని చీల్చబోయాడు. ఎమ్మెల్యేలను కొన్నాడన్న ఆరోపణలు, తగిన సాక్ష్యాలు లభించడంతో సోనియా గాంధీ అతన్ని పార్టీలోంచి బహిష్కరించింది. కానీ 2004 పార్లమెంటు ఎన్నికల నాటికి మళ్లీ పార్టీలోకి తీసుకుని కాంగ్రెసు నుండి బిజెపికి మారిన వృద్ధనాయకుడు విద్యాచరణ్ శుక్లాకు పోటీగా నిలబెట్టింది. ఆ ప్రచారసందర్భంగా అజిత్ యాక్సిడెంటుకు గురయి తొమ్మిదేళ్లపాటు వీల్ చైర్‌లో వుండవలసి వచ్చింది. ఏమైతేనేం, ఎన్నికల్లో శుక్లాను ఓడించి అనామకుణ్ని చేశాడు. గత్యంతరం లేక 2008లో శుక్లా మళ్లీ కాంగ్రెసులో చేరాడు.

ఇలాటి వాళ్లంతా అజిత్ జోగిని కట్టడి చేయకపోతే తాము పార్టీలో నిలదొక్కుకోలేమని ఫిర్యాదులు చేశారు. వాళ్ల మాటలు విన్న కాంగ్రెసు అధిష్టానం అజిత్‌ను రాష్ట్ర వ్యవహారాల నుండి తప్పించి, నందకుమార్ పటేల్‌ను రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడిగా చేసింది. అజిత్ అంటే పడని చరణ్ దాస్ మహంత్‌ను కేంద్రమంత్రిగా తీసుకుంది. అంతేకాదు, మరో అజిత్ ప్రత్యర్థి రవీంద్ర చౌబేను అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుణ్ని చేసింది. అజిత్ జోగి కొడుకు అమిత్ తన రాజకీయ శత్రువును హత్య చేయించాడన్న ఆరోపణపై రాయపూరు జైల్లో 10 నెలలు గడిపాడు. బయటకు వచ్చాక బస్తర్‌లో పాదయాత్ర నిర్వహిస్తే చాలామంది వచ్చారు. అది చూసి యితర కాంగ్రెసు నాయకులు బస్తర్‌లో పాదయాత్ర చేశారు. వారిపై మావోయిస్టులు దాడి చేసి ముఖ్యుల నెందర్నో చంపివేశారు. మావోయిస్టుల దాడి వెనుక అజిత్ జోగి హస్తం వుందని రాష్ట్ర కాంగ్రెసు నాయకుల సంశయం. అజిత్ మాత్రం యీ దాడిని ఖండిస్తూ అధికార బిజెపికి వ్యతిరేకంగా ఉద్యమం లేవదీశాడు. కానీ కాంగ్రెసు హై కమాండ్ కరగలేదు. అజిత్ అంటే పడని భూపేష్ బాఘేల్ అనే నాయకుణ్ని పార్టీ కోఆర్డినేటర్‌గా నియమించింది. ఆ ప్రాంతంలోని పంచాయితీ ఎన్నిక జరిగితే మేమన్ అనే అతన్ని అజిత్ తన కాండిడేట్‌గా సూచించాడు. కానీ మహంత్ మరొకరికి టిక్కెట్టు యిప్పించాడు. బస్తర్‌లో కాంగ్రెసు నాయకులు హతమార్చబడినా దానికి సానుభూతి ఓట్లు పడలేదు. పైగా ఇండిపెండెంట్‌గా నిలబడిన మేమన్ 1800 ఓట్ల తేడాతో గెలిచాడు. ఇదంతా అజిత్ చేస్తున్న కుట్రే అని అనుమానించిన స్థానిక కాంగ్రెసు నాయకులు బస్తర్ హతుల ఆత్మశాంతికి నిర్వహించిన 'కలశయాత్ర'కు అజిత్‌ను ఆహ్వానించలేదు.

ఈ వరసంతా చూసిన కినిసిన అజిత్ 'మిని మాత' పేరుపై ఐదురోజుల యాత్ర చేశాడు. దళితులైన సత్నామీ కులంలో పుట్టి పార్లమెంటుకు ఎన్నికైన మహిళ పేరు మిని. ఆవిడ పేరు మీద భారతీయ సత్నామీ కళ్యాణ్ సమితి అనే సంస్థ పేర నిర్వహించిన యీ యాత్రలో అజిత్ కాంగ్రెసు జండాలు పెట్టించలేదు. 'దీనికి బిజెపి ఆర్థికసాయం చేసింది' అంటూ అజిత్ వ్యతిరేకులు ప్రచారం చేస్తున్నారు. వచ్చే ఎన్నికలలో అజిత్ తన అనుయాయులను వేర్వేరు పేర్లతో ఎన్నికలలో నిలబెట్టి, బిజెపి మళ్లీ గెలిచేందుకు సహాయపడతాడని వారంటున్నారు. అజిత్‌కున్న ప్రజాదరణ తెలిసిన కాంగ్రెసు అతన్ని కూడా అభ్యర్థులను సూచించమంది. అతన్ని ప్రోత్సహిస్తే యితర కాంగ్రెసు నాయకులు సహకరించరు. పక్కన పడేస్తే ప్రజలకు కోపం వస్తుంది. ఎలాగైనా అతనితో తంటానే!

**లాలూ కేసు నేర్పే పాఠాలు**

జెడి (యస్) లాలూ యాదవ్‌కి శిక్ష పడి జైలుకి వెళ్లారని అందరికీ తెలుసు. అంటే సప్లయిర్ల నుండి డబ్బు తీసుకుని జేబులో పెట్టుకుంటూ పట్టుబడ్డాడా? లేదు కదా! సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడన్స్ (పరిస్థితులే సాక్ష్యంగా నిలిచిన సందర్భం) యిక్కడ పని చేసింది. క్లుప్తంగా పరామర్శిస్తే – లేని పశువులను చూపించి వాటి మేతకు, మందులకు ఖర్చయిందంటూ పదేళ్లపాటు పశుసంవర్ధక శాఖ అధికారులు 950 కోట్ల రూ.లు మేసేశారని అభియోగం. లాలూ 1990లో ముఖ్యమంత్రి అయ్యారు. 1996లో సిబిఐ 53 దాణా కుంభకోణం కేసులు పెట్టింది. వాటిలో 44 కేసులు ముగిసాయి. నిందలు పడినవారిలో చాలామంది శిక్ష అనుభవించారు. తక్కిన 9 కేసుల్లో 5 కేసుల్లో లాలూ నిందితుడు. అక్టోబరులో తీర్పు వచ్చింది – 37.7 కోట్ల రూ.ల కేసు గురించి! ఆ కేసులో నిందితులు 56 మంది. కేసు నడుస్తూండగా 7గురు చనిపోయారు. ఇద్దరు అప్రూవర్లుగా మారారు. ఒకతను నేరాన్ని అంగీకరించేశాడు. ఒకతన్ని నిర్దోషిగా వదిలేశారు. మిగిలిన 45 మందిలో ఐయేయస్‌లు, శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు, రాజకీయనాయకులు వున్నారు. రాజకీయనాయకుల్లో – లాలూ, కాంగ్రెసుకు చెందిన మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ్ మిశ్రా, ప్రస్తుతం జెడి(యు)లో వున్న ఎంపీ జగదీశ్ శర్మ, జెడ్ (ఎస్)కు చెందిన మాజీ శాసనసభ్యుడు ఆర్ కె రాణా వున్నారు. లాలూకు, రాణాకు ఐదేళ్ల కఠినశిక్ష, మిశ్రా, శర్మలకు నాలుగేళ్ల శిక్ష పడ్డాయి. పశుసంవర్ధక శాఖకు ప్రాంతీయ డైరక్టరుగా వున్న ఎస్.బి.సిన్హా కుంభకోణానికి సూత్రధారి అని కోర్టు నిర్ధారించింది. కానీ యిప్పటికే చనిపోయాడు కాబట్టి శిక్ష వేయలేకపోయింది.

తీర్పు చెపుతూ న్యాయమూర్తి అన్నమాటలను గమనించాలి – "రాజకీయనాయకుల, ఉన్నతాధికారుల ప్రమేయం గురించి సూటిగా సాక్ష్యం దొరకదు కాబట్టి యిలాటి కేసుల్లో పరిస్థితులనే సాక్ష్యంగా తీసుకోవాలి. సంఘటనల వరుసను గమనించి, వాటి వెనుక కుట్ర వుందేమో కనిపెట్టాలి." పశువుల మేత విషయంలో బజెట్ కేటాయింపులకు, అవసరాలకు మించి పది రెట్లు కొంటూ వుంటే వీరు కళ్లు మూసుకున్నారని నమ్మగలమా? కొన్ని సందర్భాల్లో అది 270 రెట్లు కూడా వుంది. ఈ నేరంలో పాలుపంచుకున్న ఉన్నతోద్యోగుల సర్వీసును పొడిగించవలసిన అవసరం ఏముంది? ఎక్కౌంట్స్ జనరల్ యీ విషయంగా అడిగిన ప్రశ్నలకు వీరెందుకు సమాధానాలు పంపలేదు? ఫైనాన్సు శాఖ లాలూ క్రిందనే వుంది. ఆయనకు తెలియకుండా యింత డబ్బు దుర్వినియోగం అవుతుందా? పైగా అవినీతి మచ్చ అంటిన ఆ శాఖ వుద్యోగులు వేరే ఊళ్లలో చదువుతున్న లాలూ పిల్లలకు లోకల్ గార్డియన్లగా వ్యవహరించారని కూడా కోర్టు గమనించింది. (లోకేశ్‌కు సత్యం రామలింగరాజుకు యిలాటి లింకు వుందా?) ఇవ్వే కాకుండా అప్రూవర్‌గా మారిన దీపేశ్ చండక్ అనే సప్లయిర్ యిచ్చిన స్టేటుమెంటు లాలూకి వ్యతిరేకంగా బలమైన సాక్ష్యంగా మారింది. "కుంభకోణంలో సూత్రధారి అయిన సిన్హా లాలూకి బాగా క్లోజ్. లాలూ ముఖ్యమంత్రి కావడానికి ముందు నుండీ అతనికి లాలూ అనుచరుడు ఆర్.కె. రాణా ద్వారా డబ్బు పంపుతూ వుండేవాడు. 1989లో ముఖ్యమంత్రి ఎన్నికకు ముందురోజు లాలూ తన వద్దకు వస్తే ఎమ్మెల్యేలను కొనడానికి అతను రూ.5 లక్షలు యిచ్చాడు. అప్పుడు లాలూ గెలవలేదు. 1992లో రాణా ద్వారానే కోటి రూ.లు పంపాడు." అని అతను చెప్పాడు.

అధికారులు చెప్పడం చేత తాము ఫైళ్ల మీద సంతకాలు పెట్టామని, తమకు తెలియకుండా తమ వీపు వెనక్కాల ముఖ్యమంత్రి డీల్ కుదుర్చుకుంటే తామేం చేయగలమనీ కొందరు మంత్రులు వాదించడం గమనిస్తున్నాం. అలాటి సందర్భాల్లో లాలూ కేసు మార్గనిర్దేశనం చేయవచ్చు. – **ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2013)**

**అక్టోబరు 31** **ఎమ్బీయస్ : కెసియార్ గడుసుదనం**

ప్రత్యేక తెలంగాణ బీజం తెరాస వేసినా, దాన్ని పోషించి, పెద్దది చేసినది కాంగ్రెసు పార్టీలోని అంతర్గత కలహాలే. ఆంధ్ర నాయకులను అదుపు చేయడానికి తెలంగాణ కాంగ్రెసు నాయకులు తెరాసను దువ్వుతూ వచ్చారు. కెసియార్‌కు నీరసం వచ్చి తెరాస దుకాణం కట్టేసే టైములో కేకే, ఎమ్మెస్సార్ కలిసి పన్నాగం పన్ని కరీంనగర్‌కు ఉపయెన్నిక తెచ్చి కెసియార్‌కు మళ్లీ ఊపిరి పోశారు. అలాగే కెసియార్ నిరాహారదీక్ష టైములో కూడా ఆయనకు ప్రాణంమీదకు వచ్చిందంటూ హంగామా చేసి డిసెంబరు 9 ప్రకటన వచ్చేట్లు చేశారు. ఆ నాటి కెసియార్ ఆరోగ్యస్థితి ఎలా వుందో చెప్పాలంటూ నిమ్స్ వారిని రికార్డులు అడిగితే వాళ్లు మాట్లాడరు. గోనె

ప్రకాశరావుగారు సేకరించి వుంచానంటారు. ఎప్పుడు బయటపెడతారో తెలియదు. ఆంధ్ర ప్రాంతంలో కూడా ప్రజలు విభజన కోరుకుంటున్నారని, విభజిస్తే వాళ్లు సంతోషించి సోనియాపై కీర్తనలు పాడతారనీ టి-కాంగ్రెసు వారు ఆవిణ్ని నమ్మించారు. అందుకే డిసెంబరు 9 ప్రకటన వచ్చింది. తీరా చూస్తే సీమాంధ్రలో ఉద్యమం ఉవ్వెత్తున లేచింది. 'అబ్బే, అదంతా చంద్రబాబు పన్నాగం. రాజకీయప్రేరితం. సామాన్యజనాలు విభజనే కోరుతున్నారు.' అంటూ మళ్లీ పాట మొదలుపెట్టారు. మూడున్నరేళ్లు యిదే పాట సాగింది.

'విభజన చేస్తాం కానీ దానివలన మనకు రాజకీయప్రయోజనం ఏమిటి?' అని అడిగారు సోనియా. 'డిసెంబరు 9 ప్రకటన తర్వాతనే తెలంగాణ ఉద్యమానికి ఊపు వచ్చింది. ఆ ప్రకటన చేసినది మన పార్టీయే కాబట్టి ఆ ఘనతంతా మనకే దక్కుతుంది. తెలంగాణ ప్రజలంతా మీ ఫోటోను కళ్లకద్దుకుంటారు' అని చెప్పారు సోనియాకు. 'కెసియార్ మాటేమిటి? ఉద్యమసారథిగా ఆయనా వాటాకు వస్తాడు కదా' అని సోనియా సందేహిస్తే, 'మీరు తెలంగాణ ప్రకటన చేయండి చాలు. ఆయన్ను పట్టుకుని వచ్చి మీ చెంత పడేస్తాం.' అని హామీలు గుప్పించారు. ఆ మేరకు అడపాదడపా కెసియార్ చేత ప్రకటనలు కూడా చేయించారు. 'తెలంగాణ సాధనే మాకు ముఖ్యం. దానికోసం ఎవరినైనా సరే ముద్దాడుతాం.' అని. ఆఫర్ బాగానే వుంది కదాని సోనియా చివరకు జులై 30 న తెలంగాణ యిచ్చేస్తున్నాం అని ప్రకటించారు. ఆ ప్రకటన చేసేటప్పుడే తెరాస విలీనం గురించి జర్నలిస్టులు దిగ్విజయ్‌ను అడిగారు. 'మా పని మేం చేశాం, ఆయన మాట ఆయన నిలబెట్టుకోవాలి' అన్నట్టు దిగ్గీ చెప్పారు. 'దీని గురించి మేము వేరే విజ్ఞప్తి ఏమీ చేయం, తన బాధ్యత గుర్తెరిగి ఆయనే వచ్చి మాతో కలవాలి' అనే అర్థం వచ్చింది.

తన పాత్ర గురించి కెసియార్‌కు ఏ అవగాహన వుందో తెలియదు కానీ, జులై 30 గడచి మూణ్నెళ్లు అవుతున్నా కెసియార్ విలీనం చేయలేదు సరికదా, అసలా అవసరం ఏముంది అన్నట్టు మాట్లాడుతున్నారు. తెలంగాణ సాధనతో సరిపెడతామన్నవారు, యిప్పుడు తెలంగాణ పునర్నిర్మాణం గురించి మాట్లాడుతున్నారు. నిర్మాణం తర్వాత మేన్‌టెనెన్స్ వుంటుంది. తలిదండ్రులు స ృష్టించి వదిలిపెట్టయరుకదా, పిల్లవాణ్ని పెంచి, పెద్ద చేసి, తన కాళ్ల మీద నిలదొక్కుకునేదాకా కనిపెట్టుకునే వుంటారు. ఆ తర్వాత కూడా పట్టించుకోకుండా వుండరు. కాస్త స్వేచ్ఛనిచ్చినట్టే యిచ్చి నక్కినక్కి చూస్తూంటారు. తెలంగాణ విషయంలోనూ తన కనుసన్నల్లో నుండి దాటిపోకుండా చూద్దామని జనకుడు కెసియార్ ఉద్దేశం. పొరుగు రాష్ట్రాలతో కొట్లాడైనా తెలంగాణ ప్రయోజనాలను కాపాడగల రక్షకుడిగా వుండాలంటే, తనను తెలంగాణకు మాత్రమే పరిమితం చేసుకోవాలి. కాంగ్రెసు, బిజెపి, వైకాపా, టిడిపిల్కటతే యితర ప్రాంతాలనూ ద ృష్టిలో పెట్టుకుని మాట్లాడవలసిన బాధ్యత వుంటుంది. విభజన తర్వాత జలవివాదాలు రావడం తథ్యం. అబ్బే, ఎందుకు వస్తాయి, కమిటీలు వుంటాయి, బోర్డులు వుంటాయి అంటూ కబుర్లు చెపుతున్నారు కొందరు. ప్రస్తుతం బాబ్లీలో ఏం జరిగిందో చూడండి. కోర్టులో వివాదం నడుస్తూండగానే సరే, మహారాష్ట్ర కట్టిపారేసింది. 'తెలంగాణ ప్రాంత ప్రయోజనాలు కాపాడతాం లెండి' అని ఓ హామీ యిచ్చిందంతే. నిస్సహాయస్థితిలో కోర్టు 'హామీ యిచ్చిందిగా' అంటూ మనల్ని సర్దుకోమన్నారు.

రేపు ఆంధ్ర విషయంలో తెలంగాణలో కూడా యిదే జరగదన్న భరోసా ఏముంది? ఇంతకంటె ఎక్కువగా జరగడానికే ఆస్కారం వుంది. రాజకీయంగా ఒత్తిళ్లు తెచ్చి అలా జరగకుండా చూడాలంటే యిరుప్రాంతాల్లో సొంత ప్రయోజనం వున్న పార్టీలు మాత్రమే కాస్త జాగ్రత్తగా మాట్లాడతాయి. 'బెళగాం మహారాష్ట్రలో కలవాల్సిందే' అని శివసేనంత తీవ్రంగా మహారాష్ట్ర కాంగ్రెసు అనలేదు. ఎందుకంటే కర్ణాటకలో కూడా కాంగ్రెసు యూనిట్ వుంది కదా. అందుకని సన్నాయినొక్కులు నొక్కి వూరుకుంటుంది. బాబ్లీ గురించి టిడిపి చేసినంతగా కాంగ్రెసు చేయకపోవడానికి కారణమేమిటంటే టిడిపికి మహారాష్ట్ర యూనిట్ లేదు, కాంగ్రెసుకి వుంది. 2009 డిసెంబరు 9 తర్వాత చిరంజీవి సమైక్యంవైపు పూర్తిగా మొగ్గిపోయారు. తన ప్రజారాజ్యం పార్టీ తెలంగాణ యూనిట్ పూర్తిగా దెబ్బ తిన్నా పట్టించుకోలేదు. ఆయన అదే పార్టీని కొనసాగించి, అవసరమైనపుడు కాంగ్రెసును ఆదుకుంటూ, తన ప్రత్యేకతను నిలుపుకుని వుంటే జులై 30 తర్వాత సీమాంధ్రలో ఆయన్ను మించిన హీరో వుండేవాడు కాదు. అయితే కాంగ్రెసులో చేరడం చేత ఆయన ఆ అడ్వాంటేజి పోగొట్టుకున్నాడు. ఎందుకంటే కాంగ్రెసుకు తెలంగాణలో కూడా యూనిట్ వుంది.

తెలంగాణ ప్రయోజనం కాపాడగల సత్తా మాకే వుంది అంటూ మూడు, నాలుగు పార్టీలు చెప్పుకుంటూ వుంటే తమను తాము వీరతెలంగాణ వాదులుగా చూపుకోవాలంటే 'ఆంధ్ర మిగులు విద్యుత్ మనకు అమ్మలేదు కాబట్టి, నీళ్లు ఆపేద్దాం' వంటి నినాదం యిది ప్రజలను రెచ్చగొట్టాలి. అలాటి నినాదం యివ్వాలంటే తెలంగాణ ప్రాంతీయపార్టీగానే వుండాలి. రెండు, లేక ఎక్కువ రాష్ట్రాలలో వునికి వున్న జాతీయ పార్టీలో చేరకూడదు. అందుకే కెసియార్ కాంగ్రెసులో చేరడానికి ఉత్సాహంగా లేరు. ఈ రోజు చిరంజీవి పరిస్థితే రేపు కెసియార్‌ది అవుతుంది. 'మనకు ఆంధ్రలో యూనిట్ కూడా ముఖ్యమే కదా, వాళ్లనూ త ృప్తి పరచాలి కదా' అంటూ సోనియా సీమాంధ్రులకు యిచ్చే కన్సెషన్లను ఆమోదించవలసిన యిబ్బంది కలుగుతుంది. హైదరాబాదును ఉమ్మడి రాజధానిగా ఎంతకాలం వుంచాలి, హైదరాబాదు సరిహద్దులు ఏ మేరకు వుండాలి, హైదరాబాదు శాంతిభద్రతల పరిరక్షణ ఎవరి చేతిలో.. యిలాటి అనేక విషయాలలో కాంగ్రెసు ద ృక్పథం, తెరాస ద ృక్పథం భిన్నంగా వుంటాయి. అది సహజం. ఉమ్మడి రాజధానిగా పదేళ్లు అని యివాళ అంటున్నారు. ఈలోగా ఆంధ్ర రాజధాని తయారవ్వాలి. అనేక జలయజ్ఞం ప్రాజెక్టులు చూశాం. చెప్పిన గడువు కంటె రెండు, మూడు రెట్లు ఎక్కువ సమయం పడుతోంది. అలనాటి నాగార్జున సాగరే కాదు, యీనాటి పోలవరం కూడా చూస్తున్నాం కదా! గడువు పెరుగుతూనే పోతూంటుంది. ఆంధ్ర రాజధానీనిర్మాణం మాత్రం శరవేగంతో పూర్తవుతుందన్న గ్యారంటీ ఏముంది?

ఈ ప్రభుత్వం అవసానదశలో వుంది. తమ ఆఖరి బజెట్‌లో ఎంత ఎలాట్ చేస్తారో తెలియదు. అది వచ్చే ప్రభుత్వం మన్నిస్తుందో లేదో తెలియదు. ఎంఎంటియస్, రైల్వే కొత్త లైన్లు.. అన్నిట్లోనూ యిదే ధోరణి చూశాం. పదేళ్ల గడువు పెంచాలి అని కాంగ్రెసు నిర్ణయిస్తే కెసియార్ ఔననాల్సిందే కదా. ఇప్పుడు విడిగా పార్టీ కాబట్టి రెండు, మూడేళ్లు చాలు. ఉమ్మడి రాజధాని అనక్కరలేదు, తాత్కాలిక రాజధాని అనండి చాలు.. ఇలా ఎంత కటువుగానైనా మాట్లాడవచ్చు.

తెలంగాణ రాష్ట్రం ఎన్నో ఆశల పునాదిపై ఏర్పడుతోంది. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నాయకులందరూ – ఏ పార్టీకి చెందినవారైనా సరే – సకల కష్టాలకూ కారణం ఉమ్మడి రాష్ట్రమేననీ, సర్వ అనర్థాలకూ కారణం ఆంధ్రులేననీ నూరిపోశారు. వీరందరూ దశాబ్దాలుగా అధికారంలో వున్నవారే, పదవులు అనుభవించినవారే. తమ ప్రాంతాలకు తాము ఏం చేశారో, ఏం చేయలేకపోయారో చెప్పుకోకుండా ఆంధ్ర ముఖ్యమంత్రుల కారణంగానే అభివృద్ధి జరగలేదని సాకులు చెప్పారు. ఒక్కసారి రాష్ట్రమంటూ వచ్చేస్తే ఆంధ్రుల్ని తరిమివేయవచ్చనీ, అప్పుడు యింటికో ఉద్యోగం, ఉద్యోగంలో వున్నవారికి పదోన్నతి, ప్రతీ పేదవాడికీ పక్కా యిల్లు.. యిలా స్వర్గం భూతలంపై దిగివస్తుందని నమ్మించారు. కేంద్రాన్ని అడిగి విద్యుత్ ప్రాజెక్టులు, స్టీల్ ఫ్యాక్టరీలు, విమానాశ్రయాలు అన్నీ తెచ్చేసుకుంటామని ఊరించారు.

వీటిలో ఎన్ని జరుగుతాయి చెప్పండి. చట్టరీత్యా ఆంధ్రుల్ని తరమగలరా? రాష్ట్రం విడిపోయినపుడు ఉద్యోగాల సంఖ్య తగ్గదా? అడిగినవాళ్లందరికీ కేంద్రం అప్పనంగా నిధులు యిస్తుందా? తమకు బయటనుండి మద్దతు యిచ్చే పార్టీలు పాలించే రాష్ట్రాలకు మాత్రమే యిస్తుంది. పైగా మన ప్రాంత ప్రతినిధులు గట్టిగా అడిగి తెచ్చుకుంటేనే యివి సాధ్యం. అడిగే శ్రద్ధ, దమ్మున్నవాళ్లయితే యీ పాటికే చాలా అడిగి వుండేవారు. విభజన తర్వాత తెలంగాణ ముఖచిత్రం హఠాత్తుగా మారుతుందని అనుకోలేం. అధికారంలోకి ఎవరు వస్తారో వారి పాలనాపటిమపై చాలాభాగం ఆధారపడి వుంటుంది. అసలు సుస్థిరప్రభుత్వం ఏర్పడుతుందా అన్నదే డౌటు.

ఇలాటి పరిస్థితుల్లో ప్రజల ఆశలు నెరవేరకపోతే ఆ చివాట్లు కెసియార్‌కే పడతాయి. బ్రిటిషువాళ్లు వెళ్లిపోయాక ఏవో అద్భుతాలు జరిగి మన బతుకుల్లో వెలుగులే వెలుగులని స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నవారు మనసా, కర్మణా నమ్మారు. అవేమీ జరగకుండా, జరిగిన మేలేదో కొద్దికొద్దిగా నెమ్మదిగా జరగడంతో నిరాశపడి, స్వాతంత్ర్యపోరాట సారథి ఐన గాంధీగార్ని తిట్టనారంభించారు. 'గాంధీ గారు స్వాతంత్ర్యం తెచ్చి ఏం ఉద్ధరించారు? ఇంగ్లీషువాళ్ల జమానాయే బాగుండేది.' అనసాగారు. నిజానికి స్వాతంత్ర్యం వచ్చిన కొద్ది నెలలకే గాంధీగారు పోయారు. అనుకున్నంత ప్రగతి జరగకపోతే ఆయన్నెందుకు తప్పుపట్టాలి? అయినా గాంధీని ఉద్దేశించి సెటైర్లు, వెటకారాలు పేలుస్తూనే వున్నారు. అది చాలనట్టు 'అర్ధరాత్రి స్వతంత్రం వచ్చింది కాబట్టి యీ అగచాట్లు' అంటూ యిటీవల యింకో పాయింటు లాగారు. రేడియోలో ఆ ప్రకటన, ఉపన్యాసాలు వినేందుకు ఇంగ్లీషువాళ్లకి అనువైన టైము కాబట్టి అప్పుడు పెట్టి వుంటారు. కానీ దాన్నీ తప్పుపడుతున్నా రిప్పుడు. ఎందుకు? మన ఆశలు నెరవేరలేదు కాబట్టి!

అందువలన రేపు తెలంగాణ విషయంలో కూడా ఆశాభంగం జరిగినపుడు 'ఈ కెసియార్‌కు పని లేదు. తీరికూర్చుని తెలంగాణ అంటూ లొల్లి చేసి తెచ్చిపెట్టాడు. ఏం మంచి జరిగింది? కలిసివున్నపుడే బాగుండేది' అనవచ్చు. ఈ ప్రమాదం తనకు మాత్రమే వున్న విషయం తెలుసు కాబట్టే కెసియార్ తెలంగాణ భవిష్యత్తును యింకొకరి చేతిలో పెట్టి కూర్చోవడానికి సిద్ధంగా లేరు. చిరంజీవి అయితే స్వతహాగా రాజకీయనాయకుడు కాడు. పార్టీ నడపడం చాలా భారంగా ఫీలయి, దాన్ని కాంగ్రెసులో కలిపేసి హమ్మయ్య అనుకున్నారు. కెసియార్‌కు రాజకీయాలు వృత్తి. ఒక పార్టీ చైర్మన్‌గా అధికారం చలాయించడం ఆయనకు నచ్చిన పని. ఎప్పుడు కావాలంటే అప్పుడు, ఎవర్ని కావాలంటే వాళ్లను పల్లకి ఎక్కించడం లేదా పూచికపుల్లలా తీసిపారేయడం – ఆయన అలవాటు. కాంగ్రెసులో విలీనం చేస్తే యీ ఆటలు సాగవు. సోనియా కటాక్షవీక్షణం కోసం మరో పదిమందితో పోటీపడాలి.

ఈ వాదనలు యివాళ పుట్టుకుని వచ్చినవి కావు. ఎప్పణ్నుంచో వున్నవి. హరీశ్‌రావు బహిరంగంగా చెప్తున్నవి. అయితే యిన్నాళ్లూ కెసియార్ కాంగ్రెసులో విలీనం చేయడానికి సిద్ధంగా వున్నట్టు కలరింగ్ యిచ్చారు. అది నమ్మి తెలంగాణ కాంగ్రెసు నాయకులు సోనియాకు హామీలు గుప్పించేశారు. ఆవిడ నమ్మిందనే అనుకోవాలి. ఎందుకంటే జాతీయ మీడియాతో సహా అందరూ రాస్తున్నది – 'తెలంగాణలో కెసియార్‌ను, సీమాంధ్రలో జగన్‌ను కలుపుకుని మళ్లీ అధికారంలోకి రావడానికి కాంగ్రెసు రాజకీయపరంగా వేసిన ఎత్తుగడకు లోబడే తెలంగాణ ప్రకటన వచ్చింది' అని. తెలంగాణ ప్రకటిస్తే తెరాస భవనం వద్ద ఎవరూ వుండరని, అందరూ కాంగ్రెసువారి గాంధీ భవనంలోనే పడిగాపులు కాస్తారని టి–కాంగ్రెసు నాయకులు ప్రకటనలు చేశారు. సోనియా ప్రకటన చేయడమే కాదు, తెలంగాణ గుఱ్ఱాన్ని పరుగులు పెట్టిస్తోంది. కానీ జరుగుతున్నదేమిటి? మొన్న బోధన్‌లో మీటింగు పెడితే జనం రాలేదు. తెలంగాణ యిచ్చిన క్రెడిట్‌ను కాంగ్రెసు ఓట్లగా మార్చుకునే అవకాశం కనబడటం లేదు. వచ్చే ఎన్నికలలో తెరాసతో తలపడితే కాంగ్రెసు నిలవదన్న సంగతి తేటతెల్లంగా తెలుస్తోంది. తెలంగాణ ప్రకటించేవరకు తెరాసకు కాంగ్రెసుతో అవసరం వుంది కానీ, ప్రకటన తర్వాత కాంగ్రెసుకే తెరాసతో అవసరం వుంది అని స్పష్టంగా తెలుస్తోంది.

ఇలాటి పరిస్థితుల్లో కాంగ్రెసుతో విలీనం కావాలని తెరాస ఎందుకు తహతహలాడుతుంది? కాంగ్రెసులో నాయకులెక్కువ. వారందరినీ తృప్తిపరచడం ఎవరి సాధ్యమూ కాదు. వారికి టిక్కెట్లిచ్చాక తెరాసలో ముందునుండీ వున్నవారికి టిక్కెట్లే మిగలవు. ఈ పరిస్థితుల్లో కెసియార్ కాంగ్రెసుతో విలీనం కారు. మహా అయితే పొత్తు పెట్టుకుంటారు. కెసియార్‌తో పొత్తు అంటే అది ఎంత లక్షణంగా వుంటుందో 2004, 2009 ఎన్నికలు చూపించాయి. తన జీవితంలో చేసిన ఘోరతప్పిదం తెరాసతో పొత్తు పెట్టుకోవడం అని బాబు

అనేకసార్లు అన్నారు. మహా కూటమిని మహా కొలిమి చేసి కెసియార్ ఆయన్ను ముప్పుతిప్పలు పెట్టారు. ఫైనల్‌గా తనూ బాగుపడలేదు, టిడిపిని బాగు పడనీయలేదు. అదంతా వైయస్సార్ ప్రోత్సాహంతో చేశారని కొందరు అంటారు. ఏది ఏమైనా కెసియార్ నమ్మదగ్గ భాగస్వామి కాదని గత అనుభవాలు చెప్తున్నాయి. అందువలన విలీనం అయితీరాలని ఢిల్లీ కాంగ్రెసు నాయకులు పట్టుబట్టి వుంటారు. ఎలాగోలా తెలంగాణ తెచ్చుకోవాలనే ఆత్రుతతో 'అవశ్యము, అలానే జరుగుతుంది' అని వాళ్లను టి-కాంగ్రెసువాళ్లు నమ్మించారు. కెసియార్ కూడా వాళ్లతో బాటు కలిసి నాటకం ఆడి ఢిల్లీని నమ్మించి, జులై 30 ప్రకటన వచ్చేట్లు చేశారు.

ఇప్పుడు తోక ఝాడించారు. విలీనం ప్రశ్నే లేదని. తెలంగాణను పాలించేది తెరాసయేననీ ఈటెల చేత చెప్పించారు. తర్వాత తనూ అదే మాట చెప్పారు. ఇంకోళ్లను గద్దె నెక్కించడానికై మావాళ్లు యిన్నాళ్లూ కష్టపడినది? మేమేమైనా సన్యాసులమా, పదవులు వద్దనడానికి? అని అడిగారు. జులై 30 ప్రకటన తర్వాత మౌనం పాటించిన కెసియార్, కాంగ్రెసు తెలంగాణ ప్రక్రియ వేగం పెంచినకొద్దీ మరిన్ని అవరోధాలు పెట్టసాగారు. ఉమ్మడి రాజధాని పదేళ్లు ఎందుకు? రెండు, మూడేళ్లు చాలు అంటున్నారు. అయినా ఉమ్మడి రాజధాని అన్నది దేశంలో ఎక్కడా లేదు, ఎక్కడా లేని చట్టం యిక్కడ పెడితే ఎందుకు ఊరుకుంటాం? అని అడిగారు. కేంద్రం చేతిలో శాంతిభద్రతలు అనే అంశాన్ని కూడా గట్టిగా ఎదుర్కుంటున్నారు. పాలన ఒకరి చేతిలో, అధికారం మరొకరి చేతిలో – అదెలా? ఎక్కడైనా వుందా? అని ప్రశ్నలు సంధిస్తున్నారు. ఇవన్నీ జులై 30 న చెప్పిన అంశాలే. అప్పుడు అడగలేదాయన. అడిగి వుంటే కాంగ్రెసు వ్యవహారాన్ని మెల్లగా నడిపేది. జిఓఎమ్ ఏర్పరచాక, గడువు కూడా తీసేశాక యిప్పుడు అడుగుతున్నాడీయన. ఈ మోసాన్ని ఎదుర్కోవడానికి యుద్ధం చేస్తానంటున్నాడు. కేంద్ర హెూం శాఖ విజయకుమార్ ఆధ్వర్యంలో ఏర్పరచిన మాజీ డిజిపిల సమావేశానికి తమ పార్టీ సభ్యుడు పేర్వారం రాములును పిలవలేదేమని హుంకరిస్తున్నారు.

టి-కాంగ్రెసువారికి కూడా యివే అభ్యంతరాలున్నా పైకి అనలేరు. అంటే ఢిల్లీ తాట తీస్తుంది. అనగలిగిన కెసియారే ఉద్యమకారులకు హీరో అవుతారు. తను చెప్పినవి అమలు కాకపోతే ఆ తప్పును కెసియార్ టి-కాంగ్రెసువాళ్లపై తోసేస్తారు. వాళ్ల వలననే మనం కోరుకున్న విధంగా సంపూర్ణ తెలంగాణ సిద్ధించలేదు అంటారు. ఇవన్నీ చూసి ఢిల్లీ వారు పిలిచి 'మీరు విలీనం అవుతారనే మేం యీ స్టెప్ తీసుకున్నాం' అని గట్టిగా ఒత్తిడి చేస్తే కెసియార్ 'కార్యకర్తల అభిమతానికి వ్యతిరేకంగా వెళ్లడం కుదరదు. వారి మాటే నాకు శిరోధార్యం' అంటారు. కాంగ్రెసుతో విలీనం జరిగితే కలిగే అనర్థాలన్నీ ఏకరువు పెడతారు. ఇవి జులై 30 కి ముందూ వున్నాయి, తర్వాతా వున్నాయి. అప్పుడు మౌనంగా వుండి, యిప్పుడు చెప్పడమే కెసియార్ గడుసుదనం. ఆయన రాజకీయం వరకూ ఆయన కరక్టు. కెసియార్‌ని ఎలాగైనా కాంగ్రెసులోకి తెచ్చి, తెలంగాణలో 15 పార్లమెంటు సీట్లు తెప్పిస్తామని నమ్మబలికిన టి-కాంగ్రెసు నాయకులు ఢిల్లీ నాయకులకు ఏం చెప్పుకుంటారో, అక్కడ మొహం ఎలా చెల్లుతుందో చూడాలి. తెరాసతో విలీనం లేకుండా కేవలం పొత్తు మాత్రమే అయితే కెసియార్ వీళ్లకు ఎన్ని పార్లమెంటు సీట్లు విదిలిస్తారు? మహా అయితే పదో పన్నెండో ! అవి కూడా సమైక్యవాదం బలంగా వుండి, తెరాసకు ఛాన్సు లేని హైదరాబాదు, రంగారెడ్డి, ఖమ్మం వంటి జిల్లాల్లో! అక్కడ సమైక్యవాదానికై నిలబడిన వైకాపాతో కాంగ్రెసు పోటీపడాలి. ఇలా చూస్తే అల్టిమేట్‌గా తెలంగాణలో కాంగ్రెసు గెలిచేవి మహా అయితే ఆరో ఏడో తేలతాయి. సీమాంధ్రలో జరిగే భారీ నష్టంతో పోలిస్తే యిది బఠానీ గింజల్లాటిది. ఇలా జరిగితే తెలంగాణ ప్రకటించి కాంగ్రెసు బావుకునేది ఏముంది? **– (సమాప్తం) ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2013)**

**అక్టోబరు 33** **ఎమ్బీయస్ : సమైక్యవీరులు**

ఈ మధ్య ఎటుచూసినా సమైక్యవీరులు కనబడుతున్నారు. వీళ్లను తయారుచేసిన ఘనత కాంగ్రెసుదే అని చెప్పాలి. పుట్టించేవాడు, గిట్టించేవాడు దేవుడే అన్నట్టు విభజనా, సమైక్యమూ రెండూ కాంగ్రెసు పుణ్యమే. నిద్రాణ స్థితిలో జారుకున్న తెలంగాణ అంశాన్ని జాగృతం చేస్తూ హఠాత్తుగా జులై 30న ప్రకటన చేయడమే కాక, సీమాంధ్రుల ఆందోళనను ఏ మాత్రం పట్టించుకోకుండా 'మీరంటే ఖాతరు లేదు, మీరెలా చచ్చినా పట్టించుకోము' అని బాహాటంగా చాటుతూ ఇన్నాళ్లూ ఆదమరచి నిద్రించిన సీమాంధ్రులను రెచ్చగొట్టింది. ఇక సమైక్య ఉద్యమం అంటుకుంది. ఆ మంట యీ లెవెల్లో వుంటుందని తెలియక యిన్నాళ్లూ తాత్సారం చేసిన నాయకులంతా వెంటనే ఆ ఉద్యమంలోకి దూకి నాయకత్వం వహించేద్దామని ఉబలాటపడ్డారు. కానీ ప్రజలు వాళ్లని దగ్గరకు రానివ్వలేదు. మిమ్మల్ని నమ్మి యిన్నాళ్లూ మోసపోయింది చాలు అంటూ దూరంగానే పెట్టారు. అధికారంలో వున్న కాంగ్రెసు వాళ్ల పరిస్థితి మరీ అన్యాయమై పోయింది. రాజీనామాలు ఆమోదింపచేసుకోకుండా వచ్చేరేం అని తరిమితరిమి కొడుతున్నారు.

సమన్యాయం పాట అందుకున్న టిడిపి వాళ్లను పెద్దగా గౌరవించటం లేదు. హరికృష్ణ తప్ప తక్కినవాళ్లెవరూ రాజీనామాలు చేయలేదని తెలియగానే జనాలు ఆశ్చర్యపడ్డారు. అదేమిటని అడిగితే – మేం చేసి ప్రయోజనం ఏముంది, కాంగ్రెసువాళ్లు చేయాలి కానీ అంటున్నారు. అధికారంలో వున్నవాళ్లు రాజీనామా చేయడానికి తటపటాయించారంటే ఏదో స్వార్థం వుంటుందిలే అనుకోవచ్చు. కానీ ప్రతిపక్షంలో వున్నవాళ్ల కేమొచ్చింది, పదవీ లేదు, పాడూ లేదు. ఎంపీగా మిగిలిన సమయం కూడా కొద్ది నెలలే. గాలికి పోయిన పేలపిండి కృష్ణార్పణం అన్నట్టు, ఉద్యమంకోసం త్యాగం చేశా అని పోజు కొట్టవచ్చు కదా. అది కూడా చేయలేదంటే ఎంత నాటకం ఆడార్రా బాబూ అనిపించింది. చంద్రబాబుగారు సమైక్య ఉద్యమానికి మద్దతు యిస్తానంటారు. కానీ నోటితో సమైక్యం

అనరు. ఢిల్లీదాకా వెళ్లి దీక్ష చేశారు. ఏం సాధించారో తెలియలేదు. సోనియాకోసం ఇటాలియన్ పదాలు నేర్చుకున్నారు కానీ మనకోసం ఒక్క చక్కని తెలుగుపదం – 'సమైక్యం' నేర్చుకుని పలకటం లేదు. విభజనకు అనుకూలమే అంటారు, కానీ పద్ధతి యిది కాదంటారు, ఏదో చెప్పరు. మీది విభజనవాదమో, సమైక్యవాదమో చెప్పండి చాలు అంటే గందరగోళంగా మాట్లాడతారు. పైగా మా మాటల్లో క్లారిటీ వుంది అంటారు. ఆయన దృష్టిలో యిదే క్లారిటీ అయితే గందరగోళం ఎలా వుంటుందో వూహించడానికే భయంగా వుంది.

తెలంగాణలో పార్టీకి దెబ్బ తగులుతుంది కాబట్టి జాగ్రత్తగా వున్నాం అని ఆంధ్ర టిడిపి నాయకులు సంజాయిషీ చెప్తారు. తెలంగాణలో పార్టీ కార్యకలాపాలే లేవు. ఏమైనా వుంటే అవి సమైక్య వుద్యమానికి విఘాతం కలిగించేవే. సమన్యాయం జరిపేదాకా విభజన ఆపాలని కేసు వేసిన పయ్యావులను యర్రబెల్లి దుయ్యబట్టారు. ఆంధ్రులు బ్రిటిష్ వారి కంటె ఘోరం అంటారు రేవంత్. వీరిని కంట్రోలు చేయలేని చంద్రబాబును సీమాంధ్రులు ఎందుకు ఆదరిస్తారు? సోనియా పక్కనే బాబుకి సీటు వేస్తున్నారు. అది గమనించని టిడిపి సమైక్య ఉద్యమంలో వున్న వారందరిపై బురద చల్లుతూ పోతోంది. జగన్, కిరణ్, కెసియార్ అందరూ సోనియా ఏజంట్లే అంటోంది. కిరణ్, జగన్ సమైక్యం ముసుగులో విభజనకు సహకరిస్తున్నారని అంటుంది. కనీసం వాళ్లకు ముసుగైనా వుంది. టిడిపికి అదీ లేదు కదా. వాళ్ల దృష్టిలో సమైక్యవాదులంటూ ఎవరూ లేరు. మరి వాళ్ల పార్టీలో సమైక్యం అంటూ అడావుడి చేసే దేవినేని, పయ్యావుల వంటి నాయకుల మాట ఏమిటో చెప్పాలి. పోనీ ప్రజలైనా సమైక్యం పక్షాన వున్నట్లు బాబు గుర్తించారా? గుర్తించి వుంటే వారి పక్షాన నిలవాలి కదా! ఈయన చెప్తున్న ప్యాకేజీలు, రాజధాని నిర్మాణానికి కోట్లు.. వగైరాలు వాళ్లు విననప్పుడు, వాళ్ల మాటైనా యీయన వినాలి. 'లేదు అరిచి గీ పెట్టినా వినను. ఎందుకంటే మేం గతంలోనే తెలంగాణకోసం లేఖ యిచ్చేశాం.' అని అంటే ఎలా? ఇప్పుడు హెూం శాఖ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తోంది. అనుకోకుండా మళ్లీ యింకో ఛాన్సు వచ్చింది టిడిపికి. కనీసం దాంట్లోనైనా టిడిపి మా విధానం సమైక్యం అంటుందా? అనలేకపోతే విభజన యీ పద్ధతుల్లో జరగాలి అంటూ బ్లూ ప్రింటైనా యివ్వాలి. లేకపోతే సీమాంధ్రుల్లో టిడిపి విశ్వసనీయత పూర్తిగా తుడిచిపెట్టుకుని పోతుంది.

టిడిపియే కాదు, ఏ పార్టీ ఐనా అనేకసార్లు పాలసీలు మార్చుకుంటూ వుంటారు. ఒకప్పుడు సమైక్యానికి నిలబడిన సిపిఐ యిప్పుడు విభజన అనలేదు. మద్యనిషేధం గురించి, రెండు రూపాయలకు బియ్యం గురించి టిడిపి తన విధానాలను మార్చుకోలేదా? సీమాంధ్రలో ఉవ్వెత్తున్న వచ్చిన ఉద్యమం చూసి జగన్ తన స్టాండ్ మార్చుకోలేదా? అధిష్టానం మాట శిరోధార్యం అన్న కిరణ్ కూడా మారలేదా? బొత్స, పనబాక, చిరంజీవి, పళ్లంరాజు... యిలా చాలామంది గతంలో కంటె మెట్టు దిగి 'కనీసం హైదరాబాదును యుటి చేయండి' అని హై కమాండ్‌ను బతిమాలుకుంటున్నారు. ఇందరు మారగా లేనిది బాబు ఎందుకు మారకూడదు? 'మీరేమనుకున్నా సరే, గతంలో నేను యిచ్చిన మాటకు కట్టుబడి వుండాల్సిందే' అని మొండికేస్తే సోనియాకు, యీయనకు తేడా ఏముంది? సోనియా కూడా యిలాగే మాట్లాడుతోంది కదా! తమను నాశనం చేయడానికే సోనియా విభజన తలపెట్టిందని టిడిపి చెపుతూంటే నవ్వు వస్తుంది – వీళ్లేదో పెద్ద ఫోర్సు అని ఎలా అనుకుంటున్నార్రా అని. టిడిపి ఒకప్పుడు ఫోర్సు. ఇప్పుడు కేవలం ఫార్సు. రెండు చోట్లా వున్నాం అనుకుంటూ రెండు చోట్లా గుడ్‌విల్ పోగొట్టుకున్నారు. ఎన్టీయార్ ప్రవచించిన తెలుగు ఆత్మగౌరవం నినాదాన్ని, సమైక్య నినాదాన్ని వైకాపా తన్నుకుపోతే బాబు చూస్తూ వూరుకుంటున్నారు.

'కొత్త రాష్ట్రాలకు రాజధాని కట్టడం మా స్పెషాలిటీ. అభివృద్ధి చేయడంలో మమ్మల్ని తలదన్నేవారు లేరు, విడిపోయాక సమైక్యం అనే నినాదానికి అర్థం లేకుండా పోతుంది. అప్పుడు ఫోకస్ అంతా నిర్మాణం మీదనే. దానికి మమ్మల్నే పిలవాలి. ఈ కారణం చేత మమ్మల్ని యిరుప్రాంతాల్లో ఎన్నుకోక తప్పదు – యిదీ బాబు నమ్మకం, ఆయన సమర్థకుల వాదన. ఏదైనా కట్టాలంటే కేంద్రం నుండి నిధులు తెచ్చుకోవాలి. కేంద్రంలో ఏర్పడే ప్రభుత్వం బాబుతో స్నేహం నెరపేది, బాబు మద్దతుపై ఆధారపడేది అయితేనే నిధులు వస్తాయి. బాబు పార్టీ అంటే పడని ప్రభుత్వం వస్తే నిధులు రావు. ఇక రెండో పాయింటు – నిర్మాణం చేయగల శక్తి బాబుకి మాత్రమే వుందనడం వింత వాదన. హైదరాబాదులో ప్రభుత్వ సంస్థల లిస్టు అంటూ వందకు పైగా సంస్థల పేర్లు యీ మధ్య ఫార్వార్డ్‌లో తెగ వస్తున్నాయి. బిఎచ్ఇఎల్, డిఫెన్సు లాబ్స్, ఆర్డినెన్సు ఫ్యాక్టరీ, నిమ్స్... యిలా బోల్డు వున్నాయి. వాటిలో తొమ్మిదేళ్ల బాబు హయాంలో వచ్చినవి ఎన్నో ఒక్కసారి పరికించి చూడండి. మీకే తెలుస్తుంది హైదరాబాదుకు ఖ్యాతి తేవడంలో యీయన పాత్ర ఎంత పరిమితమో! కాంగ్రెసు ప్రభుత్వాల హయాంలో ఎన్నో సంస్థలు వచ్చాయి. ఎన్‌టిఆర్ హయాంలోనూ కొన్ని వచ్చాయి. వాళ్లెవరూ కొట్టుకోనంతగా యీయన డప్పు కొట్టుకోవడం వలన బాబు లేకపోతే ఆంధ్రప్రదేశ్ అడుక్కుని తింటుందన్న బిల్డప్ యిచ్చే మీడియా తయారైంది. ఎన్నికలు దగ్గరపడిన కొద్దీ యీ విషయం తేటతెల్లం అయేసరికి టిడిపికి ఎన్నికల్లో యుఎస్‌పి ఏదీ లేకుండా తయారవుతుంది. సమైక్యనినాదం చేపట్టకపోతే ఎక్కడా ఉనికి లేకుండా పోతామన్న స్పృహ బాబుగారికి కలిగేదాకా ఆ పార్టీకి భవిష్యత్తు లేదు.

ఇక వైకాపా – టిడిపి వారు యీ మధ్య అందిపుచ్చుకున్న సమన్యాయం పల్లవి కాపీరైట్ వీళ్లదే. ఆర్టికల్ 3 ప్రకారం కేంద్రానికే సర్వాధికారాలు, మేం యివ్వనూ లేం, అడ్డుకోనూ లేము నిమిత్తమాత్రులం అని చెప్పుకుంటూ గడిపారు. ఇప్పుడీ సమైక్య ఉద్యమం జోరు చూడగానే సమన్యాయం నుండి సమైక్యం వైపుకి వచ్చిపడ్డారు. సమైక్యం అన్నాం కదాని, అందరి కంటె ముందుగా రాజీనామాలు చేశాం కదాని సీమాంధ్ర ప్రజల ఉద్యమాలకు నాయకత్వం వహించాలని ఉబలాటపడ్డారు. కానీ సమైక్య ఉద్యమకారులు వైకాపాను

వాటేసుకోలేదు. అలా అని నిందించనూ లేదు. చూద్దాంలే అన్నట్టు ఉదాసీనంగా వున్నారు. జగన్‌కు యిది చాలలేదు. ఏకైక సమైక్యవీరుడిగా అవతారం ఎత్తుదామని నిశ్చయించారు. అది అతని అవసరం కూడా. ఎందుకంటే సమైక్యం ముసుగులో విభజనకు సహకరించాలన్న షరతుపైనే సోనియాతో డీల్ కుదిరి బెయిల్ లభించిందని టిడిపి జోరుగా ప్రచారం చేస్తోంది. ఆ మచ్చ తుడుపుకుందామని జగన్ హైదరాబాదులో పెద్ద సభ పెట్టి, సోనియాను ఘాటుగా విమర్శించారు. 'అది కూడా డీల్‌లో భాగమే, ఆ సభను విజయవంతం చేయడానికి కాంగ్రెసు రైళ్లు నడిపింది, జనసమీకరణ చేసింది, దానికి తెరాస తోడ్పడింది' అన్నారు టిడిపివారు. ఒక్కదెబ్బతో శత్రువులందరినీ ఒక్క గాటికి కట్టేసి తిట్టేశారు. ఆర్టికల్ 3 వుందని, దాని ప్రకారం విభజించమని జగనే సోనియాకు సలహా యిచ్చారని టిడిపి ఆరోపణ. లేకపోతే సోనియాకు యీ విషయం తెలియదా!?

జగన్ సభకు ఎన్నో ఆంక్షలు విధించారని మర్చిపోకూడదు. జనసమీకరణకు ప్రభుత్వం సాయపడనక్కరలేదు. సమైక్యవాదంలోనే ఆ ఫోర్సు వుంది. ఎన్‌జిఓల సభకు అన్ని పరిమితులు పెట్టి నియంత్రించారు కానీ ఏ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లోనో పెడితే జనం యింకా వచ్చేవారు. జగన్‌కు సొంత గ్లామర్ వుంది. పైగా సమైక్యానికి ఏకైక ఆశాదీపంగా కనబడుతున్నాడు. ఇలాటి సభలు యింకో నాలుగు పెట్టినా వాటికీ జనం వస్తారు. పెట్టాలన్నా దృఢసంకల్పం వుండాలంతే. ఇది గమనించే తెరాస దీన్ని ఆపే ప్రయత్నం విరమించుకుంది. గతంలో ఎన్‌జిఓ సభ అడ్డుకోబోయి భంగపడిన విషయం వాళ్లకు గుర్తుంది. అడ్డుకోకపోవడం, జగన్ తన ఉపన్యాసంలో కెసియార్ మాట ఎత్తకపోవడంతో వైకాపా-తెరాస డీల్ వుందని మొదలెట్టారు. అలా అంటున్నారని విజయలక్ష్మిగారి ఖమ్మం పర్యటనను తెరాస అడ్డుకుంది. 'తెలంగాణ ఎలాగో వస్తోంది, వీళ్లు వచ్చి మొత్తుకుంటే ఏమవుతుంది?' అని కెసియార్ చెపుతూండగా మళ్లీ దానికి విపర్యంగా జరగడం వింతగా వుంది. అడ్డుకోవడం వలన అడ్డుకున్నవారి బలహీనతే బయటపడుతుంది. తెలంగాణ వస్తుందన్న నమ్మకం తెరాసకు కొరవడిందన్న సందేశం వెళుతుంది.

వర్షాలు విపరీతంగా పడుతున్నాయి కాబట్టి జగన్ మీటింగుకి జనం రారనుకున్నారు కానీ కుప్పలుతిప్పలుగా వచ్చారు. సమైక్యవాదానికి సహజంగానే బలం వుంది. ప్రస్తుత పరిస్థితిలో సీమాంధ్రుల్లో భవిష్యత్తు గురించి భయాందోళనలు కూడా విపరీతంగా వున్నాయి. కేంద్రం నుండి ప్యాకేజి వస్తుందా రాదా, వస్తే ఎలాటిది వస్తుంది, వచ్చినా అమలవుతుందా అన్న సందేహాలు చాలా వున్నాయి. ఈ గందరగోళంలో ఎవరు తమ తరఫున మాట్లాడినా వారిని దేవుళ్లా చూస్తారు సీమాంధ్రులు. ఆ రోజు మీటింగులో జగన్ చాలా పకడ్బందీగా ఉపన్యాసం యిచ్చారు. సమైక్యమే నా మార్గం, కేంద్రంలో ఎవరైతే రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచుతారో వారికే నా మద్దతు అని నిర్ద్వంద్వంగా ప్రకటించారు. ఈ స్పష్టత యిన్నాళ్లూ లేదు. 'తెలంగాణ సెంటిమెంటు గుర్తిస్తాం. అసలు తెలంగాణకోసం చిన్నారెడ్డి ద్వారా ఉత్తరం పంపినది వైయస్సారే' అంటూ విజయమ్మ పరకాల ఉపయెన్నికలలో మాట్లాడినప్పుడు యీ సమైక్యం అటకెక్కించారు కదా. సమన్యాయం చేస్తే చాలు, విభజించేయండి అన్నారు కదా. 'విభజన అడ్డుకునే శక్తి మాకు లేదు' అని ప్లీనరీలో మాట్లాడిన జగన్ యీ రోజు ఏ ధైర్యంతో 'అడ్డుకోగలం' అంటున్నారు. హఠాత్తుగా ఎక్కణ్నుంచి శక్తి వచ్చింది? ఆనాడు బిజెపి మాకు ప్రధాన శత్రువు కాబట్టి యుపిఏకు మద్దతు యిస్తాం అన్నారు. ఈ రోజు యుపిఏ కావచ్చు, ఎన్‌డిఏ కావచ్చు, మూడో ఫ్రంట్ కావచ్చు ఎవరు సమైక్యంగా వుంచితే వారికే నా మద్దతు అంటున్నారు. ఫోకస్ ఎందుకు మారింది? జగనే మార్చారు.

ఇన్నాళ్లూ జగన్ ఫోకస్ – కాంగ్రెస్ దుష్పరిపాలన, టిడిపి అవకాశవాదం, బిజెపి మతతత్వం వగైరా. ఇప్పుడు మొత్తం ఫోకస్ – సమైక్యం. దాన్నే ఎన్నికల అంశంగా మారుద్దామని జగన్ నిశ్చయించుకున్నారు. ఇలా మార్చడం ద్వారా జగన్ కేసుల నుండి ఫోకస్ మారిపోతుంది. తక్కిన పార్టీలన్నీ జగన్ కేసుల మీద ఆధారపడే తమ స్ట్రాటజీ తయారుచేసుకున్నాయి. జగన్ వస్తే రాష్ట్రాన్ని కబళించేస్తాడు జాగ్రత్త అని. ఇప్పుడు జగన్ వ్యూహం ఫలించి సమైక్యమే ఎన్నికల అంశం అయిపోతే ప్రజలు యిక దాని గురించే మాట్లాడతారు. సమైక్యం గురించి నిలబడినవారిపై అభిమానం కురిపిస్తారు. వారి వైఫల్యాలు, వారిపై ఆరోపణలు కాస్సేపు మర్చిపోతారు. సమైక్యం ఎన్నికల అంశంగా మారితే సమైక్య ఛాంపియన్లు సీమాంధ్ర మొత్తమే కాదు, తెలంగాణలో కొన్ని ప్రాంతాల్లో కూడా గెలిచి, ముఖ్యపాత్ర పోషిస్తారు. రాష్ట్రం కలిసున్నా, విడిపోయినా 2014 ఎన్నికల్లో మొత్తం స్వీప్ చేసే పార్టీ ఏదీ లేదు. నెగ్గే పార్టీకి సింపుల్ మెజారిటీ వస్తుందో రాదో కూడా డౌటే. అలాటి పరిస్థితిలో ఉమ్మడి రాష్ట్రంలో కనీసం 120-130 సీట్లు తెచ్చుకునే అవకాశం సమైక్య ఛాంపియన్‌గా నిలబడే పార్టీకే వుంది. ఒకవేళ రాష్ట్రం విడిపోతే సీమాంధ్రలో కనీసం 100 సీట్లు రావడం గ్యారంటీ.

ఈ విషయాన్ని బాబు విస్మరిస్తున్నారు, జగన్ గట్టిగా పట్టుకున్నారు. సోనియా డైరక్షన్‌లోనే జగన్ నటించాల్సిన అవసరం లేదు. 2014 ఎన్నికలలో ఎక్కువ సీట్లు తెచ్చుకోవడమే జగన్ లక్ష్యం. ఆ సీట్లు చూపించే సిబిఐ మళ్లీ తనపైకి రాకుండా చూసుకోగలరు. సోనియా మాట వింటున్నాడు కదాని జనం ఓట్లేయరు. తమకు నచ్చే మాట చెపితేనే వేస్తారు. సీమాంధ్రులకు ప్రస్తుతం సోనియా శత్రువు. ఆమెకు వ్యతిరేకంగా మాట్లాడితేనే ఓట్లు పడతాయి. ఓట్లు పడి గెలిచాక జగన్ సోనియా మాట వింటారా లేదా అన్నది అప్పటి పరిస్థితిపై ఆధారపడుతుంది. ఒకవేళ సోనియాయే అధికారంలోకి వస్తే, ప్రజాభిప్రాయం మాట ఎలా వున్నా తన ప్రయోజనాల కోసం జగన్ ఆమెవైపు మళ్లవచ్చు. ప్రజలు నిలదీస్తే ఏదో ఒకటి చెప్పవచ్చులే అనుకోవచ్చు. అయితే ఒకవేళ సోనియా అధికారంలోకి రాకపోతే..? అప్పుడు యీనాటి ఒప్పందం జగన్ పట్టించుకుంటారా? పట్టించుకోవాలని సోనియా పట్టుబట్టగలరా? సోనియా మళ్లీ అధికారంలోకి వస్తారా రారా అన్నదానిపై యావత్తు ఆధారపడి వుంది.

ప్రస్తుతం నడుస్తున్న పాలన చూస్తుంటే యుపిఏ మళ్లీ అధికారంలోకి వస్తుందని ఎంతటి ఆశావాదీ చెప్పలేడు. ధరలు పెరిగిపోయాయి,

అవినీతి ఆరోపణలు పెచ్చుమీరాయి. మన్‌మోహన్ కీర్తి మసకబారింది. అవతల మోదీ దూసుకుంటూ వస్తున్నారు. అందువలన కేంద్రంలో కాంగ్రెసు మళ్లీ అధికారంలోకి రాదని సర్వే ఫలితాలు చెపుతున్నాయి. అయితే కొన్ని రాష్ట్రాలలో స్థానిక నాయకుల కారణంగా కాంగ్రెసు బలంగా వుండి కొన్ని సీట్లు తెచ్చుకుంటుంది. మోదీకున్న యిమేజి కారణంగా బిజెపి గణనీయంగా సీట్లు పెంచుకున్నా, ప్రధానిగా మోదీ ఆమోదయోగ్యుడు కాకపోవచ్చు. అందువలన ప్రాంతీయపార్టీలన్నీ కలిసి బేరాలాడుకుని ఓ కూటమి తయారుచేస్తే దానికి కాంగ్రెసో, బిజెపియో బయటనుండి మద్దతు యివ్వవచ్చు. ఇలా ఏదైనా సంభవమే. అందువలన ప్రాంతీయపార్టీలన్నీ తమ బలం పెంచుకోవడంపై దృష్టి సారిస్తాయి. వైకాపా కూడా అదే దృక్పథంతో వుంది. 'సోనియాకు తోక' అనే ముద్ర పడితే ప్రజలు ఛీకొడతారు. అందువలన పోనుపోను జగన్ సోనియాపై మరింత ఘాటు విమర్శలు చేయడం తథ్యం. సోనియా విభజన చేశారు కాబట్టి ఆమెకు వ్యతిరేకంగా నిలబడడానికి సమైక్యజపం మరింత ధాటీగా చేస్తారు, చేస్తున్నారు. సోనియా విదేశీయత గురించి పదేపదే ప్రశ్నిస్తున్నారు. మిమ్మల్ని ఇటలీ వెళ్లిపోమంటే బాధగా వుండదా? అని అడుగుతున్నారు.

ఇప్పుడు సమైక్యత కోసం అంటే ఢిల్లీ ప్రయాణం కట్టారు. అన్ని పార్టీలనీ కలుస్తారట. మంచిదే. ఇతరులెంతమందిని కలిసినా బిజెపిని కలిసి ఒప్పించడమే ముఖ్యం. బిజెపి తలచుకుంటే బిల్లు ఆగిపోతుందని అందరికీ తెలుసు. బిజెపి విధానాలంటే సరిపడని సమైక్యవాది సైతం యిప్పుడు బిజెపి కేసే ఆశగా చూస్తున్నాడు. గుండెల్లో సమైక్యం వున్నా తన నోటితో సమైక్యం అనలేని చంద్రబాబు బిజెపి ద్వారా మళ్లీ విభజనను ఆపిస్తారని చాలామందికి అనుమానం. విభజన వలన తన బావుకునేది లేదని గ్రహించిన బిజెపి బాబు మాట వినవచ్చు కూడా. ఎందుకంటే టిడిపి-బిజెపి పొత్తులో చాలా సమంజసత వుంది. ఎన్నికల తర్వాత యుపిఏ ప్రభుత్వంలోకి రాని పక్షంలో (దానికే ఎక్కువ అవకాశాలు కనబడుతున్నాయి) బిజెపి నేతృత్వంలో ఎన్‌డిఏ అధికారంలోకి వస్తే బాబు మద్దతు యివ్వవచ్చు. వాళ్లు తీసుకోనూ వచ్చు. అలా మద్దతిచ్చిన బాబు రాష్ట్రంలో తనకు పక్కలో బల్లెంగా వున్న జగన్‌ను మళ్లీ జైలుకి పంపాలని కోరవచ్చు. మరిన్ని కేసులు బనాయించాలని కోరనూ వచ్చు. ఈ భయంతో జగన్ యిప్పుడు బిజెపిని కలిసి 'టిడిపి కంటె నాకు ఎక్కువ సీట్లు వస్తాయి. బాబును దూరం పెడితే నేనే మద్దతు యిస్తాను చూస్కోండి. నా పై కాంగ్రెసు కేసులు పెట్టినట్టు బాబుపై కూడా పెట్టాలి మరి' అనవచ్చు. బిజెపి యిద్దరికీ భుజం తట్టి ఎన్నికల తర్వాత ఎవరికి ఎక్కువ సీట్లు వస్తే వారివైపు మొగ్గి యింకోరి భరతం పట్టవచ్చు. చేతిలో సిబిఐ వుంటే చాలు, ఏమైనా చేయవచ్చుగా.

2014 ఎన్నికల తర్వాత మూడో ఫ్రంట్‌కు గాని, యుపిఏకు గాని మద్దతు యిస్తాను తప్ప మతతత్వ పార్టీ అయిన బిజెపితో ఛస్తే కలవను అని ప్రకటించిన జగన్ యీరోజు రాజకీయావసరాలకై యిలా బిజెపివైపు మొగ్గడం ఎబ్బెట్టుగానే వుంటుంది. అందుకే సమైక్యం అనే బ్యానర్‌పై కలుస్తున్నాడు. గతంలో నానాగోత్రాల వాళ్లూ కలిసి మూడో ఫ్రంట్ ప్రభుత్వాన్ని ఏర్పరచారు. దరిమిలా యుపిఏకు మద్దతు యిచ్చారు. ఎందుకు? అంటే ఒకటే సమాధానం - 'అవినీతి, అసమర్థత కన్న మతతత్వం చాలా ప్రమాదకరమైనది. బిజెపి మతతత్వ పార్టీ కాబట్టి దాన్ని అధికారం నుండి దూరంగా వుంచడానికి మేం మాకిష్టం లేకపోయినా సెక్యులరిస్టు పార్టీ అయిన కాంగ్రెసుకు మద్దతిస్తున్నాం, లేదా జనతాదళ్‌కు యిస్తున్నాం..' యిలా చెప్పుకునేవారు. మీడియా కూడా లాలూ, ములాయం, మాయావతి, జయలలిత యిలాటి వాళ్లపై కూడా ఆదరం చూపుతుంది - ఎందుంటే వాళ్లు సెక్యులరిస్టులు! సెక్యులరిజం అనే పేరు చెపితే చాలు ఎవరినైనా, ఎన్ని లోపాలున్నా వాటేసుకోవచ్చు యీ దేశంలో! ఇప్పుడు జగన్‌కు అలా సమైక్యం దొరికింది. సమైక్యం కోసం బిజెపితో లుస్తున్నా అని చెప్పుకోవచ్చు. ఇప్పటికే 'మోదీ పరిపాలనాదక్షుడు, మతతత్వం కాస్త తగ్గించుకుంటే మంచి నాయకుడు' అని ఓ కితాబు - పడి వుంటుంది కదాని- పడేశాడు.

మోదీని యిలా పొగడుతున్న నోటితోనే సోనియాను నానా తిట్లూ తిడుతోంది వైకాపా. 'మేం విభజనను అడ్డుకోలేము, కేంద్రమీదే భారం వేసి వుంచాము. హస్తినవాసినీ తల్లీ, తండ్రి వలె మమ్మల్ని చూడుము, సమన్యాయము చేయుము అని బతిమాలాము' అని నిన్నటిదాకా చెప్పిన ధోరణికి, యీనాటి ధిక్కారధోరణికి హస్తిమశకాంతరం వుంది. మెజారిటీ తెలుగు ప్రజల్లో సమైక్యానికి డిమాండు వుందని, విభజన అవకతవకగా జరగడం పట్ల తెలుగువారందరూ ఆగ్రహిస్తున్నారనీ గ్రహించినమీదట వచ్చిన ధీమా యిది. సమైక్య ఛాంపియన్‌గా వెలిగిపోవడానికి జగన్ ఏ ఛాన్సూ వదలటం లేదు. తనవరకూ ప్రయత్నించుకుంటే తప్పు లేదు. కానీ అదే చేత్తో యితర సమైక్యవాదులను తొక్కేసే ప్రయత్నం చేస్తున్నారు జగన్. తను తప్ప తక్కిన అందరూ కుహనా సమైక్యవాదులే అని, వాళ్లు చేసేదంతా కుట్ర అనీ, బయటకు సమైక్యవాదం అన్నా లోపలంతా విభజనవాదమే అనీ చూపించడానికి సర్వయత్నాలూ చేసి వెగటు పుట్టిస్తున్నారు జగన్. ఆయన టార్గెట్లు యిద్దరు - బాబు, కిరణ్.

బాబు సిద్ధాంతరీత్యా సమైక్యవాది అయినా ఓట్లకోసం విభజనవాదం వల్లిస్తున్నారని అందరికీ అనుమానం. కాంగ్రెసు తెలంగాణ యివ్వదన్న ధీమాతో వేరుతెలంగాణ వైపు చాలా దూరం వెళ్లిపోయారనీ, మళ్లీ వెనక్కి రావడానికి, మాట మార్చడానికి అవస్థపడుతున్నారని, బింకం కొద్దీ పాత లేఖకు కట్టుబడి వున్నారు కానీ  తనకు చెడ్డపేరు రాకుండా విభజన ఆగిపోతే అంతేచాలని ప్రార్థిస్తున్నారనీ రాష్ట్రంలో అన్ని ప్రాంతాల వారూ నమ్ముతారు. లేఖ యిచ్చినా తెలంగాణలో టిడిపి ఏమీ పుంజుకోలేకపోవడానికి యిదే కారణం. వచ్చే నాలుగూ ఓట్లూ టిడిపికి ఎప్పటినుండో వున్న ఓటు బ్యాంకు కారణంగా వస్తున్నాయి తప్ప వేరుతెలంగాణా వాదులెవరూ టిడిపికి ఓటెయ్యడం లేదు. తెరాసతో పొత్తు పెట్టుకోవడం తను చేసిన ఘోరతప్పిదంగా బాబు  పలుమార్లు చెప్పుకున్నారు. ఎన్‌డిఏ హయాంలో బిజెపితో చెప్పి తెలంగాణ ఆపించానని కూడా చెప్పుకున్నారీమధ్య. ఇప్పుడు తెలంగాణ కల సాకారం కాబోయే తరుణంలో

పయ్యావుల, సిఎం రమేష్ వంటి బాబు ఆత్మీయులు కోర్టుకు వెళ్లారంటే ఆయన ఆశీస్సులు లేవని ఎవరు నమ్మగలరు? కాంగ్రెసుపార్టీలో ఎవరు పడితే వాళ్లు ఏది కావాలంటే అది మాట్లాడతారు. సబ్ కుఛ్ చల్తా. కానీ టిడిపి కాంగ్రెసు వంటి పార్టీ కాదు. అధినాయకుణ్ని దాటి ఎవరూ వెళ్లలేరు. ఒక్క తెలంగాణ విషయంలో తప్ప తక్కినవాటిలో టిడిపి వారందరిదీ ఒకటే మాట. తెలంగాణ విషయంలో మినహాయింపు ఎందుకంటే రెండు చోట్లా రెండు రకాల సెంటిమెంట్లు వున్నాయి కాబట్టి! 'ఎవరు ఏం మాట్లాడినా అవేమీ లెక్కలోకి రావు. నేను చెప్పినదే ఫైనల్' అని బాబు ఎప్పుడో హెచ్చరించారు. ఆయన ఏమీ చెప్పరు. ఒకవేళ చెప్పినా అర్థమయ్యేట్లు చెప్పరు. అందువలన బాబుని టార్గెట్ చేయడం యీజీ. పైగా అవిశ్వాస తీర్మానం పెట్టలేదని, ఎఫ్‌డిఐ బిల్లుకు అనుకూలంగా వ్యవహరించారని.. వంటి ఉదాహరణలు చూపి బాబు, సోనియా కుమ్మక్కయ్యి ఉమ్మడి శత్రువైన తనను జైల్లో పెట్టించారనీ జగన్ ఎప్పణ్నుంచో ఆరోపిస్తున్నారు. పైగా బాబు బాహాటంగా సమైక్యం అనటం లేదు. అందువలన ఆయనను సమైక్యవాది కాదని నిరూపించడం కష్టం కాదు.

ఇక కిరణ్ దగ్గరకు వచ్చేసరికి చాలా యిబ్బందులు వస్తున్నాయి. ఈనాడు ఎవరూ చెప్పనంత ధాటీగా కిరణ్ తను సమైక్యవాది అని చెప్పుకుంటున్నారు. ఇదంతా సోనియా ఆడిస్తున్న డ్రామానా అని మొదట్లో చాలామంది సందేహించిన మాట వాస్తవం. ఎందుకంటే కిరణ్‌కు స్వయం ప్రతిపత్తి లేదు. చిదంబరం ప్రాపు సంపాదించి సిఎం అయ్యాడనే అందరూ అంటారు. కాబినెట్‌లో సగం మంది వ్యతిరేకులే. ఎవర్నీ కలుపుకుని వెళ్లలేదు. రేపు సోనియా తీసేస్తే వెంట పదిమంది కూడా వస్తారన్న నమ్మకం లేదు. అలాటప్పుడు ఎలా ఎదిరిస్తాడు అని అందరూ ఆశ్చర్యపడ్డారు. కానీ ఢిల్లీలో తెలంగాణ ఎక్స్‌ప్రెస్ పరిగెడుతున్న విధం చూస్తూ వుంటే సోనియా కిరణ్ చేత యిలా ఆడిస్తోందని అనుకోవడానికి ఆస్కారం లేకుండా వుంది. కిరణ్ ఢిల్లీ వెళ్లడమే మానేశారు. సమైక్యమే నా పాలసీ అని లిఖితపూర్వకంగా కాంగ్రెసు అధిష్టానానికి రాసి పంపించారు. ప్రభుత్వం నుండి వెళుతున్న నివేదిక కూడా విభజన ఎంత కష్టమో చాటి చెప్పేట్లు తయారు చేయించారు. విభజన సునామీని ఆపడానికి యావత్తు ప్రయత్నం చేస్తానంటున్నారు. నేను వున్నంతకాలం విభజన జరగదు అంటున్నారు. ఈయన్ని కట్టడి చేయడానికి దిగ్విజయ్ సింగ్ ప్రయత్నించినా లాభం లేకపోయింది. కిరణ్ విభజనకు ఒప్పుకున్నారు అని దిగ్విజయ్ చెప్పిన ఉత్తరక్షణంలో కిరణ్ ఖండించారు. దిగ్విజయ్ ఇంకేం మాట్లాడలేకపోయారు. ఉపముఖ్యమంత్రితో సహా తెలంగాణవాదులంతా కిరణ్‌ను నిత్యం తిడుతున్నారు. కిరణ్‌ను తీసేయాలని డిమాండ్ చేస్తున్నారు. దేనికీ జవాబు చెప్పకుండా సహిస్తూ తన పని తను చేసుకుంటూ పోతున్నాడు.

ఇలాటి కిరణ్ మనసులో విభజనవాది అని జగన్ ఆరోపిస్తూ వుంటే హాస్యాస్పదంగా వుంది. నిజానికి పదవిలోకి వచ్చిన దగ్గర్నుంచి కిరణ్ విభజనోద్యమాన్ని అణచడానికి చూస్తూనే వున్నారు. నిజానికి రోశయ్య చేయలేకపోయినది, కిరణ్ చేసినదీ యిదే. రోశయ్య హయాంలో జరిగిన మిలియన్ మార్చ్‌లో టాంక్‌బండ్‌పై తెలుగుప్రముఖుల విగ్రహాలు కూలాయి. దోషులెవరో యిప్పటిదాకా గుర్తించలేదు, కేసు పెట్టలేదు. కిరణ్ హయాంలో జరిగిన మిలియన్ మార్చ్ పూర్తిగా నియంత్రించబడింది. ముందస్తు అరెస్టులు చేయడానికి గాని, అనుమతులు ఆఖరి నిమిషందాకా యివ్వకుండా వుండడానికి గాని, ఇచ్చినా షరతులు పెట్టడానికి గాని దేనికీ జంకలేదు కిరణ్. విభజనవాదులు కిరణ్ అంటే మండిపడుతూనే వచ్చారు. హై కమాండ్ అప్పట్లో విభజనకు వ్యతిరేకంగా వుంది కాబట్టి కిరణ్‌కు ఆదేశాలిచ్చి యిలా చేయించారని, దానిలో కిరణ్ ఘనత ఏమీ లేదనీ సులభంగా అనేయవచ్చు. వ్యక్తిగతమైన కన్విక్షన్, ద ృఢవిశ్వాసం వుంటే తప్ప ఆ ఆదేశాలను కిరణ్ చిత్తశుద్ధితో అమలు చేసి వుండేవారు కారు. రోశయ్యకూ యిలాటి ఆదేశాలే యిచ్చి వుంటారు. ఆయనా సమైక్యవాదే అయినా యిలా చేస్తే 'నా రాజకీయ భవిష్యత్తు ఏమవుతుందో' అని ఆయన జంకి వుండవచ్చు. రాజకీయ చరమదశలో వున్న రోశయ్య వెనకాడగా, యింకా పాతికేళ్ల భవిష్యత్తు వున్న కిరణ్ దాన్ని పణంగా పెట్టి ధైర్యంగా వ్యవహరించారు. అదీ కిరణ్ గొప్పతనం.

ఈ గొప్పతనాన్ని వైకాపా గుర్తించడం లేదు. నిజానికి జగన్ కాంగ్రెసులో వుండగా తను సమైక్యవాది అని చూపించుకోవడానికి పార్లమెంటులో ప్లకార్డు పట్టుకోవడం తప్ప మరేమీ చేయలేదు. కిరణ్ ఏకంగా సమైక్యవాదమే నా నినాదం అంటూ లేఖ రాశారు. అది అసాధారణం – ముఖ్యంగా కాంగ్రెసు చరిత్రలో ! అంతిమంగా సోనియా మాటే చెల్లి రాష్ట్రం విడిపోవచ్చు కానీ విభజన వ్యతిరేకించిన ముఖ్యమంత్రిగా కిరణ్ చరిత్రలో మిగిలిపోతారు. 'కిరణ్ సమైక్యం గురించి యిప్పుడు చెప్తున్నారు. కాంగ్రెసు అధిష్టానం ముందు చెప్పాల్సింది. అక్కడ చెప్పకుండా మన దగ్గర బోగస్ కబుర్లు చెప్తున్నారు' అంటూ వైకాపా, టిడిపి నాయకులు చెప్తున్నారు. అధిష్టానం ముందు ఆయన యిచ్చిన ప్రజంటేషన్ పేపర్లలో విపులంగా వచ్చింది. దానిని ఎవరూ ఖండించలేదు. 'విభజిస్తే రాష్ట్రంలోని యిరు ప్రాంతాలకే కాక, పార్టీకి కూడా నష్టమే అని చెప్పాను. కానీ వారు వినలేదు. నా ప్రయత్నం నేను చేస్తున్నాను.' అని కిరణ్ ప్రజల మధ్యకు వచ్చి చెపుతున్నారు. లేదు అబద్ధం చెపుతున్నాడు, అని ఢిల్లీ నుండి ఏ నాయకుడూ అనటం లేదు. బిల్లు అసెంబ్లీకి ఒకసారి వస్తుందా, రెండుసార్లు వస్తుందా అన్న విషయంలో కిరణ్ ప్రజల్ని తప్పుదోవ పట్టించాడని వైకాపా ఆరోపించింది. అప్పుడు కిరణ్ దిగ్విజయ్ సింగ్ చెప్పినదే తాను చెప్పానని ప్రకటించారు. విషయం అలా బయటపెట్టేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో దిగ్విజయ్ షిండే మీదకు నెట్టేశారు. లేకపోతే అంతా కలిసి కిరణ్ పరువు తీయడానికే చూశారు.

కిరణ్ మా మాట జవదాటరు అని ఢిల్లీ నాయకులు పాట పాడుతూనే వున్నారు. మరి విధేయుడైన వ్యక్తికి వ్యతిరేకంగా నాయకులను కూడగట్టడం దేనికి? కిరణ్‌ను మార్చం అంటూనే ప్రత్యామ్నాయాలు వెతుకుతున్నారని తోస్తూనే వుంది. అది అంత సులభమైన పని

కాదు. కిరణ్‌ను తీసి తెలంగాణ వ్యక్తిని పెడితే సీమాంధ్రులకు మరీ కోపం వస్తుంది. అతడు ఏం చేసినా ద్రోహం చేస్తున్నట్లే తోస్తుంది. పోనీ ఆంధ్ర వ్యక్తిని పెట్టినా యితను ఢిల్లీ తొత్తు, కిరణ్ మనను కాపాడుతున్నాడని యితన్ని తెచ్చారు అనుకుంటారు. 'వేసేటప్పుడు వేపకొమ్మ, తీయబోతే అమ్మోరు' అని సామెత. ఎందుకంటే మధ్యలో వేపకొమ్మకు మహిమలు వచ్చేశాయని అందరూ నమ్మడం మొదలెడతారు. పీకి పారేయడం సాధ్యం కాదు. కిరణ్ విషయంలో అదే జరుగుతోంది. చిదంబరం పెట్టిన కాండిడేట్ కదా, దిగిపోమంటే దిగిపోతాడు అనుకున్నారు. నీలాటి అర్భకుణ్ని ముఖ్యమంత్రిని చేసిన కాంగ్రెసు పట్ల విధేయత లేదా? అంటే విధేయత వుంది, దానితో పాటు సమైక్యత పట్ల నిబద్ధత కూడా వుందని చెప్పారట కిరణ్. రాష్ట్రపతిపాలన పెడితే తప్ప యితన్ని దింపలేరు. అంతకంటె అప్రతిష్ట లేదు. ఓ మామూలు సిఎం సోనియాకు ఎదురు తిరిగాడని లోకానికి విదితం అయిపోతుంది. రేపు ఎన్నికల వేళ ప్రతీవాడూ తోక ఝాడిస్తాడు. టిక్కెట్టు యివ్వకపోతే చూస్కో అని బెదిరిస్తాడు. మాట వినని భార్య గురించి బయట చెప్పుకోలేని భర్తలా అయిపోయింది సోనియా పరిస్థితి. అందుకే తీవ్రచర్య తీసుకోవడానికి వెనుకాడుతూ దొడ్డిదార్లు వెతుకుతున్నారు.

కిరణ్ స్థానంలో వచ్చేవారి పేర్లలో మొదట్లో బొత్స, ఆ తర్వాత ఆనం పేరు వినబడింది. తర్వాత కోట్ల అన్నారు. ఇప్పుడు కన్నా అంటున్నారు. మూణ్నెళ్ల ముచ్చటకోసం ముఖ్యమంత్రి పదవి ఎందుకు అని వాళ్లు అనుకుంటున్నారట. అలా అని ఇప్పుడు వదిలేస్తే యింకెప్పుడైనా వస్తుందన్న హామీ ఏమైనా వుందా? నెల చేసినా మాజీ ముఖ్యమంత్రి అనే పేరు శాశ్వతంగా వుండిపోతుంది కదా. ఏది ఏమైనా కిరణ్ అధిష్టానానికి ఎదురు తిరిగారన్నది నిశ్చయం. 'మీ ముఖ్యమంత్రి మాట వినటం లేదు' అని ఆజాద్ సిపిఐ నారాయణగారి వద్ద అన్నట్టు వార్తలు వచ్చాయి. కాంగ్రెసు ముఖ్యమంత్రి నెలన్నరపాటు ఢిల్లీ వెళ్లకపోవడం వింతల్లో వింత. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెసు పాలిత రాష్ట్రాల నుండి నిధులు పంపడం ఆనవాయితీ. కిరణ్ పంపలేదట. ఇదొకటి వాళ్లను పూర్తిగా మండించి వుంటుంది. కిరణ్‌కు బుద్ధి చెప్పి పంపించాలనే ఉద్దేశంలోనే వుండి వుంటారు. అందుకే కిరణ్ సమైక్యవేదికకు తూట్లు పొడవడానికి సకలయత్నాలు చేస్తున్నారు.

నిన్న పురంధరేశ్వరి గారు ఏం చెప్పారు? ఇంకా సమైక్యం పట్టుకుని వేళ్లాడాలా? విభజన అనివార్యం అయినపుడు మన హక్కుల కోసం పోరాడవద్దా? అని వాదించారు. అనివార్యం చేసినదెవరు? కాంగ్రెసు నిర్ణయించినంత మాత్రాన అనివార్యం అయిపోతుందా? విభజన జరిగే తీరును బిజెపి నిరసిస్తున్నపుడు తెలంగాణ బిల్లు సునాయాసంగా పాసయిపోతుందా? పోనీ పురంధరేశ్వరిగారి కంటికి విభజన తీరు ఎలా కనబడుతోందో చెప్పమనండి. అంతా సవ్యంగా టైమ్‌టేబుల్ ప్రకారం జరుగుతోందా? మొన్న సమావేశంలో మంత్రుల ముఠాలో ముగ్గురు మాత్రం కూర్చున్నారట. అరసభ్యుడు నారాయణస్వామి వస్తూ పోతూ వున్నారట. పంచపాండవులంటే మంచం కోళ్లలా.. అన్న సామెతలా, 10 మంది వుండాల్సిన జిఓఎమ్‌లో ఆరున్నర మందినే వేశారు. వారిలో సగానికి సగం మంది గైరుహాజరు. తెలుగువాళ్లని విడగొట్టడం ఎంత చులకనగా వుందో చూడండి. ఇవేమీ ఆవిడగారి కంటికి కనబడవా? ఇక హక్కులకోసం పోరాడవద్దా? అని అడుగుతున్నారు. వద్దని ఎవరన్నారు? 2009 నుండి ఏం పోరాడారు? వైజాగ్‌కి ఏం తెచ్చారు? ఇన్నాళ్లూ హక్కుల కోసం కాకుండా మరి దేనికోసం పోరాడారు? స్వప్రయోజనాల కోసమా?

ఇప్పుడు యింత లేటుగా లేచి మీరు పోరాడితే వాళ్లు యిచ్చేదేముంది – హామీలు తప్ప నిధులు కాదు కదా! వైజాగ్ రైల్వే డివిజన్ కూడా తెచ్చుకోలేని వ్యక్తి యీ రోజు పెద్ద పోరాటగత్తెగా బిల్డప్ ఒకటి. కిశోర్ చంద్రదేవ్ గారు కూడా వైజాగ్‌ను రాజధాని చేయాలని మొదలెట్టారు. ఎప్పుడో 60 ఏళ్ల కితం వాంఛూ కమిషన్ రిపోర్టు దుమ్ము దులుపుతున్నారు. ఇన్నాళ్లు మంత్రిగా వుండి వైజాగ్‌కు వీళు చేసినదేమిటి? హైదరాబాదులో ఉమ్మడి రాజధాని పదేళ్లు ఎందుకు వుండాలి? ఏడాదిలో వైజాగ్ వచ్చి పడిపోవచ్చు అంటున్నారు. సహజంగానే తెరాసకు యీ వాదన నచ్చింది. సీమాంధ్ర మంత్రులంతా ఢిల్లీ నాయకత్వం చెప్పినట్టు ఆడడానికే నిశ్చయించుకున్నారు. రాజీనామా చేశామంటూ చెప్తారు, మళ్లీ ఢిల్లీ పాటే పాడతారు. విభజనకు అంగీకరించే పంథా కరక్టు, సమైక్యం అనడం పొరబాటు, సమైక్యం అని చెప్పి కిరణ్ మోసగిస్తున్నాడు అని అనిపించడానికే వీళ్ల తాపత్రయం.

కిరణ్‌కు ప్రత్యామ్నాయంగా వచ్చేద్దామన్న ఉబలాటం చాలామందిలో వుంది. అటువంటి వారిలో కన్నా లక్ష్మీనారాయణ ఒకరు. నవంబరు 14న కిరణ్ ఎత్తుకు పై యెత్తు వేసి బాలలతో పాటు కన్నాకూ రాబోయే రోజుల గురించి సినిమా చూపించారు. బాలల చిత్రోత్సవం కారణంగా తను ఢిల్లీ వెళ్లకపోవడాన్ని వుపయోగించుకుంటూ కన్నాను నియమించబోతున్నారన్న పుకారు తయారుచేసి వదిలేసరికి గగ్గోలు పుట్టింది. అది చూసి 'నాకు ఆ ఆశ లేదు బాబోయ్' అని కన్నా అనవలసి వచ్చింది. ఇలా చేసి కిరణ్ సెల్ఫ్‌గోల్ వేసుకున్నారు, ఢిల్లీ వెళ్లకపోవడానికి అసలు కారణం షిండే చెప్పడంతో భంగపడ్డారు అని సాక్షి రాసింది. దాని మాట ఎలా వున్నా ఆశావహుల్లోంచి కన్నా వెనక్కి తగ్గారని మాత్రం చెప్పక తప్పదు కదా. అసలు ఆయన స్థాయి వ్యక్తికి సోనియా ఎపాయింట్‌మెంట్ యివ్వడంతోనే తెలుస్తోంది – కన్నాను కాస్సేపైనా కన్సిడర్ చేశారని. ఆయన కూడా సీమాంధ్రకు ఫలానాఫలానా ప్యాకేజీ యిస్తే నేను మేనేజ్ చేస్తాను అని భరోసా యిచ్చాడట. దానికేం అని వాళ్లు అన్నా సీమాంధ్రులు నమ్మే పరిస్థితి లేకుండా పోయింది. ఎందుకంటే యిప్పుడు యుపిఏ చరమాంకంలో వుంది. మళ్లీ వచ్చే ఛాన్సు కనుచూపుమేరలో లేదు. ఈ హామీలు ఎవడు నమ్ముతాడు?

ఇప్పటికే తెలంగాణ ప్రజలు సోనియా సర్కారును నమ్మడం మానేశారు. తెలంగాణ యిస్తున్నాం అంటూ – హైదరాబాదుపై యిన్ని ఆంక్షలా? హైదరాబాదు పరిధిపై తర్జనభర్జన జరిగి చివరకు జిఎచ్ఎంసికి ఒప్పుకునేట్టు వున్నారంటున్నారు. 28 రాష్ట్రాల విషయంలో లేని ఆంక్షలు, షరతులు తెలంగాణ విషయంలో పెట్టబోతున్నారని రూఢి అవుతోంది. పక్కరాష్ట్ర పౌరులకు కూడా

మీతోపాటు సమానహక్కులుంటాయి, మీ రాష్ట్రపు గుండెకాయపై అధికారం కేంద్రం చేతిలో వుంటుంది అంటే ఎవరికి నచ్చుతుంది? ఇంగ్లీషువాళ్లు స్వాతంత్ర్యం యిస్తూ యిస్తూ రెండుగా విడగొట్టినందుకే తిట్టుకున్నాం. పుణ్యాత్ములు వాళ్లు కొన్ని అధికారాలను వాళ్ల చేతిలో పెట్టుకోలేదు. ఒక దేశంలో మరో దేశపౌరులు సమానహక్కులు అనుభవిస్తారని చట్టం చేసి పోలేదు. వీళ్లు వాళ్ల కంటె దరిద్రంగా వున్నారు. హైదరాబాదు యుటీనో, ప్రత్యేకరాష్ట్రమో చేశాం. అక్కడ అందరికీ సమానహక్కులుంటాయి అంటే అదో దారి. హైదరాబాదు తెలంగాణదే, కానీ దానిపై తెలంగాణకు ముఖ్యమైన హక్కులు కొన్ని లేవు. పక్కరాష్ట్రం వారు స్థానికులుగా పరిగణించబడతారు అనడం ఎంత దుర్మార్గం! పదేళ్లే కదా అంటున్నారు. అది యిప్పటిమాట. రాష్ట్రాల విషయంలో, జలవివాదాల విషయంలో ఒప్పందాల వుల్లంఘన ఎలా జరుగుతోందో చూస్తున్నాం. చండీగఢ్ సంగతి చెప్పనే అక్కరలేదు. కేంద్రం చేతిలో సర్వాధికారాలు పెట్టి కూర్చున్నారు రాజ్యాంగనిర్మాతలు. సంకీర్ణయుగంలో ఏ చిన్నపార్టీ అయినా తమకు కావలసి వచ్చినట్టు ప్రభుత్వాన్ని ఆడించగలదు.

కాంగ్రెసు తమకేదో మేలు చేసిందని అనుకుంటున్న తెలంగాణ ప్రజలే సందేహంలో పడినప్పుడు నెలల తరబడి ఉద్యమం చేసినా కదలక, మెదలక, పట్టించుకోకుండా వున్న కాంగ్రెసు తమకేదో మేలు చేస్తుందని సీమాంధ్ర ప్రజలు ఎందుకు, ఎలా అనుకుంటారు? వారిని నమ్మించడం అంత సులభమా? జరుగుతున్నదంతా వారికి వ్యతిరేకంగానే సాగుతోంది. మా నాయకులు మమ్మల్ని దగా చేశారని వాళ్లు కుములుతున్నారు. వారికి ఏకైక ఆశాదీపంగా కిరణ్ కనబడుతున్నారు. అది వైకాపాకు కిట్టడం లేదు. ఆయన దొంగ, నయవంచకుడు అని మనల్ని నమ్మమని చంపుకుతింటోంది. నిజానికి జగన్ ఎంత వీరసమైక్యవాది ఐనా విభజనను ఆపలేడు, ఆటంకపరచలేడు. కిరణ్ ముఖ్యమంత్రి హోదాలో వున్నాడు కాబట్టి ఆపగలడో లేదో కానీ ఆటంకాలు స ృష్టించగలడు. ఢిల్లీని ఎదిరించిన వాళ్లెవరైనా తెలుగువాళ్లకు ఆప్తులే. విభజనవాదులు తిట్టినకొద్దీ కిరణ్‌కు సమైక్యవాదుల్లో పాప్యులారిటీ పెరుగుతోంది. నిజానికి యీ బలం కిరణ్‌ది కాదు, సమైక్యవాదానిది. ఢిల్లీవాళ్లు విభజన తప్పదని గట్టిగా చెప్పి పంపిన తర్వాత కిరణ్ కొన్నిరోజులు స్తబ్దంగా వున్నారు. కానీ సీమాంధ్రలో వచ్చిన తీవ్రమైన ప్రతిస్పందన ఆయనకు దారి చూపింది. సమైక్యమార్గాన్ని పట్టుకుంటేనే లాభసాటి అని తోచేట్లా చేసింది.

కిరణ్ అంతరంగంలో ఏముందో నిజానిజాలు మనకు తెలియవు కానీ ఆయన మనసులో విభజనవాది అని మనల్ని వైకాపా నమ్మించాలంటే విభజన జరిగితే కిరణ్‌కు ఏం లాభమో చెప్పాలి. రాష్ట్రం విడిపోవడం అంటూ సంభవిస్తే కిరణ్ ఎటూ కాకుండా పోతారు. విభజన తర్వాత ఆంధ్రరాష్ట్రానికి కాంగ్రెసు కాపునాయకుడికే ఛాన్సు యిస్తుంది అంటున్నారు. రెడ్లందరూ జగన్‌వైపు వెళతారు కాబట్టి, తెలంగాణలో కాంగ్రెసు తరఫున వున్న ప్రముఖ నాయకులందరూ రెడ్లు కాబట్టి, బహుశా జయపాల్‌రెడ్డిని తెలంగాణ సిఎం చేస్తారు కాబట్టి, కనీసం ఆంధ్రలో కాపులకు ఛాన్సు యియ్యవచ్చు. అప్పుడు కిరణ్ ఏమవుతారు? సిఎం పోస్టు చేశాక అంతకంటె కిందకు దిగి మామూలు మంత్రి కాలేరు. బెజవాడ గోపాలరెడ్డి ఒక్కరే అలా చేశారు. పోనీ రోశయ్యలా గవర్నరు పోస్టు యిచ్చేటంత అనుభవం, వయసు వుంది. కిరణ్‌కు అదీ లేదు. అందువలన సమైక్యరాష్ట్రం కొనసాగినంతకాలం కిరణ్‌కు సిఎం ఛాన్సుంది. అందువలననే ఆయన పూర్తిగా తెగిస్తున్నాడు. మంత్రిగా కూడా చేయనివాడు మూడేళ్లు ముఖ్యమంత్రిగా చేశాడు.

2014 తర్వాత రాష్ట్రంలో కాంగ్రెసు వస్తుందన్న ఆశ యిసుమంత కూడా లేదు. కాంగ్రెసుకు బొటాబొటీగా వచ్చి ఏ వైకాపాతోనో పొత్తు కుదుర్చుకుంటే, జగన్ తను సిఎం కావాలని పట్టుబడతారు. కాంగ్రెసుకు వైకాపా కంటె ఎక్కువ సీట్లు వచ్చి వైకాపా మైనర్ పార్ట్‌నర్‌గా వుండి కాంగ్రెసువారే ముఖ్యమంత్రి అయ్యే పరిస్థితి వస్తే జగన్ 'కిరణ్ తప్ప వేరేవరైనా అయితేనే ఒప్పుకుంటాను' అంటారు. ఎందుకంటె కిరణ్ సిఎం కావడంతోనే జగన్ పార్టీ బయటకు వెళ్లిపోయారు. రోశయ్య వ ృద్ధుడు కాబట్టి, ఎప్పటికైనా ఆయనను తీసేసి తనను పిలుస్తారన్న ఆశ జగన్‌లో వుండింది, కిరణ్ వంటి పిన్నవయస్కుడు (రాజకీయాల స్టాండర్డ్‌లో) సిఎంగా రావడంతో ఆశలుడిగి జగన్ వెళ్లిపోయారు. అప్పట్నుంచి సాక్షి పేపరు కిరణ్‌ను తిట్టని రోజు లేదు. ఈ విధంగా చూస్తే కిరణ్‌కు ధిక్కరించడం తప్ప వేరే ఆప్షన్ లేదు. పదవి దిగిపోతూ త్యాగమూర్తి పోజు కొడుతూ దిగిపోతే మజా వుంటుంది. గుడ్‌విల్ వుంటుంది. గతంలో పంజాబ్ విభజనను ముఖ్యమంత్రి అడ్డుకుంటే అతన్ని తీసేసి పని కానిచ్చారు. కానీ అతను పంజాబీలకు యిష్టుడిగా చరిత్రలో మిగిలిపోయాడు కదా. ఇప్పుడు కిరణ్ కూడా అంతే. శాయశక్తులా పోరాడాను, కానీ ఏమీ చేయలేకపోయాను, క్షమించమని ప్రజలను వేడుకుంటున్నాను అంటే ప్రజలు అర్థం చేసుకుంటారు.

కాంగ్రెసు కిరణ్ సొంత పార్టీ ఏమీ కాదు. అనేకమంది నాయకుల్లో అతనూ ఒకడు. తనకంటూ పెద్దగా బలం లేనివాడు. సొంత పార్టీల్లో సర్వంసహా అధికారాలు అనుభవిస్తున్న చంద్రబాబు, జగన్ సమైక్యంపై డోలాయమానంగా వ్యవహరించినపుడు వారి కంటె యితను నిజాయితీగా వ్యవహరించినట్టే కదా అనుకుంటారు సమైక్యవాదులు. కిరణ్ రాజీనామా చేయకపోవడంలో, తక్కినవాళ్ల రాజీనామాలు నివారించడంలో, అసెంబ్లీని తనంతట తానే పిలిపించకపోవడంలో కుట్ర వుందని వైకాపా అంటుంది. ఢిల్లీ తన స్ట్రాటజీ మారుస్తూ పోతున్నకొద్దీ, యిక్కడ కూడా మారుతోంది. అసెంబ్లీలో బిల్లుపై చర్చించి, అందరి వాదనలూ, ఉపన్యాసాలు రికార్డు కావలసిన చారిత్రక అవసరం వుంది. ఈ వాదనలు వింటేనే పార్లమెంటు సభ్యులకు విషయం ఏమిటో తెలుస్తుంది. లేకపోతే ఆంధ్ర ఏమిటో, తెలంగాణ ఏమిటో, యీ గొడవలేమిటో వాళ్లకు ఏం అర్థం అవుతుంది? అంతిమంగా పార్లమెంటుకే సర్వాధికారాలు. ఇక్కడి వాదనలపై బేస్ చేసుకుని అక్కడి ఎంపీలు వాదిస్తారు. అసెంబ్లీకి బిల్లు రాకుండా రాజీనామా చేసేసి, సాంకేతిక కారణాలపై చర్చను ఆపడం సరైన పని కాదు. కిరణ్ తన భావాలను ప్రెస్‌మీట్‌లో కాదు, అసెంబ్లీ ఫ్లోరుపై వినిపించినపుడే చరిత్రలో రికార్డవుతాయి.

ఆ పని చేశాక రాజీనామా చేస్తే చేయవచ్చు.

కిరణ్ ఇదంతా చేస్తున్నది – సొంతపార్టీ పెట్టడానికే అంటున్నారు. అయితే కావచ్చు. కానీ ఆ పార్టీ ఎంతవరకు విజయవంతం అవుతుందో అందరికీ సందేహమే. కిరణ్‌లో ప్రధానలోపం – అందర్నీ కలుపుకుని పోరు. తన మనసులో మాట ఎవరికీ చెప్పరు – అని అంటారు. అలాటివాడు పార్టీ పెట్టేసి, నడిపేయగలరా? ఫలితాల మాట ఎలా వున్నా ప్రయత్నాలు చేస్తూ వుండవచ్చు. ఆ దిశగానే తనను తాను సమైక్యఛాంపియన్‌గా కిరణ్ ప్రొజెక్టు చేసుకుంటున్నారు. సొంత ఛానెల్‌లో 'ధిక్కరించినవాడే ధీరుడు' అనే పేరుమీద ఎన్టీయార్‌తో తనను పోల్చుకుంటూ కథనాలు వేయించుకుంటున్నారు. పోనుపోను కథ ఎలా మారుతుందో తెలియదు. ఎన్నికల సమయానికి కిరణ్ పార్టీ రెడీ అయితే జగనంటే, బాబు అంటే యిష్టం లేని సమైక్యవాదులు ఓట్లు వేయనూ వేయవచ్చు. సొంతంగా అధికారంలోకి రాకపోయినా అతుకులబొంత ప్రభుత్వానికి కింగ్‌మేకర్ పాత్ర పోషించవచ్చు. అదంతా భవిష్యత్తు చెప్పాలి.

ముగింపుగా – సమైక్యవీరుడు అని యీ ముహూర్తాన ఎవరికైనా బిరుదు యివ్వాలంటే మాత్రం కిరణే దానికి అర్హుడు అని నా అభిప్రాయం. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2013)**

**అక్టోబరు 36-37 వీక్లీకై ఎమ్బీయస్ : అంబేద్కర్ – తనదాకా వస్తే తెలిసింది**

రాజ్యాంగంలో ఆర్టికల్ 3 గురించి యిన్నాళ్లూ మనం ఎప్పుడూ పట్టించుకోలేదు. రాష్ట్రవిభజన పుణ్యమాని ప్రతీవారూ దాని గురించి మాట్లాడి మనకు తెలియచెప్పినదేమిటంటే – ఆ ఆర్టికల్ ప్రకారం ఏదైనా రాష్ట్రం యొక్క సరిహద్దులు పెంచడానికి గాని, తుంచడానికి గాని, పేరు మార్చిపారేయడానికి గాని.. వేయేల, రాష్ట్రంతో ఫుట్‌బాల్ ఆడుకోవడానికి కేంద్రానికి సర్వహక్కులు వున్నాయి. ఈ ఆటలో సదరు రాష్ట్రానికి నోరెత్తడానికి కూడా వీల్లేదు. 'అదేమిటండీ బాబూ మా రాష్ట్రాన్ని అలా విడదీసేస్తున్నారు?' అని మొత్తుకుని అడ్డుపడడానికి కుదరదు. అంతా పైవారే నిర్ణయించేసి, మేం యిలా అనుకున్నాం అని బిల్లు అసెంబ్లీకి పంపిస్తారు. దాన్ని నువ్వు ఔనను, కాదను, అబ్బే అను, కాస్త నిదానించి చూడండి అను – వినవలసిన విధాయకం వారికి ఏమీ లేదు. 'నిన్ను అడిగాం, నువ్వేదో చెప్పావు, అది మేము వినలేదు, వినదలచుకోలేదు, అసలు నీ అభిప్రాయం ఏదో ఫార్మాలిటీకి అడిగాం తప్ప దాన్ని పట్టించుకోం, నీది అరణ్యరోదనే అని గ్రహించి నోరు మూసుకుంటే మంచిది. కాదూ కూడదు అరుస్తానంటావా, అరుచుకో. మేం చేసేదేదో మేం చేస్తాం.' అని ఢంకా బజాయించి చెప్పే అధికారం వారికి దఖలు పడింది.

ఓ పాత సినిమాలో రేలంగి తన కొడుక్కి భార్యగా ఓ అమ్మాయిని ముందే నిశ్చయించేసి ఆమె ఫోటో పట్టుకుని వచ్చి కొడుక్కి యిచ్చి "ఇదిగో నువ్వు చేసుకోబోయే అమ్మాయి. బాగా ఆలోచించి ఔనను." అంటాడు. అంటే కొడుకు ఎంతైనా ఆలోచించవచ్చు, ఏం ఫర్వాలేదు. ఫైనల్‌గా మాత్రం తండ్రి నిర్ణయానికి సరేననాలి. ఇప్పుడు ఆర్టికల్ 3 వ్యవహారమూ అదే. అసెంబ్లీలో గంభీర ఉపన్యాసాలు యిచ్చుకోవచ్చు, బల్లలు మైకులు బద్దలు కొట్టుకోవచ్చు. ఫైనల్‌గా మాత్రం కేంద్రం పంపిన బిల్లుకు చచ్చినట్టు ఒప్పుకోవాలి. ఒప్పుకోకపోయినా ఫర్వాలేదు, అక్కడ పని ఎలాగూ జరిగిపోతూనే వుంటుంది. అసెంబ్లీలో ప్రజాప్రతినిథులు వుండుగాక, వారి ప్రాంత ప్రజలను వారు చెప్పుకోవచ్చు గాక, కానీ ఆ బిల్లుపై ఓటింగు పెట్టరు. అంటే మెజారిటీ సభ్యులు ఏమనుకుంటున్నారో లోకానికి తెలియదు. తెలియాల్సిన అవసరం ఏముంది? అన్నీ తెలిసిన కేంద్రంవారు దేశానికి ఏది క్షేమదాయకమో నిర్ణయించడానికి అక్కడుండగా! వారికి అన్నీ తెలుసు. ఏదైనా అసెంబ్లీలో మెజారిటీ సభ్యులు మేం విడిపోతాం మహాప్రభో అని మొరపెట్టుకుని తీర్మానం చేసి పంపినా అది విని, ఆ ప్రకారం చేయవలసిన బాధ్యత కేంద్రంపై లేదు. ఇలా చేయడానికి, చేయకపోవడానికి కేంద్రంలో మూడింట రెండువంతుల మెజారిటీ కూడా అక్కరలేదు. సింపుల్ మెజారిటీ వుంటే చాలు.

ఇంతకంటె ఘోరం ఎక్కడైనా వుందా? మన రాజ్యాంగ నిర్మాతలు యిలా ఎలా చేశారు? అంటే దానికి తెలంగాణ ఉద్యమకారులు సమాధానం చెప్తున్నారు – ఎప్పుడైనా ఏదైనా రాష్ట్రం నుండి చిన్న ప్రాంతం విడిపోదామనుకుంటే పెద్దప్రాంతం అడ్డుపడుతుంది. చిన్నవాళ్ల చేతిలో వుండే సీట్ల సంఖ్య తక్కువ కాబట్టి వాళ్ల మాట ఎప్పటికీ చెల్లదు, వాళ్లకు రక్షణ కల్పించడానికోసం అంబేద్కర్‌గారు దీర్ఘంగా ఆలోచించి యావదధికారాలు పట్టుకెళ్లి కేంద్రం చేతిలో పెట్టారు – అని. ఇది నిజమే కావచ్చు. ఎందుకంటే అప్పటివరకు వున్న సినారియో ఏమిటంటే – రాష్ట్రాలలో వున్న సంస్థానాధీశుల ప్రభుత్వాలు సామంతరాజ్యాల వంటివి, కేంద్రంలో పాలన ఆంగ్లేయులది. సంస్థానాధీశులు ఒక్కొక్కరు ఒక్కో ద ృక్పథంతో వుండేవారు. ప్రాంతీయభావాలు, సంకుచితత్వం, పొరుగువారితో పడకపోవడం – యిలా అనేక అవలక్షణాలుండేవి. కేంద్రంలో వున్న ఆంగ్లేయులు తమకు విశాలద ృక్పథం వుంది అనుకుంటూ వీరిని అదుపు చేసేవారు. మన భారతీయ జాతీయనాయకులు, పుట్టుక చేత భారతీయులైనా ఆంగ్లేయుల ఆలోచనాధోరణిలోనే తర్ఫీదు అయినవారు. వారి వద్దనే ఉద్యోగాలు చేసి, వారు నేర్పించిన చదువులే చదివి, వారితో సన్నిహితంగా మెలగి, వారిలాగే ఆలోచించేవారు. 'దేశాన్ని ఒక యూనిట్‌గా చూడాలి, మనమంతా ఒక్కరమే అనే భావనతో వుండాలి తప్ప భాష పేర రాష్ట్రాలుగా విడిపోవడం ఏమిటి చీపుగా…' అని భావించేవారు. స్థానిక పరిస్థితులపై అవగాహన వుండేది కాదు. తమ ఉదారవాదాన్ని ప్రజలపై రుద్దుదామని చూసేవారు.

నెహ్రూ యిలాటి భావాల్లో ప్రథముడు. మహానగరాలలో కాస్మోపోలిటన్ సంస్కృతి చెదిరిపోకుండా కాపాడాలి, వాటి కింద వున్న

రాష్ట్రాలను చీల్చకూడదు అనుకుని హైదరాబాదు, మద్రాసు, బొంబాయి రాష్ట్రాల విభజనను నిరసించాడు. సాధ్యమైనంత అడ్డుకున్నాడు. ఆంబేడ్కర్‌కు చాలావాటిల్లో స్వతంత్ర భావాలున్నాయి కానీ కేంద్రం నిష్పక్షపాతంగా వ్యవహరిస్తుందని, రాష్ట్రాలు సంకుచితంగా ఆలోచిస్తాయని అనుకునేవారిలో ఆయనా ఒకడు. అందుకే ఆర్టికల్ 3 అలా తయారైంది. అయితే తను తయారుచేసిన ఔషధం ఎంత చేదుగా వుందో ఆంబేడ్కర్‌గారికి తనదాకా వచ్చేసరికి తెలిసింది. దాంతో 1955లో ఫజల్ అలీ కమిషన్ (మొదటి ఎస్సార్సీ) వేశాక నెహ్రూ ఆధ్వర్యంలోని కేంద్రప్రభుత్వం 'మూడు రాష్ట్రాలుండాలి – 1. విదర్భ, మరాత్వాడాలతో కూడిన సంయుక్త మహారాష్ట్ర, 2. కచ్, సౌరాష్ట్రలతో కూడిన మహా గుజరాత్, 3. బొంబాయి రాష్ట్రం. మూడోది కేంద్రం అజమాయిషీలో వుండాలి. ఎందుకంటే అన్ని ప్రాంతాలవారూ అక్కడికి నిర్భయంగా వస్తూ పోతూ వుండాలి అన్నాడు. ఇది ఆంబేడ్కర్‌ను మండించింది. కేంద్రం మాట శిరోధార్యం అని తను ప్రవచించినది మర్చిపోయి కేంద్రనిర్ణయానికి వ్యతిరేకంగా అనేక ప్రతిపాదనలు చేశారు. వివరాలు నీశిశిచీ:// గిగిగి.బిళీలీలిఖిదిబిజీ.ళిజీవీ/బిళీలీబీఖి/05౷౾.%20ఊనీళితివీనీశిరీ%20ళిదీ%20ఉరిదీవీతిరిరీశిరిబీ%20ఐశిబిశిలిరీ%20ఆజుష్ట్రఊ%20ఎఎ.నీశిళీజి లో వున్నాయి. ఈనాడు తెలంగాణ గురించి కేంద్ర కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఒక నిర్ణయం తీసుకుని హడావుడిగా అమలు చేసేస్తోంది కదా. అప్పటి కాంగ్రెసు వర్కింగ్ కమిటీ కూడా నెహ్రూ చేసిన ప్రతిపాదన భేషుగ్గా వుందంది. ఆంబేడ్కర్ మండిపడ్డాడు – 'యుపి, బిహార్, ఎంపీలను విడగొట్టాలన్న ఆలోచన వర్కింగ్ కమిటీకి ఎందుకు రాలేదు' అని ప్రశ్నించాడు.

బొంబాయిని కేంద్రపాలితం చేయాలనడం ఆయనకు పట్టరాని కోపం తెప్పించింది. "బొంబాయిలో మహారాష్ట్రుల సంఖ్య 50% కంటె తక్కువ కదా అంటున్నారు. కానీ అలా జరగడానికి కారణం – జీవికకోసం యితర ప్రాంతాల నుండి అన్ని జాతుల వాళ్లు వచ్చి బొంబాయిలో వుండడమే. వారందరూ బొంబాయిని తమ సొంత యిల్లుగా భావించరు. కేవలం మహారాష్ట్రులే అలా అనుకుంటారు. ఎవరేమన్నా సరే బొంబాయి మహారాష్ట్రులదే. కలకత్తా బెంగాల్‌లో భాగం అయినప్పుడు, మద్రాసు మద్రాసు రాష్ట్రంలో భాగం అయినపుడు బొంబాయి మహారాష్ట్రులది కాకుండా ఎలా పోతుంది? అసలు బొంబాయి పేరు మార్చి 'మహారాష్ట్ర' ముద్ర దానిపై కొడితే యీ చిక్కులు వచ్చేవి కావు. బొంబాయిని పాలించడానికి మహారాష్ట్రులు పనికిరారు (అన్‌ఫిట్) అని కాంగ్రెస్ అధిష్టానం అభిప్రాయం కాబోలు. ఇది మహారాష్ట్రులు సహించకూడదు." అంటూ విరుచుకుపడ్డారు.

అంతేకాదు, ఆయన చెప్పిన యితర విషయాలు చూస్తే ఆయనలో ఒక తీవ్ర మరాఠీ ప్రాంతీయవాది కనబడతాడు – "...ఉమ్మడి రాష్ట్రంలో మహారాష్ట్రులు తీవ్రంగా నష్టపోయారు. 315 మంది సభ్యులున్న అసెంబ్లీలో 149 మంది మరాఠీ ఎమ్మెల్యేలున్నారు. గుజరాతీవారు 106 మందే. కానీ మంత్రుల సంఖ్య చూడబోతే యిద్దరూ సమానమే. డిప్యూటీ మినిస్టర్ల దగ్గరకు వస్తే మాత్రం మరాఠీవాళ్లు 5గురు, గుజరాతీవాళ్లు 2, కన్నడవాళ్లు 2. ఇక్కడ సంఖ్య ఎక్కువుంది కదా అనుకోకూడదు. ఒక్కో డిప్యూటీ మినిస్టర్ కింద వున్న శాఖల సంఖ్య చూడాలి (..అంటూ ఆయన శాఖలు లెక్కపెట్టారు. వాటిలో ఏవి ముఖ్యమైనవో, ఏవి కావో వివరాలు యివ్వలేదు). సంఖ్యాబలం వుంది కాబట్టి మరాఠీవారే ముఖ్యమంత్రి కావాలి. హీరే గారు ముఖ్యమంత్రి అవుదామనుకున్నారు. కానీ ఆయనను కాంగ్రెస్ హై కమాండ్ పక్కన పడేసి, గుజరాతీ అయిన మొరార్జీ దేశాయ్‌ను ముఖ్యమంత్రి చేసింది. ఒక మరాఠీ నాయకుడికి ఎంత అవమానం! (హ్యూమిలియేషన్) మహారాష్ట్రుల రాజకీయపరిజ్ఞానానికి కాంగ్రెసు అధిష్టానం యిచ్చిన విలువ యిదా?.." ఇలా ఆయన కేంద్ర నిర్ణయాన్ని అడుగడుగునా దుయ్యబట్టారు.

కేంద్ర నిర్ణయాన్ని సంపూర్ణ మహారాష్ట్ర ఉద్యమకారులూ తప్పుపట్టారు. వారు మరాఠీ మాట్లాడే ప్రాంతాలన్నిటినీ కలిపి బొంబాయి రాజధానిగా మహారాష్ట్ర ఏర్పడాలని ఉద్యమించారు. ఆంబేడ్కర్ వారితో ఏకీభవించలేదు. ఉమ్మడి రాష్ట్రంలోంచి గుజరాత్‌ను విడగొట్టి పంపేయాలన్నారు. తక్కిన మహారాష్ట్రను 1) సిటీ 2) పశ్చిమ 3) మధ్య 4) తూర్పు భాగాలుగా విడగొట్టాలన్నారు. పొరుగున వున్న రాష్ట్రాలలో వున్న (ఆయన ద ృష్టిలో) మరాఠీ ప్రాంతాలను తిరిగి తీసుకోవాలన్నారు. వాటి లిస్టు (9 వున్నాయి) ఆ వ్యాసంలో చూడవచ్చు. కర్ణాటకలోని బెళగాం మాత్రమే కాదు, ఆదిలాబాదు జిల్లాలోని రాజగిర్ తాలూకా కూడా వుంది. ఆంబేడ్కర్ ఏం రాసినా, ఏం చెప్పినా కేంద్రం మహారాష్ట్రను నాలుగు ముక్కలు చేయలేదు. అలాగని బొంబాయిని యుటి చేయాలన్న కేంద్రం ఐడియా కూడా చెల్లుబాటు కాలేదు. గమనించవలసిన దేమిటంటే – కేంద్రం చేతిలో అధికారాలన్నీ పెట్టిన ఆంబేడ్కరే దానికి వ్యతిరేకంగా పోట్లాడారు.

ఈ రోజు ఆంధ్ర కాంగ్రెసు వాదులను, తెలంగాణ కాంగ్రెసువారు తప్పుపడుతున్నారు. కాంగ్రెసు హై కమాండ్ మాట ధిక్కరిస్తారా? తప్పు కదా! అంటున్నారు. ఈ నేతలు మొన్నటిదాకా అధిష్టానానికి వ్యతిరేకంగా పార్లమెంటులో ప్రదర్శనలు చేసినవారే! ఎదిరించినవారే. ఉపయెన్నికలలో కాంగ్రెసు తరఫున ప్రచారానికి వెళ్లమంటే వెళ్లకుండా మొరాయించి, కాంగ్రెసు నాశనమై పోతుంది అంటూ శాపనార్థాలు పెట్టి, మా అభ్యర్థి ఓడిపోతాడంటూ ప్రకటనలు యిచ్చినవారే. పార్టీ అధిష్టానం చెప్పిన మాట శిరోధార్యం అని అప్పుడు వాళ్లనుకోలేదు, యిప్పుడు వీళ్లనుకోవడం లేదు. కేంద్రం ఎవర్నీ లక్ష్యపెట్టకుండా, తమ చిత్తం వచ్చినట్టు చేస్తోందని ముఖ్యమంత్రి ఉత్తరం రాసినా, సమైక్యవాదులు అభ్యంతరాలు తెలిపినా తెలంగాణ ఉద్యమకారులు మండిపడుతున్నారు. ఆర్టికల్ 3 గురించి తెలియదా? కేంద్రానికి అధికారం వుందని తెలియదా? దాన్ని ధిక్కరించడం తప్పు. వాళ్లేం చేసినా పడి వుండాలి అని నీతులు చెప్తున్నారు. ఈ రోజు తెలంగాణ వస్తుందన్న ఉబలాటంతో వీళ్లు యిలా మాట్లాడుతున్నారు కానీ రేపు ఏం జరుగుతుందో అర్థం చేసుకోవడం లేదు. కేంద్రం, రాష్ట్రం మధ్య సమీకరణాలలో సమతౌల్యం పాటించకపోతే అనర్థం వాటిల్లుతుందని వీళ్లకు బోధపడదా? తెలంగాణ

సాధించుకోవడానికి కేంద్రానికి బానిసలైతే రేపు దాన్ని వాళ్లు అడ్వాంటేజిగా తీసుకోరా?

ఈసప్ నీతికథల్లో ఓ కథ వుంది. ఓ గుఱ్ఱానికి, లేడిపై కోపం వచ్చింది. తనేం చేయలేక మనిషి వద్దకు వచ్చి 'నువ్వు లేడి భరతం పట్టు' అని కోరింది. 'అది చాలా వేగంగా పరిగెడుతుంది. నేను దాని పరుగు అందుకోలేను.' అన్నాడు మనిషి. 'నామీద ఎక్కు, నేను వేగంగా పరిగెడతాను. నువ్వు దాన్ని వేటాడు.' అని ఆఫర్ యిచ్చింది. మనిషి సరేనని అలాగే చేసి, లేడిని వేటాడాడు. వేట తర్వాత గుఱ్ఱం థాంక్స్ చెప్పి 'ఇక దిగు' అంది. మనిషి 'అబ్బే, నాకీ గుఱ్ఱం సవారీ బాగుంది. ఓసారి ఎక్కిన తర్వాత మళ్లీ దిగే అలవాటు లేదు. నువ్వు జన్మంతా నాకు ఊడిగం చేయాల్సిందే' అన్నాడు. గుఱ్ఱం మొత్తుకుంది కానీ ఏమీ చేయలేకపోయింది. అప్పణ్నుంచి గుఱ్ఱం మనిషికి మచ్చిక అయిందిట.

ఇప్పుడు ఆంధ్ర ప్రాంతంపై కోపంతో తెలంగాణ వారు కేంద్రాన్ని తమ నెత్తి కెక్కనిస్తే, కేంద్రం యిక కిందకు దిగదు. ఈ రోజు ఆర్టికల్ 3 ఉపయోగించి ఆంధ్రను బయటకు పంపించినట్లే, రేపు తెలంగాణ నుండి హైదరాబాదును విడగొట్టి విడిగా పడేయవచ్చు. 'అలా ఎలా చేస్తారు? ప్రజల ఆకాంక్షో..?' అంటారా? ఏదైనా ఉద్యమాన్ని పుట్టించడం అంత కష్టమా? వందమందితో పది రోజులు చేయించి, మీడియా చేత దాన్ని హైలైట్ చేయిస్తే చాలు. హైదరాబాదు వాసులు ఆత్మగౌరవం, స్వయంపాలన యిత్యాది విషయాలపై చాలా సెన్సిటివ్‌గా వున్నారని, యితర ప్రాంతాల ప్రజలు వచ్చి తమపై సవారీ చేస్తున్నారన్న బాధతో వున్నారనీ వ్యాసాలు రాయిస్తే చాలు. వాటి ఆధారంగా హైదరాబాదును తెలంగాణ నుండి విడగొట్టవచ్చు. అప్పుడు తెలంగాణలోని మెజారిటీ ప్రజలు – యీనాటి సీమాంధ్రుల ఏడుపు అరువుతెచ్చుకుని– మొత్తుకున్నా ఏమీ లాభం వుండదు. రాష్ట్రం పేరు కూడా మార్చివేసే అధికారం కేంద్రానికి వుంది కాబట్టి, వి హనుమంతరావు వంటి సీనియర్ నాయకులు కోరారంటూ తెలంగాణ పేరు సోనియాస్తాన్ అని మార్చేసినా ఏమీ చేయలేరు. తక్కిన పేచీలు ఎలా వున్నా కేంద్రం తన హద్దులు దాటకుండా చూడవలసిన బాధ్యత దేశంలోని అన్ని ప్రాంతాలదీ! – **ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2013)**

**అక్టోబరు 38-40 వీక్లీకై** **ఎమ్బీయస్ : న్యూస్, వ్యూస్, రివ్యూస్ – 21**

## ఎన్‌సిపి పేచీలు

మహారాష్ట్రలో ఎన్‌సిపి–కాంగ్రెసు పేచీలు ముదురుతున్నాయి. సెప్టెంబరులో కాంగ్రెసు ఉపాధ్యక్షుడు రాహుల్ తన కార్యకర్తలతో ఎన్‌సిపితో పొత్తు లేని ఎన్నికలకు మనం సిద్ధపడాలి, మనం సొంతంగా బలం పెంచుకోవాలి అని ఉద్బోధించాడు. ఎన్‌సిపి కార్యకర్తలేమో 2009 లో చేసుకున్న సీట్ల పంపిణీ విధానమే కొనసాగాలంటూ డిమాండ్ చేశారు. కార్యకర్తల సమావేశం జరిగాక బయటకు వచ్చిన శరద్ పవార్ "కాంగ్రెసుతో మాకు ఘర్షణ ఏమీ లేదు" అని ప్రకటన చేశాడు. ఇంకో వారం తిరక్కుండా ఓ సభలో నితిన్ గడ్కరీతో వేదిక పంచుకుని, ఫోటోలు దిగి "రాజకీయాల్లో అస్పృశ్యులు ఎవరూ లేరు" అన్నాడు. శరద్ పవార్ అంటే అస్సలు పడని బిజెపి నాయకుడు గోపీనాథ్ ముండేకు నితిన్ ప్రత్యర్థి. అందువలన అతన్ని చేరదీయడం సహజమే. ఇక్కడ కాస్త ముందుచూపు కూడా వుంది. 2014 ఎన్నికల తర్వాత కాంగ్రెసుకు గాని, బిజెపికి గాని పూర్తి మెజారిటీ రాని పక్షంలో ప్రాంతీయ పార్టీలు ఒక కూటమిగా ఏర్పడి కాంగ్రెసు లేదా బిజెపిలలో ఎవరో ఒకరి సహాయంతో ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చు. సందర్భం బట్టి లెఫ్ట్‌ను కూడా ఆకట్టుకోవడానికి చూడవచ్చు. ఆ కూటమికి నాయకత్వం వహించడానికి అందరిలో సీనియర్ నాయకుడైన శరద్ పవార్ ఉబలాట పడుతున్నారు. అందువలన అన్ని పార్టీలతోనూ సఖ్యత నెరపాలని అతని ప్రయత్నం. సొంత రాష్ట్రంలో కాంగ్రెసుతో, జాతీయ స్థాయిలో బిజెపితో స్నేహంగా వుంటూనే లెఫ్ట్‌వాళ్లతో చెడగొట్టుకోవటం లేదు.

దీనికి గాను అతను సొంత రాష్ట్రంలో, సొంత పార్టీలో బలం చెదిరిపోకుండా చూసుకోవాలి. అతని సోదరుడి కుమారుడు అజిత్ పవార్ బలమైన ప్రత్యర్థిగా తయారయ్యాడు. పార్టీ శరద్, అజిత్ వర్గాలుగా చీలిపోతోంది. అజిత్‌ను అదుపులో పెట్టడానికి శరద్ తన కూతురు సుప్రియా సూలేను ముందుకు నెడుతున్నాడు. 'యువతీ రాష్ట్రవాదీ' అనే పేర తన పార్టీ మహిళా విభాగం ఏర్పాటు చేసి సుప్రియ చేతిలో పెట్టాడు. ఆమె ఆ పేరు చెప్పుకుని రాష్ట్రమంతా తిరిగి తన పలుకుబడి పెంచుకుంటోంది. దీనికి తోడు తన ట్రస్టు 'యశ్వంతరావు చవాన్ ప్రతిష్టాన్'కు ఆమెను అధ్యక్షురాలిగా చేశాడు. ఇలా పార్టీలో పట్టుకోసం ప్రయత్నిస్తూనే కాంగ్రెసుతో రకరకాల పేచీలు పెట్టుకుంటున్నాడు. వాటిలో తాజాది – ముంబయి పోలీసు కమిషనర్‌గా ఎవర్ని నియమించాలనే అంశం. ప్రస్తుతం వున్న సత్యపాల్ సింగ్ డిజిపిగా వెళ్లిపోబోతున్నారు. ఆయన స్థానంలో రావడానికి ముగ్గురు, నలుగురు అధికారుల పేర్లు షార్ట్ లిస్ట్ చేశారు. వారిలో ఎంపిక చేసే అధికారం ఎప్పటిలాగా తమకే వుండాలని హోం శాఖను నిర్వహిస్తున్న ఎన్‌సిపి అభిప్రాయం. వాళ్ల మాట యీసారి చెల్లనీయకూడదని కాంగ్రెసు ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చౌహాన్ పట్టుదల.

అయితే కాంగ్రెసు తరఫున కాండిడేట్ ఎవరో యిప్పటికీ తేలలేదు. కేంద్ర హోం మంత్రి షిండే ఎడిజిపి (ట్రాఫిక్)గా పనిచేస్తున్న విజయ్ కాంబ్లేకు ఆ పదవి యివ్వాలని అంటారు. రాష్ట్ర కాంగ్రెసు ఎడిజిపి (లా అండ్ ఆర్డర్)గా పని చేస్తున్న అహ్మద్ జావేద్‌కు యివ్వాలని అంటోంది. ఎన్నికల సంవత్సరంలో ఒక ముస్లిముకు యిలాటి ముఖ్యమైన పదవి యిస్తే ముస్లిములను మురిపించినట్లు

అవుతుందని వాళ్ల లెక్క. ఎన్‌సిపి ఎవరికి మద్దతు యిస్తోందో యింకా తెలియలేదు కానీ యాంటీ-టెర్రరిజం స్క్వాడ్ చీఫ్‌గా వున్న రాకేష్ మారియా వైపు మొగ్గు చూపుతున్నారని అంటున్నారు. రాకేష్ అంటే అందరికీ గౌరవమే. టెర్రరిజం మూలాలు కనిపెట్టి అణచడంలో అతని కృషి అమోఘం. అయితే యిటీవలే అతనిపై చిన్న మరక పడింది. పుణె బేకరీలో పేలుడుకు కారణం హిమాయత్ బేగ్ అని రాకేష్ టీము కనిపెట్టి అతనిపై కేసు పెట్టి మరణశిక్ష పడేట్లు చేశారు. ఆ పేలుడుకు సూత్రధారి ఐన యాసిన్ భత్కల్ యిటీవలే పట్టుబడ్డాడు. అతను 'పుణె పేలుడుకి, హిమాయత్‌కు సంబంధం లేదు' అని పోలీసులకు చెప్పాడు. దాంతో రాకేష్ సామర్థ్యంపై కొద్దిపాటి అనుమానం కలిగింది. వీటి మాట ఎలా వున్నా ఎవర్ని నియమించాలన్నదానిపై ఎన్‌సిపి కాంగ్రెసుతో పేచీ పెట్టుకుంటోదన్నది గమనార్హం. ఈ పేచీల ద్వారా కాంగ్రెసు నుండి ఎన్నికల్లో ఎక్కువ సీట్లు రాబట్టాలని ప్రయత్నం. ఎందుకంటే శరద్ ప్రస్తుతానికి కాంగ్రెసుతో తెగతెంపులు చేసుకునే మూడ్‌లో లేడు.

**దయానా ఆఖరి ప్రియుడు**

పదహారేళ్ల క్రితం దయానా కారు ప్రమాదంలో మరణించిందని, అప్పుడు ఆమె పక్కన కారులో డోండి ఫయాద్ అనే ప్రియుడు వున్నాడనీ అందరికీ తెలుసు. డోండీ కంటె ముందు ఆమె హస్నత్ ఖాన్ అనే హార్ట్ సర్జన్‌తో రెండేళ్లపాటు ప్రేమ వ్యవహారం నడిపింది. వారిద్దరి మధ్య నడిచిన ప్రేమకథ ఆధారంగా కేట్ స్నెల్ అనే రచయిత్రి 2001లో "దయానా- హెర్ లాస్ట్ లవ్" అనే పుస్తకం రాశారు. దాని ఆధారంగా యీ నెలలో సినిమా విడుదలైంది. ఆ సినిమాలో వాస్తవమెంత? కల్పన ఎంత? అన్నది ఆసక్తికరంగా మారింది.

మామూలుగా అందరికీ తెలిసిన విషయాలేమిటంటే - 1995 ఆగస్టు 31న దయానా స్నేహితురాలు ఊనా భర్త జో టఫోలోకు బైపాస్ సర్జరీ జరిగింది. ఆమె దయానాకు ఫోన్ చేసి ఆసుపత్రికి రమ్మనమంది. లండన్‌లో రాయల్ బ్రాంప్టన్ హాస్పటల్‌కు వచ్చిన దయానా ఆ ఆపరేషన్ చేస్తున్న కార్డియో థొరాసిక్ సర్జన్ హస్నత్ ఖాన్‌ను చూసి ముచ్చటపడింది. పాకిస్తాన్‌కు చెందిన ఖాన్ ఇంగ్లండులో స్థిరపడి గుండెమార్పిడి ఆపరేషన్లలో ప్రావీణ్యత సంపాదించాడు. ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న అతను నిజానికి దయానా కంటె చాలా తక్కువ స్థాయిలో వున్నాడు. కానీ అతని మర్యాద, గాల్ఫ్ ఆట, జాజ్ సంగీతాన్ని ఆస్వాదించడం యివన్నీ చూసి దయానా యిష్టపడింది. అప్పుడు ఆమె వయసు 34. ఇతని వయసు 36. బ్రహ్మచారి. పదిహేను రోజుల్లో అతని కలిసి డేట్ చేసింది. 'మా మేనత్త యింటికి వెళ్లి పుస్తకాలు తెచ్చుకోవాలి. కూడా వస్తావా?' అని అడిగాడతను. ఆమె వెళ్లింది. నవంబరు నెలాఖరులో ఆసుపత్రి నైట్ డ్యూటీ చేస్తున్న అతనివద్దకు ఆమె వెళ్లింది.

ఆ తర్వాత వాళ్ల మధ్య సాన్నిహిత్యం మరింత బలపడింది. ఖాన్ తన గురువు మాగ్డీ యాకూబ్‌తో కలిసి ప్రపంచ వ్యాప్తంగా సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకుంటూంటాడు. 1996లో బీరూట్‌లో వున్న పాలస్తీనా శరణార్థుల శిబిరానికి వెళ్లినపుడు దయానా కూడా అతని కార్యక్రమాలకు సహాయపడింది. 1996 జూన్ నాటికి ప్రిన్స్ ఛార్లెస్‌తో విడాకులు తీసుకోవడం ఖాయం అని తేలిపోయాక దయానా తన స్నేహితులతో ఖాన్‌ను పెళ్లి చేసుకోబోతున్నానని చెప్పింది. 1997 మేలో తమ పెళ్లి గురించి ఆమె పాకిస్తాన్‌లో వున్న అతని కుటుంబంతో మాట్లాడింది. తర్వాత ఏమైందో తెలియదు కానీ ఆమె డోండీకి దగ్గరైంది. అతనితో కలిసి హాలీడేయింగ్‌కు వెళ్లింది. తిరిగి వచ్చాక జులై 28 న లండన్‌లోని బట్టెరెసా పార్క్‌లో ఖాన్‌ను కలిసి, తమ మధ్య రెండేళ్లగా నడిచిన ఎఫైర్ ముగిసిపోయిందని చెప్పింది. 'ఈమెకు వేరే ఎవరితోనో స్నేహం కుదిరింది' అనుకున్నాడు ఖాన్. కొన్ని రోజులు పోయాక ఆమె మరణం గురించి విన్నప్పుడు 'ఓహో ఆ ప్రియుడు డోండీ అన్నమాట' అని యితనికి తెలిసింది. 2006లో ఖాన్‌కు పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకున్నాడు. భార్య ఆఫ్గన్ కులీన కుటుంబానికి చెందినది. 18 నెలల తర్వాత వాళ్లు విడాకులు తీసుకున్నారు. అప్పటినుండి ఒంటరిగానే వున్నాడు. ఇప్పుడాయన ప్రభుత్వ సర్వీసు నుండి సెలవు తీసుకుని ఇథియోపియాలో హృద్రోగులైన పిల్లలకు వైద్యం చేస్తున్నారు.

ఈ టైములో ఆ సినిమా వెలువడడం, తనను ఒక ప్రేమికుడిగా చూపుతూ సినిమా పోస్టర్లు వెలయడం అతనికి యిబ్బందిగా వుంది. అతను సినిమా చూడలేదు. చూసినవారిని కలవనూ లేదు. ఈ సినిమా వాస్తవాలకు దగ్గరగా వుంది అని అతను సర్టిఫై చేస్తే చిత్రవిజయానికి దోహదపడుతుంది కదాని నిర్మాతదర్శకుల ఆశ. కానీ వాళ్లు ఖాన్‌ను యీ ప్రాజెక్టు విషయంలో ఎప్పుడూ సంప్రదించలేదు. మెలోడ్రామా కోసం వాళ్లు కొన్ని ఘట్టాలు సినిమాలో చొప్పించారు. ఓ సీనులో ఖాన్ మేనమామ పాకిస్తాన్‌నుండి వచ్చి 'దయానా మన ముస్లిం కుటుంబంలో యిమడలేదు. నువ్వు కుటుంబాన్నో, దయానానో ఎవరో ఒకర్ని ఎంచుకోవాలి.' అని చెప్తాడు. 'ఇది పూర్తిగా అభూతకల్పన. నా తలిదండ్రులే కాదు, మా నాయనమ్మ కూడా దయానా అంటే యిష్టపడ్డారు. మా వ్యవహారానికి వాళ్లు అభ్యంతరం చెప్పలేదు." అంటున్నాడు ఖాన్.

'అయితే నిజంగా జరిగినదేమిటో చెప్పవచ్చు కదా' అంటే 'అది పూర్తిగా వ్యక్తిగతమైన విషయం. ప్రతీవాడికీ రసవత్తరమైన విషయాలు కావాలి. అవి నేను ఎవరికీ చెప్పను. అత్యంత సన్నిహితులైన నా స్నేహితులకు తప్ప మా విషయం ఎవరికీ తెలియదు. దయానా ప్రియుణ్ని కానని చెప్పలేను. ఎందుకంటే అది చరిత్ర కెక్కిన విషయం. కానీ రాబోయే తరాలు నన్ను ఒక మంచి డాక్టరుగా గుర్తుపెట్టుకోవాలని కోరుకుంటున్నాను. ఈ సినిమా నాకు వేరే రకమైన గుర్తింపు తెస్తోంది. అదే నాకు బాధగా వుంది.' అంటాడు

ఖాన్.

**ఎటు చూసినా షెహజాదాలే!**

రాహుల్ గాంధీని షెహజాదా (యువరాజు) గా పిలవడంపై అభ్యంతరం చెప్పిన కాంగ్రెసువాళ్లకు సమాధానం చెపుతూ మోదీ 'వారసత్వ రాజకీయం ద్వారా వెలుగులోకి వచ్చాడు కాబట్టి అలా అనవలసి వస్తోంది' అని వివరణ యిచ్చారు. ప్రస్తుత రాజకీయాలు చూస్తే షెహజాదాలు కాని వారు చాలా తక్కువమంది వున్నట్టు తోస్తోంది. ఎన్నికలు జరగబోతున్న రాష్ట్రాలలో చూడబోతే – మధ్యప్రదేశ్‌లో దిగ్విజయ్ సింగ్ కుమారుడు జయవర్ధన్ (25) కితం ఏడాది రాజీవ్ పుట్టినరోజు సందర్భంగా తన తండ్రి నియోజకవర్గంలో ప్రజల మధ్యకు వచ్చాడు. డూన్ స్కూలులో, ఢిల్లీ శ్రీరామ్ కాలేజీలో చదివి, కన్సల్టెంటుగా పనిచేసి యూత్ కాంగ్రెసుద్వారా వచ్చాడు. ఇప్పుడు టిక్కెట్టు ఆశిస్తున్నాడు. మధ్యప్రదేశ్‌ను చాలాకాలం పాలించిన అర్జున్ సింగ్ కుమారుడు అజయ్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు. కేంద్రమంత్రిగా పని చేసిన మాధవరావు సింధియా కుమారుడు జ్యోతిరాదిత్య యిప్పుడు కేంద్రమంత్రి. అతను యీ మధ్యే తన 16 ఏళ్ల కొడుకు మహానార్యామాన్‌ను ఓటర్లకు పరిచయం చేశాడు. కేంద్రమంత్రి కమల్ నాథ్ కుమారుడు నకుల్ యిన్నాళ్లూ వ్యాపారం చూసుకుంటూ తండ్రి నియోజకవర్గాన్ని కనిపెట్టుకుని వున్నాడు. ఈ సారి ఎసెంబ్లీ ఎన్నికలలో టిక్కెట్టు ఆశిస్తున్నాడు. మాజీ ఉపముఖ్యమంత్రి సుభాష్ యాదవ్ తన కుమారుడు అరుణ్‌ను ఎంపీగా చేసి మన్‌మోహన్ మంత్రివర్గంలో సీటు యిప్పించాడు. మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా చేసి ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్ గవర్నరుగా వున్న ఊర్మిళా సింగ్ తన కుమారుడు ధర్మేంద్రను రాజకీయాల్లోకి తెద్దామని చూస్తోంది.

ఇది చూసి కాంగ్రెసులో మాత్రమే వారసత్వం వుందని అనుకోకూడదు. మోదీ పార్టీ ఐన బిజెపిలో కూడా యిదే నడుస్తోంది. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రిగా పనిచేసిన బిజెపి నాయకుడు మదన్‌లాల్ ఖురానా కుమారుడు విమల్ అతని స్థానంలో వద్దామనుకుంటున్నాడు. ఇంకో బిజెపి మాజీ ముఖ్యమంత్రి సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు పర్వేష్ కూడా అదే పనిలో వున్నాడు. మరో బిజెపి నాయకుడు ఓపి బబ్బర్ తన కొడుకు రాజీవ్‌కు తిలక్ నగర్ నుండి టిక్కెట్టు యిప్పిద్దామని చూస్తున్నాడు. రాజస్థాన్‌లో రాష్ట్ర బిజెపి మాజీ అధ్యక్షుడు ఘనశ్యామ్ తివారి తన కొడుకు అశీశ్ టిక్కెట్టు కోసం ప్రయత్నిస్తుండగా బిజెపి మాజీ కేంద్రమంత్రి జశ్వంత్ సింగ్ కొడుకు మానవేంద్ర జైసల్మేర్ టిక్కెట్టు కోసం ప్రయత్నిస్తున్నారు.

తమాషా ఏమిటంటే వీళ్లందరూ బాగా చదువుకున్నవారే. ఏమిటీ రాచరికపు పోకడలు అని అడిగితే వాళ్లు చెప్పే సమాధానాలు యిలా వుంటున్నాయి – ''..రాజకీయాల్లో నాకు అభిరుచి వుంది కాబట్టి వస్తున్నాను. మా నాన్నగారి బలవంతం లేదు... నాకు ప్రజాసేవ అంటే ఆసక్తి. యూత్ ఆర్గనైజేషన్‌లో సభ్యుణ్ని... నా తండ్రి రాజకీయాల్లో వుండడం చేత నేను రాజకీయాల్లోకి రాకూడదనడం దుర్మార్గం.. నేను ప్రత్యక్ష రాజకీయాల్లోకి యిప్పుడే వస్తున్నాను కానీ ఎప్పణ్నుంచో మా నాన్నగారి ఎన్నికల ప్రచారానికి వెన్నెముకగా వుండేవాణ్ని...'' ఈ వరస చూస్తే వారసత్వ రాజకీయాలు మనల్ని వదలవని ఖచ్చితంగా చెప్పవచ్చు.

**అఫయిర్స్ మీకు – ఆదాయం మాకు**

నోయల్ బైడర్‌మన్ అనే వ్యక్తి పన్నెండేళ్ల క్రితం ఎవిడ్ లైఫ్ మీడియా అనే కంపెనీ పెట్టి దాని ద్వారా ఒక వెబ్‌సైట్ ప్రారంభించి యిబ్బడిముబ్బడిగా సంపాదించేస్తున్నాడు. ఆ వెబ్‌సైట్ పేరు 'ఏష్లీ మాడిసన్'. పెళ్లయిన వ్యక్తులు ఎవరితోనైనా వివాహేతర సంబంధం పెట్టుకోవాలంటే ఆ వెబ్‌సైట్ సహకరిస్తుంది. దాని నినాదం ''లైఫ్ ఈజ్ షార్ట్. హేవ్ ఏన్ ఎఫైర్.'' ఆ వెబ్‌సైట్ చూపించే కమ్మర్షియల్‌లో యిద్దరు ఘాటైన శృంగారంలో మునిగి వుంటారు. కింద కాప్షన్ వస్తుంది – 'ఇద్దరూ పెళ్లయినవారే.. విడివిడిగా' అని.

ఈ వెబ్‌సైట్‌లో చందా కట్టే పద్ధతి లేదు. 49 డాలర్లు పెడితే 100 క్రెడిట్ పాయింట్లు యిస్తారు. దాంతో 20 మంది మహిళలకు ఈమెయిల్స్ పంపవచ్చు. ఈ ఫీజు మగవాళ్లకే. ఆడవాళ్లకు లేదు. వాళ్లు ఫ్రీగా చాటింగ్ చేయవచ్చు – వివాహిత మహిళలను ఆకర్షించడమే వీరి ధ్యేయం కాబట్టి! సొంతవూళ్లో వుండగా ఎఫయిర్ పెట్టుకోవడం కంటె టూరు చేస్తూ పరాయివూళ్లో వున్నవారిని కలవడం సులభం. టూర్లు చేస్తున్న మగ/ఆడ వారి సమాచారం కావాలంటే 20 డాలర్లు అదనంగా కట్టాలి. 'ప్రయారిటీ మ్యాన్' అనే స్కీములో డబ్బు కడితే ఎవరైనా మహిళ కంప్యూటర్ తెరవగానే అతని ప్రొఫైల్ కనబడుతుంది. బ్లాక్ బుక్ అనే యేప్ తీసుకుంటే అసలు ఫోన్ నెంబరు కాకుండా వేరే ఫోన్ నెంబరు కనబడుతుంది. దాని ద్వారా డీలింగ్స్ చేయవచ్చు. ఏవైనా బహుమతులు కొనాలన్నా వాళ్ల పేరు రాకుండా యింకో బినామీ పేరు మీద బిల్లు వస్తుంది. ఎఫయిర్ ముగిసిపోయిన తర్వాత జాడలు విడవకూడదనుకునేవారు 19 డాలర్లు కడితే ప్రొఫైల్, మెసేజ్‌లు తుడిచివేయబడతాయి. ఎఫయిర్ గ్యారంటీ ప్యాకేజీ అని 249 డాలర్ల స్కీము వుంది. మూణ్నెళ్లలో ఎవరూ చిక్కకపోతే డబ్బు వాపసు యిస్తారు.

ఇదెక్కడి దిక్కుమాలిన వ్యాపారం అని అడిగితే నోయల్ ''భార్యకు లేదా భర్తకు తెలియకుండా అఫయిర్ పెట్టుకోవాలనే పాడు

బుద్ధి వాళ్లకు లేకపోతే మేం ఎంత చెప్పినా వినరు. వాళ్ల జీవితం నిస్సారంగా నడుస్తోంది కాబట్టే వాళ్లు యీ మార్గం పట్టారు. వాళ్లకు మేం దారి చూపిస్తున్నామంతే. నా మట్టుకు నేను వివాహితుణ్ని. పెళ్లయి పదేళ్లగా కలిసే వున్నాం. మాకు ఇద్దరు పిల్లలున్నారు. నాకు ఏ అఫయిర్లూ లేవు. మా ఆవిడకు వుందని తెలిస్తే చాలా బాధపడతాను." అంటాడు. కానీ యితని వ్యాపారం చూసి చాలామంది అసహ్యించుకున్నారు. 2009లో అతను వెంచర్ కాపిటల్ కోసం ప్రయత్నిస్తే గోల్డెన్ ట్రీ ఎస్సెట్ మేనేజ్‌మెంట్ అనే కంపెనీ సారీ అంది. చికాగోలో వుండే బిఎమ్ఓ హారిస్ బ్యాంక్ "మేం పాటించే విలువలకు, మీ కంపెనీకి సరిపోదు" అని చెప్పింది. 2010లో జిఎంపి కాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ కెనడాలో ఐపిఓకు అన్ని ఏర్పాట్లు చేయబోయింది. అంతలో అందరూ తిట్టిపోయడంతో వెనక్కి తగ్గింది. "మీది పాపపు వ్యాపారం. మీ కంపెనీ షేర్లలో మేం పెట్టుబడి పెడితే యిలాటి కంపెనీలో ఎందుకు పెట్టారని అనేక ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలు మమ్మల్ని నిలదీస్తాయి" అంటూ అనేక ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీలు యితన్ని దూరంగా పెట్టాయి.

కానీ యిదంతా పాత కథ. ఈ కంపెనీకి గత ఏడాది 90 మిలియన్ డాలర్ల ఆదాయం, 30 మిలియన్ డాలర్ల లాభం రావడంతో కథ మారిపోయింది. గత ఐదేళ్లలో అమెరికాలో సభ్యుల సంఖ్య నాలుగు రెట్లు పెరిగి యిప్పుడు 1.27 కోట్లమంది అయ్యారు. 30 యితర దేశాలలో (జపాన్, హాంగ్‌కాంగ్‌లో ఎక్కువ) 83 లక్షలమంది సభ్యులయ్యారు. ఈ ఆదాయం చూసి అనేక పెట్టుబడి సంస్థలు అప్పులు యిస్తామని వెంటపడుతున్నాయి. న్యూయార్క్‌లో వున్న ఫోర్ట్రెస్ ఇన్వెస్ట్‌మెంట్స్ అనే 54 బిలియన్ డాలర్ల హెడ్జ్ ఫండ్ కంపెనీ యితని కంపెనీకి 50 మిలియన్ డాలర్ల ఋణం యిచ్చిందని వార్తలు వచ్చాయి. మరో న్యూయార్క్ ఇన్వెస్ట్‌మెంట్ బాంక్ కలిసి ఐపిఓకు వెళదామని ఆఫర్ యిచ్చిందట. బ్రెజిల్‌లో వున్న మరో బ్యాంకు మీ కంపెనీలో వాటా తీసుకుంటామంటూ ముందుకు వచ్చిందట. ఇదంతా చూస్తే నైతిక విలువల కంటె డబ్బుకే ఎక్కువ విలువ యిస్తున్నారా? అన్న అనుమానం వస్తుంది. ఇటీవల షికాగో యూనివర్శిటీ జరిపిన అధ్యయనంలో 21% మంది మగవాళ్లు, 15% మంది ఆడవాళ్లు వివాహేతర సంబంధం పెట్టుకున్నట్టు ఒప్పుకున్నారు. ఇలాటి సమాజంలో యిటువంటి వెబ్‌సైట్‌కు డిమాండ్ రావడంలో ఆశ్చర్యం ఏముంది? ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2013)

**నవంబరు 01-02 వీక్లీకై ఎమ్బీయస్ : తెలంగాణ రూటే సెపరేటు**

రాష్ట్రవిభజన పర్వం అత్యంత గందరగోళంగా సాగిపోతోంది. అసలా జీఓఎమ్ ఏమిటో, దాని తీరుతెన్నులేమిటో ఎవరికీ తెలియటం లేదు. విభజన చేసి తీరతాం, ఎలా చేయాలో సూచనలు యివ్వండి అని అడుగుతున్నారు. ఎవరైనా కమిటీ వేసేముందు సలహాలు తీసుకుంటారు. ఇలా మధ్యదారిలో వుండగా ఎటు వెళ్లాలి అని అడగరు. అప్పుడే సిటింగ్స్ అయిపోయాయి. ఇంకో ఒకటి రెండు మీటింగుల్లో అన్నీ తేల్చిపారేయబోతున్నారు. ఇప్పుడు కొన్ని పార్టీలు యిచ్చిన పేజీల పేజీల సలహాలు చదివేటంత తీరిక కూడా వాళ్లకు లేదు. ఇప్పటిదాకా అందరు సభ్యులూ –పదిమంది నుండి ఆరుగురికి తగ్గించేసినా – కలిసి ఒక్కసారీ కూర్చోలేదు. తక్కిన మీటింగుల్లో కూడా కూర్చుంటారన్న నమ్మకం లేదు. ఏదో ఒకటి తట్ట తగలేసినట్టు అవగొడదామని చూస్తున్నారు. మొదట్లో సలహాలు తీసుకోని పక్షంలో తాము చర్చించుకుని తేల్చుకున్న విషయాలు తెలియబరచి, వాటిపై సలహాలు, సూచనలు అడగవచ్చు. ఇప్పటిదాకా విషయాలు తేల్చుకోలేదు అనుకుంటే ఆంటోనీ కమిటీ నివేదికను పరికించి, దాన్నే ప్రాతిపదికగా చూపవచ్చు. ఎందుకంటే ఆంటోనీ కమిటీ యిప్పటికే యిరుప్రాంతాల కాంగ్రెసు నాయకుల దగ్గర్నుంచి తీసుకుంది కాబట్టి వారి అభిప్రాయాలపై యితర పార్టీల అభిప్రాయలు కోరినా సరిపోయేది.

**చర్చల జోలికి పోని జిఓఎమ్**

ఆంటోనీకేం తెలుసు, మాకింకా కొమ్ములు తిరిగాయి అనుకుంటే యిప్పుడు యీ మూడు మీటింగుల్లో మేం ఏర్పరచుకున్న అభిప్రాయం యిది అని డ్రాఫ్టు ముందు పెట్టవచ్చు. అదీ చేయడం లేదు. మీరేమనుకుంటున్నారో చెప్పండి అంటూ అదే దంపుళ్ల పాట. కాంగ్రెసు పార్టీ అఖిలపక్ష సమావేశాలు ఏర్పరచినపుడు కూడా యిదే కథ నడిచింది. వాళ్లేమనుకుంటున్నారో చెప్పకుండా అన్ని పార్టీలను యిద్దరేసి నాయకులను పంపమనడం, వాళ్లు చెరో అభిప్రాయం చెపితే విని ఊరుకోవడం, తన పార్టీ అభిప్రాయం చెప్పకపోవడం. ఎవరైనా ఏదైనా అభిప్రాయం చెపితే, దాన్ని వ్యతిరేకించినవారి కేసి చూసి, 'మరి దీనికేమంటారు?' అని ముఖాముఖీ అడగడమే లేదు. అసలు అలాటి చర్చ అనేదే లేదు. ఇప్పుడు అఖిలపక్షం అని పిలిచి విడివిడిగా మాట్లాడతారట. అంటే చర్చ అనేదే జరగదు. చర్చ అనేది జరిగితే గిరిగితే అసెంబ్లీలోనే జరగాలి. కానీ అసెంబ్లీలో మాట్లాడేది మేం వినవే వినం అంటున్నారు. 'మీ బోడి అభిప్రాయం ఎవడికి కావాలి? పంపాలని రాజ్యాంగంలో వుంది కాబట్టి పంపుతున్నాం. మీరేం చెప్పినా మేం చేసేది చేస్తాం' అని ఓపెన్‌గా చెప్తున్నారు. ఇక చర్చంటూ జరిగితే పార్లమెంటులో జరగాలి. ఇవన్నీ యింత అడ్డదిడ్డంగా అఘోరిస్తూంటే అది మాత్రం లక్షణంగా వుంటుందని అనుకోగలమా?

సీమాంధ్ర ప్రజలు, నాయకులు దీన్నే తప్పుపడుతున్నారు. సీమాంధ్రలో తక్కువ సంఖ్యలో వున్నా విభజన కోరే జనమూ కొందరున్నారు!

బిజెపి, సిపిఐ పార్టీల వారు కావచ్చు, లేదా దళిత సంఘాలు కావచ్చు, ఏ రాజకీయ సంబంధమూ లేకపోయినా వ్యక్తిగతంగా కూడా విభజన కోరుకోవచ్చు. అది తెలంగాణపై ప్రేమ చేత కాదు, తెరాసవారు ఆంధ్రుల్ని తిడుతున్న తిట్లను ఆమోదించడం చేత కాదు. 'సమైక్యాంధ్ర వున్నంతకాలం హైదరాబాదు తప్ప మన ప్రాంతాలు బాగుపడటం లేదు. విడిపోతే అప్పుడు చచ్చినట్టు మన ప్రాంతంలోనూ పెట్టుబడులు వస్తాయి. ఉద్యోగాల కోసం హైదరాబాదు వెళ్లనవసరం లేదు' అనే ఆలోచనతో వాళ్లు విభజన కోరుతున్నారు. వాళ్లు కూడా విభజన జరిగే తీరును హరాయించుకోలేక పోతున్నారు. తెలంగాణలో విభజన కోరుకునేవారు కూడా తమకు రాష్ట్రం రావాలని కోరుకుంటున్నారు కానీ, యిలా అపసవ్యమార్గంలో, అసంబద్ధంగా రావాలని కోరుకోవడం లేదు. సీమాంధ్రకు సంబంధించిన అంశాలన్నీ పరిష్కరించి, పేచీలు లేని రాష్ట్రం రావాలని వారి అభిమతం. కేంద్రంలోని యుపిఏకు యివేమీ పట్టటం లేదు. ఎవరి సెంటిమెంట్లు పట్టించుకోకుండా బ్రేక్‌నెక్ స్పీడుతో వెళ్లిపోతోంది.

**సమైక్యవాదుల ప్రశ్నలకు జవాబుల్లేవు**

'అలా ఎలా వెళతారు? ఓ పద్ధతీ పాడూ వుండనక్కరలేదా? గతంలో మూడు రాష్ట్రాలు విడిపోయినప్పుడు అసెంబ్లీ తీర్మానాలు తెప్పించుకున్నారు కదా' అని సమైక్యవాదులు ప్రశ్నిస్తే విభజనవాదులు 'అది ఆనవాయితీ కాదు. అంతకుముందు రాష్ట్రాలు చీల్చినపుడు కొన్ని కేసుల్లో అసెంబ్లీ తీర్మానాలు లేవు.' అంటున్నారు. ఎవరైనా తాజా ఉదాహరణలు లెక్కలోకి తీసుకుంటారు కానీ, పాతవి తీసుకోరు. విభజనవాదులకు యిది అనువుగా వుంది కాబట్టి యిలా వాదిస్తున్నారు. 'అసెంబ్లీ తీర్మానాలు పాస్ అయిన విదర్భ, యుపిలను మీరు విభజించడం లేదు. ఆంధ్రప్రదేశ్‌ను మాత్రం విడదీస్తున్నారు ఎందువలన?' అని అడిగితే కేంద్రం వద్ద సమాధానం లేదు. చిదంబరంగారు తమిళనాడు విభజన ఉద్యమాలను మొగ్గలోనే తుంచేయలంటారు. ఆజాద్ గారు జమ్మూను కశ్మీర్ నుండి విడగొట్టడానికి ఒప్పుకోరు. విదర్భ విడగొడతారా అని అడిగితే షిండేగారు యీ పుణ్యకార్యం తర్వాత ఇంకే విభజన డిమాండ్‌ను అంగీకరించం అంటున్నారు. మొయిలీ గారు ఉత్తర కర్ణాటకను విడగొట్టం, ప్యాకేజీ యిచ్చి ఊరుకోబెట్టాం అంటున్నారు.

మీ మీ రాష్ట్రాల్లో విభజన వుద్యమాలను అణచివేస్తూ కేవలం మా పట్లనే యింత కరుణ ఎందుకు చూపుతున్నారు స్వామీ అంటే ఇది 50 ఏళ్లగా నడుస్తున్న ఉద్యమం కాబట్టి అంటున్నారు. మరి గూరా?ల్యాండ్ వుద్యమం యింకా పాతది కదా అంటే దానికి సమాధానం లేదు. 'అయినా 1973-2001 మధ్య తెలంగాణ ఉద్యమం లేదు కదా, వుండి వుంటే సీమాంధ్రులు తెలంగాణలో పెట్టుబడి పెట్టేటంత పిచ్చివాళ్లు కాదు కదా' అంటే దానికీ సమాధానం చెప్పరు. ఉద్యమం వుందని మేం అనుకున్నాం అంతే అంటారు. గట్టిగా రొక్కించి అడిగితే 'అన్ని పార్టీల వాళ్లూ ఒప్పుకున్నారు కాబట్టి తలపెట్టాం..' అంటారు. 'ఒప్పుకున్న పార్టీల్లో వైకాపా అభిప్రాయం మార్చుకుంది. టిడిపి విభజన తీరును తప్పుపడుతోంది. వేరే పార్టీల గోల ఎందుకు, మీ పార్టీలోనే ఏకాభిప్రాయం లేదు. విడగొట్టమని ఓ లేఖ, సమైక్యం అని మరో లేఖ రెండూ గుండుసూదితో గుచ్చి యిచ్చాడు మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు. గతంలో యిచ్చిన లేఖలు చూపడం దేనికి? లేటెస్టుగా వాళ్లు లేవనెత్తిన అభ్యంతరాలను లెక్కలోకి తీసుకుని మరీ ముందుకు కదలండి. మెజారిటీ అభిప్రాయం (కాన్సెన్సస్) తీసుకున్నాకే తెలంగాణపై నిర్ణయం తీసుకుంటామంటూ ఏళ్లూ పూళ్లూ గడిపిన మీరు చివరకు ఎవరినీ ఒప్పించకుండానే ముందుకు ఎలా వెళతారు?' అంటే 'మేం ఆల్‌రెడీ నిర్ణయం తీసేసుకున్నాం. ఇంకెవ్వరూ నోరెత్తడానికి వీల్లేదు' అంటున్నారు.

**గొంతెమ్మ కోరికలు**

మొత్తమంతా కేంద్రం చేతిలోనే వుంది, దానికో రేషనేల్ లేదు అనగానే యిక నాయకులు రెచ్చిపోతున్నారు. ఏవేవో హిరణ్యాక్ష వరాలు కోరుతున్నారు. సీమాంధ్ర నాయకుల డిమాండు చూస్తే - ఐఐటి, ఐఐఎమ్, ఎయిమ్స్, ఐటిఐఆర్, పోలవరం కాకుండా ఇంకో రెండు జలప్రాజెక్టులు, వైజాగ్‌కు మెట్రో, మా గ్యాస్ మాకే, వాల్తేరు డివిజన్, హైదరాబాదులో వున్న ప్రభుత్వ సంస్థల్లో సగం వాటి తరలింపు, సింగరేణిలో వాటా, రెండు యింటర్నేషనల్ ఎయిర్‌పోర్టులు, విద్యుత్ ప్రాజెక్టులు, హైదరాబాదు ఆదాయంలో పదేళ్లవరకు జనాభా నిష్పత్తిన వాటా, కొత్త రాజధాని కట్టుకునేందుకు 20 ఏళ్ల పాటు ఏటా 40 వేల కోట్ల రూ.ల భారీ ప్యాకేజి (20 ఏళ్ల దాకా రాజధాని కట్టరా?), కొత్త రాష్ట్రంలో టాక్స్ హాలిడేస్ - వగైరా వగైరాలు కాక హైదరాబాదును యుటీ చేసేసి అక్కడకు కూడా తమ రాకపోకలకు, వ్యాపారవ్యవహారాలకు అడ్డు లేకుండా చూడడం! కొసరుగా భద్రాచలం! ఇక తెలంగాణ నాయకుల డిమాండు చూస్తే - సింగరేణి మొత్తం మాకే, కెజిబేసిన్‌లో వాటా, స్టీల్ ఫ్యాక్టరీ, పవర్ ప్లాంట్లు, 2 జాతీయ జలప్రాజెక్టులు, ఆంధ్ర ఉద్యోగులను తరిమేయడం, ప్లస్ ఇన్నాళ్ల ఆంధ్రుల దోపిడీకి పరిహారంగా 4.53 లక్షల కోట్ల నిధులు వగైరా వగైరా. ఇవి కాక హైదరాబాదు యుటీ, గీటీ, కేంద్రం చేతిలో శాంతిభద్రతలు ఎట్సెట్రాలు కుదరవు. ఉమ్మడి రాజధాని జాన్తానై, ఓన్లీ తాత్కాలిక రాజధాని. అదీ పదేళ్లు కాదు రెండేళ్లు. కొసరుగా ఢిల్లీ ఎపి భవన్ మాకివ్వడం, హైదరాబాదులో మెట్రో కూల్చడం!

ఈ విభజన సందర్భంగా తండ్రి - యిద్దరుకొడుకుల పోలిక తెగ వాడుతున్నారు. తండ్రి కొడుకుల మధ్య వాటా వేసే స్టేజ్

ఎప్పుడు వస్తుందంటే కొడుకులు ఎదిగి వచ్చి 'మా కాళ్లపై మేం నిలబడగలం. బతుకు మేం బతకగలం. ఉమ్మడి కుటుంబంలో వుండవలసిన అవసరం యిక ఏ మాత్రమూ లేదు. ఉమ్మడి ఆస్తిలో నువ్వు కాస్త వుంచుకుని మాకు రావలసిన ఆస్తిలో మాకు వాటా యిచ్చేస్తే అది పెట్టుబడిగా పెట్టుకుని మేం యింకా బాగా ఎదుగుతాం.' అని చెప్పినపుడు! ఇక్కడ కొడుకుల స్థితి అది కాదు. 'మేం విడిగా వెళ్లి బతకలేం. నువ్వే మమ్మల్ని పోషించాలి. మేం పెట్టబోయే భారీ ఖర్చులకు డబ్బు పట్టుకురా. దానికి మా ఉమ్మడి ఆస్తి ముట్టుకోవద్దు. బయటనుండి సంపాదించి పట్టుకురా, మా ఎదాన పొయ్యి.' అంటున్నారు. 'విడిపోతే నష్టపోతాం, కలిసే వుందాం' అని వాదించే కొడుకు యిలా వాదించాడంటే కాస్త అర్థం వుంటుంది. తమాషా ఏమిటంటే విడిపోదామని పేచీ పెడుతున్న కొడుకూ యిలాగే వాదిస్తున్నాడు. వీళ్ల వరస చూసి తండ్రి చేతులెత్తేసి 'నాయనా, మీ కోర్కెలు తీర్చడం నా వల్ల కాదు. మీకోసం వేరేవాళ్ల పొట్ట కొట్టి అంత డబ్బు పట్టుకుని రాలేను. మీరు విడిపోనేల, నాకీ తలనొప్పేల? అందరూ ఒకే చోట కలిసి వుండండి' అనేయాలి. అయితే ప్రస్తుతం తండ్రి స్థానంలో వున్న కేంద్రాన్ని పాలిస్తున్న కాంగ్రెసు అధినేత్రి సోనియా గాంధీకి యిది ప్రెస్టేజి క్వశ్చన్ అయిపోయింది. అందుకని యిలా చేతులెత్తేయకుండా యిద్దరి మాటలూ వింటున్నట్టు తెగ నటించేస్తోంది. ఆవిడ నిజంగా వింటోందేమోననుకుంటూ యిద్దరూ తమ కోర్కెల జాబితా పెంచుకుంటూ పోతున్నారు.

### సీమాంధ్రుల సందేహాలు – టి ఉద్యమకారుల సమాధానాలు

వాటితో పాటు సీమాంధ్రులకు సందేహాలు మరీ పెరిగిపోతున్నాయి. ఉద్యోగుల సమస్య ఏమిటి, నీటి సమస్య ఏమిటి, ఉమ్మడి రాజధాని అంటే ఏమిటి..? అసలు మీకు మాకేం యివ్వబోతున్నారు? అని ప్రశ్న మీద ప్రశ్న వేస్తూ పోతున్నారు. సోనియమ్మ ఏమీ మాట్లాడదు, జిఓఎమ్ నోరు విప్పదు, తన ప్లాను ఏమిటో చెప్పదు. వీళ్ల సందేహాలు విని వాళ్లు కన్‌ఫ్యూజ్ అయిపోయి, విభజనను ఆపడమో, వాయిదా వేయడమో చేస్తారన్న భయం తెలంగాణ నాయకులకు లోలోపల వుంది. అందుకని 'ఏమిటీ వెధవ సందేహాలు, ఇంతకుముందు రాష్ట్రాల విభజన ఎలా జరిగిందో యిదీ అలాగే జరుగుతుంది' అని విసుక్కుంటున్నారు. 'వాటికీ, దీనికీ పోలిక లేదు. అవన్నీ రాజధాని లేని ప్రాంతాలు విభజన కోరాయి. రాజధాని ఒళ్లో పెట్టుకున్న తెలంగాణ వాళ్లే విభజన కోరడం విపరీతం.' అని సీమాంధ్రులు అంటున్నారు. 'అవును, తెలంగాణది ప్రత్యేక పరిస్థితి. మిగతా వాటితో పోలిక లేదు' అంటారు మళ్లీ తెలంగాణ నాయకులు. అంటూనే 'హైదరాబాదును యుటీ చేయడమేమిటి, గతంలో విభజన చేసినపుడు మద్రాసును యూటీ చేశారా?' అని కూడా అంటారు. 'చండీగఢ్‌ను చేశారుగా' అంటే 'ఆ పోలిక తేకండి' అంటారు.

ఇక హైదరాబాదుపై కేంద్ర అజమాయిషీ, పదేళ్ల ఉమ్మడి రాజధాని అనేవి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానంలోనే వున్నాయి. తెలంగాణ ప్రకటిస్తూనే దానికి యీ (స్ట్రింగ్స్) చిక్కుముళ్లు వేసి మరీ యిచ్చారు. తెలంగాణ కావాలి కానీ యీ చిక్కుముళ్లు వద్దు అంటున్నారు యిప్పుడు తెరాస నాయకులు, టి-జాక్. దానికి ఒప్పుకుంటే టి-కాంగ్రెసు నేతలు తెలంగాణ ద్రోహులే అంటున్నారు. దేశంలో ఏ రాష్ట్ర విభజనలోనూ తేని యీ రెండు అంశాలు యిక్కడెందుకు? అని ప్రశ్నిస్తున్నారు. గతంలో ఎక్కడ జరిగినా మెజారిటీ జనుల ఆమోదంతో జరిగింది, యిప్పుడు అడ్డగోలుగా జరుగుతోంది కదా అంటే తెలంగాణది ప్రత్యేక పరిస్థితి అంటారు. ఇలా తెలంగాణ కేసులో పోలికలు, తేడాలు ఏ అంశానికి ఆ అంశానికి చిత్తం వచ్చినట్టు వాడుకుంటున్నారు.

వాటర్ బోర్డుల అజమాయిషీ సరిగ్గా వుండదని, ట్రైబ్యునల్స్ మాట వినకపోతే కేంద్రం ఏమీ చేయలేకపోతోందని, జలయుద్ధాలు జరుగుతాయని సీమాంధ్రులు భయాలు వ్యక్తం చేసినపుడు 'అలా ఏం జరగవు. వాటి గురించి విభజన మానేస్తామా? గతంలో విభజనలు జరిగాయి కదా' అంటారు. ఓ పక్క బాబ్లీ వివాదం చూస్తున్నాం. మొన్న కంతెనపల్లి గురించి రెండు జిల్లాల తెలంగాణ నాయకులు ఎలా ఘర్షణ పడ్డారో చూశాం. వీటిని చూడడానికి నిరాకరిస్తూ 'అన్నీ రాజ్యాంగప్రకారమే జరుగుతాయి.' అనే ఒక్క మాట పదేపదే అంటున్నారు టి-నాయకులు. ఉమ్మడి రాజధాని అనే మాట ఏ రాజ్యాంగంలో వుంది మహానుభావా అంటే దానికి సమాధానం లేదు. రాజ్యాంగం యిచ్చిన కాలపరిమితులను ఎక్కడి కక్కడ కుదించేస్తున్నారు. జిఓఎమ్‌లో సభ్యుల సంఖ్య, అసలైనవారి తొలగింపు, అసెంబ్లీ తీర్మానం అక్కరలేదనడం.. అన్నీ కేంద్రం తమ చిత్తం వచ్చినట్టు చేస్తూ పోతోంది. ప్రజా ఉద్యమాన్ని పట్టించుకోవటం లేదు. కృష్ణ కమిటీ రిపోర్టును పార్లమెంటు సభ్యులకు చూపించలేదు. దీన్ని దేనితో పోల్చగలం?

### చిన్న పార్టీకి, పెద్ద పార్టీకి అందరికీ ఒకటే స్థాయి ఎలా యిస్తారు?

అసెంబ్లీలో, పార్లమెంటులో చర్చలు జరిపితే మెజారిటీ సభ్యుల అభిప్రాయం తెలిసేది. అలా కాకుండా అఖిలపక్ష సమావేశం అంటూ ఒక్క ఎమ్మెల్యే వున్న పార్టీకి, (ఓటర్లలో 2% మంది ఓట్లేసి వుంటారు వారికి) 150 మంది ఎమ్మెల్యేలున్న పార్టీకి (కనీసం 30% ఓట్లు తెచ్చుకుని వుంటారు వీళ్లు) సమాన ప్రాధాన్యత యివ్వడం కూడా తెలంగాణ అంశం ప్రత్యేకత. ఇలా అందర్నీ ఒకే పంక్తిలో కూర్చోబెట్టి 8 మందిలో 5 యిచ్చేమంటున్నారు కాబట్టి.. అని మెజారిటీ అభిప్రాయంగా చూపడం పూర్తి దగా. తెచ్చుకున్న ఓట్ల శాతం బట్టి ప్రతీ పార్టీకి వెయిటేజి యిచ్చి అప్పుడు మెజారిటీ ఎటు వుందో చూడాలి. మొదటి అఖిలపక్షం ఏర్పాటు చేసినపుడు

యనమల రామకృష్ణుడు అప్పటి హెూం మంత్రిని అడిగారు – 'ఇకపై ఏ రాష్ట్రం విభజించినా, యిదే పద్ధతిలో లేఖలతోనే వ్యవహారం నడిపిస్తారా?' అని. చిదంబరంగారు 'దేని కదే. తెలంగాణ విషయంలో యీ పద్ధతి అవలంబిస్తున్నాం.' అన్నారు.

అందువలన మనం గ్రహించవలసినది ఏమిటంటే – దేశం మొత్తంలో ఆంధ్రప్రదేశ్ విభజన అనేది యిప్పటివరకు కనీవినీ ఎరగని పద్ధతిలో, పద్ధతీ పాడూ లేకుండా అయోమయంగా, గందరగోళంగా జరుగుతోంది. తెలుగువారి కర్మ యిలా కాలింది. ఇంకెవరికీ యిటువంటి దుర్గతి పట్టకూడదని దేవుణ్ని ప్రార్థిద్దాం. మనం చెడ్డాం కాబట్టి యితరులూ చెడాలి అని కోరుకోవద్దు. ఎందుకంటే మన విభజన యింతటితో ఆగుతుందని గ్యారంటీ లేదు. సీమాంధ్ర రాష్ట్రం నుండి కొన్నాళ్లలో ఉత్తరాంధ్రో, రాయలసీమో విడిపోతామనవచ్చు. తెలంగాణ రాష్ట్రం నుండి హైదరాబాదు విడిపోతామనవచ్చు. ఉత్తర, దక్షిణ తెలంగాణలు విడిపోవచ్చు. ఇవన్నీ ఫార్‌ఫెచ్‌డ్ ఐడియాస్ అని కొట్టి పారేయకండి. అంతా కేంద్రం చిత్తం. మన ప్రాప్తం. వారి చేతిలో ఆర్టికల్ 3 ఒకటి వుంది. అది పెట్టుకుని వాళ్లు యిష్టం వచ్చినట్టు ఆడవచ్చు. ఇవాళ జరుగుతున్నది రేపూ, ఎల్లుండీ కూడా జరగవచ్చని గ్రహించండి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2013)**

**నవంబరు 03-05 వీక్లీకై** **ఎమ్బీయస్ : న్యూస్, వ్యూస్, రివ్యూస్ – 22**

**పంజాబ్ ఆర్థిక స్థితి**

చిన్న రాష్ట్రాలకోసం ఉద్యమించే ప్రతీవారూ 'చిన్న రాష్ట్రాలే ప్రగతి సాధిస్తాయి. ఉదాహరణకి పంజాబ్ చూడండి' అంటూ వుంటారు. పంజాబ్‌లో నదులెక్కువ కాబట్టి, వ్యవసాయం ఉధృతంగా చేసేస్తుంటారు కాబట్టి నిజంగా వెలిగిపోతోందేమో అనుకుంటాం. అదంతా ఉత్తిదిట. 1984 వరకు రెవెన్యూ సర్‌ప్లస్ (వ్యయం కంటె ఆదాయం ఎక్కువ) రాష్ట్రంగా వుంది కానీ అప్పణ్నుంచి టెర్రరిజం పెరగడంతో ఆర్థిక కార్యకలాపాలు దెబ్బ తిన్నాయి. శాంతి లేనిచోట అభివృద్ధి వుండదు కదా, పైగా టెర్రరిజాన్ని అదుపు చేయడానికి పోలీసు వ్యవస్థపై, సైన్యంపై చాలా ఖర్చు పెట్టవలసి వచ్చింది. ఆ కాలంలో భారతదేశంలోని అన్ని రాష్ట్రాల కంటె ఎక్కువగా డెఫిసిట్ పంజాబ్‌కే వుండేది. 1995 ప్రాంతానికి వచ్చేసరికి జిడిపి (అభివృద్ధి రేటు)తో పోలిస్తే అప్పు జాతీయంగా 2.5% వుంటే పంజాబ్‌లో 5% వుంది. దాన్ని ఎలా సవరించాలా అని చూడలేదు పంజాబ్ పాలకులు. రెండేళ్లలో అది 7% అయింది. అలా అలా ఒకప్పుడు దేశంలో అగ్రగామిగా వున్న రాష్ట్రం ఋణభారంతో కృంగిపోసాగింది. 1998-99 సంవత్సరంలో ఏడాదిలో 10 రోజులు మాత్రం క్యాష్ బాలన్సు వుంది. తక్కిన అన్ని రోజులూ ఓవర్‌డ్రాఫ్టే! కేంద్రం మందలింపులు, ఉద్యోగుల జీతాలు ఆలస్యం కావడాలు.. వీటన్నిటికీ అలవాటు పడింది పంజాబ్.

ఇంకో పదేళ్లు గడిచేసరికి పంజాబ్ ప్రభుత్వం ఆర్థిక అరాచకత్వం మరింత పెరిగి ప్రస్తుతం రూ.1.02 లక్షల కోట్ల రూ.ల ఋణానికి చేరింది. గత నెలలో ఉద్యోగుల జీతాలే కాదు, రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లు యివ్వలేకపోయింది. తన ఆస్తులు తాకట్టు పెట్టి డబ్బు పుట్టించవలసి వచ్చింది. పరిస్థితి యింత ఘోరంగా వుందేమిటని పాత్రికేయులు అడిగితే ఉపముఖ్యమంత్రి పెద్ద డాబుగా 'అభివృద్ధి చెందిన దేశాలన్నిటికీ అప్పులున్నాయి.' అన్నాడు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై ఖఋ్చు పెట్టినపుడు ఋణాలు తప్పవు కానీ పంజాబ్ ప్రభుత్వం తీసుకుంటున్న అప్పుల్లో 80% పాత అప్పులపై వడ్డీలకు పోతున్నాయి. పోనీ సంక్షేమ పథకాలు వెలగబెడుతున్నారా అంటే అవీ సవ్యంగా నడవటం లేదు. ఆటా-దాల్ స్కీము అని పెద్ద హంగామాతో మొదలుపెట్టి కొన్ని నెలల తర్వాత ఆపేశారు. మళ్లీ ప్రారంభించినపుడు బకాయిలు తీర్చలేదు. ఉచిత విద్యుత్ అంటూ రోజుకు 4-5 గంటల కంటె విద్యుత్ యివ్వటం లేదు. కొత్త స్కూళ్లు ప్రారంభిస్తామని ప్రకటనలు చేస్తారు కానీ యిప్పుడున్న స్కూళ్లలో వున్న 35,000 ఖాళీలను భర్తీ చేయడం లేదు. ప్రభుత్వ యంత్రాంగంపై అయ్యే ఖర్చులో మాత్రం ఏ లోటూ చేయడం లేదు. ఖరీదైన కార్లు, విదేశీయాత్రలు యితోధికంగా పెరుగుతున్నాయి.

ఈ అధ్వాన్న పరిస్థితిపై పంజాబ్ పాలకులను నిలదీస్తే వాళ్లు చెప్పే కారణాలు – 1) శత్రుదేశమైన పాకిస్తాన్‌తో సరిహద్దు వుండడం చేత రక్షణకు ఖర్చు అవుతోంది (గుజరాత్‌కు కూడా యీ సమస్య వుంది మరి) 2) పంజాబ్‌కు సముద్రతీరం లేదు, రవాణాకు ఎక్కువ ఖర్చు అవుతోంది (దేశంలో 20 రాష్ట్రాలకు యీ సమస్య వుంది, కొత్తగా తెలంగాణ చేరుతోంది) 3) స్పెషల్ స్టేటస్ హెూదాతో పన్నుల రాయితీలు యిస్తున్న హిమాచల్ ప్రదేశ్ పక్కనే వుండడం వలన పరిశ్రమలు అక్కడకు తరలిపోతున్నాయి. (హర్యాణాకూ యీ సమస్య వుందిగా). పాలించడం చేతకాకపోతే యిలాటివి ఎన్నయినా చెప్పవచ్చు. నీతి ఏమిటంటే – రాష్ట్రం చిన్నదా, పెద్దదా అన్నది క్వశ్చన్ కాదు. పాలకులు మంచివాళ్లా కాదా అన్నది పాయింటు.

**ఛత్తీస్‌గఢ్‌లో బలాబలాలు**

90 సీట్లున్న ఛత్తీస్‌గఢ్‌లో గత ఎన్నికల్లో బిజెపికి 50 సీట్లు రాగా, కాంగ్రెసుకు 38 వచ్చాయి. 2003 నుండి పాలిస్తున్న బిజెపి ముఖ్యమంత్రి రమణ్‌సింగ్‌కు పాలనాదక్షతకు పేరుపడ్డారు. ఈ సారి కూడా నెగ్గితే ఆయన హేట్రిక్ చేసినట్టు అవుతుంది. నెగ్గగలరా?

సిఎన్ఎన్-ఐబిఎన్ సర్వే ప్రకారం బిజెపికి 61-71, కాంగ్రెసుకు 16-24 వస్తాయని అంచనా. ఇది నిజంగా సాధ్యపడుతుందా అని కొందరు అనుమానిస్తున్నారు. ఎందుకంటే ఛత్తీస్‌గఢ్ స్వాభిమాన్ మంచ్ (సిఎస్ఎమ్) అనే పార్టీ బిజెపి ఓట్లు కొంతమేరకు గుంజుకుంటుందన్న భయం వుంది. ఆ సంస్థను నాలుగేళ్ల క్రితం తారాచంద్ సాహు అనే బిజెపి నాయకుడు స్థాపించాడు. ఛత్తీస్‌గఢ్‌లో మొదటినుండీ వున్న సాహు(నూనె వర్తకులు), కూర్మీలు (ఓబిసిలో వర్గంలోకి వచ్చే రైతులు) జనాభాలో సగం మంది వున్నా బిజెపి పాలనలో బయట నుండి వచ్చినవారు బలపడి స్థానికులపై పెత్తనం చలాయిస్తున్నారని అతని నినాదం. మధ్యప్రదేశ్‌నుండి యిదే వాదనతో ఛత్తీస్‌గఢ్ విడివడ్డాక కూడా యిలాటి వివాదాలు వస్తూనే వున్నాయన్నది గమనార్హం. బిజెపి అతన్ని పార్టీ నుండి వెలివేసింది. తారాచంద్ పోయాక అతని కొడుకు నడుపుతున్న యీ పార్టీ యీ ఎన్నికలలో సిపిఐ, జెడి(యు)లతో పొత్తు పెట్టుకుని బిజెపి అవకాశాలను దెబ్బ తీస్తుందని ఒక అంచనా. 2003లో కాంగ్రెసు నుండి వెలివేయబడిన విద్యాచరణ్ శుక్లా, శరద్ పవార్ ఎన్‌సిపితో పొత్తు పెట్టుకుని 90 సీట్లలో పోటీ చేసి కాంగ్రెసు ఓట్లు చీల్చాడు. తను ఒక్కటే గెలిచినా, అనేక చోట్ల కాంగ్రెసును ఓడించాడు. అప్పుడు కాంగ్రెసు అతన్ని పార్టీలో మళ్లీ చేర్చుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు ఆ పని సిఎస్ఎమ్ చేయవచ్చు. బియస్‌పి గత ఎన్నికలలోనే సీట్లు గెలుచుకుంది. ఈ సారి కూడా 2 గెలుచుకోవచ్చు. సిపిఐ ఓ రెండు.

దేశమంతా కాంగ్రెసు అవినీతి గురించి ప్రతిపక్షాలు ఉద్యమిస్తూ వుంటాయి. ఈ రాష్ట్రంలో కాంగ్రెసే అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమిస్తోంది. రమణ్ సింగ్ కాబినెట్‌లోని మంత్రులు తమ ఆస్తుల వివరాలను ప్రకటించినపుడు గత ఐదేళ్లలో వాళ్ల ఆస్తులు విపరీతంగా పెరిగిన తీరు చూసి అందరూ విస్తుపోయారు. దాన్నే కాంగ్రెసు ఎన్నికల అంశంగా చేసుకుంటోంది. బిజెపికి హ్యాట్రిక్ దక్కకుండా చేయాలన్న పట్టుదలతో వున్న కాంగ్రెసు అధిష్టానం అజిత్ జోగి భార్యకు, కుమారుడికి టిక్కెట్లు యిచ్చి అతనితో రాజీ కుదుర్చుకుంది. 2014 పార్లమెంటు ఎన్నికలలో అతనికి టిక్కెట్టు యిస్తానంది. బస్తర్ జిల్లాలో అజిత్ జోగి మద్దతు లాభించవచ్చు. బస్తర్ ఎవరు గెలిస్తే వాళ్లే రాష్ట్రాన్ని పాలిస్తారని ఒక నానుడి. మొత్తం మీద కొత్తవాళ్లకు చాలామందికి టిక్కెట్లు యిచ్చారు. కానీ కాంగ్రెసు బలహీనతలు ఏమిటంటే - ముఖ్యమంత్రిగా ఎవరినీ చూపించటం లేదు. యుపిఏ అవినీతికి విస్తృతప్రచారం వుంది కాబట్టి ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెసు అవినీతి వ్యతిరేక ప్రచారం పని చేయడం లేదు. ప్రజాదరణ లేని కొందరు సిటింగ్ ఎమ్మెల్యేలకు మళ్లీ టిక్కెట్లు యిచ్చారు.

బిజెపికి 25% సిటింగ్ ఎమ్మెల్యేలకు టిక్కెట్లు యివ్వలేదు. సంక్షేమపథకాలను విజయవంతంగా అమలు చేసింది. బలహీనతల గురించి చెప్పాలంటే పార్టీలో అంతర్గత కలహాలున్నాయి. అభివృద్ధి ఫలాలు హైవేకు దగ్గరగా వున్న గ్రామాలకు అందాయి తప్ప యింకా అనేక గ్రామాల్లో తాగునీరు, విద్యుత్, టాయిలెట్ సౌకర్యాలు లేవు. పారిశ్రామికవేత్తలకు చౌక ధరలకు భూమి, గనులు కట్టబెట్టారన్న ఆరోపణలున్నాయి. ముఖ్యమంత్రి పట్ల వ్యతిరేకత లేకపోయినా యితర మంత్రుల్లో కొందరి పట్ల ఏహ్యత వుంది. ఎలా చూసినా కాంగ్రెసు కంటె బిజెపి మెరుగైన స్థితిలో వుండడానికి కారణం - గిరిజన ప్రాంతాల్లో ఆరెస్సెస్ చేస్తున్న కృషి. రాష్ట్ర జనాభాలో 30% మంది గిరిజనులు, 12% మంది దళితులు వున్నారు. వీరిలో చాలామంది క్రైస్తవమతం తీసుకున్నారు. ప్రభుత్వమద్దతుతో ఆరెస్సెస్ యీ ప్రాంతాల్లో 100 వనవాసి కళ్యాణ్ ఆశ్రమాలు, వెయ్యి సరస్వతీ శిశు మందిరాలు, 500 ఏకోపాధ్యాయ పాఠశాలలు నడుపుతూ వారిని తిరిగి హిందూమతంలోకి ఆకర్షిస్తోంది. వీళ్లు పోలింగు రోజున ఓటర్లను బూత్‌దగ్గరకు తీసుకురాగలరు. అందువలన బిజెపియే గెలుస్తుందని అనుకోవచ్చు కానీ సర్వేలో చెప్పినంత గొప్పగా గెలవకపోవచ్చు.

### అదృష్టాన్ని తెచ్చే రాళ్లు

కేరళ ముఖ్యమంత్రి ఊమెన్ చాండీ యిటీవలి కాలంలో చాలా కష్టాలు ఎదుర్కుంటున్నారు. ఆయన కాబినెట్‌లోని మంత్రులు సెక్స్ స్కాండల్స్‌లో యిరుక్కున్నారు. కొందరు మంత్రులే కాదు, ఆయన ఆఫీసు కూడా అవినీతి వివాదంలో చిక్కుకుంది. కోర్టు చివాట్లు వేసింది. కాంగ్రెసు చీఫ్ విప్ పిసి జార్జి వ్యాఖ్యలు యిరకాటంలోకి నెట్టాయి. ఇదే అదనుగా భావించి సిపిఎం నాయకత్వంలోని ప్రతిపక్షాలు చాండీ రాజీనామా చేయాలంటూ ఆందోళన చేపట్టాయి. ఆయన మీటింగులకు వచ్చి అల్లరి చేయసాగాయి. అతని యింటిని కూడా చుట్టుముడతాయని బెదిరించాయి. పరిస్థితి చేజారిపోతోందని గ్రహించిన చాండీ ధైర్యం చేసి జనంలోకి వెళ్లి పరిస్థితి ఎదుర్కోవాలని నిశ్చయించుకున్నాడు. అక్టోబరు 18 న తిరువనంతపురంలో రచ్చబండ వంటి కార్యక్రమం నిర్వహించాడు. ప్రజలు వచ్చి తమ గోడు వినిపించుకున్నారు. అభ్యర్థనలు యిచ్చారు. చాండీ అప్పటికప్పుడు ధనసహాయాలు ప్రకటించాడు. అది విజయవంతం కావడంతో ఇంకో వారం పోయాక కోచిలో యింకో రచ్చబండ నిర్వహించాడు. అక్కడ 14 వేల పై చిలుకు పిటిషన్లు తీసుకుని రూ.2 కోట్లు ఆర్థిక సహాయం ప్రకటించాడు. వీటితో ముఖ్యమంత్రి పాప్యులారిటీ పెరగసాగింది.

ఇది ప్రతిపక్షాలకు చింత కలిగించింది. అక్టోబరు 27 న ముఖ్యమంత్రి కమ్యూనిస్టులకు కంచుకోట ఐన కన్నూరులోని పోలీసు అథ్లెటిక్ మీటింగుకి వెళుతూండగా సిపిఎం కార్యకర్తలు అతని కారును అడ్డుకుని నల్లజండాల ప్రదర్శన నిర్వహించారు. అంతటితో ఆగలేదు, కారుపై రాళ్లు విసిరారు. ముఖ్యమంత్రి నుదుటిమీద, ఛాతీ మీద గాయాలయ్యాయి. దీన్ని రాజకీయంగా తనకు అనుకూలంగా మలచుకోవడానికి నిశ్చయించుకున్న చాండీ ఆ దెబ్బలకు చికిత్స తీసుకోలేదు. ఆ ఫంక్షన్‌కు అలాగే రక్తం ఓడుతూనే వెళ్లాడు.

కన్నూరు జిల్లా కాంగ్రెసు కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తూ "కమ్యూనిస్టులు బలంగా వున్న యీ జిల్లాలో మీరు ప్రాణాలకు తెగించి కాంగ్రెసు కోసం పోరాడుతున్నారని నేను స్వానుభవంతో తెలుసుకున్నాను." అంటే చప్పట్లు పడ్డాయి. రక్తం కారుతున్న ముఖ్యమంత్రి టీవీల్లో కనబడడంతో సానుభూతి పెరిగింది. ముఖ్యమంత్రిపై దాడిని ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా బంద్ నిర్వహిద్దామని కాంగ్రెసు ప్రతిపాదిస్తే 'వద్దు, ప్రజలకు యిబ్బంది లుగుతుంది' అన్నాడు చాండీ. దాంతో సానుభూతి యింకా పెరిగింది. కాంగ్రెసువారంతా విభేదాలు మరచి చాండీకి మద్దతు ప్రకటించారు.

ఇదంతా చూసి సిపిఎం కంగారు పడింది. దాడికి, మాకూ ఎలాటి సంబంధం లేదు, దాన్ని ఖండిస్తున్నాం అని ప్రకటించింది. అది నిజమైతే సంతోషమే అన్నాడు చాండీ. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో 46 మంది కమ్యూనిస్టు కార్యకర్తలున్నారు. మొదటి యిద్దరు నిందితులు ప్రతిపక్షాలకు చెందిన ఎమ్మెల్యేలే! అతి చేస్తే గతి చెడుతుందన్న సామెత వూరికే రాలేదు.

**రాహుల్ ప్రవచనం- అమిత్ జోగి ప్రవర్తన**

ఛత్తీస్‌గఢ్‌లో బస్తర్ జిల్లాలో నెగ్గాలంటే అజిత్ జోగితో సయోధ్య చేసుకోక తప్పదని గ్రహించిన కాంగ్రెసు అతని కొడుకు అమిత్‌కు మర్‌వాహి అసెంబ్లీ టిక్కెట్టు యిచ్చారు. ఓ పక్క రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి నేరస్తులు రాకూడదంటూ స్పీచులు దంచుతున్నాడు. ఇంకో పక్క అమిత్‌లాటి వాళ్లకు టిక్కెట్టు యిప్పించాడు. ఈ అమిత్‌పై గతంలోనే ఆరోపణలున్నాయి. ఇప్పుడు కొత్తగా కొన్ని వెలుగులోకి వచ్చాయి. ఎన్‌సిపి లీడరైన రామ్ అవతార్ జగ్గి అనే అతన్ని చంపడానికి కొందరితో కలిసి కుట్ర పన్నాడని గతంలోనే ఆరోపణ వుంది. సెషన్స్ కోర్టుకు వాళ్లు కేవలం రూ.5000 బెయిల్ తీసుకుని అతన్ని వదిలేశారు. దానిపై రామ్ అవతార్ కొడుకు సతీష్ హైకోర్టుకి వెళ్లి రివిజన్ పిటిషన్ వేశాడు. కేసు హై కోర్టులో పెండింగులో వుంది.

2003 ఛత్తీస్‌గఢ్ ఎన్నికల తర్వాత కాంగ్రెసు ఓడిపోయి, అజిత్ జోగి ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా వుండి, బిజెపికి అధికారం అప్పగించవలసిన తరుణంలో కొందరు బిజెపి ఎమ్మెల్యేలను కొనే ప్రయత్నం చేశాడు. ఆ పనిలో అమిత్ సాయపడ్డాడు. సిబిఐ కేసు బుక్ చేసింది. అయితే 'అవినీతి నిరోధక చట్టంలో ముఖ్యమంత్రి శిక్షార్హుడు అని వుంది కానీ, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి గురించి ఏమీ రాయలేదు, అందుకని విచారణ ఆపేయండి' అని న్యాయశాఖ సలహా యివ్వడంతో సిబిఐ విచారణ ఆపేసింది. దాంతో సహనిందితుడుగా వున్న అమిత్ బయటపడ్డాడు. కానీ ఈ లంచం వ్యవహారాన్ని బయటపెట్టిన వీరేంద్ర పాండే సిబిఐ కేసు మూసేయకూడదంటూ సిబిఐ కోర్టులో ఛాలెంజ్ చేశాడు. కేసు నడుస్తోంది. ఇంకో బిజెపి మంత్రి దిలీప్ సింగ్ జుడావ్ లంచం తీసుకుంటూండగా ఓ స్టింగ్ ఆపరేషన్ జరిగింది. దానిలో అమిత్ కెమెరాలకు చిక్కాడు.

ఇవన్నీ అందరికీ ఎప్పణ్నుంచో తెలుసు. ఇప్పుడు కొత్తగా పత్రికలు కూపీ లాగిన సమాచారం ఏమిటంటే – శ్రీ అమిత్ జోగిగారు అవతార పురుషుడు. ఒకే జన్మలో మూడు చోట్ల, మూడు విభిన్న ప్రాంతాల్లో జన్మించారు. భారతీయ పౌరసత్వానికై 2001 లో అప్లయి చేస్తూ తను 1977, ఆగస్టు 7 న డాలస్‌లో పుట్టానని ఒక అఫిడవిట్ దాఖలు చేశాడు. ఇంకో ఏడాది పోయాక వాళ్ల తండ్రి ముఖ్యమంత్రిగా వుండగా ఛత్తీస్‌గఢ్‌లో పౌరసత్వం కోరుతూ దాఖలు చేసిన అఫిడవిట్‌లో 1978 ఆగస్టు 7 న బిలాస్‌పూర్‌లో పుట్టానని తెలియపరచాడు. దానికి అనుబంధంగా యిచ్చిన కాగితాల్లో తను బిలాస్‌పూర్ జిల్లాలోని పెండ్రా గ్రామంలో పుట్టినట్టు రాశాడు. జిల్లా కలక్టరుగారు యిలాటివి ఏమీ పట్టించుకోకుండా సర్టిఫికెట్టు దయచేయించారు. 2004లో బిజెపి ప్రభుత్వం నడుస్తూండగా అమిత్ తన షెడ్యూల్ ట్రైబ్ క్రింద వస్తానంటూ ఎస్‌టి సర్టిఫికెట్టుకై అప్లయి చేశాడు. దానిలో తను 1977 ఆగస్టు 7న పెండ్రా రోడ్‌లోని గౌరేలాలో పుట్టినట్టు అప్లికేషన్‌లో రాశాడు. దానికి మద్దతుగా యిచ్చిన డాక్యుమెంట్లలో యితను పెండ్రా రోడ్ తహసీల్‌లోని సాబహారా గ్రామంలో పుట్టినట్లు పట్వారీ యిచ్చిన సర్టిఫికెట్టును జోడించాడు.

అమిత్‌గారి అమితమైన జన్మస్థలాలు, జన్మదినాల మాట ఎలా వున్నా యాయనకు ఎస్‌టి హెూదా యివ్వనక్కరలేదటూ షెడ్యూల్ ట్రైబ్స్ జాతీయ కమిషన్ అభ్యంతరపెట్టింది. ఒక వ్యక్తి కులంగురించి ఆచూకీ తీసే హక్కు కమిషన్‌కు లేదని అమిత్ తండ్రి అజిత్ జోగి ఆ కమిషన్‌పై మండిపడ్డాడు. వివాదం ముదిరి యితని కులం గురించి తేల్చమని సుప్రీం కోర్టు 2011లో విచారణకు ఆదేశించింది. విచారణ రిపోర్టు యింకా వెలుగు చూడలేదు. ఆర్డినెన్సును నాన్సెన్సు అన్న యువరాజావారికి అమిత్ నేరాలు కనబడటం లేదు పాపం.

**నాజీల దోపిడీకి గురైన కళాఖండాలు**

జర్మన్ ఇన్‌కమ్‌టాక్స్ శాఖ వారు కార్నిలియస్ గుర్లిట్ అనే పన్ను ఎగవేతదారుడి యింటిపై దాడి చేసి అటకమీద జాడీలు, చీకటి గదులు సోదా చేసినపుడు అతని యింట్లో వాళ్లకు డబ్బు మూటలు కనబడ లేదు కానీ, 1.3 బిలియన్ డాలర్ల విలువైన చిత్రపటాలు, కళాఖండాలు కనబడ్డాయి. గుర్లిట్ తండ్రి హిల్డ్‌బ్రాండ్ గుర్లిట్ కళాఖండాలను ఎగుమతి చేసే వ్యాపారంలో వుండేవాడు. అతను 1930-40లలో కొన్న ఆ బొమ్మల వెనక చరిత్ర వుంది. నాజీలు పోలండ్‌పై, ఫ్రాన్సుపై దాడి చేసినపుడు అక్కడి ధనిక యూదుల

యిళ్లల్లో వున్న ఖరీదైన చిత్రాలను నాజీలు స్వాధీనం చేసుకునేవారు. ఒక్కోప్పుడు వాళ్లపై ఒత్తిడి చేసి తక్కువ ధరకు కొనేవారు. మరొకప్పుడు అసలేమీ యిచ్చేవారు కారు. ఫ్రాన్సులో 1940-44 మధ్య అలా వశపరచుకున్న పెయింటింగులు, యితర వస్తువులు లక్షకు మించి వుంటాయని ఒక అంచనా. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన చిత్రకారులు వేసిన యీ చిత్రాలు యూదుల యిళ్లల్లో వున్నాయి కాబట్టి అవి భ్రష్టుపట్టిపోయాయని నాజీ ప్రాపగాండా మంత్రి గోబెల్స్ నిర్ణయించాడు. అవి పారేయడం కంటె యితర దేశాలకు అమ్మి డబ్బు గడిస్తే మంచిది కదా అని అతని ఉద్దేశం.

ఇతర దేశాలలోని ప్రముఖులతో ధనికులతో లింకులు వున్నవాడెవడాని వెతికితే యిదిగో యీ హిల్డ్‌బ్రాండ్ గుర్లిట్ కనబడ్డాడు. అతని నాయనమ్మ యూదురాలు, తాత జర్మన్. యూదు కనక్షన్ వున్నా అవసరం వుంది కాబట్టి ఆ అభ్యంతరాన్ని పట్టించుకోకుండా యితని ద్వారా చాలా అమ్మించాడు. అలా అమ్మగా మిగిలిపోయినవాటిని గుర్లిట్ తన యింట్లోనే వుంచుకున్నాడు. అతని తదనంతరం అతని కొడుక్కి వారసత్వంగా యీ బొమ్మలు వచ్చాయి. కొడుకు వేరే వ్యాపారం చేసి దెబ్బ తిన్నాక యీ బొమ్మలను ఒక్కొక్కటీ అమ్ముకుంటూ జీవిస్తున్నాడు. ఇప్పుడు ప్రభుత్వం కంటపడ్డాయి. నాజీలు బలవంతంగా స్వాధీనం చేసుకున్న కళాఖండాల గురించి యుద్ధానంతరం యూదులు ఆందోళన చేశారు. చాలామందికి వెనక్కి యిచ్చేశారు కూడా. వ్యక్తి చనిపోతే వాళ్ల వారసులకు యిచ్చేశారు. అయినా చాలా చిత్రాలు మిస్ అయిపోయాయి – యీ విధంగా! 2007లో ఒక జర్మన్ ఎక్స్‌పర్ట్ ఇలా దోచుకున్న ఆర్ట్ గురించి ఒక పుస్తకం రాసి ప్రచురించాడు. నాజీల ఘోరాలు తవ్వే కొద్దీ బయటకు వస్తూనే వుంటాయి లాగుంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2013)**

**నవంబరు 06-08 వీక్లీకై** **ఎమ్బీయస్ : రావణకాష్టం రగులుతూనే వుండాలి...**

జీఓఎమ్ (తెలుగులో మంత్రుల ముఠా అంటే సబబుగా వుంటుంది) ఎదుట పార్టీలు తమ వాదనలు వినిపించాయి. ఇన్నాళ్లూ కాంగ్రెసు అడిగేవాడికి చెప్పేవాడు లోకువ అన్నట్లు ప్రవర్తించింది. అఖిలపక్షం అనడం, అందర్నీ పిలవడం, తన మనసులో వున్నది చెప్పకపోవడం, నువ్వు ఏమనుకుంటున్నావో చెప్పు చూదాం అనడం, అంతా వినేసి 'వెళ్లిరా' అనడం తప్ప 'అభివృద్ధి గణాంకాలు ఒకటి చెప్తూ వుంటే నువ్వు యింకోటి చెప్తున్నావేమిటి?' 'నువ్వు చెప్తున్నది చేస్తావన్న నమ్మకం ఏమిటి?', 'నీ సూచన ఆచరణయోగ్యం కాదు కదా', 'నీతో పాటు వచ్చిన నీ పార్టీ సహచరుడే నీతో విభేదిస్తున్నాడేం?' – వంటి ప్రశ్నలు కూడా ఎప్పుడూ వేయలేదు. అసలు ఎదుటివాళ్లు చెప్తున్నది విన్నారో లేదో కూడా తెలియదు. ఈ ఆట ఏళ్లపాటు సాగించారు.

**అఖిలపక్షమా, వికలపక్షమా?**

ఇప్పుడు 'అఖిలపక్షం' పేర వికలపక్షం నిర్వహిస్తున్నారు. విడివిడిగా పిలిచి మా చెవిలో చెప్పి పొండి అంటున్నారు. అందర్నీ ఒక చోట కూర్చోపెట్టి 'ఇదిగో సీమాంధ్రుల భయాలు యిలా వున్నాయి, ఆ భయాన్ని పోగొట్టే సాకు చెప్పి మీ రాష్ట్రాన్ని మేం స్వాధీనం చేసుకోబోతున్నాం. అలా జరగకూడదంటే మీరు ఫలానా ఫలానా హామీలు యివ్వాలి. ఇస్తారా?' – యిలాటి ప్రశ్నలు వేసి చర్చించ లేదు. సమావేశం జరిగాక దానికి కొనసాగింపుగా తదుపరి చర్యలు యిలా చేపట్టాం అని చెప్పలేదు. ఏం చేస్తున్నారు అని అడిగితే 'ఏకాభిప్రాయం కోసం ప్రయత్నిస్తున్నాం. అందర్నీ పిలిచి మాట్లాడుతున్నాం' అని ఏళ్లూ, పూళ్లూ గడిపేశారు. మాటలాడడం అంటే యిద్దరూ తమతమ అభిప్రాయాలు కలబోసుకుంటేనే మాట్లాడడం అంటారు. వీళ్లు నోరు విప్పింది ఎప్పుడు? 'నీ సొద నువ్వు చెప్పుకో, నాకు తోచింది నేను చేస్తా' అన్నట్టే ప్రవర్తించారు.

ఇప్పుడూ అదే పద్ధతి అవలంబించారు. కానీ యీసారి కొన్ని పార్టీలు ఎదురు ప్రశ్నించాయి. ఏవిటీ రహస్య సమావేశాలు? అని నారాయణ అడిగారు. హైదరాబాదును యుటీ చేయాలని మీరేదో నివేదిక యిచ్చేశారటగా అని అసదుద్దీన్ ఆంటోనీని డైరక్టుగా అడిగారు. ఇక బిజెపి వాళ్లయితే కడిగి పారేశారు. 'ముందు హైదరాబాదు ఆదాయం ఎంతో చెపితే దాన్ని ఎలా పంచాలో తర్వాత చెప్తాం' అన్నారు. 'మేమూ ఆ అంకెల గురించే వెతుకుతున్నాం. దొరగ్గానే చెప్తాం' అంది మంత్రుల ముఠా. 'దొరికిన తర్వాతే మీటింగు పెట్టలేకపోయారా? అవి దొరికించుకుని మీరు చదువుకుని ఒక అభిప్రాయం ఏర్పరచుకుని అప్పుడు మమ్మల్ని పిలిస్తే మేం మా అభిప్రాయం చెప్తాం' అని వాయించి వచ్చారు. వీళ్లు యిలాగే అన్నారో లేదో మనకు నిర్ధారణగా తెలియదు. ఎందుకంటే 'మేం యిలా చెప్పాం' అని వీళ్లు బయటకు వచ్చి చెప్పుకోవడమే తప్ప ముఠా సభ్యులు పెదవి విప్పటం లేదు.

**సమాచారం లేదు కానీ తీర్పు రెడీగా వుంది..**

వెళ్లినవాళ్లు సమాచారం కోసం యిలా అడగడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. కానీ 'మా దగ్గర గణాంకాలు ఏమీ లేవు, యింకా సేకరిస్తున్నాం' అని ముఠావారు నిర్లజ్జగా చెప్పడమే వింతగా వుంది. ఓ పక్క తెలంగాణ బిల్లు వచ్చేస్తోంది.. చేస్తోంది..స్తోంది.. ది..

అంటూ ఊదరగొట్టేస్తున్నారు. 20 న ఫైనల్ నివేదిక, నెలాఖరుకి అసెంబ్లీకి రాక, పదిరోజుల్లో పోక, డిసెంబరు 5 న పార్లమెంటులో పెట్టుట, 9 న సోనియమ్మ జన్మదినాన తెలుగువారిని చీల్చుట... అంటూ టైమ్‌టేబుల్ చెప్పేస్తున్నారు. మరి ఇవాళ్టి దాకా సమాచారం కూడా లేకుండా వుంటే యింతటి బృహత్కార్యం ఎలా నిర్వహిస్తారు? ముఠావారు అబద్ధం చెప్పారని అనలేము. వాళ్ల దగ్గర నిజంగా ఏమీ లేదేమో! ఒకవేళ వుందేమో ఫైళ్లు వెతికే ఓపిక లేదేమో! వాళ్లు కూర్చునేదే రెండు, మూడు గంటలు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో తమ పార్టీ గతి ఎలా అఘోరిస్తుందో ఎవరి అంచనాలు వాళ్లు చెప్పుకుని ముచ్చట్లాడడానికి ఓ అరగంట, ముప్పావుగంట పోయాక విభజన ఫైలు తెరవగానే నదీజలాలు, ప్రాంతాలవారీ ఆదాయవ్యయపట్టికలు కనబడగానే కళ్లు తిరుగుతాయి. వీళ్లెవరూ ఆ యా శాస్త్రాల్లో నిపుణులు కారు. రాజకీయాల్లో ఓ గాడ్‌ఫాదర్ వుంటే ఆయన్ని ఆశ్రయించి పైకి వచ్చినవాళ్లు. ఇంత సాంకేతికపరమైన అంశాలు బోరు కొడతాయి.

పోనీ సొంతరాష్ట్రం అయితే ఆదిలాబాదు ఎక్కడుందో, ఆమదాలవలస ఎక్కడుందో తెలుస్తుంది. అసలు రెండోదాని స్పెల్లింగ్ చదివేటప్పటికే మతి పోతుంది. ఒకసారి ఓ తెలుగేతరుడు నాకు దాని ఇంగ్లీషు స్పెల్లింగు చూపించి 'దీనిలో ఏడు 'ఏ'లు వున్నాయి. ఏది దీర్ఘంగా పలకాలి? ఏది హ్రస్వంగా పలకాలి?' అని అడిగాడు. నిజమేకదా పాపం అనుకున్నాను. ముఠా మొత్తంలో ఒక్క తెలుగువాడు లేకుండా చేసింది మహాతల్లి. 50 పేజీల మేటర్ యిచ్చి అరగంటలో టైపు చేసి యిమ్మన్న బాస్‌ని టైపిస్టు ఎంత తిట్టుకుంటాడో, యీ ముఠా సభ్యులు కూడా సోనియాను తిట్టుకుంటూ కాస్సేపు కాగితాలు తిరగేసి వచ్చేస్తున్నారు. ఆ కాగితాల్లో కూడా ఒక్కొక్కరు ఒక్కో రకమైన అంకెలు యిచ్చారు. ప్రభుత్వం పంపినదే ఫైనల్ అనుకుందామంటే 'ఇవి సమైక్యవాది కిరణ్ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వం పంపిన అంకెలు, నమ్మకూడదేమో' అని సందేహం. పోనీ రెండేళ్ల క్రితం శ్రీకృష్ణ కమిటీ ఎంతో శ్రమ కోర్చి సేకరించిన అంకెలు చూస్తే ఓ ఐడియా వస్తుంది కదా అనుకుంటే నామోషీ. హోం శాఖ చెత్తబుట్టలో పడేయడానికి ఉద్దేశించిన ఆ నివేదికను, 500 పై చిలుకు పార్లమెంటు సభ్యుల్లో ఎవరూ చదవబోని ఆ నివేదికను, మనం మాత్రం చదవడం ఏమిటి షేమ్ షేమ్ అనుకుంటున్నారు. అందువలన ఎవరేమడిగినా ముఠావాళ్లు 'తెలియదు' అంటున్నారు. ప్రపంచంలో అంతకంటె సులభమైన సమాధానం లేదు. 'తెలుసు' అంటే అనేక ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి వస్తుంది. తెలియదు అంటే యింకేం అడగ్గలరు?

**లీక్స్ అండ్ ఎక్స్‌క్లూజివ్స్..**

ఇలా తెలియనివాళ్లందరూ కలిసి తెలుగువాళ్ల దుంప తెంపడానికి సమకట్టారేమిట్రా బాబూ అని మనం వర్రీ అవుతూంటే తెలుగు మీడియా వారు 'ఎక్స్‌క్లూజివ్'లు గుప్పిస్తున్నారు. హోం శాఖ తయారుచేసిన నివేదిక రహస్యంగా సంపాదించార, ఆంటోనీ నివేదిక దొంగతనంగా సంపాదించాం, రాష్ట్రపరిస్థితిపై గవర్నరు చెప్పినదాన్ని ఆచూకీ తీశాం, విభజనానంతర సమస్యలపై డిజిపి తంత్రాన్ని కూపీ లాగాం, సమైక్యవాదిగా కనబడుతున్న ముఖ్యమంత్రి చాటుగా విభజనకై ఎలా ప్రయత్నిస్తున్నాడో మేం పట్టేశాం, విభజనవాదిగా కనబడుతున్న కెసియార్ ఎన్నికలదాకా విభజన జరక్కుండా ఎలా చూస్తున్నాడో గుట్టు రట్టు చేస్తున్నాం, మా పత్రికకు మాత్రమే యిలా సమాచారచోరకళ వుంది, తక్కినవాళ్లు మా ముందు బలాదూర్ అంటూ ప్రతీ పత్రికా కథనాలు యిచ్చేసి హెడ్‌లైన్స్ పెట్టేస్తోంది. వీటిల్లో ఏది నిజమో, ఏది అబద్ధమో తెలియదు కానీ ఏ నివేదిక చూసినా తెలంగాణవాదులకు ఆనందం చేకూర్చేది అంశం కనబడటం లేదు. అన్నిట్లోనూ హైదరాబాదుపై మడత పేచీలే.

**తెరాసను మక్కికి మక్కి కాపీ కొడుతున్న టి-కాంగ్రెసు**

సమైక్యం అంటూనే విభజన జరిగితే యిలా వుండాలి అని గట్టిగా మాట్లాడుతున్న మజ్లిస్ హైదరాబాదును యుటీగా గాని, కేంద్రం అజమాయిషీలో శాంతిభద్రతలుగానీ, ఉమ్మడి రాజధానిగా గానీ ఒప్పుకోవటమే లేదు. ఆంధ్రకు వర్కింగ్ కాపిటల్‌గా కొన్నాళ్లు వుంటే చాలంటోంది. తెలంగాణావాదుల్లో తీవ్రంగా వున్న తెరాస వారు హైదరాబాదును యుటీ చేస్తే వూరుకోమంటూ ఉమ్మడి రాజధానికి ఓకే కానీ అది కూడా ఐదేళ్లు చాలు అంటున్నారు. ఇక కేంద్ర అజమాయిషీ జాన్తానై, 28 రాష్ట్రాలు అనుభవిస్తున్న హక్కులన్నీ తెలంగాణకు వుండాల్సిందే అంటున్నారు. అ హైదరాబాదు ఉమ్మడి రాజధానిగా పదేళ్లు అని కాంగ్రెసు వర్కింగ్ కమిటీ తీర్మానం చెప్పినా తెలంగాణ కాంగ్రెసువాదులు ఐదేళ్లకు కుదించాలి అంటున్నారు. దామోదర రాజనరసింహ అఖిలపక్షంలో అలాగే చెప్పి వచ్చారు. (అసలు యిది కూడా కాస్త దిగి వచ్చినట్లే, మంత్రుల ముఠాకు టి-కాంగ్రెస్ తరఫున యిచ్చిన నివేదికలో దామోదర తాత్కాలిక రాజధాని మాత్రమే అన్నారు. ఎందుకంటే అప్పుడు తెరాస అలా అంది, యిప్పుడు తెరాస ఐదేళ్ల ఉమ్మడికి సై అంటే వీళ్లూ సైసై అంటున్నారు)

శాంతిభద్రతలు, భూమిపై హక్కులు కూడా వదులుకోమని, హైదరాబాదుపై ఆంక్షలు వుండడానికి వీల్లేదన్న విషయంలో కూడా తెరాస పాటే పాడుతున్నారు. (టి-కాంగ్రెసు యిప్పుడు పూర్తిగా తెరాస బాటే పట్టింది. జాగోభాగో అన్నారటేమిటి అని ముఠావారు కెసియార్‌ను ప్రశ్నించారు కానీ, అదే భాష ఉపయోగించిన టి-కాంగ్రెసు లీడర్లు కొంతమంది గురించి దామోదరను అడగలేదెందుకో)

'కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఫస్ట్‌క్లాసైన తీర్మానం చేసింది. దాన్ని వ్యతిరేకిస్తున్న సీమాంధ్ర కాంగ్రెసు నాయకులు ద్రోహులు, సోనియా మాట మాకు శిరోధార్యం, ఆవిడకు గుడి కట్టిస్తాం' అంటూనే ఆ తీర్మానానికి ఎదురు తిరుగుతున్నారు వీళ్లు. ఎందుకంటే తీర్మానాన్ని మొత్తంగా అంగీకరిస్తే తెలంగాణ ద్రోహులుగా తెరాస చేత ముద్ర వేయించుకోవాల్సి వస్తుందన్న భయం వీరిది. అందువలన తెరాసను మించిన తీవ్రతెలంగాణ వాదన వినిపిస్తున్నారు. అయితే హెూం శాఖ తయారు చేసి ముఠాకు సమర్పించిన 400 పేజీల నివేదిక అంటూ బయటకు వచ్చిన దానిలో పదేళ్లపాటు ఉమ్మడి రాజధాని అనీ, పోలీసు, భూ ఆదాయం, మునిసిపల్, ఉన్నత విద్య బాధ్యతలన్నీ కేంద్రానికే అని వుంది.

**ఆంటోనీ తన నివేదికను ఎక్కడ దాచారు?**

వీళ్లందరూ హైదరాబాదు అంటే ఎంసిఎచ్ పరిధి వరకే అని గట్టిగా వాదిస్తున్నారు. ఆంటోనీ నివేదిక అంటూ బయటకు వచ్చినదానిలో జిఎచ్ఎంసి వరకు ఉమ్మడి రాజధాని అంటూ వుంది. ఈ ఆంటోనీ నివేదిక ఏమిటో బ్రహ్మపదార్థంలా తయారైంది. దిగ్విజయ్ సింగ్‌ను అడిగితే ఆంటోనీగారు నివేదిక యిచ్చారు, కాంగ్రెసు పార్టీ అధ్యక్షురాలు కాబట్టి సోనియా చేతిలో పెట్టారు. ఆవిడ చదివి అవసరమనుకుంటే ముఠాకు యిస్తుంది, లేకపోతే లేదు అని చెప్పారు. అసదుద్దీన్ నేరుగా అడిగితే ఆంటోనీగారు నేను నా నివేదిక ఎవరికీ యివ్వలేదే అన్నారట. జులై 30 ప్రకటన తర్వాత సీమాంధ్రులో ఆందోళన వస్తే 'ఇంకేముంది, ఆంటోనీ కమిటీ వేశాం, అది అన్ని సమస్యలకు జిందా తిలిస్మాత్‌లా పని చేస్తుంది, గోల చేయకుండా మీ గోడు ఆయనకు వినిపించండి' అన్నారు ఢిల్లీ నాయకులు. కాంగ్రెస్ వాళ్లే కాదు, ఎవరైనా వెళ్లి చెప్పుకోవచ్చు అన్నారు. ఎన్‌జిఓలు వెళ్లనంటే వాళ్లను చివాట్లు వేశారు. ఆయన మన రాష్ట్రానికి వచ్చి స్వయంగా గోడు వింటారన్నారు. కొన్నాళ్లు పోయాక 'రారు కానీ దివ్యదృష్టితో అన్నీ గ్రహిస్తారు, మీ సమస్యలన్నిటికీ పరిష్కారం ఆ కమిటీ నివేదికలోనే వుంది' అన్నారు. చివరకు చూస్తే ఆంటోనీ గారు నివేదిక ఎవరికీ యివ్వలేదట. అసలు తయారుచేశారా, హాస్పటల్‌లో పరుపు కింద పెట్టి మర్చిపోయారా? లేక మడిచి రాకెట్‌లా ఆసుపత్రి కిటికీలోంచి బయటకు విసిరేశారా? ఈ విభజన యిస్యూ కాదు కానీ యావన్మంది తెలుగువాళ్లం ఢిల్లీకి లోకువై పోయాం. సొంత రాష్ట్రంలో ఉప్పూ, పత్రీ పుట్టని నేతాశ్రీలు కూడా మనల్ని ఆడుకుంటున్నారు. ఆంటోనీ పెద్దమనిషి అనుకుంటే ఆయనా యిలాగే తయారయ్యాడు.

**హెూం శాఖ నివేదిక చూస్తే విద్యార్థులు, ఉద్యోగులు మొత్తుకుంటారు**

ఆంటోనీ జిఎచ్ఎంసి వరకు హైదరాబాదు అంటేనే టి-వాదులు మండిపడుతూంటే దరిమిలా కేంద్ర హెూం శాఖకు రాష్ట్రప్రభుత్వ అధికారిక నివేదిక బయటకు వచ్చింది. వాళ్లు ఏకంగా ఎచ్ఎండియే దాకా వెళ్లిపోయారు. ఎచ్ఎండియే కనుక పదేళ్ల ఉమ్మడి రాజధానిగా కేంద్రం చేతిలోకి వెళ్లిపోయిందంటే తెలంగాణ ఉద్యమం పూర్తిగా విఫలం కావడమే కాదు, కౌంటర్-ప్రొడక్టివ్ అయినట్టే లెక్కేసుకోవాలి. ఇంకో విషయం కూడా మనం గమనించాలి. అసలు ఉద్యమంలో పెద్ద పాత్ర వహించినది - విద్యార్థులు, ఉద్యోగులు. ఓపెన్ క్యాటగిరీలో గెలుస్తున్న సీమాంధ్రులు రాష్ట్రం విడిచి వెళ్లిపోతే ఆ అవకాశాలు మనకే వచ్చి ఉద్యోగాలు, ప్రమోషన్లు వస్తాయన్న ఆశతో, ఉత్సాహంతో వున్నారు. హెూం శాఖ ముఠాకు యిచ్చిన నివేదిక ప్రకారం చూస్తే ఉమ్మడిగా వుండే పదేళ్లలో తెలంగాణలోని విద్యా సంస్థల్లో అడ్మిషన్ల సమయంలో మొత్తం ఆంధ్రులను కూడా స్థానికులు (ఇన్‌సైడర్స్)గా చూడాలని వుంది. తెలంగాణలోని వైద్యసదుపాయాలన్నీ ఆంధ్రులకు అందుబాటులో వుండాలి. ఇక ఉద్యోగుల విషయానికి వస్తే - ఇక్కడ నుండి వెళ్లిపోమని ఎవర్నీ ఒత్తిడి చేయరాదు. పని చేసే వాళ్లే కాదు, పెన్షనర్లు కూడా. ఇక్కడ వుందామనుకుంటే ఇక్కడే స్థిరపడి యీ రాష్ట్రం నుండే పెన్షన్ తీసుకోవచ్చు. ప్రైవేటు రంగంలో కూడా ఆంధ్రులపై వివక్షత చూపరాదు. ఉద్యోగభద్రత కల్పించాలి. డాక్టర్లు, యాక్టర్లు యిత్యాది ప్రొఫెషనల్స్‌పై ఎలాటి ఒత్తిడీ కలగకుండా వారిని కొనసాగేందుకు రక్షణలు కల్పించాలి. ఆంధ్ర పోలీసులను కూడా యిక్కడ నుండి పంపేయడానికి వీల్లేదు... యిలా సాగింది ఆ నివేదిక!

ఇది చదివితే ప్రత్యేక తెలంగాణ కోరేవారి రక్తం కుతకుత ఉడకదా? ఇంత పోరాడి చివరకు సాధించినది ఏమైనా కనబడుతోందా? ఇదంతా పదేళ్లే వుంటుందో, ఆ పై యింకా కొనసాగుతుందో ఎవరు చూడవచ్చారు? అప్పటి రాజకీయ పరిస్థితులపై ఆధారపడి వుంటుంది. కేంద్రంలో ఆంధ్రులపై ఆధారపడే ప్రభుత్వం ఏర్పడితే తమ విశేషాధికారాలను ఉపయోగించి, గడువు పొడిగించవచ్చు. ఇక రాష్ట్రప్రభుత్వం పంపిన నివేదికలో కూడా శాంతి భద్రతలు, భూ వ్యవహారాలు కేంద్రం చేతిలో అనీ, సీమాంధ్ర ఉద్యోగులకు, పారిశ్రామికవేత్తలకు రక్షణ కల్పించాలనీ, అంటూ రెండేళ్లలో రిటైరయ్యేవారిని మాత్రం హైదరాబాదులో వుంచాలని సూచించింది. స్థానికత నిర్వచించడానికి ప్రాతిపదిక ఏమిటో మీరే చెప్పాలంది. ఈ నివేదిక కిరణ్ రాయించారంటూ టి-వాదులు మండిపడుతున్నారు. ఇదంతా ఎడ్మినిస్ట్రేటివ్ ఛానెల్స్ ద్వారానే సాగుతుంది. కేంద్ర హెూం శాఖే చెప్పి యిలా సిఫార్సు చేయండి అని చెప్పి వుండవచ్చు. ముఖ్యమంత్రి ప్రమేయం వుండనక్కరలేదు. ఓ పక్క సమైక్యం అంటూ విభజన యీ తీరుగా చేయండి అని ఆయన ఎలా చెప్తాడు? ఆయనను పక్కన బెట్టి, బ్యూరాక్రసీ ద్వారా కేంద్రం పనులు చేయిస్తూండవచ్చు.

**అదిగో భద్రాద్రి, ...యిదిగో తన్నుకోండి**

విభజన జరిగితే హైదరాబాదు వివాదాస్పద అంశం అవుతుందని మొదటినుండీ అనుకుంటూన్నదే. కానీ భద్రాచలం కూడా వివాదం అయింది యిప్పుడు. ఒకప్పుడు కెసియార్ భద్రాచలాన్ని కేర్ చేయలేదు. ఆ చేత్తో హైదరాబాదు యివ్వండి, యీ చేత్తో భద్రాచలం తీసుకోండి అని ఆఫర్ యిచ్చారు. దాన్ని ఏ తెలంగాణవాదీ ఖండించలేదు. ఇప్పుడు అందరూ హఠాత్తుగా రామభక్తులై పోయారు. అమ్మో రాములోర్ని వదులుకుంటే ఎలా అంటున్నారు. తలంత్రాల సంప్రదాయం గుర్తు చేస్తున్నారు. ఆ మాటకొస్తే మొత్తం ఆంధ్రప్రదేశ్ నిజాం కింద వుండేది. భద్రాచలం మాత్రమే ఎందుకు, మొత్తం రాష్ట్రాన్నే తెలంగాణగా పరిగణించవచ్చు! జయపాల్ రెడ్డిగారు ఆంధ్రలో చాలామంది దేవుళ్లున్నారు, తెలంగాణకు ఉన్నది ఒక్కడే దేవుడు, భద్రాద్రి రాముడు మేం వదులుకోం అన్నారు. యాదగిరి లక్ష్మీనరసింహస్వామిని, వేములవాడ రాజేశ్వరుణ్ని, ఓరుగల్లు భద్రకాళిని ఎలా మర్చిపోయారో మరి! అలంపురం, బాసర, కాళేశ్వరం – యివన్నీ పుణ్యస్థలాలు కావా వారి దృష్టిలో!? నిజం చెప్పాలంటే తెలంగాణలో శక్తిపూజ, శివారాధన ఎక్కువ. వైష్ణవ దేవాలయాల గురించి చెప్పాలంటే – తెలుగునాట మొత్తం చూసుకుంటే విష్ణువు అవతారాలలో నరసింహస్వామిని ఎక్కువగా పూజించాం. ప్రతీ రెండు జిల్లాలకు ప్రముఖమైన నారసింహక్షేత్రం కనబడుతుంది. ఆ తర్వాత చెప్పుకోవలసినది వేణుగోపాలస్వామి రూపంలో. రాముడి అవతారంలో గుళ్లు భద్రాచలం గుడి తర్వాతే చిన్న స్థాయిలో వచ్చాయి. అందువలన భద్రాద్రి రాముడే తెలంగాణ భక్తికి ప్రతీక అనడం పొసగదు.

ఈనాటి యీ రామభక్తికి కారణం వేరే వుంది. ఆంధ్రలో కట్టబోతున్న పోలవరం ప్రాజెక్టు నిరాటంకంగా సాగాలంటే నిర్వాసితుల సమస్య తీర్చాలి. ఇతర రాష్ట్రాల జోక్యం వుంటే పని సాగదు. ఇప్పటికే ఒడిశా నానా చిక్కులూ పెడుతోంది. ప్రజాభిప్రాయం తీసుకోవాలని కేంద్రం చెప్తోంది. ఆ పని ఒడిశా చేయదు, మన అధికారులు వెళ్లి తీసుకోతే అడ్డుపడుతోంది. పోలవరం కట్టనివ్వకూడదని పట్టుదలతో వున్న తెలంగాణ రేపు మరిన్ని చిక్కులు పెడుతుంది. అందువలన పోలవరం కట్టాలంటే భద్రాచలం ఆంధ్రలో వుండాల్సిందే. ఈ విషయం గ్రహింపుకు వచ్చినకొద్దీ భద్రాచలంపై వివాదం ముదిరింది. భద్రాచలం చేతిలో వుంటే పోలవరం ఆపినట్టే అని తెలంగాణవాదుల అంచనా. పోలవరం ఆగకుండా వుండాలంటే భద్రాచలం చేతిలో వుండాలని ఆంధ్ర ఆరాటం. ఇక రాష్ట్రప్రభుత్వ నివేదిక చూస్తే భద్రాచలం, మునగాల వగైరాలు ఆంధ్రకు యిచ్చేయాలని సూచించింది.

**కేంద్రం వద్ద సమస్యలే వున్నాయి, పరిష్కారాలు లేవు**

ఇలా తెలంగాణ తేనెతుట్ట కదిపిన కొద్దీ సమస్యలు పెరిగిపోతున్నాయి. ప్రతీదీ వివాదమే. విభజనకై సూచిస్తున్న మార్గాలేవీ విభజనవాదులకు ఆమోదయోగ్యంగా లేవు. వాళ్లు ప్రతీ అడుగుకీ అడ్డుపడేట్లు వున్నారు. ఇక కేంద్రం వద్ద కూడా సమస్యలే తప్ప పరిష్కారాలు లేవు. సమైక్యవాదులు సమైక్యం సమైక్యం అంటూ వచ్చినంతకాలం అది ఉన్మాదం అంటూ కొట్టి పారేశారు. వారిలో కొందరు విడిగా వచ్చి పోనీ విభజన చేయండి, కానీ వాటిలో ఫలానాఫలానా సమస్యలున్నాయి వాటిపై మీరేం ఆలోచించారు అని అడిగితే ఇంకా ఏం ఆలోచించలేదు, మీకేమైనా ఆలోచనలుంటే చెప్పండి అంటున్నారు. చెప్తాం కానీ సమాచారం యివ్వండి, దానిపైనే మా ఆలోచన ఆధారపడుతుంది అంటే సమాచారమూ లేదు అంటున్నారు. వివేకం వున్నవాళ్లయితే పరిష్కారాలు వెతకలేక 'సరే వున్నదేదో యిలాగే వుండనీయండి, తర్వాత చూసుకుందాం' అనాలి. కానీ సోనియా తెలంగాణ యిచ్చి తీరాలని ఒంటికాలి మీద నిల్చున్నారు. అందువలన కేంద్రం చేయబోయేదేమిటంటే – కాంగ్రెస్ పార్టీ తీర్మానం లాగానే ఏదీ తేల్చకుండా మూడు ముక్కలతో బిల్లు తయారుచేస్తుంది. తక్కిన విషయాలన్నీ కేంద్రం, అనగా రాబోయే ప్రభుత్వం చూసుకుంటుంది అనేస్తారు. సీమాంధ్ర ప్యాకేజి గురించి కూడా బిల్లులో వుండదట. అది వేరేగా డీల్ చేస్తాం అంటారట.

తెలుగు ప్రజలు సమైక్యవాదులు, విభజనవాదులుగా ఎలాగూ చీలిపోయారు. సీమాంధ్రుల్లో విభజనకు మానసికంగా సిద్ధపడిన నాయకులు సైతం కేంద్రం అవలంబిస్తున్న అస్పష్ట, అవకతవకవిధానాల వలన భయపడుతున్నారు. ఎందుకంటే యీ నివేదికలన్నీ లీకులే తప్ప అధికారికంగా ఏదీ కన్‌ఫమ్ కాలేదు కదా. 'వీటిలో ఏదీ తెలంగాణ బిల్లులో వుండదు కదా. అమలు చేయడానికి మీ ప్రభుత్వం ఎలాగూ వుండదు. కనీసం మాట యివ్వడానికైనా సిద్ధపడకపోతే ఎలా? ప్రజలను ఎలా కన్విన్స్ చేయగలం? తెలంగాణ విడిపోయాక అప్పుడు ప్యాకేజీకి, హైదరాబాదులో రక్షణ వంటి విషయాలకు గండి కొడితే మేం బంగాళాఖాతంలో వురకాలి. లేకపోతే మా ప్రజలే మమ్మల్ని తోస్తారు, అదేదో ముందు తేల్చండి' అని వారు పట్టుబడతారు. తర్వాత చూస్తానంటున్నారుగా, ఏమిటీ సొద అని తెలంగాణవాదులు వారిపై కోపగించుకుంటారు. ఒకరి మీద మరొకరు దుమ్మెత్తి పోసుకుంటారు. తెలుగువాళ్ల మధ్య యీ గొడవలు యిలాగ కొనసాగుతూనే వుంటాయి. రావణకాష్టం రగులుతూనే వుంటుంది. ఈ విభజన సందర్భంగా అనేక పాత విషయాలు బయటకు వచ్చాయి. బళ్లారి పోగొట్టుకున్నామని, కృష్ణగిరి, గంజాం, కోరాపుట్ తెలుగువాళ్లు మనకు దూరమయ్యారని చాలామంది వాపోయారు. వాళ్లంతా మనతో కలిసి వుంటే ఏం చేసేవాళ్లమా అని నాకనిపిస్తోంది. కలిసి కొట్టుకోవడానికి ఇంకో నాలుగు గొంతుకలు చేరేవంతే. పోన్లెండి, వాళ్లనైనా వేరే రాష్ట్రంలో వుండి ప్రశాంతంగా వుండనీయండి. **– ఎమ్బీయస్ ప్రసాద్**

**(నవంబరు 2013)**

**నవంబరు 09-11 వీక్లీకై** **ఎమ్బీయస్ : న్యూస్, వ్యూస్, రివ్యూస్ - 23**

పద్మనాభుని వైభవం ఎంత?

తిరువనంతపురంలోని పద్మనాభస్వామి గుడిలో నేలమాళిగలు తెరిచిన వైనం మనందరికీ తెలుసు. అప్పుడు మన టీవీల్లో గ్రాఫిక్స్ ఎక్కువ, సమాచారం తక్కువ అయిపోయింది. ఆ మాళిగలు తెరవడానికి కోర్టు నియమించిన కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించిన సివి ఆనంద బోస్ అప్పుడేం జరిగిందో యిప్పుడో పత్రికకు చెప్పారు. కమిటీ వేయడానికి నేపథ్యం ఏమిటో ఒక్కసారి గుర్తుకు తెచ్చుకుంటే – ఆ గుడి చాలా శతాబ్దాలుగా వుంది. కానీ 1730లో తిరువాన్కూర్ రాజు మార్తాండవర్మ గుడిని కొత్తగా కట్టించాడు. ఇంకో 20 ఏళ్లకు తన రాజ్యసర్వస్వాన్ని పద్మనాభునికి అంకితం చేసి, ఆయన దాసులగానే తను, తన వారసులు రాజ్యం చేస్తామని ప్రకటించాడు. తన వద్దనున్న బంగారాన్ని, మణిమాణిక్యాలను గుడికి సమర్పించి, వాటిని నేలమాళిగలలో భద్రపరిచాడు. అతని వారసులు కూడా అదే పరంపర కొనసాగించారు. ప్రజలు విరాళాలుగా యిచ్చినవి వీటితో కలపలేదు. స్వాతంత్ర్యం వచ్చాక, రాచరికాలు పోయాయి. గుడి నిర్వహణ రాష్ట్రప్రభుత్వం తీసుకుందామనుకుంది. కానీ రాచకుటుంబం ఒక ట్రస్టు ఏర్పరచి, దాని ద్వారా గుడిని నిర్వహిస్తోంది. పద్మనాభునికి పరమభక్తుడైన టిపి సుందరరాజన్ అనే మాజీ పోలీసు అధికారి యీ ట్రస్టు వ్యవహారం బాగా లేదని, నేలమాళిగలలో దాచిన సొమ్ము ఏమైందోనని భయంగా వుందని, అక్కడున్న వస్తువుల జాబితా రాయించి బహిర్గతం చేయాలని కోరుతూ 2007లో హై కోర్టుకి, ఆ పై సుప్రీం కోర్టుకి వెళ్లాడు.

2011 జనవరిలో కేరళ ప్రభుత్వం గుడి మేనేజ్‌మెంట్ తమకు అప్పగించాలని ట్రస్టును ఆదేశించింది. కానీ దీన్ని ధిక్కరిస్తూ రాచకుటుంబం సుప్రీం కోర్టుకి వెళ్లింది. సుప్రీం కోర్టు ఒక కమిటీని ఏర్పరచి గుడిలోని ఆరు మాళిగలను తెరిచి, వస్తువుల జాబితా తయారుచేసే బాధ్యత అప్పగించింది. అప్పట్లో నేషనల్ మ్యూజియంకు డైరక్టరుగా పనిచేస్తున్న ఆనంద బోస్‌ను కమిటీ చైర్మన్‌గా నియమించింది. ఆ విధంగా జరిగిన విషయాలన్నీ ఆయనకు తెలుసు. ఆరు మాళిగలలో నాల్గిటిని గుడి కార్యకలాపాల్లో భాగంగా తరచుగా తెరుస్తూనే వుంటారు. అవి గ్రానైట్‌తో నిర్మించబడి, బ్యాంకు స్ట్రాంగ్ రూముల్లా దృఢంగా వున్నాయిట. అన్నీ ఒకే సైజులో లేవు. వాటిల్లో కొన్నిటిలో తరచుగా వుపయోగించే విలువైన వస్తువులు వున్నాయి. ఎప్పుడో కానీ వాడని ఆభరణాలున్న మాళిగలు తక్కినవాటి కంటె పటిష్టంగా కట్టారు. విలువైన వస్తువులను చెక్క పెట్టెల్లో పెట్టి వాటిని మాళిగలలో భద్రపరిచారు. ఆ పెట్టెలన్నీ ఒకే సైజులో లేవు. ఆభరణం సైజు బట్టి పెద్దగా, చిన్నగా వున్నాయి. ఈ పెట్టెలు పెట్టాక నేలమాళిగలో అటు యిటు మసలడానికి చాలా తక్కువ చోటు వుంది. ఇవన్నీ గుడి పూజారి కస్టడీలో వున్నాయి.

ఆరు నేలమాళిగలలో రెండిటి విషయమే మిస్టరీగా మిగిలింది. వాటిని ఎ, బిలుగా వ్యవహరించారు. అంతిమంగా ఎ ను తెరిచారు, బిను తెరవలేదు. ఎ మాళిగకు తలుపులు లేవు. భారీ గ్రానైట్ రాళ్లను పేర్చి పెట్టేశారు. ఒక్కో రాయిని దింపాలంటే పదిమంది సాయపట్టాల్సిందే. అందువలన రహస్యంగా జరిగే అవకాశమే లేదు. లోపలకి వెళ్లాక కూడా చీకటిగా వుంది. కాగడాలు వెలిగించి పట్టుకుంటే తప్ప దారి కనబడదు. అపరిచితులెవరైనా అడుగుపెడితే తడబడేట్లా యీ ఏర్పాటు చేశారట. నిజానికి 'ఎ'ను గతంలో తెరిచారని అనిపించింది. ఎప్పుడో మాత్రం తెలియదు. ''అన్ని నేలమాళిగలను గతంలో తెరిచారని, వస్తువుల జాబితా రాసి పెట్టారని చారిత్రక ఆధారాలున్నాయి. కానీ ఆ జాబితాను ఆలయనిర్వాహకులు కమిటీకి అందచేయలేదు." అంటారు ఆనంద బోసు. కొన్ని శతాబ్దాలపాటు అలా మూసేసి వుంచితే ఒక రకమైన వాతావరణం ఏర్పడుతుంది. ఇప్పుడు తెరవడం వలన అది చెదిరింది. వాటిలో వున్న వస్తువులు చెడిపోకుండా వుండడానికి శాస్త్రీయపద్ధతిలో కొన్ని రకాల వాయువులు ఉపయోగించి మైక్రో-క్లయిమేట్ సృష్టించడానికి ఇస్రో, కెల్ట్రాన్ (కేరళ ప్రభుత్వపు ఎలక్ట్రానిక్ కార్పోరేషన్) ముందుకు వచ్చాయి. ఓ పక్క టన్నుల కొద్దీ బంగారం, వజ్రవైఢూర్యాలు, పురాతన విగ్రహాల కేటలాగ్ తయారవుతూండగా యింకో పక్క అవి యీ పని పూర్తి చేశాయి.

ఎ-మాళిగ పని పూర్తి అవుతూండగా బి-మాళిగను తెరుద్దామని కమిటీ నిశ్చయించింది. అప్పుడు గుడిలో అష్టమంగళ దేవప్రశ్నమ్ అనే ప్రక్రియ నిర్వహించారు. పూనకం వచ్చిన పూజారి భగవంతుడి తరఫున మాట్లాడుతూ 'బి-మాళిగ నాలో భాగం, అది తెరవడం నా కిష్టం లేదు, తెరిస్తే తెరిచినవారి కుటుంబాన్ని నాశనం చేస్తా' అన్నాడు. ఆ మాళిగ ద్వారంపై పాము బొమ్మ గీసి వుంది. ఈ మాళిగల గురించి కేసు వేసిన సుందరరాజన్ 2011 జులైలో చనిపోయాడు. వీటి వలన తెరవరాదని భక్తులు ఆందోళన చేశారు. ఏది ఏమైనా దాన్ని కూడా తెరవాలనే కమిటీ నిశ్చయించింది. స్థితిగతులను కోర్టుకి నివేదించి వారి ఆదేశాలను కోరింది. కోర్టు యింకా ఏమీ చెప్పలేదు.

**ఉమ్మడి కుటుంబంలో ఉన్న మజా..**

రాష్ట్రాన్ని విభజిస్తే తప్పేమిటి? అని కొంతకాలం బొత్స సత్యనారాయణ అడుగుతూండేవారు. పెద్ద ఉమ్మడి కుటుంబం నడుపుతూ మీరిలాగ ఆలోచించడమేమిటి? మీరంతా విడిపోతే యిప్పుడున్నంత బలం వుంటుందా? అని విజయనగరం వాసులు ఆయన్ని ప్రశ్నించారు. బొత్స కుటుంబసభ్యులందరూ కలిసి ఓటేస్తే ఓ కౌన్సిలరు గెలవగలడు, లేదా ఓడగలడు. అలాటి కథే ఒకటి మిజోరాంలోని బక్త్వాంగ్ గ్రామంలో ఎదురైంది. ఆ నియోజకవర్గంలో ఎవరైనా గెలవాలంటే జియోనా చనా అనే 69 ఏళ్ల పెద్దమనిషి ఆశీర్వాదం వుండాల్సిందే. ఎందుకంటే ఆయన ఒక పెద్ద ఉమ్మడి కుటుంబాన్ని నడుపుతున్నాడు. ఎంత పెద్దదంటే ఆయన ఒక్కడే కానీ ఆయనకు 39 మంది భార్యలు, 90 మంది పిల్లలు, 45 మంది మనుమలు, మనుమరాళ్లు వున్నారు. కొందరు భార్యల తాలూకు అత్తమామలు కూడా వారితో బాటు వుంటున్నారు. మిజోరాం వంటి చిన్న రాష్ట్రంలోని నియోజకవర్గాలు మన నియోజకవర్గాలంత పెద్దవి కూడా కాదని గుర్తుంచుకుంటే ఆ యింట్లో వున్న 160 ఓట్లతో ఫలితాలు ఎలా తారుమారు చేయవచ్చో మీరే వూహించుకోండి.

చనా తండ్రి కూడా యిలాగే చాలామందిని పెళ్లి చేసుకుంటే కాథలిక్ చర్చివారు అభ్యంతర పెట్టి మాట వినకపోతే అతన్ని వెలివేశారు. అతను బయటకు వచ్చేసి తనకంటూ ఒక మతశాఖను ప్రారంభించి ఓ చర్చి పెట్టాడు. ఇది 70 ఏళ్ల క్రితం మాట. ఆ చర్చిలో యితను పూజారిగా కూడా వ్యవహరిస్తాడు. కానీ అది యితని హాబీ మాత్రమే. ఇతనిది ఫర్నిచర్ బిజినెస్. పొలాలు, కోళ్ల ఫారం, పందుల ఫారం కూడా వున్నాయి. తన ఓట్లతో సాధారణంగా కాంగ్రెసు పార్టీకి మద్దతు యిస్తూ వుంటాడు. స్థానిక ఎమ్మెల్యే యితనితో సత్సంబంధాలు నెరపుతూ వుంటాడు. నిరుద్యోగులకు ప్రభుత్వ పథకం ప్రకటించినపుడు యితను ఆ పథకం ద్వారా తన వూళ్లో అనేకమంది యువతీయువకులకు జీవనోపాధి కల్పించాడు. ఇలాటి మంచితనం వలన అనేకమంది యితని చర్చిలో చేరారు. ప్రస్తుతం 4 వేలమంది అనుయాయులున్నారు. వాళ్లందరికీ అతను ఓ దేవుడిలాటి వాడు. ఇంట్లో కుటుంబసభ్యుల మాట చెప్పనే అక్కర్లేదు. అందరూ అతన్ని ఆరాధిస్తారు.

అతని తొలి వివాహం 17 వ ఏట జరిగింది. వధువు అతని కంటె నాలుగేళ్లు పెద్దది. ఆ తర్వాత అతను వరసపెట్టి పెళ్లిళ్లు చేసుకుంటూనే వున్నాడు. వారిలో కొందరు అతని కంటె పెద్దవాళ్లు కూడా వున్నారు. తాజా భార్య వయసు 33. 13 ఏళ్ల క్రితం చేసుకున్నాడు. ఏడుగురు భార్యలు 30 ఏళ్ల పడిలో వుంటే, పదిహేనుమంది 40 ఏళ్ల పడిలో వున్నారు. వీళ్లందరూ కలిసి నివసించడానికి నూరు గదుల భవంతి వుంది. భార్యలు 5 డార్మిటరీల్లో వుంటారు. ఒక్కోదానిలో ఎనిమిదేసి మంది. ఇతనికి విడిగా ఒక పెద్ద బెడ్‌రూమ్, రోజుకి ఒకర్ని చొప్పున పిలుస్తాడు. రోజుకి 40 కిలోల బియ్యం, 24 కిలోల పప్పు, 50 కిలోల కూరగాయలు, 40 కోళ్లు ఖర్చవుతాయి. ఈ వింతకాపురాన్ని చూడడానికి టూరిస్టులు వస్తూ వుంటారు. మనవాడు దాన్ని కూడా ఆదాయమార్గంగా మార్చుకున్నాడు. వాళ్లకోసం గెస్ట్‌హౌస్ కట్టించి అద్దె వసూలు చేస్తాడు. ఇంటికి వచ్చి చూస్తామంటే టిక్కెట్టు అంటాడు. కుటుంబంతో కలిసి ఫోటో దిగుతానంటే 150 డాలర్ల ఫీజు అంటాడు!

**దాసరికి బొగ్గు మసి..**

దాసరి నారాయణరావు గారు బహుముఖప్రజ్ఞాశాలి. ఆయన అనేక విధాలుగా, అనేక కారణాలతో ఎప్పణ్నుంచో వార్తల్లో వుంటూ వచ్చారు. కానీ ప్రస్తుతం బొగ్గు కుంభకోణం కారణంగా ఆయన పేరుకు బాగా మసి అంటింది. పత్రికల వాళ్లు ఆయన విషయాలన్నీ కూపీ లాగుతున్నారు. పుకార్లకు నిలయమైన తెలుగు సినీరంగానికి వచ్చి అడిగితే వాళ్లు చాలాచాలా విషయాలు చెప్తున్నారు. నిజమెంతో, అబద్ధమెంతో తెలియదు కానీ వాళ్లు చెప్తున్న విషయాలివి – '2004లో అనుకోకుండా మంత్రి అయ్యే సమయానికి దాసరి చాలా ఆర్థికపరమైన కష్టాల్లో మునిగివున్నారు. ఆయన పెట్టుబడి పెట్టిన వ్యాపారాలనేకం దెబ్బతిని వున్నాయి. కొన్ని అప్పులు తీర్చడానికి చెన్నయిలో ప్రసాద్ స్టూడియోస్ ఎదురుగా వున్న తన స్కూలును తమిళనాడు కాంగ్రెసు నాయకుడు వాళప్పాడి రామమూర్తికి 2001లో అమ్మచూపారు. అడ్వాన్సు యిచ్చాక రామమూర్తి చనిపోయారు. డీల్ పూర్తి కాలేదు. అప్పులవాళ్లు దాసరిని హింసిస్తూండేవారు. మంత్రిపదవి వచ్చిన నెల్లాళ్లకే దాసరి తన బాకీదారులందరినీ పిలిచి 3.75 కోట్ల రూ.ల అప్పులు తీర్చేశారు.

'ఇక ఆ తర్వాత దాసరి భారీ సినిమాల డిస్ట్రిబ్యూషన్ హక్కులు తీసుకోసాగారు. "జై చిరంజీవ" సినిమా నైజాం, వైజాగ్ పంపిణీ హక్కులకై రూ.6 కోట్లు చెల్లించారు. సినిమా ఫెయిలయింది. తర్వాత "సైనికుడు", "సూపర్", "బాలు", "దేశముదురు" యిలా 40 పెద్ద సినిమాల హక్కులు ఆయన తీసుకున్నారు. వీటిలో చాలా సినిమాలు అపజయం పాలైనా తన కంపెనీకి లాభాలు వస్తున్నట్లే చూపిస్తూ వచ్చారాయన. 2006లో రాజ్యసభ ఎంపీగా ఎన్నికైన సందర్భంగా తన ఆస్తులను ప్రకటించినపుడు వాటిలో సిరి మీడియా, సౌభాగ్య మీడియాల గురించి ప్రస్తావనే లేదు. కాగా చిన్నచిన్న వస్తువుల విలువ కూడా చూపించారు. ఎయిర్ కూలర్ (విలువ రూ.2736), టైప్ మిషన్ (1938), టేపు రికార్డరు (949), కంప్యూటరు (4015), ఎయిర్ కండిషనర్ (2313). ఆషాడభూతి కథలో పూచికపుల్ల వుదంతం గుర్తుకు వస్తోందా?

దాసరి 2004–08 మధ్య బొగ్గు శాఖలో సహాయమంత్రిగా పనిచేశారు. బొగ్గులో యింత డబ్బు ఎలా వస్తుంది అంటే 'సి' గ్రేడ్ బొగ్గును అతి తక్కువ నాణ్యత కలిగిన 'ఎఫ్' గ్రేడ్ బొగ్గుగా చూపించి గనులను కొన్ని కంపెనీలకు ఎలాట్ చేస్తారు. ఆ కంపెనీలు కృతజ్ఞతాపూర్వకంగా మంత్రి తాలూకు కంపెనీలలో డబ్బు వేస్తారు. జిందాల్ కంపెనీవారికి 2008లో జార?ండ్‌లోని అమరకొండ

మొర్గాదంగల్ కోల్ బ్లాక్‌ను ఎలాట్ చేసినందుకు ప్రతిఫలంగా  ఒక ఏడాదిలోపున జిందాల్ కంపెనీ దాసరి కంపెనీలు సిరి, సౌభాగ్యలలో 2.25 కోట్ల రూ.లు వేశారని సిబిఐ తన చార్జిషీటులో ఆరోపించింది. ఇలాటివి జరగకుండా బొగ్గుగనులను వేలం వేసేట్లా ఆర్డినెన్సు తేవాలని బొగ్గు శాఖ సెక్రటరీ పిసి పరేఖ్ సూచిస్తే దాసరి, అప్పటి న్యాయశాఖ మంత్రి, ప్రస్తుత కర్ణాటక గవర్నర్ ఎచ్.ఆర్.భరద్వాజ్ (ఈయనే మన ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు ఉమ్మడి గవర్నరుగా వస్తారని పుకారు) కలిసి కొట్టి పారేశారు. వింత ఏమిటంటే యిప్పుడు సిబిఐ పరేఖ్‌ను కూడా దోషిగా నిలబెట్టింది. ఇప్పుడాయన దాసరిపై వేలు చూపుతున్నారు.

దాసరి 'నాదేం లేదు, నేను సహాయమంత్రిని మాత్రమే, ప్రధానమంత్రి కార్యాలయం ఏం చెపితే అదే చేశాను' అంటున్నారు. కానీ దాసరి స్వభావం గురించి టివి జర్నలిస్టు శ్రీనివాసన్ జైన్ 'బిజినెస్ ఇండియా'లో వ్యాసం రాస్తూ ఒక విషయాన్ని వెల్లడించారు. 'పరేఖ్ హైదరాబాదు నివాసంలో సిబిఐ సోదా చేసినపుడు 'దాసరికి నీతినియమాలు లేవు, ఆయన ధనదాహానికి మితి లేదు' అని రాసివున్న కాగితం దొరికిందట. అయితే ఆ కాగితంపై ఎవరి సంతకమూ లేదు. దాసరి ప్రస్తుతం ''అసెంబ్లీలో దొంగలుపడ్డారు'' అనే సినిమా తీయబోతున్నారు. ''పార్లమెంటులో..'' అని మార్చి తీస్తే స్వీయానుభవాలు కూడా రంగరించవచ్చు.

**నవంబరు 15** **ఎమ్బీయస్ : 371 డికి నా దగ్గరో చిట్కా**

ఆర్టికల్ 371 డి మీద గత రెండు రోజులుగా ఒకటే చర్చలు. అన్నీ విన్నా, చదివినా ఎటార్నీ జనరల్‌గారు ఏం చెప్పారో ఎవరికైనా బోధపడిందో లేదో నాకు అనుమానమే. 371 డి కారణంగా విభజనకు రాజ్యాంగ సవరణ అవసరం అని ఆయన చెప్పాడని చాలా తెలుగు పత్రికలు, కొన్ని ఇంగ్లీషు పత్రికలు రాశాయి. అబ్బే అవసరం లేదు, విభజించిన తర్వాత ఇక ఆ ఆర్టికల్‌తో పనేముంది అన్నాడని కొన్ని తెలుగు, ఇంగ్లీషు పత్రికలు రాశాయి. ఏది నమ్మాలి?

ఈ 371 డి మీద సమైక్యవాదులు చాలా ఆశలు పెట్టుకున్నారు. ఇందిరా గాంధీ విభజన దారికి అడ్డంగా యీ పేరుతో పెద్ద బండరాయి పెట్టి వెళ్లిందని, దీన్ని తీయనిదే విభజన బండి ముందుకు సాగదనీ, తీయడానికి మూడింట రెండు వంతుల మెజారిటీ ప్లస్ మెజారిటీ రాష్ట్రాల ఒప్పుకోలు కావాలి కాబట్టి, అవి యుపిఏ సాధించలేదు కాబట్టి విభజన ఆగిపోతుందని అంటూ వచ్చారు. 'అబ్బెబ్బే, ఆంధ్రప్రదేశ్ అనే రాష్ట్రం వున్నంత వరకే 371డి, ఒకసారి రాష్ట్రం విడగొట్టాక, అసలు రాష్ట్రమే లేనపుడు యిక 371 డితో పనేముంది' అని విభజనవాదుల వాదన. 'అసలు విడగొట్టాలంటే 371 డి తీయాలి కదా' అంటారు సమైక్యవాదులు. 'అనుమతి లేనిదే లోనికి పోరాదు, లోనికి పోతే తప్ప అనుమతి పత్రం యివ్వరు' అన్నట్టుంది యీ పరిస్థితి. ఇరువైపులా రాజ్యాంగ నిపుణులు వున్నారు, ఎవరికి నచ్చినట్లు వాళ్లకి చెప్తున్నారు. న్యాయశాఖ కూడా రాజ్యాంగసవరణ అవసరమే అందని లీకు వచ్చింది. దీనిపై మంత్రుల ముఠా వారు ఎటార్నీ జనరల్ వాహనవతిని సంప్రదించారని తెలిసింది. అయితే వాహనవతి ఏమన్నారన్నాదానిపై వివిధ రకాల లీకులు వచ్చాయి. 'తెలంగాణ ఆవిర్భావ చరిత్ర' అని రేపు రాయబోయే పుస్తకంలో పుస్తకంలో ఏ పేజీలో చూసినా లీకులు, పుకారులే కనబడతాయి. ఫలానావారు యీ పరిష్కారాన్ని సూచించారు, కానీ ఫలానావారు దాన్ని వ్యతిరేకించారు, అప్పుడు మధ్యేమార్గంగా ఫలానావారు ఒప్పించారు – అని కాదు, సూచించారని లీకు వచ్చింది, వ్యతిరేకించారని పుకార్లు వచ్చాయి, ఒప్పించారని స్క్రోలింగ్‌లు కాస్సేపు వచ్చాయి... యిలాగే రాయాలి. ఈ ఆవిర్భావచరిత్రంతా అయోమయచరిత్రే. ఏది సూటిగా నడవటం లేదు. అంతా దాపరికమే.

వాహనవతిని ఏం అడిగారు, ఆయన ఏం చెప్పారు అన్నదానిపై నేను ''ఈనాడు'' కథనాన్ని నమ్ముతున్నాను. దాని ప్రకారం మంత్రుల ముఠావారు 'ఈ 371 డి అవశేష ఆంధ్రప్రదేశ్‌కు ఆటోమెటిక్‌గా వర్తిస్తుందా?' అని అడిగారు. 'అబ్బే, వర్తించదు, అది మొత్తం రాష్ట్రానికి సంబంధించినది కాబట్టి, సగం ముక్కకు దాన్ని వర్తింపచేయాలంటే మళ్లీ రాజ్యాంగసవరణ చేయాల్సిందే' అని చెప్పారు. కొన్ని పేపర్లలో 'విభజన చేయాలంటే అడ్డు వస్తుందా?' అని అడిగినట్టు వచ్చింది. మన ముఠాకు అలాటి అనుమానాలే రావని నాకు గట్టి నమ్మకం. సోనియా తలచుకున్నాక విభజన జరిగితీరుతుంది. ఆవిడ సునామీలు సృష్టించగలదు, భూకంపాలు ఆపగలదు, వెధవది తెలుగువాళ్లను చీల్చడం ఓ లెక్కా? విభజన ఎలాగూ తథ్యం. తర్వాత ఏమవుతుంది అనేదో వాళ్లు తెలుసుకోదలచారు. వాహనవతిగారు చెప్పారు. దీన్నే నమ్మవచ్చు. ఈ సందేహం వాళ్లకు ఎందుకు వచ్చింది? ఈ ఆంధ్రప్రదేశ్ అనే పేరు మిగల్చడం వలన వచ్చింది. 371 డి, ఆంధ్రప్రదేశ్ అనేవి రెండూ పెనవేసుకుని పోయాయి కాబట్టి, అవశేష రాష్ట్రం పేరు ఆంధ్రప్రదేశ్ కాబట్టి 371 డి ఆటోమెటిక్‌గా అమలవుతుందా? అని ఉత్తినే, సరదాకి అడిగారు.

అసలు తెలంగాణ చీల్చగా మిగిలిన దానికి అవశేష ఆంధ్రప్రదేశ్ అనే యీ పేరెందుకు? ఆంధ్ర అంటే పోయే కదా! 1953–56 మధ్య ఆంధ్ర రాష్ట్రం అనే పేరే వుండేది. ఇప్పుడు అదే తయారవుతోంది. డీ–మెర్జర్ అయినపుడు మళ్లీ అదే పేరు పెట్టవచ్చుగా. 1956లో రాష్ట్రం ఏర్పడినపుడు పేరేం పెట్టాలి అన్న సందేహం వచ్చింది. విశాలాంధ్ర పేరుతోనే అప్పటిదాకా ఉద్యమాలు జరిగాయి. కమ్యూనిస్టులు కాస్త ముందుకు వెళ్లి 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' అనే నినాదం ఎత్తుకున్నారు. విశాలాంధ్ర పేరుతో పేపరు పెట్టారు. రాష్ట్రానికి ఆ పేరు పెడితే కమ్యూనిస్టులు గుర్తు వస్తారన్న భయంతో బెజవాడ గోపాలరెడ్డిగారు ఆంధ్రప్రదేశ్ పేరు సూచించారు. ఇది హిందీ పేరులా వుంది అని తెలుగు నాయకులు అభ్యంతర పెట్టినా, ఉత్తరాది నాయకులకు యిది నచ్చింది – మధ్యప్రదేశ్, ఉ

త్తరప్రదేశ్ తరహాలోనే యిది కూడా వుంది కదాని. ఉమ్మడి రాష్ట్రానికి పేరు పెట్టడానికి డ్రాఫ్టు బిల్లులో 'ఆంధ్ర-తెలంగాణ' అనే పేరు వుందని, సీమాంధ్ర నాయకులు తెలంగాణ పేరును ఎగ్గొట్టించేశారని అన్న ఆరోపణలు యీ మధ్యే వచ్చాయి. గతంలో ఎన్నడూ వినలేదు. దీనిలో వాస్తవాలు నాకు తెలియవు. అదే ఒరవడి అయితే మరాట్వాడా బొంబాయిలో కలిసింది కాబట్టి దానికి 'బొంబాయి-మరాట్వాడా' రాష్ట్రం అని పేరు పెట్టాలనే సూచన కూడా వచ్చిందా? ఉద్యమసమయంలో అనేక అవాస్తవాలు పుట్టించారు. వాటిల్లో యిది కూడా ఒకటేమో నాకు తెలియదు. ఎవరో ఒకాయన పుస్తకంలో రాశారు అంటారు. పుస్తకంలో రాసినంత మాత్రాన గాస్పెల్ ట్రూత్ అయిపోదు. దాని గురించి ఎక్కడో అక్కడ చర్చ జరగాలి. హైదరాబాదు అసెంబ్లీలో కాని, ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవించాక అసెంబ్లీలో కాని 'పేరులో తెలంగాణ చేర్చాలని' ఎవరో ఒకరు అడిగి వుండాలి. 'ఆంధ్ర' పదం తెలుగువారందరికీ వర్తిస్తుందనే అభిప్రాయంలో వున్నారు కాబట్టి, తెలంగాణలో విముక్తి పోరాటం ఆంధ్ర మహాసభ పేరుతో జరిగింది కాబట్టి 'ఆంధ్రప్రదేశ్' అనే పదం మనది కాదు అని తెలంగాణ వారెవరూ అనుకోలేదు. ఇవన్నీ యిటీవలి అపోహలే, కల్పనలే.

సరే యింతకీ యిప్పుడు రాష్ట్రాన్ని చీల్చాక తెలంగాణ అన్నారు. సబబే, యిక మిగిలినదానికి అవశేష లేదా సశేష ఆంధ్రప్రదేశ్ అనే పేరెందుకు? అలా పేరు పెట్టడం వలనే కదా, యీ ఆర్టికల్ 371 డి గురించి యిలాటి సందేహం వచ్చింది! రాష్ట్రం చీల్చి అవతల పారేస్తే తర్వాత వాళ్లు జోనల్ సిస్టమ్ పెట్టుకుంటారో, పెట్టుకోరో కేంద్రానికి ఎందుకు? విడిపోయాక ఏం తింటామా, ఎలా బతుకుతామా అని సీమాంధ్రులు ఏడుస్తూ వుంటే వాళ్ల ఉద్యోగులకు 371 డి వుంటుందా లేదా అన్న చింత మంత్రుల ముఠాకు ఎందుకో నాకర్థం కాదు. తీర్చవలసిన సమస్యలు అనేకం వున్నాయి. చూపవలసిన పరిష్కార మార్గాలు అనేకం వున్నాయి. వేటిమీదా వాళ్ల దగ్గర పరిష్కారం లేదు, అసలు సమాచారమే లేదు. బుర్రలు ఖాళీగా పెట్టుకున్నాం, మీకు తోచినది మీరు పోసి పోవచ్చు అని యితర పార్టీల వాళ్లను పిలిచారు. వాళ్లు వెళ్లి యింత గడ్డి పెట్టి వచ్చారు. ముఠావాళ్లు చేతులెత్తేసి, మా వంతుగా మేం చీల్చేస్తాం, దానివలన వచ్చే సమస్యలపై నిర్ణయం తర్వాతి రోజుల్లో కేంద్రమే చూసుకుంటుంది అని తప్పుకోబోతున్నారు. అలాటప్పుడు విడిపోయాక ఆంధ్ర రాష్ట్రం ఉద్యోగులకు రిజర్వేషన్లు వుంటాయా లేదా అని వాళ్లు వర్రీ అవుతున్నారని, దానికోసం ఎటార్నీ జనరల్‌ను సంప్రదించారని అంటే నాకేమిటో నమ్మకంగా లేదు. తిరుక్షౌరం చేసి వదిలిపెట్టిన తర్వాత అవతలివాడు గుండుకు చందనం రాసుకుంటాడా, కొబ్బరినూనె రాసుకుంటాడా అన్నదాని గురించి మంగలి వర్రీ అవుతాడా!? అబ్బే. ఏదో ఎటార్నీ జనరల్‌ను 371 డి గురించి అడిగినట్టు నాటకం ఆడి ఒకదాని బదులు మరొకటి అడిగి పంపించేసి వుంటారు. విభజనకు అడ్డు వస్తుందా అని అడిగితే సోనియమ్మకు కోపం వస్తుందని లోలోపల ముఠావారికి గుబులుగానే వుండి వుంటుంది.

371 డి సంగతి తేల్చాలి. ఏజిని అడక్కూడదు. ఎలా? నా దగ్గర ఒక ఉపాయం వుంది. ఆర్టికల్ 3లో ఏదైనా రాష్ట్రం పేరు మార్చే హక్కు కూడా కేంద్రానికి వుంది కదా. ఎంచక్కా ఆంధ్రప్రదేశ్ పేరు 'లిటిల్ ఇటలీ' అనో మరేదో మార్చేయాలి. అప్పుడు విభజించడానికి సమకట్టాలి. ఎవరైనా వచ్చి 'ఆంధ్రప్రదేశ్‌కోసమే తయారుచేసిన 371డి ని రాజ్యాంగసవరణ ద్వారా మార్చకుండా రాష్ట్రాన్ని ఎలా చీలుస్తారు?' అని అడిగితే 'అసలు ఆ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎక్కడికి పోయిందో మాకు తెలియటం లేదు సార్, వుంటే దాన్ని ఏదో ఒకటి చేద్దుం. ఇదిగో యీ లిటిలిటలీ ఒక్కటే వుంది. దాన్ని సరదాగా చీల్చేద్దాం' అనవచ్చు. ఆంధ్రప్రదేశ్ అనే పేరే లేనపుడు 371 డిలో ప్రస్తావించిన ఆంధ్రప్రదేశ్ కానీ, అవశేష ఆంధ్రప్రదేశ్ కానీ సోదిలోకే రావు. ఇక అడ్డేముంది, అడ్డగోలుగా నరకడానికి! - **ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2013)**

**నవంబరు 16-17 వీక్లీకై** **ఎమ్బీయస్ : ఆంధ్రుల్ని నరికాం - ఇక అడవుల్ని నరుకుదాం**

సీమాంధ్రులకు కొత్త రాజధాని గురించి రాష్ట్రప్రభుత్వం పంపిన నివేదిక అంటూ ఒకటి పేపర్లలో వచ్చింది. రాజధానికోసం లక్ష ఎకరాలు కావాలని, ప్రయివేటు వ్యక్తుల నుండి కొనబోతే కొరివి అయి, కోట్లు ఖర్చవుతాయి కాబట్టి అంతకంటె ప్రభుత్వ భూమిగా వున్న అటవీభూమిని తీసుకోవడం మేలని సలహా యిచ్చారట. రాజధాని అనగానే విజయవాడ, గుంటూరు మధ్య పెడతారనడం, అబ్బే అక్కడ ప్రభుత్వ స్థలం లేదు, నాగార్జున యూనివర్శిటీ స్థలం సరిపోదు అనడం జరుగుతూనే వుంది. మరి ప్రభుత్వస్థలం ఎక్కడుంది అంటే వాన్‌పిక్ కోసం సేకరించిన వేలాది ఎకరాలు ప్రకాశం జిల్లాలో వున్నాయి కాబట్టి అక్కడే పెడతారు అంటూ వచ్చారు. కోస్తా, సీమలకు మధ్యలో వుంది కాబట్టి, ప్రకాశం జిల్లాలోని కొన్ని తాలూకాలు గతంలో గుంటూరు, నెల్లూరునుండి తెచ్చుకున్నవే కాబట్టి యిరుప్రాంతాల వాళ్లూ రాజధాని తమదే అనుకోవడానికి అవకాశం వుంది. సీమ, కోస్తాల వారిద్దరికీ ఆమోదయోగ్యమైన రాజధాని అదే - అనే ఉద్దేశం ఎల్లెడలా వుంది.

వాన్‌పిక్ భూములను అలాగే వుంచి, యిప్పుడు అటవీ భూములంటున్నారు. వాన్‌పిక్ ఐడియా మంచిదే. పోర్టులను, హింటర్ ల్యాండ్‌ను కలపడం అత్యవసరం. కోస్టల్ కారిడార్‌కై సేకరించిన భూమిని యితరత్రా వాడేస్తే ఎలా? ఆ ప్రకారం చూస్తే అటవీ భూములను సాగు చేసి వాడదామనడం సమంజసమే. ఇప్పటికే యిన్‌ఫ్రాస్ట్రక్చర్ వున్న ప్రదేశాల కంటె వర్జిన్ ల్యాండ్‌ను తీసుకుని దాన్ని మనకు అనువుగా మలచుకోవడం తెలివైన పని. అలా చేసినా మూడోవంతు అడవులు మిగులుతాయని వీరు హామీ యిస్తున్నారు. కొత్త నగరం కట్టేటప్పుడు దాని విస్తరణను ముందుగానే వూహించి, చండీగఢ్ మోడల్లో సెక్టార్లుగా కట్టుకుంటే, రోడ్లు మెలికలు

తిరక్కుండా తిన్నగా ప్లాన్ చేస్తే అంతకంటె ఏం కావాలి? ప్రస్తుతం నగరాల్లో ట్రాఫిక్ రద్దీ తట్టుకోవడానికి కొన్ని ప్రధాన రహదారులను ఒన్-వే గా చేసి వాహనాలను చక్కర్లు కొట్టిస్తున్నారు. పెట్రోలు వృథా, సమయం వృథా, శక్తి వృథా. నగర శివార్లలో వుండే చాలా పల్లెటూళ్లల్లో టౌను ప్లానింగ్ వుండదు. రోడ్లు 25 అడుగుల వెడల్పు కంటె వుండవు. రోడ్డుకి అడ్డంగా ఎవడో యిల్లు కట్టుకుంటాడు. దాన్ని తీసేసి యింకో రోడ్డుతో కలుపుదామన్నా, రోడ్డు వెడల్పు చేద్దామన్నా వాళ్లు కోర్టుకి వెళ్లి ఆపేస్తారు. అందువలన అడవుల్లో నగరనిర్మాణం చేస్తే యిబ్బంది వుండదు. ఏ చెట్టుని కొట్టేసినా అది కోర్టుకి వెళ్లదు. పర్యావరణవేత్తలు కాస్త హంగామా చేస్తారంతే.

చంద్రబాబుగారు హైవేల విస్తరణ భారీ ఎత్తున చేపట్టి వ్యాపారాభివృద్ధికి దోహదపడ్డారు. కానీ ఆ క్రమంలో రహదారులపై వున్న వందల ఏళ్ల నాటి చెట్లను నిర్దాక్షిణ్యంగా కొట్టించేశారు. ఆ చెట్లను రోడ్డు మధ్యలో అలాగే వుంచి అటూ యిటూ రోడ్డు వేస్తే ఏం పోతుందని అనిపించేది. మరి సాంకేతికంగా ఏం యిబ్బందులున్నాయో ఏమో, కొట్టి పడేశారు. ఇప్పుడు హైవేల మీద మధ్యాహ్నం వెళుతూ వుంటే ఎండ పేల్చేస్తుంది. రోడ్డు మీద ఎండమావుల్లా ఏవేవో యిమేజెస్ కనబడుతూంటాయి. కొట్టేసిన చెట్లకు బదులుగా చెట్లు ఎక్కడైనా వేయించారో నాకు తెలియదు. మొక్కలు నాటారో, నీరు పోశారో లేదో తెలియదు. అలాటప్పుడు యిప్పుడు రాజధాని కోసం కొట్టేయబోయే చెట్లకు బదులుగా వేరే చోట నాటుతారంటే నమ్మకం కుదరదు. ఊళ్లల్లో వేస్తే అడ్డు వస్తాయనుకుంటే, తిరుపతి కొండల మీదనైనా వేయవచ్చు. తిరుమల కొండలను గ్రీన్‌గా చేసేస్తామని ఎప్పణ్నుంచో చెప్తున్నారు. వృక్షో రక్షతి రక్షితః అని బోర్డులు రాసి పెడతారు. కానీ యిన్నేళ్లగా చూస్తున్నాను, తిరుమలలో హరితతత్వం పెరిగింది తప్ప హరితతత్వం పెరగలేదు. ఈ అటవీప్రాంతం కూడా ప్రకాశం జిల్లాలోను, గోదావరి ప్రాంతంలోను వుందంటున్నారు. ప్రకాశం జిల్లా తీరప్రాంతం కదా, ఈ అడవులు కొట్టేస్తే తుపానుల తాకిడికి తట్టుకోవడం మరింత కష్టమవుతుందా? పర్యావరణవేత్తలు చెప్పాలి. ఏది ఏమైనా జనావాసాలను రాజధానిగా మార్చడం కంటె నిర్జన బంజరు భూములనో, అరణ్యాలనో అనువుగా మలచుకోవడం తెలివైన మార్గం. లిటిగేషన్ తగ్గి, పని త్వరగా జరుగుతుంది. అయితే కొట్టేసిన చెట్లకు రెట్టింపు నాటితే తప్ప నిధులు విడుదల చేయమని కేంద్రం షరతు పెట్టాలి.

అయితే ముఖ్యమైన ప్రశ్న ఏమిటంటే – రాజధానికి లక్ష ఎకరాలు ఎందుకు? అని. హైదరాబాదుతో పోటీపడాలంటే, ఎచ్ఎమ్‌డిఏ పరిధంత వుండాలి కాబట్టి లక్ష ఎకరాల అంచనాకు వచ్చేశారట. అసలు హైదరాబాదుతో పోటీపడడం దేనికి? కనబడ్డవన్నీ హైదరాబాదులో పెట్టేకదా, యింత ముప్పు వచ్చింది, యిప్పటికైనా బుద్ధి రాలేదా? హైదరాబాదు ఒకప్పుడు సుందరనగరం. టౌనులో వుండే సౌకర్యాలు, సిటీలో వుండే సౌలభ్యాలు రెండూ కలగలిపి, కాస్ట్ ఆఫ్ లివింగ్ కూడా తక్కువగా వుండి, చక్కటి వాతావరణంతో ఆహ్లాదకరంగా వుండేది. మరి ఇప్పుడు? ఎక్కడికి వెళ్లాలన్నా రానుపోను నాలుగు గంటలు పడుతుంది. చెట్లన్నీ మాయమయ్యి, పార్కులు, చెరువులు కబ్జా అయిపోయి వేడి పెరిగిపోయింది. కూరలు దొరకడం మానేశాయి. ఖర్చు కూడా విపరీతంగా పెరిగింది. గతుకుల రోడ్లు, శబ్దకాలుష్యం, ట్రాఫిక్ జామ్‌లు... వూరంటేనే విసుగు పుడుతోంది. మళ్లీ యింకోటి తయారు చేస్తారంటే బాబోయ్ అనిపిస్తోంది. రాష్ట్రం మొత్తానికి అన్ని అవకాశాలు హైదరాబాదులో పెట్టడం చేతనే నగరజనాభా రోజురోజుకి పెరుగుతూ పోతోంది. హైదరాబాదుని యుటీ చేసేసి, స్థానికులకే ఉద్యోగాలిస్తాం అని రూలు పెడితే, సీమాంధ్ర, తెలంగాణ రాష్ట్రాల వాళ్లు భోరున విలపించాలి.

సీమాంధ్రకు రాజధాని విషయంలో మళ్లీ అదే తప్పు చేయకూడదు. మాటవరసకి ప్రకాశం జిల్లాలో రాజధాని పెట్టి అక్కడే విపరీతంగా అభివృద్ధి చేశారనుకోండి. అన్ని జిల్లాల వాళ్లూ అవకాశాలకై అక్కడికే వచ్చి వాలతారు. వాళ్లలో ప్రతిభావంతులు ఉద్యోగాలు చేజిక్కించుకుంటారు. ఇంకో ఇరవై ఏళ్లకి ప్రకాశం జిల్లా వాళ్లు –యిప్పటి తెలంగాణ వాళ్లలాగా– గొడవ మొదలెడతారు. ఎక్కడెక్కడి వాళ్లో యిక్కడికి వచ్చి మా అవకాశాలు తన్నుకుపోతున్నారు. మా నోట్లో మట్టికొడుతున్నారు. మా రాష్ట్రం మాకు విడిగా కావాలి అని. ఇదేదో అభూతకల్పనలా వుందనకండి. తిరుమల తిరుపతి దేవస్థానానికి వెళ్లి చూడండి. చిత్తూరు జిల్లా ఉద్యోగులు ఎందరున్నారో తెలుస్తుంది. ఆ జిల్లా వాళ్లకు వెంకటేశ్వరస్వామి వాళ్ల పెరటిదేవుడని గొప్ప నమ్మకం. వాళ్లకు తప్ప ఆ దేవస్థానంలో ఎవరికీ ఉద్యోగాలు వుండకూడదన్న పట్టుదల. టిటిడి అడ్మినిస్ట్రేటర్లందరూ స్టాఫ్‌లో చిత్తూరు, నాన్-చిత్తూరు గొడవలతో వేగాల్సిందే. అక్కడ సిక్స్ పాయింటు ఫార్ములా, జోనల్ సిస్టమ్, 610 జీవో యిలాటివి ఏవీ అక్కరలేదు. వాళ్లు చెప్పినదే వేదం, అంతే. రేపు రాజధాని ఒకచోట కట్టాక ఆ జిల్లావాళ్లూ యిలా పేచీ పెట్టరన్న నమ్మకం ఏమిటి? అసలు రాజధాని అక్కడ పెట్టకపోతే స్థానికులకు ఆ పాటి ఉద్యోగాలుకూడా వచ్చేవి కావు కదా! కానీ ఆ సంగతి వాళ్లు ఆలోచించరు. అన్ని జిల్లాల వాళ్లూ పెట్టుబడి పెట్టారు కాబట్టే హైదరాబాదు యింత విస్తరించింది. ఇక్కడ భూములున్నవాళ్ల స్వప్రయోజకత్వం ఏమీ లేకుండా, వాళ్లు చిటికెనవేలు కూడా కదపనక్కరలేకుండా ఒకప్పుడు పశుగ్రాసం కోసం జమీందారులు యినాంగా యిచ్చిన భూములకు కోట్ల రూపాయల ధర పలికింది. అందుకు వారు సంతోషించారా? లేదే! మా పిల్లలకు ఉద్యోగాలు రాలేదు, మెరిట్‌లో వేరే వాళ్లు తెచ్చేసుకుంటున్నారు అని బాధపడిపోయారు. ఆందోళన జరిగింది. రాష్ట్రం విడిపోతోంది.

ఇలాటి అవస్థ మళ్లీ రాకుండా వుండాలంటే సీమాంధ్రలోనైనా పెద్ద రాజధాని కట్టకూడదు. మొత్తం ప్రాంతాన్ని అయిదారు జోన్లగా విడగొట్టుకుని, ఒక జోనులో మంచి విద్యాలయాలు, మరొక జోనులో మంచి ఆసుపత్రులు, మరొక జోనులో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, మరొక జోనులో జలాధారిత పరిశ్రమలు.. యిలా ఏర్పరచుకుంటూ పోవాలి. ఒక తరహావన్నీ ఒకే చోట ఎందుకు, వాటిని కూడా విడగొట్టవచ్చు కదా అని మీరు అడగవచ్చు. కానీ గమనిస్తే ఒక చోట ఫోకస్ చేస్తేనే అక్కడ ఆ పరిశ్రమ

అభివృద్ధి చెందుతుంది. హోల్‌సేల్ బట్టల మార్కెట్‌కి వెళితే బట్టలషాపులన్నీ అక్కడే పెడతారు. తోలు పరిశ్రమకు కాన్పూరు, వజ్రాల మార్కెటుకు సూరత్, ఐటీకి బెంగుళూరు, బంగారానికి ప్రొద్దుటూరు.. అన్నట్టు క్లస్టర్స్‌గా ఏర్పాటు చేస్తేనే అభివృద్ధి చేయడం సులభం. సినిమా పరిశ్రమ మద్రాసులో పాతుకుపోయింది. హైదరాబాదు వచ్చి యిన్నాళ్లయినా మ్యూజిక్ విభాగంలో యింకా కొరత వుంది. ఆంధ్రరాష్ట్రం ఏర్పడ్డాక చిత్రపరిశ్రమను ప్రోత్సహించడానికి రాజధాని అనే పేరుతో ఒంగోలులో స్టూడియో కట్టమంటే ఎవరూ కట్టకపోవచ్చు. ఔట్‌డోర్ షూటింగుకు కూడా అనువుగా వుండే రాజమండ్రి, లేదా వైజాగ్ వంటివి సినిమావాళ్లకు అనువుగా వుంటాయి. అక్కడ వాళ్లకు తగిన విధంగా ఎయిర్‌పోర్టు సౌకర్యం, రవాణా సౌకర్యం వగైరాలు కల్పించాలి.

ఇలా కాకుండా అన్నీ ఒకే చోట కడదామనే తెలివితక్కువ ఆలోచన చేసినా లక్ష ఎకరాలు మరీ టూమచ్. హైదరాబాదు అంటే 23 జిల్లాలకు రాజధాని. ఆంధ్ర రాజధాని కేవలం 13 జిల్లాల రాజధాని. దానికి యింత షోకెందుకు? మంత్రుల క్వార్టర్లుగా ఖరీదైన విల్లాలు ప్లాను చేస్తున్నారేమో. అంత అక్కరలేదు. పెద్ద రాష్ట్రమైన పశ్చిమ బెంగాల్ మంత్రులు ఫ్లాట్లలో వుంటారు. ఆంధ్ర రాష్ట్ర మంత్రులు కూడా కావాలంటే 4-బెడ్ ఫ్లాట్స్‌లో వుండమనండి. అలాటి యిరవై ఫ్లాట్లతో ఒక కాంప్లెక్సు కడితే అందరికీ కలిపి సెక్యూరిటీ యిస్తే బోల్డు మంది పోలీసులు మిగులుతారు. విభజన తర్వాత నక్సలిజం పెరుగుతుందంటున్నారు కదా, ఇలా మిగిల్చిన పోలీసులను అటు పంపండి. అంతేకాదు, అన్ని రకాల ఆఫీసులూ రాజధానిలోనే వుండనక్కరలేదు. ప్రస్తుతం సముద్రతీరంలో ఆపరేట్ చేసే కార్పోరేషన్‌ల ఆఫీసులు కూడా హైదరాబాదులోనే పెడుతున్నారు. ఇకపై అలా మానేసి, ఆఫీసులను కూడా చెల్లాచెదురు చేసేస్తే ఉద్యోగులు ఒకే చోట పోగుపడడం వుండదు. ప్రస్తుతం నగరీకరణ కారణంగా పల్లెలు పాడుపడిపోతున్నాయి. వాటిని ప్రభుత్వం వారు పట్టించుకోవడం మానేశారు. కార్యాలయాల వికేంద్రీకరణ జరిపి పట్టణాలకు తరలిస్తే వాటిని ఆనుకుని వున్న గ్రామాలలో మళ్లీ జనాభా కనబడుతుంది. కొంతమంది వుద్యోగులు స్వగ్రామాల్లో నివసిస్తూ పట్టణాలకు అప్ అండ్ డౌన్ చేస్తారు.

ఇది నిజంగా జరిగితే సీమాంధ్ర తెలంగాణ కంటె బాగుపడుతుంది అనడంలో సందేహం లేదు. ఎందుకంటే తెలంగాణలో హైదరాబాదు తప్పిస్తే తక్కిన ప్రాంతాలలో ఆఫీసులు లేవు. జిల్లాల ప్రజలంతా హైదరాబాదు వాసానికి అలవాటు పడి జిల్లా కేంద్రాలకు వెళ్లడం లేదు. వికేంద్రీకరణ జరుపుతున్నాం, మీరు వెనక్కి జిల్లాలకు వెళ్లిపోవాలి అంటే ప్రతిఘటన వస్తుంది కూడా. ఇలాటివి కొత్త రాష్ట్రంలో అమలు జరిగినట్టుగా పాతరాష్ట్రంలో చేయడం కష్టం. ఖాళీపలక మీద రాయడం సులభం. ఇప్పటికే రాసేసినదాన్ని చెరపాలంటే కష్టం. అందువలన గొడవలు రాకుండా వున్నదున్నట్టుగా నడపడానికే ఎక్కువ ఆస్కారం వుంది. దృఢసంకల్పం వుంటేనే, ఆటుపోటులు తట్టుకోగల శక్తి వుంటేనే యిలాటి కసరత్తు సాధ్యం. ఆ శక్తి తెలంగాణ నాయకుల్లోనే కాదు, ఆంధ్ర నాయకుల్లోనే అరుదు. అందుకని మనం ఎంత మొత్తుకున్నా అన్నీ కలిపి ఒకే చోట పెడతాం అనుకుంటూ అడవులు తెగ నరికినా ఆశ్చర్యపడనక్కరలేదు. **- ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2013)**

**నవంబరు 18-19 వీక్లీకై** **ఎమ్బీయస్ : విభజిస్తే దళితులకు అధికారమా?**

రాష్ట్రవిభజన జరిగితే దళితులకు అధికారం దక్కుతుందని, రెండు చోట్లా దళితులు ముఖ్యమంత్రులుగా వచ్చేస్తారనీ చాలాకాలంగా ప్రచారం జరుగుతోంది. కత్తి పద్మారావుగారి వంటి మేధావులు, దళితనాయకులు, తెలంగాణ ఉద్యమకారులు దీని గురించి అనేకసార్లు చెపుతున్నారు. సమైక్యవుద్యమంలో కూడా కొన్ని దళితసంఘాలనాయకులు కలవకుండా 'విడిపోవడమే మాకు కావాలి' అనే స్టాండ్ తీసుకున్నారు. కిరణ్ సమైక్యత గురించి మాట్లాడుతూంటే ఆయనను వ్యతిరేకించడానికి, అడ్డుకోవడానికి అధిష్టానం దళిత నాయకులను ఉపయోగించుకుంటోంది. రేపు అసెంబ్లీలో టి-బిల్లు గురించి చర్చ జరిగినపుడు అన్ని ప్రాంతాల దళితనాయకులు విభజనను సమర్థించేట్లా కాంగ్రెసు ప్రణాళిక రచిస్తోందని ప్రచారం జరుగుతోంది. విభజన జరిగితే నిజంగా దళితులు అధికారంలోకి వచ్చేస్తారా?

**కులం బట్టి అధికారం వచ్చేయదు**

ఎవరికైనా అధికారం కావాలంటే ఏం చేయాలి? ప్రజల మద్దతు కూడగట్టుకోవాలి. వాళ్లను ఆకర్షించడానికి పాట్లు పడాలి. ఎన్నికలలో నానా వాగ్దానాలు చేయాలి. నెగ్గాక పార్టీ అధినాయకత్వం కళ్లల్లో పడాలి. గాడ్‌ఫాదర్‌ను సంపాదించుకోవాలి. ప్రత్యర్థులను పడగొట్టాలి. పదవిలోకి వచ్చాక దాన్ని నిలబెట్టుకోవడానికి మిత్రులను కలుపుకోవాలి, శత్రువులను నిర్జించాలి. ప్రజల ఆదరణ సంపాదించాలి. ఇవేమీ చేయకుండా కేవలం పుట్టుక వలన అధికారం వచ్చేయదు. వైయస్ ముఖ్యమంత్రి అయ్యారంటే 'ఈయన క్రైస్తవుడు కదా, యిప్పటిదాకా యీ రాష్ట్రానికి క్రైస్తవ ముఖ్యమంత్రి లేడు పాపం' అంటూ చేసేయలేదు. ఇప్పుడు జగన్ ఎంత పోరాటం చేస్తున్నాడో చూస్తున్నాం. ఉద్యోగంలో కూడా ఫలానా కులంలో పుట్టావా, రా వచ్చి కుర్చీలో కూర్చో అనరు.

కొన్ని వర్గాలకు రిజర్వేషన్ యిచ్చినా మళ్లీ దానిలో కూడా పోటీ వుంటుంది. వారిలో ప్రతిభ వున్నవాడికే దక్కుతుంది. విభజిస్తే ఏరియా ఆఫ్ ఆపరేషన్ చిన్నదవుతుంది, అంతే. దానిలో దళితుల జనాభా సగటు కంటె ఎక్కువగా వుంటే అప్పుడు దళితులకు ఛాన్సు ఎక్కువ. ఈశాన్య రాష్ట్రాల్లో పర్వతప్రాంతం కాబట్టి షెడ్యూల్డ్ ట్రైబ్ వాళ్లు చాలామంది వుంటారు. వారిలో ఎవరో ఒకరు ముఖ్యమంత్రి

కావచ్చు. అక్కడ ఎస్‌టి ముఖ్యమంత్రిగా వచ్చాడు కదాని యిక్కడ ఎస్‌సి ముఖ్యమంత్రిగా వస్తాడని ఎలా అనగలం? ఈ విభజన చేసేటప్పుడు ఎస్‌సి జనాభా ఎక్కువగా వున్న ప్రాంతాలన్నీ ఒక రాష్ట్రంగా ఏర్పరిస్తే అలాటి పరిస్థితి వచ్చేదేమో! ఇక్కడ ప్రాంతాలవారీ విభజన జరుగుతోంది. దీనివలన రెండు రాష్ట్రాల్లోని దళితుల సంఖ్య ఎప్పటి నిష్పత్తిలోనే వుండబోతోంది.

**సత్తా వుంటే పెద్ద రాష్ట్రమూ ఏలవచ్చు**

చిన్న రాష్ట్రం అయినంత మాత్రాన దళితుడు ముఖ్యమంత్రి అవుతాడని ఎలా వాదిస్తారో నాకు అర్థం కాదు. అయ్యే సత్తా వుంటే పెద్ద రాష్ట్రానికైనా అవుతారు. మాయావతి ఉత్తరప్రదేశ్ వంటి సువిశాల రాష్ట్రానికి ముఖ్యమంత్రి కాలేదా? మన రాష్ట్రానికి దామోదరం సంజీవయ్య కాలేదా? సంజీవయ్య ఎక్కువకాలం పాలించలేకపోయారు అంటే దానికి కారణం – ఆయన దళితుడు కావడం కాదు, రాజకీయంగా లైట్ వెయిట్ కావడం. పివి నరసింహారావు బ్రాహ్మడు అయినా, రోశయ్య వైశ్యుడు అయినా వాళ్లకూ అదే గతి కదా. రాజకీయంగా నేర్పు వుంటేనే ఎక్కువకాలం వుంటారు. అదే రెడ్డో, కమ్మో అయితే ఎక్కువకాలం పాలించేసేవారు అనడానికీ లేదు. భవనం వెంకట్రామరెడ్డి ముఖ్యమంత్రిగా చేసినట్టుగా కూడా ఎవరూ గుర్తుంచుకోలేనంత తక్కువ కాలం చేశారు. అంజయ్యని అందరూ బిసి అనుకునేవారు, 'కాదు రెడ్డిని' అని చెప్పుకున్నాడు పదవిలోకి రాగానే. కానీ ఆయన ఎంతకాలం పాలించాడు కనుక? ఎన్టీయార్ కమ్మ. రెండోసారి అధికారంలోకి రాగానే రాజకీయ చతురత లేక ఏడాది కూడా పాలించలేకపోయారు. బాబు కమ్మ. ఎన్టీయార్‌ను దింపి, అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు పాలించారు. వెంగళరావు వెలమ. చాలాకాలమే పాలించారు. పదవిలోకి రావడం, నిలదొక్కుకోవడం – యిదంతా వ్యక్తుల చాకచక్యం బట్టి వుంటుంది తప్ప కులం బట్టి వుండదని అర్థమవుతోంది.

దళితులకు దీపస్తంభం లాటివాడు జగ్‌జీవన్ రామ్. దశాబ్దాలపాటు కేంద్రంలో అనేక ముఖ్యమైన పదవులు అలంకరించారు. ఉపప్రధాని కూడా అయ్యారు. మరి ఆయన సొంత రాష్ట్రమైన బిహార్‌లో ఒక్క దళిత ముఖ్యమంత్రీ లేడు. దీనికి ఏమంటారు? దళితుల్లో వుండే చీలికల వలన కూడా కొన్ని అవకాశాలు మిస్సవుతారు. మన రాష్ట్రంలో సిఎంగా కోస్తా నుండి కిరణ్‌ను ఎంపిక చేశాక ఉపముఖ్యమంత్రి పదవి తెలంగాణ వ్యక్తికి యిద్దామని అధిష్టానం అనుకుంది. కానీ ఎవరికి యివ్వాలి? మాలకా? మాదిగకా? గీతారెడ్డికా? దామోదర రాజనరసింహకా? అనే మీమాంసలో పడి చివరకు ఏడు నెలలు లేటుగా పదవి యిచ్చారు. మన దగ్గర మాదిగ రిజర్వేషన్ పోరాటం మాలలకు వ్యతిరేకంగా సాగుతోంది కాబట్టి సమస్య మరింత జటిలం అవుతోంది. ఎవరికి యివ్వబోయినా అవతలివాళ్లను కూడా ఏదో విధంగా సంతృప్తి పరిస్తే తప్ప యివ్వలేని పరిస్థితి.

**విడిపోతే ఏ రాష్ట్రంలో దళిత సిఎం వస్తారు చెప్పండి**

ఇలాటి పరిస్థితుల్లో దళితులకు ఆటోమెటిక్‌గా పదవి దక్కుతుందని ఎలా అనగలరు? ఇప్పుడు జనవరి 1 కల్లా రాష్ట్రం విడిపోయిందనుకోండి. కిరణ్ దిగిపోయారనుకోండి. ఆంధ్రకు కాపు నాయకుడు సిఎం అంటున్నారు, తెలంగాణలో జయపాల్ రెడ్డి, జానా రెడ్డి, డి శ్రీనివాస్.. యిలాటి పేర్లు వినబడుతున్నాయి తప్ప దామోదర పేరు వినబడుతోందా? డిప్యూటీ సిఎంగా వున్నారు కాబట్టి ఆటోమెటిక్‌గా ఆయనే ఫస్ట్ కాండిడేట్ అనుకోవాలి. కానీ అలా అనుకోవటం లేదు. ఎందువలన? ఆయన పెర్‌ఫామెన్సు గొప్పగా వున్నట్టు రిపోర్టులు ఏమీ లేవు. రాజకీయంగా మద్దతు వున్నట్టూ లేదు. ఇటీవల ముఖ్యమంత్రిని రన్‌డౌన్ చేయడానికి తెలంగాణవాదులు ఆయనను ఉపయోగించు కుంటున్నారు తప్ప మొదటినుండీ జానారెడ్డియే ప్రధాన పాత్ర వహిస్తూ వచ్చారు. కేంద్రం నుండి ముసుగువీరుడుగా వుంటూ వచ్చిన జయపాల్ రెడ్డి యిప్పుడు ముసుగు తీసి బయటకు వచ్చారు కాబట్టి, ఆయనకూ ఛాన్సుంది అంటున్నారు. పూర్తి రాష్ట్రానికి ఉపముఖ్యమంత్రిగా పని చేసిన దళితుడు సగం రాష్ట్రానికి కూడా ముఖ్యమంత్రి కాకుండా పోతే, యిక కొత్త రాష్ట్రంలో దళితుడు సిఎం అవుతాడని ఎలా అనుకుంటాం?

కెసియార్ ఎప్పణ్నుంచో చెప్తూన్నారు – తెలంగాణలో తెరాస అధికారంలోకి వస్తే దళితుడు సిఎం అనీ, ముస్లిం డిప్యూటీ సిఎం అనీ. చెప్పడమే తప్ప తన పార్టీలో దళితుల నెవరినీ పైకి రానివ్వలేదని అందరూ ఎత్తి చూపుతున్నారు. ఒక్క జిల్లా యిన్‌చార్జి కూడా దళితుడు లేడట. కడియం శ్రీహరి చేరారు కాబట్టి ఆయన వాళ్ల తరఫున సిఎం కాండిడేటు అవుతారు అని జోస్యం చెపితే అందరూ నాకు పిచ్చెక్కిందనుకుంటారు. ఎన్నికయిన ఎమ్మెల్యేలలో మెజారిటీ అభిప్రాయం ప్రకారం మా అబ్బాయే సిఎం అని రేపు కెసియార్ అంటే ఏం చేయగలం? ఎన్నికయ్యే వాళ్లలో ఎంతమంది దళితులు వుంటారు? వారికోసం రిజర్వ్ చేసిన సీట్లలో కూడా వేరే చోట కూడా దళితులకు యిచ్చినపుడు కదా, వాళ్లు మెజారిటీలో వుండేది! టిక్కెట్టు యిచ్చేటప్పుడు విన్నబిలిటీ చూస్తారు. మహిళల విషయంలోను అదే జరుగుతోంది. నెగ్గే అవకాశాలు లేవు కాబట్టి టిక్కెట్టు యివ్వలేదు అంటారు. సామాజిక న్యాయం అంటూ ప్రజారాజ్యం పార్టీ బిసిలకు చాలా చోట్ల టిక్కెట్టు యిస్తే ఏం జరిగింది? నెగ్గలేదు. ఇవన్నీ చూస్తూ కూడా రాష్ట్రం చిన్నదై పోగానే దళితులను నెగ్గించేస్తారని ఎలా అనుకుంటారో నాకు తెలియదు.

**ఇటీవల విభజించిన రాష్ట్రాలలో ఏం జరిగింది?**

యుపి నుండి ఉత్తరాఖండ్ విడగొట్టారు. దళితుడు సిఎం అయ్యాడా? అగ్రవర్ణస్తులే కదా అయినది. మధ్యప్రదేశ్ విడగొట్టి ఛత్తీస్‌గఢ్ ఏర్పరచారు. షెడ్యూల్డ్ ట్రైబ్‌కు చెందిన అజిత్ జోగిని సిఎం చేసి కూర్చోబెట్టారు. మూడేళ్ల తర్వాత 2003 ఎన్నికలలో ఆయన ఓడిపోయాడు. బిజెపికి చెందిన రమణ్ సింగ్ (దళితుడు కాదు) నెగ్గి పదేళ్లగా పాలిస్తున్నాడు. ఇక జార?ండ్ – అది ట్రైబల్స్ అధికసంఖ్యలో వున్న రాష్ట్రమే. దళితుడు సిఎం అయినా అధికారంలో నిలదొక్కుకో లేకపోతున్నాడు. 13 ఏళ్లలో 9 మంది ముఖ్యమంత్రులు, మూడుసార్లు రాష్ట్రపతి పాలన! అంటే దళితుడు అధికారం చేయలేక పోతున్నాడన్నమాట! చిన్న రాష్ట్రాలైన పంజాబ్, హరియాణా, గోవా, త్రిపుర, సిక్కిం.. వేటిల్లో దళితుడు ముఖ్యమంత్రిగా వున్నాడు?

దళితనాయకులకు ఈ ప్రశ్నలు సంధిస్తే వాళ్లు ఆంబేడ్కర్‌ని వల్లిస్తారు. చిన్న రాష్ట్రాలుంటే దళితులకు అధికారం వస్తుందని ఆయన చెప్పాడంటారు. ఆయన నిస్సందేహంగా మేధావి. అయితే భవిష్యత్తు ఎలా వుంటుందో చెప్పగలిగే జ్యోతిష్కుడు కాడు. అప్పటికాలాన్ని ద ృష్టిలో పెట్టుకుని ఆయన కొన్ని సిద్ధాంతాలు చెప్పారు. కాలానుగుణంగా వచ్చే మార్పులు ఆ సిద్ధాంతాలను పూర్వపక్షం చేసిన సందర్భాలూ వున్నాయి. కార్ల్ మార్క్స్ విషయంలోనూ అది జరిగింది. సాంకేతిక విప్లవం వచ్చిన యూరోప్‌లో శ్రామిక విప్లవం వస్తుందని ఆయన వూహించాడు. అక్కడ రాలేదు. రాచరికపు రష్యాలో వచ్చింది. మార్క్స్ బతికి వుంటే తన సిద్ధాంతాలను సవరించుకుంటూ ఆయన పుస్తకాలు రాసి వుండేవాడు. గతితార్కిక భౌతికవాదమే అది. కానీ మార్క్సిస్టులు మార్పుకి ఒప్పుకోరు. అవే సిద్ధాంతాలను వల్లె వేస్తూ వుంటారు.

**ఆంబేడ్కర్ చెప్పినవన్నీ జరిగాయా?**

ఆంబేడ్కర్ విషయంలోనూ అదే జరుగుతోంది. ఆయన మరణించి 57 ఏళ్లు అయింది. ఈలోగా సమాజం ఎన్నో మార్పులకు గురైంది. దళితుల సామాజిక స్థితిగతుల్లో, రాజకీయ అవగాహనలో మార్పు వచ్చింది. అదే సమయంలో వాళ్లను అదుపు చేసే శక్తులు కూడా కొత్త ఎత్తులు వేస్తున్నాయి. ఇవన్నీ పరిగణనలోకి తీసుకోకుండా 60 ఏళ్ల క్రితం ఆయన అలా చెప్పారు కాబట్టి యిప్పుడు అదే జరుగుతుంది అని వాదించడం పొరబాటు. ఆంబేడ్కర్ భారతవిభజనను సమర్థించారని అందరికీ తెలుసు. దానికి గల కారణం ఏమిటో విశ్లేషిస్తూ సోషలిస్టు నాయకుడు, మేధావి మధు లిమయే ''ద ఇలస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా''లో 1984 జూన్‌లో ఒక పెద్ద వ్యాసం రాశారు. దానిలోని కొన్ని ముఖ్యమైన భాగాలు యిక్కడ ఉటంకిస్తున్నాను –

'పాకిస్తాన్–భారత విభజన' అనే పుస్తకంలో ఆంబేడ్కర్ బ్రిటిషువారు మొత్తం భారతదేశాన్ని తమకు అప్పగించి వెళతారని హిందువులు అనుకోకూడదని హెచ్చరించారు. బ్రిటిషువారు వెళ్లిపోయాక ప్రజాస్వామ్యం వస్తుందని, ప్రజాస్వామ్యం అంటే అత్యధికప్రజల అభిమతమే అనీ, హిందువులు అధికసంఖ్యలో వున్నారు కాబట్టి కేంద్రప్రభుత్వంలో బ్రిటిషువారి స్థానంలో హిందువులు వుండి, తాము అధికంగా వున్న రాష్ట్రాలపై పెత్తనం చలాయిస్తారనీ ముస్లిములు భయపడుతున్నారు కాబట్టి విభజన అనివార్యమని ఆంబేడ్కర్ వాదించారు. అంతమాత్రం చేత ముస్లిము ఛాందసవాదాన్ని ఆంబేడ్కర్ సమర్థించారని అనుకోకూడదు. హిందూఅగ్రవర్ణస్తుల పెత్తనాన్ని ఎలా ఖండించారో దాన్నీ అలాగే నిరసించారు. పాకిస్తాన్ ఏర్పడ్డాక ఇరాన్, ఇరాక్, అరేబియా, టర్కీ, ఈజిప్టు అన్నీ కలిసి మహా ఇస్లామిక్ రాజ్యాన్ని ఏర్పరుస్తాయని ప్రతి ముసల్మాను దానివలన ఉత్తేజితుడవుతాడని ఆంబేడ్కర్ భవిష్యవాణి చెప్పారు. కానీ అలా జరగలేదు. ముస్లిము రాజ్యాలు సైతం తమలో తాము కలహించుకున్నాయి.

**ముస్లిములు వెళ్లిపోతేనే షెడ్యూలు కులాలకు లాభం**

'హిందూస్తాన్ నుండి ముస్లిములు విడిగా వెళ్లాలని ఆయన ఎందుకు కోరుకున్నారు? ఆంబేడ్కర్ జీవితలక్ష్యం – షెడ్యూల్ కులాల అభ్యున్నతి. రాష్ట్రాలకు హక్కులు యిస్తే అవి షెడ్యూలు కులాల వారిని అణచివేస్తాయని ఆయన భయం. అందుకే బలమైన కేంద్రం వుండాలని, రాజ్యాంగంలోనే రక్షణలు కల్పిస్తే ద్వారా షెడ్యూలు కులాలు క్షేమంగా వుంటాయని ఆయన అభిప్రాయం. ముస్లిములు దానికి అభ్యంతరపెడతారని ఆయన భయపడ్డాడు. లక్నో ఒప్పందం ద్వారా ఫెడరల్ లెజిస్లేచర్‌లో ముస్లిములకు 33% వాటా దక్కింది. యుద్ధసమయంలో బ్రిటిషు ప్రభుత్వం జిన్నాకు అపరిమిత అధికారాలు కట్టబెట్టింది. హిందువులతో సమానసంఖ్యలో తమకు సెంట్రల్ కాబినెట్‌లో ప్రాతినిథ్యం వుండాలని జిన్నా, ముస్లింలీగ్ వాదించారు. కాంగ్రెసుకు సన్నిహితంగా వున్న జమాయిత్ ఉలేమా ఎ హింద్ విభజనను వ్యతిరేకిస్తూనే హిందువులకు, ముస్లిములకు సమానప్రాతినిథ్యం వుండాలని డిమాండ్ చేసింది. లేకపోతే ముస్లింలలో తమకు మద్దతు తగ్గిపోతుందని ఆ పార్టీ భయం.

'విభజన నుండి తప్పించుకోవడానికి ముస్లింలతో రాజీ కుదుర్చుకోవాలసిన అగత్యం కాంగ్రెసు నాయకులకుంది. ఆ పరిస్థితుల్లో వాళ్లు ముస్లింలకు సగం వాటా యిచ్చి తక్కినవాటిల్లోనే హిందువులలోని అన్ని కులాల వారికీ సర్దవలసి వస్తుంది. అదే జరిగితే వాళు

ల అగ్రవర్ణాల వారికందరినీ సంతృప్తి పరచిన తర్వాతే షెడ్యూల్ కులాల వారి వద్దకు వస్తారు. షెడ్యూల కులాల వారికి దక్కేది అడుగూబొడుగే. ఇదే ఆంబేడ్కర్‌ను బాధించింది. ఆయన తన పుస్తకంలో యిలా రాశారు – ''అస్పృశ్యుల హక్కులను, అవసరాలను కాపాడడం కంటె ఎక్కువగా ముస్లిముల హక్కులను, అవసరాలను కాపాడడానికి కాంగ్రెసు నాయకత్వం శ్రమించలేదా? అస్పృశ్యులకు ఎలాటి రాజకీయ వెసులుబాటు కల్పించడానికి యిష్టపడని గాంధీ ముస్లిములకు బ్లాంక్ చెక్కు యివ్వడానికి సిద్ధపడలేదా? అస్పృశ్యులతో, శూద్రులతో అధికారం పంచుకోవడాని కంటె ముస్లిములతో అధికారం పంచుకోవడానికి కాంగ్రెసు ఉవ్విళ్లూరుతోంది.'' ఈ కారణం చేతనే పాకిస్తాన్ ఏర్పడి ముస్లిములు వెళ్లిపోతే, కాంగ్రెసు షెడ్యూల్ కులాల వారికి న్యాయం చేస్తుందని ఆంబేడ్కర్ ఆశించారు.' – ఇదీ మధు లిమయే వ్యాససారాంశం.

**ఆచరణలో ఏం జరిగింది?**

ఆంబేడ్కర్ ఊహలు ఎంతవరకు నెరవేరాయో చూదాం. పాకిస్తాన్ ఏర్పడింది. ముస్లింలందరూ భారత్ విడిచి వెళ్లలేదు. ముస్లింలను బుజ్జగించే కార్యక్రమం యింకా కొనసాగుతూనే వుంది. కాంగ్రెసు షెడ్యూల్ కులాల వారికి రిజర్వేషన్లు యిచ్చింది. రిజర్వేషన్ల కాలపరిమితి పొడిగిస్తూ పోతోంది. అందరూ వారి గురించి మాట్లాడేవారే కానీ వాటి ఫలాలు ఆ కులాలకు పూర్తిగా అందలేదు. కొందరు దళితులు పదవులు అధిష్టించినా ఏ ఒక్క రాష్ట్రంలోనూ దళితుల స్థితి అద్భుతంగా వున్నట్టు చెప్పలేం. ఆంబేడ్కర్ విగ్రహాలు వెలుస్తున్నాయి కానీ ఆయన స్థాపించిన రిపబ్లికన్ పార్టీ పుంజుకోలేదు సరికదా 50 ముక్కలుగా చీలిపోయింది. ఆయన సొంత రాష్ట్రంలో తప్ప వేరెక్కడా కనబడటం లేదు. ఆంబేడ్కర్ ఆశయాలతో అంటూ బహుజన సమాజ పార్టీ ఏర్పడింది. ఒకసారి బిసిలతో, మరొకసారి బ్రాహ్మణులతో పొత్తు పెట్టుకుని అధికారంలోకి వస్తోంది, పోగొట్టుకుంటోంది. వ్యక్తి ఆరాధనతోనే ఆ పార్టీ నడుస్తోంది తప్ప ప్రజాస్వామ్యబద్ధంగా కాదు. ఇతర కులాల రాజకీయనాయకులకు, దళిత నాయకులకు తేడా లేకుండా వుంది.

ఆయన దళితులకై ఏర్పరచిన నియో–బుద్ధిజం ఎవర్నీ ఆకర్షించలేకపోయింది. కొందరు దళితులు హిందువులుగానే కొనసాగుతూండగా మరి కొందరు క్రైస్తవం పుచ్చుకున్నారు. దళితులందరూ కలిసి యితరులను ఎదిరించడం మాట ఎలా వున్నా వారిలో వారే కలహించుకుని వర్గాలుగా విడిపోతున్నారు. అధికారం అందిపుచ్చుకున్న దళితులకు తక్కిన దళితులకు సాయపడుతున్న ఉదాహరణలు అతి తక్కువ. అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడంలో వారు అగ్రవర్ణస్తులతో సమాన స్థాయిలో వున్నారు.

అందువలన చిన్న రాష్ట్రాలు ఏర్పడితే దళితులు పాలకులవుతారని ఆంబేడ్కర్ అప్పుడు అనుకుంటే అనుకోవచ్చు కానీ యిప్పటి పరిస్థితులు చూసి వుంటే మరో రకమైన అభిప్రాయం వెలిబుచ్చేవారు. వేర్పడితే అధికారం రాదు, పోరాడితేనే వస్తుంది. దళితులకైనా సరే, మరొకరికైనా సరే యీ సూత్రం వర్తిస్తుంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2013)**

**నవంబరు 20–21 వీక్లీకై** **ఎమ్బీయస్ : న్యూస్, వ్యూస్, రివ్యూస్ – 24**

**కుతుబ్ మీనార్‌తో పంతం**

సాధారణంగా తాజ్‌మహల్‌తో పోలిక వస్తూ వుంటుంది. నీ పట్ల నా ప్రేమ నిరూపించుకోవడానికి తాజ్‌మహల్‌ను మించిన కట్టడం కట్టి చూపిస్తా, – నన్ను చక్రవర్తిని చేస్తే...! అంటాడు ప్రేమికుడు. కానీ ఛత్తీస్‌గఢ్‌లోని సత్నామీ కులస్తులు మాత్రం కుతుబ్ మీనార్ కంటె ఎత్తయిన స్తంభం కావాలని పంతం పడుతున్నారు. సత్నామీలు దళితులలో ఒక వర్గం. వారి ఆధ్యాత్మిక గురువు గురు ఘాసీదాస్ మరణించి చాలాకాలమైంది. ఆయన పేర మఠాలు వెలిశాయి. వాళ్ల ఆరాధనకు గుర్తుగా జైత్‌ఖంభ్ (జయస్తంభం) కట్టడం ఆనవాయితీ. అలాటి స్తంభాలు సత్నామీలు బహుళంగా వున్న ప్రాంతాల్లో అనేకం కనబడతాయి. 2000 సంఎరంలో మధ్యప్రదేశ్‌నుండి విడివడిన ఛత్తీస్‌గఢ్‌కు ముఖ్యమంత్రిగా పని చేసిన అమిత్ జోగి సత్నామీ. ఈ గురువు అనుయాయి. ''మన ఘనత చాటేందుకు నేను ప్రభుత్వ ఖర్చుతో గిరోద్‌పురిలో కుతుబ్ మీనార్ కంటె రెట్టింపు ఎత్తున్న జైత్‌ఖంభ్‌ను కడతాను. ఛత్తీస్‌గఢ్‌లో ఎక్కణ్నుంచి చూసినా అది కనబడేట్లా చేస్తాను.'' అని అజిత్ 2002లో ప్రకటించాడు. అయితే 2003 అసెంబ్లీ ఎన్నికలలో అతను ఓడిపోయి బిజెపి అధికారంలోకి రావడంతో ఆ ప్రాజెక్టు మూలపడింది.

రాష్ట్రంలోని షెడ్యూల్ కులాలలో 80% వున్న సత్నామీల ఓట్లు కావాలంటే యీ జైత్‌ఖంభ్ కట్టాల్సిందే అనుకున్న బిజెపి ప్రభుత్వం 2008 ఎన్నికలకు ఏడాది ముందు దీని నిర్మాణం చేపట్టింది. 20 అంతస్తులతో 2012కి పూర్తయింది. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు వచ్చాయి. ''అన్నప్రకారం కట్టాం కదా, మాకు ఓట్లేయండి'' అంటున్నారు బిజెపి వారు. కానీ సత్నామీలు సంతోషంగా లేరు. ''అజిత్ కుతుబ్ మీనార్‌కు రెట్టింపు ఎత్తు స్తంభం కడతానన్నాడు. ఇది దాని కంటె కాస్త ఎత్తుందంతే. అది 72.5 మీటర్లయితే, యిది 77 మీటర్ల ఎత్తు.'' అని ఫిర్యాదు చేస్తున్నారు. ఇప్పటికే తడిసి మోపెడైందని బిజెపి ముఖ్యమంత్రి రమణ్ సింగ్ బాధ. దీనికి బజెట్ వేసుకున్నది 15 కోట్లు. చివరకు చూస్తే మూడున్నర రెట్లయింది. అసెంబ్లీలో దీని గురించి పెద్ద గొడవైంది. అవినీతి జరిగిందని,

నిర్మాణ నాణ్యత బాగా లేదని అనేక ఆరోపణలు వచ్చాయి. 77 మీటర్లకే యింత గొడవైతే ఇక 145 మీటర్లయితే ఎంత గొడవయ్యేదో వూహించండి.

మధ్యప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంలో షెడ్యూల్ కులాల జనాభా ప్రకారం వారికి 16% రిజర్వేషన్ వుండేది. రాష్ట్రం విడిపోయాక జనాభా నిష్పత్తి ప్రకారం అది 12%కి తగ్గించేశారు. అబ్బే అలా ఒప్పుకోం, మాకు 16% వుండాల్సిందే అని సత్నామీలు ఆందోళన చేస్తున్నారు. (ఆంధ్ర, తెలంగాణ విడిపోయాక దళితుల రిజర్వేషన్లలో మార్పులు వస్తాయేమో చూడాలి). రాజ్యాంగం ప్రకారమే యీ నిష్పత్తి వుంటుంది కాబట్టి ఎవరూ ఏమీ చేయలేరు. కానీ సత్నామీలు అదేమీ వినడం లేదు. "మాకు 16% రిజర్వేషన్ యిచ్చేదాకా యీ టవర్‌ను ప్రారంభించడానికి ఒప్పుకోం." అంటున్నారు. అందువలన ఏడాది క్రితమే అది పూర్తయినా యిప్పటిదాకా ప్రారంభోత్సవం కాలేదు. 51 కోట్ల పెట్టుబడి వృథాయే. వీళ్ల అసంతృప్తిని సొమ్ము చేసుకోవడానికి అజిత్ జోగి ఎన్నికల ప్రచారంలో తిరుగుతూ "ఇది సత్నామీల ఆత్మగౌరవానికి సంబంధించిన విషయం. మా కాంగ్రెసును గెలిపిస్తే ఎత్తు పెంచుతాం, రిజర్వేషన్ కోటా పెంచుతాం" అని వాగ్దానాలు చేస్తున్నాడు. (ఫోటో – 51 కోట్ల రూ.లతో కట్టిన గిరోద్‌పురి జైత్ ఖంభ్)

### మీ ప్రచారానికి నా సినిమా ఎందుకు?

ఇటీవల సినిమాలలో, టీవీల్లో పొగతాగే, లేదా మద్యం తాగే సన్నివేశాలు రాగానే అవి ఆరోగ్యానికి హానికరం అనే ప్రకటన తెరమీద కనబడుతూ వుంటుంది. ప్రభుత్వం విధించిన నియమం అది. "నేను యీ నియమాన్ని ఖాతరు చేయను" అంటున్నాడు హిందీ సినిమా దర్శకుడు అనురాగ్ కాశ్యప్. విడుదలకు సిద్ధంగా వున్న తన "అగ్లీ" అనే సినిమాలో అలాటి వేమీ పెట్టనని చెప్తున్నాడు. " ఆ సినిమాలో కథ ఏమిటంటే పట్టపగలు ఒక పిల్లవాడు కిడ్నాప్ అవుతాడు. పరిశోధన ప్రారంభమవుతుంది. రోజురోజుకి దానిలో అనేక మలుపులు బయటపడతాయి. సమాజంలో అనేకవర్గాల వికృతరూపాన్ని బయటపెడుతూ కథ సాగుతుంది. అలాటి సస్పెన్సు సినిమాలో పట్టున్న దృశ్యం నడుస్తూండగా మధ్యలో యిలాటి ఆరోగ్య సందేశాలు తెరమీద కనబడితే ప్రేక్షకుడు కథలో లీనం కాలేడని అతని వాదన.

"నేను సినిమా తీసేది వినోదానికి. ఇలాటి సందేశాలు యివ్వడానికి కాదు. అయినా అనారోగ్యకరమైన వస్తువులైన సిగరెట్టు, మద్యం అమ్మకాలపై పన్నులు వేసి ఆదాయం గడిస్తున్న ప్రభుత్వం యిలాటి ప్రచారానికి డబ్బు ఖర్చు పెట్టాలి. నేను సినిమా తీస్తే దానిలో సందేశం పెట్టాలని పట్టుబట్టడం, పెట్టకపోతే చట్టవ్యతిరేకం అనడం అన్యాయం." అని వాదిస్తున్నాడు అనురాగ్. నిజమే కదూ! ప్రభుత్వానికి చిత్తశుద్ధి వుంటే వాటి అమ్మకాలు ఆపేయించాలి.

### దిగ్విజయ్ పేరు చెపితే ఓటర్లు హడల్

మధ్యప్రదేశ్ ఎన్నికలలో కాంగ్రెసు వ్యతిరేక ప్రచారానికి కేంద్ర బిందువుగా దిగ్విజయ్ నిలిచారు. బిజెపి సమర్థకులు యింటర్నెట్‌పై వేసే జోకులన్నీ దిగ్విజయ్ పైనే. "ఇది చాలా అన్యాయం. దిగ్విజయ్ కారణంగానే బిజెపి గత 10 సంవత్సరాలుగా యీ రాష్ట్రంలో అధికారంలో వుంది. వాళ్లు కృతజ్ఞతలు చెప్పడం పోయి యిలా చేయడం దుర్మార్గం." అని చమత్కరించాడు దిగ్విజయ్ అంటే పడని ఓ కాంగ్రెసు నాయకుడు.

దిగ్విజయ్ గురువైన అర్జున్ సింగ్ రాజకీయక్రీడలు ఆడి ఫైనల్‌గా దెబ్బ తిన్నాడు. అతని హయాంలో జరిగిన చూర్‌హట్ ల్యాటరీ స్కామ్‌పై హై కోర్టు అతనికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడంతో కాంగ్రెసు హై కమాండ్ 1989 జనవరిలో అతన్ని దిగిపోయి మాధవరావు సింధియాకు పగ్గాలు అప్పగించమని ఆదేశించింది. తన శిష్యుడైన దిగ్విజయ్‌ను కూర్చోబెడతానని యితను మొండికేశాడు. దానికి ఒప్పుకోని అధిష్టానం మోతీలాల్ వోరాను పంపించింది. తన మిత్రులైన ఫోతేదార్, బూటా సింగ్, దర్బారా సింగ్, గులాం నబీ ఆజాద్‌లను అర్జున్ కదలేసి చూశాడు. కానీ పార్టీ వైస్ ప్రెసిడెంటుగా వుండగా అర్జున్ తమ పట్ల వ్యవహరించిన తీరు గుర్తు పెట్టుకున్న వారందరూ అతనికి మొండిచెయ్యి చూపించారు.

అర్జున్ అడుగుజాడల్లోనే నడిచాడు దిగ్విజయ్. తనను రాజకీయాల్లోకి ప్రవేశపెట్టిన శ్యామ్ చరణ్ శుక్లాకు చెక్ పెట్టి 1993లో తొలిసారి ముఖ్యమంత్రి అయ్యాడు. అప్పట్లో పార్టీలో చాలా గందరగోళం వుండేది. అనేక వర్గాలు వుండేవి. దిగ్విజయ్ అందరికీ తన మంత్రివర్గంలో చోటు కల్పించి కాస్తకాస్త తృప్తి పరుస్తూ, ఎవరూ తనను దాటిపోకుండా చూసుకున్నాడు. 1996 పార్లమెంటు ఎన్నికలలో మాధవరావు సింధియా, అర్జున్ సింగ్‌లు బలం క్షీణించడంతో వారి అనుచరులను తన కాబినెట్ నుండి తొలగించాడు దిగ్విజయ్. అయితే ఎన్నికల తర్వాత పివి నరసింహారావు ప్రాభవం తగ్గి, అధ్యక్షస్థానంలో వున్న సీతారాం కేసరి సోనియా ఆశీస్సులతో పివిని పక్కకు తప్పించాడు. మాధవరావు, అర్జున్ సింగ్‌లను మళ్లీ వెలుగులోకి తెచ్చాడు. దాంతో దిగ్విజయ్ గొంతులో వెలక్కాయ పడింది. అప్పుడు విద్యాచరణ్ శుక్లాను తీసుకుని వచ్చి వాళ్ల కోపం తగ్గించడానికి చూశాడు.

1998 ఎన్నికల సమయానికి దిగ్విజయ్‌కు మళ్లీ ఛాన్సివ్వద్దని చాలామంది నాయకులు చెప్పినా, సోనియా వినలేదు. దిగ్విజయ్

ఆవిడ్ని బాగా యింప్రెస్ చేశారు. దిగ్విజయ్ రెండో టర్మ్‌లో అవినీతి ఆరోపణలు ముంచెత్తాయి. పంచాయితీ రాజ్, భూ సంస్కరణలు వంటి వ్యవస్థలను నాశనం చేశాడని ప్రజలకు కోపం. 2003లో మూడోసారి ఎన్నికలకు సిద్ధమవుతూండగా దిగ్విజయ్ సన్నిహితులెందరో అతన్ని విడిచిపెట్టేశారు. ఓడిపోవడం తథ్యం అని అందరూ అనుకున్నారు. కానీ దిగ్విజయ్ ఢిల్లీ మీడియాలో వున్న తన స్నేహితుల ద్వారా సోనియాను ప్రభావితం చేసి విజయం తప్పదని భ్రమింపచేశారు. చివరకు ఘోరపరాజయం చెంది పదేళ్లగా కాంగ్రెసు ప్రతిపక్షంలోనే వుండిపోయింది. ఇప్పటికి కూడా బిజెపివారు దిగ్విజయ్ పాలన గుర్తు చేసి ఓటర్లను భయపెడుతున్నారు. అది గ్రహించే రాహుల్ గాంధీ 'అస్తమిస్తున్న సూర్యుణ్ని ఎవరూ పట్టించుకోరు' అన్నాడు. దిగ్విజయ్ చాలా తెలివిగా 'అవును నేను అస్తమిస్తున్న సూర్యుణ్నే, రాహుల్ ఉదయించే సూర్యుడు' అని స్టేటుమెంటు యిచ్చారు. నిజానికి రాహుల్ ద ృష్టిలో ఉదయించే సూర్యుడు దిగ్విజయ్‌కు వ్యతిరేకంగా తను నిలబెడుతున్న కాండిడేట్ – జ్యోతిరాదిత్య సింధియా!

దిగ్విజయ్‌కు తన కొడుకును ఎలాగైనా రాజకీయాల్లో పైకి తీసుకురావాలన్న తపన వుంది. అతనూ, అర్జున్ సింగ్ కొడుకూ స్నేహితులు. రాఘవగఢ్‌లో పార్టీ టిక్కెట్టు తెచ్చుకున్నాడు. పార్టీ తన పేరును ప్రకటించడానికి ముందే నామినేషన్ వేసేశాడు. మరొకరైతే అధిష్టానం క్రమశిక్షణ చర్య తీసుకునేదే. కానీ దిగ్విజయ్ మొహం చూసి రాహుల్ వూరుకున్నాడు. నిజానికి ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర వ్యవహారాల యిన్‌చార్జిగా దిగ్విజయ్ పొడిచేసిందేమీ లేదు. ఆంధ్రప్రదేశ్‌కు యిన్‌చార్జిగా వచ్చిన దగ్గర్నుంచి అంతా గందరగోళం చేసి పెట్టారు. పార్టీ ప్రాంతాలవారీగా నిట్టనిలువుగా చీలిపోయింది. అయినా దిగ్విజయ్‌ను సహించడానికి కారణం – అతన్ని రాహుల్ తన గురువుగా భావించడం! ఇంకో కారణం ఏమిటంటే ఏ పోస్టూ లేకుండా వదిలేస్తే అందరి మధ్య తంపులు పెట్టి పార్టీని నాశనం చేయగలడన్న భయం!

**బాదరాయణ సంబంధం**

1994 డిసెంబరులో పేపర్లకు ఎక్కిన ఇస్రో గూఢచర్యం కేసులో నిందితుడు నంబి నారాయణన్‌ను యీ ఏడాది సెప్టెంబరులో నరేంద్ర మోదీ కలిశారు. ఎందుకు? ఆయనకూ, యీయనకూ లింకేమిటి? అని ఆశ్చర్యపడుతున్నారా? ఉంది ఓ బాదరాయణ సంబంధం! మోదీ ప్రభుత్వంపై ఒక బోగస్ ఎన్‌కౌంటర్ కేసు నడుస్తోంది. గుజరాత్‌కు డిజిపిగా పని చేసిన ఆర్.బి.శ్రీకుమార్ కోర్టులో 'సొహ్రాబుద్దీన్ తదితరులను హత్య చేసి దాన్ని ఎన్‌కౌంటర్‌గా చూపమని మోదీ ప్రభుత్వం, ముఖ్యంగా అమిత్ షా తనను ఆదేశించారని' చెప్పాడు. అది మోదీకి, బిజెపికి పెద్ద తలకాయనొప్పిగా తయారైంది. వాళ్ల తక్షణ కర్తవ్యం – ఈ శ్రీకుమార్ విశ్వసించదగిన వ్యక్తి కాదు అని నిరూపించడం. దానికై అతని పాత చరిత్రంతా తవ్వితీశారు. దానిలో 1994 నాటి ఇస్రో కేసు తీగ తగిలింది. లాగితే డొంక కదిలింది.

ఇస్రోలో పనిచేసే నంబి నారాయణన్, డి.శశికుమారన్ అనే యిద్దరు సైంటిస్టులు రాకెట్లలో వుపయోగించే క్రయోజనిక్ టెక్నాలజీని విదేశాలకు అమ్ముకుంటున్నారనే వార్త బయటకు వచ్చింది. వారికి యిద్దరు మాల్దీవు దేశస్తులైన యువతులు సహకరించారని కూడా ఆరోపణ. కేసు పెట్టి నారాయణన్‌ను జైల్లో పడేశారు. 50 రోజులపాటు హింసించారు. ఇస్రో ఖ్యాతి దెబ్బతింది. వాళ్లు ఆ టెక్నాలజీపై ఆధారపడి తయారుచేసిన జిఎస్ఎల్‌వి రాకెట్ ప్రయోగం నిలిపివేశారు. నారాయణన్ ప్రిన్స్‌టన్ యూనివర్శిటీలో కెమికల్ రాకెట్ ప్రొపల్షన్‌లో మాస్టర్స్ డిగ్రీ తీసుకున్నారు. విక్రమ్ సారాభాయ్, సతీష్ ధావన్, యు.ఆర్.రావు వంటి మహానుభావుల వద్ద పనిచేశారు. ఇస్రోలో అతనికి ఎంతో పేరుంది. సిబిల్ మాథ్యూస్ అనే పాత్రికేయుడు, అప్పటి కేరళ పోలీసు అధికారి శ్రీకుమార్ కలిసి తనను కావాలని యిరికించారని నారాయణన్ వాపోయాడు.

కేసు పెద్దది కావడంతో కేరళ ముఖ్యమంత్రి కరుణాకరన్ రాజీనామా చేశారు. సిబిఐకు అప్పగించారు. విచారణ జరిపి నారాయణన్ నిర్దోషి అని సిబిఐ క్లియర్ చేసింది. ఇస్రోలో మళ్లీ ఉద్యోగం యిచ్చారు. 1998లో సుప్రీం కోర్టు విచారించి, నిందితులందరినీ నిర్దోషులుగా నిశ్చయించి విడిచిపెట్టింది. నారాయణన్ వదిలిపెట్టలేదు. తనకు నష్టపరిహారం కావాలని 1999లో కేసు వేశాడు. 2001లో హ్యూమన్‌రైట్స్ కమిషన్‌వారు కేరళప్రభుత్వం కోటి రూ.ల పరిహారం యివ్వాలని తీర్పు చెప్పింది. వాళ్లు యివ్వలేదు. ఈయన హైకోర్టుకి వెళితే మొదట రూ.10 లక్షలు ఎడ్వాన్సుగా యిమ్మనమని 2012లో తీర్పు చెప్పింది. ఇదంతా శ్రీకుమార్ నిర్వాకం అని, వాళ్లు ఇస్రో కేసులో వ ృత్తిపరమైన పరిధులు దాటి ప్రవర్తించారని విమర్శలు వచ్చాయి. కేరళ ప్రభుత్వం వారిపై కేసులు పెట్టింది. కేసులు విత్‌డ్రా చేసుకోమని సిబిఐ సిఫార్సు చేయడంతో 2012లో కేసు మూసేసింది.

ఇది బిజెపికి కలిసివచ్చింది. సొహ్రాబుద్దీన్ కేసులో కూడా శ్రీకుమార్ అనుచితంగా వ్యవహరించాడని చూపడానికి, అతని తరహాయే అంత అనడానికి ఇస్రో కేసు అనువుగా వుంది. సెప్టెంబరులో మోదీ కేరళ వచ్చినపుడు స్థానిక బిజెపి నాయకులు నంబి నారాయణన్‌కు కబురుపెట్టారు. ఆయన వెళితే మోదీ మీకేసు సంగతేమిటన్నాడు. శ్రీకుమార్ తనను ఎలా వేధించాడో యీయన అంతా చెప్పాడు. ఏ వ్యక్తికీ యిలాటి కష్టం రాకూడదంటూ ఓదార్చి పంపాడు మోదీ. బిజెపి పార్టీ తన డిఫెన్సు కోసం నారాయణన్‌ను వాడుకుని వదిలేస్తుందో, లేక తను అధికారంలోకి వస్తే ఆయనకు న్యాయం చేకూరుస్తుందో వేచి చూడాలి.

కారుపార్టీ వాళ్లు, కమలం పార్టీ వాళ్లు పొత్తు పెట్టుకోబోతున్నారన్న వార్త రాష్ట్రరాజకీయ వర్గాల్లో కలకలం రేపింది. బిజెపి, టిడిపికి దగ్గరవుతోందని సంకేతాలు స్పష్టంగా తెలుస్తున్నాయి. అది సహజమైన పొత్తుగానే అనిపిస్తోంది కూడా. తెరాసకు, బిజెపికి మొదట్లో సయోధ్య వున్నా, ఉపయెన్నికలలో నేనూ వున్నానంటూ బిజెపి ముందుకు రావడంతో తెరాస మండిపడింది. వాళ్లిద్దరికి చాలాకాలంగా పడటం లేదు. ఇప్పుడు కాంగ్రెసు తెలంగాణ తీర్మానం తర్వాత తెరాస మంచి వూపు మీద వుంది. ఎన్నికలలో తనదే విజయం అని, తెలంగాణలో తెచ్చుకునే పార్లమెంటు సీట్లతో కేంద్రంలోని సంకీర్ణ ప్రభుత్వాన్ని ఓ వూపు వూపవచ్చని అనుకుంటోంది. ఇక బిజెపి కూడా మోదీ రంగం మీదకు వచ్చాక జాతీయస్థాయిలో కాలరెగరేస్తోంది. మోదీ ప్రభావంతో రాష్ట్రంలో కూడా ఓట్లు, సీట్లు రాలతాయని నమ్మకంగా వుంది. ఇద్దరికీ కార్యక్షేత్రం తెలంగాణయే. మరి అలాటప్పుడు పొత్తు కుదిరేదెలా? మరి యీ వార్త ఎలా వచ్చింది? తెరాసను కాంగ్రెసులో విలీనం చేస్తానని కెసియార్ ముందుకు వచ్చినా కాంగ్రెసు ఉత్సాహం చూపడం లేదట. కెసియార్ ఢిల్లీ వెళ్లినా స్పందన లేదట. షరతులు లేకుండా విలీనం అయితే ఓకే అనీ, గొంతెమ్మ కోరికలు కోరితే చేర్చుకోమని కాంగ్రెసువారు అన్నారనీ, వారిని అదలగొట్టడానికి కెసియారే యీ బిజెపి పుకారు లేవదీశారని ఒక ఊహాగానం. నిజమేనా?

టి-కాంగ్రెసు నాయకులందరూ తెరాసతో విలీనానికి ఉవ్విళ్లూరుతూండగా కాంగ్రెసు అధిష్టాం తెరాస పట్ల ఉదాసీనంగా ఎందుకుంటుంది? ప్రభుత్వవ్యతిరేక ఓటు బలంగా వుందని అందరికీ తెలుసు. తెరాస కాంగ్రెసులో విలీనం అయిపోతే ఆ ఓటుకి గుత్తాధిపత్యం టిడిపికే దక్కుతుంది. ఎందుకంటే తెలంగాణలో వైకాపాకి వున్న బలం స్వల్పమే. క్యాడర్ పెద్దగా లేదు. టిడిపికి మంచి నిర్మాణవ్యవస్థ వుంది. అందువలన కాంగ్రెసు వ్యతిరేక, ప్రభుత్వ వ్యతిరేక ఓటంతా టిడిపికే వెళ్లి, (తెరాసను విలీనం చేసుకున్న) కాంగ్రెసు ఎక్కువ సీట్లు తెచ్చుకోలేదు. విభజన చేయడం వలన సీమాంధ్రలో ఎలాగూ దెబ్బ తింటాం, తెలంగాణలో బాగా పుంజుకుంటాం అనే లెక్క వేసుకున్న కాంగ్రెసు యీ పరిస్థితికి సమాధాన పడలేదు కదా. ఇక తెరాస పక్షాన్నుండి చూసుకున్నా - వాళ్లు కూడా కాంగ్రెసులో విలీనం అయిపోయి, ఇన్నేళ్ల వాళ్ల తప్పుల్ని నెత్తిన వేసుకోలేరు కదా. కాంగ్రెసును యిన్నాళ్లూ అందరూ తిడుతూనే వున్నారు. ఇప్పుడు తెలంగాణ ప్రకటించారు కాబట్టి తెలంగాణలో కొందరు వాళ్ల పట్ల మెత్తబడవచ్చు. కానీ చాలామంది తెలంగాణ వాదులు - 'ఈ యిచ్చేది 2009లోనే యిచ్చి వుంటే వెయ్యిమంది ప్రాణాలు దక్కేవి కదా, ఇన్నాళ్లూ వూరుకుని యిప్పుడు రాహుల్‌ను ప్రధాని చేయడానికి హడావుడిగా చేశారు' అని తప్పుపడుతున్నారు. అంతేకాకుండా విభజనసమయంలో పెట్టే ఆంక్షలను కూడా తప్పుపడుతున్నారు. తెరాస యిప్పుడేమంటోంది? '28 రాష్ట్రాల విషయంలో లేని ఆంక్షలు తెలంగాణాకు మాత్రమే ఎందుకు?' అని అడుగుతోంది. అందువలన కాంగ్రెసు పట్ల కినుక తప్పదు.

ఫైనల్‌గా తెలంగాణ బిల్లు ఎలా వుంటుందో యిప్పటిదాకా తెలియదు. కానీ పరిమిత ఆంక్షలు తప్పవు అని జయపాల్‌రెడ్డి సూచించారు. యూటీ అనరు కానీ వ్యవహారం యూటీలాగే నడుస్తుంది. తెలంగాణ ప్రభుత్వం తన అధికారాలలో అతి ముఖ్యమైనవి గవర్నరుకి దఖలు పరుస్తుంది. ఆ గవర్నరు నిష్పక్షపాతమైన అధికారియో, న్యాయాధీశుడో అయివుండడు కదా. ఫక్తు రాజకీయవేత్త అయి, తన రాష్ట్రంలో ఏదో స్కాములో యిరుక్కుని, పదవి పోగొట్టుకుని, అక్కడే వదిలేస్తే తన వారసుడి కొంపకు ఎసరు పెడతాడని భయపడి అధిష్టానం చేత తరమబడినవాడై వుంటాడు. కేంద్రంలో ఎవరుంటే వాళ్ల పార్టీ మనిషో, లేక వాళ్ల కనుసన్నల్లో మసలే వ్యక్తో అయి వుంటాడు. అలాటివాడు తెలంగాణలో గుండెకాయను తన యిష్టం వచ్చినట్టు ఏలతాడు. హైదరాబాదు ఆదాయంలో ఎంత ఆంధ్రకు పోవాలో, ఎంత తెలంగాణకు పోవాలో ఆ మహానుభావుడే పర్యవేక్షిస్తాడు. అతనికి తెలంగాణపై వలపక్షం ఏమీ వుండదు, ఎందుకంటే అతను రెండు రాష్ట్రాలకూ గవర్నరు. రాజభవన్‌లో వున్నంతమాత్రాన అతను సచ్ఛీలుడని, ఏ ఒత్తిళ్లకు ప్రలోభాలకు లొంగడని గ్యారంటీ ఏమీ లేదు. రాజభవన్‌లో ఎన్‌డి తివారీ ఎటువంటి పనులకు పాల్పడ్డారో తెలుసు. గవర్నరు ఏం చేసినా, ప్రజలకు అపనమ్మకం కలగక తప్పదు. దానితో బాటు అటువంటి వ్యక్తికి అధికారం అప్పగించిన తెలంగాణ కాంగ్రెసు నాయకుడి సారథ్యంలో ఎన్నికల ముందు ఏర్పడే తెలంగాణ ప్రభుత్వంపై కోపం కలగక మానదు.

కాంగ్రెసుకు యీ బెడద ఎలాగూ తప్పదు. వారితో కలిస్తే తెరాసకూ వాతలు తప్పవు. చిరంజీవి ప్రజారాజ్యం పార్టీని విడిగా వుంచి వుంటే, యిప్పుడు ఆయన ఎమ్మెల్యేలు సంజాయిషీలు చెప్పుకునే స్థితిలో వుండేవారు కారు. 2009 డిసెంబరు తర్వాత వారు సమైక్యబాట పట్టారు కాబట్టి ప్రజలు వారికి జేజేలు పలికేవారు. కాంగ్రెసుకు అవసరమైనపుడు మద్దతు యిస్తూ, మంత్రిపదవులు అనుభవిస్తూ, యిలాటి సంకట సమయాల్లో కాంగ్రెసును వ్యతిరేకిస్తున్నాం అంటూ కాంగ్రెసుపై వ్యతిరేకత సెగ తమను తాకకుండా చూసుకునేవారు. కానీ విలీనమై దెబ్బ తినేశారు. సినిమాహీరోగా నీరాజనాలు అందుకున్న చిరంజీవి జనాల చేత యిప్పుడు ఛీత్కరించబడుతున్నారు. పార్టీలో చేరేవరకూ సోనియా ఆయన మాటకు విలువ యిచ్చేవారు. ఇప్పుడు గుంపులో గోవిందా అయిపోయారు. ఆయన యూటీ అన్నా, ఊటీ అన్నా వినేవాడు లేడు. రేపు సీమాంధ్రలో కాంగ్రెసుకి ఘోరపరాజయం తప్పదు. వారితో కలిసిపోయినందుకు మాజీప్రజారాజ్యం వారికీ శృంగభంగం తప్పదు. ఇది చూశాకైనా తెరాస కాంగ్రెసులో విలీనం గురించి పునరాలోచనలో పడవచ్చు.

పైగా యుపిఏ అంపశయ్యమీద వుంది. 2014లో మళ్లీ అధికారంలోకి వస్తుందని నమ్మకం లేదు. ఎన్‌డిఏ కూటమి అధికారంలోకి వస్తే కెసియార్ బృందం విడిగా వచ్చి లబ్ధి పొందుదామని చూడాలంటే కష్టం. ఎందుకంటే పార్టీ మార్పిడి నిరోధ చట్టం వలన వాళు

ల్లో మళ్లీ ఎన్నికలకు వెళ్లవలసి వస్తుంది. చిన్నపార్టీలోంచి విడిగా వచ్చేసి పార్టీ పెట్టుకోవడం సులభమే కానీ కాంగ్రెసు వంటి పెద్ద పార్టీలోంచి విడివడాలంటే చాలామంది ఎంపీలను కూడగట్టుకోవాలి. అందువలన విడిగా ఫ్రీ రాడికల్‌గా వుండడమే మేలు. ఎన్‌డిఏ, మూడో కూటమి, ప్రాంతీయ పార్టీల నాలుగో కూటమి.. యిలా దేనిలోనైనా చేరవచ్చు. తెరాసకు సిద్ధాంతపరమైన యిబ్బందులు ఏమీ లేవు కాబట్టి ఎవరితోనైనా చేరవచ్చు. తెలంగాణ పునర్నిర్మాణం అంటే నిధులు చాలా కావాలి. ఉమ్మడి రాజధానిపేరుతో రాజధానిలో వుండబోయే ఆంధ్రులను అదుపులో వుంచాలి. అడలగొట్టాలి. ఇవన్నీ చేయాలంటే కేంద్రంలోని ప్రభుత్వంలో భాగస్వామి కావాలి. కాంగ్రెసు పార్టీలో చేరి ఆ స్వాతంత్ర్యాన్ని పోగొట్టుకోవడం తెరాస చేయదు. విలీనం కాకపోతే మిగిలిన ఆప్షన్ – పొత్తులు. ఎన్నికలకు ముందు ఒకరితో పొత్తు పెట్టుకుని, తర్వాత మరొకరితో జత కట్టడానికి ఏ పార్టీకి అభ్యంతరాలుండవు. తెరాసకు ముందే వుండవని 2009లోనే కెసియార్ చూపారు.

ఇలా ఆలోచిస్తే... కాంగ్రెసుతో పొత్తులు కుదరలేదు కాబట్టి కెసియార్ బిజెపి తనను ఆహ్వానించినట్టు పుకారు పుట్టించారని అనాలి. కానీ కాంగ్రెసు పొత్తుల గురించి యిప్పుడు ఆలోచిస్తున్నట్లుగా ఏమీ తోచటం లేదు. అసెంబ్లీ ఎన్నికలలో సాధించే విజయాలపై వారి బార్గయినింగ్ పవర్ వుంటుంది. ఇంకో వారం ఆగితే కాంగ్రెసు పడవ మునుగుతోందో, తేలుతోందో తేలిపోతుంది. ఇప్పటికిప్పుడు పొత్తు సంగతి తేల్చమని కెసియార్ పట్టుబట్టారని అనుకోవడానికి లేదు. అందువలన బిజెపియే తెరాసను సౌండ్ చేసి వుంటుంది అనుకోవడం తార్కికం. ఓ పక్క టిడిపితో సంప్రదింపులు చేస్తూ మరో పక్క తెరాసతో ఎలా చేస్తుంది? అనే ప్రశ్న అవివేకులే వేస్తారు. విభజన జరిగిపోతే సీమాంధ్రలో టిడిపితో, తెలంగాణలో తెరాసతో పొత్తు కుదుర్చుకోవచ్చు కదా! అనేక పార్టీలు ఒక రాష్ట్రంలో మిత్రులుగా, మరో రాష్ట్రంలో శత్రువులుగా వ్యవహరించడం చూశాం. ఎన్‌సిపి మహారాష్ట్ర యూనిట్‌కు కాంగ్రెసుతో పొత్తు వుంటుంది. తక్కిన రాష్ట్రాల యూనిట్లకు వుండదు. ఒకవేళ రాష్ట్రం విడిపోకపోయినా వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు స్ట్రాటజీలు వుండడమూ వింత కాదు. సిబిఐ ఆంధ్ర ప్రాంతంలో టిడిపితో, తెలంగాణలో తెరాసతో పొత్తు పెట్టుకుంది కదా. బిజెపి రేపు అదే పని చేయవచ్చు. టిడిపి తెలంగాణలో పోటీ చేసినపుడు బిజెపి పోటీ చేసిన చోట తన అభ్యర్థిని పెట్టకుండా తెరాసకు ఎలాట్ చేసిన స్థానాల్లో మాత్రం పెట్టవచ్చు. పొత్తు పెట్టుకున్న పార్టీలు కూడా పొత్తు కుదరని స్థానాల్లో 'ఫ్రెండ్లీ కాంటెస్టు' పేర పోటీ పడతారు. ఇవన్నీ మామూలే.

కాంగ్రెసు సీమాంధ్రలో వైకాపాతో, తెలంగాణలో తెరాసతో పొత్తు పెట్టుకుందామని చూస్తోంది అంటారు. అది బహిరంగంగా వుంటుందో, ఎన్నికల అనంతరం వుంటుందో తెలియదు. అదే పని బిజెపి ఎందుకు చేయకూడదు? జగన్ ఢిల్లీ వెళ్లినపుడు బిజెపి వారు కూడా సాదరంగానే ఆహ్వానించారు. ఇక్కడ సిద్ధాంతాలకు ప్రాధాన్యత లేదు. గెలుచుకుని వచ్చే సీట్లకే ప్రాధాన్యత. సీమాంధ్రలో వైకాపా బలంగా వుంది, తెలంగాణలో తెరాస బలంగా వుంది అని సర్వేలు చెపితే యిద్దర్నీ దువ్వడానికి రెడీ. దువ్వే కళ కాంగ్రెసుకే కాదు, బిజెపికీ తెలుసు. వైకాపా బలహీనపడుతోంది, టిడిపి పుంజుకుంటోంది అనే రిపోర్టులు వస్తే టిడిపితో పొత్తు పెట్టుకునే అవకాశం బిజెపికి మాత్రమే వుంది. వైకాపా యివాళ కాకపోయినా రేపైనా కాంగ్రెసుతో కలుస్తుందన్న అనుమానం బిజెపి మెదడులో మెదిలితే వారు టిడిపినే ఎక్కువ నమ్ముతారు. కానీ టిడిపితో రాష్ట్రమంతా పొత్తు పెట్టుకోవడం చాలా రిస్క్‌తో కూడుకున్న వ్యవహారం. తెలంగాణలో టిడిపి యీ ఎన్నికలలో పెద్దగా గెలవదని అందరి సందేహం. అస్పష్టమైన విధానంతో ఏ ప్రాంతమూ నమ్మని పరిస్థితి తెచ్చుకుంది టిడిపి. అందువలన రెండు చోట్లా కొన్ని కొన్ని సీట్లు తెచ్చుకుని ఆగిపోతుందని అంచనా. అలాటప్పుడు తెలంగాణలో తెరాసను గట్టిగా పట్టుకోవడమే లాభదాయకం.

బిజెపితో కలిస్తే ముస్లిములు దూరమవుతారన్న భయం కెసియార్‌కు లేదా? అంటే మరి గతంలోనూ బిజెపితో కలిసి పని చేశారు కదా. పైగా విభజన తర్వాత మజ్లిస్ బాగా పుంజుకుంటుంది. విభజన వలన బిజెపి బలపడి మన దుంప తెంపుతుంది అని ప్రచారం చేసి మజ్లిస్ తెలంగాణ జిల్లాలలో కూడా తన అభ్యర్థులను నిలబెడుతుంది. ముస్లిము ఓట్లు గణనీయంగా వాళ్లకే పడతాయి. పడతాయో లేదో తెలియని ఆ ఓట్ల కోసం కెసియార్ బిజెపిని వదులుకోరు. బిజెపి వద్ద నిధుల కొరత లేదు. పైగా తెరాస ఒంటరిగా పోటీ చేసే స్థితిలో ఎన్నడూ లేదు. పార్టీకి క్యాడర్ లేదు. నిర్మాణం లేదు. ఎప్పుడు చూసినా నాయకులు ప్రెస్ కాన్ఫరెన్సులలో కనబడతారు. లేదా ఆర్నెల్లకో సారి భారీ సభ పెడతారు. గ్రామస్థాయిలో కార్యకర్తలను తయారుచేసి, తర్ఫీదు యివ్వడంపై యిన్నాళ్లూ శ్రద్ధపెట్టలేదు. ఇప్పుడే ప్రారంభించారు. సమయం చాలదు.

తెరాసతో పొత్తు వుండదు. ఒంటరిగానే పోటీ చేస్తాం అని రాష్ట్రస్థాయి బిజెపి నాయకులు గంభీరప్రకటనలు చేస్తున్నారు. ఎందుకంటే వారందరూ తెలంగాణవారే. తమ కేదో బలం వుందని వాళ్లు అనుకుంటూ వుంటారు. గతంలో సొంతంగా ఎదిగే సమయంలో టిడిపితో పొత్తువలన నష్టపోయామని, యిప్పటికైనా విడిగా పోటీ చేస్తే పుంజుకోవచ్చని వాళ్ల ఊహ. ఆంధ్రప్రాంతంలో పార్టీ ఏమై పోయినా వాళ్లకు పట్టదు. కానీ జాతీయస్థాయి నాయకులకు వీళ్ల బలం ఎంతో తెలుసు. వీళ్ల వలన ఏమీ కాదనీ తెలుసు. తెలంగాణ విషయంలో వీళ్లను నమ్ముకుని వీళ్లు చెప్పినట్టు ఆడడం వలననే చివరకు ఎటూ కాకుండా చెడ్డామని వాళ్లు గ్రహించారు. తెలంగాణ బిల్లు సమర్థించి వాళ్లు బావుకునేది ఏమీ లేదు. తెలంగాణ తెచ్చిన ఘనత కాంగ్రెసుకు, తెరాసకు పోతుంది. ఇక ఆంధ్రలో క్షౌరం. నిజానికి సోనియాపై కోపంతో రగులుతున్న ఆంధ్రులకు సోనియాకు బుద్ధి చెప్పగల మొనగాడిగా మోదీకి పట్టం కట్టేవారు – విభజన విషయంలో సమన్యాయం చేయగలిగి వుంటే. ఆంధ్రులకు తృప్తి కలగించని తెలంగాణ బిల్లును గుడ్డిగా సమర్థించిన బిజెపిని, కాంగ్రెసును ఒకే గాటకు కడతారు వారు.

ఈ విషయాలు క్రమేపీ గుర్తిస్తున్న బిజెపి అధినాయకత్వం కేంద్రంలో ప్రభుత్వం ఏర్పరడానికి టిడిపి, తెరాసలతో పొత్తు పెట్టుకోవడానికి నిర్ణయిస్తే, స్థానిక నాయకత్వం సరేననాల్సిందే! ఈ పరిణామాలు గమనిస్తున్న కాంగ్రెసుకు కాక పుదుతుందనడంలో సందేహం లేదు. తెలంగాణ యిచ్చినా తెరాస-బిజెపి కూటమిని ఎదుర్కొని ఎన్నికలలో గెలవడం అంత సులభమేమీ కాదు వాళ్లకు! **– ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2013)**

**డిసెంబరు 01** **ఎమ్బీయస్ : తెలంగాణ మెడకు రాయి – రాయల తెలంగాణ**

కాస్సేపట్లో మంత్రుల ముఠా ఆఖరి సమావేశం జరుగుతోంది. వివరాలు వాళ్లు బయటకు చెపితే రాయల తెలంగాణ ప్రతిపాదన వుందో లేదో కచ్చితంగా తెలుస్తుంది. లేకపోతే లీకులే గతి. నిన్న, ఇవాళ్టి పేపర్లు, టీవీ ఛానెళ్లు చూస్తే రాయల తెలంగాణ ఐడియాను సోనియా ఆమోదించారనే తెలుస్తోంది. ఈ విషయంలో తెలుగు మీడియాను నమ్మలేని పరిస్థితి వచ్చింది కాబట్టి ఇంగ్లీషు ఛానెళ్లు పెట్టి చూశా. ఎన్‌డిటివి, హెడ్‌లైన్స్ టుడే వంటివి కూడా నిర్ధారించాయి. వాళ్లు 'బిగ్గర్ తెలంగాణ' అంటున్నారు. '20% అధికం, అదే ధరకు..' అన్న స్లోగన్‌తో టూత్‌పేస్టు, షాంపూలాటివి అప్పుడప్పుడు అమ్ముతూ వుంటారు చూశారా, అలాగ, '10 జిల్లాల కోసం అడిగితే 20% కలిపి 12 జిల్లాలు.. అదే ఉద్యమానికి' అన్నట్టు తెలంగాణకు ఆఫర్ చేస్తున్నారు.

దీనివలన ఆంధ్రప్రదేశ్ సరిగ్గా సగానికి తెగుతుందట. అదో పెద్ద పాయింటా? అనుకోవద్దు. రెండు రాష్ట్రాలూ సమానంగా వుంటే ఎవరు అన్న, ఎవరు తమ్ముడు అనే వివాదం రాదు. మొన్నటిదాకా టి-ఉద్యమకారులు 'ఆంధ్రులు పెద్దన్నల్లా వ్యవహరిస్తున్నారు' అంటూ వుండేవారు, సంఖ్యాపరంగా అక్కడ ఎక్కువ స్థానాలు, జిల్లాలు వుండేవి కాబట్టి. జులై 30 ప్రకటన తర్వాత యింకో నినాదం విన్నాను – 'ఆంధ్రోడు తమ్ముడే, అడ్డొస్తే మాత్రం తన్నుడే!' అని. పంచ్ బాగుంది కానీ అన్నగారు హఠాత్తుగా తమ్ముడెలా అయిపోయాడు – ప్రాసకోసం కాకపోతే! అనుకున్నాను. ఇలా సగానికి విడగొడితే అలాటి సందేహాలు రావు.

కాంగ్రెసు తెలంగాణ యిచ్చింది కాబట్టి ఎన్నికలలో లబ్ధి పొందుతుంది అని టి-కాంగ్రెసు నాయకులు అంటూ వచ్చారు. 'అవునవును తెలంగాణ యిస్తే వాళ్లకు ఎదురు వుండదు' అంటూ ఊరిస్తూ వచ్చిన టి-వాదులు జులై 30 ప్రకటన వచ్చిన తర్వాత ప్లేటు ఫిరాయించారు. 'ఈ ఇచ్చేదేదో నాలుగేళ్లకు ముందే యివ్వాల్సింది. ఇప్పుడు వెయ్యిమంది ప్రాణాలు బలిగొన్న తర్వాత యిస్తే ఎంత? ఇవ్వకపోతే ఎంత? సోనియాకు గుడి కట్టాలంటే ఆ వెయ్యిమంది సమాధుల మధ్య కట్టండి.' అనసాగారు. ఆలస్యానికి తప్పుపడుతున్న ప్రజలను ఊరడించడానికి, నష్టపరిహారంగా యింకో రెండు జిల్లాలు కలిపి సోనియా యిస్తోంది అనుకోవచ్చుగా! జానపద చిత్రాలలో రాజుగారు అసాధ్యమైన పనిని చేసిన సాహసికి యువరాణిని యిచ్చి పెళ్లి చేయడంతో బాటు, అర్ధరాజ్యం కూడా యిచ్చేవారు. ఒక్కోప్పుడు యిద్దరు కూతుళ్లుంటే యిద్దర్నీ యిచ్చి పెళ్లి చేసేవారు. ఇద్దరు భార్యలతో సహా సింహాసనం ముందు నిలబడి హీరో ప్రేక్షకులకు నమస్కారం పెడుతూ వుంటే 'శుభం' అని వచ్చేది. అలాగ యిప్పుడు టి- ఉద్యమకారుల పోరాటస్ఫూర్తిని మెచ్చి సోనియా తెలంగాణ కన్యతోబాటు, రాయలసీమ (సగమే అనుకోండి) కన్యను కూడా కట్టబెట్టింది అనుకోవచ్చు.

భగవాన్ చాహేతో ఛత్ ఫాడ్‌కే దేతా హై అని సామెత. నాకేం అక్కరలేదనుకుని తలుపులు బిడాయించుకుని కూర్చున్నా, యింటి కప్పు పగలగొట్టి దేవుడు ఆకాశం నుండి మండువాలో పడేస్తాడు. తెలంగాణ దేవతగా కీర్తించబడుతున్న సోనియా దేవత తెలంగాణ చాలు అంటున్నా పై నుంచి రాయలసీమ కూడా పడేసింది – పండగ చేస్కోండి అని. సేర్ కో సవా సేర్ మిల్‌నా అంటారు హిందీలో – ఎవడైనా గట్టివాడికి వాడి కంటె ఇంకో నాలుగాకులు ఎక్కువ చదివినవాడు (సవా సేర్ అంటే శేరుంపావు అని అర్థం) ఎదురైతే యిది వుపయోగిస్తారు. ఇప్పుడు తెలంగాణ సేర్ అనుకుంటే రాయల తెలంగాణ సవాసేర్ అనవచ్చు (20% పెరిగింది కాబట్టి). టి-ఉద్యమం వాళ్లు సేర్ అడిగితే సోనియా సవాసేరు ప్రతిపాదనతో ముందుకు వచ్చింది.

లెక్కప్రకారం ఉద్యమకారులు దీనికి సంతోషించాలి కానీ అదేమిటో మండిపడుతున్నారు. మొన్నటిదాకా చిరునవ్వులు చిందిస్తూ వచ్చిన జయపాల్ రెడ్డిగారు నిన్నటినుండి మొహం వేళ్లాడేశారు. ఇన్నాళ్లూ ఆయన ముసుగువీరుడు. జులై 30 ప్రకటన తర్వాత మీడియా ముందుకు పదేపదే వచ్చి శీతాకాల సమావేశాల్లో టి-బిల్లు రావడం, జనవరిలో తెలంగాణ ఏర్పడడం ఖాయం అని ధాటీగా చెపుతూ తెగ తిరిగారు. అంతేకాదు, అసలు నేను తెలంగాణకోసం ఎంత కష్టపడ్డానో తెలుసా అంటూ క్రెడిట్ కొట్టేద్దామని చూశారు కూడా. నిజానికి తెలంగాణ అంశం యీ స్థాయిదాకా రావడానికి కారణం నిశ్చయంగా కెసియారే. కాంగ్రెస్ అంతఃకలహాల వలన ఆయన విజయం సాధించాడన్నది వేరే విషయం. కానీ తెలంగాణ కోసం పోరాటం సాగుతోంది అని చూపించడానికైనా ఒకరు ఆ జండా పట్టుకుని తిరగాలి కదా, ఆ పని కెసియారే చేశారు. తెలంగాణ జాతిపిత కెసియారే అని డాఎ౹ శ్రవణ్ ప్రకటించారు. ఇప్పుడు జయపాల్ ఆ జాతిపిత బిరుదు కొట్టేయాలని చూస్తున్నారు. తన కాబినెట్ సహచరులను గొప్పగా యింప్రెస్ చేశానని, సీమాంధ్ర మంత్రులను చవటలను చేశానని ఆయన మురియడం, విజయగర్వాన్ని ప్రదర్శించడం కనబడింది.

రెండు రోజుల క్రితం 'హైదరాబాదుపై పరిమిత ఆంక్షలు వుంటాయి సుమా' అని ముఠా సభ్యులు ఒక సూచన చేశారాయనకు. దాన్ని మీ వాళ్లను మానసికంగా సిద్ధం చేయండి అని కూడా చెప్పి వుంటారు. అందుకే ఆయన 'హైదరాబాదుపై పరిమిత ఆంక్షలు పెట్టడానికి కూడా రాజ్యాంగ సవరణ అక్కరలేదు' అంటూ పరోక్షంగా ఆంక్షల గురించి చెప్పారు. 'ఆయన దృష్టిలో పరిమితమైనవి,

మన దృష్టిలో అపరిమితమైనవేమో' అని టి-ఉద్యమకారులు ఉగ్గబట్టుకుని చూస్తున్నారు. అంతలో యిప్పుడు రాయల తెలంగాణ మాట బయటకు వచ్చింది. ఇది జయపాల్‌కు కూడా తెలిసినట్టు లేదు. ముఠా వాళ్లు ఆయనకు కూడా జెల్లకాయ కొట్టినట్టున్నారు. 'బిల్లు అంతిమదశలో యీ ప్రస్తావన, ప్రతిపాదన అనవసరం' అంటున్నారు జయపాల్.

ఇది అంతిమదశ అని ఆయన ఎలా అనగలరు? సుప్రీం కోర్టు వాళ్లేమంటున్నారు? 'ఇప్పటిదాకా ఏం జరిగింది కనుక? అన్నీ ప్రతిపాదనలే కదా' అంటున్నారు. కాబినెట్ తీర్మానం చేయాలి, అసెంబ్లీలో చర్చ జరగాలి, పార్లమెంటుకి బిల్లు రావాలి, సవరణలు చేయాలి.. అని చేంతాడంత జాబితా చదివారు. మరి జయపాల్‌గారి కంటికి యివేమీ కనబడటం లేదు. అప్పుడే తెలంగాణ వచ్చేసినట్టు, దానికి ముఖ్యమంత్రిగా వుండమని అధిష్టానం ఆయనను బతిమాలుతున్నట్టు కొన్ని దృశ్యాలు ఆయన కళ్లముందు కదలాడుతున్నాయి. మధ్యలో రాయల తెలంగాణ పీడకల రావడంతో ఆయనకు మెలకువ వచ్చేసింది. అధిష్టానం సీమాంధ్ర మంత్రులను వెర్రివాళ్లను చేసి ఆడుకుంది కానీ నాతో అలా జరగదు అనే నమ్మకంతో వుండి వుంటారు. ఇప్పుడు ఆయనా గతుక్కుమన్నారు. ఎందుకంటే 'ఓహో ఇన్నాళ్లూ తెలంగాణ కోసం లాబీయింగ్ చేసి విజయం సాధించామన్నావు, దీనికోసమా? సీమాంధ్ర మంత్రుల్లా నువ్వూ అధిష్టానంతో లాలూచీ పడ్డావా?' అని టి-ఉద్యమకారులు నిలదీసే ప్రమాదం వుంది.

జయపాల్ రెడ్డిగారికి తోడు దామోదర రాజనరసింహ కూడా యిరకాటంలో పడ్డారు. గత ఆర్నెల్లగా కాంగ్రెసు అధిష్టానం ఆయనకు తెగ విలువ యిచ్చేసింది. అప్పటిదాకా సారథ్యం వహిస్తూ వచ్చిన జానారెడ్డిగార్ని పక్కన పడేసి, యీయన్ని పవర్ పాయింట్ ప్రెజంటేషన్ యిమ్మన్నారు. అప్పణ్నుంచి యీయన 'తెలంగాణ సాధించిన వీరుడు' పాత్ర ధరించడం మొదలుపెట్టారు. తెరాస ఏ డిమాండ్లు పెడితే అవే తనూ చెపితే 'మేం ఎక్కడా రాజీ పడం' అనే యిమేజి బిల్డప్ యిచ్చారు. చూడబోతే ఆయన చెప్పినది ఏదీ జరగడం లేదు. హైదరాబాదు పరిమితి ఎంసిఎచ్ అంటే ముఠా వారు జిఎచ్ఎంసి అన్నారు, హైదరాబాదుపై శాంతిభద్రలు, ఆంక్షలు ఒప్పుకోం అంటే గవర్నరు చేతికి యిస్తాం అంటున్నారు. ఇప్పుడు ఆయన కూడా ఎదురు చూడని విధంగా రాయల తెలంగాణ అన్నారు. పిలిచి 'నువ్వెళ్లి మిగతావాళ్లని కన్విన్స్ చేసి రా' అన్నారు.

తను ప్రేమించి, హంస రాయబారం నడిపిన దమయంతి స్వయంవరానికి నల మహారాజు వెళుతూంటే ఇంద్రాది దేవతలు దారిలో తగిలారు. నువ్వో ఉపకారం చేయాలి అన్నారు. సరే అని మాటిచ్చేశాడు మహానుభావుడు. అప్పుడు చెప్పారు – 'అదృశ్యరూపుడిగా వెళ్లే శక్తి నీకిస్తాం. నువ్వు దమయంతిని రహస్యంగా కలిసి, మా గురించి గొప్పగా చెప్పి, దమయంతిని కన్విన్స్ చేసి మాలో ఒకరిని పెళ్లాడేట్లా చేయాలి' అని. తెల్లబోయినా నలమహారాజు సరేనన్నాడు – యిచ్చిన మాట కోసం. ఇప్పుడు రాజనరసింహ కూడా రాజ'నల'సింహ అయ్యారు.

పోలిక ఏమిటంటే – రాయల తెలంగాణ ఏర్పడితే రెడ్లను ఆకట్టుకోవచ్చని కాంగ్రెసు ప్లానుట. ఆంధ్రలో నాయకత్వం కమ్మ లేదా కాపుకి పోయినా, తెలంగాణలో రెడ్డి ముఖ్యమంత్రి అయేందుకు భూమిక తయారుచేశారట. కాంగ్రెసుకు వెన్నుదన్నుగా నిలిచిన రెడ్లకు యిది ఆ పార్టీ యిచ్చే కానుకట. ఇదే జరిగితే దామోదరకు ముఖ్యమంత్రి పదవి హుళక్కి. విభజన జరిగితే దళిత, బిసి, మైనారిటీలకు అధికారం వచ్చేస్తుందని వూదరగొట్టి (ఎలా వస్తుందో నాకు అస్సలు అర్థం కాదు) ప్రచారం చేయడంతో దామోదర పాపం తెలంగాణ సిఎం సీటుపై ఆశ పెట్టుకుని వుంటారు. ఇప్పుడు యీ రాయల తెలంగాణ పేరు చెప్పి రెడ్డికి పదవి అప్పగించాలంటే ఆయనకు దుఃఖం వస్తుంది. తనకు నష్టం కలిగే పనిని సానుకూలం చేసే పని హై కమాండ్ తనకే అప్పగించింది. అదే కాంగ్రెస్ చేసిన తమాషా, ఏం ఆ పనిని ఆస్థాన శకునిగా వున్న జయపాల్ రెడ్డిగారికి అప్పగించవచ్చుగా, ఆయనతో మంతనాలాడవచ్చుగా. లేదా జానారెడ్డికి చెప్పవచ్చుగా. వాళ్లు రెడ్లు. రాయల తెలంగాణ అనగానే వెంటనే – 'ఏం రెడ్లు రాజ్యం చేద్దామనా?' అంటారేమో అని ఆ పని దళితుడికి అప్పగించారు.

తెలంగాణలో మొదటినుండి రాజకీయంగా రెడ్లు, వెలమలే పోటీ పడ్డారు. రెడ్లదే పై చేయి అవుతూ వచ్చింది. ఇప్పటిదాకా వెంగళరావు ఒక్కరే వెలమ ముఖ్యమంత్రి. తెరాస ఆవిర్భవించినపుడు కెసియార్ వెలమ కాబట్టి వెలమలు ఎక్కువగా ఆదరించారు. ముఖ్యమైన పదవులను కెసియార్ కుటుంబసభ్యులు, బంధువులు అలంకరించారు. కెసియార్‌తో పాటు నడిచిన తక్కినవారు అతిత్వరలోనే తప్పుకున్నారు. ఆలె నరేంద్ర – కెసియార్‌తో యించుమించు సమానస్థాయిలో కొంతకాలం వున్నారు, తర్వాత దూరమయ్యారు. సంతోష్‌రెడ్డి కొంతకాలం వుండి పార్టీ మారిపోయారు. విజయశాంతి కొన్నాళ్లు వెలిగారు. తర్వాత వేదిక మీద వున్నా మాట్లాడించ నివ్వలేదు. తెరాసలో వున్న ముఖ్యమైన నాయకుల్లో రెడ్డి – నాయిని నరసింహారెడ్డి ఒకరే. ఆయనకు ముఖ్యమైన బాధ్యతలు ఏవీ అప్పగించినట్టు తోచదు. టిక్కెట్ల పంపిణీలో కూడా ఆయన మాట చెల్లుతుందనుకోను. ఏదో అప్పుడప్పుడు ప్రకటనలు యివ్వడానికి, టీవీ చర్చల్లో మాట్లాడడానికి పనికి వస్తారంతే.

తెరాస ఎదుగుతున్నకొద్దీ వెలమలలో కొంత వుత్సాహం వచ్చినమాట నిజం. కొందరు యితర పార్టీల్లోంచి వచ్చి చేరారు. నాగం జనార్దనరెడ్డి తెరాసలో చేరబోయి, ఆగిపోయి, బిజెపిలో చేరడానికి కులం ఒక కారణమేమో తెలియదు. 10 జిల్లాల తెలంగాణ ఏర్పడితే కనీసం ఒక ఛాన్సుకైనా వెలమ ముఖ్యమంత్రి వస్తాడని అనుకుంటున్న తరుణంలో యిప్పుడు కాంగ్రెసు రాయల తెలంగాణ తెచ్చింది. రాయలసీమలో రెడ్ల ప్రాబల్యం ఎలాగూ వుంది, వాళ్లు తెలంగాణ రెడ్లతో కలిస్తే – వాళ్లదే పై చేయి అవుతుంది. పైగా కర్నూలు, మెహబూబ్ నగర్ జిల్లాల వారికి బాంధవ్యాలు కూడా వున్నాయి.

రెడ్డి, వెలమ గొడవ మాట ఎలా వున్నా రాయల తెలంగాణ ఏర్పడితే తెరాస బలం పలుచనవుతుంది. పది జిల్లాల తెలంగాణలో తెరాసకు 30% సీట్లు కచ్చితంగా వస్తాయనుకుంటే 12 జిల్లాల రాయల తెలంగాణలో అది 25%కు తగ్గిపోతుంది. బిజెపి బూచి చూపించి, తెలంగాణ జిల్లాలలో కూడా సీట్లు సంపాదించి మజ్లిస్ తన బలాన్ని 6% సీట్ల నుండి 12% శాతం సీట్లకు పెంచుకోవచ్చు. హైదరాబాదులో సీమాంధ్రులకు రక్షణ కల్పించే భారం వహిస్తామని కాన్వాస్ చేసుకుంటే 15% సీట్లు కూడా రావచ్చు. ఇప్పటివరకు తెలంగాణలో ప్రధానపార్టీలు కాంగ్రెసు, తెరాస అనుకుంటే ఆ రెండు జిల్లాలు వచ్చి కలిస్తే అక్కడ బలంగా వున్న టిడిపి, వైకాపాలు యీ రాష్ట్రంలో భాగమై అవి కూడా రాయల తెలంగాణ రాష్ట్రంలో చెప్పుకోదగ్గ శాతం ఓట్లు, సీట్లు తెచ్చుకుంటాయి. కాంగ్రెసు సంగతి సరేసరి. ఈ

విధంగా చూస్తే రాయల తెలంగాణకు అంగీకరించడం అంటే తెరాసకు ఆత్మహత్యాసదృశమే. అందుకే అది రేపు నిరసనలు, ఎల్లుండి బంద్ అంటోంది. అది అంతటితో ఆగదు. ఈ ప్రతిపాదనకు అంగీకరించిన పార్టీలన్నీ తెలంగాణ ద్రోహులే అంటుంది. ఆ మాట ఒక్కటి చాలు – కాంగ్రెసు, బిజెపిలను వణికించడానికి. ఒకరితో మరొకరు పోటీపడి దీన్ని నిరాకరిస్తారు. టి–జాక్, టి–ఉద్యమకారుల సంగతి సరేసరి. వాళ్లు ససేమిరా అంటారు.

అనడంలో ఆశ్చర్యం లేదు కానీ, వారి వాదనలే వింతగా వున్నాయి. ఎవరడిగారని రాయలసీమను విడగొడుతున్నారు? అని ప్రశ్నిస్తున్నారు. కలిపేముందు మమ్మల్ని అడగనక్కరలేదా? అంతా మీ యిష్టమేనా అని నిలదీస్తున్నారు. సేమ్ యివే ప్రశ్నలు యీ మధ్య సమైక్యవుద్యమకారులు అడిగారు. అప్పుడు వీళ్లు వాళ్లను మందలించారు – 'బోడి మిమ్మల్ని అడిగేది ఏముంది? కేంద్రానికి సర్వాధికారాలు పూజ్య ఆంబేడ్కర్ యిచ్చినవి వున్నాయి. ఆర్టికల్ 3 చదువుకుని రండి. అసెంబ్లీలో తీర్మానం కాదు కదా, చర్చ కూడా చేయరు, రాష్ట్రపతిపాలన విధించి తమకు యిష్టం వచ్చినట్టు చేస్తారు. మీరు చచ్చినట్టు ఆమోదించవలసినదే' అని. ఇప్పుడు కేంద్రం రాయల తెలంగాణ యిదే పద్ధతిలో యిస్తే మరి వీరు ఎలా అభ్యంతర పెట్టగలరు? రాష్ట్రాలు బానిసలు, కేంద్రం చెప్పినట్టు ఆడాల్సిందే అనే సిద్ధాంతాన్ని వ్యాప్తి చేసిన వీరు యీ రోజు దానికి విరుద్ధంగా ఎలా మాట్లాడగలరు?

విభజన ఎలా చేయాలి అన్న విషయంపై సీమాంధ్ర, తెలంగాణ నాయకులను ఒక్కచోట కూర్చోబెట్టి కేంద్రం ఎప్పుడూ మాట్లాడలేదు. తనకు తోచినది తను చేసింది, శభాష్ అన్నారు వీళ్లు. 'యూటీ చేయకుండా ఉమ్మడి రాజధాని చేసే వెసులుబాటు రాజ్యాంగంలో లేదు కదా, అలా ఎలా పెడతారు? అంతకంటె చండీగఢ్ మోడల్లో యుటీ చేసి ఉమ్మడి రాజధాని చేయండి.' అని సీమాంధ్ర నాయకులు కొందరు సూచిస్తే 'అబ్బే కాంగ్రెసు వర్కింగ్ కమిటీ తీర్మానంలో యూటీ లేదు కాబట్టి, దాని మాట ఎత్తడానికి వీల్లేదు. ఆ తీర్మానం శిలాశాసనం' అన్నారు. బొటాబొటీ మెజారిటీతో, ఎదుటివాళ్ల మధ్య తంపులు పెట్టి సర్కారు బండి గెంటుకువస్తూన్న పార్టీ తీర్మానం ఒకటి అఘోరిస్తే అదో పెద్ద శిలాక్షరం, వేదవాక్కు.. బ్రహ్మరాత..తుడిపివేయకూడదంటూ చెప్పారే! ఇప్పుడు అదే పార్టీ రాయల తెలంగాణ అంటే అదీ ఒప్పుకోవాలిగా ! ఇది ఆ తీర్మానంలో లేదే అని ఎత్తి చూపించారు కెసియార్. లేకపోతే యిప్పటికిప్పుడు మారుస్తారు. జులై 30 నాడే తీర్మానాలు చేయాలి, తర్వాత చేయకూడదు అని ఏమైనా చట్టం వుందా? అది శిలాశాసనం అయితే, యిదీ శిలాశాసనమే. అది నీటి మీద రాతయితే, యిదీ నీటిమీద రాతే!

'రాష్ట్రంలో మెజారిటీ ప్రజల అభిప్రాయాన్నే లెక్కలోకి తీసుకుంటే మైనారిటీ ప్రజల ఆకాంక్షలు ఎన్నటికీ నెరవేరవు. అందుకని కేంద్రమే తన చిత్తం వచ్చినట్లు చేయవచ్చు' అంటూ టి–వాదులు యిన్నాళ్లూ వాదించారు. అందుకనే సీమాంధ్రులు గొంతు చించుకున్నా పట్టించుకోకండి అన్నారు. ఇప్పుడు రాయల తెలంగాణ విషయంలో అదే వాదన వాళ్లకు వ్యతిరేకంగా పని చేస్తోంది. 10 జిల్లాలవాళ్లు ఒకవైపు వున్నారు, రాయలసీమ మాకు వద్దు అంటున్నారు. కానీ 2 జిల్లాల వాళ్లు అవతలివైపు వుండి 'కలుస్తాం' అంటున్నారు. టి–వాదుల వాదన ప్రకారం 2 జిల్లాల మాటే నెగ్గాలి. కేంద్రం వాళ్ల గోడే వినాలి. 10 జిల్లాల వాళ్లనీ నోర్ముయ్ అని గదమాయించాలి. ఇప్పుడు అదే జరుగుతున్నట్టుంది.

భద్రాచలాన్ని ఆంధ్రలో కలపాలా, తెలంగాణలో కలపాలా? అన్న చర్చ జరుగుతున్నపుడు 'భద్రాచలం జనాభా తెలంగాణతో కలిసి వుంటామని ఆందోళన చేస్తున్నారు. వారి గోడు వినండి' అని టి–జాక్ నుండి టి–ఉద్యమకారులు అందరూ వాదించారు. 'భద్రాచలం ఒక్కటే ఏమిటి 13 జిల్లాల వాళ్లు తెలంగాణతో కలిసి వుంటామని ఆందోళన చేస్తున్నారు, వారి గోడూ వినండి' అని సమైక్యవాదులు చెపితే అబ్బే అది వినం, యిది మాత్రమే వింటాం అని మొండికేశారు. ఇప్పుడు భద్రాచలం వారిలాగానే కర్నూలు, అనంతపురం జిల్లా నాయకులు తెలంగాణతో కలుస్తాం అంటున్నారు. పంచాయితీ సమితుల వాళ్లు ఉత్తరాలు రాసి యిచ్చారు. భద్రాచలం లాజిక్ యిక్కడా వుపయోగిస్తే వాళ్ల మాటా కాదనకూడదు. కానీ టి–ఉద్యమకారులు కాదంటున్నారు. అంటే ఢిల్లీ వారు తమకు అనుకూలంగా చెప్పినపుడు గొప్పవారు, చెప్పకపోతే సన్నాసులు అన్నమాట. కిరణ్ అధిష్టానాన్ని ఎదిరించినపుడు 'ఎంత తప్పు, హన్నా! అధిష్టానాన్ని ఎదిరిస్తాడా? అతని పదవి పీకేయాలి' అని రంకెలు వేసినవారు యిప్పుడు తామే ఎదురు తిరుగుతున్నారు. గతంలో ఢిల్లీ మౌనంగా వున్నపుడూ వీళ్లు ఎదురు తిరిగారు, పార్లమెంటు ఎదుట ధర్నాలు చేశారు. మధ్యలో తమకు అనుకూలంగా తోచినపుడు మాత్రం ఎదుటివాళ్లకు సుద్దులు చెప్పారు.

రాయల తెలంగాణ ఏర్పాటు చేసే క్రమంలో రాయలసీమను రెండుగా చీల్చడం చాలా దారుణంగా అనిపిస్తుంది. తమను చీల్చమని వాళ్లు అడగలేదు, ఉద్యమాలు చేయలేదు, తెలంగాణ వాళ్లంటే మాకు ప్రేమ వాళ్లతో కలపండి అని అడగలేదు (ఒక్క జెసి

దివాకరరెడ్డి తప్ప). అయినా చీలుస్తున్నారు. సోనియాకు సెంటిమెంట్లు లేవు కాబట్టి అలా చీలుస్తోంది అనుకున్నా కర్నూలు, అనంతపురం జిల్లా పంచాయితీ సమితులు ఉత్తరాలు ఎందుకు యిచ్చినట్లు? అసలు వాళ్లు ఏం రాశారు? 'మా రెండు జిల్లాలను మాత్రమే చేర్చండి, తక్కిన రెండు జిల్లాలను వదిలేయండి' అని రాశారా? అలా వుండి వుండదు. ఈ రెండు జిల్లాలను కలిపితే నీటి సమస్య తీరిపోతుంది కాబట్టి.. అంటున్నారు. ఇది కలిపినా పోతిరెడ్డిపాడు గొడవ అలాగే వుంటుంది. హంద్రీ నీవా, తెలుగుగంగ యిత్యాది ప్రాజెక్టులకు నీటి కొరత తప్పదు. నీటి సమస్య కోసమే అయితే అందువలన ఆ జిల్లాలూ కలపాలి. కానీ కలపటం లేదు. ఎందుకంటే ఆ జిల్లాల నుండి గట్టి ప్రతిపక్ష నాయకులున్నారు. కడప నుండి జగన్, చిత్తూరు నుండి బాబు, ...కిరణ్ కూడా లీడరనుకుంటే, కొత్త పార్టీ పెట్టి ఓట్లు చీలుస్తాడనుకుంటే – ఆయనదీ చిత్తూరే. వాళ్లందరినీ ఆంధ్ర రాష్ట్రానికి పరిమితం చేసి తెలంగాణలో కాంగ్రెసును బలోపేతం చేస్తున్నారని అనుకోవాలి. అంటే దీని అర్థం – తరతరాల బాటు నిలిచిపోయే రాష్ట్రవిభజన యీనాడు వున్న యిద్దరు, ముగ్గురు నాయకుల కారణంగా వక్రంగా, అపసవ్యంగా జరుగుతోందన్నమాట. ఇది రాజకీయమా? రాక్షసీయమా? (స్త్రీపదం ఉద్దేశపూర్వకంగా వాడబడింది)

అయినా ఆ రెండు జిల్లాల వాళ్లూ మాత్రం ఉత్తరాలు ఎందుకు యిచ్చారు? 'హైదరాబాదుతో యథాతథ పరిస్థితి కొనసాగాలనే ఆశతో..' అని చెప్పవచ్చు. హైదరాబాదును విడగొట్టేసి వేరే రాష్ట్రంగా చేస్తున్నాం, వరంగల్లు రాజధానిగా తెలంగాణ రాష్ట్రంలో చేరతారా? అంటే వీళ్లు జారిపోతారు. కాంగ్రెసు పార్టీ 10 జిల్లాల తెలంగాణ అంది కాబట్టి 10 జిల్లాలే యివ్వాలి అని కెసియార్ మరీ పట్టుబడితే ఢిల్లీ వారికి యింకో ఐడియా రావచ్చు. ఈ రెండూ కలిపేసి, హైదరాబాదు, రంగారెడ్డిజిల్లాలు తీసేసి యివ్వవచ్చు. హైదరాబాదు, రంగారెడ్డిని వేరే రాష్ట్రం చేసి, కేంద్రపాలన కింద పెడితే సీమాంధ్ర నాయకుల్లో కొందరు ఖుష్. 'హైదరాబాదుతో కూడిన.. అన్నారు కదా!' అనే కెసియార్ లాజిక్ లాగితే 'కావలిస్తే రాష్ట్రం పేరే హైదరాబాదు అని మార్చేస్తాం, లేదా ఆదిలాబాదు పేరు హైదరాబాదుగా మార్చేస్తాం' అంటారు. ఇదేదో జోక్ అనుకోకండి. దిగ్విజయ్ చెప్పడం లేదా? 'రాయల తెలంగాణ ఏర్పాటు చేస్తాం, కానీ దాన్ని 'తెలంగాణ' అనే పిలుస్తాం' అని! 'ఆర్టికల్ 3 వాళ్ల చేతిలో వుంది. ఏదైనా, ఏమైనా చేయవచ్చు' అని విభజనవాదులకు ప్రత్యేకంగా గుర్తు చేయనక్కరలేదు కదా!

ఇవాళ చూస్తే గోదావరి జిల్లాల వాళ్లు కూడా ఉత్తరాలు యిచ్చారట – గోదావరి–తెలంగాణ ఏర్పాటు చేయాలని. భద్రాచలం మీదుగా తూర్పుగోదావరి జిల్లాకు, అక్కణ్నుంచి పశ్చిమగోదావరి జిల్లాకు లింకు వుంది కాబట్టి, గోదావరి నది తెలంగాణను, గోదావరి జిల్లాలను కలుపుతోంది కాబట్టి యీ ప్రతిపాదనట. ఇన్నాళ్లూ తెలుగువాళ్లందరూ ఒకటే అన్న థీమ్ మీద సాగింది. ఇప్పుడు హైదరాబాదుతో లింకు కోసం 'మనం మనం బరంపురం' (మీది తెనాలి, మాది తెనాలి ఫ్రేజ్‌కు యిది మూలరూపం) అని మొదలుపెట్టారు. జెసి దివాకరరెడ్డి కూడా తెలంగాణతో మా కెంతో అనుబంధం వుంది. వాళ్లకూ బోనాలున్నాయి, మాకూ బోనాలున్నాయి అనసాగారు. ఈ పెద్దమనిషే మొన్నటిదాకా రాష్ట్రం విడిపోతే మమ్మల్ని కర్ణాటకలో కలపండి, మాకు నీటితో సహా అనేక బంధాలు, అనుబంధాలు వున్నాయి అంటూ వచ్చారు. కలుపుకుందామంటే ఎన్ని చుట్టరికాలైనా గుర్తుకు వస్తాయి. వీరిని కలుపుకోవడం యిష్టం లేని తెలంగాణ నాయకులకు యిలాటివేవీ గుర్తుకు రావడం లేదు. 'అడ్డపంచె గాళ్లు, హంతకులు, కబ్జాకోరులు' అంటున్నారు. జెసి వెంటనే 'అబ్బే మేం కత్తులు, కఠార్లు వదిలేశాం, ఆ సంస్కృతి అంతా కృష్ణా, గుంటూర్లకు వెళ్లిపోయింది. ఇంకా కాస్త మిగిలినది కడప వాళ్ల దగ్గరుంది. ఇప్పుడు మనం మనం ఒకటే, ఆ కోస్తా వాళ్లే వేరు' అంటున్నారు.

వింటూంటే ఎంత నీచంగా వుందో మాటల్లో రాయలేం. ఎందుకీ దేబిరింపు? మొన్నటిదాకా అనంతపురం నాయకులు తెలంగాణవాళ్లపై ఎటువంటి మాటలు ప్రయోగించారు? తెలంగాణవాళ్లు అప్పుడూ యిప్పుడు ఎప్పుడూ రాయలసీమ వాళ్లని తిడుతూ, అసలు వాళ్లు వచ్చాకనే తెలంగాణలో కబ్జాలు ప్రారంభమయ్యాయని, మతకలహాలు వచ్చిపడ్డాయని, వాళ్లను దోచుకున్న ముఖ్యమంత్రులందరూ రాయలసీమ వాళ్లేననీ అంటూ వచ్చారు. రాష్ట్రసమైక్యత కోసం అన్ని మాటలు పడినా అదొక అందం, ఆదర్శం. కానీ రాయలసీమలోని తక్కిన రెండు జిల్లాలను కుప్పమీద పడేసి రాయల తెలంగాణ కోసం తపించడం వెనకు స్వార్థం తప్ప వేరే ఏమీ కనబడటం లేదు. ఆ స్వార్థం కూడా తన ప్రాంతప్రజలు బాగు పడతారని కాదు, తన బస్సు వ్యాపారం బాగుండాలని! అది కూడా ఎంత లక్షణంగా సాగుతోందో మొన్నటి వోల్వో వ్యవహారం చాటి చెపుతోంది. జెసి మాట సరే, సమైక్య ఉద్యమం తీవ్రంగా జరిగిన అనంతపురం, కర్నూలు జిల్లాల ప్రజల్లో తిరుగుబాటు ఎందుకు రావడం లేదు? అని అడుగుతున్నారు. ఇప్పుడే పుకార్లని నమ్మి స్పందించడం ఎందుకని ఆగివుండవచ్చు. రెండు నెలలపాటు ఉద్యమం చేసి తడాఖా చూపించారు. ఇప్పుడు ఫైనల్‌గా బిల్లులో రాయల తెలంగాణ వుంటుందో లేదో తెలియనప్పుడు మళ్లీ సమ్మెలెందుకు? బిల్లు వచ్చాక ఏకంగా మళ్లీ మొదలెడదాం అనుకుని వుండవచ్చు.

ఇంకోలా ఆలోచిస్తే తెలంగాణతో కలవడానికి వాళ్ల లాజిక్ వాళ్లకుండవచ్చు. సీమాంధ్రకు రాజధానిగా కర్నూలు ఎంపిక అవుతుందో లేదో తెలియదు. విజయవాడ, వైజాగ్, ఒంగోలు, తిరుపతి.. యిలా నాలుగైదు ఆప్షన్లలో కర్నూలు కూడా ఒకటి. రాజధాని ఎలాగూ రానపుడు ప్రస్తుతం వున్న రాజధానితో అంటకాగితే సరిపోతుంది కదా. ఏ వైజాగో రాజధాని అయితే దాని కంటె హైదరాబాదే దగ్గర కదా. విజయవాడ, గుంటూరు వాళ్లతో పోటీ పడడం కంటె తెలంగాణలో యిప్పటికే అలవాటైన చోట నెగ్గుకురావడం సులభం కదా. మెహబూబ్ నగర్‌లో అనేక వ్యాపారాలు కర్నూలు వాళ్లవేనట. కొత్త రాజధానికి డబ్బులు యిస్తారో లేదో తెలియదు. చేతిలో వున్నది

వదులుకుని కేంద్రం హామీలు నమ్మి మోసపోవడం దేనికి? అనుకోవచ్చు. పైగా నీళ్లు రావన్న భయం లేదు. తెలంగాణ వాళ్లు తమకు చచ్చినట్టు నీళ్లు యివ్వాల్సిందే!

వీళ్ల లాజిక్ యిలా వుందని కెసియార్‌కూ తెలుసు. అందుకనే ఆయన రాయల తెలంగాణకు ససేమిరా అంటున్నాడు. 'వాళ్లను మాతో కలుపుకుంటే ఆ జిల్లాలలో కట్టిన ప్రాజెక్టులను మేం చట్టబద్ధం చేయాల్సి వుంటుంది. అలా చేయడానికి మేమేమైనా పిచ్చివాళ్లమా?' అని అడిగాడాయన. అంటే రాయలతెలంగాణ కాకుండా మామూలు తెలంగాణ ఏర్పడితే నీళ్లు ఆపడం తథ్యం అని అర్థమవుతోంది. అంతేకాదు, పోలవరం ముంపు గ్రామాలను కూడా తెలంగాణకు యిచ్చేస్తోంది మంత్రుల ముఠా. పోలవరం ఆపాలన్న తమ డిమాండ్ నెగ్గించుకోవడానికి అక్కడ పునరావాస చర్యలు ప్రారంభించకుండా చూడవచ్చు కెసియార్. అది కట్టే బాధ్యత నాది అని కేంద్రం అంటోంది. వచ్చే ప్రభుత్వం ఏమంటుందో తెలియదు. కేంద్రం పట్టుబట్టినా తెలంగాణ రాష్ట్రం అడ్డుకొట్టవచ్చు. ఒడిశాలాగే ఆ గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ జరగకుండా చూడవచ్చు. శాంతిభద్రతలు స్టేట్ సబ్జక్ట్ కాబట్టి కేంద్రం ఏమీ చేయలేదు. హైదరాబాదు వరకు అధికారాలు గవర్నరు చేతిలో వుంటాయి కానీ జిల్లాలలో అధికారాలు తెలంగాణ ప్రభుత్వానివే.

కెసియార్ మాట్లాడిన విధానం చూస్తే ఆయన పొరుగు రాష్ట్రమైన ఆంధ్రతో సఖ్యంగా వుండే లక్షణాలు ఏమీ చూపటం లేదు. 'రాయలసీమ రెండు జిల్లాలు అంటగట్టినా అసెంబ్లీలో ఓ తీర్మానం చేసి వదిలించేసుకుంటాం' అంటున్నారాయన. అంత సులభమా? అలా అయితే తమకు ఓట్లేయని జిల్లాలన్నిటినీ అసెంబ్లీ తీర్మానాలతో వదిలించేసుకుంటే ఏ పార్టీ కూడా ఎన్నికలలో ఓడిపోదు. హరీష్‌రావుగారు అసెంబ్లీ తీర్మానం అనటం లేదు కానీ, 13 జిల్లాల జిడ్డు వదిలించుకున్నవాళ్లం 2 జిల్లాలను వదిలించుకోలేక పోతామా? అని ధైర్యంగా అన్నారు. అంటే వాళ్లకు నీళ్లు, నిధులు యివ్వకుండా ఎండగడతారా? అప్పుడు వాళ్లంతట వాళ్లే గోల పెట్టి బయటకు పోతాం అంటారా? అలా అనిపించి అప్పుడు ఆ రెండు జిల్లాలతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలని అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం పాస్ చేసి పంపినా కేంద్రం కదలకపోతే వీళ్లు ఏమీ చేయలేరు. విదర్భ బిల్లు, యుపి బిల్లు పాస్ అయి పార్లమెంటులో మగ్గుతున్నాయి. అందుచేత వదిలించుకోవడం వీళ్లు అనేటంత సులభం ఏమీ కాదు. ఇలా యీసడింపుగా మాట్లాడి రాయలసీమ వాళ్లను మరింత రెచ్చగొట్టి సమైక్యం వైపు నిలిచేట్లా చేయడం తప్ప కెసియార్, హరీష్ వీటితో సాధించేది ఏమీ లేదు.

రాయల తెలంగాణ అనే ఆలోచనను కెసియార్ వ్యతిరేకించడం సహజం. తన బలాన్ని ఎదుటివాళ్లు దెబ్బ కొడుతూ వుంటే చూస్తూ కూర్చోరు కదా. అలా చేయకపోతే తెలంగాణ రాదు సుమా అంటే ఏమంటారో చూడాలి. లింకేమిటి అంటే పార్లమెంటులో బిల్లు పాస్ అవాలంటే అసెంబ్లీలో ఏకాభిప్రాయ తీర్మానం  టెక్నికల్‌గా అక్కరలేదు కానీ మోరల్‌గా కావాలి. అసెంబ్లీ వద్దుకాక వద్దు అని పాస్ చేసిన బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడితే అనేక ప్రశ్నలు వస్తాయి. రాష్ట్రపతి కూడా గుడ్డిగా సంతకం పెట్టలేరు. అందువలన అసెంబ్లీలో మెజారిటీ సంపాదించేందుకు చూస్తున్నారు. దానికోసం రాయలసీమ వాళ్లను కలుపుకుంటున్నారు. రాయల తెలంగాణ అయితే బిల్లు ఆల్మోస్ట్ పాసయిపోతుందని కాంగ్రెసు ధీమా. అప్పుడు పార్లమెంటులో బిల్లుకు దారి సుగమం అవుతుంది. కానీ పార్లమెంటు సభ్యులు కూడా అనేక ప్రశ్నలు వేస్తారు – ఎవరూ అడగని రాయల తెలంగాణ ఎందుకు యిస్తున్నారు? అని. 'బయటకు చెప్పకపోయినా మా దగ్గర చెపుతూ వచ్చార'ని మంత్రుల ముఠా అంటారు.

మన తెలుగువాళ్లకు రాయల.. ఐడియా చాలా ఔట్‌రేజియస్‌గా వుంది కానీ కాంగ్రెసు అధిష్టానం మెదడులో యిది ఎప్పటినుండో మెదలుతూనే వుంది. అసలు యీ సూచన మజ్లిస్ నుండి వచ్చింది. ఫన్నీగా వుంది అనుకున్నాను. కానీ జస్టిస్ శ్రీక ృష్ణ అలా అనుకోలేదు. దాన్ని కూడా ఆరిటిలో ఒక ఆప్షన్‌గా తీసుకుని చర్చించారు. ఎందుకంటే పైనున్న కాంగ్రెసు వాళ్లకూ అది నచ్చింది కాబట్టి! ఆ తర్వాత అందరం మర్చిపోయాం కానీ మధ్యమధ్యలో ఫీలర్లు వదులుతూనే వచ్చారు. జులై 30 తర్వాత కూడా దాని గురించి దిగ్విజయ్ మాట్లాడారు. ఆ ఫైలు క్లోజ్ చేయలేదన్నట్టు చెప్పారు. మంత్రుల ముఠా వద్దకు మొర వినిపించుకోవడానికి వెళ్లిన కాంగ్రెసు నాయకుల వద్ద, అఖిలపక్షం సందర్భంగా వెళ్లిన యితర పార్టీ నాయకుల వద్ద 'నువ్వు చెప్పినది సరే కానీ, రాయల తెలంగాణ గురించి నీ అభిప్రాయం ఏమిటి?' అని అడుగుతూ వచ్చారు. దాని గురించి ఏమీ ఆలోచించని మనవాళ్లు తెల్లమొహం వేసి, 'అదెందుకు?' అనేసి వచ్చేశారు. అధిష్టానం మెదళ్లలో ఆ రాయల–టి పురుగు దొలుస్తూనే వుంది. దాని గురించి సైలెంటుగా వర్క్ చేస్తూనే వున్నారు. ఇప్పుడు బయటపెడుతున్నారు. ఈవాళ్టి ఆంధ్రజ్యోతి ఆ ప్రతిపాదనపై పునరాలోచించే అవకాశం వుందని రాసింది. అంతిమంగా ఏమవుతుందో తెలియదు కానీ, అంత సులభంగా వెనక్కి తీసుకునే మాటయితే అలా ప్రతిపాదించి, భంగపడేదే కాదు. రాయల తెలంగాణ ఎందుకు అవసరమో వాళ్లు ఏ జైరాం రమేషో యిప్పటికే పెద్ద నోట్ తయారు చేసి వుంటారు.

దీనివలన రేసులోంచి కర్నూలు తప్పుకుంటుంది కాబట్టి ఆంధ్ర రాజధాని సమస్య తీరుతుంది అన్నది వాళ్లు చెప్పే ఓ పాయింటు. అది పోయినా వైజాగ్, విజయవాడ, ఒంగోలు, గుంటూరు మధ్య పోటీలు తప్పవు కదా! అన్ని ప్రాంతాలకూ అనువుగా రాష్ట్రం మధ్యలో రాజధాని వుండాలి కాబట్టి... అంటూ యిన్నాళ్లూ విజయవాడ.. ఒంగోలు మధ్య వూళ్లవాళ్లు వాదిస్తూ వచ్చారు. మొన్న బైరెడ్డి రాజశేఖరరెడ్డి ఆ పాయింటు కొట్టి పారేశారు. ఏ రాష్ట్రానికి రాజధాని మధ్యలో వుంది చెప్పండి – బొంబాయా? కలకత్తాయా? మద్రాసా? అంటూ లిస్టు చదివారు. నిజమేననిపించింది. ఇలా ఆలోచిస్తే శ్రీకాకుళం వాళ్లూ, తిరుపతివాళ్లూ కూడా 'మేమూ వున్నాం లిస్టులో' అంటూ బయలుదేరవచ్చు. రాజధాని ఎక్కడ పెట్టాలో తేల్చడానికి నిపుణుల కమిటీ వేస్తామని మంత్రుల ముఠా అంటోంది. రాజధానికై భారీ ప్యాకేజీ కూడా యిస్తామని చెప్తున్నారు. అసలు రాజధాని ఎక్కడో తెలిస్తే అక్కడి భూమి సేకరణకు ఎంతవుతుందో

తెలుస్తుంది, అప్పుడు ప్యాకేజీ ఎంత యివ్వాలో తేలుతుంది. దానిలో ఎంత విదిలిస్తారో ఏమో రాబోయే ప్రభుత్వం చూసుకోవాలి. వీళ్లకు ఏ బాధ్యతా లేదు. ఇలాటి హామీని నమ్ముకుని సీమాంధ్రులు విభజనకు ఒప్పుకోవాలిట! వహ్వా!!

నీటి సమస్యకు యిది పరిష్కారం అని అంటున్నారు కానీ, కడప, చిత్తూరుల సమస్య తీరదు. కెసియార్ ధోరణి చూశాం కదా. రాయలసీమలో ఏ జిల్లాకు నీరు వదిలినా ప్రతిఘటించేట్లు వున్నారు. పోలవరాన్ని కట్టనిచ్చేట్టు లేరు. అన్నదమ్ముల్లా విడిపోదాం అంటూనే యిలాటి బెదిరింపులు వస్తూ వుంటే విభజనకు ఎందుకు ఒప్పుకుంటారు? ఒప్పుకుంటారు – అసెంబ్లీని సగానికి చీలిస్తే అని ఢిల్లీ హై కమాండ్ అంచనా. జగన్ దేశమంతా తిరిగి యితర పార్టీ నాయకులను కలిసి కేంద్రానికి అపరిమిత అధికారాలు యిచ్చేస్తున్నారు, చూసుకోండి అని అడలగొట్టి వచ్చాడు. 371 (డి), ఉమ్మడి రాజధాని యిలా అనేక అడ్డంకులు వున్నా రాజ్యాంగ సవరణకు అందర్నీ ఒప్పించడం పోయి, ఏదో ఒక దొడ్డిదారి వెతికి పని కానిచ్చేద్దామని చూస్తోంది అని వాళ్లను సెన్సిటైజ్ చేసి వచ్చాడు. తెలంగాణ మాట ఎలా వున్నా, యిలా అడ్డదార్లు అనుమతిస్తే రేపు బిజెపి ఆర్టికల్ 370 ను కూడా సింపుల్ మెజారిటీతో మార్చేసి కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి వూడగొట్టేస్తుందని భయపడసాగారు వాళ్లు. అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం రాకపోతే పార్లమెంటులో బిల్లు అడ్డుకుందామని అనుకుంటున్నారేమోనన్న భయం వేసి విఎచ్ జగన్ వెళ్లిన చోటికి వెళ్లి అబ్బెబ్బే జగన్ మాటలు వినకండి అని చెప్పివచ్చారు.

అసెంబ్లీలో బిల్లును ఓడించి తీరతామని ప్రతిన బట్టిన కిరణ్‌ను అదుపు చేయలేక హై కమాండ్, అసెంబ్లీలో మెజారిటీ తయారు చేయడానికై కాంగ్రెసు రాయల తెలంగాణ తెచ్చిందని జాతీయ ఛానెళ్లు చెపుతున్నాయి. కావచ్చు. కానీ ఆ ప్రకటన సరిగ్గా విఎచ్ బస్సు యాత్ర మొదలుపెట్టిన టైముకే వెలువడింది. తెలంగాణ యిచ్చిన సోనియాను దేవతగా కీర్తిస్తూ తెలంగాణ అంతా ప్రచారం చేయండి, పొండి అని దిగ్విజయ్ సింగ్ టి-కాంగ్రెసు నాయకులను తోస్తున్నారు. వాళ్లు ఒకటి రెండు మీటింగులు జరిపి కాళ్లు జాపేశారు. వీళ్లతో కాదు, చూడండి నా తడాఖా అంటూ విఎచ్ బస్సేసుకుని బయలుదేరారు. సరిగ్గా రాయల తెలంగాణ గొడవ వచ్చింది. వెళ్లి సోనియా ఏమైనా చెప్పబోతే 'అంత మంచిదైతే తెలంగాణ యివ్వాలి కానీ రాయల తెలంగాణ ఫిటింగ్ పెట్టిందేం?' అని జనాలు అడుగుతారు. ఈయన దగ్గర సమాధానం ఏముంది?

ఈ రాయల తెలంగాణ ప్రతిపాదన వేరే ఎవరి దగ్గర్నుంచి వచ్చినా ఎలా వుండేదో కానీ, మజ్లిస్ నుండి రావడంతో అందరికీ మంటగా వుంది. మజ్లిస్ తన రాజకీయప్రయోజనాల కోసం చెపితే, దాన్ని గులాం నబీ ఆజాద్ పట్టుకుని వేళ్లాడి సోనియాకు చెప్పి ఒప్పించారు. మైనారిటీలు కాంగ్రెసుకు ఓటేస్తారని,  తెలంగాణలో రాబోయే ప్రభుత్వానికి మజ్లిస్ మద్దతు అవసరం కాబట్టి దీనికి ఒప్పుకోండి అని ఆజాద్ చెప్పి వుంటారు. సీమాంధ్ర మంత్రులు సమైక్యం.. పదేళ్ల యూటీ.. ఐదేళ్ల యూటీ.. పోనీ మూడేళ్ల యూటీ.. అంటూ ఎన్ని మెట్లు దిగినా, మజ్లిస్ యూటీకి ససేమిరా అంది కాబట్టి ఆ ఆలోచనను కొట్టి పారేశారు. అంతా మజ్లిస్ చెప్పినట్టే సాగుతోంది. తెలంగాణ ఏర్పడితే బిజెపి బలపడుతుంది కాబట్టి అది కౌంటర్ చేయడానికి మజ్లిస్‌ను దువ్వాలనే ఐడియాతో అది చెప్పినట్లా ఆడితే మిగతా పార్టీలకు ఎలా వుంటుందో కాంగ్రెసు ఆలోచిస్తోందా? గతంలో మజ్లిస్ వాళ్లు ప్రభుత్వోద్యోగులను పట్టుకుని తన్నినా వైయస్ అదుపు చేయలేదు. కిరణ్ వచ్చాకనే వాళ్లకు ముకుతాడు పడింది. ఇప్పుడు విభజన తర్వాత శాంతిభద్రతలు కేంద్రం చేతిలో వుండబోతున్నాయి. మజ్లిస్ వాళ్లు మళ్లీ హైదరాబాదులో వాళ్ల ఆగడాలు మొదలెడితే, వాళ్లను తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఏమీ చేయజాలదు. వెళ్లి కేంద్రానికి చెప్పుకోవాలి. అది మజ్లిస్ మద్దతుపై ఆధారపడిన ప్రభుత్వమైతే ఏ చర్యా వుండదు.

ఏ రాష్ట్రప్రభుత్వానికీ లేని దుస్థితి తెలంగాణ రాష్ట్రానికి పట్టబోతోంది. ఆత్మగౌరవం కోసం ఉద్యమం నడిపాం అని చెప్పుకుంటూ యిలాటి షరతులకు లోబడడం ఎలాటి ఆత్మగౌరవ రక్షణో టి-ఉద్యమకారులే చెప్పాలి. మాట్లాడితే యిది సీమాంధ్రుల కుట్ర అంటారు. అది తప్ప నోట యింకో మాట రాదు. ప్రత్యేక రాష్ట్రం వస్తే చాలు, ఎలాటి నిబంధనలు పెట్టినా ఒప్పుకుందాం అని వీళ్లు ప్రజలకు ఏ విధంగా కన్విన్స్ చేయగలరో నాకు అర్థం కాదు. శాంతి భద్రతలు, రెవెన్యూ కేంద్రానికి అప్పగించి కూర్చున్నారు. ఇప్పుడు మంత్రుల ముఠా సూచన ప్రకారం నదీజలాలన్నీ కూడా వారి పర్యవేక్షణలోకే వెళ్లిపోతాయి. ఇరు రాష్ట్రాలు కూర్చుని మాట్లాడుకుని ఒక ఒప్పందానికి రావడానికి రెండేళ్లు గడువు యిస్తారట. ఆ తర్వాత ఓ బోర్డు ఏర్పాటు చేసి దాన్ని వాళ్ల అధీనంలోకి తీసుకుంటారట. అంతా వాళ్లే చేస్తారట, వాళ్లు చెప్పినదే జరుగుతుందట. రెండు రాష్ట్రాలూ చూస్తూ కూర్చోవాలి. తెలంగాణ ఉద్యమం నడిచిన పుష్కరకాలంలో ఏ నాడైనా యిరు ప్రాంతాల వారిని ఒక్క దగ్గర కూర్చోబెట్టి మాట్లాడించే ప్రయత్నం చేయని కాంగ్రెసు ప్రభుత్వం, చర్చలే జరపకుండా ముందే నిర్ణయం తీసేసుకుని వివాదాలు సృష్టించిన కాంగ్రెసు ప్రభుత్వం, పుకార్లతో, లీకులతో యిరు ప్రాంతాల వారి మధ్య ద్వేషాగ్ని రగిల్చిన యీ ప్రభుత్వం యిద్దరూ కూర్చుని సామరస్యంగా సమస్య పరిష్కరించుకుంటారని ఎలా అనుకుంటుంది? రెండేళ్ల గడువు కూడా దండగ. ఇవాళే బోర్డు ఏర్పరచి అంథా వాళ్ల చేతిలో తీసుకోమనండి.

నిజానికి దేశంలో ఏ రెండు రాష్ట్రాలూ యింత దిక్కుమాలిన పరిస్థితిలో లేవు. నదీజలాలపై హక్కు కోల్పోయి, కేంద్రం ఎలా చెపితే అలా తలాడించే దుస్థితిలో లేవు. ఎందుకంటే కేంద్రం నిష్పక్షపాతంగా వ్యవహరిస్తుందన్న నమ్మకం లేదు. దేవెగౌడ తను ప్రధానిగా వుండగా ఆల్మట్టి మొదలెట్టించారని గుర్తు పెట్టుకుంటే చాలు. 'మీరు ఏం చేసినా మేం పడి వుంటాం' అని సంతకం పెట్టి యివ్వబోతున్నారు మన తెలుగు నాయకులు. ఎందుకురా అంటే కొత్త రాష్ట్రం కోసం! కొందరికి కొన్ని కొత్త పదవులకోసం! నిజానికి యుపి, బిహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల ప్రజలు మనకంటె అనేక విషయాల్లో వెనుకబడి వున్నారు. వాళ్లు విభజన విషయంలో నాగరీకత ప్రదర్శించి

వారిలో వారు చర్చించుకుని ఏకగ్రీవ అభిప్రాయానికి వచ్చారు. మనం అనాగరికంగా ఒకరినొకరం రాక్షసులని నిందించుకుని, వెళ్లి ఢిల్లీ ముందు సాగిలబడుతున్నాం. స్వతహాగా రావల్సిన హక్కులన్నీ క్షవరం చేసుకుని యిలాటి రాష్ట్రం తెచ్చుకుంటే ఎంత, తెచ్చుకోకపోతే ఎంత! మనకు స్వాతంత్ర్యం వచ్చినపుడు అప్పటి కమ్యూనిస్టు పార్టీ అధినేత బిటి రణదివే ఒక ప్రకటన యిచ్చాడు – చివర్లో ..యిది అర్ధబానిసత్వం అన్నాడు. ఇది పూర్తి బానిసత్వమే.

ఇన్నిటికి రాజీపడినా తెలంగాణ బిల్లు గట్టెక్కుతుందా అంటే సందేహమే. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో వచ్చి తీరుతుంది అని జయపాల్ గారు బల్లగుద్ది మరీ చెప్పారు. చూడబోతే అజెండాలో లేనేలేదు. డిసెంబరు 9న తెలంగాణ ఏర్పడుతుందన్న మాట వట్టిపోయింది. అసలు యీ సమావేశాల్లో తెలంగాణ బిల్లు రావడం దాదాపు అసాధ్యం అంటున్నారు. సెషన్ పొడిగించండి అని బిజెపి అంటే దక్షిణాది ఎంపీలు, ఈశాన్యరాష్ట్ర ఎంపీలు క్రిస్మస్ రోజుల్లో పెడితే ఒప్పుకుంటారో లేదో వాళ్లను అడిగి చెప్తాం అన్నారు కమల్ నాథ్. ఈ లోపున అసెంబ్లీలో ఎన్ని విన్యాసాలు జరుగుతాయో, ఎన్ని సవరణలు ప్రతిపాదిస్తారో చూడాలి. 2014 ఫిబ్రవరిలోలో ప్రత్యేక సెషన్ పెట్టి యీ బిల్లు క్లియర్ చేస్తారనే మాట ఒకటి కొత్తగా వినబడుతోంది. ఈ సెషన్ 5 నుండి 20 వరకు 16 రోజులుంటే దానిలో 4 రోజులు సెలవులు. 38 బిల్లులు పాసు కావాలిట. వాటిలో వివాదాస్పదమైనవి కూడా వున్నాయి. మహిళా రిజర్వేషన్, లోకపాల్ వంటివి..!

బొగ్గు కుంభకోణం, తేజ్‌పాల్ స్కాండల్.. యిలాటి వాటిపై బిజెపి కనీసం రెండు మూడు రోజులు ఆగమాగం చేయకమానదు. మధ్యలోనే అసెంబ్లీ ఫలితాలు వస్తాయి. 5 రాష్ట్రాలలో ప్రస్తుతం మూడిటిలో అధికారంలో వున్న కాంగ్రెసు రెండిటిలో నిలబెట్టుకుంటే గొప్ప. రాజస్థాన్‌లో ఓటమి తప్పదంటున్నారు. ఢిల్లీలో కూడా ఓడిపోతే పరిస్థితి దీనంగా అయిపోతుంది. షీలా దీక్షిత్‌కు వ్యక్తిగతంగా ఎంత మంచిపేరున్నా అధికధరల పాపం ఆమె మోయక తప్పదు. పైగా కామన్‌వెల్త్ స్కాండల్‌లో ఆమె పేరు కూడా బయటకు వచ్చింది. దానిపై చర్యలు ఏం తీసుకున్నారని స.హ.చట్టం కింద సమాచారం అడిగితే ప్రభుత్వం చెప్పటం లేదు – ఆవిడ అవకాశాలు దెబ్బ తింటాయని! తెలంగాణ విషయంలో ఈ రోజు ఎవరి అభిప్రాయాలను లెక్క చేయకుండా బుల్‌డోజర్‌లా దూసుకుపోతున్న కాంగ్రెసుకు ఎన్నికల్లో దెబ్బ తగిలితే, మొహం వేలాడేసి, గుఖ్ఖం దిగక తప్పదు.

బిల్లు ఎప్పుడు పెట్టినా బిజెపి మాటలను పట్టించుకోక తప్పదు. రాయల తెలంగాణ మాట ఎందుకు వచ్చింది అని బిజెపి అడిగితే వీళ్లు ఏం చెప్తారు? మిమ్మల్ని అణచడానికే అని చెప్తారా? 'తెలంగాణ ఎనౌన్సు చేస్తే కెసియార్ ఎగిరివచ్చి మా చెంత వాలతాడని టి-కాంగ్రెస్ నాయకులు చెప్పిన అబద్ధాలు విని మోసపోయాం, విలీనం మాట ఎత్తని కెసియార్‌పై కసితో యీ ప్రతిపాదన తెచ్చాం' అని చెప్తారా? బిజెపి అమెండ్‌మెంట్స్ ప్రతిపాదించి, బిల్లును అందరికీ ఆమోదయోగ్యంగా చేసి తెలంగాణ యిచ్చిన క్రెడిట్ కాంగ్రెసుకు దక్కేట్లు చేస్తుందా? నా ఉద్దేశం – 'మీకు ఏదీ సజావుగా చేయడం రాదు, అసెంబ్లీ ఎన్నికలలో కూడా ఓడిపోతున్న మీకు పాలించే అధికారం లేదు. మీరు దిగిపోండి. మేం అధికారంలోకి వచ్చి యిరుప్రాంతాల వారినీ మెప్పించేట్లా బిల్లు తయారుచేసి చూపిస్తాం' అని ఛాలెంజ్ చేస్తారు. గతంలో మూడు రాష్ట్రాల విషయంలో అసెంబ్లీలో బిల్లు తీర్మానం పాస్ అయి వచ్చాక వాజపేయి ప్రభుత్వం పడిపోయింది. కొన్నేళ్లకు మళ్లీ తీర్మానం పాస్ చేయించుకుని తెప్పించి అప్పుడు పాస్ చేసి, విభజన చేశారు. ఆ విషయం గుర్తు చేసి మేం మాట యిస్తే ఎప్పటికైనా నెరవేరుస్తాం, మీలా కాదు అంటూ గొప్ప చెప్పుకుంటారు. కాంగ్రెసు వాళ్లు అదే అదనని 'మేం తెలంగాణకు కట్టుబడి వున్నాం, సకలయత్నాలు చేశాం, కానీ బిజెపి సహకరించలేదు, భారీ మెజారిటీతో మళ్లీ ఎన్నుకుంటే యీసారి తెలంగాణ ఖాయం' అన్న నినాదంతో ఎన్నికలకు వెళ్లవచ్చు.

2014 ఎన్నికల లోపున తెలంగాణ బిల్లు పాస్ కాలేదనుకోండి, అప్పుడేం జరుగుతుంది? కాంగ్రెసో, బిజెపియో అధికారంలోకి వచ్చి మళ్లీ ప్రయత్నాలు మొదలుపెడుతుంది. కానీ అప్పుడూ యివే సమస్యలు కదా! మరి వీటికి పరిష్కారం ఏమిటి? సమస్యను వాయిదా వేయడం వలన లాభం ఏమిటి? పరిష్కారం ఢిల్లీలో లేదు. మనలోనే వుంది. విభజనవాదులు తమ సర్వకష్టాలకు ఆంధ్రులను తిట్టడం మానేసి వారితో కూర్చుని సంభాషణ ప్రారంభించాలి. జులై 30 తర్వాత జయపాల్ రెడ్డిగారు ఆ పని చేస్తానని మాట యిచ్చారు, మళ్లీ మర్చిపోయారు. ఢిల్లీ వాళ్లు తన మాటే వింటున్నారు కదా, యీ కోన్‌కిస్కాయ్‌లతో మాట్లాడేది ఏముంది అనుకున్నారేమో. రాయల తెలంగాణ అనగానే ఆయనా ఉలిక్కిపడ్డారు. ఆంక్షలు లేని హైదరాబాదు నుండి 'పరిమిత ఆంక్షల' స్థితికి దిగారు. ఢిల్లీ వాళ్లను దేబిరిస్తే ఏమొస్తోంది? అన్ని అధికారాలూ వాళ్ల చేతిలోకి వెళుతున్నాయి. వాళ్లు చూస్తే – వాళ్ల మాటమీద వాళ్లే నిలబడరు. రాష్ట్రాల పేర్లు మార్చేస్తారు, బిల్లు పేరు మార్చేస్తారు. హైదరాబాదులో వున్న హైకోర్టు ఆంధ్ర హైకోర్టు అవుతుందిట, తెలంగాణ హైకోర్టు ఎక్కడ పెడతారో తర్వాత చెప్తారట. ఇవాళ రాయల తెలంగాణ అంటారు, రేపు మరొకటి అంటారు. ఇవాళ యింత హంగామా చేసినదాకా వుండి రేపు అంతా తూచ్ అన్నా అనవచ్చు. ఏం చేసినా మనం శుంఠల్లా చూస్తూ వుండాల్సిందే! **(సమాప్తం)**

**– ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2013)**

**డిసెంబరు 07 వీక్లీకై** **ఎమ్బీయస్ : హైదరాబాదులో సీమాంధ్రుల జనాభా ఎంత?**

మంత్రుల ముఠా ఏం చేస్తోందో చాలా రోజులుగా లీకులు వస్తున్నా, కెసియార్ మౌనం పాటించారు. రాయల తెలంగాణ

విషయం వచ్చినపుడే నోరు విప్పారు – యిది గట్టి ప్రతిపాదన అని మాకు న్యూస్ వచ్చింది అంటూ. పనిలో పనిగా హైదరాబాదుపై ఆంక్షల గురించి కూడా మళ్లీ ఒకసారి నిరసన తెలిపారు. ఆంక్షలు లేని తెలంగాణా కావాలి, 28 రాష్ట్రాలకు లభించిన స్వేచ్ఛ తెలంగాణకూ వుండాలి. వేరేలా చూసినా, చేసినా వూరుకోం అని చెప్తూనే వున్నారు. ఇప్పుడు మళ్లీ చెప్పారు. ఉమ్మడి రాజధాని కాదు, తాత్కాలిక రాజధానే మాకు సమ్మతం అన్నారు. అది కూడా రాత్రికి రాత్రి పొమ్మంటే ఎక్కడకిపోతారు పాపం అని రెండు, మూడేళ్లు తలదాచుకోనిద్దామనే జాలితో సరేనన్నది అని వివరణ యిచ్చారు. నిజానికి శాంతిభద్రతలు రాష్ట్రానికి సంబంధించిన అంశం. దాన్ని కేంద్రం తన చేతిలో తీసుకోవాలని చూడడం దారుణం. ఈ సెషన్‌లో మతహింసనిరోధక బిల్లు ప్రవేశపెడదామని యుపిఏ చూస్తోంది. ఏ రాష్ట్రంలోనైనా మతకలహం జరిగితే రాష్ట్రం పిలవనక్కరలేకుండా కేంద్రం డైరక్టుగా తన బలగాలు దింపేయవచ్చు. ఇలా చేయడం రాష్ట్రాల హక్కులను హరించడమే, మేం ఒప్పుకోం అని అన్ని ప్రతిపక్షాలు ముక్తకంఠంతో అంటున్నాయి. మరి అలాటప్పుడు తెరాస, యితర నాయకులు మాత్రం దానికి ఎందుకు ఒప్పుకుంటారు? కేవలం తమకంటూ ప్రత్యేకరాష్ట్రం యిస్తున్నారన్న కృతజ్ఞతతోనా? ఒప్పుకుంటే తెలంగాణ నాయకులందరూ కలిసి చేస్తున్న పొరబాటు యిది అని ఘంటాపథంగా చెప్పవచ్చు.

రాయల తెలంగాణ గురించి మాట్లాడేటప్పుడే శాంతిభద్రతలు కేంద్రం తన చేతిలో ఎందుకు పెట్టుకోవాలి? అని కెసియార్ ప్రశ్నించారు. కేంద్రం ఏదో ఒక కారణం చెప్పి తీసుకోబోవచ్చు. కారణాలు ఏం చెప్పినా మేం దీనికి సమ్మతించం అని గట్టిగా ప్రతిఘటించాలి. అది మానేసి కెసియార్ గతం తవ్వబోయారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుండి విడిపోయినపుడు మద్రాసులో తెలుగువారు 14 లక్షల మంది వున్నా యిటువంటి రక్షణ గురించి ఆలోచించలేదు కదా, యిప్పుడు హైదరాబాదులో వున్న 5 లక్షల మంది సీమాంధ్ర జనాభా గురించి యింత హంగామా దేనికి? అని అడిగారు. మద్రాసునుండి విడిపోయినపుడు అక్కడ కెసియార్ లేరు. తెలుగువాళ్లను రాక్షసజాతిగా ఎవరూ వర్ణించలేదు. జాగో, భాగో అనలేదు. పండగకి సొంతవూరు వెళితే మళ్లీ రానివ్వం అనలేదు, నాలుకలు కోస్తాం, రక్తపుటేరులు పారిస్తాం వంటి నినాదాలు ఎవరూ యివ్వలేదు. అందుకని రాష్ట్రం విడిపోయినపుడు అటువంటి వూహే ఎవరికీ రాలేదు. మరి యిప్పుడు ఆ పరిస్థితి లేదు కదా! ఈ పరిస్థితుల ఎడ్వాంటేజి తీసుకుని కేంద్రం రెండు రాష్ట్రాలపై పెత్తనం తన చేతిలోకి తీసుకుంటోంది.

ఈ సందర్భంగా కెసియార్ హైదరాబాదులో సీమాంధ్రుల జనాభా 5 లక్షలే అనడం కాస్త వింతగా వుంది. దిక్కుమాలిన కమిటీ అని తను తీసిపారేసిన జస్టిస్ శ్రీకృష్ణ కమిటీ రిపోర్టులోంచి ఆయన వుటంకించారు. అంటే ఆ రిపోర్టును సమర్థించినట్లా? కాదా? దాని సిఫార్సులు అంగీకరించినట్లా? డేటాను అంగీకరించినంత మాత్రాన, కన్‌క్లూజన్స్‌ను అంగీకరించినట్లు కాదని మనందరికీ తెలుసు. మరి ఆ రిపోర్టులోని డేటాను అంగీకరించారనుకోవాలా? దాని ప్రకారం 1956 తర్వాత తెలంగాణలోనే ఎక్కువగా అభివృద్ధి చెందినట్లు వుంది. మళ్లీ అది ఒప్పుకోరు కెసియార్. ఈ ఒక్క అంకె మాత్రమే ఒప్పుకుంటున్నారు, తన వాదనకు అనువుగా వుందని. మళ్లీ అదే నోటితో లక్షమంది సీమాంధ్రులు హైదరాబాదులో అక్రమంగా ఉద్యోగాల్లో వున్నారంటారు. సక్రమంగా వున్నవాళ్లు కూడా అంతో, లేక దానిలో సగమో, ముప్పావో వుంటారనుకుంటే లక్షన్నర నుండి రెండు లక్షల దాకా సీమాంధ్ర ఉద్యోగులే వుంటారు. కుటుంబానికి నలుగురు సభ్యులున్నా ఆరు నుండి ఎనిమిది లక్షలు తేలారు. మరి కర్రీ పాయింటువాళ్లు, రొయ్యలమ్ముకునేవాళ్లు, యిడ్లీ బండి వాళ్లు – వీళ్లంతా కనీసం ఓ లక్ష మందైనా వుండరా? బంజారా హిల్స్, జూబిలీ హిల్స్ నిండా వాళ్లే, ఫిల్మ్ నగర్ నిండా వాళ్లే అని కూడా కెసియార్, ఆయన అనుచరులు తరచుగా అనే మాట. ఉద్యోగులు అక్కడుంటారనుకోం కదా. మరి అక్కడ జనాభా కలపవద్దా? వాళ్లూ, వాళ్ల కుటుంబసభ్యులు.. అందరూ కలిసి ఎంతమంది వుంటారు? మొత్తం 5 లక్షలేమిటి స్వామీ అని డైరక్టుగా అడిగితే కెసియార్ ఏం సమాధానం చెపుతారా అని ఆలోచించాను. 'నేను ఆంధ్రోళ్లలో మనుష్యుల గురించే చెప్పాను. తక్కినవాళ్లందరూ రాక్షసులే. వాళ్లను లెక్కపెట్టలేదు' అని చెప్పవచ్చును.

అసలు మన భారతదేశంలో వాస్తవాలకు, అంకెలకు గౌరవం లేదు. కవుల దగ్గర్నుంచి రాజకీయనాయకుల దాకా అందరూ అతిశయోక్తులు చెప్పేవారే. తెలంగాణ ఉద్యమం ప్రారంభమైన కొత్తల్లో 'ఇది 4 కోట్ల మంది తెలంగాణ ప్రజల ఆకాంక్ష' అనేవారు. ఓ నాలుగేళ్లు పోయేసరికి ఆ జనాభా హఠాత్తుగా అరకోటి పెరిగిపోయింది. నాలుగున్నర కోట్ల మంది ఆకాంక్ష అనసాగారు. నాలుగున్నర కోట్ల మంది తెలంగాణ ప్రజలు మీ చేష్టలను గమనిస్తున్నారు అనసాగారు. నిజానికి తెలంగాణ జనాభా 3.5 కోట్లు. రాయల తెలంగాణ ఏర్పరిస్తే చేరే జనాభా కూడా నాలుగున్నర కోట్లు లేదు. అయినా అందరూ అదే పాట పాడుతున్నారు. ఇప్పుడు 5 లక్షల అంకె కూడా అలాటిదే అనుకోవచ్చా? జస్టిస్ శ్రీకృష్ణ గారు కూడా యిలాటి పొరబాటు చేశారా?

ఆ మాట అనేముందు అసలు ఎవరు సీమాంధ్రులు అన్న నిర్వచనం కావాలి. కెసియార్ దృష్టిలో సీమాంధ్రుడు ఎవడు? జస్టిస్ కృష్ణ దృష్టిలో సీమాంధ్రుడు ఎవడు? అక్కడుంది తిరకాసు. శ్రీకృష్ణగారి సంగతి నేను చెప్పలేను – ఆయన తన రిపోర్టులో నిర్వచనం యివ్వలేదు కాబట్టి! కానీ కెసియార్, తదితర ఉద్యమకారుల దృష్టిలో సీమాంధ్రుడు అన్నవాడెవడో తెలుసు. ఇక్కడే పుట్టి, యిక్కడే చదువుకుని, యిక్కడే ఉద్యోగం చేస్తూ, యిక్కడే శాశ్వతంగా నివసిస్తున్నవాడు కూడా తెలంగాణవాడు కాకుండా పోవచ్చు – అతని తండ్రి లేదా తాత ఆంధ్ర నుండి వచ్చి వుంటే! విభజనను అంగీకరించకపోయినా తెలంగాణవాడు కాదు. అంగీకరిస్తే పదేళ్ల క్రితం వచ్చిన గుజరాతీ అయినా, యిరవై ఏళ్ల క్రితం వచ్చిన మార్వాడీ అయినా స్థానికుడి కిందే లెక్క. ఈ నిర్వచనం పెట్టుకుని తెరాస, టి–జాక్ మాత్రమే కాదు, టి–కాంగ్రెసు, టి–టిడిపి నాయకులు తమకు ప్రత్యర్థులందరినీ తిట్టిపోస్తున్నారు. సీమాంధ్ర

మీడియా అంటారు, సీమాంధ్ర పెట్టుబడిదారులు అంటారు. వాళ్ల దృష్టిలో కిరణ్‌కుమార్ రెడ్డి యిక్కడే పుట్టి, యిక్కడే చదువుకున్నా తెలంగాణ వ్యక్తి కాదు. ఖమ్మం ఎంపీగా వుండిన రేణుకా చౌదరి తెలంగాణ  మహిళ కాదు. నిజామాబాద్‌లో పుట్టి, యిక్కడే పెరిగి, యిక్కడే ఉద్యోగం చేసి, పరిశ్రమ పెట్టి, తెలంగాణ ఉద్యమానికి పూర్తి సహకారం అందించిన ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ తెలంగాణ వ్యక్తి కాదు.

వీళ్లందరినీ కలిపినా యింకా ఐదు లక్షలమంది మాత్రమే అంటే కెసియార్ లెక్కల్లో వీక్ అనే చెప్పాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్**

**డిసెంబరు 08–09 వీక్లీకై** **ఎమ్బీయస్ : రక్షకుడా? తక్షకుడా?**

అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి ఘనవిజయం సాధించబోతోందని, మోదీని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించడం ఎంతో లాభించిందని అనుకుంటున్నారు. మోదీలో ఎన్నయినా సుగుణాలుండవచ్చు కానీ శత్రువులను సహించలేని దుర్గుణం మాత్రం చాలా బలంగా వుందని ప్రదీప్ శర్మ ఉదంతం చెబుతోంది. 2001లో గుజరాత్‌లోని కచ్ జిల్లాలోని భుజ్‌లో భూకంపం వచ్చి సర్వనాశనం అయినపుడు పరిస్థితిని చక్కదిద్దడంలో ఆ జిల్లా కలక్టరుగా ప్రదీప్ శర్మ చేసిన కృషి అమోఘం. రాష్ట్రంలో చెప్పుకోదగ్గ కలక్టర్లలో ఒకడు అని స్వయంగా మోదీ ప్రదీప్‌ను మెచ్చుకున్నాడు. 2009 కల్లా పరిస్థితి మారిపోయింది. అతన్ని ఎలాగైనా కేసుల్లో యిరికించాలని మోదీ, అతని కుడిభుజం అమిత్ షా తెగ ప్రయత్నించారు. ఎందుకు అనేదే ఆసక్తికరమైన కథ.

ఆ కథకు నాయకి మాధురి అనే అమ్మాయి (అసలు పేరు బయటకు చెప్పకుండా మీడియా యీ పేరుని ఉపయోగిస్తోంది). ఆమె ఒక ఆర్కిటెక్ట్. వాళ్ల కుటుంబం భుజ్‌కు చెందినది. 2004లో 27 ఏళ్ల వయసున్న మాధురి ప్రదీప్ వద్దకు వచ్చి ఒక పబ్లిక్ పార్క్‌ను లాండ్‌స్కేపింగ్ చేస్తానంటూ ఒక ప్రణాళిక ముందు పెట్టింది. ప్రదీప్‌కు ఆమె ఐడియా నచ్చింది. సరేనని ఆ పని అప్పగించాడు. 2005లో ఆ పార్కును ఆవిష్కరించడానికి వచ్చిన మోదీకి యీమెను పరిచయం చేశాడు కూడా. ఆమెను చూసి మోదీ ముచ్చటపడ్డాడు. వాళ్లిద్దరి మధ్య స్నేహం పెరిగింది. ఆమె ముఖ్యమంత్రి అఫీషియల్ ఐడీకి యీమెయిల్ పంపితే జవాబు వచ్చేది. అప్పుడప్పుడు ఆమె సెల్‌కు మోదీ సొంత సెల్ నుండి ఎస్సెమ్మెస్‌లు కూడా వచ్చేవి. మాధురి కుటుంబానికి 'ఎకోలిబ్రియమ్' అనే కంపెనీ వుంది. మోదీతో సాన్నిహిత్యం కారణంగా ఆ కంపెనీకి కొన్ని కాంట్రాక్టులు కూడా దక్కాయి. ప్రదీప్‌తో కూడా మాధురి, ఆమె కుటుంబం స్నేహంగానే వుండేది. మాధురి ఒక బెంగుళూరు అబ్బాయిని యిష్టపడి పెళ్లి చేసుకుందామనుకున్నపుడు 'వద్దని మీరైనా నచ్చచెప్పండి' అని ప్రదీప్‌ను మాధురి తలిదండ్రులు కోరారు కూడా.

2008లో ప్రదీప్ భావనగర్‌కు మునిసిపల్ కమిషనర్‌గా పని చేసే రోజుల్లో మాధురి వచ్చి కలిసింది. 'భావనగర్‌కు దగ్గర్లో వున్న అలంగ్‌లో ఉన్న ఒక ప్రాజెక్టుకోసం మోదీ మిమ్మల్ని కలవమన్నారు' అంటూ చెప్పింది. కొన్ని ఎస్సెమ్మెస్‌లు కూడా చూపించింది. మోదీ వ్యక్తిగత సెల్ నెంబరు యిదిగో అంటూ ఒక నెంబరు యిచ్చింది కూడా. దాన్ని యితను సేవ్ చేసుకున్నాడు. ఒక రోజు పొరబాటున దానికి కాల్ చేశాడు. చేయగానే 'అరే యిది ముఖ్యమంత్రిది కదా' అనుకుని కట్ చేశాడు. మోదీ దాన్ని ఆన్సర్ చేయలేదు కానీ, ఎవరు కాల్ చేశారో కనుక్కోమని తన స్టాఫ్‌ను ఆదేశించాడు. వాళ్లు యీ నెంబరు ఫలానా ప్రదీప్ శర్మది అని చెప్పారు. అతనికి తన నెంబరు ఎలా వెళ్లింది? అని ఆలోచించి బహుశా మాధురి యిచ్చి వుంటుంది అని గ్రహించి, వాళ్లిద్దరి మధ్య ఏదో నడుస్తోందేమో, లేకపోతే నా నెంబరు ఎందుకు యిస్తుంది? అని అనుమానించాడు మోదీ. ప్రదీప్‌ను యిరికించాలంటే మాధురితో వ్యవహారం పనికి వస్తుంది అని కూడా అనుకున్నాడు.

ఇరికించడం దేనికి? అప్పటికే అంటే 2009 నాటికి మోదీ ప్రదీప్‌పై మండిపడుతున్నాడు. ఎందుకంటే ప్రదీప్ సోదరుడు కులదీప్ శర్మ ఐపియస్ అధికారి. ఎడిషనల్ డిజిపిగా వున్నాడు. సొహ్రాబుద్దీన్ బూటకపు ఎన్‌కౌంటర్ కేసులో కోర్టుకి మధ్యంతర నివేదిక సమర్పించడానికి చాలా చొరవ తీసుకున్నాడు. (అదే దరిమిలా 2010 అక్టోబరులో అమిత్ షా అరెస్టు కావడానికి దారి తీసింది) 'కులదీప్‌పై కసి తీర్చుకోవాలంటే ప్రదీప్‌ను అప్రతిష్టపాలు చేయాలి. అతనికి మాధురికి మధ్య ఏదో నడుస్తూన్నట్లు వుంది. అది కూపీ లాగి, దాన్ని బయటపెట్టి అల్లరి పెట్టాలి' అని హోం మంత్రిగా పని చేస్తున్న అమిత్ షాకు మోదీ ఆదేశాలిచ్చాడు. ఇక అమిత్ షా అతి వుత్సాహంగా ఆ పనిని ముగ్గురు ఉన్నత పోలీసాధికారులకు అప్పగించాడు. ఒకరు యాంటీ టెర్రరిజం స్క్వాడ్‌లో ఎస్.పి.(ఆపరేషన్స్)గా వున్న జి.ఎల్. సింఘాల్, క్రైమ్ బ్రాంచ్, ఇంటెలిజెన్సు శాఖలకు చెందిన మరో యిద్దరు. వీళ్ల పని ఏమిటంటే మాధురి ఏ క్షణంలో ఎక్కడ వుందో, ఏం చేస్తోందో కనిపెట్టి అమిత్ షాకు ఫోన్‌లో చెప్పడం ! తనను పోలీసులు వెంటాడుతున్న సంగతి మాధురి కూడా గ్రహించి వీళ్లను తప్పించుకోవడానికి అనేక ట్రిక్కులు వేసేది. అవి వీళ్లు అమిత్‌కు చెప్పేవారు. 'ఎలాగైనా వెంటాడండి, వదలకండి, మనకు ఏదో ఒక సాక్ష్యం దొరకాలి' అని అమిత్ యీ అధికారులను ఉత్సాహపరిచేవాడు.

ఇలా నెల్లాళ్లపాటు సాగినా ఫైనల్‌గా ఏమీ దొరకలేదనుకోవాలి. ఇక మాధురి కోణం వదిలిపెట్టి ప్రదీప్‌ను ఏదో ఒక కారణం చెప్పి అరెస్టు చేయడానికి నిశ్చయించుకున్నాడు మోదీ. 2010 జనవరిలో క్రిమినల్ కాన్స్పిరసీ (నేరపూరితమైన కుట్ర), బ్రీచ్ ఆఫ్ ట్రస్ట్ (నమ్మకద్రోహం) అనే ఆరోపణలపై అరెస్టు చేశారు. నోటీసు లేదు, సమన్లు లేవు.  సిటీ ఎస్‌పి ప్రదీప్ యింటికి వెళ్లి జస్ట్ అరెస్టు చేసేశాడు. జైల్లో పెట్టాక 'కలక్టరు హోదాలో అక్రమ భూ కేటాయింపులు చేశార'ంటూ యింకో రెండు కేసుల్లో బుక్ చేశారు.

ప్రదీప్‌ను పోలీసు కస్టడీలోకి తీసుకోగానే అందరికంటె ముందుగా అతన్ని చూడడానికి వచ్చినది – మాధురి తలిదండ్రులు. ఆ విషయం ప్రస్తావించి 'నాకు ఆ అమ్మాయితో అక్రమసంబంధం వుండి వుంటే వాళ్లు వచ్చి పరామర్శించేవారా?' అని జెయిల్లో బయటకు వచ్చిన ప్రదీప్ అడుగుతున్నాడు. తనపై పెట్టిన కేసుల అన్యాయమంటూ అతను సుప్రీం కోర్టును ఆశ్రయించాడు. ప్రశాంత్ భూషణ్ అతని తరఫు న్యాయవాది.

మాధురి విషయంలో అతన్ని యిరికించడానికి చూశారన్న సంగతి మామూలుగా అయితే ఎప్పటికీ బయటకు వచ్చేది కాదు. కానీ అప్పట్లో అమిత్ షాకు సహకరించిన సింఘాల్ దరిమిలా ఇష్రాత్ జహాన్ ఎన్‌కౌంటర్ కేసులో సస్పెండ్ కావడంతో అతను ఎదురు తిరిగి యీ విషయాన్ని బయటపెట్టడంతో అందరికీ తెలిసింది. అతను చాలా తెలివిగా అప్పట్లో అమిత్ షా తనతో మాట్లాడిన సంభాషణలను టేప్ చేసి పెట్టి 267 సంభాషణలను 2013 ఏప్రిల్‌లో సిబిఐకు అప్పగించాడు. వాటిల్లో ఒక దానిలో అమిత్ చెప్పినది అతి ముఖ్యమైనది. మాధురి, ప్రదీప్ కలిసి ఒక ఐస్‌క్రీమ్ పార్లర్‌లో కబుర్లు చెప్పుకుంటున్నారని వినగానే అమిత్ మండిపడ్డాడు – 'ఆ ప్రదీప్‌ను జైలుకి పంపించాలి. వంజారా ఎంతకాలం జైల్లో వున్నాడో, యితను అంతకంటె ఎక్కువకాలం వుండాలి' అని. బూటకపు ఎన్‌కౌంటర్ కేసుల్లో అప్పట్లో డిఐజిగా వున్న వంజారా జైల్లో కూర్చోవలసి వచ్చింది. 'ఆ అమ్మాయి చాలా తెలివైనది. మనం గమనిస్తున్నామని తెలుసుకుని వేర్వేరు వాహనాల్లో తిరుగుతోంది.' అని సింఘాల్ విన్నవించాడు. 'సాహెబ్ ఆదేశాల ప్రకారం యిది చేస్తున్నాం. ఆయన అన్నీ తెలుసుకోదలచారు' అని అమిత్ షా చెప్పడం కూడా టేపుల్లో వినవచ్చు. ఆ సాహెబ్ ఎవరు అన్నదాని గురించి ఎవరికీ సందేహాలు లేవు కానీ మోదీయే కచ్చితంగా చెప్పలేని పరిస్థితి.

ఈ టేపులను కోబ్రాపోస్ట్, గులైల్ అనే వెబ్‌సైట్లు బయటపెట్టడంతో అమిత్ షా, తద్వారా మోదీ యిరకాటంలో పడ్డారు. అమిత్ షా యిప్పుడు బిజెపి జనరల్ సెక్రటరీ. యుపిలో పార్టీ వ్యవహారాల యిన్‌చార్జ్. అమిత్ యిలా యిరుక్కోవడంతో యిక గుజరాత్ బిజెపి నష్టనివారణ చర్యలు మొదలు పెట్టింది. 'నేను మాధురి తండ్రిని. నా భార్య ఆసుపత్రిలో వుండేటప్పుడు, మా అమ్మాయి హొటల్లో వుండేది. అక్కడికి, యిక్కడికి వేళకానివేళల్లో తిరగాల్సి వస్తోంది కాబట్టి కాస్త కనిపెట్టి వుండమని 20 ఏళ్లగా మా కుటుంబస్నేహితుడైన మోదీగార్ని కోరాను. ఆయన దయతో అంగీకరించారు. మా అమ్మాయి కదలికలను పోలీసులను గమనించడంపై నాకెట్టి అభ్యంతరాలు లేవు కాబట్టి యీ వ్యవహారం యింతటితో ముగించాలని కోరుతున్నాను.' అనే లేఖ ఒకటి బిజెపి కార్యాలయం నుండి వెలువడింది.

'అతనెవరో బయటపడకుండా మధ్యలో బిజెపి పార్టీ రంగంలోకి దిగడం ఏమిటి? ఇది 32 ఏళ్ల మహిళ చిన్నాచితకా వయసుది కాదు. ఆమె యిష్టం వచ్చినవాళ్లతో ఆమె స్నేహంగా వుండవచ్చు. అందుకోసం యీ నిఘాలు ఏమిటి? ఇది మహిళల హక్కులకు సంబంధించిన విషయం. ఈ సంగతిపై విచారణ జరుపుతాం.' అని జాతీయ మహిళా కమిషన్‌వారు చొరవ తీసుకున్నారు. 'మాకు లేని అభ్యంతరం మీకెందుకు? మీ విచారణ ఆపేయండి' అంటూ ఆ కమిషన్ ఆఫీసుకి ఉత్తరం వచ్చింది. అది ఎవరూ పట్టుకుని వచ్చి యివ్వలేదు. నవంబరు 19 న ఆఫీసు మూసేసినపుడు వాచ్‌మన్ చేతికి యిచ్చేసి వెళ్లిపోయారు. దానిపై ఆ సదరు తండ్రి పేరు, అడ్రసు, ఫోన్ నెంబరు ఏమీ లేవు. అది నిజమో, బోగస్సో తెలియదు. కానీ దీనివలన ఒకటి మాత్రం నిర్ధారణ అయింది – అమిత్ చెప్పిన ఆ 'సాహెబ్' మోదీయే! అని.

తండ్రి అలా ఉత్తరం రాశాడు కాబట్టి, బాధితురాలైన (?) మహిళ ఫిర్యాదు చేయలేదు కాబట్టి దీనిపై యింకే చర్చా జరగకూడదని బిజెపి నాయకులు వాదిస్తున్నారు. తన కూతురికోసం ఒక తండ్రి పడిన ఆందోళన గమనించి దయార్ద్రహృదయంతో మోదీ పోనీ కదాని రక్షణ కల్పిస్తే దానికి పెడర్థాలు తీయడం తప్పని వాదిస్తున్నారు. 'తండ్రి రక్షణ కోరడం నిజమే అయితే మహా అయితే ఓ కానిస్టేబుల్‌ను వెంట వుండమని పంపిస్తారు కానీ మూడు ముఖ్యమైన శాఖల ఉన్నతాధికారులను యీ పనిపై నియోగించడం వింతగా లేదా? పైగా ఆమె ఏ జిమ్‌కి వెళ్లింది? ఎంతసేపు వుంది? ఆ జిమ్ పేరేమిటి? ఏ షాపింగ్ కాంప్లెక్సులో ఎంతసేపు గడిపింది? ఎవరితో గడిపింది? ఏం కొంది? యివన్నీ రాష్ట్ర హెూం మంత్రి అడిగి తెలుసుకోవడమేమిటి? ఆయనకు వేరే పని లేదా? లేక గుజరాత్‌లో మహిళలకు ఆ పాటి రక్షణ కూడా లేదా? అయినా తండ్రి కోరికపై యీ గూఢచర్యం చేపట్టామని రాష్ట్ర పోలీసు అధికారి ఎవరైనా ఎందుకు కన్‌ఫమ్ చేయడం లేదు? ఏ లిఖిత అభ్యర్థన లేకుండా ప్రభుత్వాధికారుల సేవలను యిలా వినియోగించడం ఏ మేరకు సబబు?' అని ప్రశ్నలు గుప్పిస్తూ వుంటే బిజెపి సమాధానాలు చెప్పలేక తబ్బిబ్బవుతోంది. లోకంలో అనేక విషయాలపై మాట్లాడే మోదీ దీని గురించి ఏమీ మాట్లాడడం లేదు, అమిత్ షా కూడా మౌనాన్నే ఆశ్రయించాడు.

గుజరాతీ సమాజంలో మహిళలకు సాధారణంగానే భద్రత ఎక్కువ. రాత్రుళ్లు కూడా స్వేచ్ఛగా తిరగగలుగుతారు. ఈ మాధురి కూడా మరీ చిన్నపిల్లేమీ కాదు. అప్పటికే 32 ఏళ్లు. సొంతంగా ప్రాజెక్టులు చేపట్టి నిర్వహించే శక్తి గల ఎంటర్‌ప్రెనార్. ముఖ్యమంత్రితో డైరక్టుగా మాట్లాడేటంత చొరవ, సాన్నిహిత్యం కలది. ఆమెను రక్షించడానికే యింత హంగామా జరిగిందంటే ఎవరూ నమ్మరు. దీనిలో కసితో కాటేసే తక్షకత్వమే కనబడుతోంది. మాధురిని తన స్నేహితురాలిగా భావించి మెసేజ్‌లు పంపిన మోదీ ప్రదీప్ సెల్ నుండి తన సొంత సెల్‌కు కాల్ రావడంతో ఉలిక్కిపడ్డాడు. వారిద్దరి మధ్య తను అనుకున్నదాని కంటె ఎక్కువ స్నేహం వుందని అతనికి అర్థమైంది. ఆమె వద్ద తనకు సంబంధించిన విషయాలు మెసేజ్ రూపంలో వున్నాయి కాబట్టి ప్రదీప్ ఆమె వద్దనుండి అనునయంగా రాబట్టి, తన విషయాలు బయటపెడతాడని మోదీ భయపడి వుంటాడు. అందుకని ప్రదీప్‌ను ఎలాగోలా స్కాండల్‌లో

యిరికిద్దామని చేసిన ప్రయత్నమే యిదంతా. తన రాజకీయ ప్రత్యర్థి సంజయ్ జోషిని అప్రతిష్టపాలు చేయడానికి సెక్స్ సిడిలు తయారు చేయించినవాడికి యిది ఒక పెద్ద విషయం కాదు. దీనిలో పాలు పంచుకున్న సింఘాల్ ఎదురు తిరిగి, టేపులు బయటపెట్టడంతో యిదంతా బహిరంగ రహస్యమైంది. ఇలాటివి యింకా ఎన్ని వున్నాయో ఎవరికి తెలుసు? **– ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2013)**

**డిసెంబరు 10–12 వీక్లీకై** **ఎమ్బీయస్ : న్యూస్, వ్యూస్, రివ్యూస్ – 25**

**సోనియా మానసిక విశ్లేషణ**

మానసిక విశ్లేషకులు, రాజకీయ సమీక్షకులు "రేపు" నరసింహారావుగారు ఆంధ్రజ్యోతిలో 'సోనియా గాంధీ జీవన విశ్లేషణ' అంటూ నాలుగు రోజుల పాటు వ్యాసాలు రాశారు. ఆమె జీవితంలోని అనేక ఘట్టాలను – ఆమెను హీనంగా చూపే వాటిని – ఏరి కూర్చారు. వాటితో బాటు ఆమె వ్యక్తిత్వాన్ని విశ్లేషించారు. చివరి వ్యాసంలో ఆమెకు ఆంధ్రులంటే ఆగ్రహం అంటూ కొన్ని ఉదాహరణలు చూపారు. వాటిలో కొన్ని – 1) 'రాజీవ్ గాంధీ ప్రధాని అయిన తర్వాత లోకసభలో ఆయన్ని యిబ్బంది పెట్టినవారు ఎవరు అని అడిగితే దక్షిణాదిన తెలుగు మాట్లాడేవారిని ఆమెకు తెలిసిందట 2) ఆమె భారతపౌరసత్వం లేకుండానే ఓటరుగా నమోదయిన విషయం గురించి ఉపేంద్ర పార్లమెంటులో ఎత్తితే ఆమె 'నీ అంతం చూస్తా' అని ఉపేంద్రను స్వయంగా బెదిరించారట 3) జైపాల్ రెడ్డి బోఫోర్స్ విషయంలో రాజీవ్‌ను విమర్శించడం రాజీవ్‌ను బాధించింది 4) విపి సింగ్ కూటమి ఏర్పాటుకు టిడిపి చొరవ తీసుకుంది 5) ఒక ఆంధ్ర మహిళా ఎంపీ రాజీవ్‌కు అతిసన్నిహితంగా వుండడం సోనియాను బాధించింది 6) సోనియా లాభదాయక పదవిలో వున్నారని ఎర్రన్నాయుడు ఆరోపించడం చేతనే సోనియా మళ్లీ పోటీ చేయవలసి వచ్చింది, అది ఆమెను కలచివేసింది 7) తను ఆమోదించడం చేత ప్రధాని అయిన పివి తనపట్ల కృతజ్ఞత చూపకపోవడంతో ఆమెలో ద్వేషం పెరిగింది 8) వైయస్సార్‌ను సిఎం చేస్తే ఆయన స్వతంత్రంగా వ్యవహరించడం ఆమెకు వ్యతిరేకత ఏర్పడింది. ఇవన్నీ చెప్పి 'ఆంధ్రులంటే ఆగ్రహం కాబట్టి రాష్ట్రాన్ని విభజించారు' అని తేల్చారు నరసింహారావుగారు.

ఈయన చెప్పిన విషయాల్లో కాస్త లోతుగా వెళితే – 1) రాజీవ్ ప్రధాని అయినపుడు టిడిపి ప్రధాన ప్రతిపక్షంగా వుంది. అందుకే వాళ్లు పార్లమెంటులో ప్రభుత్వాన్ని విమర్శించారు. అంతమాత్రం చేత కోపం తెచ్చుకునేమాటైతే ఆ తర్వాత 1989లో, 2004లో, 2009లో కాంగ్రెసు ప్రభుత్వాలను రాష్ట్రంలో గెలిపించినందుకు సోనియాకు కోపం తగ్గి వుండాలిగా! ముఖ్యంగా 2009 యుపిఏ–2 ఏర్పడ్డానికి 33 మంది తెలుగు ఎంపీలే కారణమని అందరికీ తెలిసినపుడు ఆమెకు మాత్రం తెలియదా? 2) నేను ఉపేంద్రగారి ఆత్మకథ చదివాను. ఈ సంఘటన ఎక్కడా చదివిన గుర్తు లేదు. పైగా మితభాషి అయిన సోనియా హైదరాబాదు ఎయిర్‌పోర్టులో బహిరంగంగా అలా బరస్ట్ అవుతుందంటే నమ్మగలమా? ఉపేంద్రపై అంతకోపం వుంటే మరి 1998లో విజయవాడ ఎంపీ స్థానానికి కాంగ్రెసు టిక్కెట్టు ఎందుకు యిచ్చినట్లు? 3) బోఫోర్స్ విషయంలో చేసిన వ్యాఖ్యల గురించి జైపాల్ రెడ్డిని సోనియా క్షమించలేకపోతే ఆయన్ను మాత్రం కాంగ్రెసులో ఎందుకు చేర్చుకున్నారు? కేంద్ర కాబినెట్‌లో అతి ముఖ్యమైన శాఖలు ఎందుకు అప్పగించారు? ఇప్పుడు తెలంగాణ విషయంలో ఆయన చెప్పినట్లే ఎందుకు ఆడుతున్నారు? 4) రాజీవ్ గాంధీకి అత్యంత ఆత్మీయుడిగా మెలగిన విపి సింగ్ బోఫోర్స్ విషయంలో రాజీవ్‌తో విభేదించి, అరుణ్ నెహ్రూతో కలిసి బయటకు వచ్చి నేషనల్ ఫ్రంట్‌లో చేరారు. ఎన్టీయార్ ఆ ఫ్రంట్‌కు కన్వీనరుగా వున్నారు. 1989 ఎన్నికలలో టిడిపి ఘోరంగా ఓడిపోయి, పార్లమెంటులో సోదిలోకి లేకుండా పోయింది. సోనియాకు కోపం వుంటే విపి సింగ్, అరుణ్ నెహ్రూలపై వుండాలి, నరసింహారావుగారి లాజిక్ ప్రకారం వారి సొంత రాష్ట్రమైన యుపిపై వుండాలి, మధ్యలో తెలుగువాళ్లపై కోపం ఏమిటి?

5) రాజీవ్ గురించిన యీ ఆరోపణ గాని యిలాటి ఆరోపణగాని నేనెన్నడూ వినలేదు. అయినా భర్త ప్రియురాలు ఏ భాష మాట్లాడితే వారందరినీ దూరం చేసుకుంటారా? అలా అయితే పురంధరేశ్వరి, రేణుకా చౌదరి.. వంటి వాళ్లకు ఏ పదవి యివ్వకుండా వుండవచ్చు కదా 6) పార్లమెంటులో ప్రతిపక్షం అన్నా లక్ష ఆరోపిస్తారు. వాధ్రా గురించి బిజెపి అనడం లేదా? ఎర్రన్నాయుడు ఓ ఆరోపణ చేశారు కదాని తెలుగువాళ్లందరిపై కక్ష కట్టారంటే అంతకంటె జోక్ మరొకటి వుండదు 7) పివికి, సోనియాకు మధ్య అనేక రాజకీయాలు నడిచాయి. సోనియాను కట్టడి చేయడానికి పివి ప్రయత్నాలు చేశారు. చివరకు సోనియా పార్టీపై పట్టు సాధించి పివిపై కసి తీర్చుకున్నారు. పివి తెలుగువాడు కాకుండా మలయాళీ అయినా అదే జరిగి వుండేది. పివి పోయిన 9 ఏళ్లకు యిప్పుడు గుర్తు పెట్టుకుని కక్ష సాధించాలని రాష్ట్రాన్ని విభజించిందంటే నమ్మడం ఎలా? 8) వైయస్సార్ సోనియాకు అప్పుడు కాడంటే నవ్వు వస్తుంది. రాష్ట్రంలో కనబడిన ప్రతీ రాయిపై రాజీవ్ పేరు రాసి శిలాఫలకాలుగా పాతేసిన వైయస్ అంటే సోనియాకు కోపమా?

అసలు మనమందరం ఒప్పుకోవాల్సిన పాయింటు ఒకటుంది – తెలుగువాళ్లని విడగొట్టాలన్న ఐడియా కాపీరైటు సోనియాది కాదు. చిన్నారెడ్డి వంటి ఎమ్మెల్యేలది. వాళ్లు ఎప్పుడో లేఖ యిస్తే పక్కన పడేసింది. మన తెలుగువాళ్లలోనే 40% ప్రాంతపు ప్రజాప్రతినిధులు – పార్టీల భేదం లేకుండా – 'మేం సాటి తెలుగువాళ్లతో వేగలేకపోతున్నాం, వాళ్లు దుర్మార్గులు, దుష్టులు, రాక్షససంతతి వారు, మమ్మల్ని దోచుకుంటున్నారు' అని హాహాకారాలు చేసి ఆవిణ్ని బతిమాలారు. గత తొమ్మిదేళ్లగా 'ఇంకా తేల్చలేదేం?' అంటూ

ఊదరగొట్టేశారు. వాళ్లను వూరుకోబెట్టడానికి 2004లోనే కామన్ మినిమమ్ ప్రోగ్రాంలో చేర్చినా, ఏకాభిప్రాయం సాధించాక చేస్తాం, సరైన సమయంలో సరైన నిర్ణయం అంటూ జోకొట్టి జోకొట్టి తొమ్మిదేళ్లపాటు రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచిన ఘనత సోనియాదే. ఇప్పుడు కూడా సమైక్యవాది ఐన నరసింహారావుగారికి సోనియా చేస్తున్నది దుర్మార్గంగా తోచవచ్చు. కానీ తెలంగాణ ప్రజలకు ఆమె దేవతగానే కనబడుతోంది. తెలంగాణ ప్రజలు కూడా తెలుగువారే అని రావుగారు భావిస్తే ఆమెకు తెలుగువారంటే ద్వేషం, ఆగ్రహం అనే మాటలను సవరించుకుని, 'కొందరు తెలుగువారంటే..' అని వ్యాసం రాసుకోవాలి.

అంత మాత్రం ఆలోచన లేకుండా నరసింహారావుగారు యింతటి వితండ వాదన ఎందుకు చేసినట్లు? తన మీద కోపంతో సోనియా తెలుగువాళ్లను విభజిస్తోందని చంద్రబాబు చేస్తున్న చేస్తున్న ప్రచారానికి యీయన సైద్ధాంతిక అంశాలు అద్దబోయారు. రావుగారి పాయింట్లలో చాలా భాగం టిడిపి నాయకులను హీరోలుగా చూపించే ప్రయత్నం ప్రస్ఫుటంగా కనబడుతోంది. గతంలో రావుగారు జగన్ మానసిక విశ్లేషణ అంటూ కూడా చేశారు. అది చదివితే జగన్ అంటే ఎవరో అండర్ వరల్డ్ డాన్ అనుకుంటాం. ఇప్పుడు సోనియాని పట్టించారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఆమె చేసిన నిర్ణయానికి 'తెలుగువాళ్లపై కోపం' అంటూ విపరీత వ్యాఖ్యానం చేసి' దానికి 'ఆమెకు భారతసమాజం గురించి కనీస అవగాహన లేదు' అంటూ మానసిక విశ్లేషణ చేర్చి వ్యాసం రాసేశారు. 'తెలుగువాళ్లను విభజించండి' అని లేఖ యిచ్చి, అంతటితో ఆగకుండా దాన్ని పదేపదే ఉటంకించి, 'ఏం యింకా విడగొట్టరేం? నిర్ణయం తీసుకునే దమ్ము లేదా? చేతకాదా?' అని సోనియాను ఉడికించి, రెచ్చగొట్టి, 2009లో ఎవరితో పొత్తు లే ఒంటరిగా, నిస్సహాయంగా మిగిలిన తెరాసను మహాకూటమిలోకి పిలుచుకుని వచ్చి పునర్జీవం పోసి, యిప్పుడు కూడా 'విభజిస్తే తప్పు లేదు కానీ కొబ్బరి చిప్పల్లా సమానంగా విడగొట్టాలి' అంటూ పాట పాడుతున్న చంద్రబాబు గారికి తెలుగువాళ్ల మీద ప్రేమో, కోపమో, ద్వేషమో... ఆయనకు భారత సమాజం మాట ఎలా వున్నా తెలుగుసమాజం గురించి అవగాహన వుందో లేదో కూడా.. అది కూడా త్వరలోనే విశ్లేషణ చేసి చెప్తారని ఎదురు చూస్తున్నాను.

**గుడి కాదు, ఆదర్శాల బడి**

కర్ణాటకలోని మంగుళూరుకు దగ్గర్లో గోకర్ణనాథేశ్వరుని గుడి వుంది. ప్రఖ్యాతి చెందిన యీ గుడిలో పూజలతో బాటు సంస్కరణలకు కూడా పెద్ద పీట వేస్తారు. మనుష్యులంతా ఒక్కటే, దేవుడు ఒక్కడే అని బోధించిన కేరళ ప్రాంతానికి చెందిన సంఘ సంస్కర్త శ్రీ నారాయణ గురు 1912లో యిక్కడ శివలింగాన్ని స్థాపించారు. ఆ స్ఫూర్తి యింకా కొనసాగుతోంది. వితంతువుల పట్ల హిందూమతం చూపించే వివక్షతను పోగొట్టాలనే ఉద్దేశంతో 2011లో అన్ని కులాలకు చెందిన 5 వేల మంది వితంతువులను ఆహ్వానించి వారి చేత చండికా హెూమం చేయించింది గుడి యాజమాన్యం. ఆ సంవత్సరంలోనే యింకోసారి 2500 మంది వివాహిత మహిళలు గుడికి వచ్చి సామూహిక ప్రతిజ్ఞ చేశారు – 'తమ భర్త పోయాక కూడా తాము పసుపు, కుంకుమ, మంగళసూత్రం తీసివేయం' అని. ఆ సందర్భంగా ఒక దళిత వితంతువు చేత పూజ చేయించి అందరికీ హారతి యిప్పించారు. ఇటీవలే ఇద్దరు వితంతువులను పూజారిణులుగా నియమించింది గుడి. 45 ఏళ్లు, 65 ఏళ్ల వయసున్న ఆ యిద్దరూ కావలసిన మంత్రాలన్నీ శ్రద్ధగా నేర్చుకుని తమ విధులు నిర్వహిస్తున్నారు.

ఈ గుడి పునరుద్ధరణ కార్యక్రమాన్ని 1990 ప్రాంతాల్లో చేపట్టి 1991లో రాజీవ్ గాంధీ చేత ఆవిష్కరింపచేశారు. అతని తల్లి హిందువు ఐనా, తండ్రి పార్శీ అని అందరికీ తెలుసు. పూరీ జగన్నాథ మందిరంలో అయితే అతన్ని లోపలకి రానిచ్చేవారు కూడా కాదు. గుడి కట్టి వందేళ్లు నిండిన సందర్భంగా 2012లో ఉత్సవాలు జరిపినపుడు సోనియా గాంధీని ఆహ్వానించారు. ఆమె విదేశీయురాలు, అన్యమతస్తురాలు. అయినా గుడి యాజమాన్యం అలాటి అభ్యంతరం పెట్టుకోలేదు.

**ఆమ్ పార్టీకి విరాళాల వెల్లువ**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో ఆమ్ ఆద్మీ గట్టి పోటీయే యిచ్చిందని పరిశీలకులు అంటున్నారు. ఆ పోటీ తట్టుకోవడానికే ఆఖరి క్షణంలో కాంగ్రెసు, బిజెపిలు తమ కార్యకర్తలను తరిమి ఓటర్లను బూత్‌లకు రప్పించాయని కూడా అంటున్నారు. దానివలన ఆమ్ ఆద్మీ విజయావకాశాలు దెబ్బ తిని వుండవచ్చని కూడా అంచనా. సర్వే ఫలితాలు వివిధరకాలుగా వున్నాయి. ఇండియా టుడే 6 వస్తాయంటే టైమ్స్ నౌ వారు 11, ఏబిపి-నీల్సన్ 15 అంటే టుడేస్ చాణక్య ఏకంగా 31 అంది. ఈ పార్టీ యిలా పుంజుకోవడం గమనించే కాబోలు కాంగ్రెసు పార్టీ దాని యిమేజి దెబ్బ కొడదామని చూసింది. ఆ పార్టీ అభిమాని ఎమ్ఎల్ శర్మ అనే ఆయన ఆమ్ పార్టీకి విరాళాలు ఎక్కణ్నుంచి వస్తున్నాయో తెలపాలంటూ ఢిల్లీ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం వేశాడు. కోర్టు ప్రభుత్వాన్ని వివరాలు సేకరించి డిసెంబరు 10 లోగా నివేదిక యిమ్మనమని ఆదేశించింది. ఆ విషయం పరిశోధిస్తున్నామని నవంబరు 12 న షిండే ప్రకటించారు. అలా అన్న మర్నాడే ప్రపంచవ్యాప్తంగా 2300 మంది అభిమానులు రూ.30 లక్షలు విరాళం యిచ్చారు!

నిజానికి ఆమ్ ఆద్మీ ప్రకటించిన దాని ప్రకారం దానికి నవంబరు 17 నాటికి 70,000 మంది దాతల నుండి రూ. 20 కోట్ల

విరాళాలు వచ్చాయి. శాంతి భూషణ్ 1 కోటి యివ్వగా, హాంగ్‌కాంగ్‌లోని అమిత్ అగర్వాల్ 50 లక్షలు యిచ్చారు. హీరో గ్రూపు 30, విక్రాంత్ జిందాల్ 21, ప్రణవ్ ఠాకూర్, అతుల్ రామయ్య చెరో 20 యిచ్చారు. 100 మంది లక్ష చొప్పున యిచ్చారు. 50 వేలు యిచ్చినవారు 300. మార్చి దాకా అది సేకరించిన విరాళాలు కోటిన్నరే. ఎన్నికలలో నిలబడతామనగానే విరాళాలు వర్షించాయి. ఈ 20 కోట్లలో ఇండియా నుండి 14 కోట్లు రాగా అమెరికా నుండి 2.16 కోట్లు, హాంగ్‌కాంగ్ నుండి 1.14 కోట్లు వచ్చాయి. విదేశాలనుండి వచ్చినా అవి భారతీయులు యిచ్చినవే అంటారు అరవింద్. 'మేం ఇండియన్ పాస్‌పోర్టు లేని ఎన్నారైల నుండి కూడా తీసుకోలేదు. భారతపౌరసత్వం వున్నవాళ్లు ఆ విషయాన్ని డిక్లేర్ చేసి విరాళం యివ్వాలని షరతు పెట్టాం." అన్నాడాయన. తక్కిన పార్టీలు 20 వేల కంటె తక్కువ విరాళాలు ఎక్కణ్నుంచి వచ్చాయో చెప్పవు. ఒక స్వచ్ఛంద సంస్థ అధ్యయనం ప్రకారం కాంగ్రెసు, బిజెపి, బియస్‌పిలు తమకు వచ్చే నిధుల్లో మూడోవంతు భాగానికి మాత్రమే దాతల పేర్లు చెప్పగలరట! వారు యితరులను నిందించడం ఎంత హాస్యాస్పదమో చూడండి.

**దేవుళ్ల దగ్గర ఎంత బంగారం వుంది?**

ఈ మధ్య రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనేక దేవాలయాలకు నోటీసులు పంపింది – 'మీ దగ్గరున్న బంగారం ఎంతో చెప్పండి' అంటూ. మామూలుగా అయితే యీ ప్రశ్నకు సమాధానం వచ్చేదేమో కానీ మొన్న ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్ జిల్లాలో ఆర్కియాలిజీ శాఖ హంగామా తర్వాత అందరూ బిగుసుకు పోయారు. 'ఎవరో ఒక సాధువు తనకు కలలో కనబడిందని చెపితే, వెంటనే ప్రభుత్వం తవ్వకాలు మొదలెట్టడం దేనికి? ప్రభుత్వం దివాళా తీసింది, ఎక్కడ బంగారం కనబడినా దాని మీద కన్నేస్తోంది' అని అందరూ నిర్ధారణకు వచ్చేశారు. అందువలన గుళ్లలో బంగారం గురించి అడిగిందంటే – దాన్ని కాజేద్దామనే దురుద్దేశంతోనే అని దేవాలయ సమితులు, హిందూ సంస్థలు అనుకుని అభ్యంతరాలు తెలిపారు. రిజర్వ్ బ్యాంకు వెనుకంజ వేసింది. 'ఆ సమాచారం యిప్పుడు అక్కరలేదు లెండి' అనేసింది.

అసలు వారికి యీ ఆలోచన ఎందుకు వచ్చింది? దేశంలో బంగారం ఏమౌతోంది అని వారు ఒక అధ్యయనం నిర్వహించారు. బంగారం కొనుగోలుదారుల్లో 60% మంది గ్రామీణులే. నగరంలో వున్న ధనికులు ఓ పట్టాన చేయి విదల్చరు కానీ గ్రామీణ మహిళలు చాలామంది తమ యిష్టదేవతలకు గాజులు, ముక్కుపడకలు, దుద్దులు, నెక్లసులు కూడా యిచ్చేస్తూంటారు. బ్లాక్ మనీ వున్న చాలామంది ధనికులు కూడా ఇన్‌కమ్ టాక్స్ కట్టేబదులు దాన్ని ఆభరణంగా మార్చి గుడికి విరాళం యిచ్చేస్తే మంచిదనుకుంటారు. అజ్ఞాతంగా హుండీలో పడేస్తే ప్రచారం దక్కకపోయినా దేవుడికి ఫలానా అని తెలిసి పుణ్యం దక్కుతుంది కదా వాళ్ల లెక్క. అలా ఎందుకు చేస్తారు అని అడిగితే 'ప్రభుత్వధనం లో చాలా భాగం అవినీతికి, అసమర్థపాలనకు పోతుంది కాబట్టి...' అని సమాధానం యిస్తారు. మరి గుడి నిర్వహణ మాత్రం బాగుంటుందా, అక్కడ అవినీతి జరగదా? అని అడిగితే 'అవన్నీ దేవుడే చూసుకుంటాడు. తన డబ్బు తిన్నవాణ్ని తప్పక శిక్షిస్తాడు' అని సమాధానం చెప్తారు. ఇలాటి దాతల వద్దకు వెళ్లి 'వేదాలను పరిరక్షిస్తాం, పురాణాలపై పరిశోధన చేసి ప్రజలకు అందిస్తాం' అని ప్రతిపాదిస్తే 'మంచిది, చేయండి' అంటారు కానీ ఆర్థికసాయం చేయరు. దానివలన వారికి దక్కే పుణ్యం ఏమీ వుండదని, చిత్రగుప్తుడి ఖాతాలో యివి జమ కావని వారనుకుంటారు.

ఈ విధంగా గుళ్లల్లో డబ్బుతో పాటు, చాలా బంగారం కూడా పోగుపడుతుంది. ఎంత వుందో ఎవరికీ సరిగ్గా తెలియదు. సంవత్సరాలు గడిచే కొద్దీ ఆలయాల ఆదాయం పెరుగుతూ పోతోంది. చెప్పుకోదగ్గ ధనిక దేవాలయాల్లో తిరుపతితో పాటు, త్రివేండ్రంలోని పద్మనాభస్వామి గుడి, జమ్మూలోని వైష్ణోదేవి, గుజరాత్‌లోని సోమనాథ మందిరం, మహారాష్ట్రలోని సిద్ధి వినాయకుడి గుడి, మధురలోని మీనాక్షి గుడి, పూరిరోలని జగన్నాథుడి గుడి, కాశీలోని విశ్వనాథుడు గుడి, శబరిమల వున్నాయి. మానసాదేవికై కట్టిన గుడి కూడా బాగానే ఆర్జిస్తోంది. 2006లో 4 కోట్ల విరాళాలు పొందిన ఈ గుడి 2012 వచ్చేసరికి 13 కోట్లు సంపాదించింది. ఈ నవరాత్రికే 1.20 కోట్ల రూ.ల విలువైన స్వర్ణాభరణాలు విరాళంగా వచ్చాయి. సంక్షేమ పథకాలంటూ మన ప్రభుత్వాలు దివాలా తీయడం, చివరకు ఓ నాటికి దేవాలయాలను జాతీయం చేశామని ప్రకటించడం తప్పదనిపిస్తోంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2013)**

**డిసెంబరు 13 ఎమ్బీయస్ : గఢ్ ఆలా పణ్ సింహ్ గేలా...**

మరాఠీ వారైన షిండే గారి నోట తెలంగాణ ప్రకటన వినబడగానే నాకు యీ మాటలే స్ఫురించాయి.

ఛత్రపతి శివాజీ సింహ్‌గఢ్ కోటను జయించి రమ్మనమని తన సేనాని తానాజీని పంపించాడు. కోటను గెలిచారు. కానీ ఆ యుద్ధంలో తానాజీ చనిపోయాడు. రెండు వార్తలు ఒకేసారి వినగానే శివాజీ రియాక్షన్ అది –

'గఢ్ ఆలా పణ్ సింహ్ గేలా..' – 'కోట వచ్చింది, కానీ సింహం వెళ్లిపోయింది'. అది ఫేమస్ కొటేషన్‌గా మిగిలిపోయింది.

తెలంగాణ ప్రజలు కోరుకున్నట్టే పది జిల్లాల తెలంగాణయే దక్కింది. హైదరాబాదే దానికి రాజధాని. భద్రాచలం, మునగాల అన్నీ వాళ్లవే. ఆంధ్రావాళ్లు అడిగిన ఒక్క కోరిక కూడా తీర్చలేదు. రాయలసీమ 'అడ్డపంచెల వాళ్ల'ని తెలంగాణ 'గళ్లలుంగీల'తో కలిపి

కలుషితం చేయలేదు. (ఈ విశేషణాలు నావి కావు, మన నాయకులవి).

అంతా హ్యేపీస్ అనుకోమని టి-కాంగ్రెసు వాళ్లు మనల్ని వూదరగొడుతున్నారు. కానీ తెరాస నాయకులు, యితర టి-వాదులు అనుకోవటం లేదు. పూర్తి వివరాలు రానీయండి చూదాం అంటున్నారు.

అవును మరి, తెలంగాణ పోరాటం జరిగిందే హైదరాబాదు కోసం. ఇది పచ్చి నిజం. అన్ని ఉపాధి అవకాశాలు, వ్యాపారావకాశాలు హైదరాబాదులోను, చుట్టూనే వున్నాయి. అక్కణ్నుంచి ఆంధ్రులను బయటకు నెట్టేస్తే ఆ అవకాశాలు మనవే అని ఆశపెట్టే అందర్నీ ఉద్యమంలోకి లాక్కుని వచ్చారు.

హైదరాబాదు లేకపోతే మేమెలా బతుకుతాం, కనీసం దాన్ని యుటీ చేసి అందరికీ అవకాశాలు వుండేట్లు చేయండి అంటూ సీమాంధ్రులు గగ్గోలు పెట్టారు. – 'ససేమిరా వీలుపడదు, ఆంక్షలు లేని హైదరాబాదు యివ్వకపోతే ఉద్యమిస్తాం, పోరాడతాం' అన్నారు తెరాస వాళ్లు.

'మా వద్ద ఉన్నత విద్య, వైద్య సౌకర్యాలు లేవు, హైదరాబాదును ఉమ్మడి రాజధానిగా పెట్టి మేం అవకాశాలు కోల్పోకుండా చూడండి' అని అడిగారు విభజనకు సిద్ధపడిన సీమాంధ్ర నాయకులు. – 'కుదరదు, రెండేళ్లో, మూడేళ్లో తాత్కాలిక రాజధాని చాలు. అదీ ఎంసిఎచ్ చాలు.' అంటున్నారు తెరాస వారు.

ఇవాళ వచ్చిన ప్రకటన ప్రకారం హైదరాబాదు అంటే జిఎచ్ఎంసీ పరిధిని తీసుకున్నారు. అది కూడా తక్కువేమీ కాదు. సీమాంధ్రులు అడిగినా ఎచ్ఎండిఏ అయితే 5 జిల్లాల వరకు వ్యాపించేది. యుటీని చేయలేదు కానీ దాదాపు అంత పనీ చేశారు. శాంతిభద్రతలు, భూపాలన యివన్నీ గవర్నరు చేతిలో.. అనగా కేంద్ర ప్రతినిధి చేతిలో పెట్టారు.

ఇక విద్య, వైద్య అవకాశాలు యిప్పటిలాగానే కొనసాగుతాయి అన్నారు. అంటే అందరూ స్థానికులే అవుతారన్నమాట. ఉద్యోగుల ఆప్షన్లు వగైరా బిల్లులో విపులంగా వుంటాయట. రేపటి పేపరు చూస్తే యింకా ఎన్ని బయటపడతాయో తెలియదు.

'28 రాష్ట్రాలు ఎలా ఏర్పడ్డాయో తెలంగాణకూడా అలాగే ఏర్పడాలి' అన్న టి- ఉద్యమకారుల డిమాండు నెరవేరలేదు. ఇప్పటిదాకా ఏ రాష్ట్రానికీ లేనన్ని పరిమితులు, ఆంక్షలు తెలంగాణకు విధించారు.

ముఖ్యంగా ఈ ఆంక్షలు తెలంగాణ రాష్ట్రానికి గుండెకాయ అయిన హైదరాబాదుపై విధించారు. ముఖ్యపట్టణంపై అధికారం చెలాయించలేని ప్రభుత్వం తెలంగాణను ఏలబోతుంది. అందుకే 'కోట దక్కింది, కానీ సింహాసనం దక్కలేదు'

కుంటిరాజుగారు సేనాపతి ఆంక్షల మేరకు నడుచుకోవలసి వస్తే పాలన ఎంత అందంగా వుంటుందో అంత అందంగా వుంటుంది.

కేంద్రం చేతిలో వుంటే అంత భయం దేనికి? తెలంగాణ అంటే వల్లమాలిన ప్రేమ వున్న సోనియా పైన వుండగా.. అనుకోవడానికి లేదు. సోనియా అస్తమిస్తున్న సూర్యుడు. 2014లో మళ్లీ ఉదయిస్తుందో లేదో తెలియదు. పైగా ఆమె ప్రేమ శాశ్వతమో, తాత్కాలికమో తెలియదు. 9 ఏళ్లగా తెలంగాణ అనే మాట తన నోట ఉచ్చరించకుండా జాగ్రత్త పడింది. హైదరాబాదు ప్రగతి కుంటుపడిపోయినా ఉలకలేదు, పలకలేదు. ఇంత చేసినా తెలంగాణలో కాంగ్రెసుకు ఆమె అనుకున్నన్ని ఓట్లు పడకపోతే, యుపిఏ 3 అధికారంలోకి వస్తే ఆమె మూడ్ ఎలా వుంటుందో తెలియదు. ఆమె కాకుండా ఎన్‌డిఏ వస్తే ఎలా వుంటుందో అదీ తెలియదు. కేంద్రంలోని సంకీర్ణ ప్రభుత్వం ఎవరిపై ఆధారపడుతుందో, దానికి మద్దతిచ్చే పార్టీలు యిరుగుపొరుగు రాష్ట్రాలలో వుంటే ఏం జరుగుతుందో అదీ తెలియదు.

ఇంత అయోమయస్థితి వున్నపుడు హైదరాబాదుపై సర్వాధికారాలు కేంద్రానికి వెళ్లిపోవడం అత్యంత దుఃఖదాయకం. తెలంగాణ రాష్ట్రానికి పూడ్చలేని నష్టం. 'అబ్బే పదేళ్లు మించకుండా... అన్నారు కదా, ఓర్చుకుంటే సరి' అనవచ్చు టి-కాంగ్రెసు వారు. పదేళ్ల తర్వాత రాజెవరో? రంగడెవరో? అప్పుడు అధికారంలో వుండేవాడికి రాహుల్ వంటి కొడుకుండి, అతగాడిని ప్రధానిని చేయాలని తల్లికో, తండ్రికో అనిపిస్తే.., అప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటారో ఎవరికి ఎరుక?

అందుకే తెలంగాణకు వచ్చిన దాని కంటె పోగొట్టుకున్నది ఎక్కువ అనిపిస్తోంది.

ఇక ఆంధ్ర ప్రాంతం గురించి చెప్పాలంటే –

వాళ్లకూ కోటా లేదు, సింహమూ లేదు. అక్కడ నాయకులుగా చలామణీ అవుతున్నవి పిల్లులే!

అవి కూడా ముసలి పిల్లులు. బాగా బలిసిపోవడం చేత దుమికి ఎలుకలను వేటాడలేని పిల్లులు!!

కిచెన్‌లో దూరి దొంగతనంగా పాలు తాగేసి, ధ్యానముద్ర పట్టి, రాజకీయసన్యాసం పుచ్చుకున్నట్లు నటించే రుద్రాక్షపిల్లులు!!!

**– ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు)**

**డిసెంబరు 14** **ఎమ్బీయస్ : సోనియాకు అంద వచ్చిన మండేలా**

''ముత్యాలముగ్గు''లో రావు గోపాలరావు డైలాగు వుంది – ''చచ్చి ఋణం తీర్చుకున్నావు నారాయుడూ'' అని! అలాగే నెల్సన్ మండేలా సమయానికి చనిపోయి సోనియాకు సాయపడ్డారు.

ఇవాళ సోనియా పుట్టినరోజు. తెలంగాణ యిచ్చి, దేవతగా నీరాజనాలు అందుకోవడానికి రెడీ అవుతున్న సమయంలో యీ

పుట్టినరోజు ఘనంగా జరపడానికి సకల ఏర్పాట్లు జరిగాయి. శంకరరావుగారు గుడికి కూడా యివాళే పునాది వేస్తున్న యీ రోజునే ఆమె రాజకీయ సమాధి తయారైంది. నాలుగు రాష్ట్రాలలో చావుదెబ్బ తిని మొహం వేలాడేసింది. పుట్టినరోజు చేసుకోవాలనే మూడ్ ఎలా వుంటుంది? కార్యకర్తలు వచ్చి 'ఏదో హంగామా చేయకపోతే బాగుండదు మేడమ్, మీరే డీలా పడిపోయారని తెలిస్తే మనవాళ్లందరూ నీరసిస్తారు. మా పాటికి మేము నాలుగు టపాకాయలు కాలుస్తాం, వద్దనకండి' అని బతిమాలితే వద్దని చెప్పడం ఎలా? అని ఆలోచిస్తూ వుంటే సోనియాకు హఠాత్తుగా మండేలా గుర్తుకు వచ్చాడు. 'ఆయన పోయాడు కాబట్టి నా పుట్టినరోజు వేడుకలు రద్దు' అని ప్రకటించి హమ్మయ్య అనుకుంది. నిజానికి ఆయన పోయినది ఆదివారమో, సోమవారమో కాదు. అంత్యక్రియలు కూడా మంగళవారం! మధ్యలో సోమవారం నాడు యీ వేడుకలు రద్దు చేయడమేమిటి?

ఎన్నికలు జరిగే 5 రాష్ట్రాలలో మణిపూర్ గురించి ఎవరూ పట్టించుకోరు. ఈశాన్యరాష్ట్రం కావటం వలన దాని రాజకీయాలు పెద్దగా పట్టించుకోం. పైగా చిన్న రాష్ట్రం. కాంగ్రెసు సాధారణంగా గెలుస్తూ వుంటుంది. నిన్న ఫలితాలు వచ్చిన 4 రాష్ట్రాలే కీలకం ఎందుకంటే అవి హిందీ బెల్టులో వున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే వెంటనంటి వచ్చే పార్లమెంటు ఫలితాలను ప్రభావితం చేస్తాయని యిప్పటికే ఎన్నోసార్లు రుజువైంది. 10% సీట్లు ఎక్కువ కూడా వస్తాయని సెఫాలజిస్టులు చెపుతున్నారు. కాంగ్రెసుకు తూర్పున బెంగాల్‌లో, బిహార్, ఒడిశాలలో పార్లమెంటు సీట్లు వచ్చే స్కోపు లేదు. పశ్చిమాన గుజరాత్‌లో లేదు. మహారాష్ట్ర, పంజాబ్, హరియాణా వంటి రాష్ట్రాలలో కొద్దో గొప్పో వుంది. దక్షిణాదిన కేరళలో వారి నేతృత్వంలో ప్రభుత్వం వున్నా దానిలో వారి వాటా ఎప్పుడూ తక్కువే. తమిళనాడులో బేస్ పోయి చాలాకాలమైంది. ఆంధ్రప్రదేశ్‌లో సంగతి చూడబోతే సర్వేలు చెప్పనక్కరలేకుండానే ఆంధ్రలో బాగా దెబ్బ తిందని, తెలంగాణలో తెరాస తర్వాతి స్థానమేననీ మనకు ఎలాగూ తెలుసు. ఇక కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో బిజెపి ఓట్లను ఎడ్యూరప్ప చీల్చడం వలన నెగ్గిందన్న విషయం బిజెపి గ్రహించి ఎడ్యూరప్పను వెనక్కి తీసుకొస్తోందనీ వార్తలు వస్తున్నాయి. అది జరిగితే పార్లమెంటు ఎన్నికలలో ఫలితాలు ఎలా వుంటాయో వేచి చూడాల్సిందే. ఇలాటి పరిస్థితుల్లో హిందీ హార్ట్ ల్యాండ్‌లో ఎన్నికలు చాలా కీలకం అని పరిశీలకులందరికీ తెలుసు.

మరి ఫలితాలు వెలువడ్డాక చూస్తే మొత్తం సీట్లలో 70% బిజెపి గెలుచుకోగా, కాంగ్రెసు 20% గెలుచుకుంది. ఇద్దరి మధ్య 50% తేడా అంటే చాలా ఎక్కువ. మోదీ వ్యాఖ్యానించినట్లు నాలుగు రాష్ట్రాలలో కాంగ్రెసు తెచ్చుకున్న అసెంబ్లీ ఓట్లు ఒక్క రాష్ట్రంలో బిజెపి తెచ్చుకున్నదానికి సరిపోలవు. పరాజయానికి కారణాలు కూడా చెప్పుకోలేని పరిస్థితిలో వుంది కాంగ్రెస్. ప్రభుత్వ వ్యతిరేకత (యాంటీ-ఎస్టాబ్లిష్‌మెంట్) అందామంటే బిజెపి పాలిత రాష్ట్రాలలో కనబడకుండా కాంగ్రెసు పాలిత రాష్ట్రాలలోనే కనబడడమేమిటి? పైగా మధ్యప్రదేశ్, ఛత్తీస్ గఢ్‌లలో బిజెపి మూడోసారి ఎన్నికవడమేమిటి? అక్కడ అధికధరలు లేవా? యుపిఏ అవినీతి వలన కలిగే దుష్ఫలితాలు లేవా? ఉన్నాయి. అయినా వాటికై వాళ్లు స్థానిక ప్రభుత్వాన్ని తప్పు పట్టలేదు. కేంద్ర కాంగ్రెసును, రాష్ట్ర కాంగ్రెసును బాధ్యులను చేశారు. కాంగ్రెసు పందికొక్కు కనబడిన చోటల్లా బిజెపి దుడ్డుకర్రతో బాదేశారు. ఢిల్లీలో కాంగ్రెసు, బిజెపిలకు ప్రత్యామ్నాయం కనబడగానే ఆమ్ ఆద్మీ దుడ్డుకర్ర వాడారు. ఇక్కడే బిజెపి కూడా పాఠాలు నేర్చుకోవాలి. రాజకీయాలకోసం ప్రజలను పట్టించుకోకుండా విధానాలు ఏర్పరచుకుంటే బిజెపిని కూడా ఉతికేస్తారు – మూడో ప్రత్యామ్నాయం కనబడితే! దక్షిణాది ఓటర్లకు అలాటి ప్రత్యామ్నాయాలు ప్రాంతీయ పార్టీల రూపంలో లభ్యమైనపుడు బిజెపికి కూడా గుండు సున్నే! తమిళనాట డిఎంకె, అన్నా డిఎంకెలు వున్నాయి, కర్ణాటకలో జెడిఎస్ వుంది. తెలుగునాట టిడిపి, వైకాపా, తెరాసలున్నాయి.

ఫలితాలు వచ్చాక సోనియా, రాహుల్ ప్రజలు తమ పట్ల కచ్చితంగా అసంతృప్తిగా వున్నారని అంగీకరించారు. ప్రజలే కాదు, వాళ్ల కార్యకర్తలూ , నాయకులూ అసంతృప్తిగా వున్నారని గ్రహిస్తే మంచిది. సోనియా, ఆమె సుపుత్రుడి వ్యవహారశైలి అలా ఏడ్చింది. మన రాష్ట్రం సంగతే చూడండి. విభజన విషయంలో సరైన సమయంలో, సరైన నిర్ణయం అంటూ జాగు చేసి చేసి యిన్నాళ్లకు యిలా నిర్ణయం యిన్నాళ్లకు తీసుకున్నారు. (ఇప్పుడు ప్రధాని అభ్యర్థిని 'సరైన' సమయంలో ప్రకటిస్తాం అని సోనియా చెప్పగానే వులిక్కి పడ్డాను. అది కూడా యింత 'సరైన' సమయమేనా? అని) ఎవరినీ సంప్రదించలేదు. అంతా సస్పెన్సు. బిల్లు స్వరూపం ఎలా వుంటుందో తెలంగాణ నాయకులకూ తెలియదు, తమ కిచ్చే ప్యాకేజి ఏమిటో సీమాంధ్ర నాయకులకూ తెలియదు. వెళ్లి ప్రజలకు ఏం చెప్పి మానసికంగా సిద్ధం చేయాలో రాష్ట్ర నాయకులకే కాదు, ఢిల్లీలో వున్న రాష్ట్రవ్యవహారాల యిన్‌చార్జిలకూ తెలియదు. కోర్ కమిటీ వాళ్లకూ తెలియదు. ఆంటోనీ కమిటీ సభ్యులకూ తెలియదు, మంత్రుల ముఠాకూ తెలియదు. 'సోనియా తెలంగాణ యిమ్మన్నారు, యివ్వాలి' అన్న మాట తప్ప వేరొకటి వారికి తెలియదు. అందువలన బిల్లు ఎలా రూపొందించాలి, ఎలా పాస్ చేయించాలి, ఎసెంబ్లీకి ఎన్నిసార్లు పంపాలి, యుటీయా మరోటా... యిలా అనేక ప్రశ్నలకు సమాధానాలు తెలియక ఎవడికి తోచింది వాడు చెప్పేయడం, తర్వాత నాలిక కరుచుకోవడం.

ఇందిరా గాంధీ కాలంలో యిలాగే జరిగిందా? అంతా ఆవిడ మాట మీద జరిగేది. జరగకపోతే ఆవిడ వెంటనే రియాక్టయేది. సంబంధిత వ్యక్తులను పిలిచి మాట్లాడేది. అవసరమైతే ఆవిడే వెళ్లేది. ఉదాహరణకు 1969 విభజనోద్యమం జరిగినపుడు ఆవిడ రహస్యంగా హైదరాబాదుకు మెరుపు పర్యటన జరిపి నాయకులను పిలిపించి, సంగతేమిటని అడిగింది. (తర్వాత పేపర్లో వచ్చింది). 1972 విభజనోద్యమం జరిగినపుడు అందర్నీ ఢిల్లీకి రప్పించి ఒక్కచోట కూర్చోబెట్టి చర్చించి సమస్యలకు పరిష్కారం కనిపెట్టింది. ఇప్పుడీ సోనియా – సోనియా ఎవరికి ఎప్పుడు ఎంతసేపు ఎపాయింట్‌మెంట్ యిస్తుందో తెలియదు. ఇచ్చాక ఏమీ మాట్లాడదు,

వినేసి వూరుకుంటుంది. ఆవిడ మనసులో మాట ఏమిటో తెలియదు. వేర్వేరు అభిప్రాయాలు చెప్పినవారిని ఒకేసారి ఒకేచోట కూర్చోబెట్టి భేదాభిప్రాయాలను సార్ట్ ఔట్ చేయదు. ఏకాంత సేవలా ప్రతీ వారూ విడిగా ఆ దేవత వద్దకు వెళ్లి తమ గోడు చెప్పుకోవడం, ఆవిడకు అర్థమయిందో లేదో, అసలా సబ్జక్టు తెలుసో లేదో, ఆమోదించిందో లేదో తెలియక జుట్టు పీక్కోవడం.

ఇందిరా గాంధీ అయితే యీ దేశపు బిడ్డ, తాతల కాలం నాటి నుండి యింట్లో రాజకీయవాతావరణమే. మరి సోనియాది యీ దేశం కాదు, యిక్కడి వ్యవహారాలపై చాలాకాలం దాకా యింట్రస్టు లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో భర్త ప్రధాని అయ్యాక అతని రాజకీయాల్లోకి ఆమె తలదూర్చలేదు. ఇల్లు, పిల్లలు చూసుకుంది. తన ఇటాలియన్ స్నేహితులకు వ్యాపారాలకు సహకరించింది. అనుకోకుండా భర్త పోవడంతో హతాశురాలై అన్నీ వదిలేసి ప్రశాంతంగా వుందామనుకుంది. అయితే పివి అంటే పడని కాంగ్రెసువారు ఆమెను సతాయించి, రాజకీయాల్లోకి లాక్కుని వచ్చారు. వద్దుమొర్రో అంటూనే ఆమె కాంగ్రెసు సారథ్యం వహించింది. లోకసభ ఎంపీగా ఎన్నికయి కూడా ప్రధాని బాధ్యత నిర్వర్తించలేనంటూ మన్‌మోహన్‌కు అప్పగించింది. కుమార్తె ప్రేమవివాహం చేసుకుంది. అల్లుడు ఆశపోతు. అనేక ఆర్థికనేరాల్లో చిక్కుకుని తలకాయనొప్పి తెచ్చిపెడుతున్నాడు. కొడుకు చూడబోతే తండ్రి వారసత్వం నిలిపేట్టు లేదు. రాజకీయాలను తప్పనిసరి తద్దినంగా చూస్తున్నాడు. అప్పుడప్పుడు కనబడడం, ఎమోషనల్‌గా ఏదో మాట్లాడడం, మాయమై పోవడం. అతను ఎక్కడికి వెళితే అక్కడ పరాజయం తప్పదన్నట్టు తయారైంది వ్యవహారం. ఇవన్నీ చాలనట్టు సోనియాకు తీవ్ర అనారోగ్యం దాపురించింది.

ఇలాటి పరిస్థితిలో ఆవిడ ఇండియా హిస్టరీ, జాగ్రఫీ ఏం చదువుతుంది? పోలవరం, భద్రాచలం, మునగాల..కృష్ణా, తుంగభద్ర, నెట్టెంపాడు... అంటే ఆవిడ బుర్రకేం ఎక్కుతుంది? అసలా పేర్లే నోరు తిరగవు ఆవిడకు. మనవాళ్లు వెళ్లి యిన్ని టిఎంసి నీళ్లు దోచుకున్నారు, అన్ని టిఎంసిలు దాచుకున్నారు అంటే ఆవిడ చదివిన అత్తెసరు చదువుకి అంతటి టెక్నికల్ విషయాలు తలలో దూరతాయా? కొడుకుని అడిగి తెలుసుకుందామా అంటే అతని చదువూ అంతంతమాత్రమే! రాజకీయ నాయకులందరికీ చదువు రాదు. సాంకేతిక విద్యపై అవగాహన వుండదు. కానీ వాళ్లు ప్రజల్లో తిరుగుతారు. వాళ్ల కష్టసుఖాలు తెలుసుకుంటారు. ఆ విధంగా వీళ్లకేదో చేయాలన్న తపన బయలుదేరుతుంది. సోనియా, రాహుల్‌లకు అలాటి ఫీలింగ్సే లేవు. కాంగ్రెసుకు పెట్టనికోటగా వుండి, యుపిఏ 2 నిలబడడానికి కారణభూతమైన మన రాష్ట్రం నాలుగు నెలలుగా అల్లకల్లోలంగా వుంది. వాదోపవాదాలు జరుగుతున్నాయి. ఉద్యోగస్తులు నెలల తరబడి సమ్మె చేశారు. ప్రజాజీవనం స్తంభించింది. గతంలో తెలంగాణలో సకలజనుల సమ్మె జరిగింది. అప్పుడు కానీ, యిప్పుడు కానీ యీ తల్లీకొడుకులు తొంగి చూశారా? మీకేం ఫర్వాలేదు, మేం ఉన్నాం అంటూ అనునయంగా ఒక్కమాట అన్నారా? తుపాన్లు వచ్చి తీవ్ర నష్టం వాటిల్లింది. వచ్చి ఓదార్చారా? ఓ ప్రకటన చేశారా? మీరు ఏమై పోయినా ఫర్వాలేదు, మా దర్బారు మేం నడుపుకుంటాం అన్నట్టు కదలకుండా, మెదలకుండా కూర్చున్నారు.

ఇక చుట్టూ వున్న వందిమాగధగణం ఏదో ఒక పని చేస్తున్నట్టు కనబడాలి కాబట్టి ఉత్తుత్తి స్టేటుమెంట్లు యిచ్చేస్తున్నారు. ఈ జయరాం రమేష్ చూడండి, సోమవారం నాడు అసెంబ్లీకి తెలంగాణ బిల్లు వచ్చేస్తుందని పెద్ద స్టేటుమెంటు పడేశాడు. అంటే రాష్ట్రపతి గారు బెంగాల్ పర్యటన నుండి వచ్చీ రాగానే కాళ్లూ, చేతులూ కూడా కడుక్కోకుండా, కళ్లు మూసుకుని తెలంగాణ బిల్లుపై సంతకం పెట్టేసి పోస్టుబాక్సులో పడేసి వస్తారనుకోవాలా? '70 పేజీల బిల్లు ముసాయిదాను కాబినెట్ సమావేశంలో టేబుల్ ఐటంగా పెట్టారేమిటి? అసలు చదవాలా వద్దా? చదవందే మా అభిప్రాయం ఏం చెప్తాం?' అని సీమాంధ్ర కాబినెట్ మంత్రులు మొత్తుకుంటే 'మీ మొహం మీరు చదివేదేమిటి, చెప్పేదేమిటి? మీ బదులు మేమే ఆలోచించేశాం, మీరేం చెప్పినా మేం వినంగాక వినం, మా అభిప్రాయం మార్చుకోం. మీరు చదవడం వేస్టు' అని చిదంబరం దబాయించేసినట్టు జైరాం రమేష్ రాష్ట్రపతిని దబాయించేద్దా మనుకున్నాడా? అసలు యీ జైరాం రమేష్ యింత మేధావి రూపెత్తడం ఏమిటో నాకు అర్థం కావటం లేదు. తనకు తెలియని విషయం లేదన్నట్టు మాట్లాడతాడు. గతంలో మణి శంకర అయ్యర్ యిలాగే వుండేవాడు. ఇప్పుడు ఎక్కడో మూలపడి వున్నాడు.

ఈ జైరాం నదీజలాల పంపిణీ గురించి మనకు లెక్చర్లు యిచ్చేబదులు కావేరీ జలాల గురించి తన రాష్ట్రానికి, తమిళనాడుకి జరిగే వివాదాన్ని పరిష్కరించమనండి చాలు. శ్రీవారికి పోలవరం అంటే యిష్టం లేదట. గిరిజనుల పాకలు మునిగిపోతాయట. మునిగిపోతే వేరే చోట ఆవాసం కల్పిస్తారు, కల్పించాలి, కల్పించేట్లు చేయాలి. రోడ్డు వేసినా, ఫ్యాక్టరీ కట్టినా ఎవరో ఒకళ్లు అంతకుముందు అక్కడ వున్నవాళ్లని లేవగొట్టక తప్పదు. వాళ్లకు నష్టపరిహారం యివ్వకతప్పదు. దాన్ని సద్వినియోగం చేసుకుంటే వాళ్ల జీవితాలు మెరుగుపడతాయి కూడా! గిరిజనుల విషయంలో – వాళ్లలో చదువుసంధ్యలు తక్కువ కాబట్టి డబ్బు యిస్తే దుర్వ్యయం చేస్తారన్న భయంతో స్థలానికి స్థలం యివ్వాలని రూలుంది. ఆ బాధ్యత నిర్వర్తిస్తే తప్ప పనులు చేస్తే తప్ప రెండవ విడత నిధులు యివ్వం అని కేంద్రం పట్టుబడితే తప్పు లేదు. కానీ ఆ ప్రాజెక్టు డిజైన్ మార్చాలి అనడానికి యీయనెవడు? ఎందరో నిపుణులు చర్చించి ఫైనలైజ్ చేసి వేలకోట్ల రూపాయలు ఖర్చు పెట్టాక యిప్పుడు అదేదో సినిమాలో సుత్తి వేలులాగ 'నీ ఫేసు నాకు నచ్చలేదు' అంటే అదో కారణమా? ఎప్పుడో శాంక్షన్ అయిన పోలవరం, దుగ్గరాజపట్నం వంటి ప్రాజెక్టులను యిప్పుడు మళ్లీ ప్రకటిస్తూ అదేదో సీమాంధ్రులకు ఫేవర్ చేస్తున్నట్లు నటించడం చూస్తూంటే మండుతోంది.

ఇది చాలనట్టు, సోమవారం నాడు తెలంగాణ తీర్మానం అసెంబ్లీకి వస్తుందంటూ తెలంగాణవాదులను ఊరించడం దేనికి? ఫైనల్‌గా ఉసూరుమనిపించడం దేనికి? వెర్రాడి పెళ్లాం వాడకంతా వదిన అన్నట్టు తెలుగువాడంటే అందరికీ లోకువై పోయింది. ఢిల్లీ

నుండి ఏం వాగినా చెల్లిపోతోంది. రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ న్యాయనిపుణులను సంప్రదించినట్టుగానైనా చూపించుకోవాలా వద్దా? ఇవన్నీ రేపు చరిత్రలో మిగిలిపోయే ఘట్టాలు. ఇందిరా గాంధీ పంపిన ఎమర్జన్సీ బిల్లు గబగబా సంతకం పెట్టి ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ ఎంతో అప్రతిష్ఠ మూటగట్టుకున్నాడు. అప్పట్లో ఆబూ అబ్రహాం కార్టూన్ వేశాడు కూడా – 'ఇందిర నుండి ఏదో బిల్లు వస్తే ఫక్రుద్దీన్ బాత్ టబ్‌లో వుండగానే సంతకం పెట్టాడని!' ప్రణబ్‌కు అలాటి పేరు తెచ్చుకోవడం యిష్టం లేదు. పైగా సోనియా, ఇందిరా గాంధీ కాదు. నిన్నటి అసెంబ్లీ ఫలితాలు చూశాక సోనియా లెవెల్ మరింత పడిపోయింది. ఆవిడ మాటలు పట్టించుకోకపోయినా ఫర్వాలేదు, ఈవిడ ప్రభుత్వం యింకెన్నాళ్లుంటుంది, యీ భాగ్యానికి ఆవిడ చెప్పినట్టు ఆడనక్కరలేదు – అనుకోవచ్చాయన. దక్షిణాఫ్రికా వెళ్లి వచ్చాక చూదాం అనేశాడాయన.

అసెంబ్లీకి పంపించినపుడు మూడు రోజులే టైమిస్తాడు, వారం రోజులే యిస్తాడు అంటూ ఆశపడేవాళ్లు కూడా కాస్త తమాయించుకోవాలి. డిసెంబరు 9 నాటికి సోనియా జన్మదిన కానుకగా తెలంగాణ అన్నది జరగలేదు. జనవరి 1 కల్లా తెలంగాణ బిల్లు పాస్ అవుతుంది అన్నది జరుగుతుందో లేదో తెలియదు. ఈ ఎన్నికల ఫలితాలు చూశాక బిజెపి వాళ్లు 'ఈ ప్రభుత్వానికి పాలించే అర్హత లేదు, వెంటనే రిజైన్ చేయాలి' అంటూ గొడవ చేస్తారు కొన్ని రోజులు, తథ్యం. ఎన్నాళ్లు పార్లమెంటు సాగుతుందో, ఆ లోపుగా బిల్లు చర్చకు వస్తుందో రాదో తెలియదు. వచ్చినా యీ ఎన్నికల ఫలితాల వూపులో వున్న బిజెపి వాళ్లు 'కాంగ్రెసు వాళ్లు తెలంగాణ యిచ్చినట్టు, వాళ్లకు మనం వంతపాడినట్టు ఎందుకు వుండాలి? మనమే హీరో పాత్ర వేద్దాం. మనం వచ్చాకే యిచ్చి తెలంగాణలో కాస్త బలం పుంజుకుందాం, తెలంగాణ యివ్వడం అనేదాన్ని ఎన్నికల అంశంగా చేసి లాభపడదాం' అని ఆలోచిస్తే ఏవేవో పుల్లలు వేయవచ్చు.

సోనియా, రాహుల్ ఆత్మపరిశీలన చేసుకుంటాం అని మాట యిచ్చారు. ఆ పరిశీలనలో విభజన సవ్యంగా చేయాలి అనే అంశం కూడా వుందో లేదో తెలియదు. ఇప్పుడు చేస్తున్న పద్ధతి యిరుప్రాంతాలలోనూ అసంతృప్తి కలిగిస్తోంది. ఇద్దరి మధ్య కలహం పెట్టి మధ్యలో కేంద్రం లాభపడదామని చూస్తోందని తెలంగాణవాదులు కూడా గ్రహించారు. విభజన చేసినపుడు గొడవలు లేకుండా సవ్యంగా చేసి యిస్తే ప్రత్యేకవాదులు సంతోషిస్తారు. ప్రస్తుతానికి తెలంగాణ వారి పని రైల్లో రిజర్వేషన్ దొరికినవాళ్లలా వుంది. వాళ్లు సుఖంగా ప్రయాణం చేయాలంటే జనరల్ బోగీల వాళ్లకు కూడా కాసిన్ని సౌకర్యాలివ్వాలి. ఓ నాలుగు బోగీలు ఎక్కువ వేయాలి. అవేమీ లేపోతే రిజర్వేషన్ లేనివాళ్లు కూడా రిజర్వ్‌డ్ కంపార్టుమెంటులో ఎక్కేస్తారు. ఎక్కడమే కాదు, చాలా వయొలెంట్‌గా వుంటారు. దిగిపొమ్మంటే తీవ్రంగా పోట్లాడతారు. 'మేం మీలా సౌఖ్యం కోసం కాదు, మనుగడ కోసం పోరాడుతున్నాం. ఇక్కడ కూడా వుండనివ్వకపోతే ఎక్కడికి పోతాం' అంటూ కొట్లాడి బోగీని అక్రమంగా ఆక్రమిస్తారు.

అదేవిధంగా సీమాంధ్రులకు వారి ప్రాంతంలో సుఖంగా బతకడానికి ఏర్పాటు చేయకపోతే హైదరాబాదులో, తెలంగాణ యితర ప్రాంతాల్లో వారు సక్రమంగానో, అక్రమంగానో చొరబడి తెగింపుతో బతుకుతారు. ఇలాటి పరిస్థితి తెలంగాణ వారికీ తలనొప్పే. ఇలాటి విషయాలన్నీ సార్ట్ అవుట్ చేసి తమకు ప్రత్యేకరాష్ట్రం యిస్తేనే వాళ్లు ఆనందిస్తారు. 2009 డిసెంబరు 9 నుండి నాలుగేళ్లపాటు సోనియా ఏమీ చేయలేదు. కనీసం కృష్ణ కమిటీ రిపోర్టు చేతికి అందిన తర్వాతనైనా ఏదో ఒక ఆప్షన్ అమలు చేసేందుకు ప్రయత్నించాల్సింది. హీనపక్షం జులై 30 తర్వాతైనా ఏదో ఒక కసరత్తు చేసి వుండాల్సింది. ఏమీ చేయకుండా ఎవర్నీ అడక్కుండా, ఆంటోనీ నివేదిక పట్టించుకోకుండా, యివన్నీ టేబుల్ ఐటెమ్స్‌గా ప్రవేశపెడుతూ లీకులతో, పుకార్లతో వ్యవహారం నడుపుతూ గందరగోళంగా ప్రత్యేకరాష్ట్రం ఆవిర్భవిస్తే ఏం లాభం? బిల్లును తరచి చూసిన కొద్దీ కెసియార్‌కు ఎన్నో అభ్యంతరాలు కనబడుతున్నాయి. సవరణలు ప్రతిపాదిస్తామంటున్నారు. శాసనసభలో సీమాంధ్ర ఎమ్మెల్యేలు నోరు విప్పకపోయినా తెరాస గొంతెత్తి మాట్లాడేట్లు వుంది.

ఈ పరిస్థితుల్లో సోనియాకు తెరాస జస్ట్ థ్యాంక్స్ చెప్తోంది తప్ప ఆకాశానికి ఎత్తేయడం లేదు. టి–కాంగ్రెసు వాళ్లు మాత్రమే దేవత, దేవత అంటున్నారు. ప్రజలు నమ్ముతారో లేదో తెలియదు. ఎవరైనా సరే, ఉదయించే సూర్యుడికే మొక్కుతారు, అస్తమించే సూర్యుణ్ని పట్టించుకోరు. ఈ ఘోరపరాజయం తర్వాత సోనియాను ఎదిరించినా ఫర్వాలేదని రాష్ట్ర కాంగ్రెసు నాయకులకు అనిపించడం ఖాయం. ప్రజలకు కాంగ్రెసుపై మోజు తీరిపోయిందని, మనం వేరే కొమ్మ వెతుక్కుంటే మంచిదనీ తోచవచ్చు. మునిగే ఓడను వదిలిపెట్టడానికే అందరూ ప్రయత్నిస్తారు. తెలంగాణ కాంగ్రెసు వాళ్లు కూడా తెలంగాణ ఏర్పాటు ముచ్చట జరిగిపోగానే తెరాసలో చేరవచ్చు. ఎందుకంటే తెలంగాణ యిచ్చినా ఆ క్రెడిట్ తెరాసకే దక్కుతుందని సర్వేలు కూడా చెప్తున్నాయి. ఈ మధ్య ఒక సీనియర్ జర్నలిస్టు టీవీ చర్చలో ఒక విషయాన్ని ఎత్తి చూపించారు – ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవం నాడు పొట్టి శ్రీరాములు విగ్రహానికి దండలు వేస్తున్నాం కానీ, అసలు ఉమ్మడి రాష్ట్రం నుండి విడదీసి రాష్ట్రం యిచ్చిన జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభాయ్ పటేల్, పట్టాభి సీతారామయ్యగార్ల విగ్రహాలకు దండలు వేయడం లేదు. అలాగే తెలంగాణకోసం 'ప్రాణత్యాగానికి సిద్ధపడిన' (ఇవాళంతా టి–ఛానెల్ సెలైన్‌తో వున్న కెసియార్ బొమ్మ చూపిస్తూనే వుంది – విజయ దివస్ పేరుతో) కెసియార్ పార్టీకి ఓట్లేస్తారు తప్ప యిచ్చింది కదాని సోనియాకు మొక్కరు. గతిలేక యిచ్చింది, యివ్వాలన్న బుద్ధి వుంటే ఎప్పుడో యిచ్చేది, తన కొడుకు కోసం యిచ్చింది అని ఎన్నికలలో కాంగ్రెసేతర పక్షాలు ప్రచారం చేయడం, దానికి ఎందరో కొందరు నమ్మడం ఖాయం. ఉత్తరభారతంలో కాంగ్రెసు వ్యతిరేక పవనాలు బలంగా వీస్తూన్నపుడు వాటి ప్రభావం మన రాష్ట్రంపై బొత్తిగా లేకుండా పోవు.

ఈ ఆలోచనలన్నీ చుట్టుముట్టినపుడు సోనియాకు బర్త్ డే సెలబ్రేట్ చేసుకోవాలని ఏం అనిపిస్తుంది? అందుకే మండేలా పేరు

చెప్పి వేడుకలు రద్దు చేసింది. ఒకవేళ మండేలా చనిపోకుండా వుంటే ఏం చేసేదా అని ఆలోచించాను. బహుశా ధర్మవరపు సుబ్రహ్మణ్యం అంత్యక్రియలు పేరు చెప్పేదేమో! 'నేను ఏడిపిస్తున్న తెలుగువాళ్లని నవ్వించిన మహానుభావుడాయన. ఆయన మృతికి సంతాపసూచకంగా సెలబ్రేషన్స్ కాన్సిల్' అనేదేమో! **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2013)**

**డిసెంబరు 17 -20 ఎమ్బీయస్ : ఆరుషి కేసులో తీర్పు సబబేనా?**

ఆరుషి హత్య కేసులో వెలువడిన తీర్పు చాలామందిని ఆశ్చర్యపరిచింది. తలిదండ్రులు సొంతబిడ్డను చంపుకుంటారా? మీడియా చేసిన హంగామా వలన జడ్జిగారు ప్రభావితుడయ్యాడు అని చాలామంది అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియాలో కూడా విస్తృతంగా చర్చ జరుగుతోంది. తలిదండ్రులు హత్య చేశారని భావిస్తే దానితో బాటు ఆరుషి ప్రవర్తన మంచిది కాదని కూడా భావించాలి. ఒక 14 ఏళ్ల పిల్లకు 45 ఏళ్ల పనివాడితో అక్రమసంబంధం వుందని అనుకోవడానికి చాలా ఎబ్బెట్టుగా వుంది. ఎవరికీ నమ్మబుద్ధి కావటం లేదు. 'ఆరుషికి న్యాయం కలగజేయండి' అనే నినాదంతో ఫేస్‌బుక్‌లో ఒక ఉద్యమం నడుస్తోంది. మరి ఘజియాబాద్‌లోని సిబిఐ స్పెషల్ కోర్టు నవంబరులో వెలువరించిన తీర్పు తప్పందామా?

ఐదేళ్ల క్రితమే యీ కేసు ప్రారంభమైంది కాబట్టి కేసు వివరాలు చాలామందికి సరిగ్గా గుర్తుండకపోవచ్చు. తల్లీ తండ్రీయే చంపారని కొన్నాళ్లు, అబ్బే కాదు, పనివాళ్లు చంపారని కొన్నాళ్లూ కన్‌ఫ్యూజ్ చేశారు. ఇప్పటికి కూడా ఎవరు చంపారు, ఎలా చంపారు, ఎందుకు చంపారు అన్న విషయంపై స్పష్టత లేదు. 5 ఏళ్ల పరిశోధన, మూడు జట్ల యిన్వెస్టిగేటర్లు, 15 నెలల విచారణ, 46 మంది సాక్ష్యులు, 15 మంది డాక్టర్లు, 4 గురు ఫోరెన్సిక్ లాబ్‌లు.. అన్నీ కలిసి గందరగోళం. కేసు ఒక్కోసారి ఒక్కో దిశలో నడిచింది. పోస్టు మార్టమ్ చేసిన డాక్టరే మాట మార్చారు. అదేమంటే 'ఆరుషి తండ్రి రాజేష్ సోదరుడు దినేష్ కూడా డాక్టరే, అతను నా స్నేహితుడు. అతని కోరిక మేరకు ఆరుషి శృంగారంలో పాల్గొన్నదన్న విషయంలో వాస్తవాలు దాచి పెట్టాను' అన్నాడు. తప్పుడు సాక్ష్యం యిచ్చినందుకు ఆయనపై కేసు పెట్టాలి. ఇంకా పెట్టలేదు. కానీ పోస్టు మార్టమ్ నడిచే సమయంలో దినేష్ నుండి చాలా ఫోన్ కాల్స్ వచ్చాయని నిరూపణ అయింది.

మొత్తమంతా చూస్తే పోలీసులు కేసు విచారణ సరిగ్గా జరపలేదు అని స్పష్టంగా తేలుతోంది. చిన్న చిన్న విషయాలలో కూడా వాళ్లు శ్రద్ధ వహించలేదు. అంతమాత్రం తెలియనివారా మన పోలీసులు? ఏదైనా హత్య జరిగితే అక్కడకి ఎవర్నీ రాకుండా చేసి, సాక్ష్యాధారాలు సేకరించాలన్న ప్రాథమిక అవగాహన లేకుండా మన పోలీసు వ్యవస్థ పనిచేస్తోందా? రోడ్డు మీద యాక్సిడెంటు జరిగి శవం అక్కడ పడి వుంటే మనం పోయి తొంగి చూడబోతే పోలీసు కానిస్టేబుల్ అదిలిస్తాడు – 'అటు పోవద్దు' అని. అలాటిది ఒక డాక్టరు గారింట్లో బెడ్‌రూమ్‌లో శవం పడి వుంటే అక్కడకు బంధువులందరినీ రానిచ్చి అంతా కలయదిరగనిస్తారా? సాక్ష్యాలు నాశనం చేయనిస్తారా? ఒకవేళ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించినా చదువుకున్న తలిదండ్రులు ఊరుకుంటారా? ఆరుషి తలిదండ్రులు యిద్దరూ విద్యావంతులు. ఉన్నత కుటుంబం నుండి వచ్చినవారు. ఏదైనా హత్య జరిగినపుడు ఎలా వ్యవహరించాలో తెలియనంత మూరు?లు కారు. పైగా చనిపోయినది వాళ్ల సొంత కూతురు. హంతకుణ్ని పట్టుకోవాలన్న పట్టుదలతో ఏ సాక్ష్యం వదలవద్దని పోలీసులకు గట్టిగా చెప్పాలి. నిజానికి వాళ్ల యింటి పొరుగునే రిటైర్డ్ డిఎస్‌పి కెకె గౌతమ్ వున్నారు. ఆయనను పిలిచినా దగ్గరుండి అన్నీ చూసుకునేవాడు. తనను పోస్ట్ మార్టమ్ చేసే డాక్టరుకు సిఫార్సు చేయడానికి తనను ఉపయోగించుకుందామని దినేష్ ప్రయత్నించాడని గౌతమ్ 2012లో సిబిఐ కోర్టుకి చెప్పాడు. ఇవన్నీ తను సిబిఐకు మొదట్లోనే చెప్పినా వాళ్లు తమకు అనుకూలమైన విషయాలు మాత్రమే తీసుకుని తక్కినవి వదిలేశారని కూడా చెప్పాడు.

టివిలో "సిఐడి" వంటి క్రైమ్ సీరియల్ చూసే ప్రేక్షకులు కూడా యిలాటి జాగ్రత్తలు తీసుకుంటారు. మరి వీళ్లు డాక్టర్లు. దంతవైద్యులు కాబట్టి తమ చేతుల మీదుగా చావులు ఎక్కువ చూసి వుండకపోవచ్చు కానీ వాళ్ల కుటుంబంలో ఎందరో డాక్టర్లున్నారు. రాజేష్ తల్వార్ తండ్రి కార్డియో థొరాసిక్ సర్జన్. సోదరుడు దినేష్ నేత్రవైద్యుడు, వదిన వందన అనస్తీషియా డాక్టరు. రాజేష్ ఢిల్లీలో మౌలానా ఆజాద్ మెడికల్ కాలేజీలో బిడిఎస్ చదువుతూవుండగా నూపుర్ పరిచయమైంది. ఆమె మరాఠీ, యితను పంజాబీ. నూపుర్ తండ్రి ఇండియన్ ఎయిర్ ఫోర్సులో పనిచేశాడు. తర్వాత లండన్‌లో హై కమిషనర్‌గా పని చేసేటప్పుడు నూపుర్ బాల్యం లండన్‌లో గడిచింది. ఇద్దరూ 1989లో పెళ్లాడారు. రాజేష్ నోయిడాలోని ఫోర్టిస్ హాస్పటల్‌లో డెంటల్ యూనిట్‌కు హెడ్. ఐటిఎస్ డెంటల్ కాలేజీలో ప్రొఫెసర్. అది కాక ఢిల్లీలో హౌజ్ ఖాస్‌లో క్లినిక్ నడుపుతున్నాడు. నూపుర్ కూడా అక్కడే ప్రాక్టీసు చేస్తోంది.

వాళ్లిద్దరూ కలిసి నోయిడాలోని జలవాయు విహార్‌లో మంచి లొకాలిటీలో 1300 చ.అ.ల 2 బెడ్‌రూమ్ ఫ్లాట్ కొనుక్కున్నారు. అది సెకండ్ ఫ్లోర్‌లో వుంది. ఆ యింటి ప్లాను చూస్తే తప్ప కొన్ని విషయాలు అర్థం కావు. మామూలుగా ఫ్లాట్ అనగానే ఒక్కటే ప్రవేశద్వారం వుంటుంది. కానీ దీనికి డోర్లు చాలానే వున్నాయి. మెయిన్ గ్రిల్ డోర్ ఒకటి, ఆ తర్వాత మరో గ్రిల్ డోర్, ఆ తర్వాత తనంతట తాను లాక్ అయ్యే చెక్క తలుపు ఒకటి.. యిలా. అంతేకాదు, ప్రత్యేకంగా డాబా కూడా వుంది. దానికి ఫ్లాట్ బయటనుండి మెట్లున్నాయి. మొదటి గ్రిల్ డోర్ దాటి రెండో గ్రిల్ డోర్‌కు వెళుతూండగానే కుడివైపు హేమరాజ్ గది వుంది. అక్కడున్న తలుపు ద్వారా ఆ గదిలోకి వెళ్లవచ్చు. అతని గదినుండి డ్రాయింగు హాల్లోకి యింకో తలుపు వుంది. డ్రాయింగ్‌హాల్లోకి వెళ్లాక కుడివైపు

ఆరుషి బెడ్‌రూమ్ వుంది, ఎదురుగా రాజేష్ దంపతుల బెడ్‌రూమ్ వుంది. ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటంటే కావాలనుకుంటే హేమరాజ్ (అతని అసలు పేరు యమ ప్రసాద్) రాజేష్ వాళ్లకి తెలియకుండా ఆరుషి గదిలోకి వెళ్లగలడు.

అందుకే ఆరుషి గదికి బయటనుండి తాళం వేస్తూ వుంటారు. ఆరుషి తలుచుకుంటే లోపలనుండి తలుపు తీయగలదు. కానీ బయటనుండి ఎవరైనా ఆ గదిలోకి వెళ్లాలంటే తాళంచెవి వుండాల్సిందే. హత్య జరిగిన రాత్రి ఆరుషియే హేమరాజ్ కోసం తలుపు తీసి వుంటుందని ప్రాసిక్యూషన్ అంటుంది. 'అబ్బే, నేనే తాళం చెవిని డోరులోనే మర్చిపోయాను. దానితో హేమరాజ్ ఆమె గదిలోకి వెళ్లి వుంటాడు.' అంటుంది నూపుర్. తమ కూతుర్ని హేమరాజ్ హత్య చేసి పారిపోయాడు అనే థియరీతోనే ఆరుషి తలిదండ్రులు కేసు నడవాలని ఆశించారు.

2008 మే 16 ఉదయం హత్య బయటపడింది. నూపుర్ కథనం ఏమిటంటే – 'మా యింట్లో పని చేసే భారతి 6 గంటలకు కాలింగ్ బెల్లు కొట్టింది. బయటి గ్రిల్ డోరు తోసి చూసింది. మామూలుగా అయితే హేమరాజ్ వచ్చి తలుపు తీసేవాడు. అవేళ తీయలేదు. మళ్లీ మళ్లీ బెల్లు కొట్టగా నేను చెక్క తలుపు తీసి లోపటి గ్రిల్ డోర్ తెరిచి భారతిని చూసి "హేమరాజ్ లేడా? పాలకోసం వెళ్లాడేమో కాస్త ఆగు" అన్నాను. "అప్పటిదాకా ఆగడం దేనికి, మీరు తాళం చెవి విసిరేస్తే నేను గ్రిల్ డోరు తలుపు తీసుకుని లోపలకి వస్తాను" అంది భారతి. తర్వాత చూస్తే ఆ డోర్ బిగుసుకు పోయి వుంది తప్ప తాళం వేసి లేదు. రెండో గ్రిల్ డోరు మాత్రం బయటనుండి గొళ్లెం వేసి వుంది. (హేమరాజ్ వెళ్లిపోతూ పోతూ లోపలి గ్రిల్ డోర్ బయటనుండి గొళ్లెం పెట్టి వెళ్లాడని చూపించడానికి రాజేష్ దంపతులు ప్రయత్నించారు. డ్రాయింగ్ హాల్లోంచి హేమరాజ్ గదిలోకి వచ్చి, దాని రెండో తలుపులోంచి గ్రిల్ డోర్ బయట గొళ్లెం పెట్టే వీలుంది). నేను, భారతి మాట్లాడుతూండడం విని రాజేష్ నిద్ర లేచి హాల్లోకి వచ్చాడు. అక్కడ డైనింగ్ టేబుల్ మీద విస్కీ సీసా చూసి ఉలిక్కిపడ్డాడు. ఎవరో వచ్చి వుంటారని భయపడుతూ వెంటనే ఆరుషి గదికి వెళ్లి చూశాడు. అక్కడ ఆరుషి చచ్చిపోయి వుంది."

దీని తర్వాత భారతి చెప్పినదిది – "అవును, నేను లోపలకి వెళ్లేసరికి రాజేష్, నూపుర్ ఏడుస్తున్నారు. నూపుర్ నన్ను కౌగలించుకుని "ఆరుషి గదిలోకి వెళ్లి  ఏం జరిగిందో చూడు" అంది. నేను గదిలోకి వెళ్లగానే నూపుర్ వెనక్కాలే వచ్చి పక్కమీద వున్న ఆరుషి శవంపై తలారా కప్పిన దుప్పటి తీసి చూపించింది. నాకు ఆరుషి మెడపై రక్తపుచార కనబడి భయపడింది. "చూశావా, హేమరాజ్ ఎంత ఘోరం చేశాడో?" అని అరిచింది నూపుర్. "వెళ్లి యిరుగుపొరుగును పిలుచుకుని రానా?" అని అడిగింది భారతి వణుకుతూ. "సరే పిల్చుకుని రా" అంది నూపుర్. వచ్చినవాళ్లలో వాళ్ల పొరుగున వుండే టాండన్ అనే అతను సెక్యూరిటీ గార్డును పిలిచి పోలీసులకు చెప్పమన్నాడు."

దీనిలో వింతగా తోచే అంశాలేమిటంటే – రాజేష్ నిద్ర లేచేసరికి ఆరుషి శవం కనబడింది అనుకుందాం. దాన్ని కదల్చకుండా అలాగే వుంచుతారు. ఒకవేళ బతికి వుందేమోనన్న అనుమానం వుంటే డాక్టర్లు కాబట్టి నాడి పట్టుకుని చూస్తారు. అంతేగాని, పైన దుప్పటి కప్పుతారా? ఇంట్లో శవం కనబడగానే మొదట చేయాల్సిన పని పోలీసులను పిలవడం. పనిమనిషి వస్తే ఆమెకు శవం చూపించి యిరుగుపొరుగునీ పిల్చుకుని రమ్మనడం కాదు. పోలీసులను వేరేవాళ్లు పిలిచారు. పోలీసులు 6.50కు వచ్చారు. అప్పటిదాకా పక్కింటివాళ్లను రానివ్వక్కరలేదు. పోలీసులు వచ్చేసరికే హాల్లో 15 మంది, తల్వార్ల బెడ్‌రూమ్‌లో 6 మంది వున్నారు. ఇక సాక్ష్యాలు ఏం మిగులుతాయి? కావాలనే వీళ్లు సాక్ష్యాలు నాశనం చేసినట్లు కనబడుతోంది. "హేమరాజ్ మా అమ్మాయిని చంపేసి వెళ్లిపోయాడు" అని నూపుర్ చెప్పింది. ఎందుకు చంపుతాడు? అవసరం ఏముంది? ఎందుకో అందుకు చంపాడనుకుంటే – ఆరుషి గదిలోకి వెళ్లగలగాలి. ఎలా? 'తాళంచెవి తలుపులో వదిలేశాను' అని నూపుర్ చెప్పింది. అది తీసుకుని లోపలకి వెళ్లి చంపేసి, డ్రాయింగ్ హాల్లోంచి తన గదిలోకి వెళ్లి, మరో తలుపు ద్వారా బయటి గ్రిల్ డోర్ తీసుకుని వెళ్లిపోయి వుండాలి. అందుకే అది తాళం వేసి లేదు.

పోలీసులు వచ్చినపుడు యీ కథే వినిపించారు. వాళ్లు వెంటనే నమ్మేశారు. సాక్ష్యాలు పెద్దగా ఏమీ సేకరించలేదు. ఇల్లంతా తిరిగి చూడలేదు కూడా. టెర్రేస్ మీద చూడాలని ఎవరో ఒక పోలీసతను అన్నాడట. తాళం చెవి కనబడటం లేదు అన్నాడు అప్పటికే మతి పోయి వున్న రాజేష్. సరే, ఏం చూస్తాంలే అని వదిలేశారు పోలీసులు. ఇది వింతాతి వింత విషయం. హత్యాయుధం దొరకనప్పుడు పరిసరాలన్నీ క్షుణ్ణంగా వెతుకుతారు. తాళంచెవి లేదంటే  తలుపు బద్దలు కొట్టి మరీ చూస్తారు. అది చేయలేదు. టీవీ చర్చలకు వచ్చిన రాజేష్ వదిన ఈ విషయంపై మాట్లాడుతూ – కూతురు చనిపోయిన ఆందోళనలో వున్న తండ్రి తాళం చెవి మర్చిపోవడం సహజమే కదా అన్నారు. సాక్ష్యాలు చెదిరిపోయిన మాట ఎత్తితే 'యింటి నిండా బంధుమిత్రులు వచ్చేశారు. గందరగోళంగా వుంది. పోలీసులే అవన్నీ చూసుకోవాలి. చూసుకోకుండా యిప్పుడు మా వాడిపై నింద వేస్తే ఎలా?' అని వాదించారు.

ఇంత ప్రాథమిక విషయాలు కూడా తెలియకుండానే పోలీసులకు వుద్యోగాలు చేస్తున్నారా? మామూలుగా మనం వూహించవలసినది ఏమిటంటే – చూసీ చూడనట్లు పొమ్మనమని పోలీసులకు వాళ్ల పై అధికారులు చెప్పి వుంటారు. ఆ విధంగా వాళ్ల చేత చెప్పించినది రాజేష్ కుటుంబమే అయివుంటుంది. ఆ కుటుంబానికి వున్న పలుకుబడి మనం విస్మరించకూడదు. 14 ఏళ్ల అమ్మాయి పనివాడి చేతిలో హత్యకు గురైందని వింటే ఎవరికైనా మనసు కరుగుతుంది. కేసు అంటూ కోర్టు గొడవలతో విసిగించకూడదని జాలిపడతారు. 'హేమరాజ్ ఏదో కారణం చేత ఆరుషిని హత్య చేసి పారిపోయాడు, దొరకలేదు' అని రాసేసి కేసు క్లోజ్ చేస్తే చాలు అని పోలీసులకు చెప్పి పంపించివుంటారు. అందుకే డాబా మీదకు వెళ్లి చూడనక్కరలేదని పోలీసులకు అనుకున్నారు. పెద్దింట్లో కేసు కాబట్టి అంతా

మొక్కుబడి వ్యవహారమే. మన దగ్గర సినీనటుడు బాలకృష్ణ యింట్లో కాల్పుల కేసు చూశాం, వాచ్‌మన్‌ను చంపేశారు. దాని గురించి ఎవరైనా వివరంగా చెప్పగలరా? ఎవరికైనా శిక్ష పడిందా? మనిషి తనంతట తానే చావలేదు కదా. మరి ఎవరో ఒకరికి శిక్ష పడాలి కదా!

విచారణ సరిగ్గా చేసినా చేయకపోయినా పోస్టుమార్టమ్ తప్పదు కదా. చావుకి ముందు ఆరుషి ఎటువంటి శృంగారచేష్టలలోనూ పాల్గొనలేదని, ఆమెపై ఏ అత్యాచారమూ జరగలేదని రాసేశారు. అందువలన హేమరాజ్ డబ్బు కోసమో, మరి దేని కోసమో చంపాడని మొదటిరోజు అనుకున్నారు. మర్నాడు హేమరాజ్ శవం బయటపడి వుండకపోతే ఆ కథ అలాగే నడిచి వుండేది. ఈ లోపున రాజేష్ చాలా హంగామానే చేశాడు. హేమరాజ్ ఆచూకీ చెప్పినవాళ్లకు 25 వేల రూ.లు బహుమతి ప్రకటించాడు. పోలీసులు కూడా ప్రకటనలు యిచ్చారు. కానీ హేమరాజ్ ఆ యింటి డాబా మీదనే శవంగా తేలాడు.

రాజేష్ దంపతులు ఆ రోజే ఆరుషి అంత్యక్రియలు జరిపేసి, మర్నాటికల్లా ఆమె అస్థికలు గంగలో కలపాలంటూ హరిద్వార్‌కు కారులో బయలుదేరారు. కెకె గౌతమ్ అనే రిటైర్డ్ డియస్పీ వీళ్ల యింటి పక్కనే వుంటాడు. ఆయన మర్నాడు మధ్యాహ్నం వాళ్లను పలకరించడానికి వచ్చాడు. పోలీసు బుద్ధి కదా, హేమరాజ్ గదిని చూడబోయాడు. అక్కడ వైన్, బియర్, స్ప్రైట్ బాటిల్స్ కనబడ్డాయి. హేమరాజ్‌తో బాటు ఎవరైనా వున్నారా? వాళ్లంతా కలిసి డ్రింక్స్ తీసుకుని వుంటే మరి మూడు గ్లాసులుండాలి కదా! అవేవీ? ఫ్లాట్ అంతా కలయదిరగడంలో డాబా మెట్ల వద్ద రక్తపుచుక్కలు కనబడ్డాయి. వాటిని అనుసరిస్తూ పైకి వెళ్లాడు. టెర్రేస్ తెరిపించాడు. గోడమీద రక్తపు చేతిముద్ర, రక్తపునీటితో వున్న ఎయిర్ కూలరు కనబడ్డాయి. అక్కడ ఒక శవం కనబడింది. మే నెల మండుటెండలు కాబట్టి రోజున్నరలో బాగా కుళ్లిపోయింది. ఆ శవాన్ని అక్కడకు దుప్పటిలో చుట్టి తెచ్చినట్టు కనబడుతోంది. ఎయర్ కూలరు గ్రిల్ దానిపై పెట్టారు. పక్క ఫ్లాట్ వాళ్ల డాబా మీద నుంచి చూసినా యిది కనబడకుండా వుండడడానికి మధ్యనున్న గ్రిల్‌కి అక్కడ ఆరేసి వున్న దుప్పటి అడ్డంగా కట్టారు.

నిజానికి ముందురోజు ఉదయం 8.30కు ఆరుషి శవాన్ని పోస్టుమార్టమ్‌కు తీసుకెళ్లాక ఆమె గదిలో పరుపు, దుప్పటీ అవీ తడిపేసి డాబా మీద ఆరేద్దామనుకున్నారు. టెర్రేస్ తాళం చెవి లేదనడంతో పక్కింటి ఫ్లాట్ డాబా మీదకు వెళ్లి ఆరబెట్టారు. అప్పుడు యీ వైపు చూసినా యీ శవం కనబడలేదు. అనుకోకుండా గౌతమ్ వచ్చి కెలకడంతో బయటపడింది. సరే యింతకీ యీ శవం ఎవరిది? హేమరాజ్‌దా? రాజేష్‌కు ఫోన్ చేశారు. అతనూ, భార్యా హరిద్వార్‌కి వెళ్లే దారిలో వున్నారు. వెనక్కి రప్పించారు. అస్థికల పాత్ర పట్టుకుని నూపుర్ కారులోనే కూర్చుని వుండగా రాజేష్ పైకి వచ్చాడు. శవం చూపించి హేమరాజ్‌దా అంటే కాదన్నాడు. గుర్తు పట్టలేనన్నాడు. అప్పుడు యితరులు యిది హేమరాజ్‌దే అన్నారు. 8 నెలలుగా యింట్లోనే అహర్నిశలు వుంటూ వంట చేసిపెడుతూ, పనుల్లో సాయపడుతూ వున్న వ్యక్తి శవాన్ని రాజేష్ గుర్తించకపోవడమేమిటి? హేమరాజ్ హత్య చేసి పారిపోయాడన్న థియరీకే అతను కట్టుబడ్డాడు కాబట్టే అనుకోవాలి. పోలీసులు వచ్చి రాజేష్ దంపతులను హరిద్వార్‌కు, యీ శవాన్ని పోస్టుమార్టమ్‌కు పంపించారు. ఆరుషి లాగే యితని హత్య కూడా రాత్రి 1- 2 ప్రాంతంలో జరిగినట్టు తెలిసింది. అంటే హేమరాజ్ ఆరుషిని చంపిన తర్వాత వేరే ఎవరైనా అతన్ని చంపారా? ఎందుకు? లేక హేమరాజ్‌ను, ఆరుషిని ఒకళ్లే చంపి శవాలను వేర్వేరు చోట్ల పడేశారా?

రెండోదే జరిగింది అనుకుంటే అలా చేసినది రాజేష్ కావచ్చు. ఆరుషి శవాన్ని దుప్పటి కప్పి యింట్లోనే పెట్టి హత్యానేరం హేమరాజ్ శవాన్ని డాబా మీద పడేసి, దాన్ని ఎవరూ చూడకుండా చేసి, హేమరాజ్‌నే నిందితుడిగా చూపించాడనుకోవాలి. మే 16 రాత్రి హేమరాజ్ శవాన్ని మాయం చేయాలని అనుకుని ఏ కారణం చేతనో చేయలేకపోయా డనుకోవాలి. క్రైమ్ నవలలోనే కాదు, నిజంగా జరిగే నేరసంఘటనల్లో కూడా హంతకుడు ఏదో ఒక సాక్ష్యాన్ని వదిలిపెట్టడమో, అనుకోకుండా ఏదో జరిగి – ఎవరో రావడమో, లేక చప్పుడు కావడం చేత భయపడి దేన్నో ఆనుకుని అక్కడ వేలిముద్రలు పడడమో ఏదో జరుగుతుంది. మొన్న మహేష్ బ్యాంక్‌లో బంగారం చోరీ సంగతి చూడండి. మొగానికి ముసుగు వేసుకున్నాను కదాని దొంగ కొన్ని సిసిటివి కెమెరాలు ఆఫ్ చేయలేదు. నడక తీరు బట్టి పట్టేశారు. స్టాఫ్‌లో ఎవరో ఒకరు చేసి వుంటారనుకుని వాళ్లందరినీ నడిచి చూపించమన్నారు. పోలిక దొరికింది. ఒక్కోసారి హంతకుడు మొదటి హత్య చాలా పకడ్బందీగా చేస్తాడు. దొరకడు. పోలీసులు పట్టుకోలేక పోవడంతో ధైర్యం పెరిగి రెండో హత్య చేస్తాడు. అప్పుడు పొరబాటున క్లూ వదిలేయడం జరుగుతూ వుంటుంది. వదిలేయకపోయినా రెండు హత్యావిధానాల్లో వున్న సారూప్యత (మోడస్ ఒపరాండి), రెండు కేసుల్లో వున్న అవసరం, అవకాశం పోల్చి చూసేసరికి హంతకుడు పట్టుబడతాడు. రాజేషే హంతకుడు అనుకుంటే రెండో శవమే అతన్ని పట్టిచ్చింది.

అయితే కోర్టు కూడా అతన్ని హంతకుడు అని డైరక్టుగా అనలేదు. అనడానికి సాక్ష్యాలు చాలలేదు. సాధారణంగా హత్యాస్థలంలో తీసిన ఫోటోలు బలమైన సాక్ష్యంగా వుంటాయి. కానీ యీ కేసులో పోలీసు ఫోటోగ్రాఫర్ ఫింగర్‌ప్రింట్స్ కోసం తీసిన 24 ఫోటోల్లో 22 మసకమసగ్గా వున్నాయి. అతను సబ్మిట్ చేసిన ఫోటోల్లో 23 ఫోటోలు నెగటివ్స్‌తో మ్యాచ్ కాలేదు. టెర్రేస్ మీద రక్తపు కాలిముద్రలను ఫోటో తీయలేదు. ఏం? అంటే చాలామంది జనం వున్నారండి అన్నాడు. డ్రాయింగ్ హాల్లో ఓ మూల బార్ వుంది. అక్కడ విస్కీ బాటిల్ వుంది. దానిపై రక్తంతో తడిసిన వేలిముద్రలున్నాయి. అవి ఎవరివి అంటే వేటితోనూ మ్యాచ్ కాలేదండి అన్నాడు. హత్యాస్థలం వద్ద మడతలు పడని దుప్పటి అవీ చూసి సాక్ష్యాలు మసిబూసి మారేడుకాయ చేశారన్న అనుమానమే రాలేదతనికి. 2010 మార్చి తర్వాత కేసు తిరగతోడినప్పుడే వీటిపై అతను నోరు విప్పాడు.

పోలీసు శాఖలో పనిచేసే ఫోటోగ్రాఫర్ యింత అసమర్థుడా? సాధారణంగా పెద్దవాళ్లు యిన్‌వాల్వ్ అయిన కేసుల్లో పోలీసులు కావాలనే సాక్ష్యాలను, ఆధారాలను సరిగ్గా సేకరించరు. ప్రజలను సంతృప్తి పరచడానికి కొన్నాళ్లపాటు కేసు నడిపిస్తారు. కోర్టులో విచారణకు వచ్చేసరికి ఈ ఆధారాలు తేలిపోతాయి. సాక్షులు ఎదురు తిరుగుతారు. తగిన ఆధారాలు లేవంటూ కోర్టు కేసు కొట్టేస్తుంది. పనిలో పనిగా తమ విధి సరిగ్గా నిర్వహించలేదంటూ పోలీసులకు అక్షింతలు వేస్తుంది. వాళ్లు తల ఓసారి ఝాడించి, అక్షింతలు విదిల్చేసుకుంటారు. జగన్ కేసులో సిబిఐ చేసిన హంగామా చూశాం. నెలల తరబడి మీడియా హోరెత్తించేసింది – అదిగో ఆ కేసులో పట్టుబడ్డాడు, యీ కేసులో యింకేముంది, సిబిఐ సాక్ష్యాలు సేకరించింది, వాళ్లను విచారించింది, వీళ్లను నిలదీసింది, ఫలానావాడు నిజాలు కక్కేశాడు.. అంటూ చివరకు ఏం జరిగింది? సిబిఐ పెట్టిన 10 కేసుల్లో 8 వాటికి ఆధారాలు సరిపోలేదన్నారు. బెయిలు యిచ్చారు. ఫైనల్‌గా కోర్టు అన్నీ కొట్టి పారేసినా ఆశ్చర్యం లేదు.

అలాగే కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి కేసు. ఇన్నేళ్లు సాగదీసేటప్పటికి నిందితుల్లో ఒకడు యీ మధ్యే హత్యకు గురయ్యాడు. ముఖ్యసాక్షులు ఎదురు తిరిగారు. హతుడి కుటుంబసభ్యులే జావకారిపోయారు. ఆధారాలు లేవంటూ కోర్టు కేసు మూసేసింది. ధర్మం జయించిందని స్వాములు ప్రకటించారు. ఈయన చంపలేదు సరే, మరి అతన్ని ఎవరు చంపారు? అడిగినవారు లేరు. సాక్షుల మానసిక స్థితి కూడా ఎప్పుడూ ఒకలాగ వుండదు. ప్రలోభాలకు లొంగవచ్చు, భయపడవచ్చు, ఎందుకొచ్చిన గొడవ అనుకోవచ్చు. కేసు సాగదీసినకొద్దీ రంగులు మారిపోతాయి. ఇప్పుడు రాజేష్ తల్వార్ కేసులో కూడా యిదే ఫైనల్ అనుకోవడానికి లేదు. వీళ్లు పై కోర్టుకి వెళ్లేటప్పటికి సాక్షులు తమ సాక్ష్యాలు మార్చేయవచ్చు. సిబిఐ వారు ఒత్తిడి చేసి మా చేత చెప్పించారు అనవచ్చు.

అసలు హత్య జరిగిన వారం రోజులకే పోలీసు ఐజి గురుదర్శన్ సింగ్, నిందితుడు రాజేష్ తల్వారే అనేశాడు. 'ఆ రోజు రాజేష్ తెల్లవారుఝామున 3 గంటల దాకా మేలుకుని యింటర్నెట్‌తో పని చేసుకుంటున్నాడు. ఎందుకంటే యింటర్నెట్ రౌటర్ 3 గంటలదాకా పని చేస్తూనే వుంది. (12 గంటల తర్వాత యింటర్నెట్ వాడలేదని మరో కథనం వుంది) అది కట్టేసేసరికి అతనికి ఆరుషి గదిలో చప్పుళ్లు వినబడ్డాయి. వెళ్లి చూశాడు. హేమరాజ్, ఆరుషిని సన్నిహితంగా చూశాడు. విపరీతమైన కోపంతో ఒక దుడ్డుకర్రలాటి (అది రాజేష్ గాల్ఫ్ క్లబ్ కావచ్చు) తో దానితో యిద్దరి తలల మీద బాదాడు. నూపుర్ లేచి వచ్చి అతనికి సాయపడింది. డాక్టర్లకుండే సహజమైన లాఘవంతో సన్నటి చాకుతో యిద్దరి గొంతులూ కోసి చంపేశారు. హేమరాజ్ శవాన్ని డాబా మీదకు చేర్చి తాళం వేసేశారు. ఇక ఆరుషి శరీరంపై శృంగారానికి సంబంధించిన జాడలు ఏవీ కనబడకుండా శుభ్రం చేసేశారు. ఆ ప్రదేశంలో సాక్ష్యాలు లేకుండా చూసి, ఆమె శవంపై దుప్పటి కప్పేశారు. రాజేష్ నెర్వస్‌గా ఫీలయ్యాడు. వెళ్లి బార్ తెరిచి విస్కీ బాటిల్ తెరిచి కాస్త తాగాడు. దాని మీద హతుల యిద్దరి రక్తపు నమూనాలు వున్నాయి. ఇద్దర్నీ చంపినది ఒక్కరే. అది రాజేష్. పరువుకోసం చేసిన హత్య యిది' అని సింగ్ కథనం.

చాలామంది దాన్ని విశ్వసించారు. మే 31న సిబిఐకు అప్పగించారు. జులై 11 న రాజేష్ బెయిల్‌లో బయటకు వచ్చాడు. ఇక అతన్ని కేసు నుండి తప్పించడానికి సిబిఐ జాయింటు డైరక్టరు అరుణ్ కుమార్ ప్రయత్నించసాగాడు. హేమరాజ్‌ను ఎవరు ఎందుకు చంపారు? అన్నదానికి సమాధానం చెప్పాలి కాబట్టి, ముగ్గురు పనివాళ్లను వేదికపైకి తీసుకుని వచ్చాడు. రాజేష్ వద్ద పనిచేసే కృష్ణ అనే పనివాడు, పక్కింట్లో పని చేసే విజయ్ మండల్, తల్వార్ల స్నేహితులు దురానీల యింట్లో పనివాడు రాజ్‌కుమార్ ముగ్గురు కలిసి హేమరాజ్ గదిలో మందు కొట్టారని, హేమరాజ్ వారిస్తున్నా ఆరుషిపై బలాత్కారం జరిపి, చంపి, ఆ తర్వాత హేమరాజ్‌ను చంపారని వాదించారు. వాళ్లపై నార్కో టెస్టులు జరిపి నిజాలు రాబట్టామని చెప్పారు. హేమరాజ్ శవాన్ని మెట్లమీదకు లాక్కుని వెళ్లిన గుర్తులు లేవని, హేమరాజ్, కృష్ణ డాబా మీదనే ఘర్షణ పడ్డారని, అక్కడే హేమరాజ్ హత్యకు గురయ్యాడని చెప్పాడు. ఆ కథనంలోనూ చాలా లోపాలున్నాయి. కోర్టులో చెపితే నిలిచేట్లు లేదు. 14 నెలలు గడిచేసరికి అరుణ్ కుమార్‌ను తప్పించి కౌల్ అనే ఆయన్ని యిన్వెస్టిగేషన్ ఆఫీసరుగా తీసుకుని వచ్చారు. 15 రోజుల్లో కేసు స్వరూపం మారిపోయింది. ముగ్గురు పనివాళ్లు నిరపరాధులనీ, రాజేషే ప్రధాన నిందితుడే కానీ నిరూపించేందుకు సాక్ష్యాలు లేవు కాబట్టి కేసు మూసేయాలని విజ్ఞప్తి చేసింది.

అయితే రాజేష్ యీ మచ్చను సహించలేకపోయాడు. ఎందుకంటే ఆరుషి–హేమరాజ్ అక్రమసంబంధం సిద్ధాంతం నమ్మబుద్ధిగా లేదు కాబట్టి, ఆమె క్లాస్‌మేట్స్, స్నేహితులు ఎవరూ ధృవీకరించలేదు కాబట్టి, రాజేష్‌కు, అనితా దురానీ అనే డెంటిస్టుకి సంబంధం వుందని, అదే యీ హత్యలకు మూలకారణమనీ మరో పుకారు బయటకు వచ్చింది. అనిత, అతను కలిసి రోజూ ఉదయం నోయిడాలో ఒకే క్లినిక్‌లో పనిచేస్తారు. అదే క్లినిక్‌లో సాయంత్రం అనిత భర్త, రాజేష్ భార్య కలిసి పనిచేస్తారు. రెండు జంటలూ చాలా స్నేహంగా వుంటాయి. హేమరాజ్ యీ విషయాలు గ్రహించి బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని, అవేళ రాత్రి రాజేష్ కోపం పట్టలేక హేమరాజ్ తల బద్దలు కొడితే ఆరుషి నిలదీసిందని, అందుకే కోపావేశంలో ఆమెనూ చంపివేశాడనీ అనసాగారు. హేమరాజ్ భార్య నేపాల్ నుండి వచ్చి 'తమ కుటుంబరహస్యాలు బయట పెడుతున్నందుకు తిడుతున్నాడనీ, బెదిరిస్తున్నాడనీ హేమరాజ్ తరచూ వాపోయేవాడ'ని మీడియాతో చెప్పింది. ఈ గొడవల కారణంగా రాజేష్ సిబిఐ రిపోర్టును ఛాలెంజ్ చేస్తూ పరిశోధన యింకా సాగించాలని కోరాడు. బయట మీడియాలో పరువునష్టం దావా వేస్తానని బెదిరించాడు. ఎందుకంటే బయట ప్రజలు రాజేష్, నూపుర్‌లే యీ హత్య చేసి వుంటారని బలంగా నమ్మసాగారు.

అలా కోరడమే రాజేష్ కొంప ముంచింది. 2012 జూన్ నుండి సిబిఐ కేసుని తిరగదోడింది. పోస్టుమార్టమ్ చేసిన డాక్టరును తలమీద గాయాల గురించి ఎందుకు రాయలేదని అడిగింది. అతను తన స్టేటుమెంటు మార్చాడు. చివరకు జడ్జి రాజేష్, నూపుర్‌లను హత్య చేసినందుకు గాక, సాక్ష్యాలు తారుమారు చేసినందుకు శిక్షించారు. ఆ నలుగురు తప్ప ఆ రాత్రి ఆ యింట్లో వేరే ఎవరూ లేరని, ఆరుషి తలుపు తీసి హేమరాజ్‌ను తన గదిలో రప్పించుకుందని కోర్టు అభిప్రాయపడింది. డిఫెన్సు తరఫున వచ్చిన సాక్ష్యాలను కోర్టు విశ్వసించలేదు. ఆరుషి, హేమరాజ్‌ల సెల్ ఫోన్లు మాయం కావడం కూడా మిస్టరీగా వుంది. బయటి హంతకుడు యిన్ని జాగ్రత్తలు తీసుకుంటాడా అని కోర్టు సందేహం.

ఆరుషి తలిదండ్రులు అమాయకులని యిప్పటికీ చాలామంది నమ్ముతున్నారు. 45 ఏళ్ల హేమరాజ్ బంజాడేకి వాళ్ల నేపాల్ దేశంలో భార్యాబిడ్డలే కాదు, మనుమడు కూడా వున్నాడు. ఎనిమిది నెలల క్రితమే పనిలో చేరాడు. అతన్ని 14 ఏళ్ల ఆరుషి దగ్గరకు రానిస్తుందా? అర్ధరాత్రి తలుపు తీసి ఆహ్వానిస్తుందా? అని విస్తుపోతున్నారు. ఈ విషయాలపై చర్చించినకొద్దీ వెగటు పుట్టి యీ వెర్షన్ నమ్మబుద్ధి కాదు. కానీ అలా అయితే చాలా ప్రశ్నలకు సమాధానం చెప్పవలసి వుంటుంది – బయటనుండి బలవంతంగా ఆ యింట్లోకి గాని, ఆమె గదిలోకిగాని వేరెవరో చొరబడినట్లు కనబడటం లేదు. ఆరుషి గది తలుపులో తాళం చెవి ఆ రాత్రి వదిలేశానని నూపుర్ చెప్పినది ఎంతవరకు నిజమో తెలియదు. బయటనుండి వచ్చిన హంతకుడైతే బార్ వద్దకు వెళ్లి ధైర్యంగా విస్కీ తాగడు. తలిదండ్రులు ఏ క్షణాన్నయినా లేస్తారన్న భయం వుంటుంది. 'మేం మా తలుపులు బిడాయించుకుని ఎసి వేసుకుని పడుక్కున్నాం. మాకేమీ వినబడలేదు' అంటున్నారు రాజేష్, నూపుర్‌లు. అయితే ఆ రాత్రి ఇంటర్నెట్ రౌటర్ని ఎవరో గానీ మధ్యమధ్యలో ఆన్ చేసి, ఆఫ్ చేస్తున్నారు. ఇది 3 గంటల దాకా సాగింది. రాజేష్ నిద్రపోయి వుంటే నెట్ వాడినవారెవరు? హేమరాజ్ శవాన్ని డాబాపైకి యీడ్చిన హంతకుడు తర్వాత శవంపై కూలర్ గ్రిల్ పెట్టాడు. ఆ గ్రిల్ తీయడంలో అతని చేతుల కంటిన రక్తం కూలరు నీళ్లలో కలిసింది. హంతకుడు ఆ తర్వాత టెర్రేస్ తలుపు తాళం పెట్టి మళ్లీ యింట్లోకి ప్రవేశించాడు. డైనింగ్ టేబుల్ పక్కన మామూలుగా అందరికీ కనబడకుండా ఉడెన్ ప్యానెల్ వెనక్కాల వుండే బార్ తెరిచి విస్కీ తాగాడు. బయటివాడెవడైనా అయితే యింత అవస్థ ఎందుకు పడతాడు? శవాన్ని దాని మానాన్న దాన్ని వదిలేసి పారిపోతాడు. వచ్చి తీరిగ్గా మందు కొట్టడు.

అందువలన యిది కచ్చితంగా ఇంటి సభ్యుల పనే. రాజేష్ కాకపోతే మరెవరు చేశారో చెప్పవలసినది వారే! మద్యం ముట్టని హేమరాజ్ గదిలో మద్యపు సీసాలు ఎలా వున్నాయి? వంటి చిక్కు వీడని ముళ్లు ఇప్పటికి కూడా చాలా వున్నాయి. కావాలని గందరగోళ పరచిన కేసులో యివి తప్పవు. గందరగోళ పరిచినదెవరు? అంటే హంతకులే అయి వుండాలి. రాజేష్ దంపతుల్లో కూతురు హంతకులను పట్టించాలన్న ఆతృత కంటె కావాలని సాక్ష్యాలను చెరిపివేయించాలన్న తపన స్పష్టంగా కనబడుతోంది కాబట్టి, వారినే అనుమానించాలి. ఆ విధంగా చూస్తే తీర్పు సబబే. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2013)**

**డిసెంబరు 21-22 వీక్లీకై** **ఎమ్బీయస్ : బిజెపి టి-టిడిపి బాట పడుతుందా?**

తెలంగాణ బిల్లు పార్లమెంటుకి ఎప్పుడు వస్తుందో ఎవరూ చెప్పలేకుండా వున్నారు. సోనియా కనుసన్నల్లో నడిచిన కాబినెట్ చేతిలో వున్నంతకాలం అడ్డదారుల్లో, అడ్డగోలుగా, అడావుడిగా పరుగులు పెట్టించారు. వారి చేతిలో నుండి బయటపడి రాష్ట్రపతి దగ్గరకు వెళ్లేసరికి స్పీడు బ్రేకర్లు పడసాగాయి. జైరాం రమేష్ లెక్క ప్రకారం సోనియా పుట్టినరోజుకే బిల్లు రాష్ట్ర అసెంబ్లీకి వచ్చేయాలి. అసలా స్టేటుమెంటు ఎలా యిచ్చాడో నాకు అర్థం కాదు. రాష్ట్రపతి తనకు బిల్లు రాగానే చూడకుండానే పంపించేసినా గవర్నరుకో, స్పీకరు ఆఫీసుకో పంపాలి. స్పీకరు అసెంబ్లీని సమావేశపరుస్తూ అందరికీ కబురు పెట్టాలి. దీనికి హీనపక్షం ఒక్కరోజైనా పట్టదా? అలాటప్పుడు సోమవారం 'అసెంబ్లీకి వస్తుంది' అనడమేమిటి, మహా అయితే గవర్నరుకి చేరుతుంది అనాలి. రాష్ట్రపతి భవన్ నుండి బయటకు బుధవారం రాత్రి బయటకు వచ్చింది. మన చీఫ్ సెక్రటరీకి డైరక్టుగా వచ్చేసిందని గురువారం తెలుగు పేపర్లు రాశాయి. కాదు, హెూం శాఖకు వెళ్లింది అని "హిందూ" రాసింది. చివరకు ఆ మాటే నిజమని గురువారం మధ్యాహ్నానికి తేలింది. తెలుగు పత్రికలు తప్పులు ఎందుకు రాయాలి?

**ఉత్తుత్తినే ఊరించవద్దు ప్లీజ్...**

ఈ సొల్లు కబుర్లే తెలంగాణలో ఆత్మహత్యలకు దారి తీస్తున్నాయి. రాయల తెలంగాణ అనగానే యిద్దరు ఆత్మహత్య చేసుకున్నారట. మర్నాటికల్లా తూచ్ అన్నారు. ఆ ప్రాణాలు మళ్లీ వచ్చాయా? అలాగే సోమవారం బిల్లు రాలేదు అని యింకో యిద్దరు చేసుకుంటే..? శీతాకాలపు సమావేశాల్లో వచ్చేస్తుంది, జనవరి 1కి తెలంగాణ కల సాకారమవుతుంది.. యిలా కబుర్లు చెపితే ఓహో సంక్రాంతికి యింటికి వెళ్లిన సీమాంధ్రులు మళ్లీ రారన్నమాట అనుకుంటాడు బలహీనమనస్కుడైన తెలంగాణ కుర్రాడు. వాళ్లు మళ్లీ తిరిగివస్తే చావుకి తెగిస్తాడు. ఎందుకీ కబుర్లు? సాధ్యమైనంత త్వరగా చేస్తాం అన్న ఒక్క మాట చాలు కదా, లోక్‌పాల్ బిల్లు, మహిళా బిల్లు యిలాటి వాటిల్లో ముహూర్తాలు పెడుతున్నారా? ఇక్కడకి వచ్చేసరికి యిలాటి ప్రేలాపనలు, టి-కాంగ్రెసు నాయకులను సంబరాలు

చేసుకోమనడం.. అంతా ఆటలా వుంది.

పార్లమెంటు పేరుకే ప్రారంభమైంది కానీ కార్యకలాపాలు ఏమీ జరగటం లేదు. 2 జి స్కామ్ నివేదిక చటుక్కున ఆమోదించేసినందుకు బిజెపి స్పీకర్‌పై ఫయిరవుతోంది. ఆమెపై అవిశ్వాసమంటోంది. సీమాంధ్ర ఎంపీల అవిశ్వాస ప్రయత్నాలు సఫలమైనా, విఫలమైనా సర్కారును ఓ కుదుపు కుదిపారు. వాళ్లు నష్టనివారణ చర్యలకై సమయం వెచ్చించాల్సి వస్తోంది. సోనియా ఆశించినట్టు ప్రణబ్ గుడ్డిగా సంతకం పెట్టలేదు. రాజ్యాంగం ప్రకారం సరిగ్గా వుందా లేదా అని నిపుణులను అడిగారు. బుధవారం నాడు సోనియా స్వయంగా వెళ్లి కలవడం తెలంగాణ బిల్లు గురించే అంటున్నారు. అంటే బిల్లు చూడగానే చటుక్కున ఆమోదించే తరహాలో లేదని స్పష్టంగా తెలుస్తోంది. ఇక అసెంబ్లీలో చర్చలు ఏ తీరున సాగుతాయో తెలియదు. ప్రస్తుతరూపంపై తెలంగాణవాదులకూ అభ్యంతరాలున్నాయి. సమైక్యవాదులకు సరేసరి. అసెంబ్లీలో ఓటింగు జరిగినా, జరగకపోయినా చర్చలు జరిగి భిన్నాభిప్రాయాలు రికార్డవుతాయి కదా. పార్లమెంటుకి బిల్లు తిరిగి వెళ్లినపుడు వీటి ఆధారంగా అక్కడ చర్చలు జరుగుతాయి కదా. అప్పుడు బిజెపి ఎలా ప్రవర్తిస్తుంది అన్నదే అతి ముఖ్యం.

### ప్రతిపక్షాలను దిగజార్చడమే సోనియా వ్యూహం

టి-బిల్లు పార్లమెంటుకి యిప్పుడే వెళుతుందని అనుకోవడం ఎంతటి అత్యాశో, యిప్పట్లో వెళ్లదని కాని, అసలు వెళ్లదని కాని అనుకోవడం కూడా అత్యాశే. 2013లో వెళ్లకపోతే 2014లో వెళ్లవచ్చు. దీనికోసం ప్రత్యేకసమావేశం ఏర్పరచవచ్చు. సోనియా చాలా పట్టుదలతో వున్నారని అందరికీ తెలుసు. దేనికి ఆ పట్టుదల? తెలంగాణ యివ్వాలనా? లేక తెలంగాణపై తక్కిన పార్టీలు ఆడే నాటకాన్ని బయటపెట్టాలనా? మొదటిదాని కంటె రెండోదే ఆమెకు ఎక్కువ రాజకీయప్రయోజనం కలిగిస్తుంది. కేంద్రప్రభుత్వ అసమర్థతపై ప్రజలకు ఎంత ఆగ్రహం వుందో మొన్న అసెంబ్లీ ఎన్నికలు చాటి చెప్పాయి. అధికధరలు మా కొంపముంచాయని సోనియా స్వయంగా చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో పార్లమెంటు ఎన్నికలతో బాటు, అసెంబ్లీ ఎన్నికలు కూడా జరుగుతాయి కాబట్టి డబుల్ ఎఫెక్ట్. ఇలాటి పరిస్థితిలో ప్రభుత్వ వ్యతిరేకత వలన ప్రతిపక్షాలు లాభపడతాయి. వాళ్లను దెబ్బకొడితే, సగానికి చీలిస్తే అధికారపక్షం నిలబడుతుంది. 2009లో జరిగినది అదే. అయిదేళ్ల వైయస్ పాలనకు వ్యతిరేకంగా వున్న ఓట్లు చీలిపోకూడదని చంద్రబాబు తనకు బొత్తిగా పడని తెరాసతో కూడా జట్టుకట్టి (ఇప్పుడు చూడండి, బాబు, కెసియార్ ఎంత ఘోరంగా తిట్టుకుంటున్నారో! నాలుగున్నరేళ్ల క్రితం ఒకరినొకరు ఎలా కీర్తించుకున్నారో గుర్తుందా?) మహాకూటమి ఏర్పరచారు. ఏం లాభం? చిరంజీవి కొత్త పార్టీతో ముందుకు వచ్చారు. ఆయన కాంగ్రెసు ఓట్లు మాత్రమే చీలుస్తారని బాబు అనుకుంటే, కాంగ్రెసు, టిడిపి యిద్దరి ఓట్లూ చీల్చాడు. మధ్యలో జెపి లోకసత్తా అంటూ పోటీకి వచ్చి కొన్ని ఓట్లు ఆయనా పట్టుకుపోయాడు. చీలిపోయిన ప్రతిపక్షం వైయస్ మళ్లీ అధికారంలోకి రావడానికి దోహదపడింది. జస్ట్ పాస్ మార్కులు వేశారని వైయస్సే చెప్పుకున్నారు.

ఇప్పుడు ప్రతిపక్షాలు మూడున్నాయి – టిడిపి, వైకాపా, తెరాస. చిరంజీవిని కలిపేసుకున్నారు కాబట్టి పిఆర్పీ సమస్య లేదు. తెలంగాణ విషయంలో యీ మూడు పార్టీలు ఛాంపియన్లుగా చూపించుకుంటూ 'మేం యిమ్మనమని చెప్పినా యింకా యివ్వకుండా తాత్సారం చేస్తున్నారేం?' అంటూ కాంగ్రెసును ఛాలెంజ్ చేస్తూ వున్నాయి. మీ పని యిలా వుందా అని కాంగ్రెసు జులై 30 ప్రకటన వెలువరించింది. దెబ్బకు వైకాపా తెలంగాణ యూనిట్ ఎగిరింది. 2014 ఎన్నికల సమయానికి రాష్ట్రం సమైక్యంగానే వుంటే వైకాపాకు తెలంగాణలో అతి తక్కువ సీట్లు వచ్చే పరిస్థితి. తెలంగాణ అంశం రావడానికి ముందు అది 20-25% సీట్లు తెచ్చుకునే శక్తిగా వుంది. ఇప్పుడు 10% సీట్లు కూడా తెచ్చుకుంటుందో లేదో. ఇక టిడిపి – తెలంగాణకు కట్టుబడింది అని పేరు తెచ్చుకుని కాస్త పుంజుకుంటున్న సమయంలో యీ ప్రకటన రావడంతో మళ్లీ రెండుకళ్ల, రెండు కొబ్బరిచిప్పల, యిద్దరు పిల్లల సిద్ధాంతానికి తిరిగి రావలసి వచ్చింది. సమైక్యం అని గట్టిగా అనకపోవడం వలన సీమాంధ్రలో వైకాపాతో పోటీ పడలేక, విభజనే అని గట్టిగా అనకపోవడం వలన తెలంగాణలో తెరాసతో పోటీ పడలేక చతికిల పడింది. సీమాంధ్ర టిడిపి నాయకులు సమైక్యం అంటూ కోర్టుల్లో, వీధుల్లో చేస్తున్న పోరాటానికి బాబు ఆశీర్వాదం లేదని ఎవరూ నమ్మరు. తెలంగాణలో ముందే నమ్మరు. అందుకని టి-టిడిపి చప్పబడింది. సర్వేలలో బాబు స్కోరింగ్ కిరణ్ కంటె వెనకబడిందంటే రెండు పడవల ప్రయాణం ఎంత ప్రమాదకరమో తెలుస్తోంది.

### తెలంగాణ ప్రకటనతో తెరాస లాభపడిందా?

ఇక మూడో ప్రతిపక్షమైన తెరాస – ప్రకటన వెలువడేవరకు తెరాస మహా ఉత్సాహంగా అన్ని పార్టీల నుండి నాయకులను తమ పార్టీలో కలుపుకుంటూ దూసుకుపోతోంది. 2014 ఎన్నికలలో 100 అసెంబ్లీ, 15 పార్లమెంటు సీట్లు తెచ్చుకుని తెలంగాణ సాధించే ఎజెండా పెట్టుకుని, కాంగ్రెసు, టిడిపిలను దుయ్యబడుతూ తెలంగాణకు ఏకైక ఛాంపియన్‌గా వెలగడానికి ప్రణాళికలు రచిస్తోంది. ప్రకటన రాగానే మానిఫెస్టోలో ఏం రాయాలో తెలియక బిత్తరపోయింది. పోనీ విలీనం అయిపోదామనుకున్నా కాంగ్రెసు ఆసక్తి

కనబరచటం లేదు. అందువలన ప్రతిపక్షంగానే పోరాడాలి. వేటి కోసం? పునర్నిర్మాణం కోసం అనే స్లోగన్ ప్రజలకు ఓ పట్టాన బుర్రకెక్కదు. హైదరాబాదుపై ఆంక్షలు, విద్యాలయాల్లో ఎడ్మిషన్లు, ఉద్యోగస్తుల స్థానికత వివాదం, ఆస్తులు అప్పుల పంపకం జనాభా ప్రాతిపదికనా? మరో రకంగానా? యివన్నీ సాంకేతిక విషయాలు. వీటిపై జనాలకు అవగాహన కల్పించి వారిని జాగృతం చేయడం సులభమైన విషయం కాదు. 'మనకో రాష్ట్రం కావాలి' అనేది సులభంగా అర్థమయ్యే నినాదం. ఒకసారి రాష్ట్రమంటూ వచ్చేసిన తర్వాత దానికి గ్లామర్ తగ్గిపోతుంది. అలాగే తెలంగాణలో అందరి కంటె తెరాసకు ఎక్కువ సీట్లు వచ్చినా, ప్రకటనకు ముందు రాదగినన్ని రావు. ఆ మేరకు కాంగ్రెసు లక్ష్యం నెరవేరినట్లే.

ప్రతిపక్షాల బలాన్ని హరించే క్రమంలో కాంగ్రెసు బలం కూడా క్షీణించదా? అంటే తప్పక క్షీణిస్తుంది. కానీ ఎంతోకొంత మిగులుతుంది. సీమాంధ్ర ఎంపీల సంగతే చూడండి – అవిశ్వాసం పెట్టినవారి సంఖ్య కంటె పెట్టనివారి సంఖ్యే ఎక్కువ కదా. అసెంబ్లీలో కూడా సీమాంధ్ర ఎమ్మెల్యేలందరూ సమైక్యానికే ఓటేస్తారన్న గ్యారంటీ ఏముంది? ఆనం వివేకానందరెడ్డిలా హాస్యం చిందించేవారు సమైక్యం అంటూనే 'అధిష్టానం చెప్పినట్లు చేయాలి కదా' అనేస్తారు. చాప చినిగినా, చదరమంత మిగులుతుందని వాళ్ల ఆశ. మొన్నటిదాకా తెలంగాణ మంత్రులు యిలాగే నడుచుకున్నారు. ఇప్పుడు సీమాంధ్ర మంత్రులు ఆ బాటలో నడుస్తున్నారు. కాంగ్రెసు చెట్టు పేరు చెప్పుకుని చెల్లుబాటు అవుదామనుకునే నాయకులు మన రాష్ట్రంలో పుష్కలంగా వున్నారు. ఓటర్లకు కూడా సోనియాపై, కాంగ్రెసుపై ఎంత కోపం వున్నా చివరకు ఎటు ఓటేస్తారో తెలియదు. అప్పటికి ఏ హామీలు గుప్పిస్తారో, ఏం మాయ చేస్తారో తెలియదు.

**పార్లమెంటులో బిజెపిని ఎక్స్‌పోజ్ చేయాలిగా...**

అందువలన ఆంధ్రలో దిబ్బయిపోతామన్న భయం పక్కన బెట్టి, అసెంబ్లీ మొహానికి ఓ సారి బిల్లు చూపించేసి, కాంగ్రెసు పార్లమెంటుకు తెప్పించి అక్కడ బిల్లు ప్రవేశపెడుతుందనే అనుకుంటున్నాను. ఎందుకంటే అక్కడ జాతీయస్థాయిలో ప్రతిపక్షమైన బిజెపిని ఎక్స్‌పోజ్ చేయవలసిన అవసరం వుంది. బిజెపికి రాష్ట్రస్థాయిలో బలం లేనపుడు తెలంగాణ బిల్లు ద్వారా దాన్ని యిరకాటంలో పెట్టడం దేనికి? అనుకోవచ్చు. ప్రస్తుతం సీమాంధ్రలో సోనియాపై వున్న ఆగ్రహం, ఆమెకు బుద్ధి చెప్పగల మోదీపై వ్యామోహంగా మారితే ఆంధ్రలో నాలుగైదు సీట్లు, తెలంగాణలో రెండు, మూడు సీట్లు బిజెపి గెలుచుకోవచ్చు. అది నివారించాలంటే బిజెపిని కూడా యిరుకున పెట్టాలి. తెలంగాణకై మేం మద్దతు యిస్తున్నాం అని బిజెపి స్పష్టంగా చెపుతున్నపుడు యీ బిల్లు విషయంలో దానికి వచ్చే యిబ్బంది ఏముంది? ఉంది. ఎందుకంటే యీ బిల్లు సీమాంధ్రులకు పూర్తి వ్యతిరేకంగా వుంది. వాళ్లు అడిగిన ఒక్క కోరికా నెరవేరలేదు. ఏవో కొన్ని అరకొర హామీలు తప్ప వారికి దక్కినది తక్కువ, పోగొట్టుకున్నది ఎక్కువ. సీమాంధ్రులను అసంతృప్తి పరచి, తెలంగాణ యిప్పించడం పార్టీకి శ్రేయస్కరం కాదని మోదీ ఆలోచన. హైదరాబాదు సభలోనే ఆయన ఆ విషయం చాటి చెప్పాడు. మోదీ వచ్చాకనే ఆంధ్రలో బిజెపి యూనిట్ కాస్త యాక్టివ్ అయింది. 'భద్రాచలం మాది' వంటి ఉద్యమాలు చేసింది, రాష్ట్ర బిజెపి నాయకత్వం పూర్తిగా తెలంగాణ నాయకుల చేతిలో వుంది కాబట్టి వారిని ధిక్కరించి, ఢిల్లీ వెళ్లి 'హైదరాబాదులోని కేంద్ర సంస్థల్లో సగం సీమాంధ్రకు తరలించాలి' వంటి డిమాండ్లు వినిపించింది.

రాష్ట్ర బిజెపి నాయకుల నడిగితే అబ్బే అదేం లేదు అనే అంటారు, ఎందుకంటే వాళ్లంతా తెలంగాణ వారే. ఈ మధ్యే సీమాంధ్ర బిజెపి నాయకులంటూ ఒకళ్లిద్దరు ప్రకటనలలో, టీవీలో చర్చలలో కనబడుతున్నారు. అంతిమంగా జాతీయ నాయకులు ఎటు మొగ్గితే అటు మొగ్గవలసిన వారే వీరంతా! వచ్చే ఎన్నికలలో ఒంటరి పోరాటం చేద్దామని స్థానిక నాయకత్వం వూహూ వుబలాటపడిపోతూ వుంటే కేంద్ర నాయకత్వం రాష్ట్రంలో ఒక ముఖ్యనాయకుడి చేత రిపోర్టు తెప్పించుకుంది. అతను చెప్పినదిది – 'తెలంగాణలో తెలంగాణ ఉద్యమప్రభావం వరంగల్, కరీంనగర్ జిల్లాలతో బాటు మెదక్, నిజామాబాద్, నల్గొండ జిల్లాలలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే బలంగా వుంది. మెహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాదు సిటీ, ఆదిలాబాద్ జిల్లాలలో చాలా భాగం, నిజామాబాద్‌లో కొంత భాగంలో సెంటిమెంటు బాగా తక్కువగా వుంది. మొత్తం 119 సీట్లలో యివి 60–70 సీట్లు వుంటాయి. హైదరాబాదు పరిసరాల్లో 34 సీట్లున్నాయి. వీటన్నిటిలో ఆంధ్రప్రాంతం నుండి వచ్చి స్థిరపడిన వారి జనాభా గణనీయంగా వుంది. 2009 ఎన్నికలలో గ్రేటర్ హైదరాబాదు పరిధిలోని 25 స్థానాలలో 24 వాటిల్లో టిడిపి రెండో స్థానంలో వుంది. ఈ సారి ఆంధ్ర నుండి వచ్చి స్థిరపడినవారు భయంచేత టిడిపికి ఓట్లు వేసే అవకాశం వుంది. తక్కిన 35 సీట్లలో తెలంగాణ సెంటిమెంటు తక్కువగా వుంది. 2012 ఉపయెన్నికలో బిజెపి మెహబూబ్‌నగర్‌లో గెలిచినా పరకాలకు వచ్చేసరికి 9 వేలు మాత్రం తెచ్చుకుంది. టిడిపికి 31 వేల ఓట్లు వచ్చాయి. ఈ పరిస్థితుల్లో టిడిపితో పొత్తు పెట్టుకోవడం వలన బిజెపి లాభపడి, 2020 నాటికైనా స్వతంత్రంగా బలం పుంజుకుంటుంది. తెరాసతో బిజెపి పొత్తు కుదరడం అసాధ్యం. వారు కాంగ్రెసు వైపే చూస్తున్నారు.

**వంతపాడితే ఆంధ్రలో మంగళం పాడినట్లే**

ఈ బిల్లును యథాతథంగా పార్లమెంటులో పాస్ చేయిద్దామని కాంగ్రెసు ప్రయత్నించినపుడు బిజెపి వంతపాడితే అదీ సీమాంధ్రుల

ఆగ్రహానికి గురవుతుంది. అంతేకాదు, తెలంగాణవాదుల ఆగ్రహానికి కూడా... ఆంక్షల విషయంలో తెరాస కాంగ్రెసును, బిజెపిని సమానదోషులుగా చూపి బిజెపి తెలంగాణలో దక్కే ఆ కాస్త ప్రయోజనం కూడా దక్కకుండా చేస్తుంది. అందువలన బిజెపి సవరణలు ప్రతిపాదించక తప్పదు. ఎలాటి సవరణలు సూచిస్తుందో యిప్పుడే చెప్పలేం. ఎందుకంటే ఆంధ్ర, తెలంగాణల మధ్య కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపంలా తయారయింది. 'తెలంగాణ యిమ్మన్నాం కానీ సీమాంధ్రకు అన్యాయం చేయమనలేదు' అంటూ బిజెపి ముగ్గురు సభ్యుల బృందాన్ని ఏర్పాటు చేసి మంత్రుల ముఠాకు నివేదిక యిస్తామంది. ఆ నివేదిక తయారైందో లేదో తెలియదు. బహిర్గతం కాలేదు. బిల్లు ముసాయిదా బయటకు వచ్చాక కూడా అది ఏకపక్షంగా వుంది, ఆంధ్రకు కాస్తయినా విదల్చండి అనడానికి కూడా ధైర్యం చాలటం లేదు. అదే సమయంలో శభాష్, మేం దీనికి పూర్తిగా మద్దతు యిస్తాం అని జాతీయ నాయకులు అనటమూ లేదు.

ఈ విషయంలో టిడిపిని కాపీ కొడుతోంది. పార్లమెంటులో చర్చకు వచ్చినపుడు సీమాంధ్ర టిడిపి ఎంపీలు ఎలాగూ సమైక్యం అంటారు. టి-టిడిపివారు మాత్రం విభజన కావాలి అంటూనే బిల్లుకు అనుకూలంగా ఓటు వేయకుండా 'ఇది కాదు పద్ధతి. సమన్యాయం జరగలేదు' అని వాదిస్తారు. టిడిపి 'సమన్యాయం', 'సమన్యాయం' అంటుంది తప్ప అదేమిటో చెప్పదు. ఎలా వుండాలో చెప్పదు. చెప్పండి అంటే 'మాకు చేతకాదు అని సోనియా దణ్ణం పెట్టి దిగిపోయి చంద్రబాబుకి అధికారం అప్పగిస్తే అప్పుడు చెపుతాం' అంటున్నారు టిడిపి నాయకులు. బిజెపికి కూడా రేపు పార్లమెంటులో అదే చెప్పవచ్చు. 'ఇది కాదు విభజించే విధానం. మీరు ఒక్క పనీ సరిగ్గా చేయలేరు. మీరు దిగిపోండి. మేం అందర్నీ మెప్పించేట్లా విభజించి చూపిస్తాం' అనవచ్చు. పై నివేదిక ప్రకారం చూస్తే బిజెపి టిడిపితో పొత్తు పెట్టుకుని 2014 ఎన్నికలలో పోటీ చేసే అవకాశం వుంది. టిడిపికి కావలసినదీ అదే. సమన్యాయం జరగలేదనో ఏదో కారణం చెప్పి బిజెపి తెలంగాణ బిల్లుకు అవరోధం కల్పించగలిగితే సీమాంధ్రలో బిజెపికి ఆదరం పెరుగుతుంది. టిడిపి తోడయితే గణనీయమైన సంఖ్యలో సీట్లు సంపాదిస్తుంది. ప్రస్తుతం వున్న జీరో నుంచి నాలుగు పార్లమెంటు సీట్లు వచ్చినా మేలే కదా! అలా కాకుండా గుడ్డిగా బిల్లును సమర్థించినా తెలంగాణలో అది తెచ్చుకునేది అన్ని వుండవు. తెరాస, కాంగ్రెస్, కొద్దో గొప్పో గెలిచే టిడిపిల తర్వాతనే దాని స్థానం! **– ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2013)**

**డిసెంబరు 23-24 వీక్లీకై** **ఎమ్బీయస్ : న్యూస్, వ్యూస్, రివ్యూస్ - 26**

## మోదీ మ్యాజిక్ పనిచేసిందా? లేదా?

ఈ ప్రశ్నకు సమాధానం చెప్పమంటే బిజెపి నాయకులు ఔనని, కాంగ్రెసు నాయకులు లేదనీ చటుక్కున చెప్పేస్తారు. మనం మామూలువాళ్లం కాబట్టి చప్పున చెప్పలేం. అసలు ఫలితాలు వెలువడుతూండగానే కాంగ్రెసు తరఫున వచ్చినవాళ్లు మోదీ ప్రభావం ఏమీ లేదని చెప్పనారంభించారు. ఛత్తీస్‌గఢ్‌లో పోటాపోటీగా ఫలితాలు వస్తున్నంతసేపు, 'ఏమైంది మోదీ ఎఫెక్ట్?' అంటూ ఎద్దేవా చేశారు కూడా. చివరకు సందిగ్ధం వదలి 10 సీట్ల తేడాతో బిజెపి గెలిచాక ఆగారు. పై ప్రశ్నకు సమాధానం వెతికే ముందు ఫలితాల తీరుతెన్నులలో విశేషాలను ఓ సారి పరికిద్దాం.

4 రాష్ట్రాలలోని మొత్తం 508 స్థానాల్లో కాంగ్రెసు 21% సీట్లు, బిజెపి 70% సీట్లు గెలుచుకున్నాయి.

దేశంలో రెండో అతి పెద్ద రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌లో 51 జిల్లాలలో 17 జిల్లాలలో కాంగ్రెసు ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది. 16 జిల్లాల్లో ఒక్కో సీటు, 13 జిల్లాలలో రెండేసి సీట్లు గెలిచింది. మొత్తం 230 సీట్లకు అది గెలిచినది 58, (అర్జున్ సింగ్, దిగ్విజయ్ సింగ్‌ల కొడుకులు నెగ్గారు) అంటే బిజెపి కంటె 107 తక్కువ! బిజెపి ఎమ్మెల్యేలు, మంత్రులపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. 30 మందిలో 10 మంది మంత్రులు ఓడిపోయారు. అయినా మొత్తం మీద బిజెపికి గతంలో కంటె ఎక్కువసీట్లు కట్టబెట్టారు, కారణం ముఖ్యమంత్రిపై ఆరోపణలు లేవు. 2009లో ఉమాభారతి వేరే పార్టీ పెట్టి ఓట్లు చీల్చడంతో బిజెపికి 37% ఓట్లు వచ్చాయి. ఈ సారి ఆమె బిజెపిలో కలవడంతో లాభించి 47% ఓట్లు రాగా కాంగ్రెసుకు 32% నుండి 38% పెరిగాయి.

రాజస్థాన్‌లో – అశోక్ గెహలోత్ ప్రభుత్వం మొదటి మూడేళ్లు ప్రజలను పట్టించుకోలేదు. తర్వాత మేల్కొని రెండేళ్లపాటు సంక్షేమపథకాలు చేపట్టినా అవి సరిపోలేదు. మొత్తం 200 స్థానాలుంటే కాంగ్రెసు స్కోరు 96 నుంచి 21కి దిగజారిపోయింది. 12 జిల్లాల్లో ఒక్కటీ గెలవలేదు. 2009లో బిజెపి కంటె 2% ఎక్కువగా 36% ఓట్లతో గెలిచిన కాంగ్రెసు యీసారి 34% తెచ్చుకుంది. బిజెపి 12% ఎక్కువ ఓట్లు తెచ్చుకుని 162 సీట్లు గెలుచుకుంది. గెహలోత్ సొంత జిల్లాలో 90% సీట్లు బిజెపి గెలిచింది.

మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీలు తమకు పెట్టని కోట అని కాంగ్రెసు అనుకుని తన లెక్కలన్నీ ఆ కోణంలో చూస్తుంది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో ఆదివాసీ జనాభా ఎక్కువగా వున్నా కాంగ్రెసు మట్టి కరిచింది. ఢిల్లీలో ఎస్సీ కాంగ్రెసు నాయకులు కూడా అనామకుల చేతుల్లో ఓడిపోయారు. రాజస్థాన్‌లో గిరిజన బెల్టులోని 28 స్థానాల్లో 17 బిజెపి గెలిచింది. 70% ముస్లింలున్న కమాన్ అసెంబ్లీ స్థానంలో బిజెపి అభ్యర్థి నటవర్ సింగ్ కొడుకునే ఓడించాడు.

ఛత్తీస్‌గఢ్‌లో – బిజెపికి గతంలో కంటె ఒకటి తగ్గి 49 సీట్లు వచ్చాయి కానీ 5గురు మంత్రులు ఓడారు. కాంగ్రెసుకు ఒకటి పెరిగి

39 వచ్చాయి. ఇతరులు 13% ఓట్లు పట్టుకుపోగా బిజెపికి 44%, కాంగ్రెసుకు 43% వచ్చాయి. అజిత్ జోగి కావాలని కాంగ్రెసు అభ్యర్థులకు వ్యతిరేకంగా తన కాండిడేట్లను పెట్టడం వలననే యితరులకు 13% ఓట్లు వచ్చాయని అంచనా. పెద్ద లీడర్లందరూ ఓడిపోయారు.

ఢిల్లీలో షీలా దీక్షిత్ తను డీలా పడడానికి కారణం – కాంగ్రెసు పార్టీ తనకు సహకరించకపోవడమే అని ఆరోపించింది. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్ జెపి అగర్వాల్ ఎన్నికలలో ఉత్సాహంగా పాల్గొనలేదని ఆరోపించినా, ఆమె అసలు లక్ష్యం సోనియా, రాహుల్‌లే. ఎందుకంటే సాధారణంగా పార్టీ అధినాయకత్వం ఢిల్లీలో ప్రచారం చేయవలసిన రాష్ట్ర, జాతీయ నాయకులు లిస్టు తయారుచేసి వీరిలో ఎవరిని మీ నియోజకవర్గాల్లో ప్రచారానికి పంపమంటారు? అని అడుగుతారు. వాళ్లలోనుండి అభ్యర్థులు ఎంచుకుంటారు. ఓటర్లలో బెంగాలు నుండి వచ్చినవారు ఎక్కువగా వుంటే బెంగాలీ కాంగ్రెసు లీడరును పంపమని.. యిలా అడుగుతారు. ఈ సారి ఆ కసరత్తు జరగనే లేదు. అభ్యర్థులు తమకు తామే తంటాలు పడవలసి వచ్చింది. తన నియోజకవర్గం నుండి కాంగ్రెసు ఓటర్లున్న కొన్ని ప్రాంతాలను పునర్విభజన పేరుతో పక్క నియోజకవర్గాన్ని తరలించి తన ఓటమికి కారకులయ్యారని, అసెంబ్లీ ఎన్నికలయ్యేదాకా ఆగమని అడిగినా ఆగలేదనీ షీలా ఫిర్యాదు. "గత ఐదేళ్లగా ఢిల్లీ ప్రభుత్వం, ఢిల్లీ కాంగ్రెసు కలిసి పనిచేయలేదు" అని కాంగ్రెసు జనరల్ సెక్రటరీ జనార్దన్ ద్వివేది అనేశారు.

ఢిల్లీలో కాంగ్రెసు అభ్యర్థులకు పార్టీ ఫండ్స్ అందలేదు. 1998లోనే అభ్యర్థికి 25 లక్షల రూ.లు యిచ్చేవారు. ఈ సారి ఏమీ యివ్వలేదు. – ఆప్ భయమో ఎందుచేతో! కాంగ్రెసుకు 25% ఓట్లు, ఆప్‌కు 32%, బిజెపికి 34% ఓట్లు వచ్చాయి. సీట్ల విషయంలో మాత్రం కాంగ్రెసు ఎప్పుడూ తిననంత దెబ్బ తింది. ఇద్దరే యిద్దరు మంత్రులు గెలిచారు. ముఖ్యమంత్రి కూడా రాజకీయాల్లోకి కొత్తగా వచ్చిన అరవింద్ కేజ్రీవాల్ చేతిలో 25 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఢిల్లీ విజయంతో ఉత్సాహం పెరిగిన ఆప్ (ఆమ్ ఆద్మీ పార్టీ) మహారాష్ట్ర యూనిట్ వచ్చే ఏడాది మహారాష్ట్రలో పోటీ చేయడానికి నిశ్చయించుకుంది. "35 జిల్లాలలో 33 జిల్లాలలో మేం చురుగ్గా వున్నాం. చక్కెర ఫ్యాక్టరీల వేలం కుంభకోణం, ఇరిగేషన్ కుంభకోణం బయటపెట్టాం." అంటోంది.

ఆప్‌ను మధ్యతరగతివారే సమర్థిస్తారని అందరూ అనుకున్నారు. కానీ ఆశ్చర్యకరంగా ఢిల్లీ పరిసరాల ప్రాంతాలలోని మురికివాడలలోని జనమంతా వారిని ఆదరించారు. పోష్ ఏరియాల్లో కూడా మురికివాడలుంటాయి. డబ్బున్నవాళ్ల యిళ్లల్లో పనిచేసే వారందరూ వాటిలో నివసిస్తారు. వాళ్లందరూ ఆప్‌కు ఓటేశారు. అందుకే న్యూ ఢిల్లీ నియోజకవర్గంలో కూడా ఆప్ గెలిచింది. ఆప్ అభ్యర్థులు తమ వద్దకు రాలేకపోయినా వీరు ఓట్లేశారు.

ఎన్నికలలో గమనించవలసిన మరో అంశం ఏమిటంటే – కాంగ్రెసును ఓడించడానికి కంకణం కట్టుకున్న ఓటరు ఆ శక్తి బిజెపికి మాత్రమే వుందనుకుని, తమ ఓట్లను యితరులపై వృథా చేయలేదు. అందుకే యితర పార్టీలకు ఢిల్లీలో 4 నుంచి 3కి, మధ్యప్రదేశ్‌లో 16 నుండి 7కి, రాజస్థాన్‌లో 26 నుండి 16కి తగ్గాయి (బియస్పీకి 6 నుంచి3 తగ్గాయి, సంగ్మా పార్టీ 5 గెలిచింది). ఛత్తీస్‌గఢ్‌లో మాత్రం యిద్దరు గెలిచారు. (వారిలో ఒకరు బియస్పీ)

చివరగా చెప్పాలంటే – ఛత్తీస్‌గఢ్‌లో 12 స్థానాలున్న బస్తర్ ప్రాంతంలో కితంసారి బిజెపి 11 స్థానాలు గెలిచింది. కానీ మావోయిస్టుల దాడిలో కాంగ్రెసు నాయకులు చనిపోవడంతో సానుభూతి పవనాలతో యీ సారి అక్కడ జరిగిన మొదటి విడత ఎన్నికలలో కాంగ్రెసుకే ఎక్కువ ఓట్లు పడ్డాయని గ్రహించిన బిజెపి స్థానిక నేతలు మోదీని రప్పించి సభలు ఏర్పాటు చేశారు. కాంగ్రెసువారు అలాటి ప్రయత్నాలు చేయలేదు. రెండో విడతలో బిజెపి పుంజుకుంది. చివరకు కాంగ్రెసుకు 8, బిజెపికి 4 వచ్చాయి.

ఈ ఫలితాలకు రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో కాంగ్రెసు స్వయంకృతాపరాధం, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో ముఖ్యమంత్రులు అందించిన మంచి పరిపాలన కారణాలు అనవచ్చు. మోదీ ప్రభావం అత్యధికంగా రాజస్థాన్‌లోనే కనబడింది. అక్కడ మోదీ సభలకు చాలా బాగా హాజరయ్యారు. ఛత్తీస్‌గఢ్‌లో తక్కువే. ఢిల్లీలో అయితే ప్రభుత్వ వ్యతిరేక ఓటును ఆప్‌తో పంచుకోవలసి వచ్చింది. బిజెపికున్న సౌకర్యాలతో పోలిస్తే ఆప్ చాలా వెనకబడివున్నా అన్ని సీట్లు గెలిచిందంటే, మోదీ వేవ్ వుందని చెప్పలేము. ఎందుకంటే మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో మోదీ సభలకు జనం గొప్పగా రాలేదు. నవంబరు 18 న భోపాల్ సభకు 4 వేల మందే వచ్చారు – అక్కడున్న ఎమ్మెల్యేలందరూ బిజెపివారే అయినా! అదే రోజున సాగర్‌లో 400 మంది మాత్రమే హాజరయ్యారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో స్థానిక ముఖ్యమంత్రుల పలుకుబడే బిజెపికి విజయం చేకూర్చింది.

దీని అర్థం ఏమిటంటే – కాంగ్రెసు పాలిత రాష్ట్రాలలో ప్రజలు విసిగిపోయి వున్నపుడు, ఆప్ వంటి గట్టి ప్రత్యామ్నాయం లేకపోతే, మోదీ మ్యాజిక్ పనిచేస్తుంది. సమర్థవంతమైన బిజెపి పాలన వున్న రాష్ట్రాలలో మోదీ ప్రచారం సాయపడుతుంది. మోదీ ఎఫెక్టు గురించి క్లుప్తంగా చెప్పాలంటే, ఎన్టీయార్ కొటేషన్ అరువు తెచ్చుకోవాలి. 'ఒక సినిమా జయాపజయాలను హీరో నిర్ణయించలేడు. సక్సెస్ లేదా ఫ్లాప్ రేంజ్‌ను ప్రభావితం చేయగలడంతే!' అన్నాడాయన. మామూలుగా చిన్న హీరోతో 5 వారాలు ఆడవలసిన మంచి సినిమా పెద్ద హీరోని పెడితే 8 వారాలాడుతుంది. చిన్న హీరోని పెట్టి తీసిన చెత్త సినిమా 2 కోట్లు నష్టం తెస్తే, పెద్ద హీరోతో అయితే 20 కోట్ల నష్టం తెస్తుంది. మోదీ సొంత రాష్ట్రంలో ఐదేళ్ల క్రితం కంటె తక్కువ సీట్లు తెచ్చుకున్నారు. కానీ కాంగ్రెసు వ్యతిరేకత కారణంగా ఆయన యితర రాష్ట్రాలలో బలమైన ప్రభావం చూపగలుగుతున్నాడు. మొన్న ఎన్నికలు జరిగిన చోట ప్రాంతీయపార్టీలు లేవు. అవి వున్నచోట మోదీ ప్రభావం ఎలా వుంటుందో తెలియదు. కేంద్రప్రభుత్వాన్ని ఓడించడానికి మోదీ పార్టీకి, రాష్ట్రప్రభుత్వానికి

ఓడించడానికి స్థానిక ప్రాంతీయపార్టీకి ఓటేయవచ్చేమో! – ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2013)

**డిసెంబరు 25-27 వీక్లీకై** **ఎమ్బీయస్ : చర్చించాలా? తిప్పి పంపాలా?**

తెలంగాణ బిల్లు అసెంబ్లీకి చేరింది. కొందరు ఔనన్నా, మరి కొందరు కాదన్నా ప్రవేశపెట్టబడింది అన్నారు. ఇప్పుడు దాన్ని చర్చించాలా? వద్దా అని సమైక్యవాదుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. చర్చించడానికి ఒప్పుకుంటే విభజనకు అంగీకరించినట్టే కాబట్టి, ఆ వచ్చినదాన్ని అలాగే చుట్టచుట్టి వెనక్కి పంపేయాలి అని వీరసమైక్యవాదుల వాదన. బిల్లులో చాలా లోపాలున్నాయని, వాటిని అంగీకరిస్తే సీమాంధ్రకు శాశ్వతమైన హాని జరుగుతుందని వారి భయం. అది జరగకుండా చేయాలంటే అసలు దాని కేసి చూడనుకూడా చూడకూడదని జనాలకు చెపుతున్నారు.

**రాష్ట్రపతి యిచ్చిన అవకాశం**

సంకల్పమాత్రం చేత తెలంగాణ బిల్లు పరుగులు పెట్టి సోనియా పుట్టినరోజు నాడు తెలంగాణ ఆవిర్భావ ప్రకటన జరుగుతుందని కొన్నాళ్లు, పార్లమెంటు శీతాకాల సమావేశాలలోనే బిల్లు పాస్ అయిపోయి, జనవరి 1 వేడుకలను కొత్త రాష్ట్రంలోనే జరుపుకోవచ్చని మరి కొన్నాళ్లు, ఆంగ్ల సంవత్సరాది ఎందుకు తెలుగు సంక్రాంతి తెలంగాణలోనే జరుపుకుందాం అని యింకొన్నాళ్లు – యిలా అనేకమంది టి-నాయకులు చెప్పుకుంటూ వచ్చారు. అల్లాటప్పా వాళ్లే కాదు, తెలంగాణ విధాతగా తనను తాను చెప్పుకుంటున్న జయపాల్‌రెడ్డిలాటి సోనియా సన్నిహితులు కూడా యివి చెప్పారు. అలా ఎలా జరుగుతుంది, రాష్ట్రపతి చూడాలి, బిల్లు అసెంబ్లీకి పంపాలి, అసెంబ్లీలో ఓటింగు కాకపోయినా తీర్మానం జరగాలి, అది చూసుకుని పార్లమెంటులో సవరణలపై చర్చ జరగాలి, మార్పులు చేర్పులు చేశాక ఆపై బిల్లు పాసవాలి.. యింత తతంగానికి నాలుగైదు వారాలైనా పట్టదా అని సందేహమనస్కులు అడిగితే, 'రాష్ట్రపతి మూడు రోజుల గడువు మించి యివ్వరు. అసెంబ్లీ అభిప్రాయానికి ఎటూ విలువ లేదు కాబట్టి, జస్ట్ ఫార్మాలిటీ కోసం పంపించి బిల్లు చేత అసెంబ్లీ గడప ముట్టించి వెనక్కి పట్టుకుని వచ్చేస్తారు.' అంటూ చెప్తూ వచ్చారు. 'మేధావి చిదంబర మహాశయుల ఆధ్వర్యంలో తయారైన బిల్లు కాబట్టి రాష్ట్రపతి కూడా ఎలాటి సంశయాలు పెట్టుకోకుండా బిల్లు వీధి గుమ్మం నుండి రాగానే పెరటిగుమ్మం నుండి హైదరాబాదు పంపించేస్తారు. సొంతంగా చదివి కుడీఎడమా పరామర్శించే పని పెట్టుకోరు. ఎవర్నీ న్యాయపరమైన సలహాకోసం అడగరు. అందువలన రాష్ట్రపతి భవన్‌లో బిల్లు వుండేది కొన్ని గంటలు మాత్రమే...' అని ధైర్యం చెప్పారు.

చివరకు ఏం జరిగింది? రాష్ట్రపతి క్షుణ్ణంగా చదివారు, న్యాయకోవిదులను సంప్రదించారు. ప్రతీ క్లాజుపై అసెంబ్లీలో శాసనసభ్యులు తమ అభిప్రాయాలు వెల్లడించాలని కోరారు. దాని వలన బిల్లు మొత్తాన్ని అంగీకరించవలసిన, లేక తిరస్కరించవలసిన అగత్యం లేకుండా చేశారు. ప్రతి స్టెప్‌లో 'ఇంతవరకు మాకు సమ్మతం, యిది మాత్రం కాదు' అని చెప్పవచ్చు. ప్రతీ అంశం అమలు చేయడంలో గల కష్టాలను చెప్పవచ్చు. దాదాపు 280 మంది సభ్యులున్నారు. ఒక్కో అంశంపై వారికి ఒక్కో అభిప్రాయం వుండవచ్చు. వీరందరూ వాటిని వెలిబుచ్చి, యితరులతో వాదించి, చర్చించి, తమ తమ అభిప్రాయాలు వెలిబుచ్చేందుకు వీలుగా మొత్తం ప్రక్రియకు ఆరువారాలు టైము యిచ్చారు. స్టేట్స్‌మన్ అనే వర్ణనకు తగినట్టు ప్రణబ్ వ్యవహరించారు. దీనికి 6 వారాల సమయం పడుతుందని అని లెక్క వేసి మరీ యిచ్చారు. ఆ సమయాన్ని పూర్తిగా వినియోగించుకుని విభజన ప్రక్రియ ఎంత కష్టమో, ఎంత క్లిష్టమో తెలియపరచవలసిన బాధ్యత సమైక్యవాదులది.

**చర్చ అక్కరలేదన్న తెలంగాణవాదులు**

'దీనికోసం 6 వారాల చర్చ ఎందుకు? ఇంతదూరం వచ్చాక యింకా వాదోపవాదాలు దేనికి? వీరిలో సిపిఎం తప్ప తక్కిన పార్టీలన్నీ ఎప్పుడో ఒకప్పుడు విభజనకు ఒప్పుకున్నవే. వారికి సమస్యపై పూర్తి అవగాహన వుంది కాబట్టి అంతకాలం సాగదీయవలసిన పని లేదు. అయినా ఆరువారాల లోపు పంపమన్నారు కానీ ఆరువారాలూ చర్చించి తీరాలని చెప్పలేదు. విభజనకు ఓకే అనడానికి ఒక్క రోజు చాలు. పోనీ మా ప్రాంతానికి ఐఐటి కావాలి, ఐఐఎమ్ కావాలి అని చెప్పుకోవాలంటే కొన్ని గంటలు చాలు. ఓ రోజు కావాలంటే అర్ధరాత్రి దాకా కూర్చుందాం. బిల్లుపై చర్చ ముగించేసి వెనక్కి పంపేద్దాం.' అని హరీశ్‌రావు వంటి నేతలు వాదించారు. ఆయన కంటె ఆత్రుత సోనియాది. తెలంగాణ బిల్లును ఆగమేఘాలమీద పంపించామని చెప్పుకోవడానికో ఏమో ప్రత్యేక విమానంలో హైదరాబాదుకి పంపించారు. మర్నాడు పొద్దున్న కల్లా అది అసెంబ్లీకి వచ్చేయాలని, ఓకే స్టాంపు కొట్టి వెనక్కి పంపేయాలని టి-వాదులు మహా ఉబలాటపడ్డారు. ఫార్మాలిటీస్ పూర్తి చేసి పంపించడంలో జరిగిన ఆలస్యానికి చీఫ్ సెక్రటరీపై సభాహక్కుల తీర్మానం పెట్టేయడానికి రెడీ అయ్యారు. అసలు యిది సభాహక్కుల భంగంగా ఎలా వస్తుందో ఎవరికీ అర్థం కాదు. చివరకు అది సభ

వాయిదా పడ్డాకనే ప్రాంగణంలోకి అడుగు పెట్టింది. ఘోరం జరిగిపోయినట్టు గగ్గోలు పెట్టారు. అది గడిచి ఎన్ని రోజులైంది. ఆ తర్వాత మాత్రం బిల్లు కథ ముందుకు సాగిందా? ఆ ఒక్కరోజు గురించి అంత హంగామా దేనికి? తెలంగాణ గురించి ఏదో చేస్తున్నాం అని తెలంగాణ ప్రజలకు చెప్పుకోవాలన్న తాపత్రయంతోనేగా?

నిజానికి ఒక్క రోజులో చర్చ పూర్తవుతుందా? బిల్లు ముసాయిదా కాపీ రాగానే కెసియార్ తమ అభిప్రాయం ఏమిటో చెప్పగలిగారా? లేదే! నిపుణుల బృందానికి అప్పగించి, వారు అధ్యయనం చేసి దానిలోని సాంకేతిక విషయాల గురించి వివరించిన తర్వాత నాలుగు రోజులకు ఫలానా క్లాజ్ మాకు ఒప్పందం కాదు, ఫలానాది ఫర్వాలేదు.. అంటూ చెప్పగలిగారు. నిపుణులు కాబట్టి విషయాన్ని అంత త్వరగా అర్థం చేసుకోగలిగారు. అదీ బృందంగా ఏర్పడి... ! మరి శాసనసభ్యులు!? వారికి ఏ సాంకేతిక విద్య వచ్చి వుండకపోవచ్చు. నిరక్షరాస్యులను కూడా ప్రజాప్రతినిధులుగా ఎన్నుకునే వెసులుబాటు మన రాజ్యాంగం కల్పించింది. వారి మాతృభాషలో బిల్లు చదువుకుని యిలాటి విషయాలలో వారికి నమ్మకమున్న నిపుణుల చేత ఆ వివరాలన్నీ చెప్పించుకుని, దానిపై సొంత అభిప్రాయం ఏర్పరచుకుని మాట్లాడాలి. కెసియార్ అయితే మేధావి. రాష్ట్రమంత్రిగా, కేంద్రమంత్రిగా పనిచేసిన వారు. స్వయంగా చాలా విషయాలపై పట్టున్నవారు. ఆయన అర్థం చేసుకున్నంత త్వరగా యితరులు చేసుకుంటారనుకోవడం అవివేకం. శ్రీకృష్ణ కమిటీ రిపోర్టులో ఓ చోట కృష్ణ బదులు గోదావరి రాస్తే ఆ తప్పు ఎత్తి చూపించి, ఈ తప్పులతడక నివేదికపై మాట్లాడడమే వేస్టు అని తీసిపారేశారు తెరాస వారు. మరి యిప్పుడు యీ బిల్లులో ఓ చోట 'తెలంగాణ'కు బదులు 'తమిళనాడు' అని రాశారు. (బిల్లు తయారీలో తమిళుల పాత్ర ఎక్కువ కావటం వలనే యిలా జరిగి వుంటుంది. చిదంబరం మహాశయుడు, నారాయణస్వామి యిద్దరూ తమిళులే. జయరాం రమేష్ కర్ణాటక రాష్ట్రీయుడైనా అయ్యంగారే, భార్య అయ్యర్! తక్కినవాళ్లు నలుగురున్నా వాళ్లెవరూ సరిగ్గా మీటింగులకు రాలేదనీ, యీ అరవ్వాళ్లే ఓవరాక్షన్ చేశారనీ అందరం గమనించాం. అందుకే తమిళనాడు పదం పడడంలో ఆశ్చర్యం లేదు) కానీ ఆ పేరు చెప్పి బిల్లు పక్కన పడేద్దాం అనటం లేదు తెరాస.

**బిల్లు విలక్షణత**

ప్రతి బిల్లు గురించి, శాసనసభ్యులందరూ యింత లోతుగా అధ్యయనం చేస్తున్నారా? అని అడగవద్దు. ఏం చేయకపోయినా నడిచిపోతోంది. కానీ యీ బిల్లు అలాటిది కాదు. ఈ బిల్లు లాటిది దేశంలో ముందెన్నడూ తయారవ్వలేదు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గపు ప్రజలు దీనిపై సెన్సిటైజ్ అయ్యారు. 'విడిపోతున్నపుడు మనకు దక్కినదేమిటి? మన హక్కుల కోసం నువ్వు చేసినదేమిటి?' అని తమ ఎమ్మెల్యేలను నిలదీయబోతున్నారు. అందువలన తప్పకుండా విస్తృతమైన చర్చ జరగాల్సిందే. దానికి టైము పట్టి తీరుతుంది. ఒక్కరోజులో ఎస్ ఆర్ నో అనడానికి వీల్లేదు. ఇది సీమాంధ్ర ప్రాంతపు ఎమ్మెల్యేలకే కాదు, తెలంగాణ ప్రాంత ఎమ్మెల్యేలకు కూడా వర్తిస్తుంది. ఉదాహరణకు ఆంధ్రలో మిగిలే విద్యుత్ తెలంగాణకే అమ్మాలి, తెలంగాణవాళ్లు అక్కరలేదు అంటేనే వేరేవాళ్లకు అమ్మాలి అనే క్లాజ్ వుంది. అదీ ఏకంగా పాతికేళ్లపాటు! ఉమ్మడి రాజధాని పదేళ్లే కానీ యిది మాత్రం పాతికేళ్లుట! తెలంగాణ ప్రభుత్వం ఎంత రేటు ఆఫర్ చేసినా, లేక బకాయి పడినా వాళ్లకే అమ్మాలా? దాన్ని సీమాంధ్ర ప్రభుత్వం ఖాతరు చేస్తుందన్న నమ్మకం ఏముంది? చంద్రబాబు యిప్పటికే రంకెలు వేస్తున్నారు. రేపు సీమాంధ్రలో ఆయన ప్రభుత్వం వస్తే మేం దీన్ని రద్దు చేసుకుంటాం అంటే? భవిష్యత్తులో ఏదైనా రాష్ట్రం సీమాంధ్రకు వచ్చి 'మీ రాష్ట్రంలో తీరప్రాంతంలో పెట్టుబడులు పెడతాం, కానీ మీ మిగులు విద్యుత్ మాకు అమ్మండి' అంటే, ఆంధ్ర ప్రభుత్వం అమ్మలేదు కదా! ఆ మేరకు దానికి నష్టమే కదా! తెలంగాణలో రాబోయే ప్రభుత్వం ఎలా వుంటుందో? విద్యుత్ ఉత్పాదనకై పెట్టుబడులు పెట్టి స్వయంసమృద్ధి సాధించుకుని యీ ఒప్పందాన్ని వదులుకుంటుందన్న గ్యారంటీ ఏమిటి? తన నిధులను ప్రజాకర్షక పథకాలపై , ఉద్యోగులకు జీతాల పెంపుపై, ప్రతీ యింటికీ ఉద్యోగంపై, ప్రతి పౌరుడికి పక్కా యిల్లుపై ఖర్చు పెట్టేస్తే..?

బిల్లులో అనేక అంశాల్లో 'ఫలానా సంస్థ/పరిశ్రమ/జోన్ అక్కడ పెట్టడానికి పరిశీలన జరుగుతుంది' అన్నదే మాటిమాటికీ కనబడుతోంది. బజెట్‌లో శాంక్షన్ అయిన రైల్వే లైన్లే అమలు కావటం లేదు. పరిశీలిస్తాం అంటే ఎలా కుదురుతుంది? పరిశీలిస్తున్నాం అని ఓ కమిటీ వేశారనుకోండి, వాళ్లు 'ఇక్కడ అనువుగా లేదు, పరిశ్రమ పెడితే పక్కనున్న చెట్టుమీద పిట్టలకు శబ్దకాలుష్యం పెరిగిపోతుంది, వాటికి పునరావాసం కల్పించాలి. 20 ఏళ్లల్లో ఓ అరణ్యాన్ని తయారుచేసి, పిట్టలకు పునరావాసం కల్పించిన తర్వాతే ఆలోచిద్దాం' అని నివేదిక యిచ్చారనుకోండి. ఈ పిట్టలగోలతో ఆ హామీ అక్కడికి బుట్టదాఖలు. ఈ ప్రాజెక్టుకు యిన్ని నిధులు కేటాయించాం అని ఎక్కడా లేదు. 'పోలవరం కట్టడం మా బాధ్యత' అంటారు. తెలంగాణ పట్ల నిర్ణయం కూడా మా బాధ్యతే అన్నారు, అది ఎంత లక్షణంగా నిర్వహించారో చూశాం. నాలుగేళ్లగా నానబెట్టి, బెట్టి చివర్లో పరుగులు పెట్టించి, జులై 30 ప్రకటన తర్వాత మూణ్నెళ్లు నిద్రపోయి, విభజన వంటి తీవ్రమైన అంశాన్ని టేబుల్ ఐటంగా ప్రవేశపెట్టి, అందరిలో అనుమానాలు రేకెత్తించి, ఓ పక్క విమానంలో పంపి, మరో పక్క తన పార్టీ ఎమ్మెల్యేలనే అదుపులో పెట్టకుండా విచ్చలవిడిగా మాట్లాడనిచ్చి... యిదీ వీరు బాధ్యత నిర్వర్తించే విధానం!

**ఉమ్మడి రాజధాని**

ఇప్పటిదాకా ఉమ్మడి రాజధాని అంటే కేంద్రపాలితమే అవుతోంది. కానీ హైదరాబాదును ఉమ్మడి రాజధాని అంటున్నారు, కానీ యూటీ కాదంటున్నారు. అదెలా సాధ్యం? రాజ్యాంగంలోనే లేని యిలాటి ఉమ్మడి రాజధాని ప్రయోగం ఎలా వుండబోతోంది? దానిపై స్పష్టత లేదు. రాష్ట్రపరిధిలోకి వచ్చే శాంతిభద్రతలు వంటి అంశంపై గవర్నరుకే సర్వాధికారాలు అంటున్నారు, దాన్ని రాష్ట్రప్రభుత్వమే గవర్నరుకు ధారాదత్తం చేయాలంటున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే తొలుదొల్త చేయవలసిన పని ఏమిట్రా అంటే 'శాంతిభద్రతలు కాపాడడం మాకు చేతకాదు. మా పాలనలో సీమాంధ్రులు ప్రాణ, మాన, విత్తములకు భంగం కలుగుతుంది. అందువలన రాజధాని ప్రాంతం వరకు మా అధికారాలను గవర్నరు దోసిట్లో పోస్తున్నాం' అని తీర్మానం చేసి, ఆయనకు అప్పగించేయాలి. అలా అప్పగించడానికి నిరాకరిస్తే పరిస్థితి ఏమిటి? కేంద్రం సైన్యాన్ని పంపిస్తుందా? చేతులెత్తేసి కూర్చుంటుందా? అలా అయితే సీమాంధ్రులకు యిచ్చిన ఒట్టు తీసి గట్టున పెట్టినట్టేనా? 'ఇలాటి తీర్మానం చేయడానికి నిరాకరించే పరిస్థితి ఎందుకు వస్తుంది? ప్రస్తుతం వున్న శాసనసభ్యుల్లో తెలంగాణ సభ్యుల్లో కాంగ్రెసు వారి సంఖ్య ఎక్కువ కాబట్టి వారే ప్రభుత్వం ఏర్పాటు చేస్తారు. వారందరూ సోనియా వీరవిధేయులు కాబట్టి ఆమె చెప్పినట్టే చేస్తారు.' అని వాదించవచ్చు.

వారెంత ఢిల్లీ విధేయులైనా యింకో రెండు, మూడు నెలల్లో ప్రజల ముందుకు వెళ్లి ఎన్నికలు ఎదుర్కోవలసినవారే! ఇలాటి తీర్మానం పాస్ చేయడమంటే తెలంగాణకు ద్రోహం చేయడమే అని రాజకీయప్రత్యర్థులు గోల చేస్తారు. అసెంబ్లీని స్తంభింపచేస్తారు. వాకౌట్ చేస్తారు. సీమాంధ్ర పెట్టుబడిదారుల ఒత్తిడికి లొంగి యీ తీర్మానం చేస్తున్నారు అని రచ్చరచ్చ చేసి ప్రజల తలకు ఎక్కిస్తారు. అలాటి పరిస్థితుల్లో ఏ ప్రభుత్వమైనా తెగించగలదా? అసలు తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక అధికారంలోకి వచ్చే ప్రభుత్వం కాంగ్రెసుదేనన్న గ్యారంటీ ఏమిటి? ఇప్పుడున్న టి-కాంగ్రెసు వారందరూ కాంగ్రెసులోనే వుంటారని ఎలా చెప్పగలం? తెలంగాణ వచ్చేదాకానే ఆమెతో పని కానీ వచ్చేశాక ఏముంది? రాహుల్‌ని కాబోయే ప్రధానిగా చూపించి, తెలంగాణలో ఓట్లు దండుకోగలరా? సీమాంధ్రలో ఏం జరుగుతోంది? తెలంగాణను ఆపినంతకాలం ఓడసోనియా అన్నారు, యిప్పుడు బోడిసోనియా అంటున్నారు. విడిగా పార్టీ పెడతామంటున్నారు. ఈ విద్య టి-కాంగ్రెసు నాయకులకు రాదా? 'తెలంగాణ ప్రకటిస్తే కెసియార్‌ను పట్టుకుని వచ్చి మీ పాదాల చెంత పడేస్తామని చెప్పారు కదా, అలా జరగలేదేం?' అని సోనియా బృందం తాటిస్తూంటే తట్టుకోలేక, అంతా కలిసి తెరాసలో చేరిపోవచ్చు. అప్పుడు ప్రభుత్వమే తెరాసది అయిపోతుంది. గవర్నరుకి అధికారాలు అప్పగించడాన్ని యిప్పుడు వ్యతిరేకిస్తున్న తెరాస, ప్రభుత్వంలోకి వచ్చాక సరే ననగలదా? అంటే టి-టిడిపి యాగీ చేయదా?

పోనీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం యిలాటి తీర్మానం చేసిందనే అనుకుందాం. 2014లో గెలిచిన పార్టీ ఆ తీర్మానాన్ని రద్దు చేస్తే!? అసలు ఆ తీర్మానం రద్దునే తమ మ్యానిఫెస్టోలో ముఖ్యాంశంగా అనేక పార్టీలు చేర్చుకుంటే? 2014 ప్రభుత్వం కూడా చాలా బుద్ధిమంతురాలైన ప్రభుత్వం అనుకున్నా 2019లో గెలిచే ప్రభుత్వానికి కూడా అంతటి సద్బుద్ధీ వుండాలిగా! ఎందుకంటే యిది పదేళ్లపాటు సాగే వ్యవహారం మరి! కేంద్రం చేతిలో అన్నీ వదిలేస్తే జరిగే అనర్థాలు ఒక్కొక్కటి అవగతమవుతున్నకొద్దీ ప్రజల్లో కూడా స్థానిక పాలనకై డిమాండ్ పెరుగుతుంది. ఎర్రచందనం స్మగ్లర్లు అటవీ శాఖాధికారులను దారుణంగా చంపిన సంఘటన విషయంలో తెలియవచ్చిందేమిటంటే – అడవిలో కొట్టి పడేసిన దుంగలు అమ్ముకోవడానికి కేంద్రం అనుమతి కావాలట. దానికోసం ఎన్నిసార్లు మొత్తుకున్నా ఉలుకూ పలుకూ లేదట. పడేసిన దుంగలు పట్టుకుపోవడానికి స్మగ్లర్లు తెగించారట. ప్రతీదీ కేంద్రమే చూడబోతే యిలాగే తయారవుతుంది.

**బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న సమైక్యవాదులు**

ఇలా ఒకటి రెండు క్లాజుల గురించి ఆలోచిస్తేనే యిన్ని సమస్యలు తోస్తున్నాయి. ఇలాటివి యింకా ఎన్ని వున్నాయో! వీటిపై ఆలోచించవలసిన అవసరం లేదా? అధ్యయనం చేయనక్కరలేదా? చర్చించి ప్రజలకు బోధపరచనక్కరలేదా? తెలుగుజాతికి సంభవించిన ఇటువంటి విషమఘట్టంలో మేం నిర్వహించిన భూమిక యిది అని భావితరాలకు చెప్పనక్కరలేదా? ఈనాటి యీ చర్చలన్నీ రికార్డయి, వీటి ఆధారంగానే రేపు పార్లమెంటులో వివిధ పార్టీలకు చెందిన నాయకులు ప్రసంగించబోతారు. రెండు జాతీయ పార్టీలు తమ రాజకీయప్రయోజనాల కోసం చేతులు కలిపి, తమ సంఖ్యాబలంతో బిల్లును అంతిమంగా గట్టెక్కించవచ్చు. అలా గట్టెక్కించడంలో కొన్ని సవరణలు చేయవచ్చు. ఎప్పుడు? దేశంలోని పార్టీల నాయకులు యీ బిల్లులోని అసమంజసత్వాన్ని గమనించి, వాటికి వ్యతిరేకంగా మాట్లాడి ఏమేం సవరించాలో చెప్పినప్పుడు! వారికి పాయింట్లు అందించేదెవరు? అందించవలసిన దెవరు? సంబంధిత రాష్ట్ర శాసనసభ్యుల ఉపన్యాసాలే వారికి ఆధారం అవుతాయి. పార్లమెంటులోని యితర రాష్ట్రీయులకు యిక్కడ ఏ జిల్లాలో ఏ నది పారుతుందో తెలియదు, మిగులు జలాలు, తరుగు జలాల సంగతి తెలియదు. అసలు మనవాళ్లకే సరిగ్గా తెలియనప్పుడు వాళ్లకెలా తెలుస్తుంది? అందుకే మనవాళ్లు చర్చించి రికార్డు చేసి పంపితే వాళ్లు చదువుకుని ధాటీగా వాదించగలుగుతారు.

ఇదంతా యిక్కడ చర్చించినప్పుడే సాధ్యమవుతుంది. అయితే యిక్కడ చర్చే సాగనీయటం లేదు – సమైక్యవాదులు! పైగా చర్చకు

ఒప్పుకున్నవారు భ్రష్టులై పోయినట్టు ఆరోపిస్తున్నారు కూడా. దుర్మార్గం ఏమిటంటే – వీరందరూ మొన్నటిదాకా విభజనకు అభ్యంతరం లేదన్నవారే! కాంగ్రెసు పార్టీ రెండు నాలుకలతో మాట్లాడుతున్నపుడు ఆ పార్టీలోని సమైక్యవాదులెవరూ అడ్డుకోలేదు. టిడిపి అయితే యింకా ముందుకు వెళ్లి తెలంగాణకు అనుకూలం అని లేఖ కూడా యిచ్చింది. ఇప్పటికీ సమైక్యం అనలేదు. ఇప్పుడు సమైక్యం అంటున్న వైకాపా అయితే మొన్నటిదాకా విభజన చేయండి కానీ, తండ్రి వలె సమన్యాయం చేయండి అంది. ఈ పార్టీలలోని సీమాంధ్ర నాయకులెవరూ 'ఏమిటిది? మా విధానం సమైక్యం అని సిపిఎంలా, మజ్లిస్‌లా ఎందుకు ప్రకటించరు?' అని తమ నాయకత్వాన్ని ప్రశ్నించలేదు. ఇప్పుడు పెద్ద పోటుగాళ్లలా బిల్లు చింపడాలు, తగలబెట్టడాలు, స్పీకరును చుట్టుముట్టడాలు. చర్చించకుండా వుండడం తప్పు. అంతకంటె విభజన అనే అంశం చేపట్టి – ఒక్కో అంశాన్ని బయటకు లాగి, దుమ్ము దులిపి, యిది అసాధ్యమైన, అమలకు వీలుకాని ప్రతిపాదన అని నిరూపించి, – 'యిందువలన విభజన సాధ్యం కాదు, యథాతథ పరిస్థితి కొనసాగించండి. ఏనాటికైనా విడిపోవాలి అనే భావన యిప్పుడు వచ్చింది కాబట్టి యికపై ఒకే ప్రాంతంపై నిధులు కుమ్మరించకుండా వివిధ ప్రాంతాలలోని వివిధ పట్టణాలలో పెట్టుబడులు పెట్టి సర్వత్రా అభివృద్ధి చేశాక, అప్పుడు విభజన గురించి మాట్లాడతాం' – అని నిరూపించాలి. ఓటింగు లేకపోయినా ప్రతీ అంశంపై తమ అభిప్రాయాలు వెల్లడించే వీలు రాష్ట్రపతి యిచ్చారు. సద్వినియోగం చేసుకోవాలి.

కిరణ్ బహిరంగసమావేశాల్లో చేస్తున్నది అదే. విభజన వలన తెలంగాణ కూడా నష్టపోతుంది అని సోదాహరణంగా వివరిస్తున్నారు. ఈ సమైక్యవాదాన్ని కొత్తగా భుజానికి ఎత్తుకున్న నాయకులు కొందరు 'కిరణ్ కుట్రదారుడు, చాటుగా విభజనకు అంగీకరిస్తున్నాడు' అని ప్రచారం చేయడంలోనే సమయాన్ని వృథా చేస్తున్నారు. అంతరంగంలో ఏముందో అంతర్యామికే ఎఱుక! మనకు కావలసినది ఎక్స్‌రేలు కాదు, బహిరంగంగా రికార్డు కోసం విభజనవలన కలిగే నష్టాల గురించి అసెంబ్లీలో గంభీరమైన ఉపన్యాసాలు! వాటిస్థానంలో సమైక్యవాదులు చేస్తున్నవి – మర్కటవిన్యాసాలు! ఈ వికృతచేష్టలు యిలాగే జరిగితే 'బిల్లుపై చర్చ జరిగే అవకాశం శూన్యం. ఈ తెలుగువాళ్లెవరికీ వాదన వినిపించే విజ్ఞత, సామర్థ్యం లేదు. కేంద్రాన్ని తండ్రిగా భావిస్తారు. కాబట్టి పార్లమెంటులోనే ఏదో ఒకటి తేల్చిపడేయండి.' అని స్పీకరు, గవర్నరు సిఫార్సు చేసేస్తే మనకు తిక్క కుదిరిపోతుంది. ఆ రోజున చరిత్రలో దోషులుగా మిగిలిపోయేది యీ సోకాల్డ్ సమైక్యవాదులే.. విభజనవాదులు కాదు! **– ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2013)**

**డిసెంబరు 28-30 వీక్లీకై** **ఎమ్బీయస్ : న్యూస్, వ్యూస్, రివ్యూస్ – 27**

**శివరాజ్ చౌహాన్ ఆమోదయోగ్యత**

2014 ఎన్నికలలో కాంగ్రెసు చావుదెబ్బ తినడం ఖాయం అని అందరికీ తెలిసిపోయింది. ముఖ్య భాగస్వామి అయిన శరద్ పవార్ సైతం కాంగ్రెసులో ఇందిరా గాంధీ వంటి నాయకురాలు లేదని, మిగిలినవారందరూ బలహీనులేననీ బహిరంగంగా ప్రకటించారు. తమ పార్టీని బలోపేతం చేయడానికి కాంగ్రెసుకు ఒకటే మార్గం స్ఫురించింది – అది రాహుల్‌ను ప్రధాని అభ్యర్థిగా ప్రకటించడం. జనవరిలో ఆ ముచ్చటా తీరిపోతుందట. అది జరిగిన తర్వాత కాంగ్రెసుతో జట్టు కట్టేందుకు ముందుకు వచ్చే ధైర్యవంతులెవరో వేచి చూడాలి. ఈ పరిస్థితుల్లో మోదీ సారథ్యంలో బిజెపి దూసుకుపోవడం కచ్చితం. అయితే 200కు మించి సీట్లు సంపాదించుకునేవరకు సాయపడే మోదీ, ఎన్‌డిఏ కూటమి ఏర్పరచడానికి మాత్రం గుదిబండగా మారవచ్చనే భయం వుంది. ఎన్‌డిఏలోని యితర పక్షాలు మోదీ అంటే బెదురుతాయి. ఆ పరిస్థితుల్లో మోదీ ప్రధాని స్థానంలో వేరెవరినో కూర్చోబెట్టి వెనకనుంచి చక్రం తిప్పవచ్చు. అలాటి ప్రధాని పదవి తనను వరిస్తుందని నితిశ్ కుమార్ అనుకునేవారట. అతని పార్టీ ఎన్‌డిఏలోంచి బయటకు వెళ్లిపోవడంతో ఆ సందేహం తీరిపోయింది. ఇప్పుడు బిజెపి ప్లాన్ – బిలో భాగంగా శివరాజ్ చౌహాన్ ను కూర్చోబెట్టవచ్చని వార్తలు వస్తున్నాయి. శివరాజ్‌కు యింత ప్రాధాన్యత లభించడానికి కారణం ఏమిటి?

మొదటిగా చెప్పవలసినది మోదీ అంటే ముస్లిములు భయపడతారు. శివరాజ్ అంటే మధ్యప్రదేశ్ ముస్లిములు గౌరవిస్తారు. అనేకమంది ముస్లిముల యిళ్లల్లో శివరాజ్ ఫోటోలు వుంటాయట. ముస్లింల అభిమానాన్ని చూరగొన్నా శివరాజ్ ఆరెస్సెస్ మనిషే. 13 వ ఏట నుండి ఆరెస్సెస్ శాఖలు హాజరయ్యాడు. 17 వ ఏట ఎమర్జన్సీని వ్యతిరేకించినందుకు జైలుపాలయ్యాడు. ఒక పల్లెటూరులో అతిసామాన్య రైతుకుటుంబంలో పుట్టిన శివరాజ్ భోపాల్‌లో చదువుకుంటూ బిజెపి ఆఫీసులో తలదాచుకున్నాడు. ఆశ్రయం యిచ్చినందుకు కాలేజీనుండి తిరిగి రాగానే పార్టీ పనుల్లో సాయపడేవాడు. 1990లో అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గాడు. ఆ తర్వాత జరిగిన లోకసభ ఎన్నికలలో రెండు చోట్ల నుండి నెగ్గిన వాజపేయి లక్నో సీటు తను వుంచుకుని, మధ్యప్రదేశ్‌లోని విదిశా వదిలేశారు. శివరాజ్‌ను అక్కణ్నుంచి నిలబెడితే అప్పుడే కాకుండా, తర్వాత యింకో మూడుసార్లు నెగ్గాడు. 2003 ఎసెంబ్లీ ఎన్నికలలో దిగ్విజయ్‌తో పోటీ చేసి ఓడిపోయాడు కానీ 2004 పార్లమెంటు ఎన్నికలలో విదిశా నుండి మళ్లీ పోటీ చేసి గెలిచాడు.

2003లో ముఖ్యమంత్రి ఐన ఉమాభారతి ఒక కేసులో యిరుక్కుని జైలుకి వెళ్లవలసి వచ్చింది. 1994లో కర్ణాటకలో యిచ్చిన ఉపన్యాసం వలన మతకల్లోలాలు చెలరేగాయని అభియోగం. ఆమె అరెస్టు కావడంతో ఆమె స్థానంలో పార్టీ బాబూలాల్ గౌర్‌ను ముఖ్యమంత్రిగా కొంతకాలం పెట్టి, తర్వాత ఆయనను తప్పించి 2005 నవంబరులో శివరాజ్‌ను ముఖ్యమంత్రి చేసింది. 2008లో

ఎన్నికలు గెలిచి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు. గత పదేళ్లకాలం తీసుకుంటే మొదటి ఐదేళ్లలో కంటె తర్వాతి ఐదేళ్లలో అభివృద్ధి రేటు 6% పెరిగింది. 2012-13లో గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రోడక్ట్‌లో 9.8% పెరుగుదల సాధించి భారతదేశంలోనే అతి వేగంగా అభివృద్ధి సాధిస్తున్న రాష్ట్రంగా నిలిచింది. తలసరి ఆదాయం 8.69% పెరిగింది. రోడ్డు నెట్‌వర్క్ లక్ష కిలో మీటర్లు దాటిపోయింది. ఇది దేశంలోనే చాలా ఎక్కువ. వ్యవసాయంలో అభివృద్ధి రేటు 13.33% సాధించి, హరియాణాను దాటేసి పంజాబ్, ఉత్తరప్రదేశ్‌ల తర్వాత మూడో స్థానంలో నిలబడింది. విద్యుత్ రంగంలో డిమాండ్‌కు సరిపడా ఉత్పత్తి చేయగలుగుతోంది. రోజంతా కరంటు యివ్వగలుగుతోంది.

ప్రజల్లో కలిసిపోతూ తను కూడా సామాన్యుణ్నే అనే సందేశం యివ్వడానికి శివరాజ్ శ్రమిస్తారు. దీపావళి రోజుల్లో భార్యతో కలిసి చౌక్ బజార్‌కు వెళ్లి చెంబూ, తప్పేలా కొనడం వంటివి జనాలకు నచ్చుతాయి. చెప్పులు కుట్టేవాళ్లు, రిక్షా తొక్కేవాళ్లు, క్షురకులు, రైతులు, కమ్మర్లు, పనిమనుషులు, ఆటగాళ్లు – ఎవరైనా సరే, శివరాజ్ యింటికి వెళ్లి ఆయనకు తమ గోడు వినిపించుకోవచ్చు, వెళ్లేముందు తనింట్లో భోజనం చేసి వెళ్లమంటాడాయన. జనార్షక పథకాలు రూపొందించడంలో శివరాజ్ విధానమే వేరు. రకరకాల వర్గాలకు వేర్వేరు స్కీములు పెట్టారు. పెళ్లికాని అమ్మాయిలకు ముఖ్యమంత్రి కన్యాదాన్ యోజనా, మహిళా శిశువులకై లాడ్లీ లక్ష్మీ యోజనా.. యిలా. మోదీకున్న యిమేజి 'ఐరన్ మ్యాన్'! తద్భిన్నంగా యీయనకున్న యిమేజి 'మనోడు'! అదే ఆయనకు శ్రీరామరక్షగా నిలిచింది.

**తరుణ్ చాపల్యం – తెహల్కా విలవిల**

తన కూతురు వయసున్న జర్నలిస్టుతో సరసమాడిన తరుణ్ తేజ్‌పాల్ తన తెహల్కా సంస్థకే ముప్పు తెచ్చిపెట్టాడు. తెహల్కా అంటే చాలాకాలం పాటు జర్నలిస్టులకు చాలా అభిమానం వుండేది. వేరే చోట ఆమోదించని కథనాలను తెహల్కా ఏ అభ్యంతరాలూ లేకుండా స్వీకరించేది. సమాజంలో వున్న కుళ్లును కడిగేసి, దాన్ని ఉద్ధరిస్తున్నామనే గర్వంతో వుండేవారు ఆ సంస్థలోని సిబ్బంది. అందుకే ఆఫీసులోనే నేలమీద పడుక్కుని, రాత్రింబగళ్లు పని చేస్తూ, జీతం సరిగ్గా ముట్టకపోయినా పట్టించుకునేవారు కారు. అనేక పత్రికలు వ్యవసాయం గురించి, స్త్రీల సమస్యల గురించి రాస్తామంటే ఒప్పుకోవు, మరి కొన్ని పత్రికలు ఈశాన్య రాష్ట్రాల గురించి రాస్తామంటే వద్దంటాయి. ఎవరూ చదవరు పొమ్మంటాయి. అలాటివి రాద్దామనుకున్నవాళ్లు తెహల్కాకు వస్తే తేజ్‌పాల్ ఆహ్వానించేవాడు. మీకు తోచినది రాయండి అనేవాడు. తేజ్‌పాల్ – తెహల్కా ఒకరితో ఒకరు మమేకం కావడం వలన యిద్దరూ త్వరత్వరగా అభివృద్ధి చెందాయి. కానీ కొన్నాళ్లకు తేజ్‌పాల్ కుటుంబసభ్యులు పత్రిక వ్యవహారాల్లోకి చొరబడసాగారు. తేజ్‌పాల్ సోదరి నీనా చీఫ్ మేనేజర్. అతని సోదరుడు మింటీ తన స్నేహితులందరినీ కీలకమైన పదవుల్లో నియమించుకున్నాడు. వ్యాపారాన్ని విస్తరించుకోవాలనే తహతహలో ఆదర్శాలు పలచబడసాగాయి. దాంతో చెప్పేదొకటీ, చేసేదొకటీగా తయారైంది. పేరు వస్తున్నకొద్దీ తేజ్‌పాల్ తనను తాను గొప్పవాడిగా అనుకుని తక్కినవాళ్లను తక్కువగా చూడసాగాడు. తన ఎడిటర్లలో యిద్దరిని మాత్రమే విశ్వసించేవాడు. క్రమేపీ అది ఒక్కరికే పరిమితమై పోయింది. ఆ వ్యక్తి – మేనేజింగ్ ఎడిటర్ సోమా చౌదరి!

తేజ్‌పాల్ పత్రికను నష్టాల్లో చూపించేవాడు. సిబ్బందికి జీతాలు సరిగ్గా యిచ్చేవాడు కాదు. మీరంతా త్యాగాలు చేయాలని ఉద్బోధించేవాడు. అతను పత్రిక పెట్టి పదేళ్లయింది. ఆరేళ్ల క్రితం వారపత్రికగా మార్చాడు. ఇలా విస్తరించాడు కానీ సిబ్బంది కోసం ఎచ్ఆర్ డిపార్టుమెంటు పెట్టలేదు – యిస్తే వాళ్లకు జీతభత్యాలు పెరుగుతాయన్న భయంతో! చివరకు 2010లో పెట్టాడు. అయినా ప్రావిడెంటు ఫండ్‌కు ఏర్పాటు చేయలేదు. సీనియర్ జర్నలిస్టులు కూడా తమ ఫోను ఖర్చులు, ప్రయాణఖర్చులు తమే పెట్టుకోవాలి. చాలామంది వ్యాసకర్తలకు పారితోషికం యివ్వలేదు. మనం చేస్తున్నది ఉద్యోగం కాదు, ఉద్యమం అనే భ్రమ కల్పిస్తూనే అదే సమయంలో తన కుటుంబ సభ్యులతో కలిసి అనేక కంపెనీలు పెట్టాడు. జర్నలిజంతో సంబంధం లేని వ్యాపారాలవి. రిసార్టులు, కొండల్లో కాటేజీలు.. యిలాటివి. ఈ శృంగారచేష్ట బయటకు వచ్చాకనే తేజ్‌పాల్ కంపెనీల వ్యవహారాలు ఫస్ట్‌పోస్ట్‌లో బయటకు వచ్చాయి. అవి చూసే తెహల్కా సిబ్బంది తెల్లబోయారు. ఇంత డబ్బు యీయనకు ఎక్కడిదా అని. ఆ వ్యాపారాల్లో తేజ్‌పాల్ కుటుంబసభ్యులతో బాటు సోమా చౌదరికి కూడా వాటాలున్నాయి. అందుకే ఆమె తేజ్‌పాల్‌ను వెనకేసుకుని వచ్చింది. మహిళా జర్నలిస్టు ఫిర్యాదు యిచ్చాక అయిదురోజుల పాటు ఏమీ చేయకుండా వుండి, ఆ తర్వాత ఓ లాయర్ని సంప్రదించింది. ఆ తర్వాత తేజ్‌పాల్ స్వచ్ఛంద పదవీ విరమణ నాటకం ఆడితే దానికి సహకరించింది. అయితే కేసు పెద్దది కావడంతో తనే రాజీనామా చేసింది.

తేజ్‌పాల్ ఒక బిజినెస్ న్యూస్ పేపరు పెట్టాడు. కొన్ని రోజుల్లోనే మూసేశాడు. కారణం తెలియదు. ఏదో ఒక వ్యాపారవేత్తకో, రాజకీయవేత్తకో దొంగడబ్బు విషయంలో సాయపడడానికే అది జరిగి వుంటుందని కొందరి అనుమానం. బిజెపి అధ్యక్షుడిగా వున్న బంగారు లక్ష్మణ్ పై స్టింగ్ ఆపరేషన్ చేసి అతని పదవీచ్యుతికి కారణభూతుడైన తేజ్‌పాల్ మరి యుపిఏ 1, 2లలో యిన్ని కుంభకోణాలు జరిగితే వాటిలో ఒక్కదాన్నీ బయటపెట్టలేదేం? అని అందరూ అడుగుతున్నారు. అతను కాంగ్రెసు పక్షపాతి అనే భావం ఎల్లెడలా వ్యాపించింది. అందుకే యీ కేసు బయటకు రాగానే బిజెపి అత్యుత్సాహంతో అతనిపై దాడి చేస్తోంది. అధికారంలో వున్న యుపిఏ మద్దతు, సమాజసంస్కర్త అనే పేరు రావడం – వీటితో పోనుపోను తేజ్‌పాల్‌కు తనెక్కణ్నించో దిగి వచ్చానన్న ఫీలింగు వచ్చేసింది.

తనతో డిన్నర్లు చేసిన వివిఐపిలు తనకు సాయపడతారన్న భ్రమలో వుండేవాడు. (ఈ కేసు వచ్చాక వాళ్లందరూ పోవోయ్ అనేశారట) సమాజపు కట్టుబాట్లు తనకు వర్తించవనుకునేవాడు. వికార చేష్టలు మొదలుపెట్టాడు. 'ఒకరితోనే కాపురం చేయడం పెద్ద బోర్' 'ఎప్పుడూ టీనేజరులా వుండాలి, సాహసాలు చేయాలి' వంటి స్టేటుమెంట్లు యిచ్చేవాడు. సంపాదక సిబ్బందితో అప్పుడప్పుడు రిసార్టుల్లో ఎడిటర్ల విశ్రాంతి సమావేశాలు (రిట్రీట్ అంటారు) జరిగినపుడు మహిళా జర్నలిస్టులను తనే స్వయంగా స్విమ్మింగ్ పూల్‌లో తోస్తూండేవాడు. చివరకు గోవాలో అతనిచ్చిన ఉపన్యాసం చూడండి – 'ఇది గోవా. తాగండి, తినండి. ఎవరితో కావాలంటే వారితో పడుక్కోండి..' అని గొప్ప సందేశం యిచ్చాడు. ఇప్పుడు గోవా జైల్లో మాదకద్రవ్యాల సరఫరాదారులతో కలిసి పడుక్కుంటున్నాడు. అతని పత్రిక నుండి అనేకమంది జర్నలిస్టులు తప్పుకుంటున్నారు. పత్రిక, దాన్ని ఆధారం చేసుకుని అతను నిర్మించుకున్న వ్యాపారసామ్రాజ్యం ఏమవుతాయో ఎవరికీ తెలియదు.

**ఓటింగ్ శాతం పెరుగుదల – స్వీప్ పుణ్యమే!**

ప్రపంచవ్యాప్తంగా వున్న ప్రజాస్వామ్య దేశాల్లో పోనుపోను ఓటింగ్ శాతం తగ్గుతూ వస్తోంది. భారత్ కూడా దీనికి మినహాయింపు కాదు. ముఖ్యంగా రాజకీయాల్ని అసహ్యించుకునే యువత, గడప దాటని మహిళలు, నిరాసక్తతే తమ చిరునామాగా మార్చుకున్న పట్టణ ఓటర్లు – వీరందరూ కలిసి ఓటింగు శాతం తగ్గిస్తూ పోతున్నారు. దీనివలన ఒక్కోప్పుడు నియోజకవర్గంలోని 25% మంది ఓటేసినా అభ్యర్థి నెగ్గేసి వాళ్లను పాలించేస్తున్నాడు. ముప్పాతిక శాతం మంది అతనంటే యిష్టపడకపోయినా లాభం లేకపోతోంది. ఈ పరిస్థితిని చక్కదిద్దాలని భారత ఎన్నికల కమిషన్ సమకట్టింది. 2009లో స్వీప్ అనే విభాగాన్ని ఏర్పాటు చేసింది. 'సిస్టమాటిక్ వోటర్స్ ఎడ్యుకేషన్, ఎలక్టొరల్ పార్టిసిపేషన్' అని దాని పూర్తి పేరు. ఓటింగులో పాల్గొనని వర్గాలపై దృష్టి సారించి అది పనిచేయసాగింది. ఆయా వర్గాలలో దీని గురించి అవగాహన పెంచింది. దానివలన 2010 నుండి 21 ఎసెంబ్లీ ఎన్నికలు జరిగితే వాటిల్లో 12 వాటిల్లో అంతకంటె ఎక్కువగా ఓటింగు జరిగింది. ఈ విజయం సాధించడానికి స్వీప్ చాలా శ్రమించింది.

మొదటగా యూత్ ఓ పట్టాన కదలిరారు కాబట్టి యింట్లోనే కూర్చుని ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఆన్‌లైన్ సౌకర్యం, మొబైల్ యాప్ సౌకర్యం ఏర్పరచింది. ఎస్ఎమ్ఎస్ యిస్తే చాలు మన పోలింగు బూతు ఎక్కడుందో తెలుసుకునే సౌకర్యం కల్పించారు. యువత తరచుగా వచ్చే షాపింగ్ మాల్స్ వద్ద ఓటరు రిజిస్ట్రేషన్ శిబిరాలు ఏర్పాటు చేసింది. వారు అభిమానించే, ఆరాధించే ధోనీ, విరాట్ కోహ్లీ, మేరో కోమ్, సైనా నెహ్వాల్ వంటి వారి చేత టీవీల్లో ప్రచారం చేయించింది. సోహా ఆలీ ఖాన్ తోరాల్ రసపుత్ర వుంటి సినీ, టీవీ ఆర్టిస్టుల చేత కూడా..! స్కూళ్లల్లో, కాలేజీల్లో ఏదో పోటీల పేరుతో, ఆటల పేరుతో వారందరినీ ఒకచోట చేర్చి ఓటర్లుగా నమోదు చేయించింది. ఉదాహరణకి మొన్న ఛత్తీస్‌గఢ్ ఎన్నికలలో కాలేజీలకు వెళ్లి ఉపన్యాస పోటీలు పెట్టింది. ఓటు చేయవలసిన బాధ్యత గురించి కౌన్సిలింగ్ చేయించింది. ఢిల్లీలో కావ్వాత్తుల ప్రదర్శన, మానవహారాలు, సంగీత కచ్చేరీలు ఏర్పాటు చేసి వారిని పోగేసింది.

మహిళలను ఆకట్టుకోవడానికి రాజస్థాన్‌లో గర్బా, దాండియా ఏర్పాటు చేసి, కార్యక్రమం తర్వాత ఓటర్లుగా నమోదు చేయించింది. అన్ని రాష్ట్రాలలో ఆరోగ్య కార్యకర్తలను, ఆంగన్‌వాడి సేవికలను యీ పనిలో నియోగించింది. ఛత్తీసగఢ్‌లో ఓటేస్తే చంపేస్తామని మావోయిస్టులు బెదిరించారు. దానికోసం పోలింగు బూత్‌ల మధ్య దూరాన్ని తగ్గించింది. అడుగడుగునా పోలీసులను నియోగించి ఆ విషయాన్ని గ్రామసభలద్వారా, గ్రామసేవకుల ద్వారా, పత్రికలు, రేడియో ద్వారా ప్రచారం చేయించింది. 2012 ఎన్నికలలో ఏ పోలింగు బూతులో తక్కువ ఓటింగు జరిగిందో అధ్యయనం చేయించి, దానికి గల కారణాలేమిటో ఆరా తీయించి ఆ లోపాలను పూరించడానికి చూసింది. వీటితో బాటు బోగస్ ఓట్లను ఏరేయడానికి ఒక సాఫ్ట్‌వేర్ తయారుచేయించి 2007 గుజరాత్ ఎన్నికలలో వాడి చూసింది. ఎన్నికల విధుల్లో పాల్గొనేవారికి గతంలో పోస్టల్ బ్యాలట్‌ద్వారా ఓటు చేసే సౌకర్యం వుండేది కాదు. ఇప్పుడు కల్పించారు. మొన్న జరిగిన ఐదు ఎసెంబ్లీ ఎన్నికలలో 47 మంది పరిశీలకులను రెండు వారాల ముందే ఆ యా రాష్ట్రాలకు పంపి ఓటింగు అవగాహనా కార్యక్రమాల తీరుతెన్నులను పర్యవేక్షించమన్నారు.

ఈ కష్టమంతా ఊరికే పోలేదు. మధ్యప్రదేశ్‌లో 2008లో 69% ఓటింగు జరిగితే యీ సారి 2% పెరిగింది. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు సమస్య వున్నప్పటికీ 66% నుండి 11% పెరిగి 77% ఓటింగు జరిగింది. రాజస్థాన్‌లో 7% పెరిగి 74% అయింది. ఢిల్లీలో అయితే ఏకంగా 8% పెరిగి 66% అయింది. ఓటింగు సమయం దాటిపోయినా జనాలు క్యూలో నిలబడి ఓట్లేశారు. మిజోరాంలో గతంలో కూడా 80% వుంది. ఈ సారి 1% పెరిగింది. ఓటేసిన వారిలో మహిళల శాతం పెరగడం శుభసూచకం. రాజస్థాన్‌లో పురుషుల కంటె 0.6% ఎక్కువమంది ఓటేశారు. ఛత్తీస్‌గఢ్‌లో యిలాగే జరిగింది. మనం కళ్లుతెరిచే సరికే దేశంలో ప్రజాస్వామ్యం వుంది కాబట్టి మనకు ఓటు హక్కు విలువ తెలియదు. ప్రపంచంలో చాలా దేశాల్లో (అభివృద్ధి చెందినవాటిల్లో కూడా) చాలాకాలం పాటు లింగపరంగా, జాతిపరంగా, విద్యపరంగా ఓటింగుపై ఆంక్షలు వుండేవి. మామూలు సమయాలలో వ్యవస్థను ఘాటుగా విమర్శిస్తూ సరైన సమయంలో బద్ధకించి మనకున్న గొప్ప హక్కును వాడుకోకపోవడం ఘోరం, నేరం. ఆమ్ ఆద్మీ వాలంటీర్లు ఇంటింటికీ తిరిగి ఓటరుగా నమోదు చేసుకోండని ప్రచారం చేసినా ఢిల్లీలో మూడింట రెండు వంతుల మంది మాత్రమే

ఓటేశారు. ఇంకో పదిశాతం మంది బయటకు కదిలివచ్చి ఓటేసి వుంటే యీ త్రిశంకు సభ ఏర్పడే పరిస్థితి, మళ్లీ ఎన్నికల వలన వ్యర్థావ్యయం తప్పేదేమో! ఈ పరిస్థితి మారాలి. మార్చడానికే స్వీప్ కృషి చేస్తోంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2013)**

**డిసెంబరు 31-33 వీక్లీకై** **ఎమ్బీయస్ : న్యూస్, వ్యూస్, రివ్యూస్ – 28**

## ఉత్తర కొరియాలో రాజబంధువు కాల్చివేత

ఉత్తర కొరియా అధ్యక్షుడు జోంగ్-ఉన్ రాజకీయంగా చాలా సాహసం చేశాడు. తనకు రాజకీయ గురువుగా వ్యవహరించిన మేనత్త మొగుడు జాంగ్ థేక్‌ను దేశద్రోహి అని ఆరోపిస్తూ ఫైరింగ్ స్క్వాడ్ చేత కాల్పించాడు. ఉన్ తండ్రి ఇల్ దేశాధ్యక్షుడిగా వుండే రోజుల నుండి థేక్ రాజకీయ సలహాదారుగా, పార్టీలో ముఖ్యుడిగా వుండేవాడు. ఇల్ నియంతృత్వానికి కొమ్ము కాస్తూ తమ దేశాన్ని పొరుగు దేశమైన చైనాకు సన్నిహితంగా తీసుకుని వెళ్లి, చైనా నుండి ఆర్థికసహాయం సంపాదించగలిగాడు. ఇల్ పాలించే రోజుల్లో అతని సోదరి కిమ్, బావగారు థేక్ పెత్తనం చలాయించారు. ఇల్ తను బతికుండగానే కొడుకు ఉన్‌ను యువరాజుగా నియమించి, థేక్‌ను అతని సంరక్షకుడిగా చేశాడు. 2011లో ఇల్ పోయినపుడు ఉన్‌కు 29 ఏళ్లు. మేనత్త మొగుడైన థేక్ అతనికి అండగా నిలిచి పాలనా వ్యవహారాల్లో పెద్ద దిక్కుగా నిలిచాడు. రాజకీయ వ్యవస్థపై పట్టు సంపాదించాడు. మరి అలాటివాణ్ని యిప్పుడు యిలా చంపించడమేమిటి? అంటే దానికి కొన్ని కారణాలున్నాయి.

నియంతలు రాజ్యం చేసినపుడు సైన్యం ప్రధానపాత్ర వహిస్తుంది. మినిస్ట్రీ ఆఫ్ స్టేట్ సెక్యూరిటీ విభాగం కింద పని చేసే సైన్యం ఎప్పటికైనా రాజుకి విధేయత చూపుతుందని గ్రహించిన థేక్ తనకంటూ ఒక ప్రయివేటు సైన్యాన్ని అంటే రహస్య పోలీసు దళాన్ని తయారుచేసుకున్నాడు. దానికి మినిస్ట్రీ ఆఫ్ పీపుల్స్ సెక్యూరిటీ అని పేరు పెట్టి తన కిందే పెట్టుకున్నాడు. ప్రస్తుత రాజు ఉన్ బలపడుతున్నకొద్దీ స్టేట్ సెక్యూరిటీకి, పీపుల్స్ సెక్యూరిటీకి ద్వేషం పెరిగింది. తన మామ రెక్కలు కత్తిరించాలనుకున్న రాజు పీపుల్స్ సెక్యూరిటీకి అధిపతిగా ఆయన్ను తొలగించాలని స్టేట్ సెక్యూరిటీకి ఆదేశాలు యిచ్చాడు. దీనికి తోడు థేక్ చైనా సహాయంతో దేశంలో ప్రవేశపెట్టబోయిన ఆర్థిక సంస్కరణలు వివాదాస్పదం అయ్యాయి. ఆర్థిక వ్యవస్థ బలహీనంగా వుంది కాబట్టి చైనా పెట్టుబడులు ఆకర్షించడానికి సెజ్‌లు పెట్టబోయాడతను. ఇదంతా సొంత ప్రయోజనాలకోసమేనని, చైనా వాళ్ల వద్ద డబ్బు తినేసి ఉత్తర కొరియాలోని ముడి ఇనుమును కారు చౌక ధరలకే చైనాకు కట్టబెట్టాడని అతనిపై ప్రచారం జరిగింది. నిజానికి విదేశీ ఆంక్షల కారణంగా ఉత్తర కొరియా ఆర్థికవ్యవస్థ ఏమాత్రం బాగా లేదు. దాన్ని పునరుద్ధరించడానికి కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలి. కరెన్సీ రద్దు వంటి తీవ్ర సంస్కరణలు చేపట్టాలి. చైనా దృష్టిలో థేక్ మాత్రమే అవి చేయగలడు. అందుకే అతన్ని తన ఆప్తమిత్రుడిగా భావించింది. అదే యితని చావుకి వచ్చింది. "థేక్ విశ్వాసఘాతకుడు, దేశద్రోహి, కుక్క కంటె హీనుడు" అనే ప్రకటన వెలువరించి కొరియా ప్రభుత్వం అతన్ని కాల్పించింది. చైనా శ్రద్ధాంజలి ఘటించింది. ఇప్పుడు థేక్ భార్య, రాజుగారి మేనత్త అయిన కిమ్ గతి ఏమిటో వేచి చూడాలి.

### లావు తగ్గితే లాభాలు

లావు తగ్గితే ఆరోగ్యరీత్యా చాలా లాభాలున్నాయంటారు. ఆరోగ్యం మెరుగయితే ఆర్థికంగా కూడా మెరుగవుతాం. ఇంత డొంకతిరుగుడు లేకుండా డైరక్టుగా 'మీ బరువును బట్టి మీ టిక్కెట్టు రేటు మారుతుంది' అని చెప్తే..? పసిఫిక్ సముద్రంలో దీవుల్లా వుండే చిన్న దేశమైన సమోవాలో నడిచే సమోవా ఎయిర్‌లైన్సు సిఇఓకు ఏడాది క్రితం యీ ఐడియా వచ్చింది. విమానం ఎక్కే ముందు 'మీ బరువు తూచి కిలోకి ఏభై ఏడున్నర అమెరికన్ సెంట్లు (వాళ్ల కరెన్సీలో 1.34 తలా) తీసుకుంటాం' అని ప్రకటించారు. ఇక సన్నవాళ్లందరూ ఆ విమానాలు ఎక్కడానికి ఎగబడ్డారు. ఎయిర్‌లైన్స్ ఆదాయం విపరీతంగా పెరిగింది. సన్నవాళ్లు అనగానే ఏ 50 కిలోల వాళ్లో అనుకోకండి. 120 కిలోల కంటె తక్కువ వున్నవాళ్లందరికీ తక్కిన ఎయిర్‌లైన్సుతో పోలిస్తే దీనిలో వెళ్లడం చౌక పడుతుంది. 120 కిలోల వాళ్లు ఆ దేశంలో మామూలుగా వున్నట్టే లెక్క. ఎందుకంటే ఆ దేశంలో దాదాపు అందరూ స్థూలకాయులే. సుగర్, గుండెజబ్బులతో బాధపడేవారు అత్యధికం.

లావుగా వున్నవాళ్లు విమానంలో ఎక్కువ స్థలం ఆక్రమించడం సహజం కాబట్టి తక్కినవాళ్ల కంటె ఎక్కువ చార్జీలు చెల్లించడం న్యాయబద్ధంగానే తోస్తోంది ఆ దేశస్తులకు. ఎవరూ అభ్యంతరపెట్టలేదు. ఆ మాటకొస్తే తక్కిన దేశాల్లో కూడా దీని గురించి సీరియస్‌గానే ఆలోచిస్తున్నారు. ఈ నవంబరు 19 న హీత్రూ ఎయిర్‌పోర్టులో ఓ 22 ఏళ్ల ఫ్రెంచి కుర్రాడు బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానం ఎక్కబోతూంటే అధికారులు కుదరదని చెప్పేశారు. 'నీ 230 కిలోల బరువు మోయడం మా విమానం తరం కాదు' అని యింటికి పంపించేశారు. ఈ సమోవా ఎయిర్‌లైన్సు అంత నిర్దయగా లేదు. 'మేం స్థూలకాయుల నుండి ఎక్కువ చార్జీలు పుచ్చుకుంటున్నాం కాబట్టి వాళ్లకు తగినంత చోటు కల్పించడం న్యాయం. అందువలన ప్రస్తుతం వున్న మూడు విమానాలకు తోడుగా మేం తెప్పించబోయే సెస్నా 208

విమానంలోని సీట్లను వాళ్ల కోసం ప్రత్యేకంగా తయారుచేయిస్తున్నాం.' అన్నారు. అలాటి ఏర్పాట్లు అన్ని దేశాల్లో రైళ్లు, బస్సుల్లో కూడా వస్తే మంచిది. అప్పుడు పక్కసీటులోని లావువాళ్లని తిట్టుకోనక్కరలేదు, లావు వాళ్లు కూడా ముడుచుకుపోయి కూర్చుని, వీళ్ల విసుగులు, నిట్టూర్పులు పడనక్కరలేదు. డబ్బు పడేసి దర్జాగా, కాళ్లు చాపుకుని విశాలంగా కూర్చోవచ్చు.

### నేనిచ్చిన తీర్పు తప్పు అని ఒప్పుకున్న జడ్జి

అమెరికా న్యాయచరిత్రలో ఎన్నడూ జరగని వింత జరిగింది. బ్రూక్లిన్ రాష్ట్రంలో జడ్జిగా పని చేసి రిటైరైన ఫ్రాంక్ బార్బరా అనే 85 ఏళ్ల పెద్దమనిషి 14 ఏళ్ల క్రితం తాను యిచ్చిన తీర్పు తప్పు అని కోర్టులో బోనెక్కి చెప్పాడు.

1998 నవంబరు 4 న బ్రూక్లిన్‌లో ఓ సినిమాహాలుకి వెళ్లిన వాళ్లల్లో యిద్దరు యువకులున్నారు. ఒకడు వేవెల్ వింట్. తాగి తన స్నేహితులతో సినిమాకు వచ్చాడు. ఇంకోడు ఫ్రాంక్ కాగన్. తాగలేదు కానీ లైసెన్సు లేని పిస్టల్ ఒకటి జేబులో పెట్టుకుని వచ్చాడు. సినిమా అయిపోయిన తర్వాత ఎందుకోగానీ వీళ్లిద్దరూ ఘర్షణ పడ్డారు. వింట్ తన బంగారు గొలుసు లాక్కోబోయాడని, అందుకే జేబులోంచి పిస్టల్ బయటకు లాగానని కాగన్ కోర్టులో చెప్పాడు. వింట్‌ను అతని స్నేహితులు పక్కకు లాక్కెళ్లారు. అయితే తాగి వున్న వింట్ మహోద్రేకంతో వాళ్లను విదుల్చుకుని మళ్లీ కాగన్‌పై పడ్డాడు. జేబులో పెట్టేసుకున్న పిస్టల్‌ను కాగన్ మళ్లీ బయటకు లాగి వింట్‌ను బెదిరించాడు. వింట్ దాన్ని లాక్కోబోయాడు. తుపాకీ పేలింది. గుళ్లు వింట్ ఛాతీలోకి, కడుపులోకి వెళ్లి అతను కుప్పకూలి చనిపోయాడు. అక్రమంగా ఆయుధం కలిగి వున్నందుకు, హత్య చేసినందుకు పోలీసులు కాగన్‌ను అరెస్టు చేశారు. 1999 అక్టోబరులో కేసు విచారణకు వచ్చింది. ఆత్మరక్షణ కోసమే కాల్చానని, తనకు జడ్జి నిర్ణయంపై నమ్మకం వుందని, జ్యూరీకై అడిగే హక్కున్నా తాను ఆ హక్కు వినియోగించుకోవడం లేదనీ కాగన్ కోర్టులో చెప్పాడు.

కాగన్ తలరాత రాసే ఛాన్సు జడ్జికి వచ్చింది. ఆయన అంతకుముందు రాజకీయవేత్త. తెల్లవాళ్లు నల్లవాళ్లపై చూపుతున్న జాతివివక్షతకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేసిన వ్యక్తి. అతను కాగన్ ఆత్మరక్షణ వాదాన్ని కొట్టి పారేసి 15 ఏళ్ల జైలుశిక్ష వేశాడు. దానిపై 2004లో అప్పీల్ కెళితే పై కోర్టువారు కొట్టేసారు. కేసు అంత పటిష్టంగా వుందన్నమాట. '..కానీ అవేళ యిచ్చిన తీర్పు తప్పేమోనన్న సందేహం నా మనసులో అలాగే వుండిపోయింది. రిటైరై పోయిన తర్వాత పేపర్లో ఏదైనా తప్పు జడ్జిమెంటు గురించి చదివినపుడు నా తీర్పును సింహావలోకనం చేసుకోమని నా అంతరాత్మ చెపుతూ వుండేది. ఏడాది ఏడాదికీ అది పెరగసాగింది. దాంతో నేను కాగన్ డిఫెన్సు లాయర్‌గా పనిచేసినతన్ని సంప్రదించి, ఆ కేసంతా క్షుణ్ణంగా చదివాను. కాగన్ ఆత్మరక్షణకోసమే పోరాడాడని నాకు యిప్పుడు తోచింది. మరి ఆ రోజు అలా ఎందుకు తోచలేదా అని ఆత్మపరిశీలన చేసుకుంటే నాకు ఓ విషయం తట్టింది. కాగన్ తెల్లవాడు, వింట్ నల్లవాడు. తెల్లవాళ్ల జాతివివక్షతకు వ్యతిరేకంగా పోరాడిన నాలో అంతర్గతంగా తెల్లవాళ్లపై కోపం వుండిపోయినట్టుంది. అవకాశం రాగానే దాన్ని వినియోగించుకున్నాను. దానికి యిప్పుడు పశ్చాత్తాపపడుతున్నాను. ఆ నాటి తీర్పును పక్కన పెట్టేసి కాగన్‌కు న్యాయం చేకూర్చండి' అని బార్బరో కోర్టుకి అపీల్ చేశాడు. కేసు మళ్లీ తెరిచారు. అతను గతవారం కోర్టులో బోనెక్కి యీ విషయాలు చెప్పగానే ఏం చేయాలో తోచక తలలు పట్టుకున్నారు. కొన్ని సందర్భాల్లో జ్యూరీ సభ్యులు 'తాము ఫలానా కేసులో వెలిబుచ్చిన నిర్ణయం తప్పనిపిస్తోందంటూ కోర్టుకి రావడం జరుగుతూంటుంది. ఆ కేసుల్లో తీర్పు తిరగదోడిన సందర్భాలు లేవు. కానీ సాక్షాత్తూ జడ్జే యిలా అంటున్నపుడు ఏం చేయాలి అని ఆలోచిస్తున్నారు.

### షిండేపై ధ్వజమెత్తిన మాజీ హోం సెక్రటరీ

కేంద్ర హోం మంత్రి షిండేగారికి ఆయన శాఖలో పనిచేసే హోం సెక్రటరీ రాజ్ కుమార్ సింగ్ అంటే పడేది కాదు. రాజ్‌కుమార్‌కూ డిటోడిటో. షిండే అతనిపై కాబినెట్ సెక్రటరీకి కూడా ఫిర్యాదు చేశాడు. షిండే నిర్ణయాలు తప్పుల తడకలనీ, చిన్న చిన్న విషయాలలో కూడా జోక్యం చేసుకుంటాడని, ఢిల్లీలో పోలీసు స్టేషన్లలో నియామకాల దగ్గర్నుంచి వేలు పెడతాడని రాజ్ కుమార్ అంటున్నాడు. ఉద్యోగంలో వుండగా పబ్లిగ్గా యివి చెప్పలేరు కదా, రిటైరైన తర్వాత బిజెపిలో చేరిన తర్వాత పత్రికల వారికి చెప్పేస్తున్నాడు. 1975 ఐయేయస్ బ్యాచ్‌కు చెందిన రాజ్ కుమార్ సొంతరాష్ట్రం బిహార్. రిటైరయ్యాక తమ రాష్ట్రానికి వచ్చి ప్రభుత్వానికి సలహాదారుగా పనిచేయమని, కాబినెట్ ర్యాంకు కల్పిస్తాననీ నితిశ్ ఆఫర్ యిచ్చారు. తన పార్టీలో చేరమని ఆహ్వానించారు కూడా. "నితిశ్ మొదటిసారి ముఖ్యమంత్రి అయినపుడు ఆయన వద్ద నేను పనిచేశాను. ఆయనంటే గౌరవం వుంది కూడా. అయితే యిప్పుడు యీ ఆఫర్ వచ్చాక పరిస్థితి ఎలా వుందని విచారించాను. అవినీతి పెరిగిపోయిందట. ఉన్నతోద్యోగాలకు లంచాలు యివ్వవలసి వస్తోందట. పైగా నక్సలైట్ల విషయంలో బిహార్ అంత సీరియస్‌గా లేదని, కేంద్రంతో సహకరించటం లేదని హోం సెక్రటరీగా నాకు స్వయంగా తెలుసు. అందుకని నితీశ్‌ను కాదని బిజెపిలో చేరాను." అన్నాడు రాజ్‌కుమార్.

బిజెపిని ఎందుకు ఎంచుకున్నారు? అని అడిగితే 'దేశరక్షణ గురించి నాకు చింత ఎక్కువ. కాస్త కఠినంగా వ్యవహరించాలంటాను. ఆ విషయంలో బిజెపి విధానమే నాకు నచ్చుతుంది. ఈ విషయంలో కాంగ్రెసు విధానం పూర్తిగా లోపభూయిష్టం. కుటుంబసభ్యులను

పైకి తేవాలన్న యావలో పడి ప్రజలతో బాంధవ్యం తెంపుకున్నారు.' అని సమాధానమిచ్చాడు. అతనితో బాటే రిటైరయిన పెట్రోలియం శాఖ కార్యదర్శి ఆర్ ఎస్ పాండే కూడా బిజెపిలో చేరాడు. ఆయనను కదిపితే పెట్రోలియం శాఖలో రహస్యాలు ఎన్ని చెపుతాడో!

**లోక్‌పాల్ బిల్లుకై సంతోషించాలా?**

46 ఏళ్ల తర్వాత పాసయిన లోక్‌పాల్ బిల్లును కాంగ్రెసు, బిజెపి రెండూ ఆహ్వానించాయి. దానికై ఉద్యమించిన అన్నా హజారే సంతోషం వ్యక్తం చేశారు. ఆయన (ఒకప్పటి) శిష్యుడు అరవింద్ కేజ్రీవాల్ దాన్ని జోక్‌పాల్ బిల్లు అన్నారు. ఈ బిల్లు అమలైతే పోలీసు కానిస్టేబుల్ కూడా ప్రధానమంత్రిని అరెస్టు చేసే పరిస్థితి ఏర్పడతుందని నిరసిస్తూ ములాయం వాకౌట్ చేశారు. ఇంతకీ యీ బిల్లు విషయంలో జరిగినదేమిటి? అన్నా అడిగినదేమిటి? అరవింద్ పట్టుబట్టినదేమిటి? ఫైనల్‌గా అందరూ సమ్మతించినదేమిటి?

ఈ విషయాలను క్లుప్తంగా పరామర్శిస్తే – లోక్‌పాల్ నియామకం గురించి చెప్పాలంటే అన్నా, అరవింద్ ఏడుగురు సభ్యుల కమిటీ ఎంపిక చేయాలన్నారు. ఫైనల్‌గా ఐదుగురు చాలని బిల్లు చెపుతోంది. ప్రధాని, చీఫ్ జస్టిస్, లోకసభ స్పీకరు, ప్రతిపక్ష నాయకుడు – యీ నలుగురూ కలిసి ఇంకో సభ్యుణ్ని ఎంపిక చేసి దేశాధ్యక్షుడికి సిఫార్సు చేస్తారు. ఆయన దాన్ని ఆమోదిస్తాడు. 2011లోని డ్రాఫ్టు బిల్లులో ఐదో సభ్యుణ్ని దేశాధ్యక్షుడే నియమిస్తారని చెప్పారు. ఇప్పుడు యీ నలుగురికీ సిఫార్సు చేసే పని పెట్టారు. ఐదో సభ్యుడుగా ఎన్నికయ్యే వ్యక్తి పేరున్న న్యాయమూర్తి అయి వుండాలని షరతు పెట్టారు. ఈ ఐదుగురు కలిసి లోక్‌పాల్‌ని ఎంపిక చేస్తారు. లోక్‌పాల్‌కు రాజకీయ అనుబంధం వుండకూడదని అందరూ ఒప్పుకున్నారు. అలా ఎన్నికైన లోక్‌పాల్ 8 మంది సభ్యుల కమిటీని ఏర్పాటు చేసి తను చైర్మన్‌గా వుంటాడు. 8 మంది సభ్యుల్లో సగం మంది న్యాయమూర్తులై వుండాలి. సగం మంది ఎస్సీ, ఎస్టీ, ఓబిసి, మైనారిటీ, మహిళా సభ్యులై వుండాలి. ఏ సభ్యుణ్నయినా తీసేయాలంటే ఎవరైనా ఫిర్యాదు చేస్తే చాలని అన్నా, అరవింద్ అంటే – కాదు, 100 మంది ఎంపీలు కలిసి ఫిర్యాదు చేస్తేనే తీసేయాలని బిల్లు అంది. సిబిఐ డైరక్టరు నియామకం సెంట్రల్ విజిలెన్సు కమిషన్ సిఫార్సుపై జరుగుతుంది కాబట్టి సిబిఐ పూర్తిగా ప్రభుత్వానికి లోబడి పనిచేయనక్కర లేదు. లోక్‌పాల్ చూస్తున్న కేసులను విచారిస్తున్న సిబిఐ అధికారులను లోక్‌పాల్‌కి చెప్పకుండా బదిలీ చేయడానికి వీల్లేదని బిల్లులో చెప్పారు.

దేశానికి లోక్‌పాల్ ఏర్పడిన ఏడాదిలోగా రాష్ట్రాలన్నీ తమ స్థాయిలో లోకాయుక్తలను నియమించాలి. ఇలా నియమించి తీరాలన్న నిబంధన డ్రాఫ్టు బిల్లులో లేదు. రాష్ట్రాల యిష్టానికి వదిలేశారు. ఇప్పుడు యీ బిల్లులో లోకాయుక్తలను నియమించాలి అన్నారు కానీ వాళ్లు లోక్‌పాల్ వ్యవహరించే తీరులోనే వ్యవహరించాలని నిబంధన పెట్టలేదు. పెట్టాలని అన్నా, అరవింద్ అడిగినా పెట్టలేదు. లోక్‌పాల్ ప్రజాధనం స్వీకరించే సంస్థలు, ట్రస్టులు అన్నీ లోక్‌పాల్ పరిధిలోకి వస్తాయి. వీరిపై ఎవరైనా ఫిర్యాదు చేసినా లోక్‌పాల్ లెక్కలోకి తీసుకోవచ్చని అన్నా, ఫిర్యాదు లేకపోయినా తనంతట తానే కేసు పెట్టవచ్చని అరవింద్ అంటే – ఫైనల్‌గా బిల్లులో 'యిరుపక్షాల వాదనలు విన్న తర్వాతనే కేసు గురించి ఆలోచించాలని' వుంది. కేసు ఎంక్వయిరీ 6 వారాల్లో, ఇన్వెస్టిగేషన్ 6 నెలల్లో ముగించాలని అన్నారు. తప్పుడు ఫిర్యాదు చేసినవారికి లక్ష రూపాయల జరిమానా వేస్తే చాలు అని అన్నా, అరవింద్ అంటే బిల్లులో ఏడాది జైలు కూడా చేర్చారు. తప్పుచేసినవారికి 10 ఏళ్ల శిక్ష వేయాలని అన్నా, అరవింద్ అంటే ఏడేళ్ల నుండి 10 ఏళ్ల వరకు అని బిల్లులో పెట్టారు.

**బంగ్లాదేశ్ ఎన్నికలు సవ్యంగా జరుగుతాయా?**

1971లో పాకిస్తాన్‌నుండి విముక్తి పోరాటం చేసి బంగ్లాదేశ్ విడివడింది. ఆ పోరాటంలో 30 లక్షల మంది దాకా చనిపోయారని అంచనా. ఆ సమయంలో స్వాతంత్రేచ్ఛతో అవామీ లీగ్ పాకిస్తాన్‌తో తలపడగా కొందరు పాకిస్తాన్ పక్షాన నిలిచి తిరుగుబాటు చేసిన అవామీ లీగ్ వారిని పాకిస్తాన్ సైన్యం చేత చంపించారు. అలా 380 మంది బంగ్లాదేశీయుల చావుకి ప్రత్యక్షంగా, పరోక్షంగా కారకుడైనవాడు అబ్దుల్ ఖాదర్ మూలా. అతను నాయకత్వం వహిస్తున్న పార్టీ జమాత్–ఎ–ఇస్లామీ ప్రతిపక్షంలో వుండగా, నాటి తిరుగుబాటుదారు అవామీ లీగ్ పార్టీ యిప్పుడు అధికారంలో వుంది. ప్రధాని షేక్ హసీనా మూడేళ్ల క్రితం ఇంటర్నేషనల్ క్రైమ్ ట్రైబ్యునల్ ఏర్పరచి నాటి యుద్ధనేరాలపై విచారణ జరపమన్నారు. ఆ ట్రైబ్యునల్ యిచ్చిన తీర్పు ప్రకారం మూలాను డిసెంబరు 13న ఉరి తీసి, అతని జన్మస్థలంలో సమాధి చేశారు. వెంటనే జమాత్ అభిమానులు దేశమంతా అల్లర్లు లేవదీశారు. బాంబులు పేలాయి. కొట్లాటలు, దుకాణాలపై దాడులు జరిగాయి. 2014 జనవరి 5 న జరగవలసిన ఎన్నికలు శాంతియుతంగా జరుగుతాయా? లేదా అని అందరూ సందేహిస్తున్నారు. సైన్యం సహాయంతో ఆనాటికి పరిస్థితి అదుపులోకి వస్తుందని హసీనా ధైర్యంగా వుంది. ప్రధాన ప్రతిపక్షమైన బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ అధినేత్రి బేగం ఖలీదా జియా, ప్రస్తుత ప్రభుత్వం గద్దె దిగి, ఆపద్ధర్మ ప్రధానిగా వేరెవరినైనా కూర్చోబెడితే తప్ప ఎన్నికలలో పాల్గొనబోమని ప్రకటించారు. ఎన్నికలు ఎలా జరుగుతాయో వేచి చూడాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2013)**

''పెద్దమనుష్యులు'' సినిమాలో కొసరాజుగారి ఓ రాజకీయ వ్యంగ్యగీతం వుంది. 'శివశివమూర్తివి గణనాథా' అని. 'మంత్రీ పదవి చెయ్ గణనాథా, నువ్వు ఓడకుంటే ఒట్టు పెట్టు గణనాథా..' అని. మంత్రి పదవే కాదు, ఏ పదవి ఎక్కినా అన్‌పాప్యులర్ కావడం తథ్యం. అరవింద్‌కు యీనాటి పాప్యులారిటీ ఆర్నెల్ల తర్వాత వుంటుందన్న నమ్మకం ఎవరికీ లేదు. పదవి అంటేనే పెద్ద గొయ్యి లాటిది. ఇప్పుడు ఆప్ ఆ గోతిలోకి దిగింది. ఎంత సంశయిస్తూ దిగిందన్నది ప్రశ్న కాదు, దిగిందా లేదా అన్నది పాయింటు. ఆప్ సర్కారు ఆయుష్షు ఎంతకాలం అన్నదే యిప్పుడు అందరికీ ఆసక్తి కలిగిస్తున్న అంశం. ఈ అనుమానం దేనికి? ఆప్ ప్లస్ కాంగ్రెసుకి వచ్చిన సీట్లతో ప్రభుత్వానికి సింపుల్ మెజారిటీ వచ్చినట్లే కదా అనవచ్చు. కానీ బయటినుండి మద్దతు యిస్తున్నది కాంగ్రెసు! అసలే దాని హిస్టరీ అంతంతమాత్రం! బిజెపికూడా బయటనుండి మద్దతు యిచ్చినపుడు కాంగ్రెసు పోకడలే పోయింది. విపి సింగ్ కథ చూస్తే తెలుస్తుంది.

### చరణ్ సింగ్ బోల్తా పడిన వైనం

కానీ కాంగ్రెసు యీ విద్యలో నిష్ణాతురాలు. అవతలివాళ్లకు ఆశ పెట్టడంలో, ముగ్గులో దింపడంలో, అదను చూసి కాళ్ల కింద చాప లాగేయడంలో దాన్ని మించిన ఘనులు లేరు. 1977లో ఇందిరా గాంధీని ఓడించి జనతా పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పరచింది. అందరూ సమర్థులే. కానీ కలిసి పనిచేయలేకపోయారు. వ్యక్తిగతమైన అహంభావాల కోసం ప్రభుత్వాన్ని బలి యిచ్చారు. ప్రధాని మొరార్జీ, ఉపప్రధాని చరణ్ సింగ్ సమావేశమైతే పేపర్లో ఒక న్యూస్‌గా వచ్చే రోజులవి. అలాటి టైములో ప్రతిపక్షంలో వున్న కాంగ్రెసు చరణ్ సింగ్‌ను లోబరచుకుంది. దాన్ని సంధానపరచిన దెవరో తెలుసా? ఇందిరా కుమారుడు సంజయ్ గాంధీ, చరణ్ అనుంగు శిష్యుడు రాజ్ నారాయణ్. రాజ్ నారాయణ్ ఇందిరా గాంధీని మొదట కోర్టులో, తర్వాత ఎన్నికలలో ఓడించాడు. ఇందిర గురించి పబ్లిక్ సమావేశాల్లో కూడా చెత్తగా మాట్లాడేవాడు. ఇక సంజయ్ గురించి అయితే చెప్పనే అక్కరలేదు. విషం కక్కేవాడు. అలాటివాడు సంజయ్ ఓ పాత్రికేయుడి ద్వారా కబురంపాడనగానే పరిగెట్టుకుని వచ్చాడు. మొరార్జీ ప్రభుత్వం కూలదోస్తే మేం బయటనుండి మద్దతు యిచ్చి చరణ్ సింగ్‌ను ప్రధాని చేస్తాం అని ఆశపెట్టారు. దాన్ని రాజ్ నారాయణ్ తను నమ్మి, చరణ్ సింగ్‌ను నమ్మించాడు. ప్రధాని కావడమే తన జీవితలక్ష్యం అని చాటుకున్న చరణ్ దాని కోసం యీ పనికి ఒడంబడ్డాడు. మొరార్జీని పడగొట్టాడు. రాష్ట్రపతి చరణ్‌ను పిలిచి పార్లమెంటు విశ్వాసాన్ని చూరగొనమని సమయం యిచ్చాడు.

ఆ సమయంలో కాంగ్రెసు చరణ్‌కు మొండిచెయ్యి చూపించింది. ఇక చరణ్ పార్లమెంటుకు మొహం చాటేశాడు. ఉపప్రధాని లెవెల్లో ఉత్తరాదిలో టాలెస్ట్ లీడరుగా వున్న చరణ్‌ను రాత్రికి రాత్రి ఓ బఫూన్‌గా చూపించింది కాంగ్రెస్. ఇక అప్పణ్నుంచి ఏడెనిమిది నెలలపాటు ఆపద్ధర్మ ప్రభుత్వం ఏర్పడింది. పరిపాలన నాశనమైంది. ప్రజలు కష్టాలపాలయ్యారు. రెండేళ్ల జనతా పార్టీ సుపరిపాలనను అందరూ మర్చిపోయి, దీన్నే గుర్తు పెట్టుకున్నారు. ఇలా కొట్టుకుని చచ్చేవారి కంటె, నియంత అయినా ఇందిరా గాంధీయే బెటర్ అనుకున్నారు. పబ్లిక్ మూడ్ చూసుకుని ఇందిర 'పనిచేసే ప్రభుత్వం' (ద గవర్నమెంట్ దట్ వర్క్స్') అనే నినాదంతో 1980 ఎన్నికలకు వెళ్లి అఖండ విజయం సాధించింది. చరణ్ సింగ్, రాజ్ నారాయణ్ కాలగర్భంలో కలిసిపోయారు. ఇందిర మళ్లీ లైమ్‌లైట్‌లోకి వచ్చింది. ఆవిడ వంశమే యింకా మనల్ని పాలిస్తోంది. చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని, దేవెగౌడ ప్రభుత్వాన్ని కాంగ్రెస్‌వాళు ఎలా ఆడించారో తెలుసు. అదను చూసి పడగొట్టి కాంగ్రెసు తప్ప యీ దేశానికి సుస్థిరప్రభుత్వాన్ని వేరెవరూ అందించలేరు అనే సందేశాన్ని ప్రజల్లోకి బలంగా పంపారు.

### మద్దతు యిచ్చేందుకు కాంగ్రెసుకు గల కారణాలు

ఇప్పుడు ఆప్‌తో కూడా కాంగ్రెసు అదే ట్రిక్కు ప్లే చేస్తోందా? అని అనుమానం. అసలు తమను అంత తిట్టిపోసిన ఆప్‌కు మద్దతు ఎందుకు యివ్వాలి? ఇవ్వకపోతే మళ్లీ ఎన్నికలు జరగక మానవు. ఆప్ నెగ్గుతుందో లేదో అన్న అనుమానంతో యీసారి వాళ్లకు ఓటేయని ఓటర్లు వచ్చేసారి వేస్తారు. దాంతో ఆప్ సీట్లు పెరుగుతాయి. ఎవరివి తరుగుతాయి? బిజెపివా, కాంగ్రెసువా? నెగ్గేవాడికే తమ ఓటూ వేస్తేనే తమ ఓటు సద్వినియోగం అవుతుందని భావించే మనస్తత్వం ఓటర్లలో వుంటుంది. అందుకే ఎన్నికల ముందు సర్వేలు నిషేధించాలని అధికార పార్టీలు అంటూ వుంటాయి. ఢిల్లీలో మళ్లీ ఎన్నికలు జరిగితే ఓడిపోయే కాంగ్రెసుకు ఓటేస్తే ఓటు మురిగిపోయినట్లే అనుకున్న కాంగ్రెసు ఓటర్లు కూడా బిజెపికో, ఆప్‌కో వేసేస్తారు. దేశరాజధానిలో ఇప్పటికన్నా దిగజారే పరిస్థితిని కొని తెచ్చుకుని పరువు యింకా పోగొట్టుకోవడం కంటె ఎన్నికలను ఎలాగైనా ఆపితే చాలని కాంగ్రెసు భావించింది. ఈ పొత్తు పార్లమెంటు ఎన్నికల వరకు కొనసాగితే ఆప్‌తో ఎన్నికల పొత్తు పెట్టుకుని తమ పార్టీ తరఫున కొందరు కాండిడేట్లను గెలిపించుకోవచ్చు. ఢిల్లీ నుండి ఎన్నికయ్యే కాంగ్రెసు ఎంపీలలో చాలామంది ప్రముఖులున్నారు. వారు సాఫీగా ఎన్నికవాలంటే యిప్పుడు దిగి రావాలి.

ఇప్పుడు మద్దతు తీసుకున్నంత మాత్రాన, పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెసుతో ఆప్ పొత్తు కుదుర్చుకుంటుందన్న గ్యారంటీ ఏముంది? అది ఒక మర్యాద తప్ప నిబంధన కాదు. అయినా కాంగ్రెసు రిస్కు తీసుకుంటోంది. ఎందుకు? ఆప్‌ని యిలాగే వదిలేస్తే అది చెలరేగిపోయి పార్లమెంటు ఎన్నికలలో తమ పార్టీకి మరింతగా గండి కొట్టవచ్చు. కార్యాచరణ అంటే కబుర్లు చెప్పినంత సులభం కాదని ఢిల్లీ ఓటర్లకు నిరూపించడానికి ఆప్‌కు ఒక అవకాశం యిస్తోంది కాంగ్రెసు. బయట వుండగా ఎన్ని నీతులైనా చెప్పవచ్చు. అధికారంలోకి వచ్చాక ఎన్ని రకాలుగా రాజీ పడతారో కళ్లకు కట్టినట్టు చూపాలంటే ఆప్ సర్కారు ఏర్పడి తీరాలి.

**పదవి యిచ్చి చూడు**

జాతక కథల్లో ఓ కథ వుంది – 'ఓ బౌద్ధ భిక్షువు ఓ కుక్కను అన్యాయంగా కొట్టాడు. కుక్క రాజైన బ్రహ్మదత్తుడి వద్దకు వచ్చి ఫిర్యాదు చేసింది. 'భిక్షువుకి శిక్షేం వేయాలో నువ్వే చెప్పు' అన్నాడు బ్రహ్మదత్తుడు కుక్కతో. 'ఇతన్ని రాజుగారి సత్రపు గుమాస్తాగా వేయండి' అంది కుక్క. అందరూ ఆశ్చర్యపడితే అప్పుడు చెప్పింది – 'సత్రం గుమాస్తాగా వున్నవాడు సత్రంలోని భాండాగారం, భోజనశాల, పశుదాణా శాల, యాత్రికులు దాచుకునే వస్తువుల గది (క్లోక్ రూమ్) వంటి వాటిపై అజమాయిషీ చేయాలి. యాత్రికుల నుండి రుసుము సరిగ్గా వసూలు చేయాలి. యాత్రికుల వస్తువులు దొంగిలించే దొంగలను పట్టుకుని శిక్షించాలి. ఒక్కోప్పుడు సాక్ష్యాలు దొరకవు. అయినా సొంత తెలివి, వివేకం వుపయోగించాలి. తెలిసో, తెలియకో ఏదో ఒక తప్పు చేయకమానడు. ఆ పాపం వచ్చే జన్మదాకా కూడా వేధిస్తుంది. గతం జన్మలో నేను సత్రం గుమాస్తానే. చిన్న తప్పు జరిగి యీ జన్మలో కుక్కగా పుట్టాను. పుణ్యం చాలా వుంది కాబట్టి పూర్వజన్మజ్ఞానం నశించలేదు.' అంది కుక్క. సాధారణ ప్రభుత్వోద్యోగం చేస్తేనే పాపం తప్పదంటే, యిక పై పదవిలో వున్నవాడు ఎన్ని పొరబాట్లు చేస్తాడో ఊహించండి.

అరవింద్ కేజ్రీవాల్ ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్‌లో పనిచేశారు కానీ మానిఫెస్టో తయారు చేసేముందు ఆర్థికంగా లెక్కలు వేశారో లేదో నాకు డౌటు. విద్యుత్ చార్జీలు సగానికి సగం తగ్గిస్తామని, ఇంటికి 700 లీటర్లు నీళ్లు యిస్తామని, యిలా ఎడాపెడా వాగ్దానాలు గుప్పించాడు. ఇప్పుడు అవి పీకకు చుట్టుకున్నాయి. రాజకీయాల్లోకి కొత్తగా వచ్చినవాళ్లు యిలాటి వాగ్దానాలు ధారాళంగా చేస్తారు. నిధులు ఎక్కణ్నుంచి వస్తాయని అడిగితే అవినీతి అరికడితే అవే వస్తాయని సమాధానమిస్తారు. పదవిలోకి వచ్చాక అర్థమవుతుంది – అవినీతి మాట ఎలా వున్నా డబ్బులు సరిపోవని. అప్పణ్నుంచి కేంద్రం నిధులు యివ్వాలి అని గొడవ మొదలుపెడతారు. స్కీములు వీళ్లవి, పేరు వచ్చేది వీళ్లకు, నిధులు మాత్రం కేంద్రం యివ్వాలిట..! ఎందుకు యిస్తుంది? అప్పణ్నుంచి యాగీ. అన్ని రాష్ట్రాలూ యిలాగే అడిగితే కేంద్రం ఎక్కణ్నుంచి తెస్తుంది?

**ఆంధ్ర, అసోం, తమిళనాడు.. ఎక్కడ చూసినా యిదే కథ**

ఎన్టీయార్ దగ్గర్నుంచి యిదే కథ. ఆయనా బోల్డు పథకాలు ప్రకటించాడు, అవినీతి రూపుమాపుతానన్నాడు. ఎక్కడైనా అవినీతి జరుగుతూంటే ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు, వచ్చి వాలతాను. అని వాగ్దానాలు గుప్పించారు. జరిగిందేమిటి? ఎన్టీయార్ అవినీతిరాహిత్యాన్ని ఆయన తమ్ముళ్లే భరించలేకపోయారు. 'మీకేం సార్, షష్టిపూర్తి వరకు సినిమాల్లో నటించి బోల్డు వెనకేశారు. మేం మా ఖర్చులతో నెగ్గి వచ్చాం. కాస్త చూసీచూడనట్టు వదిలేయాలి' అని మొత్తుకున్నారు. ఆయన వినలేదు. ఇలాటి అసంతృప్త ద్రావణాలను నాదెండ్ల పోగేశారు. కాంగ్రెసు మద్దతు యిచ్చింది. గద్దె కెక్కిన ఏడాదిన్నరకే ఎన్టీయార్‌ను దింపేశారు. ప్రజాందోళన మరీ ఎక్కువగా వుండడంతో ఆయన పదవి ఆయనకు దక్కింది. పుష్కరం తర్వాత మళ్లీ చంద్రబాబు అదే సాహసం చేసి సక్సెస్ అయ్యారు. ఎందుకంటే అప్పటికే తెలుగు తమ్ముళ్లు తెలివి మీరారు. ఎన్టీయార్ అంటే ఎన్నికలలో గెలిపించడానికే పనికి వస్తారు కానీ తర్వాత మేత మేయనిచ్చే రకం కాదని గ్రహించారు. అందుకే తెలుగుదేశంలో ఎన్టీయార్ శకం అంతరించి కాంగ్రెసుకు డూప్లికేటు అయిన చంద్రబాబు శకం అవతరించింది. కాంగ్రెసు రాజకీయవారసత్వాన్ని నిరసిస్తూ ప్రభవించిన టిడిపి యీనాడు అవే వారసత్వపు గొడవల్లో కొట్టుమిట్టులాడుతోంది.

ఆదర్శాలతో ప్రారంభించిన పార్టీలెన్నో యీ విధంగా తయారయ్యాయి. తమిళనాడులో కాంగ్రెసు ముఖ్యమంత్రి భక్తవత్సలం పదిలక్షల అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణతో డిఎంకె – 'బక్తవచ్చలం–పత్తులచ్చం' అనే నినాదంతో 1967 ఎన్నికలలో పోటీ చేసింది. తర్వాత ఏర్పడిన డిఎంకె ప్రభుత్వం అణ్నా కాలంలో సంగతి ఏమో కానీ కరుణానిధి ముఖ్యమంత్రి అయ్యాక లంచగొండితనానికి, అవినీతికి ఆలవాలంగా మారింది. అసోం గణపరిషత్ పార్టీగా మారి ఎన్నికలు గెలిచినపుడు దేశంలో కొత్తగాలి వీచిందని అందరూ ఆనందించారు. ప్రఫుల్ల మొహంతా అనే విద్యార్థి నాయకుడు కాలేజీ నుండి డైరక్టుగా సెక్రటేరియట్‌కు వచ్చేసి, ముఖ్యమంత్రి అయిపోయాడు. భృగు ఫూకన్ అనే అతని సహచర విద్యార్థి నాయకుడు ఉపముఖ్యమంత్రి. అతి కొద్ది రోజుల్లోనే యిద్దరూ కొట్టుకున్నారు. మొహంతాపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఇద్దరు భార్యల గొడవ కూడా వచ్చింది. తర్వాతి ఎన్నికలలో ఓడిపోయారు. ఇవన్నీ చూసిన పరిశీలకులు ఆప్ కూడా యిదే దారిలో పోతుందని అనుమానిస్తున్నారు. కాబినెట్ ప్రకటన రాగానే వినోద్ బిన్నీ

అసంతృప్తి చెందాడని వార్తలు వచ్చాయి. ఇది ఆరంభం మాత్రమే. లోకరీతి అదేమిటో గాని మేధావులు, మంచివాళ్లు, ప్రజాస్వామ్యవాదులు ఎప్పుడూ కలిసి వుండలేరు. అహంభావం చేత కలహించుకుంటారు. మధ్యలో సైన్యమో, నియంతో, దుర్మార్గుడో విజయం సాధిస్తాడు. అతని అనుచరులు అతనంటే ప్రాణం పెట్టేట్టు వుంటారు. మేధావులతో కుతకుతలాడి పోతున్న ఆప్ ఐదేళ్లపాటు ఢిల్లీని పాలిస్తుందని ఎంతటి ఆశాభావీ ఊహించలేదు.

**మద్దతు తీసుకోవడానికి ఆప్‌కు గల కారణాలు**

ఈ విషయం ఆప్‌కీ తెలుసు. తాము పరిపాలన చేయలేక పడిపోతే ఆ నెపాన్ని కాంగ్రెసుపై నెట్టివేయవచ్చని దాని ప్లాను. కాంగ్రెసు అవినీతిపై చర్యలు తీసుకోవడం వలన వాళ్లకు కోపం వచ్చి తమలో విభేదాలు సృష్టించి పరిపాలన సాగకుండా చేస్తోందని ప్రచారం చేసుకోవచ్చు. శిలువ నెక్కిన వాళ్లను ప్రపంచమంతా ఆరాధిస్తుంది. నమ్మిన సిద్ధాంతాల కోసం, నీతికోసం ప్రభుత్వాన్ని కూలదోసుకున్న తమకు మరింత గ్లామర్ పెరుగుతుందని ఆప్ అనుకుంటూండవచ్చు. (ఇలాటివాళ్లపై చేతకానివాళ్లు అనే ముద్ర వేసి ప్రజలు సంప్రదాయ పార్టీలను ఎన్నుకున్న సందర్భాలు అనేకం. అయినా ఎవరి ఆశ వారిది) ఇదంతా ఎందుకొచ్చిన రొష్టు. కాంగ్రెసుకు 'నో' చెప్పేసి, హాయిగా మళ్లీ ఎన్నికలకు వెళితే మంచిది కదాని అని మీరూ నేనూ అనుకోవచ్చు. కానీ ప్రస్తుతం బిజెపికి అందరికంటె అధికంగా సీట్లు వచ్చాయని మర్చిపోవద్దు. మళ్లీ ఎన్నికలు జరిగితే బిజెపి కార్యకర్తలు, సానుభూతిపరులు ఉత్సాహంగా పనిచేసి 36 సీట్లు తెచ్చేసుకునే అవకాశం కూడా వుంది కదాని ఆప్‌కి భయం. బిజెపి విజయావకాశాలపై అనుమానం కొద్దీ యీ సారి ఓట్లేయని ఓటర్లు అది అతి పెద్ద పార్టీగా అవతరించడంతో దానికి గతంలో కంటె ఎక్కువ ఓట్లు వేస్తారు. అదే జరిగితే ఆప్ కార్యకర్తలకు యిప్పుడున్న ఉత్సాహం చల్లారుతుంది. తప్పుడు విధానంతో, లేనిపోని భయాలతో చేతికి వచ్చిన అవకాశాన్ని వదులుకున్నారని నాయకత్వం నిందపడే ప్రమాదం వుంది. ఢిల్లీలో ఆప్ నెగ్గింది కాబట్టి బొంబాయి, పూనా వంటి యితర నగరాలలో కూడా ఆప్ శాఖలు ఉత్తేజంగా పనిచేయవచ్చు. ఢిల్లీ ఉపయెన్నికలలో బిజెపి నెగ్గితే అక్కడ కూడా ఆప్ డల్ అయిపోతుంది. అందుకే రిస్కు తీసుకుని, కాంగ్రెసు మద్దతు తీసుకుంది.

**ఈనాటి యీ బంధం ఏనాటి వరకు?**

అయితే పార్లమెంటు ఎన్నికల వరకు ఆప్–కాంగ్రెసు బంధం కొనసాగుతుందా లేదా? అనేది ఆప్ ప్రవర్తనపై ఆధారపడుతుంది. కాంగ్రెసు ఎన్నో గమ్మత్తులు చేయగలదు. తెలంగాణ విషయంలో చూస్తున్నాం కదా – కొందరి చేత విభజన అనిపిస్తారు. మరి కొందరి చేత సమైక్యం అనిపిస్తారు. హై కమాండ్ నిర్ణయాన్ని ధిక్కరిస్తా అని ప్రకటించిన ముఖ్యమంత్రిని అలాగే కంటిన్యూ చేస్తూ విభజన బిల్లు పాస్ చేయిస్తామంటారు. వాళ్లతో డీల్ చేసేవాళ్లు కన్‌ఫ్యూజ్ అయి ఛస్తారు. ఇప్పుడు ఆప్ విషయంలో షరతులు లేవని ఒక ప్రకటన వచ్చింది. షరతులు లేకుండా మద్దతు ఎలా వుంటుంది అని షీలా దీక్షిత్ అంటారు. మద్దతుపై మా పార్టీలో భిన్నాభిప్రాయాలున్నాయి అని జనార్దన్ ద్వివేది అంటారు. పార్టీ ఆఫీసు ముందు నిరసన ప్రదర్శనలు నడుస్తూనే వుంటాయి. అవేం పట్టించుకోకండి, మేం మీతోనే వున్నాం అంటూ అరవింద్‌కు హామీ యిస్తారు. అరవింద్ మనకు హామీ యిస్తారు – కాంగ్రెసు మద్దతు తీసుకుంటూనే కాంగ్రెసు నాయకుల అవినీతిపై విచారణ జరుపుతాం అంటూ.

ఇలాటి కబుర్లు జనతావాళ్లు, ఎన్టీయార్, బోల్డు పార్టీలు చేశాయి. కానీ తర్వాత చూస్తే ఫైళ్లు కనబడలేదంటారు. సాక్షాత్తూ ప్రధాని కార్యాలయంలోనే ఫైళ్లు మాయమైనపుడు యిలాటి ఫైళ్లు మాయం కావడం ఏమంత వింత? ఎందుకంటే కాంగ్రెసు మంత్రుల అవినీతితో బాటు వారికి సాయపడిన అధికారుల అవినీతి కూడా బయటపడే ప్రమాదం వుంది. కాంగ్రెసువారు గద్దె దిగారు కానీ, అధికారగణం కొనసాగుతుంది కదా. స్వీయరక్షణకోసం వాళ్లు ఫైళ్లు గల్లంతు చేస్తారు. లేదా తప్పుడు సమాచారం అందించి, ఆప్ చేత తప్పుడు నిర్ణయాలు చేయించి, కోర్టుచేత అక్షింతలు వేయిస్తారు. అక్కడకి ఆప్ చల్లబడుతుంది.

ప్రస్తుతం ఆప్ రెగ్యులర్ పార్టీ కాదు. వినోద్ బిన్నీ ఉదంతంతో రెగ్యులర్ పార్టీగా మారే సూచనలు బయటపడ్డాయి. ఓ నెలా రెండు నెలలు గడిచేసరికి అది కూడా రాజీపడడాలు, సర్దుకుపోవడాలు నేర్చుకుంటుంది. మామూలుగానే ప్రభుత్వం నడపడం చాలా కష్టమైన పని. ఎన్నో సమీకరణాలు చూసుకోవాలి. బయటి మద్దతుతో నడిచే ప్రభుత్వం మరింతగా రాజీపడాలి. పడలేకపోతే యీ లోపునే కూలిపోయి, కాంగ్రెసుపై నింద వేస్తూ ఓటర్ల ముందుకు వస్తుంది. కానీ ప్రజలు ఏ మేరకు విశ్వసిస్తారో తెలియదు. అలా కాకుండా రాజీపడితే పార్లమెంటు ఎన్నికల వరకు మనగలుగుతుంది. కానీ అప్పుడు తన ప్రత్యేకత కోల్పోతుంది. సంప్రదాయ పార్టీల్లో యిదీ ఒకటిగా మిగులుతుంది. ఇలాటి పరిస్థితుల్లో ఆప్‌కు ఆప్షన్లు లేవు. – ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2013)

**డిసెంబరు 37 వీక్లీకై** **ఎమ్బీయస్ : చెన్నారెడ్డితో పోలికెందుకు?**

కాంగ్రెసుతో విలీనమవుతారా? అని అడిగితే 'మరో చెన్నారెడ్డి కాబోను' అన్నారు కెసియార్. చెన్నారెడ్డి చేసినదేమిటి? ప్రత్యేక తెలంగాణ కోసం 1969లో ఉధృతంగా ఉద్యమం నడిపి తెలంగాణ ప్రజా సమితి పేర 1971 ఎన్నికల్లో ఘనవిజయం సాధించి, తర్వాత తన పార్టీని కాంగ్రెసు పార్టీలో విలీనం చేసేసి, తనూ, తన అనుచరులు పదవులు అనుభవించారు. దరిమిలా ముఖ్యమంత్రి కూడా అయ్యారు. తెలంగాణ విడిగా వుండాలని 1956లో సైతం వాదిస్తూ వచ్చిన ఆయన ఒకసారి తను ముఖ్యమంత్రి కాగానే 'తెలంగాణ అంశం ముగిసిపోయింది' అని డిక్లేర్ చేశారు. తన నెవరైనా విభజనవాది అంటే కోపం తెచ్చుకునేవారు. అంటే తనకు ముఖ్యమంత్రి పదవి తప్ప తెలంగాణ అనేది సమస్యే కాదని ఆయన భావం.

మరి కెసియార్ అలాగ కాదే! తనకు మంత్రి పదవి రాలేదు కాబట్టి తెలంగాణ ఉద్యమం మొదలుపెట్టారన్న విషయం నిజమే అయినా కేంద్రమంత్రి పదవి వచ్చాక కూడా ఉద్యమం ఆపలేదే! పైగా ఆ పదవి వదిలేసి, రాష్ట్రంలో కూడా తన అనుచరుల చేత పదవులు త్యాగం చేయించి, ఉద్యమం కొనసాగించారు. అది కూడా ఎన్నో ఒడిదుడుకులతో నడిచింది. ఒక దశలో దాదాపు మూతపడింది. కాంగ్రెసు అంతర్గత రాజకీయాల వలన మళ్లీ ఊపిరి పోసుకుంది. కెసియార్ పుష్కరం పాటు ఓపిగ్గా వేచి చూశారు. నిరంతరం అదే ధ్యాసలో వుండి, తెలంగాణలో రాజకీయం చేయదలచిన ప్రతి నాయకుడు విభజనకు అనుకూలంగా మాట్లాడవలసిన అగత్యాన్ని కల్పించారు. విభజనకు ప్రతికూలంగా వున్నవారు మౌనంగా వుండవలసిన ఆవశ్యకతను సృజించారు. చెన్నారెడ్డి విలీనం చేసి తెలంగాణ విభజనను విస్మరించారు. కెసియార్ విభజన విస్మరించలేదు సరికదా, తెలంగాణపై ప్రకటన వెలువడినా పార్టీని విలీనం చేయడానికి సరేననటం లేదు. మరి పోలిక ఎక్కడ? సామాన్య ప్రజలెవరూ అలా ఆరోపించలేదు, కెసియార్ వ్యతిరేకులు సైతం చెన్నారెడ్డి పోకడలు పోతున్నావని అనలేదు. మరి ఎవరికీ లేని డౌటు కెసియార్‌కు ఎందుకు వచ్చింది?

కాంగ్రెసు పార్టీలో విలీనమైతే టిడిపి నెత్తిపై పాలు పోసినట్టే అన్నారు కెసియార్. ఎందుకంటే యాంటీ-ఎస్టాబ్లిష్‌మెంట్ ఓటంతా టిడిపికి పోతుంది. జీవచ్ఛవంలా వున్న టిడిపికి ఆయువు పోసి, బతికించడం దేనికి? అని పాయింటు లాగారు. ఈ ముక్క నాబోటివాడికి కూడా ఎప్పుడో తెలిసినప్పుడు యిన్నాళ్లూ కెసియార్‌కు తట్టలేదా? ఈ విషయం ఆలోచించకుండానే 'తెలంగాణ యిస్తే ... కాంగ్రెసులో విలీనం' ఆఫర్ యిచ్చారా? ఆయన ఆఫర్ యివ్వడం తరవాయి, టి-కాంగ్రెసు వాళ్లు అది నమ్మేసి, సోనియాకు చెప్పడం జరిగాయి. తెలంగాణ యిస్తే కెసియార్ యింటి దగ్గర ముగ్గురికి మించి (కొడుకు, కూతురు, మేనల్లుడు అని భావం కాబోలు) వుండరని హనుమంతన్న గంతులేయడమూ జరిగింది. ఇప్పుడు ఆయనే 'కాంగ్రెసులో చేరండయ్యా బాబూ' అని తెరాస వారిని బతిమాలుతున్నాడు. ఊరూరా తిరుగుతూ కాంగ్రెసు ఓటు బ్యాంకు పెంచేస్తానంటూ ఆయన మొదలెట్టిన బస్సుయాత్ర ఏమైందో తెలియలేదు. తెలంగాణ తెచ్చేమని ప్రదర్శనలు చేయమని టి-కాంగ్రెసు నేతలకు హై కమాండ్ ఎంత చెప్పినా వాళ్లు కదలటం లేదు. అంతిమంగా ఎన్నికలకు ముందుగా తెలంగాణ వస్తుందో లేదోనన్న భయం వాళ్లనూ పీడిస్తోంది. పైగా తెరాసను కలిపేసుకున్నా, లేక పొత్తు కుదుర్చుకున్నా తమకు టిక్కెట్టు దొరుకుతుందో లేదో తెలియని పరిస్థితిలో సొంత డబ్బుతో ఎవరు ర్యాలీలు నిర్వహిస్తారు?

కాంగ్రెసులో విలీనమైతే ప్రభుత్వ వ్యతిరేక ఓటు టిడిపి పట్టుకుపోతుందని కెసియార్ చెప్తున్నారు. అందువలన పొత్తుతో సరిపెడతామంటున్నారు. పొత్తు పెట్టుకున్నా యీ భావమే ప్రజల్లోకి వెళుతుంది కదా. అధికారపార్టీతో పొత్తు పెట్టుకున్నాక, ప్రభుత్వవైఫల్యాల గురించి వారిని ఎలా విమర్శించగలరు? మరి అలా అయితే పొత్తు ఎందుకు పెట్టుకున్నావ్? అని ఓటర్లు అడుగుతారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు కంటె తెలంగాణ యిచ్చిన కృతజ్ఞత ఎక్కువ ఓట్లు తెస్తుందని అనుకుంటేనే విలీనం గురించి కానీ, పొత్తు గురించి కానీ ఆలోచించాలి. ఈ మాట కెసియార్‌కి తోచకుండా వుండదు. ఇదీ చెప్తారు – ఎన్నికల ప్రకటన వచ్చాక! విలీనం అని ఆశ పెట్టి కాంగ్రెసును యిక్కడిదాకా తీసుకుని వచ్చారు కదా. ఇప్పుడు దాన్ని పలుచన చేసి పొత్తు అంటున్నారు. పార్లమెంటులో బిల్లు పాసయ్యాక పొత్తు కుదరదంటూ యీ కారణాలు చెప్తారు.

మాటవరసకి పొత్తుకు సరే అన్నా చర్చలు ముందుకు సాగడం చాలా కష్టం. తెరాస లక్ష్యం 100 ఎసెంబ్లీ సీట్లు, 15 పార్లమెంటు సీట్లు. తెలంగాణ వచ్చింది కదాని అది సంతృప్తి పడి కూర్చోదు. మద్రాసు నుండి ఆంధ్ర రాష్ట్రాన్ని చీల్చి తెచ్చిన తర్వాత కాంగ్రెసు పార్టీ దుకాణం మూసేసిందా? అధికారానికి ఎగబడింది కదా! తగినన్ని సీట్లు రాకపోతే ప్రకాశం గారికి సిఎం పదవి ఎర వేసి, వెనకనుండి చక్రం తిప్పింది. తెరాస కూడా రాజకీయపార్టీయే! 2014లో రాబోయే సంకీర్ణప్రభుత్వం నుండి కావలసినంత పిండుకోవడానికి చాలా సీట్లు తెచ్చుకోవాలి. నిలబడిన చోటల్లా నెగ్గడం అసంభవం కదా. కనీసం 12 పార్లమెంటు సీట్లు గెలవాలంటే 15 సీట్లలోనైనా నిలబడాలి, అలాగే 80 ఎసెంబ్లీ సీట్లు కావాలంటే 100 చోట్ల నిలబడాలి. ఉన్న 119 సీట్లలో కాంగ్రెసు అభ్యర్థుల్లో సిటింగ్ వాళ్లే దాదాపు 50 మంది వున్నారు. కొందరు పార్టీ విడిచిపోయినా, ఆశావహులు వుంటారుగా. కొద్ది మార్జిన్‌లో ఓడిపోయిన వారు కూడా టిక్కెట్లు ఆశిస్తారు. అందువలన మహా అయితే కాంగ్రెసు సగం, సగం బేసిస్‌పై 60 సీట్లు ఆఫర్ చేస్తే తెరాసకు ఏం సరిపోతాయి?

ప్రాంతీయపార్టీ, జాతీయ పార్టీ ఒప్పందం కుదుర్చుకున్నపుడు ప్రాంతీయపార్టీకి 75% అసెంబ్లీ సీట్లు, 25% పార్లమెంటు సీట్లు ఆఫర్ చేస్తూ వుంటారు. ఆ లెక్కన కాంగ్రెసు తెరాసకు 90 అసెంబ్లీ సీట్లు యిచ్చిందనుకుందాం. వాటిలో 70 గెలిచినా తెరాస ప్రభుత్వం ఏర్పరచగలదు. కానీ పార్లమెంటు సీట్ల వద్దకు వచ్చేసరికి 4 ఎంపీ సీట్లు మాత్రమే యివ్వచూపితే కెసియార్‌కు రుచించదు.

ఎందుకంటే జాతీయస్థాయిలో ఆయన ఎన్‌డిఏ, మూడో ఫ్రంట్, యుపిఏ – ఏ ఆప్షన్ ఎంచుకోవలన్నా తగినన్ని సీట్లు చేతిలో వుండాలి. 4 యిస్తే వాటిలో మూడు గెలిచారనుకుంటే అవేం సరిపోతాయి? 2014 ఎన్నికలే తెరాసను శిఖరస్థానం. ఆ తర్వాత నుండి కిందకు దిగడం సహజం – తెలంగాణలో తెరాస ప్రభుత్వం ఏర్పరచి అద్భుతంగా పాలించేస్తే తప్ప! ఈ 2014 అవకాశం మళ్లీ మళ్లీ రాదనుకున్నపుడు అసెంబ్లీ, పార్లమెంటు రెండిటిలోనూ 75% స్థానాలు తెరాస కోరవచ్చు. ఇక కాంగ్రెసుకు దక్కేదేముంది? ఇలా చూస్తే వారి మధ్య పొత్తు కుదిరే అవకాశాలు చాలా తక్కువగా వున్నాయి.

అది మనసులో పెట్టుకునే కెసియార్ మడత పేచీలు పెడుతున్నారు. ఆయన ఆంక్షలు లేని తెలంగాణకు ఒప్పుకోవటం లేదు. కాంగ్రెసు పార్టీలో విలీనమైతే వాళ్లు చెప్పినట్టే వినాలి. తనకంటూ సొంత విధానం మిగలదు. విలీనానికి ముందు ప్రజారాజ్యం పార్టీది సమైక్యవాదం. కాంగ్రెసులో విలీనమయ్యాక వాళ్లు విభజన అంటే వీళ్లూ సరేనన్నాల్సి వచ్చింది. కాంగ్రెసు వాళ్లది రాష్ట్ర విభజనతో ప్లస్ ఆంక్షలున్న తెలంగాణ! ఆంక్షలున్న తెలంగాణకు అంగీకరిస్తే తను మరొక చెన్నారెడ్డిని అయినట్టే అని కెసియార్ ప్రకటిస్తున్నారు. ఆయన చెన్నారెడ్డి తరహా కాదని మనకు తెలుసు కాబట్టి దీని అర్థం – ఆంక్షల తెలంగాణకు అంగీకరించినవారు చెన్నారెడ్డి వంటి వారే అని! అంటే హై కమాండ్ మాట విని ఆంక్షల తెలంగాణకు తలవూపిన టి-కాంగ్రెసు వారిని కెసియార్ తెలంగాణ ద్రోహులుగా ముద్ర కొట్టబోతున్నారు. '28 రాష్ట్రాలకు లేని ఆంక్షలు తెలంగాణకు ఎందుకు? వారికో రూలు, మాకో రూలా? ఏం తెలంగాణ అంటే కాంగ్రెసుకు అంత చులకనగా వుందా!?' అన్న నినాదానికి ప్రజల్లోకి చొచ్చుకుపోయే శక్తి వుంది. దీనికి కొనసాగింపుగా కాంగ్రెసు అధిష్టానం సీమాంధ్ర పెట్టుబడిదారులకు బ్లాక్‌మెయిల్‌కు, వారి డబ్బుమూటలకు లొంగిపోయిందని చెప్తారు. తెలంగాణ వచ్చినా ఆంక్షల తొలగింపుకు మళ్లీ ఉద్యమం చేయవలసిన అవసరం వుందనీ, అది తెరాసకు మాత్రమే సాధ్యమనీ, సీమాంధ్రలో రాజకీయ అస్తిత్వం కోసం అలమటించే కాంగ్రెసు యీ ఉద్యమంలో పాలు పంచుకోలేదు సరికదా, దాన్ని నీరుకార్చే ప్రయత్నం చేస్తుందని, అందుకని తాము సోనియాకు కృతజ్ఞత తెలుపుతూనే కాంగ్రెసుకు దూరంగా మసలు కుంటున్నామనీ కెసియార్ వాదించగలరు. దీన్ని తెలంగాణ కాంగ్రెసు ఎలా ఎదుర్కోగలదో వేచి చూడాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2013)**

**డిసెంబరు 38– 43** **ఎమ్బీయస్ : మండేలా భార్య విన్నీ...**

నెల్సన్ మండేలా చనిపోయిన తర్వాత ఆయన గురించి రాయమని చాలామంది పాఠకులు అడిగారు. ఆయన గొప్పవాడే కానీ ఆయన పోయిన దగ్గర్నుంచి అంత్యక్రియలు అంతమయ్యేదాకా మన పేపర్లు, టీవీలు 'నల్ల సూరీడు' అంటూ ఆయన జీవితవిశేషాలతో చావగొట్టేశారు. వినివిని నాకైతే చికాకు వేసింది. నా తరఫున కూడా పాఠకులను వేధించడం దేనికని వూరుకుని మండేలా జీవితంలో ముఖ్యపాత్ర వహించిన విన్నీ గురించి నేను 1998లో రాసిన వ్యాసాన్ని కింద యిస్తున్నాను. అప్పట్లో నేను ఆంధ్రజ్యోతి ఆదివారంకు ప్రత్యేకవ్యాసాలు (కవర్ స్టోరీ) రాస్తూండేవాణ్ని. విన్నీ మండేలాపై విచారణ ప్రారంభమైనపుడు అప్పట్లో ఆదివారం ఎడిటర్ ఉ మామహేశ్వరరావు నన్ను అడిగి రాయించుకున్నారు. స్వాతంత్ర్య పోరాటాలు అవీ పుస్తకాల్లో చదివినపుడు ఆదర్శవంతంగా కనబడి బాగానే వుంటాయి. కానీ దానిలో పాల్గొనే వ్యక్తులు రాగద్వేషాలకు అతీతంగా వుండరు. మన స్వాతంత్ర్యోద్యమం గురించి పాలగుమ్మి పద్మరాజు గారు రాసిన "రామరాజ్యానికి రహదారి" అసంపూర్ణ నవలలో యిలాటి వ్యక్తుల గురించి రాశారు. ఒకాయన స్వాతంత్ర్యం కోసం జైలుకి కూడా వెళ్లి వస్తూంటాడు. వివాహితుడైన ఆయనకు వదినగారితో అక్రమ సంబంధం ఏర్పడుతుంది. అదేమిటి అంటే అంతే..! మన దేశనాయకులలో చాలామందికి వ్యక్తిగతమైన దౌర్బల్యాలుంటాయి. వాటిని హైలైట్ చేయవలసిన అవసరం లేదు, అదే సమయంలో వాటిని చూపించి వారి ఆశయాన్ని కించపరచనూ కూడదు.

నెల్సన్ మండేలా గృహనిర్బంధంలో దాదాపు మూడు దశాబ్దాల పాటు వుండి పేరు తెచ్చుకున్నాడు. బాగానే వుంది. కానీ అతని విముక్తి గురించి బయటి పోరాటం సాగించినది విన్నీ. 'గాంధీగారిది చాలా సింపుల్ లైఫ్‌స్టయిల్' అని మెచ్చుకుంటే సరోజినీ నాయుడు చమత్కరించింది – 'ఆయన్ను పేదగా వుంచడానికి మేమెంత ఖర్చు పెడుతున్నామో తెలుసా?' అని. గాంధీగారు రైల్లో మూడో తరగతిలో ప్రయాణిస్తానని పట్టుబట్టేవారు. మామూలు మూడో తరగతి పెట్టెలో ఎక్కనిస్తే కూర్చోడానికి కూడా చోటుండదు. పైగా జనాలంతా ఆయనకు షేక్‌హ్యాండ్ లిచ్చి, కాళ్ల మీద పడిపోయి నిద్రాహారాలు లేకుండా చేస్తారు. అందుకని ఆయన అనుయాయులు ఆ పెట్టెలో టిక్కెట్లన్నీ కొనేసి, కాంగ్రెసు కార్యకర్తలను కూర్చోబెట్టేవారట. మరి దానికి ఖర్చెంత అయి వుంటుంది? అలా చూస్తే ఫస్ట్‌క్లాసులో వెళ్లడం చవక కదా. మండేలా ఖైదులో కూర్చున్నాడు. బయట పోరాటం చేస్తున్నపుడు విన్నీ కొన్ని మంచి పనులూ చేసింది, కొన్ని చెడ్డపనులూ చేసింది. వ్యక్తిగతమైన బలహీనతలు ప్రదర్శించింది. జాతి వివక్షత రాజ్యం చేస్తున్నపుడు వీధి పోరాటాల్లో అన్నీ న్యాయబద్ధంగానే నడపాలంటే కుదరదు మరి. ఆమె విధానాలను అంగీకరించాలన్నా, అలా అని తప్పుపట్టాలన్నా – రెండూ కష్టమే. ఆ సందిగ్ధతే, ఆ వైరుధ్యమే నాకు ఆసక్తి కలిగించి, యీ వ్యాసం రాయడానికి పురికొల్పింది. దీనికి కాప్షన్ పెట్టినది, ఇటాలిక్స్‌లోని ముందు మాటలు రాసినది ఉమామహేశ్వరరావే!

**నిప్పుకొలనులో ఉక్కుకలువ – విన్నీ మండేలా**

బిగుసుకున్న జాత్యాహంకారపు ఉక్కు సంకెళ్లకేసి ఆమె కన్నెర్ర చేసినపుడు జాతి జాతంతా ఆ నిప్పులో కాగడాల్ని వెలిగించుకుంది. ఆ కాగడాలతో తెల్ల చీకటిని మట్టుబెట్టేసింతర్వాత కూడా... ఇప్పుడూ ఈ క్షణమూ ఆమె కన్నెర్రనైంది. ఆ కంటికి నెత్తుటి కాటుకను దిద్ది ఇప్పుడందరూ ఆమెను 'రక్తపిపాసి' అంటూ నిందిస్తున్నారు. స్వేచ్ఛా విహీనమైన జాతికోసం, చెరజిక్కిన భర్తకోసం ఆమె తెగబడ్డపుడు ఆమెను వీరవనిత వన్నారు. తన కోసం, తనలోని ఒంటరితనాన్ని తరిమికొట్టడం కోసం ఆమె తెగబడ్డపుడు ఆమెను తెగించిన ఆడదన్నారు. అందరికీ ఉపకరించిన ఆ తెగువే ఇప్పుడందరి కళ్లకీ తెంపరితనంగా కనిపిస్తోంది. తిరస్కరించడం ఇవాళ ఆమెకు కొత్తకాదు. నెల్సన్ మండేలా కోసం తండ్రిని తిరస్కరించింది. స్వజాతీయుల కోసం శ్వేత ప్రభుత్వాన్ని తిరస్కరించింది. పడ్డ శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరై రిక్తహస్తాల్తో నిలబడాల్సొచ్చినప్పుడు భర్తను తిరస్కరించింది. అతని ప్రభుతను తిరస్కరించింది. ఇప్పుడిక... తనవైపు ఎక్కుపెట్టిన చూపుడు వేళ్లని తిరస్కరిస్తోంది.

మొన్నటివరకు ఆమె ఒక వీరవనిత. దక్షిణాఫ్రికాకు 'జాతిమాత'. 28 ఏళ్లు చెరలో మగ్గిన భర్తను సంరక్షించుకోడానికి, వెలుపలికి తీసుకువచ్చి గద్దెనెక్కించడానికి అహరహం శ్రమించిన సాహసి. ఆమె భర్త దేశాధినేతగా విరాజిల్లుతున్న ఈనాడు, ఆమె – భర్తచే పరిత్యక్తయై, ప్రభుత్వం నుండి బహిష్కృతయై, పార్టీ వ్యవహారాల్లో అభిశంసితయై, చర్చనీయాంశమై బోనెక్కవలసి వచ్చింది. ఎందుకిలా జరిగింది? ఈ పరిస్థితి రావడానికి ఆమె ఎంతవరకు బాధ్యురాలు?

ఆర్చ్ బిషప్ డెస్మాండ్ టుటు అధ్యక్షతన ఏర్పడిన సత్యనిర్ధారక సమితికి శిక్షలు విధించే శక్తి లేదు. ట్రూత్ అండ్ రికన్సిలేషన్ కమిషన్ పేరిట 1995లో ఏర్పడిన ఆ సమితి ఏర్పాటే విలక్షణమైనది. దక్షిణాఫ్రికాలో ఉన్న ఆఫ్రికన్లను తమ వలస పాలనలో అణగదొక్కిన శ్వేతజాతీయులు అతి క్రూరులు. తెల్లవాడు కాదన్న కారణంగా మహాత్మాగాంధీని టిక్కెట్ వున్నా రైలులో నుంచి బయటకు తోసిపారేసింది ఆ సీమలోనే. ఆయన తన సత్యాగ్రహ శంఖాన్ని పూరించినది ఆ గడ్డలోనే. అక్కడ నుండి గాంధీ భారతదేశానికి తిరిగి వచ్చి, ఆంగ్లేయులను ఈ దేశాన్నుండి వెడలనంపారు కానీ దక్షిణాఫ్రికాలో వారి పాలన అలాగే సాగింది. ఆ అల్పసంఖ్యాకుల ప్రభుత్వాన్ని నడపడానికి అనేకమంది సహకరించారు. ఆ ప్రభుత్వ ఛత్రచ్ఛాయల్లో అనేకమంది భారతీయులు కూడా వర్ధిల్లారు. ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ తన దీర్ఘ పోరాటానంతరం శ్వేతజాతి ప్రభుత్వాన్ని గద్దె దింపింది. అయితే ప్రభుత్వం చేతులు మారడం అంత సులభమైన వ్యవహారం కాదు. ఇన్నాళ్లూ తెల్లవారి అక్రమాలకు గురైన నల్లవారు ప్రతీకారానికై ఉవ్విళ్లూరకుండా వుంటారా?

ఇక్కడే నెల్సన్ మండేలా ఔదార్యం కనబడుతుంది. 28 ఏళ్లు తెల్లవారి జైళ్లలో మగ్గినా కక్షసాధింపు చర్యలు చేపట్టలేదాయన. విప్లవ నాయకుడిగా వెలుగొందిన ఆయన రాజ్యాధికారం చేపట్టిన తర్వాత గొప్ప స్టేట్స్‌మన్‌గా, ఉదారవాదిగా వన్నెకెక్కాడు. పొరుగున ఉన్న జింబాబ్వే (ఒకప్పటి రొడీషియా)లో వలె నల్ల–తెల్ల జాతుల చిచ్చు రగలకుండా క్షమాగుణం ప్రదర్శించి, అందరినీ కలుపుకువచ్చే ప్రయత్నాలు చేశాడు. జాతి వివక్షలో మగ్గిన దక్షిణాఫ్రికాకు ఇది ఒక కొత్త అనుభవం. నల్లవారి నుండి భయం లేదని తెల్లవారికి నమ్మకం కలిగించడం, తెల్లవారిపై పగ తీర్చుకోనక్కరలేదని నల్లవారికి నచ్చచెప్పడం, పూర్వ ప్రభుత్వానికి వత్తాసు పలికినా, ఈ ప్రభుత్వం వేధించదని ఇతర జాతీయులకు విశ్వాసం కలిగించడం – ఇవన్నీ మండేలా తన నిజాయితీతో, చాకచక్యంతో సాధించిన అద్భుత విజయాలు!

వైషమ్యాలు, పాత కక్షలు మర్చిపోయి అందరూ కలిసి భావికేసి సాగేలా చేసే ఆ కృషిలో భాగమే ఈ సత్యనిర్ధారక, సమన్వయ సమితి స్థాపన. ఆనాటి సంఘటనల నిజానిజాలు వెలికిదీసి, సంబంధిత వ్యక్తుల చేత యదార్థాలు చెప్పించి, తిరిగిరాని గతంతో సమాధానపడి, 'జరిగినదేదో జరిగినది. ఇక వాటిని మర్చిపోదాం' అనే స్ఫూర్తితో జాతుల మధ్య సమన్వయం సాధించడానికే ఆ సమితి ఏర్పడింది. క్రైస్తవ మతంలో ఉన్న ఒప్పుకోలు (కన్ఫెషన్) అనే సదాచారానికి అనుగుణంగా ఉన్న ఆ సమితికి ఛైర్మన్‌గా వున్నది క్రైస్తవ మత గురువైన ఆర్చి బిషప్ డెస్మాంట్ టుటు.

1980లో దక్షిణాఫ్రికాలో నల్లవాళ్లు, అత్యధిక సంఖ్యలో నివసించే సొవేటోలో ఏం జరిగిందో నిజం తెలుసుకోవడానికి విన్నీ సహాయం కోరిందా సమితి. 1980లలో రాజకీయ పరిస్థితులు వేరు. జాత్యహంకార తెల్లప్రభుత్వం అధిక సంఖ్యాకులైన నల్లవారిని చిత్రహింసలు పెట్టింది. వారు ఏర్పరచుకున్న ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెసు (ఎ.ఎన్.సి.)ను నిషేధించింది. వారి నాయకులను చెరబట్టింది, వేధించింది. నల్ల వారిని కేసుల్లో ఇరికించి వారి జీవితం దుర్భరం చేసింది. వారిలో వివిధ తెగలవారికి విభేదాలు ఏర్పరచి తగవులాడుకునేట్టు చేసింది. దానికి ప్రతిగా నల్లవారు హింసను హింసతో ఎదుర్కొన్నారు. తెల్లవారితో, రాజకీయ ప్రత్యర్థులతో పోరాటం సాగించారు. నల్లవారిలో కొందరిని పోలీసు ఏజెంట్లుగా ప్రభుత్వం ప్రవేశపెడితే, తెల్లవారిని ఏదో విధంగా అప్రతిష్టపాలు చేసి రాజకీయ యుద్ధానికి ఊతమివ్వాలని పథకాలు వేశారు నల్లవారు. ఈ యుద్ధ వాతావరణంలో అమాయకులు కూడా బలయిపోయారు. పరస్పర సందేహాలు, వ్యక్తిగత ఇష్టాయిష్టాలు ఒక్కొక్కసారి విప్లవాన్ని తప్పుదోవ పట్టించాయి. ఆ విషపూరిత వాతావరణంలో జరిగిన పొరపాట్లను తెలుసుకొని, సత్యాన్ని నిర్ధారించి, నీతిని ప్రతిష్ఠాపించాలనే ఉద్దేశ్యంతోనే ఆ సమితి పని చేస్తోంది.

ఆనాటి విషయాలు విన్నీ కంటే ఎవరికి బాగా తెలుస్తాయి? ఆ పోరాటాన్ని సాగించిన నాయకురాలు ఆమే కదా. ఆ పోరాటంలో విజయం సాధించినమాట నిజమే. కాని పోరాటమార్గంలో జరిగిన పొరపాట్లకు బాధ్యత వహించాలిగా! ఆమె సమితిలో ఎదుర్కొన్న 18 కేసుల్లో ఎనిమిది కేసులు హత్యలకు సంబంధించినవి. వాటిలో ముఖ్యమైనవి నాలుగు. అవి విన్నీ స్థాపించిన మండేలా యునైటెడ్

ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యాన జరిగిన నేరాలు. 14 సంవత్సరాల స్టాంపీ అనే కుర్రాణ్ని పోలీసు ఏజంటు అనే అనుమానంతో చిత్రవధ చేసి చంపించిందని ఒక కేసు. అదే విధంగా తన సహచరుల జాడ పోలీసులకు చెప్పేసి వుంటాడన్న అనుమానంపై సోవో అనే యువకుణ్ణి చంపించిందనీ, తనడిగిన విధంగా సర్టిఫికెట్ ఇవ్వలేదన్న కారణంగా ఒక భారతీయ డాక్టరును చంపించిందనీ మరో రెండు కేసులు. వీటన్నిటిలోనూ సాక్షులున్నారు. సమరరంగంలో విన్నీ పాత్రపై చేసిన ఆరోపణలివి.

విన్నీ తన 24వ ఏట తండ్రి మాటను కాదని, రెండో పెళ్లివాడైన 40 ఏళ్ల నెల్సన్ మండేలాను పెళ్లాడింది. వివాహమైన నాలుగేళ్లకే భర్త జైలుపాలయ్యేడు. 28 ఏళ్ల పాటు భర్త జైలులో మగ్గుతూండగా ఆమె బయట వుండాల్సి వచ్చింది. పోరాటంలో పాల్గొనే రోజుల్లోనే ఆమెకు తాగుడు అలవాటయింది. అనేకమందితో తిరిగేదని కూడా వార్తలు వచ్చేయి. 1990లో భర్త జైలునుండి బయటకు వచ్చేక ఇద్దరి మధ్య విముఖత పెరిగింది. ఏప్రిల్లో విడాకులు అనే మాట లేకుండానే తనూ, విన్నీ వేరువేరుగా నివసించడానికి నిశ్చయించుకున్నామని మండేలా ప్రకటించారు. తనకంటే 29 ఏళ్లు చిన్నవాడైన వ్యక్తికి విన్నీ రాసిన పాత ప్రేమలేఖ పత్రికల్లో ప్రచురించడంతో ఆమె అభాసుపాలయింది. ఎ.ఎన్.సి.లోని అన్ని పదవులకు రాజీనామా చేసిందామె. తర్వాత 1994లో భర్త ప్రభుత్వంలో చేరినా, సంయమనం పాటించక భర్తను నానా తిప్పలు పెట్టింది. భర్త అన్ని జాతులను కలుపుకు రావడానికి కృషి చేస్తూంటే నల్లవారికి రావలసిన వాటా రావటం లేదనీ, ఈ ప్రభుత్వం కూడా నల్లవారికి ఒరగబెట్టినదేమీ లేదని దుమ్మెత్తిపోసింది. భరించలేక 1995లో భర్త ఆమెకు మంత్రిణిగా ఉద్వాసన చెప్పవలసి వచ్చింది.

చివరకు 1996 మార్చిలో నెల్సన్ మండేలా విడాకులకై అర్జీ పెట్టుకున్నారు. భార్య శీలం మంచిది కాదనీ (అడల్టరీ), ఆదాయానికి మించిన ఖర్చు పెడుతుందని ఆయన వాదన. విడాకులు మంజూరయ్యాయి. ఆ తర్వాత మండేలా మొజాంబిక్ దివంగత నేత సమోరా భార్యయైన 55 ఏళ్ల గ్రేసా మాషెల్‌తో ప్రేమలో పడ్డారు. విన్నీ విడాకులు పుచ్చుకున్న తర్వాత తన పుట్టింటివారి ఇంటిపేరైన 'మడికిజెలా'ను తన పేరుకు చేర్చుకుంది. ఇప్పుడామె విన్నీ మడికిజెలా మండేలా. సత్య నిర్ధారక సమితి ముందు వచ్చిన కేసుల్లో విన్నీ ఫుట్‌బాల్ క్లబ్‌లో సభ్యుడైన ఒకతనిపై మనసుపడి అతని ప్రియురాలైన ధ్లామిని అనే ఆమెను కొట్టించిందని ఒక ఆరోపణ వచ్చింది. సమితి విచారణ జరిగేటప్పుడు బాధితుల తరఫు న్యాయవాదులు విన్నీని అనేక ప్రశ్నలు వేసారు – 'నీకూ, నీ కూతురికి ఒకడే ఉమ్మడి ప్రియుడట కదా?', 'నువ్వు ఇద్దరు పోలీసుల వాళ్లతో ఒకేసారి శయనించావా?' – ఇటువంటివి. సమితి కార్యాలయం బయట చూస్తే విన్నీని బలపరుస్తూ ప్రజాప్రదర్శనలు, లోపల చూస్తే ఇలాటి ఆరోపణలు.

ఈ ఆరోపణలన్నిటికీ విన్నీ ఒకటే జవాబిచ్చింది. "నేనే పొరబాటు చేయలేదు. వాళ్లందరూ అబద్ధాలు చెబుతున్నారు" అని. అంతకంటే వివరణ ఆమె ఇవ్వలేదు. ఏది నిజమో మనకు నిర్ధారణగా తెలియకపోవచ్చు. కానీ విషయాలు అర్థం కావాలంటే గతంలోకి వెళ్లి విన్నీ కుటుంబ చరిత్ర, నెల్సన్ మండేలాతో ఆమె సంబంధ బాంధవ్యాలు, దక్షిణాఫ్రికా విముక్తి పోరాటంలో ఆమె పాత్ర, ఆమె విలక్షణ వ్యక్తిత్వం అన్నీ తెలుసుకోవాలి.

విన్నీ మండేలా అసలు పేరు వామ్‌జామో (దీని అర్థం శోషిత అని) వినిఫ్రెడ్. ఆమె తెంబు జాతికి చెందింది. వారు మాట్లాడే జోసా భాషలో ఆమె పేరు చెప్పాలంటే నోరుతిరగదు. ట్రాన్స్కీ జిల్లా పోండాలన్‌లో 1934లో పుట్టింది. తండ్రి కొలంబస్ హిస్టరీ టీచర్. తన జాతి ప్రజల ఘనత గురించి కూతురికి నూరిపోసి, ఆమెను యోధురాలిగా తీర్చిదిద్దాడు. తల్లి సెర్‌ట్రూడ్ దైవభక్తి పరాయణురాలు. శుభ్రత గురించి మహావెర్రి కలది. శుభ్రతలో విన్నీకి ఆమె పోలిక వచ్చింది. ఈ అలవాటు విషయంలో విన్నీని లేడీ మాక్‌బెత్‌తో పోలుస్తారు. రాజ్యకాంక్షతో లేడీ మాక్‌బెత్ హత్యలు చేయిస్తుంది. తర్వాత ఆ రక్తం తన చేతికి శాశ్వతంగా అంటుకుపోయిందనే భ్రమతో ఎప్పుడూ చేతులు కడుక్కుంటూ ఉంటుంది. హైస్కూల్ చదువు తర్వాత విన్నీ 1953లో జోహానస్‌బర్గ్‌లో సోషల్ వర్క్ గురించి పై చదువులు చదివింది. 1958లో నెల్సన్ మండేలాతో పరిచయమైంది.

నెల్సన్ మండేలా కూడా తెంబుజాతికి చెందినవారే. ట్రాన్స్కీ జిల్లాకు చెందినవారే. 1942లో చట్టశాస్త్రంలో పట్టభద్రుడైనాక 1944లో ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఎ.ఎన్.సి.)లో జేరారు. 1948లో ఉల్లంఘనోద్యమంలో చేరి దేశద్రోహ నేరం కింద 1956లో విచారించబడ్డారు. 1961 వరకు విచారణ సాగాక ఆయనను విడుదల చేసారు. ఈ సమయంలోనే ఆయన మొదటి భార్య ఎవిలీన్‌కు విడాకులివ్వడం, విన్నీని వివాహమాడడం జరిగింది. వారికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె జెనానికు స్వాజీ రాకుమారునితో వివాహమైంది. 36 ఏళ్ల చిన్న కుమార్తె జిన్‌డ్జీకి ఇంకా వివాహం కాలేదు. విన్నీతో బాటు సమితి విచారణకు ఇద్దరూ హాజరయ్యారు. 1960లో షార్ప్‌లో నిరాయుధులైన ఆఫ్రికన్లపై ప్రభుత్వం దమనకాండ జరిపించి, ఎ.ఎన్.సి.ను నిషేధించడంతో మండిపడ్డ మండేలా తన అహింసావాదాన్ని విడిచి సాయుధ పోరాటానికి సిద్ధపడ్డారు. దరిమిలా 1962లో ఐదేళ్ల శిక్ష వేసి ఆయనను జైలులో పెట్టింది ప్రభుత్వం. 1963లో రివోనియా కుట్ర కేసు విచారణ జరిపి, 1964 జూలైలో యావజ్జీవ కారాగార శిక్ష వేసారు.

విప్లవ పోరాటంలో పాలుపంచుకుంటున్న విన్నీని కూడా ప్రభుత్వం విడిచిపెట్టలేదు. ఆమె పౌరహక్కులు హరించి, సాంఘిక కార్యకలాపాలలో పాల్గొనరాదని ఆంక్షలు విధించారు. 17 నెలల పాటు ఏకాంత శిక్ష అనుభవించిందామె. విడుదల అవుతూనే గృహనిర్బంధం, ఆంక్షలు. 1974 నుంచి 75 వరకు తిరిగి కారాగారవాసం. అప్పటికే ఆమెను జాతిమాతగా కొనియాడడం మొదలుపెట్టారు సాధారణ ప్రజలు. కానీ ఎ.ఎన్.సి.లో ఆమెపై వ్యతిరేక భావాలు అప్పట్లోనే ఉండేవి. ఆమె అహంభావం, స్వార్థం, వింత పోకడలు – వీటివల్ల ఆమెను దూరదృష్టి గల నాయకురాలిగా వారు ఆమోదించలేకపోయారు. 1976లో సోవేటో నుండి కూడా ఆమెను

బహిష్కరించారు.

1977 నుండి 8 ఏళ్ల పాటు గృహ నిర్బంధంలో ఆమె కనీస సౌకర్యాలు లేని ఇంట్లో ఏకాంత జీవితం గడపవలసి వచ్చింది. ఈ దశలోనే ఆమె స్వభావంలో చాలా మార్పులు వచ్చాయి. మద్యపానం అలవాటయింది. ద్వేషభావం ఇనుమడించింది. కొట్టొచ్చేలా కనిపించే రంగురంగుల దుస్తులు వేసుకోసాగింది. బయట నల్లజాతి ప్రజలు ఆమెను ఆరాధిస్తున్నారు. కానీ ఆమె మానసికంగా ఒంటరిదయిపోయింది. భర్త విడుదల కోసం ఉద్యమిస్తూనే ఉంది. ప్రపంచ ప్రజలందరికీ ఆయన తరఫున విజ్ఞప్తులు పంపుతూ, దక్షిణాఫ్రికాలో జరుగుతున్న అత్యాచారాలను వెలుగులోకి తెస్తూ పోరాటాన్ని సాగిస్తోంది. కానీ వ్యక్తిగతంగా చాలా మార్పులకు గురయింది.

అంతర్జాతీయంగా వస్తున్న ఒత్తిడికి తట్టుకోలేక ప్రభుత్వం ఆమెను 1985లో విడుదల చేయగానే ఆమె సొవేటోలో నివాసం ఏర్పరచుకుంది. ఆనాటి సొవేటో–ప్రభుత్వానికి, నల్లజాతి యువకులకు మధ్య పోరు సాగుతున్న కురుక్షేత్రం. నిరాశ్రయులై, నిరుద్యోగులై ఉన్న నల్లజాతి యువకులను వెంట పెట్టుకుని ఆమె ప్రభుత్వాన్నే కాదు, ప్రజలను కూడా గడగడలాడించింది. హింసారాణి (క్వీన్ ఆఫ్ టెర్రర్) అని పిలువసాగారామెను. ప్రభుత్వ నిషేధానికి గురవకుండా ఉండడానికి వేరువేరు పేర్లతో అనేక సంస్థలు పుట్టుకొచ్చాయి.

వాటిలో విన్నీ స్థాపించి, నడిపిన 'మండేలా యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్' ఒకటి. ఆ క్లబ్ సభ్యులు పోలీసులపై, రాజకీయ ప్రత్యర్థులపై కక్ష సాధింపు చర్యలు సాగించారు. పోలీసు ఏజంట్లు కొంతమంది క్లబ్‌లో సభ్యులుగా దూరి మరిన్ని ఘాతుకాలు చేసి, క్లబ్‌కు కళంకం తెచ్చారు. నల్లజాతి వారిపై కూడా సాగే ఈ దుశ్చర్యలు ఎక్కువవడంతో కొంతమంది స్కూలు పిల్లలు కలిసి మండేలా ఇంటిని తగలబెట్టారు. దాంతో "మండేలా క్రైసిస్ కమిటీ" అనే పేరుతో ఒక సంస్థ వెలసి మండేలా వద్దకు రాయబారం వెళ్లి ఆయన భార్య, ఆమె గూండాలు చేస్తున్న చేష్టల గురించి ఫిర్యాదు చేసారు. 1988లో క్షయ రావడం వల్ల మండేలాను జైలు నుండి తరలించి గృహనిర్బంధంలో ఉంచారు.

భార్య ఈ విధంగా మారుతూండడం గురించి ఆయన వింటూనే వున్నాడు. కానీ తను బయటపడిన తర్వాత నచ్చచెప్పి ఆమెను మార్చగలనని ఆశించాడాయన. వ్యవహారం ఇంతదాకా వచ్చిందని విని ఆ క్లబ్ మూసేయమని ఈ కమిటీవాళ్ల ద్వారానే ఆమెకు కబురంపాడు. కానీ విన్నీ ఆయన మాటను ఖాతరు చేయలేదు. ఆమె గూండాలు ఇతర నల్లజాతి కుర్రవాళ్లను చావుదెబ్బలు కొట్టడంలో స్టాంపీ అనే కుర్రవాడు చనిపోయాడు. దానిపై చాలా గొడవ అయింది. మాస్ డెమొక్రాటిక్ మూవ్‌మెంట్ అనే సంస్థ విన్నీతో సంబంధ బాంధవ్యాలు తెంపుకుంటూ ఒక ప్రకటన చేసింది. ఆమెను సాంఘికంగా బహిష్కరించమంటూ సొవెటో ప్రజలకు పిలుపునిచ్చింది కూడా. కానీ ఆ పిలుపేమీ పని చేయలేదు. ఆరోపణలు ఎక్కువవడంతో మండేలా క్లబ్‌ను తక్షణం మూసేయమని మళ్లీ కబురంపేడు. అయిష్టంగానే విన్నీ క్లబ్ మూసివేసింది. కానీ ఆ కాలం నాటి కేసులు మాత్రం ఆమెను వదిలిపెట్టలేదు. వాటిలో కొన్ని యిప్పుడు విచారణకు వచ్చాయి.

ద్లామినీ కేసు – ద్లామినీ నల్లజాతి యువతి. ఫుట్‌బాల్ క్లబ్‌లో సభ్యుడైన షేక్స్ ఆమె ప్రియుడు. విన్నీ తనంటే పడిఛస్తుంది కనుక తమ ప్రేమ వ్యవహారం ఆమెకు తెలియకుండా వుంచమని అతను చెప్పాడు. కానీ ద్లామిని గర్భవతి కావడంతో రహస్యం దాగలేదు. అసూయతో విన్నీ తన మనుషులను పంపి ఆమెను ఇంటికి రప్పించుకుంది. తను నాలుగు దెబ్బలేసి 'చూడండ్రా, ఎంతడిగినా ఇది నిజం చెప్పడం లేదు. మరేం చేస్తారో చేయండి' అంది తన అనుచరులతో. వాళ్లామెను తీసుకెళ్లి కొడుతూ వుంటే విన్నీ కూతురు బయటకు వచ్చి ఏమిటీ గొడవ అని వాకబు చేసింది కూడా.

ఈ దెబ్బల కారణంగా ద్లామిని బిడ్డకు ఇప్పుడు తొమ్మిదేళ్లు వచ్చినా పెరుగుదల బాగాలేదు. ద్లామిని సోదరుడు ట్లోలి కూడా క్లబ్ సభ్యుడే. అతన్ని సాటి సభ్యుడైన సిథోల్ తుపాకీతో కాల్చి చంపేశాడు. తర్వాత సిథోల్ పోలీసు లాకప్‌లో చచ్చిపోయాడు. దీనికంతటికీ కారణం విన్నీకి కలిగిన అసూయే అని ఆరోపణ.

స్టాంపీ కేసు – స్టాంపీ సెపీ అనే పధ్నాలుగేళ్ల కుర్రాడు చాకులాంటివాడు. భయమనేది ఎరుగనివాడు. ట్యుమాహోల్‌లో నివసించే 14 ఏళ్లలోపు పిల్లలను చేరదీసి, వాళ్లకు జనరల్‌గా తనను తానే నియమించుకుని విప్లవంలో అద్భుతాలనెన్నో సాధించాడు. శ్వేతజాతి ప్రభుత్వంలోని ఒక యువ మంత్రిని బాలురపై లైంగిక అకృత్యాలు జరిపేవాడిగా చిత్రీకరించి రాజకీయ లబ్ధి పొందుదామని చూసింది విన్నీ. ఆ పథకంలో భాగంగానే స్టాంపీని, మరో ముగ్గురు బాలురను పట్టి తీసుకొచ్చారు. ఒక మత గురువు సంరక్షణలో వున్న ఆ కుర్రాళ్లను ఆయన లైంగిక అకృత్యాలకు గురికాకుండా రక్షిస్తున్నామనే మిషతో వాళ్లని 1989 జనవరి 1న విన్నీ ఇంటికి తీసుకువచ్చి, ఆ శ్వేత మంత్రిపై ఆరోపణలు చేయమని అడిగారు.

వాళ్లు నిరాకరించడంతో పట్టుకుని తీవ్రంగా కొట్టారు. చిత్ర హింసల పాలు చేశారు. పిల్లలు అదృశ్యం కావడంపై ప్రజలు గగ్గోలు పెట్టడంతో చివరికి ముగ్గురు పిల్లలను విడుదల చేయడం జరిగింది. నాలుగోవాడైన స్టాంపీ శవం సొవేటో పెంటదిబ్బలో దొరికింది. దానితో చాలా గొడవ జరిగింది. కేసులు పెట్టారు. చివరికి ఫుట్‌బాల్ క్లబ్ కోచ్ అయిన జెర్రీ రిచడ్‌సన్‌ను దోషిగా నిలబెట్టి అతనికి మరణశిక్ష వేశారు. తర్వాత దానిని యావజ్జీవ కారాగార శిక్షగా మార్చారు. సహ నిందితుడైన కటీజా సెబెఖులుల్ విచారణ సమయంలో మాయమైపోయాడు.

సత్యనిర్ధారక సమితి ముందు ఆ క్లబ్ సభ్యులు తాము చేసిన తప్పులు ఒప్పుకున్నారు. చావకుండా మిగిలిన బాలురు విన్నీ తమను

కొరడాతో కొట్టిందని చెప్పారు. కానీ విన్నీ అదంతా అబద్ధం పొమ్మంది. డిసెంబరు 4న సాక్షి బోనెక్కిన కోచ్ జెర్రీ చెప్పిన విషయాలు తలతిరిగేలా చేశాయి. "నేను ఆ క్లబ్‌కి 1986 నుంచి కోచ్‌గా వున్నాను. పోలీసువాళ్లు చూపిన ఆశలకు లొంగి 1987 మార్చినుంచి వారి ఏజెంటుగా మారాను. మామి (విన్నీని అలాగ పిలిచేవాళ్లు) స్టాంపీని గూఢచారి అని అనుమానించింది. వాళ్ల ఇంట్లో వెనుక గది (పార్లమెంటు అని పిలిచేవాళ్లు) కి తీసుకువచ్చి బంధించాము. మామీయే స్టాంపీని కత్తితో పొడిచిందని కటీజా చెప్పిన సాక్ష్యం తప్పు. ఆమె ఎవర్నీ తన చేతులతో చంపేది కాదు. స్టాంపీని మెడమీద కత్తితో పొడిచింది నేను..."

అంటే ఏమిటి – విన్నీ ఉద్యమంలోనే పోలీసు ఏజెంట్లు వున్నారన్నమాట, అందునా క్లబ్ కోచ్ వంటి ముఖ్యమైన పదవులలో అసలే సందేహమనస్కురాలైన ఆమెకు తన సహచరుల గురించి లేనిపోనివి చెప్పి విషం నూరిపోసేరన్నమాట. ఆమె వాటిని నమ్మి, ఈ అఘాయిత్యాలకు పాల్పడిందన్నమాట. జెర్రీ తక్కిన విషయాల గురించి కూడా చెప్పాడు – "విన్నీ చెప్పిన మీదట ఇద్దరు ఎం.కె. గెరిల్లాలను మా ఇంట్లో దాచాను. వాళ్ల గురించి పోలీసులకు నేనే ఉప్పందించాను. పోలీసులు వచ్చాక ఆ గెరిల్లాలను నేనే చంపేశాను. వాళ్లతోపాటు నా విషయం బయట పెట్టకుండా వుండడానికి ఆ పోలీసులను కూడా చంపేశాను. గెరిల్లాలు, పోలీసులు ఒకర్నొకరు చంపుకున్నారని అనుకున్నారందరూ. పోలీసులకు గెరిల్లాల సమాచారం అందించినవారెవరని విన్నీ అడిగితే లోలో సోవో, సిబోనిసో తషబలాల పేర్లు చెప్పాను. అయితే వాళ్లను చంపేయమంది. నేను చంపేశాను..."

ఇదంతా విన్న సమితివారు ఆశ్చర్యపడి "పోలీసు ఏజెంటుగా వుండడానికి నువ్వు సిగ్గుపడలేదా" అని అడిగారు. "సిగ్గేముంది. ఆ మాటకొస్తే విన్నీయే పెద్ద పోలీసు ఏజెంటు. ఇద్దరు పోలీసు ప్రముఖులతో ఆమెకు లైంగిక సంబంధాలుండేవి" అన్నాడు జెర్రీ!

భారతీయ డాక్టర్ హత్య – జాతి వివక్షకు వ్యతిరేకంగా, మానవహక్కుల కోసం పోరాడే డాక్టర్ అబూ బకర్ ఆస్వాత్ దక్షిణాఫ్రికాలో స్థిరపడ్డ భారతీయ సంతతికి చెందినవాడు. నల్లజాతీయుల పోరాటానికి మద్దతిచ్చినవాడు. అతన్ని విన్నీ చంపించిందన్న ఆరోపణ అతి తీవ్రమైనది. ఇద్దరికి ఘర్షణ రావడానికి కారణం, విన్నీ అడిగిన దొంగ సర్టిఫికెట్ అతనివ్వకపోవడం. నల్లజాతి యువకులనేకులకు ఆశ్రయం కల్పించిన రెవరెండ్ పాల్ వెరైన్, కటీజా (స్టాంపీ కేసులో సహ నిందితుడు) అనే తన అనుచరుడిపై లైంగిక అకృత్యం జరిపాడనే సర్టిఫికెట్ కావాలని విన్నీ డిసెంబరు 1989లో ఆస్వాత్‌ను కోరింది.

ఫుట్‌బాల్ క్లబ్‌లో జరుగుతున్న ఘోరాల గురించి బాగా తెలిసివున్న డాక్టర్ సర్టిఫికెట్ ఇవ్వనన్నాడు. వారిద్దరి మధ్యా వాగ్వివాదం జరిగింది. ఆ తర్వాతే డాక్టర్‌ను ఆయన హాస్పిటల్‌లో ఎవరో హత్య చేశారు. విన్నీ ఆ టైముకి తను ఊళ్లో లేనని ఎలిబయ్ చూపింది కానీ అప్పట్లోనే దానిని ఎవరూ నమ్మలేదు. డాక్టర్ సోదరుడు ఇబ్రహీం విచారణ జరగాలని పట్టుబట్టారు. కానీ పోలీసులు విన్నీని దోషిగా నిలబెట్టలేదు.

ఇటీవల సమితి ఎదుట ఇబ్రహీం సాక్ష్యమిస్తూ – "ఆ కేసులో ముద్దాయిగా నిలబెట్టి తులానీ హత్య చేయడానికి విన్నీ తనకు డబ్బిచ్చిందని రాసి ఇచ్చాడు. అయినా పోలీసులు అతని మాటలను ఖాతరు చేయలేదు. ఆ సమయంలో మండేలాను జైలునుండి విడుదల చేసే విషయంలో చర్చలు జరుగుతున్నాయి. అటువంటి సున్నితమైన సమయంలో మండేలా భార్యపై కేసు పెడితే బాగుండదని పోలీసులు భావించారు. కానీ ఆ స్టేట్‌మెంట్ కాపీ ప్రాసిక్యూటరు నాకిచ్చి ఎప్పుడో ఒకప్పుడు పనికివస్తుందని దాచమని సలహా ఇచ్చేరు" అన్నాడు.

నిజానికి అప్పటికి, ఇప్పటికి మధ్య చాలా విషయాలు వెలుగులోకి వచ్చాయి. స్టాంపీ కేసులో సహ నిందితుడైన కటీజా జాంబియాకు తప్పించుకుని పారిపోయి, చివరికి బ్రిటన్‌కి చేరాడు. ఫ్రెడ్ బ్రిడ్‌గ్లాండ్ 'కటీజాస్ జర్నీ' అనే పుస్తకం కూడా రాసి అతను చెప్పినవి రాసుకొచ్చాడు. బిబిసి వారు ఆ విషయాలపై డాక్యుమెంటరీ కూడా తీశారు. తులానీకి, సిరిల్ మబాతాకు డాక్టర్ ఆస్వాత్ హాస్పిటల్ ఎక్కడుందో చూపించమని విన్నీయే తనను ఆదేశించిందని కటీజా చెప్పాడు. ఆ హాస్పిటల్లో రిసెప్షనిస్టుగా వున్న సిసులు సాక్ష్యంపై కొంత గందరగోళమున్నా విన్నీయే ఆస్వాత్ హత్యకు కారకురాలని అందరూ భావించారు.

ఈ గొడవలు జరుగుతున్న సమయంలోనే దేశపరిస్థితి చేజారుతుండడం గమనించి శ్వేతప్రభుత్వం మండేలాను విడుదల చేయడానికి చర్చలు ఆరంభించింది. జాతి వివక్షను రద్దు చేసింది. 1990 ఫిబ్రవరిలో మండేలా విడుదల అయ్యేడు. విన్నీ సుదీర్ఘ పోరాటానికి విజయం సిద్ధించిన క్షణం అది. వెలుపలి నుండి ఆమె విప్లవాన్ని కొనసాగించి ఉండకపోతే ఆయన ఎన్నటికైనా బయటపడేవారా అన్నంతగా ఆమె పోరాటంలో నిమగ్నమయింది. మండేలా బయటకు వచ్చాక అప్పటి అధ్యక్షుడు డి క్లర్క్‌తో, రాజకీయ ప్రత్యర్థి ఇంకాతా పార్టీతో చర్చలు జరిపి 1993 నాటికి ఒక ఒప్పందానికి వచ్చేరు. ఆ తర్వాత అన్ని జాతులకు ఓటు హక్కు ఇవ్వబడింది. 1994 ఎన్నికలలో నెగ్గి మండేలా దేశాధ్యక్షుడయ్యేరు. ఆయన విన్నీకి తన కాబినెట్‌లో సాంస్కృతిక వ్యవహారాలు, సైన్స్, టెక్నాలజీ శాఖలో ఉపమంత్రిగా స్థానమిచ్చారు.

విన్నీ ఈ పదవి గెలుచుకున్నది మండేలా భార్యగా కాదు. గత వైరాలు మరవడానికి ఇష్టపడని నల్లజాతి ప్రజల నాయకురాలిగా ఆమెనెవ్వరూ విస్మరించలేని పరిస్థితి వచ్చింది. 1993లో ఎ.ఎన్.సి.లోని విమెన్స్ లీగ్ ప్రెసిడెంట్‌గా ఆమె అల్బర్టినా సిసులును అతి సులభంగా ఓడించింది. సిసులు కూడా మంచి నాయకురాలే. కానీ విన్నీకున్న పేరు ప్రఖ్యాతులు వేరే ఎవరికి వున్నాయి? భార్యభర్తలుగా మండేలా, విన్నీల మధ్య ఎడం పెరిగింది. జైలునుంచి బయటకు వచ్చిన కొత్తలో తన భార్యపై మోపబడిన స్టాంపీ హత్యారోపణ గురించి అడిగినపుడు మండేలా 'ఆమె నిర్దోషి అని నమ్ముతున్నాను' అన్నారు. కానీ వారి మధ్య ప్రేమ అంతరించిపోయినట్టే.

1996లో విడాకులు తీసుకునేటప్పుడు 'జైలు నుంచి నేను విడుదల అయ్యాక కలిసివున్న రోజుల్లో కూడా నేను మేలుకుని వుండగా ఆమె నా పడక గది ప్రవేశించినది లేదు' అని బహిరంగంగా చెప్పుకున్నాడాయన. ఈ విడాకుల పర్వానికి ముందు విడిగా ఉంటామని 1992లో ప్రకటించడం, ఆ తర్వాత ఆమె ప్రేమలేఖల ఉదంతం, అన్నీ జరిగేయి. ఈ మధ్య కాలంలోనే ఆమె ప్రభుత్వంలో చేరడం జరిగింది. చేరాక కూడా మండేలాకు తలనొప్పిగా తయారయింది. చేరిన ఏడు నెలలకు ఎ.ఎన్.సి. పార్టీ ఎన్నికలలో నెగ్గి, తన భర్త ప్రభుత్వం నల్ల ప్రజల బాగోగులను పట్టించుకోవడం లేదని నిందించింది. ఆమె ప్రభుత్వంలో వుంటూనే ఈ విమర్శ చేసింది. ఆమెను కలుపుకురావడం జరగని పని అని గ్రహించిన మండేలా 1995లో ఆమెను మంత్రివర్గం నుంచి తొలగించారు.

38 ఏళ్ల విచిత్ర వైవాహిక జీవితం తర్వాత మార్చి 1996లో వారు విడాకులు తీసుకున్నారు. రోషంతో 'చేతనైతే తనను పార్టీ నుంచి బహిష్కరించమ'ని సవాలు విసిరింది విన్నీ. ఈ డిసెంబరు నెలలోనే ఎ.ఎన్.సి. మండేలాకు వారసుడ్ని ఎన్నుకుంది. ఆ వ్యక్తే 1999లో ప్రముఖుడవుతాడు. అన్నీ సవ్యంగా సాగితే విన్నీ ఉపాధ్యక్షురాలై వుండేది. కానీ ఈ సత్యసమితి విచారణ కారణంగా ఆమె రాజకీయ జీవితం దెబ్బతింది. పార్టీకి కొత్త అధ్యక్షుడిగా తాబో మబేకీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తనను రాజకీయంగా అంతం చేయడానికి సమితి ఇప్పుడీ విచారణ చేపట్టిందని విన్నీ ఆరోపణ.

తనపై ఆరోపణలు విరుచుకుపడుతున్న సమయంలో వాటిని విన్నీ నిశ్చలంగా వింది. కళ్లు ఎర్రబడడం తప్పించి, ఆమె భావాలు ఏవీ బయటపడలేదు. విన్నీ కూతుళ్లిద్దరూ కూడా విచారణకు హాజరయ్యేరు. పెద్దకూతురు ముఖాన్ని చేతుల్లో దాచుకుంటే విన్నీకి అతి సన్నిహితురాలైన చిన్న కూతురు మాత్రం చూయింగ్ గమ్ నములుతూ చలించకుండా విన్నది.

ఏది ఏమైనా విన్నీకి, మేక్‌బెత్ వంటి షేక్స్పియర్ విషాద నాయకులకు పోలికలున్నాయి. ఒకనాడు ప్రపంచమంతటా జేజేలందుకున్న విన్నీ ఈనాడు మధ్యతరగతి మేధావుల దృష్టిలో రాజకీయంగా, వ్యక్తిగా పతనం చెందింది. దేశ నాయకులకు వుండవలసిన సంయమనం కాని, దేశ క్షేమం కోసం ప్రత్యర్థులను కలుపుకురాగల సమన్వయం కానీ లేని దుస్సాహసి అని నిందకు గురైంది. ముందువరస ప్రేక్షకుల అభిమానం చూరగొడానికి మితిమీరి నటించే నటుడిలా నల్లజాతి నిమ్నవర్గాల మెప్పుకోసం బాధ్యతారహితంగా ఆమె ప్రవర్తిస్తోందని కొందరు విమర్శిస్తున్నారు.

పదిగంటల పాటు సాగిన ఆమె జవాబులో సాక్షులందరినీ అబద్ధాల కోర్లని నిందిస్తూనే ఇదంతా ఇండియన్ల పన్నాగం అని కూడా అంది. భారతీయ సంతతికి చెందినవారు దక్షిణాఫ్రికాలో స్థిరపడి వ్యాపారంలోను, ఉద్యోగాలలోను చాలా వృద్ధిలోకి వచ్చారు. ప్రభుత్వాలు మారినా వారి ప్రభ తగ్గలేదు. నల్లజాతి నిమ్నవర్గాల ప్రజలకు సహజంగా వారిపై అక్కసు వుంది. దానిని ఉపయోగించుకోవడానికే ఆమె ఈ సమితి విచారణంతా భారతీయుల కుయుక్తి ఫలితమని, కొంతమంది నల్లవారిని కూడా వారు లోబరచుకున్నారని అంది.

ఇదంతా నిజంగా దురదృష్టకరం. యుద్ధ సమయంలో అనేక సాంఘిక నియమాలు ఉల్లంఘించడం జరుగుతుందని అందరికీ తెలుసు. కానీ జరిగిపోయిననాటికి విన్నీ క్షమాపణ చెప్పి ఆ అధ్యాయానికి దక్షిణాఫ్రికాలో స్వస్తి చెప్పి వుంటే ఎంతో హుందాగా వుండేది. విన్నీ అంటే ప్రజలకెంతో ఇష్టం. ఆమెకు వ్యతిరేకంగా సాక్ష్యం చెబుతున్న అజ్‌హర్ కచాలియా కూడా ఓ సమయంలో అన్నాడు – ''నా శరీరంలో ఒక భాగం వెళ్లి నిన్ను కౌగలించుకుని ఆ పీడకలల్ని మర్చిపోదాం అనబుద్ధి వేస్తోంది. కానీ మరో భాగం బాధ్యత ఎవరిదో నిర్ధారిస్తే కానీ అడుగు ముందుకు సాగదని హెచ్చరిస్తోంది'' అని. నిజానికి స్టాంపీ తల్లి తన సాక్ష్యం చెప్పిన తరువాత వైషమ్యం మరచి విన్నీని కౌగలించుకున్నది కూడా.

కానీ విన్నీలో ఈ ఔదార్యం కానరాలేదు. అది గమనించే చివరిగా టుటు అన్నారు – ''నువ్వు మహావ్యక్తివి. పొరపాటు జరిగిందని నువ్వు ఒప్పుకోవడం వల్ల నీ ఔన్నత్యం మరింత పెరుగుతుందన్న విషయం నువ్వు గుర్తించాలి'' అని. దానికి విన్నీ ''ఆ రోజుల్లో చాలా ఘోరాలు జరిగేయి. వాటికి దారితీసిన పరిస్థితులు కూడా మనకందరికీ తెలుసు. ఆ పరిస్థితులకు నేనూ చింతిస్తున్నాను'' అని అన్నది. అప్పటిదాకా నాకేం తెలియదని దబాయించిన తర్వాత ఈ వివరణ సమంజసంగా లేదని అందరికీ అనిపించడంలో ఆశ్చర్యమేముంది?

ఇదీ – ఆంధ్రజ్యోతి ఆదివారం 4 జనవరి 1998 సంచికలో ప్రచురించబడిన వ్యాసం. దీనికి తాజాపరిణామాలు చేరిస్తే విన్నీ స్వరూపం బోధపడుతుంది. సత్యనిర్ధారక సమితి 2003 నాటి తీర్పు ప్రకారం 43 ఫ్రాడ్ కేసుల్లో, 25 దొంగతనం కేసుల్లో ఆమె శిక్షార్హురాలు. ఆమె నేరాన్ని ఒప్పుకోలేదు. ఐదేళ్ల జైలు శిక్ష వేశారు. ఆమె తన పార్టీలో అన్ని పదవులకు, పార్లమెంటు సీటుకు రాజీనామా చేసి ప్రెటోరియా హై కోర్టుకి అపీలు చేసుకుంది. 'నేరాలు ఆమె వ్యక్తిగత లాభానికి చేసినవి కావు' అనే కోణంలో ఆలోచించి ఈ కోర్టు జులై 2004లో మూడున్నర సంవత్సరాల జైలుశిక్ష వేసింది. ఇది కూడా ఆమె తన ఉద్యోగస్తులకోసం తీసుకున్న బ్యాంకు ఋణాలు ఎగ్గొట్టినందుకు. విన్నీ ఈ తీర్పుపై కూడా అపీలు కెళ్లింది. ఆమె జీవితంపై ఒక అపేరా తయారైంది. పేరు 'ద పేషన్ ఆఫ్ విన్నీ' దాని ప్రీమియర్ షోకై కెనడా వెళదామంటే కెనడియన్ హై కమిషన్ వాళ్లు వీసా యివ్వలేదు. ఈ విషయాలు ఎలా వున్నా ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెసులో ఆమె హవా తగ్గలేదు. 2009 ఎన్నికల్లో ప్రాధాన్యతా క్రమంలో ఆమె ఐదవ స్థానాన్ని పొందింది. పేదల్లో, అతివాదుల్లో ఆమె స్థానం పదిలంగానే వుందన్న విషయం స్పష్టమైంది.

ఆమె తన తీవ్రభావాలను వదులుకోలేదని అనుకోవడానికి మరో ఉదాహరణ – 2010లో నదీరా నైపాల్‌కు ఆమె యిచ్చిన

యింటర్వ్యూ. దానిలో ఆమె నెల్సన్ మండేలాను తిట్టిపోసింది. అంతర్జాతీయ ఖ్యాతికోసం నల్లవాళ్ల హక్కులను బలి యిచ్చాడని, డబ్బు పోగేసుకున్నాడని నిందించింది. ఒక తెల్లవాడు (డి క్లర్క్) తో కలిసి నోబెల్ ప్రైజ్ పంచుకున్నందుకు తప్పుపట్టింది. కుటుంబపరంగా చూసినా తామిద్దరికి కలిపి పుట్టిన కూతుళ్లకు అందుబాటులో లేడని, తండ్రిగా కూడా విఫలమయ్యాడని అంది. ఈ ఇంటర్వ్యూ పార్టీలో కలకలం రేపింది. చివరకు ఆ యింటర్వ్యూ అంతా ఉత్తిదేనని ఆమె తరఫు ప్రతినిథి ప్రకటన విడుదల చేశారు. ఏది ఏమైనా విన్నీ మండేలా రగులుతూనే వుంది. ఇప్పుడు మండేలా మరణించాక ఆమె మళ్లీ తెరమీదకు వచ్చింది. మండేలా ఆస్తికి, రాజకీయాలకు వారసులెవరు అనే వివాదానికి ఆజ్యం పోస్తోంది.

మండేలాకు మూడుసార్లు వివాహమైంది. 6గురు పిల్లలు, 17 మంది మనవళ్లు, మనవరాళ్లు. 80 వ యేట చేసుకున్న మూడో భార్య ద్వారా పిల్లలు లేరు. రెండో భార్య విన్నీ ద్వారా యిద్దరు కూతుళ్లు. మొదటి భార్య ఎవిలీన్‌తో 13 ఏళ్లు కాపురం చేశాడు. వాళ్లకు యిద్దరు కొడుకులు, యిద్దరు కూతుళ్లు. కొడుకులిద్దరూ మండేలా బతికుండగానే పోయారు – ఒకడు 24 ఏళ్ల వయసులో కారు యాక్సిడెంటులో, మరొకడు 55 ఏళ్ల వయసులో, ఎయిడ్స్‌తో! మొదటి కూతురు తొమ్మిది నెలలకే పోయింది. రెండో కూతురు 59 ఏళ్లది. పేరు 'మాకీ' (అసలు పేరు మకాజివె). ఆమె మసాచుసెట్స్‌లో ఆంత్రపాలజీలో డాక్టరేటు తీసుకుని, యూనివర్శిటీలలో, ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ సంస్థల్లో ఉన్నతోద్యోగాలు చేసింది. ఘనా దేశస్తుణ్ని పెళ్లి చేసుకుంది. ఇప్పుడు మండేలా వారసురాలిగా ఆమెను ముందుకు తెచ్చింది విన్నీ! మండేలా పిల్లల్లో తనే పెద్దది కాబట్టి, ఆమెయే కుటుంబ పెద్ద అని, తన కూతుళ్లు జెనానీ, జిండ్జీ ఆమెను అనుసరిస్తారని ప్రకటించింది. తన కూతుళ్లకోసం పోరాడకుండా సవతి కూతుర్ని నాయకురాలిగా చూపుతోంది కాబట్టి నిస్వార్థంగా వ్యవహరించినట్టు కనబడుతుంది. అయితే దీనిలో ఓ రాజకీయం వుంది.

మండేలా రెండో కొడుకు మకగతో కొడుకు మాండ్లా మండేలా అంటే మండేలాకు యిష్టం. తన తెగ (మ్వేజో)కు నాయకత్వం వదలుకుని తన బదులు మనవణ్ని ఎన్నుకోమని వాళ్లకు చెప్పాడు. మాండ్లాకు 39 ఏళ్లు. పొలిటికల్ సైన్సులో గ్రాజువేటు. ఇప్పటికే మూడు పెళ్లిళ్లు అయ్యాయి. వివాదాస్పదమైన వ్యక్తి. కానీ మండేలాకు అభిమాన పౌత్రుడు కాబట్టి రాజకీయవారసత్వం అతనికి దక్కుతుందనే భయంతో విన్నీ అతన్ని దూరంగా నెట్టేసింది. కునూలో మండేలా ఫ్యామిలీ ఎస్టేటులోంచి అతన్ని బయటకు నెట్టేసి తాళాలు వేసేశారట. నీళ్లు, కరంటు కట్ చేశారట. ఇదంతా మీడియా కల్పనే అంటోంది విన్నీ. మండేలా కుటుంబం యొక్క పరువు కాపాడడానికి మాకీ ప్రయత్నిస్తోందని, మీడియా రచ్చకీడుస్తోందని మండిపడింది.

''మండేలా కుటుంబం గురించి చింత నీకేల? మేం చూసుకుంటాం. పెళ్లయ్యింది కాబట్టి మీ అత్తవారి కుటుంబ పరువు చూసుకో." అని మాండ్లా మాకీపై మండిపడుతున్నాడు. 'కుటుంబంలో ఏదైనా గొడవలు వస్తే యింటి ఆడపడుచుగా ఆమె మధ్యవర్తిగా వుండాలి. కానీ మా మేనత్త తనే గొడవలు తెచ్చిపెడుతోంది. మా తాత చనిపోయిన వారం రోజులకు వచ్చింది.' అని ఆరోపించాడు మాండ్లా. ప్రజలు దర్శించుకోవడానికి వీలుగా శవపేటికను యూనియన్ బిల్డింగ్స్‌లో పెట్టినపుడు దాని పక్కన మూడు రోజులపాటు అతనే వున్నాడు.

శాంతిదూతగా పేరు పొందిన నెల్సన్ మండేలా వారసత్వం నాదంటే నాదని వివాహితురాలైన అతని పెద్దకూతురు, పెద్ద మనుమడు పోరాడుకుంటున్నారు. అదీ చిత్రం! **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2013)**

**డిసెంబరు 45** **ఎమ్బీయస్ : దేవయాని అరెస్టు**

న్యూయార్క్‌లో భారత దేశం తరఫున డిప్యూటీ కాన్సల్ జనరల్‌గా పని చేస్తున్న దేవయాని ఖోబర్‌గాడే అరెస్టు మన దేశంలో చాలా సంచలనాన్ని కలిగించింది. అమెరికా పెద్దన్న దురహంకారంపై అందరూ మండిపడ్డారు. గతంలో వారు మన భారతదేశ నాయకుల బట్టలిప్పించినా మనవాళ్లు సహించినందుకే యీ దుర్గతి దాపురించిందని సంపాదకీయాల్లో చీల్చిచెండాడారు. మనకు సిగ్గు లేదని, వాళ్ల ముందు సాగిలబడుతున్నామనీ హుంకరించారు. భారతప్రభుత్వం తనకు చేతనైనంత తీరులో స్పందించింది. అది చాలలేదని ప్రజలందరూ భగ్గుమంటున్నారు. ఈ పరిస్థితుల్లో నిజంగా జరిగినదేమిటని లోతుగా విచారించి, నిదానంగా ఆలోచిస్తే మంచిది.

మొదటగా చెప్పుకోవలసినది – ఈ సంఘటన కారణంగా అమెరికా దేశం యావత్తు భారత్‌పై, భారతీయులపై కక్ష కట్టిందని అనలేము. ప్రతి దేశంలోనూ కొందరు వ్యక్తులు యిలాటి దుశ్చర్యలకు ఒడంబడతారు. భారతీయులందరూ పాకిస్తాన్‌లోని ప్రతి మనిషిపై కత్తులు నూరుతున్నామనీ, కనబడితే అడ్డంగా నరికేయడానికి వెనకాడమనీ పాకిస్తాన్‌లో ప్రచారం చేస్తారు. ఇక్కడి ముస్లిములకు భద్రత లేదనీ, దిక్కులేక తలవంచుకుని బానిసల్లా బతుకుతున్నారనీ జిహాదీ వర్గాలు ప్రచారం చేస్తాయి. వాస్తవం ఏమిటో మనకు తెలుసు. పాకిస్తాన్‌లో ప్రతివాడు భారతీయుడంటే మండిపడుతున్నాడని అనుకోవడమూ పొరబాటే. ఇరుదేశాల మధ్య మైత్రి కోరేవాళ్లు కొందరైతే శత్రుత్వం ఎలాగైనా కొనసాగాలని కోరేవారు కొందరుంటారు. ఏదో ఒక పేచీ తెచ్చిపెడుతూంటారు. సీమాంధ్ర, తెలంగాణ వ్యక్తులు ఒకరితో ఒకరు మాట్లాడుకోలేనంత దారుణంగా వైషమ్యాలు పెరిగిపోయాయని, యిక విడిపోక తప్పదని విభజనవాదులు అసెంబ్లీలో ఉపన్యాసం యిస్తారు. బయటకు వచ్చి చూస్తే యిరుప్రాంతాల వాళ్లూ ఛలోక్తులు వేసుకుంటారు, కలిసి వ్యాపారాలు చేస్తారు, వియ్యాలందుతారు. అమెరికాలో సాధారణ పౌరుడికి గాని, భారత్‌తో వ్యాపారబంధాలున్నవాళ్లకి గానీ యిలాటి పనులకు

పొల్పడరు. కానీ కొందరికి ఏదో కసి, కక్ష వుంటాయి. కొందరు అధికారులకు నల్లవాళ్లంటే పడదు. మరి కొందరికి చైనీయులంటే పడదు. మరి కొందరికి మెక్సికన్లు.. యింకొందరికి ఇండియన్లు. వీళ్లు వచ్చి మన ఉద్యోగాలు ఎత్తుకుపోతున్నారనో మరోటో కడుపులో వుంటాయి. ఇలాటి సందర్భం ఒకటి దొరికినపుడు అటువంటి ఎలిమెంట్స్ అవకాశాన్ని ఉపయోగించుకుంటాయి. వాళ్లను చూపించి ఇది ఒబామా కుట్ర అనక్కరలేదు. అంకుల్ శామ్ బొమ్మలతో కార్టూన్లు వేయనక్కరలేదు.

ఇక రెండో అంశం – దౌత్యాధికారిగా దేవయాని వుండే వెసులుబాట్లను ఈ అధికారులు పట్టించుకోలేదు. అలవి మీరి ప్రవర్తించారు అనేది నిర్వివాదాంశం. అదను దొరికింది వేటు వేసేద్దాం, అంతగా వస్తే క్షమాపణ చెప్దాం అనుకుని వుంటారు. ఆ లోపం దొరికింది కాబట్టే భారతదేశం తీవ్రంగా స్పందించి అమెరికన్ దౌత్యాధికారులకు ఆంక్షలు విధించింది. తప్పు చేసినది వారు, అనుభవిస్తున్నది వీరు. దౌత్యాధికారులకు యిలాటి అవస్థలు తప్పవు. ఈ ముక్క చెప్పాక యింకో మాట కూడా ఒకటి చెప్పి తీరాలి. దేవయాని నేరం చేసిందా లేదా అన్న చర్చ వెనక్కి వెళుతోంది. ఆమెను అరెస్టు చేయడం సబబా, కాదా అన్న చర్చ ముందుకు వచ్చింది. ఎన్‌డి తివారిపై పితృత్వ కేసు వేశారు. గవర్నరుని కాబట్టి నాపై కేసు పెట్టడానికి వీల్లేదు అనే సాంకేతిక కారణంతో ఆయన చాలాకాలం తప్పించుకున్నాడు. అయితే గవర్నరుగా రాజ్‌భవన్‌లో రాసలీలలు సాగించారని బయటకు వచ్చి గవర్నరు పదవి పోగొట్టుకున్నాడు. హోదా కల్పించిన రక్షణ కవచం – యిమ్యూనిటీ వూడిపడిపోవడంతో కేసు ముందుకు సాగింది. ఇప్పుడు దేవయానికి దౌత్యాధికారి కవచం లేదనుకోండి, ఆవిడ నేరం చేసినా ఫర్వాలేదు అనగలమా? అసలు ఆవిడ నేరం చేసిందా?

దాని గురించి ఆలోచించేముందు మన పత్రికల్లో వచ్చినదానిలో నిజమెంత, మసాలా ఎంత అనేది వేరు చేసి చూడాలి. మన రిపోర్టుల ప్రకారం 39 ఏళ్ల దేవయానిని ఆమె కూతురు స్కూలు ముందు, ఆ పిల్ల కళ్లెదురుగా, చేతికి బేడీలు వేసి అరెస్టు చేసి తీసుకెళ్లారు. అణువణువూ శోధించి, తీసుకెళ్లి మాదకద్రవ్యాల దొంగరవాణా చేసేవారి మధ్య, చిల్లర నేరస్తుల మధ్య పడేశారు. అలా ఆరుగంటలపాటు అవమానించి ఆ తర్వాత వదిలిపెట్టారు. ఆమె బయటకు వచ్చిన తర్వాత రెండు పేరాలలో యీ విషయం రాసి తన ఫారిన్ సర్వీసెస్ కొలీగ్స్‌కు యీమెయిల్ యివ్వడంతో యీ విషయం బయటకు వచ్చింది. దీనిపై సహజంగానే దేశమంతా ఉలిక్కిపడి, అభ్యంతరాలు తెలిపింది. అమెరికన్ అటార్నీ అయిన ప్రీత్ భరారా జరిగినదిది అంటూ ఓ ప్రకటన చేశారు. దాని ప్రకారం – దేవయానిపై వున్నది క్రిమినల్ కేసు. అలాటి కేసుల్లో అందరి పట్ల పోలీసులు ఎలా వ్యవహరిస్తారో దేవయాని పట్ల కూడా అలాగే ప్రవర్తించడమే కాదు, యింకా కాస్త ఎక్కువ మర్యాదగా కూడా వ్యవహరించారు. పిల్లల ఎదురుగా అరెస్టు చేయలేదు. చేతులకు బేడీలు వేయలేదు. ఆవిడ నుండి ఫోన్ కూడా లాక్కోలేదు. ఎవరి దృష్టి పడకుండా తీసుకెళ్లి ఒక కారులో కూర్చోబెట్టారు. రెండు గంటల పాటు ఆవిణ్ని అనేకమందికి ఫోన్ చేసుకోనిచ్చారు. కాఫీ తెచ్చి యిచ్చారు. తినడానికి ఏమైనా కావాలా అని అడిగారు. కస్టడీలోకి తీసుకున్నాక ఆమెను అణువణువునా శోధించిన మాట వాస్తవం. ఒక మహిళా ఆఫీసరే ఆ పని చేశారు. గొప్పా, బీదా భేదం లేకుండా ముద్దాయిలందరిపట్ల అమెరికన్ పోలీసులు యిలాగే వ్యవహరిస్తారని గమనించాలంటారు ప్రీత్. అరెస్టు, బేడీల విషయం దేవయాని స్వయంగా చెప్తే తప్ప నిజానిజాలు మనకు తెలియవు. ఆమె మౌనం పాటిస్తోంది.

తనపై కేసు నడుస్తోందన్న విషయం దేవయానికి ముందే తెలుసు. ఇంట్లో పనిచేసే పనిమనిషికి జీతం తక్కువ యివ్వడమనేది చిక్కులతో కూడుకున్న వ్యవహారం అని ఆవిడకు క్షుణ్ణంగా తెలుసు. ఆమె తండ్రి ఉత్తమ్ ఖోబర్‌గాడే ఐయేయస్ ఆఫీసరు. ఈమె డాక్టరు. దరిమిలా ఐఎఫ్ఎస్ ఆఫీసరు. అమెరికాలో పనివాళ్లకు యివ్వవలసిన జీతభత్యాలు చాలా ఎక్కువగా వుంటాయి కాబట్టి వాళ్లెవరూ పనివాళ్లను పెట్టుకోరు. అయితే మన దేశంలో మామూలువాళ్లే యింట్లో పనివాళ్లను పెట్టుకుంటారు. ఐయేయస్ క్యాడర్ వాళ్లయితే చెప్పనక్కరలేదు. ఇద్దరు ముగ్గురు వుంటారు. మరి వీళ్లను అమెరికా తీసుకుని వెళితే అక్కడి చట్టాల ప్రకారం జీతాలు యివ్వాలంటే జేబు పేలిపోతుంది.

అందువలన మన దేశపు విదేశాంగ శాఖ ఒక ఉపాయం కనిపెట్టింది. డిప్లోమాట్లకు జీతంలోనే స్పెషల్ ఎలవన్స్ అని ఏర్పాటు చేసి పనిమనుష్యులకు భారీ జీతాలిచ్చేందుకు వెసులుబాటు కల్పించింది. ఆ పనిమనుష్యులను డిప్లోమాట్లే నియమించుకోవాలి. వాళ్ల మెడికల్ ఎలవన్సు, ఇన్సూరెన్సు, ఏడాదికి ఓసారి యింటిక వచ్చేందుకు అయ్యే రాకపోకల ఖర్చులు అన్నీ మన ప్రభుత్వం భరిస్తుంది కానీ వారి జీతభత్యాలతో వారికి సంబంధం లేదు. జీతం బేరసారాలు రాయబారులే చూసుకుంటారు. అది భారతదేశంలో యిచ్చే జీతాల కంటె చాలా ఎక్కువగా వుంటుంది కానీ అమెరికాలో చట్టప్రకారం యివ్వవలసిన దాని కంటె తక్కువగా వుంటుంది. అయితే వీళ్లకు మంచి యింట్లో వుండే వసతి, ఉచితంగా తిండి, వైద్యసదుపాయాలు – యివన్నీ లెక్కవేసుకుంటే జీతం కంటె ఎక్కువే గిట్టుబాటు అవుతుంది. కానీ అమెరికన్ చట్టప్రకారం చూస్తే వాళ్లకు యివ్వాల్సినంత జీతం యివ్వనట్లే. ఆ మేరకు నేరం చేసినట్లే. 2011లో న్యూయార్క్‌లో పని చేసే ఇండియన్ కాన్సల్ జనరల్ ప్రభు దయాల్‌పై పనిమనిషి తనను సరిగ్గా చూడడం లేదని కేసు పెట్టింది. కేసు చాలాకాలం నడిచి చివరకు కితం ఏడాది ప్రభు దయాల్ కోర్టు బయట ఆమెకు పెద్దమొత్తం చదివించుకుని కేసు కొట్టేయించుకున్నాడు. అంతకుముందు కూడా మరో రాయబారి యిలాటి గొడవల్లో చిక్కుకున్నారట.

ఇన్ని తెలిసి దేవయాని మళ్లీ అదే పొరబాటు చేసింది. సంఘటనల క్రమం చూడండి. 2012 శీతాకాలంలో సంగీతా రిచర్డ్స్ అనే పనిమనిషి ఢిల్లీలో దేవయాని యింట్లో పనికి చేరింది. కొన్నాళ్లపాటు పని చేసి నన్ను న్యూయార్క్‌కు తీసుకెళ్లరా అని అడిగింది. అక్టోబరులో సంగీత వీసా కోసం దేవయాని అప్లికేషన్ పెట్టింది. ఇలా పెట్టేటప్పుడు ఆమె కొన్ని తప్పులు చేసింది. సంగీతకు గంటకు

9.75 డాలర్ల జీతం (అమెరికా చట్టాల ప్రకారం కనీస జీతం) యిస్తానని ఆమె వీసా అప్లికేషన్‌లో రాసింది. అయితే గంటకు 3.1 డాలర్ల జీతానికి సంగీతతో వేరే ఒప్పందం రాయించుకుంది. దాన్ని బయటపెట్టలేదు. 'వీసా అధికారులు అడిగితే నా జీతం 9.75 డాలర్లు అని చెప్పు' అని సంగీతకు చెప్పింది. అనగా సంగీత చేత అబద్ధమాడించింది. ఇప్పుడు దేవయాని లాయరు ఏమంటున్నాడంటే 'అబ్బే వీసా అప్లికేషన్‌లో దేవయాని తన జీతం రాస్తే, దాన్ని పనిమనిషికి యిచ్చే జీతంగా అమెరికా అధికారులు పొరబడ్డారు' అంటున్నాడు. ఇదేదో తికమకగా వుంది. పనిమనిషికి యిచ్చే కనీస వేతనం, డిప్యూటీ కాన్సల్ జనరల్‌కి యిచ్చే జీతం ఒకటే వుంటుందా? ఒకదాన్ని చూసి మరొకటి అని భ్రమపడే ఛాన్సుందా? మా తరఫునుండి అలాటి పొరబాటు ఏమీ జరగలేదు అని అమెరికన్ అధికారులు ఖండించారు. దేవయాని నోరు విప్పి చెప్పేదాకా యివేమీ కచ్చితంగా మనకు తెలియవు.

ఈ ఒప్పందం ప్రకారం నవంబరు 24 న సంగీత అమెరికాలో అడుగుపెట్టింది. వచ్చిన నెల్లాళ్లకే సణుగుడు మొదలుపెట్టింది. వారానికి 40 గంటల కన్నా ఎక్కువ పని చేయించకూడదని కానీ యీవిడ ఎక్కువ పని చేయిస్తోందని, పరిస్థితులు దుర్భరంగా వున్నాయనీ ఢిల్లీలో వున్న మొగుడు ఫిలిప్‌కు ఫిర్యాదు చేసింది. దేవయాని వెర్షన్ వేరేలా వుంది – సంగీత వేరే యిళ్లల్లో కూడా పని చేసుకుంటాననదట. అది చట్టవ్యతిరేకం అని చెప్పి దేవయాని ఒప్పుకోలేదట. అందుకే సంగీత గొడవ చేసిందట. ఇలా ఆర్నెల్లపాటు యాగీ చేసి చేసి చివరకు జూన్ 23 న దేవయాని యింట్లోంచి సంగీత వెళ్లిపోయింది. ఎక్కడకు? అది యిప్పటిదాకా తెలియటం లేదు. అమెరికా వంటి ఖరీదైన దేశంలో సంగీత వంటి స్థాయి మనిషి విడిగా, వేరే ఆదాయం లేకుండా బతకగలదా? ఆమె వెళ్లి తమ వద్ద ఫిర్యాదు చేయగానే న్యూయార్కులోని ఫారిన్ మిషన్ యిదే సందని సంగీతకు ఆశ్రయం కల్పించి వుండవచ్చు. అమెరికాలో శాశ్వతనివాసం ఏర్పరచుకోవడానికి సంగీత వేసిన పథకం యిది అనుకోవచ్చు. ఆమెకు అమెరికన్ ప్రభుత్వం సాయపడుతోందన్నది నిర్వివాదం. ఒక పనిమనిషికి యింత పలుకుబడి ఎక్కణ్నుంచి వచ్చింది? ఆమె అత్తమామలు మనదేశంలోని అమెరికా రాయబారి కార్యాలయ ఉద్యోగుల వద్ద పనిచేస్తున్నారట. ఎవరైనా వచ్చి తమ దేశంలో స్థిరనివాసం ఏర్పరచుకుంటానంటే అదలి చచ్చే అమెరికా యీమెకు మాత్రం కన్సెషన్ ఎందుకు యిచ్చినట్టు? భారతదేశపు అధికారిని అవమానించే అవకాశం వచ్చి ఒళ్లో పడుతున్నందుకు!

సంగీత వెళ్లిపోయిన మర్నాడే దేవయాని అదే ఆఫీసుకి సమాచారం అందించి ఆమె ఆచూకీ కనిపెట్టమంది. వాళ్లు యిప్పటిదాకా స్పందించలేదు. జులై నెల వచ్చేసరికి ఒకావిడ తను సంగీత లాయరునంటూ దేవయానికి ఫోన్ చేసింది – 'ప్రభు దయాల్ తరహాలో తనకేదైనా భారీగా ముట్టచెప్పి కేసు తప్పించుకుంటావా, లేక పరిణామాలు ఎదుర్కొంటావా?' అని. తను చేసినది అమెరికన్ చట్టాల ప్రకారం నేరం అని తెలిసినా దేవయాని బెసకలేదు. అఫెన్సు మార్గంలో వెళదామనుకుంది. సంగీతపై ఢిల్లీ పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టింది. నగలు కూడా పోయాయని రాసిందనుకుంటా. పనిలో పనిగా అమెరికన్ అధికారులకు సంగీత తనను వేధిస్తోందని ఓ ఫిర్యాదు రాసి పడేసింది. జులై 8 న లాయరు ఆఫీసులో సంగీత, దేవయానితో చర్చలకు దిగి 10 వేల డాలర్లు పరిహారంగా ఇమ్మంది. దానికి తోడు పాస్‌పోర్టు, అమెరికాలో స్థిరనివాసానికి వీసా కావాలంది. అప్పటిదాకా ఆమెకు వున్నది పనిమనుషులకు యిచ్చే పాస్‌పోర్టు. అది తాత్కాలికమైనదే. ఇప్పుడు అమెరికాలో నివాసం కావాలని యివి కావాలంది. యజమాని పెట్టే బాధలు భరించలేకపోతే భారతదేశానికి తిరిగి వెళ్లి పోయేందుకు సాయపడమనాలి కానీ యిదేం కోరిక?

ఈ వరస చూడగానే భారతదేశం సంగీత పాస్‌పోర్టు రద్దు చేసేసింది. జులై 19 న సంగీత భర్త ఫిలిప్ ఢిల్లీ కోర్టులో పిటిషన్ వేశాడు – తన భార్యను వేధించినందుకు దేవయానికి శిక్ష వేయాలని, తన భార్యను వెనక్కి క్షేమంగా రప్పించేయాలనీ. కోర్టు పిటిషన్ కొట్టేసింది. ఆ తర్వాత ఫిలిప్ అమెరికన్ కోర్టులో యిలాటి పిటిషన్ వేయడానికి ప్రయత్నించాడు. అలాటి ప్రయత్నాలు చేయడానికి వీల్లేదంటూ సెప్టెంబరు 20 న ఢిల్లీ హై కోర్టు ఇంజంక్షన్ యిచ్చింది. నవంబరు 19 న సంగీతను అరెస్టు చేయడానికి ఆదేశాలు యిచ్చింది కూడా.

భారతదేశంలో యిలా అంతా దేవయానికి అనుకూలంగా జరుగుతూండగా అక్కడ అమెరికాలో దీనికి వ్యతిరేకంగా సంగీతకు అనుకూలంగా, దేవయానికి ప్రతికూలంగా చర్యలు తీసుకోవడం జరిగింది. సంగీతకు రక్షణ కల్పించడమే కాక, ఆమె కుటుంబ సభ్యులను (భర్త, పిల్లలు) భారత్‌నుండి డిసెంబరు 10 న అమెరికాకు రప్పించింది. ఎందుకట? దేవయానిపై అమెరికా ప్రభుత్వం పెట్టిన కేసులో వాళ్లు ముఖ్యసాక్షులట. కేసు ఏమిటి? సంగీత చేత వీసా అధికారికి అబద్ధం చెప్పించిందని, వీసాలో అబద్ధపు సమాచారం యిచ్చిందని, సంగీత చేత ఎక్కువ గంటలు పనిచేయించిందనీ! ఇవేమీ సంగీత భర్త, పిల్లలు ప్రత్యక్షంగా చూడలేదు. ఇక వారు సాక్షులు ఎలా అవుతారు? మహా అయితే ఫోన్లో సంగీత ఏడ్చింది అని చెప్పగలుగుతారు. ఆ మాత్రం దానికి వాళ్లను ఢిల్లీనుండి తరలించి, అమెరికాలో యిల్లరికపు అల్లుళ్లలా చూడాలా? వాళ్లను తెప్పించిన రెండు రోజులకు దేవయానిని అరెస్టు చేసింది. ఆ తర్వాతి సంగతులు అందరికీ తెలిసినవే.

ఇప్పటిదాకా అందిన సమాచారం బట్టి, నాకు అర్థమై కాస్త వూహించిన దాన్ని బట్టి, దేవయాని తప్పుడు డిక్లరేషన్ యిచ్చింది. సంగీత దాన్ని ఉపయోగించుకుని అమెరికా ప్రభుత్వం సహాయంతో దేవయానిని ఒక ఆట ఆడిస్తోంది. దేవయాని, సంగీత యిద్దరూ భారతీయులే. అమెరికా ప్రభుత్వం ఒకరిపై మరొకరిని ప్రయోగించి భారతీయరాయబార కార్యాలయ ఉద్యోగులు నీతి తప్పిన నేరస్తులని ప్రపంచానికి చూపించి, పరువు తీయదలచింది. మన దేశస్తులం దేవయానిని చూసి జాలిపడతాం. ఏదో చిన్న తప్పుకై అంత భారీ శిక్ష విధించాలా? అంటాం. ఎందుకంటే మనలో చాలామంది అదే రకం. గవర్నమెంటుకి యిచ్చే సర్టిఫికెట్లు, డిక్లరేషన్లు

అన్నీ చాలా లైట్‌గా తీసుకుంటాం. ఇన్సూరెన్సు పాలసీయే కాదు, ఇంటర్నెట్‌లో ఏదైనా సాఫ్ట్‌వేర్ డౌన్‌లోడ్ చేసుకునేటప్పుడు కాదు, 'ఐ ఎగ్రీ విత్ ఆల్ ద రూల్స్' అనే బాక్స్‌ను ఏ రూలూ చదవకుండానే టిక్కు పెట్టేస్తాం. కాగితంపై యింటూ మార్కు పెట్టిన చోట టపటపా సంతకాలు పెట్టేస్తాం. ఆదాయం తక్కువని సర్టిఫికెట్ పట్టుకుని వస్తే ఆరోగ్యశ్రీ సదుపాయం కలుగుతుందనో, రిజర్వేషన్ సౌకర్యం యిస్తారనో, స్కాలర్‌షిప్ దక్కుతుందనో అంటే వెంటనే పట్టుకుని వచ్చేస్తాం. కులం గురించి కూడా తప్పుడు సర్టిఫికెట్లు తెచ్చేవాళ్లు కోకొల్లలు. ఉద్యోగాలకు అప్లయి చేసేటప్పుడు ఆ ఫీల్డులో ఎక్స్‌పీరియన్సు వుందని అబద్ధం రాయడం, వీసాకు అప్లయి చేసినపుడు బ్యాంక్ ఎక్కవుంటులో డబ్బులున్నాయని చూపించడం (వీసా రాగానే విత్‌డ్రా చేసేస్తారు) సర్వసహజం. ఏ కంపెనీలో హ్యూమన్ రిసోర్సెస్ వాళ్లను అడిగినా చెప్తారు – తొంభై శాతం అభ్యర్థులు యిచ్చే రెజ్యూమేలన్నీ బోగస్సేననీ, వాళ్లను వడపోయడమే తమ పని అనీ!

ఎందుకిలా చేస్తాం? ఎందుకంటే మనకు శిక్ష పడదన్న ధీమా. పట్టుబడితే సారీ చెప్పేస్తే చాలు, వదిలేస్తారు. తప్పు చేసేవాళ్లపై మన భారతీయులం ప్రత్యేకమైన కరుణ కనబరుస్తాం. జేబుదొంగ పట్టుబడినా పోలీసులకు అప్పగించం. రెండు దెబ్బలేసి వదిలేస్తాం. 'వదిలేయ్ గురూ, వాడి పాపాన వాడే పోతాడు' అన్నదే మన ఫిలాసఫీ. రైల్లో మన పక్కన కూర్చున్న ప్రయాణీకుడు టిక్కెట్టు లేకుండా ప్రయాణిస్తున్నాడని తెలిసినా వూరుకుంటాం. పట్టుకోవడం మన పని కాదు, టిటిఇది. పట్టుకోకపోతే వాడి తప్పు. ట్రాఫిక్ పోలీసు లేకపోతే రెడ్ లైట్ పడినా ఎవడూ ఆగడు. అడ్డగోలుగా బతకడానికి మనం అలవాటు పడ్డాం. ఎంత యిదిగా అంటే ఏదైనా డాక్యుమెంటు చదివి సంతకం పెడతానంటే అవతలివాడికి చెడ్డ చికాకు వస్తుంది. 'ఇలా అయితే పనులు జరిగినట్టే' అనేస్తాడు మొహం మీద.

ఇప్పుడు దేవయాని సగటు భారతీయురాలిలాగ తప్పుడు డిక్లరేషన్ యిచ్చి వుంటారని అనుకుందాం. అది చట్టరీత్యా తప్పే కదా. మనం ఎలా సమర్థించగలం? కానీ మనవాళ్లు సమర్థించడానికి పూనుకున్నారు. అమెరికన్ చట్టాల ప్రకారం పనిమనిషికి జీతాలివ్వాలంటే ఆవిడ జీతం సరిపోదట. సరిపోకపోతే పనిమనిషిని పెట్టుకోనే పెట్టుకోకూడదు. సగటు అమెరికన్లలా అన్ని పనులూ తనే చేసుకోవాలి. రైల్వే స్టేషన్‌లో పోర్టర్లు వుంటారు, ఎయిర్‌పోర్టులో మన సామాను మనమే మోసుకోవాలి. లేదు నాకు కుదరదు అనుకుంటే ఎవర్నైనా బతిమాలుకోవాలి, లేదా విమానప్రయాణం మానేయాలి. అబ్బే నాకు అది అలవాటు లేదు, అలా అని జీతం యిచ్చుకోలేను అనుకుంటే న్యూయార్కు పోస్టింగు వద్దని చెప్పుకోవాలి. మా బ్యాంకులో బాంబే, బెంగుళూరు వంటి చోట్లకు పోస్టింగులు వేస్తే భయపడేవాళ్లం. మా కిచ్చే అలవెన్సులతో యిళ్లు దొరకవని! ప్రమోషన్లు వద్దని కొందరంటే, మరి కొందరు కుటుంబాన్ని వున్న వూళ్లో వుంచి, అక్కడ పని చేసేవారు. అవ్వా కావాలి, బువ్వా కావాలి అంటే కుదరదు. అయినా దేవయాని మధ్యతరగతి మహిళ కాదు. ఆదర్శ్ కాంప్లెక్సులో ఫ్లాట్ వుందని కూడా పేపర్లో వచ్చింది. ఆవిడ దళిత మహిళ కాబట్టి శిక్షించకూడదని మాయావతి అన్నారు కానీ అవన్నీ మన దేశంలో చెల్లుతాయి. దళిత, మైనారిటీ.. అంటే ఎవరూ వాళ్ల జోలికి వెళ్లరు. ఓట్లు పోతాయని భయం. అమెరికా వాడికి అవేమీ జాన్తా నై. దేవయాని సంఘటన బయటకు రాగానే, గతంలో మన దేశాధిపతులు బట్టలు కూడా విప్పించారు అంటూ గుర్తు చేసుకుని సంపాదకీయాలు రాశారిక్కడ. అంత జాగ్రత్తగా వున్నారు కాబట్టే అమెరికాలో మళ్లీ దాడులు జరగలేదు. మనకు రోజుకో దాడి. పూటకో యాక్సిడెంటు. విచారణ జరుపుతారు. తప్పు చేసినవాళ్లకు శిక్ష వేయరు. కాలేజీ ప్రమాణాలు సరిగ్గా లేవని గుర్తింపు కాన్సిల్ అంటారు. బాగానే వుంది కానీ సరిగ్గా వుందని సర్టిఫికెట్టు యిచ్చినవాణ్ని పట్టుకుని సస్పెండ్ చేయాలిగా. చేయరు. అందుకే మన జీవనప్రమాణాలు యింత ఘోరంగా వున్నాయి. అమెరికాలో కూడా యిలాగే వుండాలని ఆశించడం అన్యాయం.

మనం ఏదైనా ట్రాఫిక్ అఫెన్సు చేస్తే కానిస్టేబుల్ వదిలేయవచ్చు లేదా వాయించవచ్చు. వాయించకూడదు అనడానికి మనమెవరం? తప్పుకు ఎంత శిక్ష వేయాలి అన్నదానిపై కూడా మన దృక్కోణం వేరు, వాళ్లది వేరు. మనం తప్పులు చేస్తాం, తప్పు చేసినవాణ్ని వెనకేసుకుని వస్తాం. క్రమేపీ తప్పు చేసిన వాడికి అదొక హక్కుగా అయిపోతుంది. సారీ చెపితే వదిలేసి తీరాలి అని మనవాళ్ల గట్టి నమ్మకం. రాంగ్ సైడ్ వచ్చి మీ కారును గుద్దేసినవాణ్ని కూడా సారీ అంటే మీరు వదిలేయాలి, లేకపోతే చుట్టూ మూగినవాళ్లు మీకు వ్యతిరేకం అయిపోతారు. 'సారీ చెప్పాడుగా, యింకా ఏమిటండీ సాగదీస్తారు?' అని మీమీదే మండిపడతారు. మనం యిలా వున్నాం కదాని అమెరికావాణ్ని కూడా అలా వుండమంటే ఎలా? ఆ మధ్య కొందరు తెలుగు విద్యార్థులు ఓ బోగస్ యూనివర్శిటీలో చేరి చదవడం మానేసి చట్టవ్యతిరేకంగా యితర రాష్ట్రాలలో పని చేస్తూ వుంటే అమెరికన్ ప్రభుత్వం పట్టుకుంది. ట్రాక్ చేయడానికి కడియాలు తొడిగారు. అది అవమానం, మన తెలుగువాళ్లు యింత దారుణానికి గురవుతూ వుంటే అక్కడి తెలుగు సంఘాలు ఏం చేస్తున్నాయి అని యిక్కడ మీడియా రెచ్చిపోయింది. వర్క్ పెర్మిట్ లేకుండా చట్టవిరుద్ధంగా విద్యార్థులు ఉద్యోగం చేయడంలో మనకు తప్పు కనబడలేదు. మనం ఏం చేసినా అవతలివాళ్లు వూరుకోవాలి.

దేవయాని దౌత్యాధికారిణి కాబట్టి తప్పు చేసినా శిక్ష పడకూడదు అనో ఆవిడ అరెస్టులకు అతీతం అనో వాదించేవారిని ఒక్కటే అడుగుతాను – మరి అంతటి ఉన్నతస్థానంలో వున్నావిడ తప్పు చేయవచ్చా? తప్పుడు డిక్లరేషన్లు యివ్వవచ్చా? మన రాయబారి అంటే భారత సంస్కృతిని ప్రతిబింబించాలి. ఆవిడ మొత్తం మన దేశానికి ప్రాతినిథ్యం వహిస్తోంది. ఆవిడ ఏదైనా చేస్తే 'ఈ ఇండియన్సంతా యింతేరా!' అనేస్తారు చటుక్కున. అంతటి బాధ్యత ఆవిడపై వుంది కాబట్టే అంతంత జీతాలు, సౌకర్యాలు యిస్తోంది ప్రభుత్వం. మరి అలాటావిడ డిప్లోమాటిక్ యిమ్యూనిటీ వుంది కదాని తప్పుడు పనులు చేయవచ్చా? ఆవిడ హోదాకు తగినట్టుగా

వ్యవహరించక లేదని తేలితే అమెరికా అధికారులు చివరకు సారీ చెప్తారు. ఇండియా ప్రభుత్వం దేవయానికి పరిహారం యిస్తుంది, లేదా ప్రమోషన్ యిస్తుంది.  దాని గురించి నేను వర్రీ అవను. ఒక పెద్ద దేశంలో భారతదేశపు ప్రతినిథిగా వ్యవహరిస్తూ దేవయాని నేరం చేసినట్లు, నాలుగు రూకలు మిగుల్చుకోవడానికి తప్పుడు డిక్లరేషన్ యిచ్చినట్టు తేలితే మాత్రం చాలా ఫీలవుతాను. ఆవిడకు శిక్షో, జరిమానావో, మరోటో పడితే చింతించను. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2013)**

•••